ప్రభుత్వ పాలనాశాస్త్రం

# ప్రగతి పాలన

ఖండం : 1

BRAOU

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు

2004

# రచయితల బృందం

సంపాదకుడు
ఆచార్య సి.వి. రాఘవులు

115069
27-4-05

రచయితలు
ఆచార్య వి.యస్. ప్రసాద్
ఆచార్య యం. బాపూజీ
ఆచార్య కె. మురళీమనోహర్
డా॥ కె.రఘునాథ్
డా॥ బి.పి.సి.బోస్

సహసంపాదకులు
ఆచార్య వి.యస్.ప్రసాద్
డా॥ పి.సర్వయ్య
శ్రీ సి. వెంకటయ్య

ముఖచిత్రం
"చంద్ర"

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
ప్రథమ ముద్రణ, 1995, రెండవ ముద్రణ, 1996, 2001, 2002 ,2004

BRAOU

1995, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రికవిశ్వవిద్యాలయం
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా
ఉపయోగించదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.
ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో ఒక భాగం.
పాఠ్య ప్రణాళికా మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115069
Date 27-4-2005
Call No.

ఇతర వివరాలకు: డైరెక్టర్ ( అకడమిక్), డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
జూబిలీహిల్స్, రోడ్.నం.46, హైదరాబాద్-500 033.

ఏ.ఓ.యు కొరకు.

Lr No. 405 / Dr. BRAOU / DMP / PTG / F.No. 05 / J.O. 51 / 2003-04 Dt : 08-01-04 / No. of Copies 500

Printed At : M/s Mahalakshmi Graphics, Kukatpally, Hyderabad.Ph : 23077952

# పాఠ్యాంశ పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన వర్ధమాన దేశాల (మూడవ ప్రపంచ దేశాల) రాజకీయ చర్చలలో 'ప్రగతి' కీలకాంశంగా పరిణమించి, జాతీయాభివృద్ధి, సామాజికార్థిక ప్రగతి సాధన రాజ్య ప్రధానాశయాలుగా రూపొందాయి. ఈ ఆశయసాధనలో ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృత పరచబడి, పాలనాయంత్రాంగంపై గురుతర బాధ్యతలు మోపబడ్డాయి. ముఖ్యంగా రెండవప్రపంచ యుద్ధానంతరం గణనీయంగా పెరిగిన ప్రభుత్వ విధులు ప్రజల ఆశయాలకు – వాస్తవాలకు మధ్య, ప్రగతి ఆశయాలకు – వాటి అమలుకు మధ్య అగాధాన్ని సృష్టించి జాతీయభివృద్ధి ఆశయాలకే సవాలుగా నిలిచాయి. అప్పటి వరకు కేవలం శాంతి భద్రతల పరిరక్షణ, శిస్తు వసూళ్ళకే పరిమితమైన పాలనా యంత్రాంగం ప్రగతి కార్యక్రమాల నూతన సవాళ్ళను ఎదుర్కొనే స్థితిలో లేకుండా పోయింది. కాబట్టి పాలనా యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించి, జాతీయాభివృద్ధి కార్యక్రమాల ఆశయసాధనాల కనుగుణంగా పాలనాయంత్రాంగం శక్తి యుక్తులను, ప్రతిభాపాటవాలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రగతి లక్ష్యసాధనలో నిమగ్నమైన పాలనా యంత్రాంగాన్నే 'ప్రగతి పాలనా' అంటున్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో నేడు ప్రగతిపాలన అనే పదం విస్తృతంగా వాడుతున్నారు. ఎడ్వర్డ్ వీడ్నర్, ఎఫ్.డబ్ల్యు. రిగ్స్, జోసెఫ్ లాపలంబర, ఆల్బర్ట్ వాటర్‌సన్ లాంటి అనేక మంది పాశ్చాత్య రచయితలు ప్రగతిపాలనభావాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఈ భావన ఎలా అభివృద్ధి చెందినప్పటికి ప్రభుత్వపాలనా శాస్త్రానికి చెందిన మేధావులు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలనా వ్యవస్థలను, అవి నిర్వహిస్తున్న విధుల స్వభావాన్ని బట్టి ప్రగతి పాలనగా గుర్తిస్తున్నందున అసలు ప్రగతిపాలన అంటే ఏమిటి? అది నిర్వహించే విధులేమిటి? ప్రభుత్వ పాలనా శాస్త్రానికి, ప్రగతిపాలనా శాస్త్రానికి మధ్యగల తేడాలేమిటి అనే అంశాలు పాలనా శాస్త్ర విద్యార్థులలో ఆసక్తి రేకెత్తిస్తుంది.

ఈ నేపథ్యంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రభుత్వపాలనా శాస్త్ర పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఈ కోర్సును రూపొందించింది. ప్రగతిపాలన శాస్త్రం అభివృద్ధికి దోహదం చేసిన తత్త్వవేత్తల భావాలను, వివిధ ప్రగతి దృక్పథాలను, ఈ కోర్సులో చేర్చాం. ప్రగతి సమస్యలను, ప్రగతి దృక్పథాలను, ప్రగతి పథంలో నిమగ్నమైన ఉద్యోగి బృందం స్వరూప స్వభావాలను అవగాహన చేసుకోడానికి, ప్రగతి సాధనలో సమాజాలు ఎదుర్కొంటున్న సవాళ్ళను అర్థంచేసుకోడానికి , ప్రభుత్వ యంత్రాంగం సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఉన్న సమస్యలను విశ్లేషించడానికి 'ప్రగతిపాలన ' అనే ఈ పాఠ్యాంశం దోహదం చేయగలదని భావిస్తుంది.

ఈ పాఠ్యాంశంలో మొత్తం రెండు ఖండాలు, 21 భాగాలున్నాయి. అధ్యయన సౌలభ్యంకోసం ఈ కోర్సును రెండు పుస్తకాలుగా ముద్రించబడింది. మొదటి పుస్తకంలో మొదటి ఖండానికి చెందిన ఆరు భాగాలుంటాయి. రెండవ పుస్తకంలో రెండవ ఖండానికి చెందిన 15 భాగాలుంటాయి. ప్రగతిపాలనపై మీ అవగాహనను పెంపొందించడానికి ఈ పుస్తకం దోహదం చేస్తుందని విశ్వవిద్యాలయం ఆశిస్తుంది.

BRAOU

BRAOU

# విషయసూచిక


| భాగం | పేరు | పేజి |
|---|---|---|
| 1. | తులనాత్మక ప్రభుత్వపాలన: అర్థం, పరిధి, ప్రాధాన్యత | 1 |
| 2. | తులనాత్మక పాలన దృక్పథాలు: సంస్థాగత, ఉద్యోగిస్వామ్య, వ్యవస్థల దృక్పథాలు | 16 |
| 3. | ప్రగతిపాలన: భావన, పరిధి, ప్రాధాన్యత | 39 |
| 4. | ప్రగతి దృక్పథాలు: నిర్మాణ, విధుల దృక్పథాలు | 56 |
| 5. | ప్రగతి దృక్పథాలు: మార్క్సిస్ట్, గాంధేయ దృక్పథాలు | 70 |
| 6. | ప్రగతిపాలన సాధనాలు | 81 |


BRAOU

BRAOU

# ఖండం – 1 : ప్రగతి పాలన – భావనలు

ఈ ఖండంలో ఆరు భాగాలున్నాయి. మొదటి భాగంలో తులనాత్మక పాలన ప్రాధాన్యత, అర్థం, పరిధి; తులనాత్మక పాలనలోని ప్రధాన ధోరణులను; అభివృద్ధి చెందుతున్న భారతదేశంలాంటి దేశాలలో దీని ఉపయుక్తతను వివరించాం. రెండవ భాగంలో తులనాత్మక ధృక్పథం అధ్యయనానికి సంబంధించిన వివిధ దృక్పథాలను పరిశీలించాం. మూడవ భాగంలో ప్రగతి పాలన ప్రాధాన్యత, పరిధులను, నాలుగవ భాగంలో ప్రగతి పాలనలోని విధుల, నిర్మాణ దృక్పథాన్ని చర్చించాం. ప్రగతి లక్ష్యసాధనలో ప్రధానాంశమైన సామాజిక పరివర్తనకు దోహదం చేయు దృక్పథాలను ముఖ్యంగా గాంధేయ వాదం లేదా మార్క్సిజం యుక్తాయుక్తాలను ఐదవ భాగంలో చర్చించాం. చివరిదైన ఆరవ భాగంలో వివిధ ప్రగతి సాధనాలైన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగిస్వామ్యం పాత్రలను గూర్చి పరిశీలించాం. ఈ మొదటి ఖండం ప్రధానంగా ప్రగతి, తులనాత్మక పాలనలలోని మౌళిక భావనలను; దృక్పథాలను వివరించడానికి ఉద్దేశించబడింది.

BRAOU

BRAOU

# భాగం–1: తులనాత్మక ప్రభుత్వపాలన: అర్థం, పరిధి, ప్రాధాన్యత

విషయక్రమం


1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 తొలిపాలనా సిద్ధాంతంలో తులనాత్మక పాలన అంశాలు

1.3 తులనాత్మక పాలనా అవతరణ

1.4 తులనాత్మక పాలనా : అర్థవివరణ

1.5 తులనాత్మక పాలనా లక్షణాలు

- 1.5.1 ఆధునిక అధ్యయనాంశం
- 1.5.2 నమూనా పూర్వస్థితి
- 1.5.3 ఆచరణాత్మక సూత్రీకరణ, ఆవరణ దృక్పథాల ప్రాధాన్యత
- 1.5.4 అమెరికా మేధావుల పాత్ర
- 1.5.5 సిద్ధాంత నిర్మాణం పట్ల ఆసక్తి

1.6 తులనాత్మక పాలన ఆధారాలు

1.7 తులనాత్మక పాలనలో నమూనాలు

1.8 తులనాత్మక పాలనలో పోకడలు

- 1.8.1 ప్రామాణిక దృక్పథాల నుండి అనుభవపూర్వక దృక్పథాలకు మార్పు
- 1.8.2 ప్రత్యేక దృక్పథం నుండి సార్వజనీన దృక్పథంలోకి మార్పు
- 1.8.3 ఆవరణేతర దృక్పథం నుండి ఆవరణ దృక్పథాలకు మార్పు

1.9 తులనాత్మక పాలన దృక్పథంలో లోపాలు

1.10 తులనాత్మక పాలన ప్రాధాన్యత

1.11 ముగింపు

1.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

1.13 చదువదగిన రచనలు


BRAOU

## 1.0 లక్ష్యాలు

ప్రభుత్వ పాలనా శాస్త్రఅధ్యయనంలో ప్రధాన దృక్పథమైన తులనాత్మక పాలనా దృక్పథంలోని ప్రధానాంశాలను విద్యార్థులకు వివరించడమే ఈ భాగం ముఖ్య ఆశయం. ఇది చదివితే మీరు కింది అంశాలు వివరించగలుగుతారు.

- తులనాత్మక పాలన అంటే ఏమిటి,
- తులనాత్మక పాలన లక్షణాలు,
- తులనాత్మక పాలన ఆధారాలు, ప్రధాన ధోరణులు,
- తులనాత్మక పాలన ప్రాధాన్యత, లోపాలు.

## 1.1 పరిచయం

ఒక అధ్యయనాంశంగా, వర్ధమాన దేశాలలో అన్వయించబడుతున్న ఆచరణాత్మక నమూనాగా తులనాత్మకపాలనా మేధో ప్రపంచంలో నూతనంగా అడుగుపెట్టిన నమూనా. అయితే ప్రభుత్వ పాలనలో తులనాత్మక అధ్యయనం నూతనమైందికాదు. అరిస్టాటిల్ తులనాత్మక పద్ధతిని ఉపయోగించిన ప్రథమ రాజనీతి శాస్త్రవేత్త. చరిత్ర ప్రారంభదశనుండి తులనాత్మక అధ్యయనానికి సంబంధించిన సమాచారం లభ్యమౌతూవస్తున్నది. అయితే ఇటీవలి కాలంలో తులనాత్మక పాలన ఒక అధ్యయనాంశంగా పరిపక్వదశకు చేరుకుని, ఒక బలమైన ఉద్యమంగా రూపొంది ప్రభుత్వపాలనా శాస్త్రంలో ప్రధాన నమూనా అయింది.

ఫెరెల్ హెడీ పేర్కొన్నట్లు ఒక మేధో సంబంధమైన అంశంగా తులనాత్మక పాలన నాలుగు విషయాల పట్ల ఆసక్తిని కనపరచింది. అవి: 1. సిద్ధాంతానికై అన్వేషణ, 2. ఆచరణాత్మక అన్వయంపట్ల అభిలాష, 3. తులనాత్మక రాజకీయాలు చేసిన సేవ, 4. ప్రభుత్వ పాలన వర్తమాన సమస్యల తులనాత్మక విశ్లేషణ. తులనాత్మక పాలన ఎక్కువభాగం ఎఫ్. డబ్ల్యు రిగ్స్ రచనల చుట్టూ పరిభ్రమిస్తుంది. తులనాత్మక ప్రభుత్వ పాలనలో అత్యున్నత స్థాయిని ఆక్రమించిన 1960-70 దశాబ్దంలో రిగ్స్ తులనాత్మక పాలన బృందానికి అధ్యక్షునిగా వ్యవహరించాడు.

ప్రభుత్వపాలనా శాస్త్రంలో సిద్ధాంతీకరణను పెంపొందింపజేసేందుకు తులనాత్మక పాలనను ఒకసాధనంగా ఉపయోగించాలని రిగ్స్ ఆశించాడు. తులనాత్మకపాలన ఆచరణాత్మక, సూత్రీకరణ, ఆవరణదృక్పథాల ప్రాతిపదికగా సిద్ధాంతనిర్మాణానికి ఉపక్రమించాలని రిగ్స్ పేర్కొన్నాడు. కాల్డ్‌వెల్ ( Caldwell ) పేర్కొన్నట్లు ప్రభుత్వ పాలనా శాస్త్రాన్ని యదార్థమైన అధ్యయనాంశంగా మలిచేందుకు పాలనప్రవర్తనపై సార్వజనీన మాన్యత కలిగిన పరిజ్ఞానాన్ని ప్రోగుచేయటం తులనాత్మక పాలన ప్రధానలక్ష్యం. ఈ విధంగా తులనాత్మక పాలన ఏకరూపత కలిగిన వివిధ దేశాలలోని పాలనావ్యవస్థలను వివరించే సంప్రదాయిక దృక్పథంతో విబేధించే అధ్యయనాంశాలను, పరిశోధనా దృక్పథాలను కలిగిఉంది. తులనాత్మకపాలన వివిధపాలనా వ్యవస్థల స్వరూపాన్ని వివరించేందుకు తోడ్పడే స్థిరమైన విశ్లేషణాత్మక వర్గీకరణల రూపంలో పాలనా వ్యవస్థల లక్షణాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తుంది. కేవలం భిన్నపాలనా వ్యవస్థల ప్రవర్తన ప్రమాణాలు, వివిధ సంస్థల మధ్యగల సారూప్యతలు, తారతమ్యాలను విశ్లేషించడమేగాక, వాటి అభివృద్ధికి తోడ్పడే అంశాలను వివరించడం, విధానాల రూపకల్పనకు అవసరమైన సూచనలను చేసేందుకు, వాటిపోకడలను ఊహించేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని అభివృద్ధి పర్చడం కూడా తులనాత్మకపాలన ప్రధానలక్ష్యం.

తులనాత్మక పాలనా దృక్పథం ప్రభుత్వపాలనా శాస్త్రాన్ని ఒక గొప్పమలుపు తిప్పింది. ప్రభుత్వ పాలనా శాస్త్రాన్ని స్వీయ సాంస్కృతిక సంకుచితత్వంనుంచి విముక్తి చేసిదాని పరిధిని విస్తరింపచేసింది. ఈ అధ్యయనానికి శాస్త్రీయతను, సార్వజనీనతను సంతరించింది. విభిన్న సంస్కృతులకు చెందిన వర్ధమాన దేశాల పాలనావ్యవస్థలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలనే పాలనాతత్వవేత్తల ఆసక్తినుంచి ఉత్పన్నమైన తులనాత్మక పాలనా దృక్పథం ప్రభుత్వపాలనా శాస్త్రానికి అంతర్ శాస్త్ర (interdesciplinary), బహుళసంస్కృతి (Cross-Cultural) దృక్కోణాలను సంతరింపచేసింది. ప్రభుత్వపాలనా శాస్త్రవేత్తలు నూతనంగా ఏర్పడిన అభివృద్ధి చెందుచున్న దేశాల సమాజాలను, వాటి పాలనా వ్యవస్థల విభిన్న అంశాలను అవగాహన చేసుకొనేందుకు, ప్రభుత్వపాలనా శాస్త్ర ఆచరణాత్మకతను పెంపొందింపచేయడమేగాక దానిని ఒక విజ్ఞాన శాస్త్రంగా తీర్చిదిద్దేందుకు తులనాత్మకపాలన తోడ్పడింది.

BRAOU

## 1.2 తొలిపాలనా సిద్ధాంతంలో తులనాత్మకపాలన అంశాలు

ప్రభుత్వపాలనా శాస్త్రంలో తులనాత్మక దృక్కోణాన్ని ఆశాస్త్రం ప్రారంభమైన నాటినుండే గుర్తించవచ్చు. ప్రభుత్వ పాలనా శాస్త్రం ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా రూపుదాల్చకమునుపు ఈ శాస్త్రంలో వెలువడిన సాహిత్యాన్ని పరిశీలిస్తే అందులో తులనాత్మక దృక్కోణం గోచరిస్తుంది. ప్రభుత్వపాలనా శాస్త్రపితామహుడుగా పరిగణించబడుతున్న ఉడ్రోవిల్సన్ కు ముందు ప్రభుత్వపాలనాధ్యయనంలో ఒక ప్రధానరచనగా పేర్కొనదగిన ఫెడరలిస్ట్ అనే గ్రంథంలో అలెగ్జాండర్ హేమిల్టన్, జేమ్స్‌మాడిసన్ అమెరికా దేశప్రభుత్వ పాలనా విశ్లేషణలో కొన్ని ఇతర దేశాల పాలనా అనుభవాలను దృష్టాంతాలుగా పేర్కొన్నారు. అదేవిధంగా వీరి తరువాత వచ్చిన జెఫర్సన్, అలెక్సీ టాక్‌వెర్లీ మొదలైన తత్వవేత్తల రచనల్లో కూడా తులనాత్మక విశ్లేషణను గుర్తించవచ్చు.

ఉడ్రోవిల్సన్ తన "ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనం" అనే వ్యాసంలో తులనాత్మక పద్ధతి ప్రాముఖ్యతను నొక్కిచెప్పాడు. రాజకీయాలతో ప్రసక్తి లేకుండా విభిన్నదేశాల పాలనావ్యవస్థలను అధ్యయనం చేసి వాటి సద్గుణాలను గుర్తించాలని విల్సన్ ఉద్ఘాటించాడు. విల్సన్ వివిధ దేశాల పాలనా వ్యవస్థల అనుభవాలనుంచి ప్రయోజనం పొందటం పట్ల ఉత్సాహాన్ని కనపరిచినప్పటికీ తనరచనలో అమెరికా ప్రభుత్వ పాలనావ్యవస్థను తప్ప మరే దేశాల పాలనగురించీ వివరించలేదు.

విల్సన్ అనంతరం గుడ్నోవ్ అనే పాలనారచయిత ప్రభుత్వ పాలనా శాస్త్రంలో తులనాత్మక దృక్పథం ప్రాధాన్యతను నొక్కి చెప్పాడు. గుడ్నోవ్ రచించిన "కంపేరిటివ్ అడ్మినిస్ట్రేటివ్ లా " అనే గ్రంథం పేరులోనే తులనాత్మక అంశం ఇమిడిఉంది. గుడ్నోవ్ వివిధదేశాలలోని పాలనా చట్టాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసాడు. ఇరవయ్యవ శతాబ్దం తొలిదశలో అమెరికాలో టేలర్ ప్రారంభించిన నిర్వహణా ఉద్యమం ప్రభుత్వపాలనా శాస్త్రంపై ప్రగాఢ ప్రభావాన్ని కనపర్చింది. టేలర్ ప్రతిపాదించిన శాస్త్రీయ నిర్వహణ భావన ప్రభుత్వ పాలనను ఒక విజ్ఞాన శాస్త్రంగా రూపొందించాలనే పాలనాశాస్త్రవేత్త అభిలాషకు అనుగుణంగా ఉంది. టేలర్ సిద్ధాంతానికి నిశితపరిశీలన, అంచనా, సాధారణీకరణ మొదలైన శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు ప్రాతిపదిక. 1920 దశాబ్దంనాటికి శాస్త్రీయనిర్వహణను లెనిన్ సోవియట్ రష్యాలో పరిశ్రమపాలనకు వర్తింపచేసాడు. టేలర్ ప్రతిపాదించిన శాస్త్రీయ నిర్వహణా సూత్రాలను విభిన్న సంస్కృతులకు అన్వయించేందుకు అనువైనవిగా గుర్తించవచ్చును. అందుచేత ఈ సూత్రాలు తులనాత్మక విశ్లేషణకు ఉపయోగకరమైనవి.

శాస్త్రీయ నిర్వహణోద్యమం ప్రభావం వల్ల అమెరికాలో పాలనా పద్ధతుల సార్వజనీన పాలనా సూత్రాల అన్వేషణ ఎంతో ప్రచారాన్ని పొందింది. శాస్త్రీయ నిర్వహణ ఉద్యమం తరువాత ప్రభుత్వపాలనపై వచ్చిన రచనలలో పాలన సూత్రాల రూపకల్పనపై ఆసక్తి ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

1920 దశాబ్దంలో ప్రభుత్వపాలనకై ప్రచురింపబడిన ఎల్.డి.వైట్ (1926) విల్లోబీల (1927) గ్రంథాలు, ఇతరరచయితల గ్రంథాలు ప్రభుత్వపాలన అధ్యయనానికి నిర్వహణాదృక్పథాన్ని అనుసరించాయి. ఈ గ్రంథాలలో కొన్ని సార్వజనీన పాలనా సూత్రాలను రూపొందించటంద్వారా ప్రభుత్వ పాలనను ఒక విజ్ఞాన శాస్త్రంగా మలచాలనే బలమైన ఆసక్తిని గుర్తించవచ్చును.

1930 దశాబ్దంలో ఎల్టన్ మేయో, తదితరులు ప్రారంభించిన మానవసంబంధాల ఉద్యమం పాలనాశాస్త్ర అధ్యయనంలో కొన్ని నూతన దృక్కోణాలను చేర్చింది. అయితే ఈ ఉద్యమం పాలనా సూత్రాల సందర్భంలో బహుళ సాంస్కృతిక దృక్పథాన్ని (Cross-Cultural approach) పెంపొందింపచేయలేదు.

ఈ దశాబ్దంలో అమెరికాలో సంభవించిన గొప్ప ఆర్థిక మాంద్యానికి ప్రతిస్పందనగా రూజ్‌వెల్ట్ ప్రభుత్వం చేపట్టిన న్యూడీల్ ( New Deal Policy ) పథకం, సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధనకు



BRAOU

ఏర్పాటుచేసిన టెన్నీస్ వ్యాలీ అథారిటీ వంటి నూతన సంస్థలు అమెరికా ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వపాలన పాత్రను విస్తృతపర్చాయి. ప్రభుత్వపాలన శాస్త్రంలో లక్ష్యసాధన దృక్పథం ఒక ప్రధానదృక్పథంగా రూపొందింది. ఇదే తరుణంలో పాలనా తత్వవేత్తలలో పాలనా, రాజకీయవ్యవస్థల మధ్య సంబంధాల విశ్లేషణపట్ల ఆసక్తి పెరిగింది. దాని ఫలితంగా ప్రభుత్వపాలనా శాస్త్రంలో ఆవరణదృక్పథం చోటు చేసుకొనటం ప్రారంభమైంది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికాలో రెండు ప్రధాన పరిణామాలు సంభవించాయి. ఒకటి, ఎడ్విన్‌స్టీన్, హెర్బర్ట్‌సైమన్, డ్వైట్‌వాల్డోవంటి పాలనా తత్వవేత్తలు పాలనా సిద్ధాంత నిర్మాణం, పరిశోధనలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. రెండు, మరికొందరు రచయితలు ప్రభుత్వపాలనా శాస్త్రంలో కఠినమైన బహుళసంస్కృతుల విశ్లేషణా ప్రాధాన్యతను నొక్కిచెప్పారు. జాన్.యం.గాస్, డ్వైట్ వాల్డో, ఆల్బర్ట్ లు లెపాస్కీ, ఎఫ్.యం.మార్క్సులు తమ రచనలద్వారా తులనాత్మక దృక్పథానికి పరిపూర్ణత కల్పించేందుకు ప్రయత్నించారు. ప్రముఖపాలనా తత్వవేత్త రాబర్ట్‌ధాల్ ప్రభుత్వపాలనలో తులనాత్మక పద్ధతి ప్రాముఖ్యతను వక్కాణిస్తూ చేసిన వ్యాఖ్య పాలనా శాస్త్ర రచయితలపై ఎంతో ప్రభావాన్ని కలిగించింది. "ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనం తులనాత్మక అధ్యయనం కానంతవరకు ప్రభుత్వపాలనా శాస్త్రాన్ని ఒకవైజ్ఞానిక శాస్త్రంగా పరిగణించడం శుష్కవాదమే అవుతుందని " ధాల్ నిర్ద్వంద్వంగా వాదించాడు. ఈ విధంగా తులనాత్మక అధ్యయనాలు సమగ్రమైన సూత్రాలకు ప్రాముఖ్యతనిచ్చే దృక్పథంగల పాలనా శాస్త్రం అభివృద్ధికి విడదీయలేని అంశంగా రూపొందింది.

## 1.3 తులనాత్మక పాలన అవతరణ

1940 – 60 మధ్యకాలంలో తులనాత్మకపాలనా దృక్పథం అభివృద్ధికి కొంతకృషి జరిగింది. 1960 దశాబ్దంలో ఆదృక్పథం వ్యవస్థీకరణ చెందింది. 1963లో అమెరికా ప్రభుత్వపాలనా సమాజం తులనాత్మక పాలక బృందం (Comparative Administration Group) అనే ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందానికి ఫ్రెడ్‌రిగ్స్‌ను అధ్యక్షుడుగా నియమించారు. రిగ్స్ 1970 వరకు ఆ పదవిలో కొనసాగాడు. 1970లో రిచర్డ్ గాబుల్ ఈ బృందం అధ్యక్షుడైనాడు. తులనాత్మకపాలన బృందంలో తులనాత్మక పాలనపై ఆసక్తి కలిగిన మేధావులు, పరిశోధకులు, ప్రభుత్వ ఉద్యోగులు సభ్యులుగా చేరారు. తులనాత్మకపాలనా బృందం తులనాత్మకపాలన అధ్యయన రంగంలో పరిశోధన, బోధన, విధానరూపకల్పనలకు ఒకమూడు అంశాల పథకాన్ని రూపొందించింది. ఈ బృందం అమెరికా విశ్వవిద్యాలయాలతోపాటు వర్ధమాన దేశాలలోని అనేక విశ్వవిద్యాలయాలలో తులనాత్మక పాలనపై సమావేశాలు, సదస్సులు, గోష్టులు నిర్వహించింది.

ఈ విధంగా పరిశోధనా, బోధనారంగాల్లో తులనాత్మకపాలన అభివృద్ధికి తులనాత్మక పాలనబృందం చేసిన కృషి ఫలితంగా ప్రభుత్వపాలనా శాస్త్రంలో ఒక ఉప అధ్యయనరంగం (Sub - Field ) గా తులనాత్మకపాలన అవతరించింది.

## 1.4 తులనాత్మకపాలన: అర్థవివరణ

తులనాత్మక అధ్యయనం ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. ఒకటి, తులనాత్మక అధ్యయనం ప్రభుత్వేతర వ్యవస్థలపై కాక ప్రభుత్వ వ్యవస్థలపైనే ప్రాధాన్యత కనపర్చింది. రెండు, ఈ అధ్యయనంలో అంతర్గత సంస్కృతి విశ్లేషణ (Inter Cultural Analysis) కంటే అంతర్ సంస్కృతి విశ్లేషణ (Intra Cultural Analysis) పట్లే మొగ్గు కనపరచబడింది.

సాధారణఅర్థంలో తులనాత్మకపాలన అంటే విభిన్న పాలనావ్యవస్థల తులనాత్మక అధ్యయనం లేదా వివిధదేశాల పాలనా వ్యవస్థలను తులనాత్మకపద్ధతిద్వారా అధ్యయనం చేయడం అని అర్థం. అంటే రెండు



BRAOU

లేక అంతకన్నా ఎక్కువ దేశాలకు చెందిన పాలనావ్యవస్థల పోలికలను, తారతమ్యాలను సరిపోల్చడం తులనాత్మకపాలన అనిభావం

భావనాత్మక స్థాయిలో పరిశీలిస్తే (Conceptual level) విభిన్నసంస్కృతుల లేదా దేశాల సందర్భంలో పాలనా వ్యవస్థల అధ్యయనాన్ని తులనాత్మకపాలన అనవచ్చును. అంటే రెండు లేదా అంతకన్న ఎక్కువ సంస్కృతులకు లేదా దేశాలకు చెందిన పాలనావ్యవస్థలను తులనాత్మకంగా అధ్యయనం చేయటం తులనాత్మకపాలన. ఇంకోవిధంగా చెప్పాలంటే, భిన్నసంస్కృతుల లేదా భిన్నదేశాల పాలన వ్యవస్థల విశ్లేషణనే తులనాత్మక పాలన అనవచ్చు.

తులనాత్మకపాలన సాహిత్యాన్ని పరిశీలించి నిమ్‌రోద్ రెఫేలీ (Nimrod Raphaeli) తులనాత్మకపద్ధతి ప్రాతిపదికపై ప్రభుత్వ పాలనను అధ్యయనాన్ని సాగించటమే తులనాత్మకపాలన అని నిర్వచించాడు. రెఫేలీ నిర్వచనం అస్పష్టమైంది, అసమగ్రమైంది. ఎందుచేతనంటే, ఇది తులనాత్మకపాలన అర్థాన్ని, సారాంశాన్ని సమగ్రంగా వెల్లడించదు. తులనాత్మకపాలనా బృందం రూపొందించిన నిర్వచనం ప్రకారం "తులనాత్మకపాలన వాస్తవ పూరిత సమాచారం ఆధారంగా అవగాహనకు, విశ్లేషణకు సాధ్యమైన విభిన్న సంస్కృతులకు, దేశాలకు వర్తించే పాలన సిద్ధాంతం. ఈ నిర్వచనం బహుళ సంస్కృతులకు చెందన పాలనా వ్యవస్థల తులనాత్మక అధ్యయనాన్ని వక్కాణిస్తుంది. అయితే ప్రభుత్వ వ్యవస్థల ప్రస్తావన ఈ నిర్వచనంలో లేదు. అందుచేత ఈ నిర్వచనాన్ని కూడా సమగ్రమైందిగా పరిగణించలేము.

ఈ విధంగా తులనాత్మకపాలనపై ఉన్న నిర్వచనాల్లో చాలావరకు సమగ్రమైనవికావు. అయితే ఈ అధ్యయనంపై సమగ్రమైనదిగా పరిగణింపదగిన నిర్వచనాలు లేకపోలేదు. జాక్సన్ (Jackson) అనే రచయిత తులనాత్మకపాలనను సమగ్రంగా ఈవిధంగా నిర్వచించాడు. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో నిమగ్నమైన విభిన్న సంస్కృతులకు చెందిన పాలన నిర్మాణాలు, ప్రక్రియలను కాఠిన్యపద్ధతుల ద్వారా తులనాత్మకంగా విశ్లేషించే ప్రభుత్వపాలన దృక్కోణాన్ని తులనాత్మకపాలన అనవచ్చును. ఈ నిర్వచనంలో విభిన్న సంస్కృతులకు, ప్రభుత్వవ్యవస్థలకు ప్రాధాన్యత ఉంది. అందుచేత ఈ నిర్వచనాన్ని సమగ్రమైందిగా పరిగణించే వీలుంది. మొత్తంమీద తులనాత్మక పాలనపైగల వివిధ నిర్వచనాలను పరిశీలిస్తే ఈ అధ్యయనంలో ఐదు స్థాయిలలో తులనాత్మక విశ్లేషణను గుర్తించవచ్చు. అవి: 1. అంతర్గత సంస్థావిశ్లేశణ (Intra - Institutional Analysis), 2. అంతర్ సంస్థా విశ్లేషణ, (Inter - Institutional Analysis), 3. అంతర్గత దేశీయ విశ్లేషణ (Intra - National Analysis) 4. భిన్న సంస్కృతి విశ్లేషణ (Cross Cultural Analysis), 5. భిన్నకాల విశ్లేషణ (Cross - Temporal Analysis ).

## 1.5 తులనాత్మకపాలన లక్షణాలు

తులనాత్మకపాలనపై గత సాహిత్యాన్ని విశ్లేషిస్తే తులనాత్మకపాలనా లక్షణాలను కొన్నింటిని గుర్తించవచ్చు. ఈ లక్షణాలలో ప్రధానమైనవి.

### 1.5.1 ఆధునిక అధ్యయనాంశం

తులనాత్మకపాలనను ఆధునిక అధ్యయనాంశంగా పరిగణించవచ్చును. దీనికి తులనాత్మకపాలన రెండవప్రపంచ యుద్ధానంతరం ప్రతిపాదితమైన నమూనా కావడం ప్రధానకారణం. రాఫెలీ నిమ్‌రోద్ తులనాత్మక పాలన అధ్యయనాన్ని ప్రపంచలోకి నూతనంగా ప్రవేశించిన అధ్యయనాంశమని పేర్కొన్నాడు. ఇంతకుమునుపే చెప్పినట్లు తులనాత్మకపాలన 1962లో తులనాత్మక బృందం రూపకల్పన చేసిన అధ్యయనాంశం.

తులనాత్మకపాలన ప్రభుత్వపాలనలో ఒక అధ్యయనాంశంగా రూపొందడానికి మూడు కారణాలు

ఉన్నాయి. మొదటిగా, ఒకప్రత్యేక అధ్యయనాంశంగా లేదా దృక్పథంగా తులనాత్మకపాలన అవతరణకు 1940వ దశాబ్దంలో రాజనీతి శాస్త్రంలో ప్రారంభమైన ప్రవర్తనా ఉద్యమం ఒకబలీయమైన కారణం. తులనాత్మకపాలన వేళ్ళు ప్రవర్తనాశాస్త్రాలలో నిక్షిప్తమై ఉన్నాయని కీత్‌హెండర్సన్ పేర్కొన్నాడు. తులనాత్మక పాలనా దృక్పథాన్ని ప్రవేశపెట్టేందుకు కారణభూతమైన ప్రభుత్వపాలన శాస్త్రీయ అధ్యయనానికి కఠినమైన పరిశోధనా పద్ధతులనుపయోగించాలనే వాదానికి ప్రవర్తనా వాదంనుంచి ప్రేరణ లభించిందని హెండర్సన్ చెప్పాడు. సంప్రదాయ ప్రభుత్వపాలనా సిద్ధాంతాల సంకుచిత స్వభావంపట్ల ఏర్పడిన విముఖత పాలనా తత్వవేత్తలలో తులనాత్మక పద్ధతి పట్ల ఆసక్తిని ప్రేరేపించింది. రాబర్ట్‌ధాల్ సంప్రదాయ ప్రభుత్వపాలన సంకుచిత నైజాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రభుత్వపాలనను ఒక శాస్త్రంగా రూపొందించేందుకు తులనాత్మక దృక్పథాన్ని అవలంబించాలని చేసిన వాదన పెక్కుమంది పాలనా శాస్త్రవేత్తలను ప్రభావితం చేసింది.

రెండు, రెండవ ప్రపంచయుద్ధానంతరం ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ఖండాల్లోని అనేక దేశాలు వలసపాలననుంచి విముక్తి పొంది స్వతంత్రదేశాలుగా ఆవిర్భవించడం తులనాత్మక పాలన దృక్పథం ప్రతిపాదించబడటానికి, బహుళప్రచారం పొందేందుకు దారితీసింది. ఈ దేశాలు సమాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉండటంవలన సామాజిక, ఆర్థికప్రగతి, జాతినిర్మాణం వాటి తక్షణ లక్ష్యాలయ్యాయి. ఈ లక్ష్యాల సాధనకు తగిన సంస్కరణల సూచనలకు ఆదేశాల పాలనప్రక్రియలు, పద్ధతులగురించిన విస్తృత సమాచారం అవసరమైంది. ఈ సమాచార సేకరణకు తులనాత్మక పరిశోధనా పద్ధతి ఒక సమర్థవంతమైన సాధనమని గుర్తించబడింది.

మూడు, ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన నూతనదేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక ఆర్థికాభివృద్ధికి అమెరికా, ఐక్యరాజ్యసమితి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక సహాయ పథకాలు తులనాత్మక పాలన అవతరణలో కీలక పాత్ర వహించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అమలుపరుస్తున్న సాంకేతిక సహాయపథకాలు (Technical Assistance Programmes) విజయవంతం కావడానికి పాశ్చాత్యదేశాలకు చెందిన పాలనా శాస్త్రవేత్తలు, నిపుణులు సహకారం అవసరమైంది. ఎందుచేతనంటే, సాంకేతిక పథకాలను విజయవంతంగా అమలుచేసేందుకు తగినవిధంగా అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థల సమర్థతను పెంపొందింప చేయగల పాలనా సంస్కరణలను వారు మాత్రమే సూచించగలరు. ఈ విశ్వాసానికి అనుగుణంగా అమెరికాలోని ఫోర్డు ఫౌండేషన్, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థవంటి సహాయక సంస్థలు ఉదారంగా విరాళాలు సమకూర్చటం ద్వారా పాలనాశాస్త్రవేత్తలు, పాలనా నిపుణులు అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలను అధ్యయనం చేసేందుకు ప్రోత్సహించాయి. ఫలితంగా అనేకమంది ప్రభుత్వపాలనా నిపుణులు తులనాత్మక పద్ధతి ప్రాతపదికపై అభివృద్ధి చెందుతున్న పాలనావ్యవస్థల అధ్యయనానికి ఉపక్రమించారు.

## 1.5.2 నమూనా పూర్వస్థితి (Pre -Paradigmatic state)

తులనాత్మకపాలన పూర్వస్థితిలో ఉన్ననమూనాలని కొందరు పాలనా తత్వవేతలు భావించారు. తులనాత్మక పాలనాధ్యయనంలో ఒక నిర్దిష్టమైన, స్పష్టమైన నమూనాలేదు. ఈ అధ్యయనంలో పరస్పర వైరుధ్యంగల విభిన్ననమూనాలు ప్రతిపాదించబడినాయి. ఫలితంగా తులనాత్మక పాలనా సిద్ధాంతంలో నమూనా రాహిత్యస్థితి ఏర్పడిందని పాలనాతత్వవేత్తల అభిప్రాయం. పరిశోధనకు మార్గ దర్శకత్వం వహించే స్పష్టమైన నమూనాను, కలిగి ఉండటం విజ్ఞానశాస్త్రాల లక్షణం. ఒక విజ్ఞాన శాస్త్రంలోని నమూనా ఆ శాస్త్రం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం సూచించనపుడు దానిని తొలిగించి దాని స్థానంలో నూతననమూనా ప్రవేశపెట్టబడుతుందని థామస్‌కున్ సిద్ధాంతీకరించాడు. కున్‌సిద్ధాంత దృక్కోణంనుంచి పరిశీలిస్తే తులనాత్మకపాలన నమూనా రహిత్యస్థితిలో ఉన్న అధ్యయనాంశమని స్పష్టమవుతుంది.

BRAOU

## 1.5.3 ఆచరణాత్మక, సూత్రీకరణ, ఆవరణ దృక్పథాల ప్రాధాన్యత

తులనాత్మకపాలన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ అధ్యయనంలో ఆచరణాత్మక, సూత్రీకరణాత్మక ఆవరణ దృక్పథాలు ప్రాధాన్యత వహించినట్లు గుర్తించవచ్చును. తొలిదశలో ప్రభుత్వపాలనాశాస్త్ర సిద్ధాంతం సంప్రదాయదృక్పథం వల్ల ప్రభావితమైంది. ఈ దశలో పాలనాధ్యయనంలో సమర్థత (Efficiency), మితవ్యయం ( Economy) మొదలైన ప్రామాణాత్మక విలువలు ప్రాధాన్యత వహించాయి. కానీ, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనాధ్యయనానికి సంప్రదాయిక ప్రామాణిక దృక్పథం ఏమాత్రం ఉపకరించదని విదితమైంది. ఇదే తరుణంలో బహుళప్రచారంలోనికి వచ్చిన ప్రవర్తనావాద ప్రభావం పాలనాశాస్త్రంపై పడటంవల్ల పాలనావ్యవస్థల్లోని వాస్తవపరిస్థితుల అధ్యయనానికి ప్రాముఖ్యత పెరిగింది. ఈ అధ్యయనాలలో భిన్నదేశాలు, సంస్కృతులకు చెందిన పాలనావ్యవస్థల తులనాత్మక విశ్లేషణ విలువలను సంతరించుకుంది. పాలనావ్యవస్థల లక్షణాలను వివరించటంపై కన్నా వాటి నిర్మాణాలు, ప్రవర్తనను విశ్లేషించటంపైనే ఆసక్తి పెరిగింది. రిగ్స్ తులనాత్మక అధ్యయనంలో రెండు పోకడలను గుర్తించాడు. అవి ఏకాత్మకపోకడ ( Ideographic Trend ), సూత్రీకరణ పోకడ ( Nomothetic trend), ఏకాత్మకపోకడ ఏదో ఒక విశిష్టాంశాన్ని అధ్యయనం చేస్తుంది. ఈ దృక్పథం ఒకదేశం లేదా ఒకసంస్థ లేదా ఒక చారిత్రాత్మక సంఘటనపై తనదృష్టిని కేంద్రీకరిస్తుంది. దీనికి భిన్నంగా సూత్రీకరణదృక్పథం వివిధ పాలనావ్యవస్థల ప్రవర్తన విశ్లేషణ ఆధారంగా పరికల్పనలను సాధారణీకరణలను రూపొందిస్తుంది. తొలిదశలో తులనాత్మక పాలన అధ్యయనాలు ఏకాత్మక పోకడలను అనుసరించటంవలన వివిధ దేశాల పాలనావ్యవస్థలను విడిగా వివరించాయే తప్ప వాటి తారతమ్యాలను, సారూప్యతలను తులనాత్మకంగా విశ్లేషించలేదు. అందుచేత అవి విభిన్న సంస్కృతులకు చెందిన పాలనా వ్యవస్థల నిర్వర్తనపై సాధారణీకరణలు, పరికల్పనల రూపకల్పనకు తోడ్పడలేవు. దీని ఫలితంగా పాలనా తత్వవేత్తలు ఏకాత్మక దృక్పథం ప్రాధాన్యతను తగ్గించి యదార్థపరిస్థితులు, అనుభవం ఆధారంగాకల, విస్తృతమైన ఉపయుక్తత కలిగిన పాలనా దృగ్గోచరం విభిన్న చలాంశాల మధ్య సంబంధాలను వివరించే సంకల్పనలు, సూత్రాల రూపకల్పనపై ప్రాధాన్యత కేంద్రీకరించటం మొదలైంది. తులనాత్మక పాలనలో సూత్రీకరణ పోకడ ప్రాధాన్యతను వక్కాణించిన రచయితలలో రిగ్స్, డేనియల్ లెర్నర్, కార్ల్‌డాయిచ్ ప్రముఖులు.

మొదట్లో తులనాత్మక పాలనా అధ్యయనాలలో ఆవరణ అంశం లోపించింది. రిగ్స్ ప్రభావంవలన తులనాత్మక పాలనలో ఆవరణ దృక్పథానికి ఎనలేని ప్రాముఖ్యత ఏర్పడింది. రిగ్స్ ప్రేరేపణవల్ల పెక్కుమంది పాలనా తత్వవేత్తలు ఆవరణ దృక్పథాన్ని అన్వయిస్తూ వివిధ దేశాల పాలనా వ్యవస్థలు, వాటి పరిసరాల మధ్య పరస్పర సంబంధాలను వివిధ కోణాలనుంచి విశ్లేషించారు. ఈ పరిశోధనలు పాలనా వ్యవస్థలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలపై కేంద్రీకృతమయ్యాయి. ఈ విధంగా వారు ఆచరణాత్మక పరిశోధన పట్ల మొగ్గు కనపరిచారు.

## 1.5.4 అమెరికా మేధావులపాత్ర

తులనాత్మకపాలన శాస్త్ర అభివృద్ధిలో అమెరికాకు చెందిన పాలనా శాస్త్రవేత్తలు కీలక పాత్ర వహించారు. తులనాత్మక పాలన సృష్టికర్త అయిన తులనాత్మక పాలనాబృందంలోని ప్రముఖసభ్యులందరూ అమెరికాకు చెందిన పాలనా శాస్త్రవేత్తలు, పరిశోధకులే. వీరు ఫోర్డు ఫౌండేషన్ తదితర సహాయ సంస్థలు అందచేసిన విరాళాలతో విస్తృత పరిశోధనలు, అధ్యయనాలు నిర్వహించి తులనాత్మక పాలనాసాహిత్యాన్ని ఉత్పాదించారు. కాని తులనాత్మకపాలనపై అమెరికా పాలనా శాస్త్రవేత్త ప్రాబల్యం వల్ల ఒక అవాంఛనీయ పరిణామం సంభవించింది. అమెరికా పాలనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలను

విశ్లేషించడంలో, వాటి అభివృద్ధికి పాలనా సంస్కరణలను సూచించడంలో చేతనంగా లేదా అచేతనంగా అమెరికా సాంస్కృతిక విలువలు, ప్రమాణాలకు పూర్తిగా కట్టుబడ్డారు. ఫలితంగా తులనాత్మక పాలనా దృక్పథం స్వ సంస్కృతి ఆధిక్యతావాదం అనే బలహీనతకు లోనైందనే విమర్శ చెలరేగింది. ఈ విమర్శలో వాస్తవం లేకపోలేదు.

## 1.5.5 సిద్ధాంత నిర్మాణంపట్ల ఆసక్తి

తులనాత్మక పాలన అధ్యయనంలో సిద్ధాంత నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. దీనికి కారణాలు ఏమనగా సమాచారాన్ని ఒక కార్యచట్రంలో వ్యవస్థీకరించడం ద్వారా సిద్ధాంతనిర్మాణం ఒక అధ్యయనాంశం అభివృద్ధికి తోడ్పడుతుంది. అనుభవైక పరిశోధనలో ఇమిడిఉన్న సంక్లిష్టత సిద్ధాంత నిర్మాణ ప్రాధాన్యత పెరిగేందుకు దోహదపడతాయి. తులనాత్మక పాలనలో రెండు రకాల సిద్ధాంతాలు ప్రాబల్యం వహిస్తున్నాయి. అవి: మధ్యస్థాయి సిద్ధాంతాలు (Middle Range Theories ), సాధారణ సిద్ధాంతాలు (General Theories ). సాధారణ సిద్ధాంతాలలో రిగ్స్ ప్రతిపాదించిన పారదర్శనికి సమాజ సిద్ధాంతం (Prismatic Theory ). ప్రధానమైంది. కాగాలెబర్ ప్రతిపాదించిన ఉద్యోగిస్వామ్య నమూనా కీలకమైన మధ్యస్థాయిసిద్ధాంతం. తులనాత్మక పాలనా శాస్త్రవేత్తలు వెబర్ ఉద్యోగి స్వామ్యనమూనా ప్రాతిపదికగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ఉద్యోగిస్వామ్యవ్యవస్థ విభిన్న అంశాలపై విస్తృతంగా పరిశోధనలు నిర్వహించారు. పాలన అధ్యయనంలో మధ్యస్థాయి సిద్ధాంతాల ప్రాధాన్యత క్రమంగా పెరిగింది. దీనికి భిన్నంగా సాధారణ సిద్ధాంతాలు అతి స్థూలమైనవి, ఆచరణయోగ్యమైనవి కాక పోవటంచేత వాటి ప్రాధాన్యత క్రమంగా సన్నగిల్లింది.

పై రెండురకాల సిద్ధాంతాలతోపాటు తులనాత్మక పాలన అధ్యయనంలో ప్రగతి పాలనా సిద్ధాంతం అనే మరో సిద్ధాంతం అతి ప్రముఖస్థానం వహిస్తున్నది. రెండవప్రపంచయుద్ధానంతరం అవతరించిన అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రారంభమైన అభివృద్ధి ప్రక్రియపై అనూహ్యమైన స్థాయిలో తులనాత్మకపాలనా శాస్త్రవేత్తల దృష్టి కేంద్రీకృతమైంది. 1940 దశాబ్దం తరువాత అంతర్జాతీయ రంగంలో అమెరికా, రష్యాలమధ్య ఏర్పడిన పోటీకూడా అభివృద్ధి చెందుతున్న దేశాలపట్ల పాలనా శాస్త్రవేత్తలలో ఆసక్తి పెంపొందటానికి కారణమైంది. ఈదేశాల ఆర్థిక, సమాజిక ప్రగతికి అమెరికా చేపట్టిన సాంకేతిక సహాయ పథకాల ఫలితంగా ఒక నూతన పరిశోధన, అధ్యయనాంశంగా ప్రగతిపాలన అవతరించింది. క్రమంగా ప్రగతిపాలనా సిద్ధాంతం తులనాత్మకపాలనలో ఒక ప్రధానభాగమైంది. చివరకు ఈ సిద్ధాంతం తులనాత్మక పాలనను అధిగమించి ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా అభివృద్ధి చెందింది.

## 1.6. తులనాత్మకపాలన ఆధారాలు

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన తులనాత్మక ప్రభుత్వపాలన అభివృద్ధి చెందడానికి పెక్కుమంది పాలనా శాస్త్రవేత్తలు కృషిచేశారు. నేడు ఇది ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఒక విశిష్టమైన స్థానాన్ని అలంకరించింది. ఈ పరిణామానికి అనేకకారకాలు దోహదం చేశాయి. అంటే తులనాత్మక పాలనా సాహిత్యాన్ని విశ్లేషిస్తే ఈ అధ్యయనాంశం ఆవిర్భావానికి, అభివృద్ధికి ప్రేరణనిచ్చిన పెక్కు ఆధారాలను గుర్తించవచ్చును. వీటిని ప్రధానంగా రెండుతరగతులుగా విభజించవచ్చు అవి : 1. విధానాపర ఆధారాలు, 2. మేధోపరమైన ఆధారాలు.

విధానపర ఆధారాలు ప్రధానంగా ప్రభుత్వ విధానాలవల్ల ఉత్పన్నమైనాయి. నిర్దిష్ట పరిస్థితులలో సమర్థవంతమైన విధాన రూపకల్పన, అమలు ప్రక్రియలు అనుభవైక పరిశోధన అభివృద్ధికి దోహదం చేశాయి. అనుభవైక పరిశోధనపట్ల ప్రభుత్వ పాలనా శాస్త్రవేత్తలలో కలిగిన ఆసక్తి వారిని తులనాత్మకపాలన దృక్పథం

BRAOU

పట్ల ఆకర్షితులను చేసింది. ప్రభుత్వ విధానాలను అమలుపరచిన, అభివృద్ధి ప్రాజెక్టులను నిర్వహించిన పాలనా నిపుణులు తులనాత్మకపాలనా దృక్పథం అభివృద్ధికి తోడ్పడ్డారు.

రెండవప్రపంచయుద్ధం చివరి దశలో అమెరికా ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో సైనిక కార్యకలాపాలను నిర్వహించిది. ఈ ప్రాంతాలలో అది ఎదుర్కొనే సమస్యలను సంప్రదాయిక ప్రభుత్వ పాలన విజ్ఞానం ద్వారా పరిష్కరించడం సాధ్యంకాదని పాలనా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ స్ఫూర్తి వారిలో తులనాత్మక పాలనా దృక్పథం పట్ల ఆసక్తిని పెంపొందింపచేసే ఉత్ప్రేరకమైంది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం తులనాత్మకపాలన పట్ల ఆకర్షణను ద్విగుణీకృతం చేసిన పరిణామాలు సంభవించాయి. ఈ ప్రపంచయుద్ధంవలన ఆర్థికంగా చిన్నాభిన్నమైన యూరప్‌దేశాల ఆర్థికవ్యవస్థ పునర్నిర్మాణానికి అమెరికా చేపట్టిన మార్షల్ ప్రణాళిక, అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక, ఆర్థికప్రగతిని చేపట్టిన నాలుగు అంశాల పథకం పలుదేశాల పరిపాలనలో అమెరికా పాత్రను విస్తృతం చేశాయి. ఈ పథకాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సేవలను కూడా అమెరికాకు చెందిన పాలనా నిపుణులు అందచేయవలసి వచ్చింది. ఫలితంగా అమెరికాలోని పాలనా నిపుణులు, మేధావులతో కూడిన పెక్కు సాంకేతిక బృందాలు నియమించబడ్డాయి. ఈవిధంగా అమెరికాలో అంతర్జాతీయ పాలనోద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో పాలనా నిపుణులతోబాటు విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, ప్రైవేటు పరిశోధనా సంస్థలకు చెందిన పరిశోధకులు పాల్గొన్నారు. ఈ మేధావులు తాము కార్యకలాపాలు నిర్వహిస్తున్న దేశాల పాలనావ్యవస్థలు, వాటి సాంస్కృతిక పూర్వరంగ అవగాహనా ఆవశ్యకతను గుర్తించారు. తత్ఫలితంగా వారు తులనాత్మకపాలనా దృక్పథాన్ని అవలంబించక తప్పలేదు. కానీ ప్రారంభంలో అమెరికా చేపట్టిన సహాయకార్యక్రమాలు స్వల్పకాలికమైనవి అవటం వలన తులనాత్మక పాలనా దృక్పథం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం లేకపోయింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ఆధునీకరణ, ప్రగతికి సంబంధించిన సవాళ్ళు, సమస్యలు అమెరికాలోని పాలనాశాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో త్వరగా అభివృద్ధి సాధించాలనే కాంక్ష (Revolution of raising expectations ) పెరిగి అందుకు అవసరమైన సంస్థాగత మార్పులు చేపట్టడం మూలంగా ఏర్పడిన సవాళ్ళను ఎదుర్కొనటంలో ఈ దేశాలకు అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల సహాయం అవసరమైంది. ఇదే సమయంలో అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిరపరిస్థితులు, ప్రచ్ఛన్న యుద్ధాల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దీనితోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రగతిసాధన అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలకు ఒక సార్వజనీన లక్ష్యమైంది. ఈ కారణాలన్నీ అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలపట్ల మేధోపరమైన ఆసక్తి పెంపొందించాయి. అలాగే ఈ దేశాలలో నెలకొన్న సామాజిక పరిస్థితులు పరిశోధకులలో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ కారణాలవలన ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనంలో తులనాత్మకపరిశోధన బలపడింది.

రెండో ప్రపంచయుద్ధానంతరం సామాజిక శాస్త్రవేత్తలను ప్రధానంగా పాలనా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిన అభివృద్ధి చెందుతున్న దేశాలు వాటి చారిత్రక నేపథ్యం, భౌగోళిక పరిస్థితులు, జనాభాపెరుగుదల, ఆర్థికవృద్ధి, రాజకీయస్థిరత్వం, సైద్ధాంతికభావజాలం మొదలైన అంశాలలో భేదాలున్నాయి. ఈవైరుధ్యాలు సామాజిక విశ్లేషణలో కీలకమైన భిన్న సంస్కృతుల అధ్యయనానికి అనేక సమస్యలను సృష్టించాయి. అందుచేత తులనాత్మకపాలనా శాస్త్రవేత్తలు సమాజిక, పాలనాభివృద్ధి గమనశీలతను ( Dynamics ) వివరించేందుకు ఆవరణ దృక్పథాన్ని అవలంబించాల్సి వచ్చింది. ఈ విధంగా ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనంలో అనేక నూతన పోకడలు ఆవిర్భవించటంతో తులనాత్మకపాలన ఆవశ్యకత పెరిగింది.

BRAOU

రెండవప్రపంచయుద్ధానంతరం పెక్కుమంది యువపాలనా శాస్త్రవేత్తలలో ప్రభుత్వపాలనా సంప్రదాయ దృక్పథాల సంకుచిత ధోరణిపట్ల తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది. ప్రభుత్వపాలనా అధ్యయనంలో తులనాత్మకత లోపించినంతకాలం ప్రభుత్వపాలనా అధ్యయనం ఒక విజ్ఞానశాస్త్రంగా రూపొందటం ఒక మిథ్య అన్న రాబర్ట్‌ధాల్ వ్యాఖ్య 1950 దశాబ్ద పాలనా శాస్త్రవేత్తలలో ఏర్పడిన అసంతృప్తికి దర్పణం పడుతున్నది. ఈ అసంతృప్తి ఫలితంగా సమాజిక శాస్త్రం, మానవశాస్త్రం మొదలైన సామాజిక శాస్త్రాలలో సంభవించిన పరిణామాలపట్ల అవగాహన కలిగిన ప్రభుత్వ పాలనా శాస్త్రవేత్తలలో బహుళ సంస్కృతులు, దశాలు, కాలాంశాలకు వర్తించే సైద్ధాంతిక చట్రాలు (నమూనాలు) రూపొందించాలనే ఒక బలమైన వాంఛ ఉత్పన్నమైంది. అమెరికాదేశ సంస్కృతిని దృష్టిలో వుంచుకొని రూపకల్పనచేసిన ఊహనలు, సిద్ధాంతాలకు మాన్యత ( Validity ) చేకూర్చేందుకు వాటిని వివిధ దేశాల పరిస్థితులలో పరీక్షకు గురిచేయవలసిన ఆవశ్యకతను వారు గుర్తించారు.

చివరిగా రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రభుత్వపాలనను లాంఛనప్రాయ, న్యాయశాస్త్ర దృక్పథాల ప్రభావం నుంచి తప్పించాలనే ఆకాంక్ష వ్యవస్థలోని సభ్యుల సహజప్రవర్తన అధ్యయనంపై పెరిగిన ఆసక్తి తులనాత్మక అధ్యయనం అభివృద్ధికి ప్రేరణనిచ్చాయి.

## 1.7 తులనాత్మకపాలనలో నమూనాలు

తులనాత్మక పాలనను ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా రూపొందించేందుకు విస్తృతప్రాతిపదికపై సిద్ధాంత నిర్మాణం చేపట్టబడింది. ఈ సిద్ధాంతాలు ఏ అంశాలను తులనాత్మకంగా అధ్యయనం చేయాలో నిర్ధారించాయి. తులనాత్మక పాలనాధ్యయనంలో ప్రధానంగా మూడు నమూనాలు ప్రాధాన్యత వహించాయి. అవి : 1. నిర్మాణ – విధుల దృక్పథం, 2. ఉద్యోగి స్వామ్య నమూనా, 3. పారదర్శనిక సమాజనమూనా. టాల్‌కాట్ పార్సన్స్ ప్రతిపాదించిన 'నిర్మాణాలు – విధుల దృక్పథం ' ప్రభుత్వపాలన రాజనీతి శాస్త్రాలపై విపరీతమైన ప్రభావాన్ని కనపరిచింది. ఈ దృక్పథంలో రెండు కీలకమైన అంశాలు ఉన్నాయి వాటిలో సామాజికవ్యవస్థ ఒక అంశంకాగా, దాని నిర్మాణం, విధులపై చర్చ రెండో అంశం. టాల్‌కాట్‌పార్సన్స్ నిర్మాణం – విధుల దృక్పథం ప్రకారం సామాజిక వ్యవస్థ అనగా వివిధ పాత్రధారుల (Actors)మధ్య సంభవించే పరస్పర చర్య ప్రక్రియ ( Interaction Process ), ఈ ప్రక్రియలో పాల్గొనే పాత్రధారుల మధ్య సంబంధాల నిర్మాణమే సామాజిక వ్యవస్థలోని నిర్మాణాలు ( Sturctures ). వ్యవస్థలోని వివిధ విభాగాల మధ్య పరస్పర ఆధారం ( Interdependence ) వాటి సంబంధాలమధ్య సమతౌల్యత కొనసాగించాలనే ధోరణి సామాజిక వ్యవస్థలోని కీలకాంశాలు. సామాజిక వ్యవస్థ తన మనుగడ పరిరక్షణకు నాలుగు చర్యలను నిర్వర్తిస్తుందని పార్సన్స్ పేర్కొన్నాడు. అవి : 1. లక్ష్యాలసాధన, 2. అనుసరణీయత (Adaptation ), 3. సమైక్యత (Integration ), 4. విధానం కొనసాగింపు ( Pattern Maintenance). ఈ నాలుగు చర్యల విశ్లేషణ ప్రాతిపదికమీదే పార్సన్స్ తన వ్యవస్థ సిద్ధాంతాన్ని రూపకల్పన చేశాడు. తులనాత్మకపాలన అధ్యయనంలో నిర్మాణం – విధుల దృకపథాన్ని అనుసరించిన పాలనాశాస్త్రవేత్తలలో రిగ్స్ ప్రముఖుడు . రిగ్స్ నిర్మాణం – విధుల దృకథాన్ని అనుసరిస్తూ పారదర్శనిక సమాజ సిద్ధాంతాన్ని రూపకల్పన చేశాడు. రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంతం అభివృద్ధి చెందుతున్న దేశాల సమాజాల్లోని నిర్మాణాలు అవి నిర్వర్తించే విధుల మధ్య పరస్పర సంబంధాలను విశ్లేషిస్తుంది. రిగ్స్ నిర్మాణాన్ని చర్య విధానంగా (Action Pattern), విధులను విభిన్న నిర్మాణాలమధ్య ఉపయుక్తమైన సంబంధాలుగా నిర్వచించాడు. రిగ్స్ సమాజంలోని నిర్మాణాలు, విధుల మధ్య సంబంధాల ప్రాతిపదికగా సమాజాలను సంయోజిత (Fused) సమాజులు, ప్రతిఫలన ( Diffracted) సమాజాలు, పారదర్శనిక (Prismatic) సమాజాలని మూడు తరగతులుగా వర్గీకరించాడు. రిగ్స్ పారదర్శనిక సమాజం సామాజిక, పాలన, ఆర్థిక ఉపవ్యవస్థలపై తిరుగులేని సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. చివరిగా,

BRAOU

తులనాత్మక పాలన అధ్యయనంలో మధ్యస్థసిద్ధాంతంగా పరిగణింపబడిన ఉద్యోగిస్వామ్యవ్యవస్థ దృక్పథం అత్యంత కీలకమైన నమూనా. ఈ నమూనా ప్రగతిపాలనా దృక్పథానికి గల పరిమితపరిధిని, సాధారణవ్యవస్థల దృక్పథాన్ని అన్వయించడంలోగల కష్టాలను అధిగమించగలదని భావించబడింది. తులనాత్మక పాలనలో తులనాత్మక అధ్యయనానికి కేంద్రంగా ఉద్యోగి స్వామ్యవ్యవస్థను ఎంపిక చేయటానికి కారణం ఏమిటంటే వర్ధమాన దేశాలు వెబర్ రూపొందించిన నమూనాతో సారూప్యతకల ఉద్యోగిస్వామ్య వ్యవస్థను కలిగి ఉన్నాయి. అందుచేత వివిధ దేశాల్లోని ప్రభుత్వ వ్యవస్థల విశ్లేషణకు, వాటి తులనాత్మక అధ్యయనానికి ఉద్యోగిస్వామ్య వ్యవస్థ కేంద్రబిందువుగా ఉపయోగపడింది. మాక్స్‌వెబర్ రూపొందించిన నమూనాపై ఆధారపడిన ఉద్యోగిస్వామ్య దృక్పథం తులనాత్మకపాలనలో అత్యంత ఆధిక్యతకల ఏకైక నమూనా అని రమేష్‌కె. అరోరా పేర్కొన్నాడు. అయితే, అరోరా అభిప్రాయంతో లీసిగిల్‌మన్ ఏకీభవించక ఉద్యోగిస్వామ్య వ్యవస్థపైగల అధ్యయనాలలో అనేకలోపాలను గుర్తించాడు. ఏమైనప్పటికీ తులనాత్మకపాలన అధ్యయనంలో వెబర్ ఉద్యోగి బృంద వ్యవస్థపై గణనీయమైన సంఖ్యలో అధ్యయనాలు నిర్వహింపబడ్డాయి. ఈ అధ్యయనాలు ఉద్యోగి స్వామ్యవ్యవస్థకు చెందిన అనేక అంశాలను విశ్లేషించాయి.

పై మూడు నమూనాలు తులనాత్మకపాలన అధ్యయనంలో ఎంతో స్థానాన్ని పొందినప్పటికీ, వాటికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఈనమూనాలు సామాజికచర్య ఆత్మాశ్రయ ( Subjective ) అర్థాన్ని వివరించడంలో విఫలమయ్యాయి. అవి వ్యవస్థమార్పు అధ్యయనానికి అవసరమైన సాధనాలను (Tools) సమకూర్చలేదు. అవి సామాజిక నిర్మాణాల విధానంపై ఎక్కువ ప్రాధాన్యత కనపరచాయి. అందుచేత ఈ నమూనాలకు సమాజానికి, సమాజానికి లేదా దేశానికి , దేశానికి మధ్య భిన్నత్వం ఉన్న సామాజిక దృగ్గోచరాన్ని విశ్లేషించడానికి తగిన సామర్థ్యంలేదని జిన్ ఏస్ జంగ్ పేర్కొన్నాడు.

తులనాత్మకపాలన అధ్యయనంలో ఉపయోగించిన నమూనాలలోని లోపాలవల్ల ఈ అధ్యయనం ప్రభుత్వ పాలనలో ఒక భాగంగా మాత్రమే స్థిరపడిందే తప్ప ఒక స్వతంత్ర అధ్యయనాంశం స్థాయికి ఇప్పటికీ ఎదగలేదు.

BRAOU

## 1.8 తులనాత్మక పాలనలో పోకడలు ( Trends in Comparative Public Administration )

రిగ్స్ తులనాత్మకపాలన సాహిత్యాన్ని పరిశీలించి ఆ అధ్యయనంలో మూడు పోకడలను గుర్తించారు. ఒకటి, ప్రమాణాత్మక దృక్పథాలనుంచి ఆచరణాత్మక దృక్పథాలకు మార్పు; రెండు, ప్రత్యేక దృక్పథాలనుంచి సార్వజనీనదృక్పథాలకు మార్పు; మూడు, ఆవరణేతర దృక్పథాలనుంచి ఆవరణదృక్పథాలకు మార్పు. రిగ్స్‌పై మూడు పోకడలను ఈ విధంగా వివరించాడు.

### 1.8.1 ప్రమాణాత్మక దృక్పథాలనుంచి ఆచరణాత్మక దృక్పథాలకు మార్పు :

పాలనాచర్యలేదా, నిర్మాణాల విధానాలలో ఆదర్శవంతమైనది లేదా శ్రేష్ఠవంతమైనది ఏదో సూచించే దృక్పథాన్ని ప్రమాణిక దృక్పథం అనవచ్చును. ప్రభుత్వ పాలనా శాస్త్ర సూత్రాలలో ప్రమాణిక దృక్పథాన్ని గుర్తించవచ్చును. సామర్థ్యానికి ప్రాధాన్యతను వక్కాణించే శాస్త్రీయ నిర్వహణ ఉద్యమంలో ప్రమాణిక దృక్పథం కీలకస్థానం ఆక్రమిస్తుంది. ప్రభుత్వ పాలనాశాస్త్ర అధ్యయనం అభివృద్ధి చెందటంతో సామర్థ్యం లేదా ప్రజాప్రయోజనానికి ( Public interest ) సంబంధించిన ఏఒక్క సాధారణ సూత్రం పాలనా చర్యకు సమర్థవంతమైన మార్గదర్శకత్వాన్ని వహించలేదని స్పష్టమైంది. అందుచేత పాలనాశాస్త్రవేత్తలు పాలనా చర్యకు ఆవశ్యకమైన విభిన్న ప్రాతిపదికలను అన్వేషించారు. చివరకు, సూచనాత్మక పద్ధతిని (Prescriptive method ) పూర్తిగా త్యజించి ఆచరణాత్మక వివరణ ( Empirical description ) పై ప్రాధాన్యతను

వక్కాణించటం ప్రారంభించారు. దీనికి హెర్బర్ట్‌సైమన్ పరిశోధనను ఒక దృష్టాంతంగా పేర్కొనవచ్చును. అయితే, ప్రభుత్వ పాలనాశాస్త్ర అధ్యయనంలో సంభవించిన ఈ మార్పును తులనాత్మకపాలన అధ్యయనంలో కూడా గుర్తించవచ్చు. తులనాత్మకపాలన అధ్యయనం ప్రారంభదశలో ఈ అధ్యయన సాహిత్యంలో కీలకస్థానాన్ని ఆక్రమించిన ప్రమాణాత్మక దృక్పథం 1950 దశాబ్దంలో క్రమంగా ప్రాధాన్యత కోల్పోవడం ప్రారంభమైంది. ప్రమాణాత్మక అధ్యయనాల సంఖ్యతగ్గి ఆచరణాత్మక అధ్యయనాల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. 1950 తరువాత కాలంలో తులనాత్మక పాలనా రంగంలో చేపట్టిన పరిశోధనలలో, అధ్యయనాంశాలలో విశ్లేషణాత్మక, ఆచరణాత్మక అంశం (content) ఎక్కువ చోటు చేసుకున్నది. 1950 దశాబ్దంలో ఐక్యరాజ్యసమితి ప్రభుత్వ పాలన పథకం (Public Administration Programme) ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలనా వ్యవస్థలపై సాగించిన అధ్యయనాలు, పరిశోధనలు అధికపరిమాణంలో ఆచరణాత్మక సమాచారాన్ని వెల్లడించాయి. ఈ విధంగా 1950 తరువాత కాలంలో తులనాత్మకపాలన ప్రమాణాత్మక అధ్యయనం ఆచరణాత్మక, వివరణాత్మక అధ్యయనంగా పరివర్తన చెందటం స్పష్టంగా గుర్తించవచ్చును.

## 1.8.2 ప్రత్యేక దృక్పథం నుంచి సార్వజనీన దృక్పథంకు మార్పు

తులనాత్మకపాలన అధ్యయనంలో సంభవించిన రెండవ పోకడ ప్రత్యేక దృక్పథాలనుంచి సార్వజనీన సూత్రీకరణ దృక్పథాలకు మార్పు. ఈ రెండు దృక్పథాలు పరస్పరం విరుద్ధమైనవి. తులనాత్మక పాలనలోని అనేక అధ్యయనాం ఈ రెండు దృక్పథాల లక్షణాల మిశ్రమాన్ని కలిగి వాటికి మధ్యస్థంగా ఉండటం గుర్తించవచ్చును. తులనాత్మక పాలనకు ముందుదశలో దేశీయ అధ్యయనాల రూపంలో పెక్కుదేశాల ప్రభుత్వాలు విడిగా అధ్యయనం చేయబడ్డాయి. తులనాత్మక ప్రభుత్వాలు (Comparative Governments) అనే శీర్షికక్రింద పెక్కు దేశాల ప్రభుత్వాల అధ్యయనం చేయబడ్డాయి. ప్రధానంగా అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల ప్రభుత్వాలపై అనేక అధ్యయనాలు వెలువడ్డాయి. తులనాత్మక పాలన అవతరించాక ప్రత్యేక దృక్పథం పద్ధతిని అనుసరించి ప్రభుత్వ వ్యవస్థలో ఒక భాగమైన ఉద్యోగిస్వామ్య వ్యవస్థపై అనేక అధ్యయనాలను సాగించారు. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ ఉద్యోగి సామ్యవ్యవస్థలపై వెలువడిన అధ్యయనాలు దానికి ఉదాహరణగా పేర్కొనవచ్చును. ఈ పద్ధతికి అనుగుణంగా అమెరికా, తదితర పాశ్చాత్య దేశాల పాలనా చరిత్రలపై కూడా అనేక రచనలు సాగించారు. హెర్మన్‌ఫైనర్, కార్లఫ్రెడిక్, బ్రియాన్ ఛాప్‌మెన్ రచించిన గ్రంథాలు ప్రత్యేకాత్మక దృక్పథంతో సాగించిన రచనలకు ప్రధాన దృష్టాంతాలు.

తులనాత్మక పాలన అభివృద్ధి చెందాక ప్రత్యేకాత్మక దృక్పథం ప్రాధాన్యతను తగ్గించి, సార్వజనీన సూత్రీకరణ దృక్పథం పట్ల ఆసక్తి పెరగటం గుర్తించవచ్చును. ఈ దశలో తులనాత్మకపాలన అధ్యయనారంగంలో అనేక దేశాల యదార్థ పరిస్థితుల ఆధారంగా, విస్తృతమైన, సార్వజనీన ఉపయుక్తత కలిగిన పరికల్పనలు, ఊహనలు, సూత్రాల రూపకల్పనపై దృష్టి కేంద్రీకరించబడింది. తులనాత్మక అధ్యయనాలు, పరిశోధనలలో సూత్రీకరణ దృక్పథానికి అనుగుణంగా వివిధ దేశాలలో పాలనా దృగ్గోచరానికి సంబంధించిన అనేక చలాంశాలు, వాటిమధ్య సంబంధాలపై ప్రాధాన్యత వక్కాణించబడింది. అనేక తులనాత్మక పాలన అధ్యయనాలలో పాలనా నిర్మాణాలు, చర్యలు, వాటి మధ్య సంబంధాలపై అనేక పరికల్పనలు, సాధారణీకరణలను రూపొందించారు. రిగ్స్, కార్లడాయిచ్, డెనియల్ లెర్నర్ రచనలు సార్వజనీన సూత్రీకరణల అధ్యయనాలకు ఉదాహరణలు.

## 1.8.3 ఆవరణేతర దృక్పథం నుంచి ఆవరణ దృక్పథానికి మార్పు

తులనాత్మక పాలన అధ్యయనంతో ప్రభుత్వపాలన శాస్త్రంలో ఆవరణ దృక్పథం అవతరించింది. తులనాత్మక పాలనకు ఆవరణ దృక్పథం ప్రధాన ఆధారం అయింది. ప్రభుత్వపాలనలో ఆవరణ

BRAOU

దృక్పథాన్ని ప్రప్రథమంగా ఉపయోగించిన రచయిత జాన్.ఏమ్.గాస్ . అతని తరువాత రచయితలు ఆవరణ దృక్పథం పట్ల ఏలాంటి ఆసక్తిని ప్రదర్శించలేదు. అయితే ప్రపంచంలోని విభిన్నదేశాలు, ప్రధానంగా పరివర్తన దశలో ఉన్న దేశాల పాలనా వ్యవస్థల అవగాహన ఆవరణ దృక్పథం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది .ఎందువలనంటే, ఈ దేశాల పాలనా ప్రవర్తనను జాతి, మతం, కుటుంబం, కులం మొదలైన సామాజిక పరిస్థితులు ప్రగాఢంగా ప్రభావితం చేస్తాయి. అందుచేత తులనాత్మక పాలనలో ప్రాధాన్యతను ఆవరణేతర దృక్పథం నుంచి ఆవరణ దృక్పథానికి మార్పునంతవరకు ఆ అధ్యయనం ప్రాధాన్యత పరిమితంగానే ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తించిన ఫ్రెడ్ రిగ్స్ తులనాత్మక పాలన అధ్యయనంలో ఆవరణదృక్పథాన్ని ప్రవేశ పెట్టడమే గాక దానిని పూర్తిగా అభివృద్ధి పర్చాడు. రిగ్స్ ప్రభావంతో అనేక మంది తులనాత్మక పాలన రచయితలు ఆవరణ దృక్పథంపై అమితమైన ఆసక్తిని ప్రదర్శించారు. ఈ విధంగా రిగ్స్ తులనాత్మకపాలన అధ్యయనంలో ఆవరణ దృక్పథానికి విశిష్టమైన స్థానాన్ని కల్పించాడు.

## 1.9 తులనాత్మక పాలన దృక్పథంలో దోషాలు

తులనాత్మకపాలన దృక్పథంలో అనేక దోషాలున్నప్పటికీ రచయితలు రెండు దోషాలను నొక్కి చెప్పారు. అవి : సైద్ధాంతిక అస్పష్టత, ప్రగతి సిద్ధాంతం బలహీనత. తులనాత్మక పాలనలోని సైద్ధాంతిక అస్పష్టతను వక్కాణిస్తూ ఫెరల్ హెడీ తులనాత్మకపాలన అధ్యయనం నమూనా రహితంగా ప్రారంభమై నమూనా రహితంగానే అంతమైందని విమర్శించాడు. తులనాత్మకపాలన పరిధిలో బహుళ సంఖ్యలో అంశాలు చేరడమేకాక, విభిన్న పరిశోధనా పద్ధతులు అనుసరించబడినాయి. ఈ వైవిధ్యం తులనాత్మక పాలనను సమస్యాత్మకంగా రూపొందటమేకాక, ఆచరణాత్మక పరిశోధనను పరిమితం చేసింది. అంతేకాక తులనాత్మక పాలన రచయితలు సమాచార సేకరణ, విశ్లేషణకు అవసరమైన ఉమ్మడి భావనా చట్రాన్ని ( Common Conceptual Framework ) రూపొందించటంలో సఫలీకృతులు కాలేదు.

తులనాత్మకపాలన అధ్యయనంలో ప్రతిపాదించిన సిద్ధాంతాలను పరిశీలిస్తే అవి వివిధ దేశాలలోని పరిస్థితులను, వాస్తవాలను వివరించలేని అమూర్తకస్థాయిలో ఉన్నట్లు గుర్తించవచ్చును. తులనాత్మకపాలన ఉద్యమం అవతరణకు ప్రేరణనిచ్చిన అభివృద్ధిచెందుతున్న దేశాల సమస్యలు, సవాళ్ళను వివరించగలిగిన నమూనాలు, భావనలు, సిద్ధాంతాలు తులనాత్మకపాలనలో లేవని పీటర్ సావేజ్ విమర్శించాడు. ఈ అంశంలో ప్రభుత్వపాలన శాస్త్రంలో గోచరించే సైద్ధాంతిక అస్పష్టత, గందరగోళాన్ని తులనాత్మకపాలనలో కూడా గుర్తించవచ్చని సావేజ్ పేర్కొన్నాడు.

సిద్ధాంత పరమైన అస్పష్టత, సందిగ్ధత దోషంతోపాటు తులనాత్మకపాలన ప్రగతిభావన బలహీనతకు సంబంధించిన మరో దోషానికి గురైంది. తులనాత్మకపాలనలో ప్రగతి అతితరచుగా ప్రత్యక్షమయ్యే భావన. ప్రగతిపాలన దాదాపు తులనాత్మకపాలనకు సమాంతర భావనగా రూపొందింది. తులనాత్మకపాలనలో తలెత్తిన ఈ ధోరణి అనేకమంది రచయితల విమర్శకు గురైంది. గెర్త్ జోన్స్ (Gerth Jones) తులనాత్మకపాలనతో ప్రగతిపాలన విడదీయలేనంతంగా పెనవేసుకుందని విమర్శించాడు. తులనాత్మక పాలన పరిశోధనకు నిధులు విరివిగా లభ్యం అవటం వల్ల కూడా ఈ అధ్యయనాంశానికి కొంత ప్రాధాన్యత సంతరించిందని మరి కొందరు విమర్శించారు.

ఈ రెండు విమర్శలతోపాటు తులనాత్మకపాలనపై అతితరచుగా వినిపించే విమర్శ మరోకటి ఉంది. తులనాత్మకపాలనకు తగినంత చరిత్ర ఉన్నప్పటికీ అది అందరూ ఆమోదించిన అంశాలు కలిగిన అధ్యయనా రంగంలో ఇంకా స్థిరపడవలసి ఉంది. మొదటినుంచి ఈ అధ్యయనరంగం గుర్తింపు సంక్షోభాన్ని ఎదుర్కొందని విమర్శకులు పేర్కొన్నారు. 1969 లో తులనాత్మక పాలన గుర్తింపు సంక్షోభాన్ని గురించి వివరిస్తూ కీత్ అండర్సన్ ( Keith Handerson) ఈ అధ్యయన రంగం పరిధిలో చేరని అంశమంటూ లేదని ఉద్ఘాటించాడు.

BRAOU

తులనాత్మకపాలనలో కొన్ని ప్రధాన ఇతివృత్తాలు ఉన్నప్పటికీ వాటిలో అతి ప్రధానమైనది (Thrust)ఏదో, ప్రభుత్వపాలనకు సంబంధించిన అంశాలేవో స్పష్టంగా గుర్తించటం సులభంకాదని వాదించాడు. ఇదే ధోరణిలో జెరిసాట్ ( Jercisat )తులనాత్మకపాలన అధ్యయనంలో సమీకృతభావనలు, తులనాత్మకపాలన పరిశోధనల్లో కేంద్రబిందువు లేకపోవడం తులనాత్మకపాలన సాహిత్యంలోని ప్రధాన లోపమని విమర్శించాడు, జోన్స్ తులనాత్మక పాలన ఉద్యమం విస్తృత స్థాయికి ఎదగలేక పోయిందని వ్యాఖ్యానించాడు.

## 1.1. తులనాత్మకపాలన ప్రాధాన్యత

1960 దశాబ్దంలో తులనాత్మకపాలన బృందం సృష్టించిన నూతన దృక్పథం ప్రభుత్వపాలనా శాస్త్రంపై విపరీతమైన ప్రభావాన్ని ప్రసరించింది. ఎందరో పాలనారచయితల ఆదరణను పొందిన ఈ అధ్యయనారంగం ప్రభుత్వపాలనా శాస్త్రంలో విడదీయలేని అంతర్భాగమైంది. ఈ దృక్పథం ప్రభుత్వపాలనా శాస్త్రం మౌళికస్వభావాన్ని, స్వరూపాన్ని, మార్చివేసింది. తులనాత్మకపాలన అవతరణ ప్రభుత్వపాలనా శాస్త్రం అధ్యయనంలో ఒక విప్లవాత్మకమైన పరిణామం, గొప్పమలుపు అనడం సహేతుకం. సైద్ధాంతిక, ఆచరణాత్మక రంగాలలో ప్రభుత్వ పాలనా శాస్త్రానికి తులనాత్మకపాలన చేసిన సేవ అద్వితీయం, అమోఘం రిగ్స్ మొదలైన తులనాత్మకపాలన రచయితలు రూపకల్పన చేసిన అసాధారణ సిద్ధాంతాల వల్ల ప్రభుత్వ పాలన శాస్త్ర సైద్ధాంతిక పునాదులు గణనీయంగా బలపడ్డాయి. కాగా తులనాత్మక పాలన పరిశోధకులు అధ్యయనావేత్తలు అమెరికాపాలన నైపుణ్యాన్ని, అనుభవాలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించారు. తులనాత్మకపాలన చేసిన సేవల కారణంగా ప్రభుత్వపాలనను ఒక ఇంద్రజాలం ( Magic )గా, పాలనా నిపుణులను, మేధావులను ఇంద్రజాలికులు ( Magicians )గా పరిగణించటం జరిగింది.

తులనాత్మకపాలన వల్ల ప్రభుత్వపాలన శాస్త్రం దిఙ్మండలం ( Horizons ) విస్తృతమైంది. ఈ అధ్యయనం వల్ల ప్రభుత్వపాలన అధ్యయనానికి శాస్త్రీయ స్వభావం పెంపొందింది. ఈ అధ్యయనాంశం వల్ల ప్రభుత్వపాలనా శాస్త్రం అంతర్ శాస్త్ర దృక్పథాన్ని పెంపొందించుకొని దృఢమైన విజ్ఞానశాస్త్రంగా పరిణతి చెందింది. తులనాత్మకపాలన అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థకు సంబంధించిన, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పరిసరాలతో దానికి గల సంబంధాలలోని అనేక నిగూఢ విషయాలను వెలుగులోకి తెచ్చింది. తులనాత్మక పాలన ప్రభావం వల్ల ప్రభుత్వపాలనా రచయితలలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనావ్యవస్థల పట్ల ఏర్పడిన ఆసక్తి ప్రభుత్వపాలనా శాస్త్రాన్ని అమెరికా సాంస్కృతిక బంధాలనుంచి విముక్తి చేసింది. అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనాన్ని ఆవరించిన స్వజాతీ అనుభవాధార దృక్పథాల సంకెళ్ళనుంచి చాలా వరకు విముక్తి చేసింది. ఈ విధంగా తులనాత్మక పాలన ప్రభుత్వ పాలనా శాస్త్రానికి సార్వజనీనతను పెంపొందించి ఆ అధ్యయనానికి విశ్వసందర్భా ( Global Context ) న్ని సమకూర్చింది.

## 1.11 ముగింపు

1960వ దశాబ్దంలో తులనాత్మకపాలన బృందం సృష్టించిన తులనాత్మకపాలనా దృక్పథం అభివృద్ధి చెంది ప్రభుత్వపాలనా శాస్త్రంలో ఒక ఉప అధ్యయనాంశమైంది. తులనాత్మకపాలన సేవలవల్ల ప్రభుత్వ పాలనా శాస్త్రం సిద్ధాంతపరంగా పటిష్టమవటమేగాకా శాస్త్రీయ, అంతర్ శాస్త్ర దృక్పథాలను సంతరించుకొంది. తులనాత్మకపాలన రచయితలు వివిధ అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలు, వాటి పరిసరాల మధ్య సంబంధాలపై తమ దృష్టిని కేంద్రీకరించి అనేక పరిశోధనలు, అధ్యయనాలు సాగించి విపరీతమైన పరిమాణంలో సాహిత్యాన్ని వెలువరించారు. ప్రధానంగా ప్రసిద్ధ తులనాత్మక పాలనారచయిత ఫ్రెడ్ రిగ్స్ ప్రతిపాదించిన అసాధారణ సిద్ధాంతాలవల్ల ప్రభుత్వపాలన శాస్త్ర అధ్యయన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం

BRAOU

ప్రారంభమైంది. కానీ ఒక అధ్యయన, పరిశోధనాంశంగా, తులనాత్మకపాలన ఒక దశాబ్దకాలంలోనే తన ప్రాధాన్యతను కోల్పోయింది. స్వీయ లోపాలు, పరిమితులవల్ల మేధోపర రంగంనుంచి దాదాపు కనుమరుగైంది. అయితే 1980 దశాబ్దంలో ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఒక ఉప అధ్యయనారంగంగా తులనాత్మకపాలన పూర్వవైభవం పునరుద్ధరణకు రిగ్స్, ఫెరల్ హెడీ, పీటర్ సావెజ్, గెరాల్డ్ కైడన్, తుమ్మల కృష్ణకుమార్ మొదలైన అమెరికా పాలన తత్వవేత్తలు కృషి సల్పటం ప్రారంభమైంది. వేగంగా మారుతున్న పరిస్థితులు విసురుతున్న సవాళ్ళను ఎదుర్కొనటంలో నిమగ్నమైన అభివృద్ధి చెందుతున్నదేశాల పాలనా వ్యవస్థల అవగాహనకు తులనాత్మక అధ్యయనా పద్ధతి ఏకైక సాధనం. ఒక విధంగా, ప్రస్తుతం గుర్తింపు సంక్షోభాన్ని ఎదర్కొంటున్న ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనం భవిషత్తు తులనాత్మకపాలన భవిష్యత్తుతో ముడిపడి ఉందనే చెప్పాలి.

## 1.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి:

1. తులనాత్మక పాలన దృక్పథం అవిర్భావానికి తోడ్పడిన పరిస్థితులను వివరింపుము?
2. తులనాత్మక పాలన అర్థాన్ని వివరించి దాని లక్షణాలను పేర్కొనుము?
3. తులనాత్మక పాలన అధ్యయనంలో గోచరించే పోకడలను వివరింపుము?
4. తులనాత్మక పాలన దృక్పథం ప్రాముఖ్యతను పరిశీలింపుము

II ఈ క్రింది ప్రశ్నలకు15 పంక్తులలో సమాధానం రాయండి :

1. తొలిపాలనా సిద్ధాంతంలోని తులనాత్మక అంశాలను విరింపుము?
2. తులనాత్మక పాలన దృక్పథం ఆధారాలను తెలుపుము?
3. తులనాత్మక పాలన అధ్యయనలోని విభిన్న నమూనాలను పరిశీలింపుము?

BRAOU

## 1.13 చదువదగిన రచనలు


1. Ramesh K. Arora, Comparative Public Administration : An Eological Perspective), New Delhi, Associated Publishing House, 1988.
2. Ferrel Heady, Public Administration : A Comparative Perspective (Third Revised Edition), New York, Marcel Dekku, 1984.
3. Ferrel Heady and Sybel Stokes, Papers in Comparative Public Administration, Ann Arbor, Michigan, Institute of Public Administration, University of Michigon, 1966.
4. William J. Siffin, Toward the Comparative Public Administration, Bloomington, Indiana University Press, 1957.
5. Nimrod Raphaeli (ed.), Readings in Comparative Public Administration, Boston, Allyn and Baen, 1967.
6. Fred W. Riggs (ed.), Frontiers of Development Administration, Dursham, Duke University Press, 1970.
7. T.N. Chaturvedi (Series Editor ) S.P. Verma, S.K. Sharma ( Eds ), Comparative Public Administration, New Delhi, Indian Institute of Public Administration, 1985.
8. Public Aministration Review ( PAR ), Vo. 36, No.6, November - December 1976.


రచయిత : యం. బాపూజీ

Dr. BRAOU LIBRARY
115069
350
PRA

# భాగం–2 : తులనాత్మక ప్రభుత్వ పాలనా దృక్పథాలు : సంస్థాగత, ఉద్యోగిస్వామ్య, వ్యవస్థల దృక్పథాలు

విషయక్రమం


2.0 లక్ష్యాలు

2.1 పరిచయం

2.2 ఉద్యోగిస్వామ్య దృక్పథం

- 2.2.1 వెబర్ ఆధిక్యత భావన
- 2.2.2 అధికార ఆధారిత ఆధిక్యత
- 2.2.3 ఉద్యోగి స్వామ్యం
- 2.2.4 ఉద్యోగి స్వామ్య లక్షణాలు
- 2.2.5 ఉద్యోగి స్వామ్య నమూనాపై విమర్శలు,
- 2.2.6 తులనాత్మక పాలనా సాహిత్యంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థా నామూనా

2.3 వ్యవస్థా దృక్పథం

- 2.3.1 డేవిడ్ ఈస్టన్ వ్యవస్థా దృక్పథం
- 2.3.2 గ్రాబియల్ ఆల్మండ్
- 2.3.3 తులనాత్మక పాలన అధ్యయనంలో వ్యవస్థా దృక్పథం
- 2.3.4 వ్యవస్థా దృక్పథం విశిష్టత

2.4 సంస్థాగత దృక్పథం

- 2.4.1 రాజనీతి శాస్త్రంలో సంస్థాగత దృక్పథం
- 2.4.2 ప్రభుత్వ పాలనా శాస్త్రంలో సంస్థాగత దృక్పథం
- 2.4.3 తులనాత్మక పాలన, ప్రగతి పాలన అధ్యయనంలో సంస్థాగత దృక్పథం
- 2.4.4 సంస్థా నిర్మాణ భావన
- 2.4.5 సంస్థాగత దృక్పథం విశిష్టత

2.5 ముగింపు

2.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

2.7 చదువదగిన రచనలు


## 2.0 లక్ష్యాలు

తులనాత్మక పాలన అధ్యయనంలోని వివిధ దృక్పథాలను విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ భాగం ముఖ్య ఉద్దేశం. ఇది చదివితే కింది అంశాలు వివరించగలుగుతారు.

- ఉద్యోగిస్వామ్య దృక్పథం, అందులోని ప్రధానాంశాలు,
- వ్యవస్థా దృక్పథం – వివిధ రచయితల అభిప్రాయాలు,
- సంస్థాగత దృక్పథం – వివిధ అధ్యయనాంశాల నేపథ్యంలో

BRAOU

## 2.1 పరిచయం

మొదటినుంచి తులనాత్మక పాలన అధ్యయనంలో వివిధ సంస్కృతులకు, కాలాలకు చెందిన పాలన దృగ్గోచరం తులనాత్మక విశ్లేషణకు ఒక సాధారణ సిద్ధాంతాన్ని రూపొందించే ప్రయత్నం జరిగింది. ఈ లక్ష్యంలో తులనాత్మక పాలనా రచయితలు తులనాత్మక పాలనా అధ్యయనానికి అనేక దృక్పథాలను, నమూనాలను ప్రతి పాదించారు. కొందరు రచయితలు తులనాత్మక పాలన అధ్యయనంలో ప్రతిపాదించిన దృక్పథాలను విశ్లేషించి వాటి స్వభావాన్ని నిర్ధారించేందుకు ప్రయత్నించారు. ఈ రచయితలలో రిగ్స్‌ను ప్రధాన రచయితగా పేర్కొనవచ్చును. రిగ్స్ తులనాత్మక పాలనా అధ్యయనం లోని సాహిత్యంలో మూడు ధోరణులను గుర్తించాడు. అవి : 1.ప్రమాణాత్మక దృక్పథం నుంచి ఆచరణాత్మక దృక్పథానికి మారు, 2. ఏకాత్మక దృక్పథాలనుంచి సూత్రీకరణ దృక్పథాలకు మార్పు, 3. ఆవరణేతర దృక్పథాలనుంచి ఆవరణ దృక్పథాలకు మార్పు.

తులనాత్మక పాలన అధ్యయనంలోని దృక్పథాలను విశ్లేషించి, వర్గీకరించిన రచయితలలో రిగ్స్ తరువాత ఫెరల్ హెడీ, కెత్ హెండర్‌సన్‌లు ప్రముఖులు.

హెడీ తులనాత్మక పాలన అధ్యయనంలోని దృక్పథాలను ప్రాధాన్యతల ఆధారంగా నాలుగు తరగతులుగా వర్గీకరించాడు. అవి : 1.సవరించిన సాంప్రదాయ దృక్పథాలు, 2. అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చే దృక్పథాలు, 3. సాధారణ వ్యవస్థా నమూనాలు, 4. మధ్యస్థాయి దృక్పథాలు హెండర్సన్ తులనాత్మక పాలనలోని దృక్పథాలను 3 తరగతులుగా వర్గీకరించాడు. 1) ఉద్యోగి స్వామ్య వ్యవస్థ దృక్పథం, 2) ఉత్పత్తి - ఉత్పాదనా వ్యవస్థా దృక్పథం, 3) కాంటిన్‌జెన్సీ దృక్పథం ( Contingency Approach ) హెడీ, హెండర్‌సన్‌ల వర్గీకరణలో కొంత వ్యత్యాసం ఉన్నప్పటికీ అవి పరస్పర పూరకాలు. ఈ విధంగా తులనాత్మక పాలన రచయితలు తులనాత్మక పాలన అధ్యయనంలో అనేక దృక్పథాలను గుర్తించారు. ఈ దృక్పథాలు తులనాత్మక పాలన అధ్యయనంలో సిద్ధాంతీకరణ అభివృద్ధికి దోహదం చేయటమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాల ఆచరణాత్మక అవగాహనకు కూడా ఉపకరించాయి.

BRAOU

## 2.2 ఉద్యోగి స్వామ్య దృక్పథం

తులనాత్మక పాలనా రచయితలు మాక్స్ వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనా ప్రాతి పదికగా విభిన్న సంస్కృతులకు చెందిన ఉద్యోగిబృంద వ్యవస్థలను, వాటికీ సామాజిక, రాజకీయ చలంకాల మధ్యగల పరస్పర సంబంధాలను విశ్లేషించారు. తులనాత్మక పాలన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల వాస్తవ పాలన దృగ్గోచరాన్ని అధ్యయనం చేసేందుకు ఉద్యోగి స్వామ్య వ్యవస్థ నమూనాను ఒక ప్రధాన భావనా సాధనంగా ఎంచుకున్నారు. ఫెరల్‌హెడీ తులనాత్మక పాలన అధ్యయనాల్లో ఉద్యోగిస్వామ్య వ్యవస్థానమూనాను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరిస్తూ ఉద్యోగిబృంద వ్యవస్థపై పరిశోధన సులువైనదీ, భవిష్యత్తులో సమగ్రమైన నిర్దిష్టమైన తులనాత్మక పరిశోధనకు తోడ్పడగలదని పేర్కొన్నాడు. డ్వైట్ వాల్డో తులనాత్మక పాలన పరిశోధనకు ఉద్యోగి స్వామ్య నమూనా ప్రయోజనకరమైనది, ఉద్దీపన కలుగజేసేదిగా భావించాడు. రమేష్. కె. అరోరా తులనాత్మక పాలన అధ్యయనంలో ఉద్యోగి స్వామ్య నమూనా అత్యంత ప్రధానమైన ఏకైక భావన చట్రమని పేర్కొన్నాడు. సింగిల్‌మన్ తులనాత్మక పాలన భవిష్యత్తు ఉద్యోగిస్వామ్య వ్యవస్థ నమూనా అధ్యయనం పైన ఆధారపడి వుందని వక్కాణించాడు. జాన్‌ఏస్ జంగ్ ఉద్యోగి స్వామ్య నమూనా వివిధ సమాజాలలోని భిన్నత్వాలను వివరించగలిగినంత సమగ్రమైంది, తులనాత్మక పాలన అధ్యయనంలో అత్యంత ప్రయోజనకరమైన నమూనా అని సూచించాడు.

ఈ విధంగా తులనాత్మక పాలన విశ్లేషణలో ఉద్యోగి స్వామ్య నమూనా విశ్వసనీయమైన, ప్రయోజన కరమైన భావనా చట్రం. తులనాత్మక పాలనా రచయితలు అనేక విశిష్టతలు గల ఉద్యోగి స్వామ్య నమూనా ఆధారంగా విభిన్న సంస్కృతులకు చెందిన పాలన వ్యవస్థలను అధ్యయనం చేసి విస్తృతమైన పరిమాణంలో సాహిత్యాన్ని వెలువరించారు. రిగ్స్ తులనాత్మక పాలన సాహిత్యంలో ఉద్యోగి స్వామ్య నమూనాలపై రెండు రకాల అధ్యయనాలను గుర్తించాడు. వీటిలో వెబర్ పేర్కొన్న ఉద్యోగి స్వామ్య వ్యవస్థ లక్షణాలను వాస్తవ పాలనా వ్యవస్థలలో గుర్తించేందుకు చేపట్టిన అధ్యయనాలు ఒక రకం కాగా వెబర్ నమూనాను సవరించే మార్పు చేసే భావనా చట్రంను రూపొందించేందుకు చేపట్టిన అధ్యయనాలు రెండవరకం. మొత్తం మీద తులనాత్మక పాలన పరిధిలో నిర్వహించిన అధ్యయనాలలో ఉద్యోగిబృంద వ్యవస్థను, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిసరాలతో దాని సంబంధాలను విశ్లేషించే అధ్యయనాలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి.

తులనాత్మక పాలనలో ఉద్యోగి బృంద వ్యవస్థపై గల అధ్యయనాలు వైవిధ్య పూరితమైనప్పటికీ అవి అభివృద్ధి చెందతున్న దేశాలలోని పాలనా దృగ్గోచరం సమగ్ర అవగాహనకు, వివరణకు ఉపయోగించాడు. అయితే అధ్యయనాలను నిగూఢంగా పరిశీలిస్తే వాటిలో కొన్ని జ్ఞాన సంబంధమైన పరిమితులను గుర్తించవచ్చును. ఈ అధ్యయనాలలో రూపకల్పన చేసిన వర్గీకరణలు ఉద్యోగిబృంద వ్యవస్థల సమగ్ర, నిగూఢ అవగాహనకు ఉపకరించవు. ఫైన్ సాడ్ విమర్శించినట్లు తులనాత్మక పాలనలో ఉద్యోగి స్వామ్యంపై గల అధ్యయనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా పరిసరాలతో సంభవిస్తున్న మార్పు ప్రక్రియదాని ఫలితాలను, అభివృద్ధి ప్రక్రియ దిశను, పోకడల గురించి వివరించేది స్వల్పం.

## 2.2.1 వెబర్ ఆధిక్యతాభావన ( Weber's Concept of Domination )

వెబర్ ప్రతిపాదించిన ఉద్యోగి స్వామ్య నమూనా అతని ఆధిక్యత భావన ప్రధాన ఆధారం. వెబర్ సామాజిక దృగ్గోచరం విశ్లేషణలో హేతుబద్దీకరణ ప్రక్రియ ఒక కీలకాంశం. వెబర్ హేతుబద్ధ సమాజాల అవతరణ ప్రధానంగా అవి ఆధిక్యతను వినియోగించే పద్ధతిపై ఆధారపడి ఉందని సూచించాడు. వెబర్ అభిప్రాయం ప్రకారం ఆధిక్యత ఒక శక్తి (Power) రూపం. వెబర్ శక్తిని ప్రతిఘటన ఎదురవుతున్నప్పటికీ ఒక వ్యక్తి తన ఇచ్ఛను ( will ) ఇతరలపై విధించే సంభావ్యత ( Probability ) అని నిర్వచించాడు. కాగా ఊహాత్మక చట్ట బద్దత కలిగిన ఆధిక్యత పాలకునికి శక్తిని వినియోగించే చట్టబద్ధమైన హక్కు వుందనీ, దానిని శిరసావహించడం పాలితుల విధి అని విశ్వసించే భావన. అంటే పాలకులు, పాలితుల మధ్య ఉండే శక్తి సంబంధాలే ఆధిక్యత అని అర్థం. వెబర్ ఆధిక్యతలో రెండు రకాలను గుర్తించాడు. ఒకటి, మత, ఆర్థిక సంస్థలలో గోచరించే ప్రాపంచిక ప్రయోజనా (Constellation) పై ఆధారపడిన ఆధిక్యత. రెండు, ఆధునిక సమాజాలలో గోచరించే అధికారం ( Authority ) పై ఆధార పడిన ఆధిక్యత. ఈ రెండవ రకం ఆధిక్యత ప్రాతిపదికగా వెబర్ తన ఉద్యోగి స్వామ్య నమూనాను ప్రతిపాదించాడు.

## 2.2.2 అధికార ఆధారిత ఆధిక్యత

అధికారంపై ఆధారపడిన ఆధిక్యత అనుభవపూర్వక చట్టబద్ధతపై ఆధారపడినట్లు వెబర్ పేర్కొన్నాడు. ఈ ఆధిక్యత చట్ట బద్దతకు భిన్నమైన ఆధారాలు వున్నాయి. వెబర్ అధికారము మీద ఆధారపడిన ఆధిక్యత చట్టబద్ధతకు ప్రధానంగా మూడు ఆధారాలను గుర్తించాడు. అవి : 1. సమ్మోహన అధికారం, 2. సాంప్రదాయ అధికారం, 3. చట్టబద్ధ, హేతుబద్ధ అధికారం.

BRAOU

1. సమ్మోహన అధికారం (Charismatic Authority) : సమ్మోహన అధికారం చట్టబద్ధత నాయకుని వ్యక్తిగత గుణగణాలనుంచి ఉత్పన్నమవుతుంది. వెబర్ సమ్మోహన శక్తిని, మానవాతీత, అసాధారణ, ప్రకృతి బాహ్యశక్తులు (లేదా) గుణాలను కలిగి ఉండడం చేత సాధారణ వ్యక్తులకు పూర్తిగా భిన్నమైన మూర్తిమత్వ లక్షణం అని నిర్వచించాడు. దీనికి అనుగుణంగా సమ్మోహన అధికారం అంటే ప్రజలు తమను పాలించే నాయకుడు మాంత్రిక శక్తులను, లక్షణాలను (లేదా) దివ్యత్వాన్ని కలిగి ఉన్నాడనే విశ్వాసం చేత అతనికి విధేయత కనబర్చే పాలనా విధానం. సమ్మోహన అధికారం స్వల్ప కాలము మాత్రమే మనుగడను సాగించగలిగిన అధికార విధానం సమ్మోహన అధికారానికి విప్లవాత్మకమైన మార్పులను ప్రవేశ పెట్టగలిగిన సామర్థ్యం ఉన్నప్పటికీ అవి మేధోపరమైన విశ్లేషణకు వీలుకాని నియమాలకు కట్టుబడి ఉండటం చేత హేతుబద్ధమైనది కాదు.

సమ్మోహన అధికార వ్యవస్థలో నాయకుడు కేవలం తన సొంత నిర్ణయానికి మాత్రమే కట్టుబడి వుండటమే కాక లాంచన ప్రాయమైన తీర్పులకు బద్దుడుకాదు. ఈ విధానంలో ప్రజల మధ్య సంభవించే వివాదాలకు మేధోపరమైన (లేదా) శాస్త్రీయమైన తీర్పులు చెప్పబడతాయి. ఈ అధికార విధానంలో పాలకుడు, పాలితుల మధ్య సంబంధాలు అస్థిరమైనవి. నాయకుని అధికారము అనుచరుల ఇచ్ఛనుంచి ఉత్పన్నమైనప్పటికీ, సమ్మోహన నాయకుడు విజయాన్ని సాధించడం ద్వారా తన గొప్పతనాని నిరంతరం ఋజువు పర్చుకోవాలి. సమ్మోహన శక్తిగల నాయకుడు కేవలం తన అంతర్గత నిర్ణయాలకు, నిర్భంధాలకు మాత్రమే బద్దుడు.

సమ్మోహన అధికార వ్యవస్థలో ప్రభుత్వపాలన అస్థిరమైనది, అస్తవ్యస్తమైనది. నాయకుని అనుచరులు మాత్రమే పాలన యంత్రాంగంలో అన్ని పదవులను ఆక్రమించడం జరుగుతుంది. వారు విత్తపరమైన ప్రతిఫలాన్ని సంపాదించటం పట్ల విముఖతని ప్రదర్శిస్తారు, అవివేకమైన చర్యగా భావిస్తారు. ఈ అధికార వ్యవస్థలోని పాలనా సంస్థలు సమ్మోహన గుణగణాల ప్రాతిపదిక మీద ఎంపిక చేయబడ్డ కులీన తరగతికి చెందిన అధికారులను కల్గి వుంటుంది. ఈ వ్యవస్థలో నియామకం, పదోన్నతి, తొలగింపు మొదలైన ఉద్యోగి బృంద అంశాలతో ఎటువంటి నియమాలు పాటించబడవు. అంతేకాక విధులు క్రమానుగత శ్రేణికి అనుగుణంగా కేటాయించబడవు. నాయకుడు ఏ విధి నిర్వాహణలోనైనా జోక్యం కల్పించుకోవచ్చును. ఈ వ్యవస్థలో స్పష్టంగా నిర్వచించబడిన అధికారం కేంద్రాలుండవు. అందుచేత అధికార దుర్వినియోగాన్ని నివారించే రక్షణ యంత్రాంగం వుండదు. చివరిగా ఈ వ్యవస్థలో అందరికీ సమానంగా వర్తించే లాంఛన ప్రాయమైన నియమాలు వుండవు.

BRAOU

2. సాంప్రదాయ అధికారం ( Traditional Authority ) : సమ్మోహన అధికారం వల్లే సాంప్రదాయ అధికారం వ్యక్తిగత పాలనపై ఆధారపడింది. అయితే సమ్మోహన అధికారం వల్లే ఈ అధికారం సంక్షోభం నుంచి, అత్యున్నత ఉత్సాహం నుంచి ఉత్పన్నం కాదు. పాలకులు వ్యక్తిగత అధికారాన్ని కల్గివుంటారు. వారి అనుచరులు ఎటువంటి స్వేచ్ఛ లేని వ్యక్తులు మాత్రమే. సాంప్రదాయ అధికారం గత సాంప్రదాయ బద్ధమైన (లేదా) ఆచారబద్ధమైన పద్ధతుల క్రమబద్ధత పట్లగల గౌరవం మీద ఆధారపడింది.

సాంప్రదాయ అధికార వ్యవస్థలో పాలనహేతుబద్ధ రాహిత్యం అయిందని వెబర్ వాదించాడు. ఎందువలన అంటే ఈ వ్యవస్థలో హేతుబద్ధమైన, సముచితమైన నిబంధనల అభివృద్ధి నిరోధించబడుతుంది.

ఈ వ్యవస్థలో లాంచన ప్రాయమైన, సాంకేతిక పరమైన శిక్షణ పొందిన ఉద్యోగులు ఉండరు. అంతేకాక నాయకుని వ్యక్తిగత ప్రయోజనాలను సంతృప్తి పరచడం పట్ల అధిక ఆశక్తి వుంటుంది. నాయకుడు లాంచన ప్రాయంగా నిర్ధారించిన విధులను, సేవలను నిర్వర్తించటం తన వ్యక్తిగత హక్కుగా భావించటం వలన ఈ వ్యవస్థలో పాలన ఆజ్ఞల పట్లకాక వ్యక్తుల పట్ల విధేయత కనబర్చబడుతుంది. సాంప్రదాయ అధికార వ్యవస్థలో నాయకుని అక్రమ నిర్ణయాల ఫలితంగా రూపొందిన విధులు, అధికారాలు, తరచు మారుతున్న ఇష్టలైన వ్యక్తులతో కూడిన పాలన కొనసాగుతుంది. ఈ వ్యవస్థ వ్యక్తిగత బలహీనతలు, విచక్షణల సమ్మేళనం. ఈ వ్యవస్థలో ఉల్లంఘించకూడని సాంప్రదాయ ప్రమాణాలుంటాయి. దీనితోపాటు అక్రమ న్యాయ నిర్ణయం పాలకునిపై ఆధారపడటం వంటి లక్షణాలు వుంటాయి. ఈ వ్యవస్థలో నిర్ణయాలు పాలకులు, పాలితుల మధ్యగల వ్యక్తిగత సంబంధాలపై ఆధారపడతాయి.

**3. న్యాయ – హేతుబద్ధ అధికారం ( Legal - Rational Authority )** : న్యాయబద్ధ, హేతుబద్ధ అధికార వ్యవస్థ చట్టబద్ధహేతువు పైగల విశ్వాసం మీద ఆధారపడి వుంటుంది. సక్రమమైన పద్ధతులద్వారా రూపొందించటం వలన చట్టాలు పాటించబడతాయి. ఈ వ్యవస్థలో అధికారాన్ని చెలాయించే వ్యక్తులు నియమ నిబంధనలు సృష్టించిన విధులనే నిర్వర్తిస్తారని విశ్వసించబడుతుంది.

న్యాయ, హేతుబద్ధ అధికార వ్యవస్థలో పాలనాధికారం చట్టబద్ధతతో, హేతుబద్ధతతో రూపొందింపబడిన నియమాల ( Rules ) పై ఆధారపడి వుంటుంది. అధికారం, కార్యాలయ విధి ( Duty of Office ) పట్ల అవ్యక్తానుగతమైన ( Impersonal ) విధేయత కనబర్చబడుతుంది. అధికార విధి హేతుబద్ధమైన ప్రమాణాల ఆధారంగా నిర్ధారింపబడుతుంది. విధేయత అవ్యక్తానుగత ఆజ్ఞకు తప్ప వ్యక్తికి కనబర్చబడదు. అదే విధంగా ఆదేశాల జారీకూడా వ్యవస్థ నియమాలను అనుగుణంగా చేయబడిన చర్యయే తప్ప ఆ ఆదేశాలను జారీ చేయబడిన వ్యక్తి అక్రమ చర్యకాదు. ఈ విధంగా ఈ వ్యవస్థలో అధికారులు తమ అధికారాలను తమ వ్యక్తిగత హోదాలో చెలాయించకపోగా, అవ్యక్తమైన, నిర్బంధపూర్వకమైన ట్రస్టీలు (Trustees) గా వ్యవహరిస్తారు. న్యాయ, హేతుబద్ధ అధికార వ్యవస్థలోనే పాలన సిబ్బంది ఉద్యోగి స్వామ్య రూపంలో వుంటుంది.

వెబర్ అభిప్రాయం ప్రకారం సమ్మోహన నాయకత్వ విధానం వారసత్వ ( Succession ) సమస్యను ఎదుర్కొంటుంది. సమ్మోహన నాయకుడు తన సమ్మోహనత్వాన్ని కోల్పోయినప్పుడు వారసత్వం సమస్యను పరిష్కరించేందుకు సమ్మోహన శక్తిని పరిపాటిగా ( Routine ) మార్చే హేతుబద్ధీకరణ (Rationalization) ప్రక్రియ తోడ్పడుతుంది. సమ్మోహన నాయకుని వ్యక్తిగత ఆకర్షణను, అధికారాన్ని, యాంత్రిక పద్ధతులు ( లేదా) దేవుని ఇచ్చ ( devine will ) బలపర్చే నియమాలను తొలగించినప్పుడు సమ్మోహన శక్తి పరిపాటిగా మారటం ప్రారంభమౌతుంది. సమ్మోహన నాయకుని స్థానాన్ని భర్తీ చేసేందుకు అతని వారసుని ఎంపికకు సుస్థిర పద్ధతులు అనుసరించబడతాయి. ఈ ప్రక్రియపై సాంప్రదాయ, హేతుబద్ధ శక్తులు తమ ప్రభావాన్ని కనబరుస్తాయి. అధికారం నాయకుని సమ్మోహన శక్తి నుంచి వైదొలగి సాంస్థీకృత ( Institutional ) రూపాన్ని పొందుతుంది. ఈ ప్రక్రియలో అస్థిరమైన అధికారనిర్మాణం సుస్థిరమైన సాంప్రదాయ (లేదా) న్యాయ హేతుబద్ధ అధికార నిర్మాణంగా రూపాంతరం చెందుతుంది. ఈ విధంగా సమ్మోహన శక్తి పరిపాటిగా మారటం ద్వారా (లేదా) సాంప్రదాయ అధికారం భగ్నం కావటం ద్వారా న్యాయ హేతుబద్ధ అధికారం అభివృద్ధి చెందాక, చట్టబద్ధత ఆధారంగా అధికారంపై సమం చేసే ప్రభావం రూపుదిద్దు కుంటుంది. ఈ విధంగా న్యాయహేతుబద్ధ అధికారం చట్టబద్ధ ప్రజాస్వామ్య లక్షణాలను సంతరించు కుంటుంది.

BRAOU

## 2.2.3 ఉద్యోగి స్వామ్యం

న్యాయ, హేతుబద్ధ అధికార రూపంగా ఉద్యోగిస్వామ్యం పై వెబర్ అత్యంత ప్రతిభావంతమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ప్రభుత్వ పాలనా సిద్ధాంతాన్ని వెబర్ ఉద్యోగి స్వామ్య సిద్ధాంతం ప్రభావితం చేసినంతగా మరే ఇతర సిద్ధాంతం ప్రభావితం చేయలేదనేది వాస్తవం. వెబర్ ఉద్యోగి స్వామ్యం అనే పదాన్ని సృష్టించలేదు. పైగా వెబర్ సమాజంలో ఉద్యోగి స్వామ్యపాత్రను విశ్లేషించిన తొలి రచయిత కూడా కాదు. అయినప్పటికి, వెబర్ ఉద్యోగి స్వామ్య వ్యవస్థ లక్షణాలపై అత్యంతమైన శ్రేష్టమైన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వెబర్ సిద్ధాంతం ఉద్యోగిస్వామ్య దృగ్గోచరంపై అత్యంత నిశితమైన వివాదస్పదమైన సిద్ధాంతంగా పరిగణింపబడింది.

వెబర్ ఉద్యోగి స్వామ్య విశ్లేషణ ఆధునిక రాజ్యంలో న్యాయ, హేతుబద్ధ ఆధిక్యతపై వెబర్‌కు గల ఆశక్తితో ముడిపడి వుంది. వాస్తవానికి ఆధునిక ప్రపంచం హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఉద్యోగి స్వామ్యం కీలకాంశమని, అదిసామాజిక ప్రక్రియలో అత్యంత ప్రధానమైందని వెబర్ పరిగణించాడు. వెబర్ ఆధిక్యత పాలన ద్వారా అభివ్యక్తమవుతుందని, నిర్వహింపబడుతుందని వాదించాడు. వ్యవస్థీకృతమైన ఆధిక్యతను, నిరంతరపాలన, కార్యనిర్వాహక సిబ్బంది, భౌతిక పనిముట్ల నియంత్రణ అవసరం అని వెబర్ సూచించాడు.

వెబర్ వ్యవస్థను సంబంధాల క్రమబద్ధీకరణ అని నిర్వచించాడు. వ్యవస్థలో విధేయత కనబరచడానికి అలవాటు పడ్డ వ్యక్తులు, ఉన్నతాధికారుల ఆధీనంలో ఉన్నపాలన సిబ్బంది, ఆదేశాలను జారీచేసే అధికారాన్ని కలిగివున్న ఉన్నతాధికారులు వుంటారు. నిర్ధారిత నియమాల పట్ల మానవ ప్రవర్తన దృక్పథం, వెబర్ వ్యవస్థీకరణ సిద్ధాంతంలో కీలకాంశం.

న్యాయ, హేతుబద్ధ, సమాజంలో ఉద్యోగి స్వామ్యం అత్యంత ఆధిక్యతగల వ్యవస్థీకరణ రూపం. ఉద్యోగిస్వామ్యం అభివృద్ధి పాలనా విధుల పరిమాణాత్మక పెరుగుదల ఫలితం. ఇంకో మాటలో చెప్పాలంటే, సంక్లిష్టత నుంచి ఉద్యోగి స్వామ్యం అవతరిస్తుంది. వెబర్ ఉద్యోగి స్వామ్యం అనే పదాన్ని నిర్వచించనప్పటికి, ఉద్యోగి స్వామ్యం అంటే ఒక ప్రత్యేకమైన పాలనా సిబ్బంది ద్వారా నియంత్రణను చెలాయించడం అని సూచించాడు. అంతేకాక వెబర్ అత్యంత హేతుబద్ధమైన ఉద్యోగి స్వామ్యం లక్షణాలను వివరించాడు. ఈ ఉద్యోగి స్వామ్యాన్నే వెబర్ " ఆదర్శ నమూనా " అని పిలిచాడు.

BRAOU

## 2.2.4 ఉద్యోగి స్వామ్య లక్షణాలు

వెబర్ గుర్తించిన ఉద్యోగి స్వామ్య లక్షణాలు ఈ క్రిందివి :

1. ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో పాలన నాయకుని ఇష్ట ప్రకారం కాక నిరంతర ప్రాతిపదిక మీద నిర్వహింపబడుతుంది.
2. ఉద్యోగి స్వామ్య వ్యవస్థలో కర్తవ్యాలు ( Tasks ) కార్యపరంగా ( Functionally ) భిన్నత్వం కలవిగా విభజింపబడతాయి.
3. కార్యాలయాలు క్రమానుగత శ్రేణి పద్ధతిలో అమర్చబడాతాయి.
4. ఉద్యోగి స్వామ్య వ్యవస్థ వనరులు, ఆ వ్యవస్థలోని సభ్యుల వ్యక్తిగత వనరులకు భిన్నమైనవి.
5. ఉద్యోగులు కార్యాలయాన్ని తమ స్వంతానికి ఉపయోగించుకోలేరు(అంటే ఉద్యోగులు కార్యాలయాన్ని అమ్మరాదు (లేదా) వారసత్వంగా ఇతరులకు బదిలీ చేయరాదు.
6. పాలనకు లిఖిత పూర్వక పత్రాలు ఆధారము.
7. ఉద్యోగి స్వామ్య వ్యవస్థలో నియంత్రణకు అవ్యక్తానుగతంగా వర్తింపజేసే హేతుబద్ధ నియమాలు

ఆధారం. ఈ విధంగా ఉద్యోగిస్వామ్యం అంటే కేవలం నియమాలు మాత్రమే కాదు, ఆ నియమాల గుణాత్మకత, వాటిని అమలు పరచే విధానం ఉద్యోగి స్వామ్య వ్యవస్థ కీలక లక్షణాలు.

వెబర్ ఉద్యోగి స్వామ్య వ్యవస్థలోని ఉద్యోగుల లక్షణాలను కూడా వివరించాడు. అవి ఈ క్రిందివి.

- ఉద్యోగులు వ్యక్తిగతంగా స్వేచ్ఛను కలిగి వుంటారు. వారు ఒప్పందం ద్వారా నియమింపబడతారు.
- ఉద్యోగులు నియమింపబడతారు, ఎన్నుకోబడరు.
- ఉద్యోగులు వారి వృత్తిపరమైన అర్హతల ప్రాతిపదికగా నియమింపబడతారు.
- ఉద్యోగస్థులకు నిర్ధారింపబడిన నగదు వేతనం, పదవీవిరమణభృతి ( Pention ) చెల్లించబడతాయి.
- ఉద్యోగస్థులకు ప్రభుత్వ ఉద్యోగం ఏకైక (లేదా) ప్రధాన వృత్తి.
- ప్రతిభపై ఆధారపడిన పదోన్నతి గల కెరీర్ వ్యవస్థ వుంటుంది.
- ఉద్యోగస్థులు స్పష్టంగా నిర్వచించబడిన ఏకీకృత నియంత్రణా, క్రమశిక్షణ విధానానికి లోపడి వుంటారు.

పైన వివరించిన లక్షణాలను గలిగిన ఉద్యోగిస్వామ్య యంత్రాంగం కేవలం ఆధునిక రాజ్యాలలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి సంస్థలలో మాత్రమే గోచరిస్తాయని వెబర్ పేర్కొన్నాడు. ఉద్యోగిస్వామ్య ఆదర్శనమూనా అది నిర్వహించే పాలనా చర్యలు హేతుబద్ధ ఆధారాన్ని కలిగియుంటుంది. ఈ నమూనా పాలనా అధికారాలను కేంద్రీకృతం చేస్తుంది. ఈ నమూనా అన్ని ప్రత్యేక సౌకర్యాలను రద్దుచేసి చట్టంముందు అందరూ సమానులే అన్న సూత్రాన్ని అనుసరించడం, ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అందరికి సమాన అవకాశాలను కల్పించటం ద్వారా సమానత్వాన్ని సాధించే నమూనా అని వెబర్ వాదించాడు.

BRAOU

మానవుడు సృష్టించిన వ్యవస్థలలో ఉద్యోగిస్వామ్యం అత్యంత సమర్థవంతమైనదీ, హేతుబద్ధమైనదని మాక్స్‌వెబర్ విశ్వసించాడు. ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో నియంత్రణ పరిజ్ఞానం పై ఆధారపడి వుంది. ఈ వ్యవస్థకు స్పష్టంగా నిర్ధారించిన సమర్థత వుంది. ఈ వ్యవస్థ మేధోపరంగా విశ్లేషించడానికి వీలైన నియమాలకు అనుగుణంగా తన విధులను నిర్వర్తిస్తుంది. అందుచేత ఉద్యోగి స్వామ్య వ్యవస్థ హేతుబద్ధమైనదిగా వెబర్ పరిగణించాడు. ఇదే విధంగా ఉద్యోగిస్వామ్య వ్యవస్థ సమర్థవంతమైనదిగా పరిగణించేందుకు వెబర్ తగిన కారణాలను పేర్కొన్నాడు. ఉద్యోగిసామ్య వ్యవస్థ స్పష్టతను, వేగాన్ని, సంగతత్వాన్ని కల్గివుంది. ఈ వ్యవస్థలో లిఖితపూర్వక రికార్డులు కీలకపాత్ర వహిస్తాయి. ఈ వ్యవస్థలో నిరంతరత, ఐక్యత, కఠినతరమైన సమన్వయాలకు పూర్తి అవకాశం ఉంది. చివరగా ఉద్యోగి స్వామ్య వ్యవస్థలో ఉద్యోగి బృందం, వస్తువులపై అతి తక్కువ వ్యయం అవసరమవుతుంది. ఈ లక్షణం ప్రాతిపదికగా వెబర్ ఉద్యోగస్వామ్య వ్యవస్థను అత్యంత సమర్థవంతమైన వ్యవస్థ గా పరిగణించాడు.

వెబర్ ఉద్యోగిస్వామ్య వ్యవస్థ సమర్థత, హేతుబద్ధతల గురించి ఇంకా ఈ విధంగా వాదించాడు. అనుభవం వెల్లడిస్తున్నదేమిటంటే పరిపూర్ణమైన ఉద్యోగి స్వామ్య పాలనా వ్యవస్థ అంటే ఏకీకృత (Monocratic ) ఉద్యోగి స్వామ్యవ్యవస్థ సాంకేతిక పరంగా అత్యున్నత పరిమాణంలో సామర్థ్యాన్ని సాధించే శక్తిని కల్గివుంది. అందుచేత అది మానవులపై అధికారయుత ( imperature) నియంత్రణను చెలాయించే అత్యంత హేతుబద్ధమైన సాధనం. స్పష్టతలో స్థిరత్వంలో ఖచ్చితంగా క్రమశిక్షణను పాటించడంలో విశ్వసనీయతలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ ప్రపంచంలోని మిగతా మొత్తం వ్యవస్థలకన్నా ఎంతో అత్యున్నతమైంది.

దాని కార్యకలాపాల పరిధి విస్తృతమైంది. అన్ని రకాల పాలనా విధులను నిర్వర్తించే స్థోమతను కల్గివుంది.

ఈ విధంగా వెబర్ ఉద్యోగిస్వామ్యం సమర్థతను, హేతుబద్ధతను అత్యున్నత స్థాయిలో ప్రశంసించాడు. అయితే ఇక్కడ గమనించవలసిన ప్రధాన అంశం ఒకటి ఉంది. వెబర్ ఉద్యోగి స్వామ్యం మానవుడు ఊహించగల్గిన వ్యవస్థలన్నింటిలో ఉద్యోగిస్వామ్యం అత్యంత సమర్థవంతమైనదని వాదించలేదు. దీనికి భిన్నంగా వెబర్ మానవునికి తెలిసిన ప్రత్యామ్నాయపాలన వ్యవస్థలకంటే ఉద్యోగి స్వామ్యం సమర్థవంతమైందని మాత్రమేనని వెబర్ పేర్కొన్నాడు.

## 2.2.5 వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనాపై విమర్శలు

వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనాను సామాజిక శాస్త్రవేత్తలు ఎంత ప్రశంసించినప్పటికీ అది వారి ఆదరణ ఎంత పొందినప్పటికీ ఆ నమూనాను తీవ్రంగా విమర్శించిన రచయితలు లేకపోలేదు. ఆ విమర్శకుల అభిప్రాయం ప్రకారం వెబర్ సిద్ధాంతం వ్యవస్థ, పరిసరాల మధ్య పరస్పర చర్యను గుర్తించలేని యాంత్రిక సిద్ధాంతం. వెబర్ సిద్ధాంతం వ్యవస్థలోని సభ్యుల వ్యక్తిగత (లేదా) ప్రవర్తనాంశాలను గుర్తించటంలో విఫలమవటం వలన అది అనేక వక్రఫలితాలకు ( Dysfunctionalites ) లోనైనది. ఈ సిద్ధాంతం స్థిరమైన పరిసారాలకు వర్తిస్తుంది తప్ప తరచు మారే పరిసరాలకు ఏమాత్రం వర్తించదు. వెబర్ ఉద్యోగిస్వామ్య సిద్ధాంతాన్ని తీవ్రంగా విమర్శించిన వారిలో రాబర్ట్ మెర్టన్ ప్రముఖుడు. మెర్టన్ వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాలో అనేక వైరుధ్యాలు ఉండటంచేత వెబర్ సూచించిన చాలా లక్షణాలు వక్రఫలితాలకు దారి తీస్తాయని విమర్శించాడు. మెర్టన్ ఉద్యోగిస్వామ్య వ్యవస్థ ప్రతిలక్షణంలో స్వయంవినాశక బీజాలు ఉన్నట్లు వాదించాడు.

సెల్జనిక్ వ్యవస్థలోని వివిధ ఉపభాగాలకు అధికారాన్ని దత్తం చేయవలసిన అవసరం ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో తీవ్రమైన సందిగ్ధతకు దారితీసిందని విమర్శించాడు. వ్యవస్థ కర్తవ్యాలు సంక్లిష్టంగా రూపొందటం చేత అధికార వికేంద్రీకరణ, అధికార దత్తతలు లక్ష్యాల విస్తాపనకు ( goal displacement )వ్యవస్థ దాని విభాగాల ప్రయోజనాల మధ్య సంఘర్షణకు దారి తీస్తాయని సెల్జనిక్ పేర్కొన్నాడు. గౌల్డ్‌నర్ (Gouldner) ఉద్యోగి స్వామ్యసాంకేతిక పద్ధతులు ప్రతిచర్యకు దారి తీస్తాయని వాదించాడు. వ్యవస్థ నియయాలు, అధీన ఉద్యోగుల ప్రవర్తనను నిర్దేశించినప్పటికీ వాటివల్ల ఉన్నతాధికారుల, అధీన ఉద్యోగుల మధ్య ఉద్రిక్తపూరిత సంబంధాలు ఏర్పడి వ్యవస్థ లక్ష్యాలు మరుగుపడే అవకాశం ఉందని గౌల్డ్‌నర్ సూచించాడు.

ప్రెస్థస్ మొదలైన రచయితలు వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనా పాశ్చాత్య సంతతికి చెందినది కావడం చేత అభివృద్ధి చెందిన సమాజాలకు వర్తించదని వాదించారు. రాయిడ్ రోడాల్ఫ్, సుసన్ రోడాల్ఫ్‌లు ఉద్యోగిస్వామ్య వ్యవస్థను నిశితంగా విమర్శిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు.' వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనా ప్రధాన లక్షణమైన, లాంఛన ప్రాయమైన హేతుబద్ధత, సాంకేతిక నైపుణ్యం వ్యవస్థ సమర్థతను పెంపొందింపచేయటంతోపాటు పరాయికరణ ( alienation ), ప్రతిఘటనలను సృష్టించటం ద్వారా వ్యవస్థ అసమర్థతకు దారి తీస్తాయి, అధికారం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తాయి'. పీటర్ బ్లౌ, మెయర్‌లు, వెబర్ ఆదర్శ నమూనా శాస్త్రీయ మాన్యతను ప్రశ్నించారు. అంతేగాక వారు వెబర్ నమూనా వ్యవస్థలోని లాంఛన ప్రాయంకాని సంబంధాలను చర్యలను, పూర్తిగా విస్మరించిన ఛాందస నమూనా అని వాదించారు. అందుచేత వెబర్ నమూనా అసమగ్రమైందని, అసంపూర్ణమైనదనీ వారు పేర్కొన్నారు.

ఈ విధంగా వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాపై చెలరేగిన విమర్శలలో రెండు ప్రధాన పోకడలను గుర్తించవచ్చు. కొందరు విమర్శకులు వెబర్ నమూనా ఆచరణాత్మక మాన్యత (Emperical Validity) ను తిరస్కరిస్తే ఇతర విమర్శకులు ఆ వ్యవస్థ సమర్థతను సవాలు చేశారు. ఇటీవల కాలంలో డేవిడ్ లామండ్



BRAOU

వంటి రచయితలు వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాపై వెలువరించిన విమర్శలను విశ్లేషించి ఆ విమర్శలు అసంబద్ధమైనవనీ, అవి పరిమిత ఆధారాలు, అసంపూర్ణ, అసమగ్ర విశ్లేషణలపై ఆధారపడి చేసినవేనని వాదించారు.

## 2.2.6 తులనాత్మకపాలన సాహిత్యంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ నమూనా

1960 వ దశాబ్దంలో తులనాత్మకపాలన శాస్త్రవేత్తలు నూతన దృక్పథాల కొరకు జరిపిన తమ అన్వేషణలో ఉద్యోగిస్వామ్య భావన పట్ల ప్రాధాన్యత కనబరిచారు. ఈ శాస్త్రవేత్తలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగిస్వామ్య వ్యవస్థల నిర్మాణపరమైన లక్షణాలను పరిసరాలతో వాటి సంబంధాలను, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతి, మార్పు ప్రక్రియలలో దానిపాత్రను తులనాత్మకంగా విశ్లేషించటంపై అత్యంత ఆసక్తిని ప్రదర్శించారు. ఈ విధంగా ఉద్యోగిస్వామ్య సిద్ధాంతం తులనాత్మక పాలనా అధ్యయనంలో అత్యంత ఆధిక్యత గల ఏకైక భావనా చట్రంగా రూపొందింది. ఈ నమూనా తులనాత్మక పాలనలో పరిశోధనను అభివృద్ధిపర్చడంలో విస్తృతమైన, సృజనాత్మకమైన పాత్రను నిర్వహించింది. తులనాత్మకపాలన అధ్యయనంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థపై విస్తృతమైన పరిశోధన సాగించిన రచయితలలో రిగ్స్, ఫెరల్ హెడీ, షైయిన్ సాడ్, ఐసన్‌స్టాట్,గెరాల్డ్ కైడేన్, మెఖల్ క్రోజియర్ ప్రముఖులు. క్షీరసాగర్, పాయ్‌పనన్ దీకర్ లు భారత దేశపాలనా సందర్భంలో ఉద్యోగిబృంద వ్యవస్థపై గణనీయమైన పరిశోధన సాగించారు.

ఫెరల్ హెడీ తులనాత్మక పాలన అధ్యయనంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థపై జరిగిన పరిశోధనలను విశ్లేషించాడు. హెడీ తులనాత్మకపాలన అధ్యయనంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పరిశోధనకు చక్కటి సాధనంగా ఉపయోగపడిందని పేర్కొన్నాడు. ప్రపంచంలోని పాలనా వ్యవస్థలలో ఉద్యోగి స్వామ్యం అతిప్రధానమైన నిర్మాణం. సార్వత్రికంగా వ్యాప్తి చెందిన ఉద్యోగి బృంద వ్యవస్థపై దృష్టిని కేంద్రీకరించడం తులనాత్మక విశ్లేషణకు అత్యంత ఆవశ్యకం. విభిన్న దేశాల పాలనా వ్యవస్థలకు చెందిన పెక్కు అంశాలపై సమాచార సేకరణ అధిక శ్రమకు గురికాకుండా ఉండేందుకు ఉద్యోగి స్వామ్య నమూనా తులనాత్మక అధ్యయనానికి ఒక వ్యవస్థీకృతమైన భావన చట్రాన్ని సమకూర్చిందని హెడీ వాదించాడు. హెడీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పరిసరాల సంబంధాల విశ్లేషణపై తన దృష్టిని కేంద్రీకరించాడు. ప్రధానంగా హెడీ తులనాత్మకపాలన, రాజకీయ వ్యవస్థ సంబంధాలపై అత్యంత విస్తృతమైన విశ్లేషణను సాగించాడు.

హెడీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయవ్యవస్థ, ఉద్యోగిస్వామ్య వ్యవస్థల సంబంధాల ఆధారంగా ఒక వర్గీకరణను ప్రతిపాదించాడు. హెడీ అభివృద్ధి చెందుతున్న పాలనా వ్యవస్థలను ఆరు తరగతులుగా విభజించాడు. అవి :

- సాంప్రదాయ నిరంకుశ వ్యవస్థలు (Traditional Autocratic Systems )
- శక్తివంతుడైన నాయకుడు కల సైనిక వ్యవస్థలు (Strong Man Military Systems)
- సమ్మేళన సైనిక వ్యవస్థలు (Collegial Military Systems )
- సాంప్రదాయ శ్రేష్ఠులను తొలిగించి ఉద్యోగి బృంద శ్రేష్ఠులు అధికారాన్ని అలంకరించిన వ్యవస్థలు (Bureaucratic Systems Replacing a Traditional Elite )
- వలస పాలనా సాంప్రదాయం అంతరించాక ఉద్యోగిబృంద శ్రేష్ఠులు అధికారాన్ని చేపట్టిన

BRAOU

వ్యవస్థలు

(Bureaucratic Elite Systems Successor to a Colonial Tradition )

- కార్పొరేట్, సాంకేతిక దృక్పథం కలిగిన ఉద్యోగి బృంద శ్రేష్ఠుల వ్యవస్థలు

(Bureaucratic Elite Systems with Corporate Technocratic Orientations )

హెడీ విశ్లేషణ ప్రకారం ప్రతి ఆధునిక జాతి రాజ్యం ( Nation - State ) వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనా లక్షణాలను కలిగిన ఉద్యోగి బృంద వ్యవస్థను కలిగి వుంటుంది. అయితే రాజకీయ వ్యవస్థ, ఉద్యోగి స్వామ్యం మధ్య సంబంధాల విధానంలో ఈ దేశాల మధ్య భిన్నత్వం ఉంది. రాజకీయ వ్యవస్థ, ఉద్యోగిస్వామ్య వ్యవస్థ సంబంధాలను ప్రభావితం చేసే కారకాలలో రాజకీయ అభివృద్ధి దశ, రాజకీయ వ్యవస్థ లక్షణాలు, అది ఎంపిక చేసుకున్న లక్ష్యాలు మొదలైనవి కీలకమైనవి.

ఐసన్ స్టాట్ లు ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పరిణామ ప్రక్రియపై ఆసక్తి కనబర్చగా జాన్ డోర్సే, జెరాల్డ్ కైడన్ ఉద్యోగిస్వామ్య వ్యవస్థ నిర్వర్తన, అభివృద్ధిలపై తమ దృష్టిని కేంద్రీకరించాడు. డోర్సే ఏకీకరణ, లౌకికత్వం (Secularization), విభిన్నీకరణ, పాలనా వ్యవస్థ ఆధునీకీకరణలను పెంపొందింప జేసే పరిసరాల కారకాలను వివరించేందుకు ప్రయత్నించాడు. ఐసన్ స్టాట్ లకు భిన్నంగా డోర్సే సామాజిక ఉద్యోగి స్వామ్యీకరణ పై గాక ప్రభుత్వపాలన వ్యవస్థల విధానాలపై ఎక్కువ ఆసక్తిని ప్రదర్శించాడు. సాధారణ వ్యవస్థల సిద్ధాంతం, సమాచార ప్రచార సిద్ధాంతం మొదలైన సిద్ధాంతాల ప్రాతిపదిక మీద డోర్సే ఉద్యోగి స్వామ్య వ్యవస్థపై సమాచారం, శక్తి (Energy) ల ప్రభావాన్ని విశ్లేషించాడు. కైడన్ ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో జ్ఞానబద్ధతను ,వృత్తీకరణను పెంపొందించాలని సూచించాడు.

హెడీ వర్గీకరణను అనుసరిస్తూ ఫెయిన్ సాడ్ రాజకీయ వ్యవస్థ, పాలనా వ్యవస్థల సంబంధాల ఆధారంగా ఉద్యోగిస్వామ్య వ్యవస్థను ఐదు తరగతులుగా వర్గీకరించాడు. అవి :

1. ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్య వ్యవస్థ ( Representative Bureaucracy ),
2. రాజకీయ పార్టీలు - రాజ్య ఉద్యోగిస్వామ్య వ్యవస్థలు ( Party - State Bureaucracy ),
3. సైనిక ఆధిపత్యంగల ఉద్యోగిస్వామ్య వ్యవస్థలు ( Military Dominated Bureaucracy ),
4. పాలకుడు ఆధిపత్యం వహించే ఉద్యోగిస్వామ్య వ్యవస్థలు (Ruler-dominated Bureaucracy ),
5. పాలించే ఉద్యోగిస్వామ్య వ్యవస్థలు ( Ruling - Bureaucracy ),

ఫ్రెడ్ రిగ్స్ విభిన్న సమాజాలలోని ఉద్యోగి బృందం భిన్నత్వం విశ్లేషణపై ఆసక్తిని కనబర్చాడు. రిగ్స్ విశ్లేషణ ప్రకారం సంయోజిత (Fused ) నమూనాను పోలిన సాంప్రదాయ సమాజాలలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ విధుల భిన్నత్వం ( Diffused) కలిగిన నమూనా. అంటే ఈ సమాజాలలోని ప్రతి ఉద్యోగి రాజకీయ, పాలన, ఆర్థికపరమైన విధులను నిర్వహిస్తాడు. సమైక్యీకరణ చెందిన ప్రతిఫలన సమాజ నమూనాను పోలిన ఆధునిక సమాజాలలో ఉద్యోగి బృందం కేవలం పాలనా విధుల నిర్వర్తనకు మాత్రమే పరిమితం అయిన వ్యవస్థ. ఈ సమాజాలలో ఉద్యోగి బృందం వ్యవస్థ సమైక్యతను సాధించేందుకు ఆవశ్యమైన సంస్థాగత మార్గమని రిగ్స్ వాదించాడు. కాగా పారదర్శనిక నమూనా (Prismatic - model )ను పోలిన పరివర్తన సమాజాలలో ఉద్యోగిబృంద వ్యవస్థలు కార్యపరమైన ప్రత్యేకీరణకు, విభిన్నీకరణకు మధ్యస్థంగా వుంటూ రాజకీయ సంస్థలతో సమర్థవంతంగా సమ్మేళితంకాక, అనుచిత సమైక్యతకు (Malintegration ) దారి తీస్తాయి. ఈ మూడు విభిన్న సమాజాలలోని ఉద్యోగిబృంద వ్యవస్థ స్థానాన్ని ( locus) ఆధారంగా చేసుకొని రిగ్స్ ప్రతి సమాజంలో ఉద్యోగి బృంద వ్యవస్థకు ఒకపేరు ప్రతిపాదించాడు. సంయోజిత సమాజాలలోని

BRAOU

ఉద్యోగి బృంద వ్యవస్థకు ఛాంబర్ (Chamber), ప్రతిఫలన సమాజాలలో ఈ వ్యవస్థకు కార్యాలయం (Office) అనే పేర్లను ఉపయోగించాడు. కాగా పారదర్శనిక సమాజాలలోని ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పేరుగా స్పానిష్ పదమైన సాలా (Sala) ను ప్రతిపాదించాడు. ప్రతిఫలన సమాజాలలో కార్యాలయం లక్షణాలు, సంయోజిత సమాజాలలోని చాంబర్ లక్షణాలు పారదర్శనిక సమాజాలలోని సాలాలో గోచరిస్తాయిని రిగ్స్ పేర్కొన్నాడు.

సాలాలోని పాలనా వ్యవస్థ స్వరూపం , ఉద్యోగి బృంద పాత్ర పారదర్శనిక, సామాజిక వ్యవస్థపై రిగ్స్ సిద్ధాంతీకరణ కనుగుణంగా వివరించబడినాయి. సామాజిక విలువలను ప్రభావితం చేయగల ఉద్యోగి బృంద అధికార పరిధి పారదర్శనిక సమాజాలలో మధ్యస్థంగా వుంటుంది. అయితే ఈ సమాజాలలోని ఉద్యోగి బృందం అధికారం సంయోజిత, ప్రతిఫలన సమాజాలలోని ఉద్యోగిబృంద అధికారం కన్నా బలీయంగా వుంటుందని రిగ్స్ పేర్కొన్నాడు. పారదర్శనిక సమాజాలలో రాజకీయ ఉద్యోగిబృంద వ్యవస్థల వృద్ధి పరిమాణంలో అసమతౌల్యత వుంటుంది. ఈ సమాజాలలో రాజకీయ వ్యవస్థ నియంత్రణ బలంగా లేకపోవడం వలన ఉద్యోగిబృందానికి ప్రయోజనకరంగా పరిణమించింది. ఈ పరిస్థితి రాజకీయ ప్రక్రియలో జోక్యం కల్పించుకొనేందుకు ఉద్యోగులకు అవకాశాన్ని కల్పిస్తుంది.

పారదర్శనిక సమాజాలలో ఉద్యోగి బృందం అధికృత పాలనా సామర్థ్యం క్షీణించేందుకు దారితీసిందని రిగ్స్ పేర్కొన్నాడు. సేవల పంపిణీలో అసమానత, సంస్థాగతమైన అవినీతి, నిబంధనల అమలులో అసమర్థత, ఉద్యోగిబృంద భర్తీలో బంధుప్రీతి, ఉద్యోగులలో కేవలం స్వప్రయోజనాలకే ప్రాధాన్యత కనబరచేతత్వం. ఆశయాలకు, ఆచరణాత్మక ప్రవర్తనకు మధ్య అంతరం మొదలైనవి సాలా వ్యవస్థ ప్రధాన లక్షణాలని రిగ్స్ ప్రతిపాదించాడు. రిగ్స్ దృష్టిలో సాలా నమూనాలోని పాలన మౌళికంగా వ్యర్థమైంది. దుర్వ్యయభరితమైంది. ఈ సమాజాలలో పాలన దక్షతను క్షీణింపచేసే కారకాలు అనేకం ఉన్నాయి.

వెబర్, రిగ్స్ విశ్లేషణలను పరిశీలిస్తే అవి రెండు పరస్పర పూరకాలనే (Complimentary) వాస్తవాన్ని గుర్తించవచ్చును. వెబర్ కొన్ని రకాల సామాజిక, ఆర్థిక ప్రగతి ప్రక్రియల ఫలితంగా రూపొందించిన ఉద్యోగిస్వామ్య వ్యవస్థ లక్షణాలను విశ్లేషించారు. కాగా రిగ్స్ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ అభివృద్ధి వేగంగా సంభవించకపోవడానికి గల కారణాల అన్వేషణపై ఆసక్తిని ప్రదర్శించాడు. కాగా పాలనా నమూనాలను రూపొందించడంలో రిగ్స్‌పై వెబర్ ప్రభావాన్ని స్పష్టంగా గుర్తించవచ్చును. వెబర్ పంథాలోనే రిగ్స్‌పై మూడు ఆదర్శ నమూనాలను ప్రతిపాదించాడు. అయితే వెబర్ ఆదర్శ నమూనాలకు అధికార వ్యవస్థ చట్టబద్ధత ప్రాతిపదిక కాగా రిగ్స్ ఆదర్శ నమూనాలకు నిర్మాణపరమైన విభిన్నత్వం ప్రాతిపదిక. అయితే పాలన వ్యవస్థ ఆవరణ (Ecology of Administrative System) విశ్లేషణలో రిగ్స్ వెబర్‌ను పూర్తిగా అధిగమించినట్లు గుర్తించవచ్చును. పాలన దాని పరిసరాల ప్రతిచర్యపై వెబర్ కంటే రిగ్స్ ఎక్కువ స్పృహను, ఆసక్తిని ప్రదర్శించాడు.

హాయ్‌పనన్ దీకర్, క్షీరసాగర్ లు భారత దేశ ఉద్యోగి బృంద సందర్భంలో వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనా నిర్మాణపరమైన, ప్రవర్తనాపరమైన లక్షణాలను పరిశీలించారు. హాయ్‌పన్ దీకర్, క్షీరసాగర్ లు తులనాత్మక పరిశోధనలో ఉద్యోగిబృంద వ్యవస్థ అధ్యయనం ఒక అర్థవంతమైన ఆరంభదశ అనే సాధారణీకరణను బలపర్చారు. కాని వారు ఉద్యోగిస్వామ్య వ్యవస్థ నిర్మాణపరమైన, ప్రవర్తనా పరమైన లక్షణాల మధ్య సంబంధాలు సమస్థితిలో (Isomorphic) ఉండవని వెల్లడించారు. విభిన్న పాలనా దృగ్గోచరాల అధ్యయనానికి సాధారణీకరించిన ఉద్యోగిస్వామ్య నమూనా ఉపకరించదని వారు వాదించారు. అందుచేత ఉద్యోగి స్వామ్య వ్యవస్థ లక్షణాలు విభిన్న పాత్రలు వహించే అనేక ఉపనమూనాల(Sub-Models)ను రూపొందించాలని వారు సూచించారు.

ఈ విధంగా పెక్కు మంది తులనాత్మక రచయితలు వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనా ప్రాతిపదికగా

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ఉద్యోగిస్వామ్య వ్యవస్థల అనేక దృక్కోణాలను అధ్యయనం చేసి అనేక సాధారణీకరణలను రూపొందించారు. ఈ రచయితలు తమ విశ్లేషణకు వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాను ప్రాతిపదికగా ఏర్పరచుకొన్నప్పటికీ వారు వెబర్ సృజించిన అనేక కీలక అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించి వాటిని నిగూఢంగా విశ్లేషించారు. వీరి రచనలను పరిశీలిస్తే గోచరించే వాస్తవం ఏమిటంటే వీరు తమ రచనల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగి స్వామ్య రుగ్మతల విశ్లేషణపైనే అధిక ప్రాధాన్యత కనబర్చారు. ఈ అంశాన్ని రిగ్స్, ఫెరల్ హెడీ రచనల్లో సైతం గుర్తించవచ్చును. దీనివల్ల వారి రచనలు వర్ధమాన దేశాల ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పాక్షిక అవగాహనకు మాత్రమే తోడ్పడగలవు. వీరి రచనల్లోని మరో తీవ్ర లోపం ఏమిటంటే ఈ రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగిస్వామ్య వ్యవస్థల స్వభావంలో, నిర్వర్తనలో గల విపరీతమైన భిన్నత్వాన్ని వివరించేందుకు ప్రయత్నించలేదు. వీరి విశ్లేషణలో వేరొక లోపం కూడా ఉంది. వీరు ఉద్యోగి స్వామ్య వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ సంబంధాలపైనే తమ ఆసక్తిని కేంద్రీకరించి, సమాజంలోని ఇతర వ్యవస్థలతో, ఆ వ్యవస్థకు గల సంబంధాల విశ్లేషణను నిర్లక్ష్యం చేశారు. ఈ లోపం వల్ల తులనాత్మక పాలన సాహిత్యంలో ఉద్యోగిస్వామ్యంపై కల విశ్లేషణ పూర్తి స్థాయిలో లేదనే వాస్తవం వెల్లడవుతున్నది. తులనాత్మక పాలనా సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ సాహిత్యంలో ఉద్యోగి బృంద వ్యవస్థపై అధ్యయనాలు కేంద్రస్థానం ఆక్రమిస్తున్నాయని గుర్తించవచ్చును. తులనాత్మకపాలన అధ్యయనంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థపై విశ్లేషణ ఎంత కీలకస్థానం ఉందంటే తులనాత్మక పాలన అధ్యయనాన్ని తులనాత్మక ఉద్యోగి సామ్య వ్యవస్థ అధ్యయనంగా పరిగణించవచ్చును. తులనాత్మక పాలన అధ్యయనంలో వెబర్ రూపొందించిన ఉద్యోగి స్వామ్య వ్యవస్థ నమూనా పూర్తిగా రూపాంతరం చెందింది. తులనాత్మక పాలనా రచయితలు ఉద్యోగి స్వామ్య వ్యవస్థను రాజకీయ పాత్రధారునిగా రాజకీయ వ్యవస్థ కీలకాంశంగా, సామాజిక వస్తువుల ఉత్పత్తి దారునిగా, అధికార కేంద్రంగా, మార్పు ప్రతినిధిగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతి సాధనంగా, పరిసరాలను నిర్ధారించే సాధనంగా ఒత్తిడి సమూహంగా విభిన్న రూపాలలో గోచరిస్తుంది. దీని ఫలితంగా తులనాత్మక పాలన అధ్యయనంలో సాంప్రదాయ ఉద్యోగిస్వామ్య సిద్ధాంతం పూర్తిగా పరివర్తన చెందింది. దీని ఫలితంగా ఉద్యోగి స్వామ్య సిద్ధాంతం ఒక సంక్లిష్ట సిద్ధాంతంగా రూపొందింది. అయినప్పటికీ ఉద్యోగిస్వామ్య సిద్ధాంతం తులనాత్మక పాలన అధ్యయనంలో అలాగే ప్రభుత్వ పాలనా శాస్త్రంలో కూడా అత్యంత ఆధిక్యత గల ఏకైక నమూనాగా కొనసాగుతున్నది.

BRAOU

## 2.3 వ్యవస్థా దృక్పథం

ఆధునిక కాలంలో సామాజిక శాస్త్రాల పరిశోధనలో అతి తరచుగా ఉపయోగించబడుతున్న సైద్ధాంతిక నమూనా వ్యవస్థా దృక్పథం. 1940-60 దశాబ్దాలలో వ్యవస్థా దృక్పథం పెక్కుమంది సామాజిక శాస్త్ర వేత్తలను ప్రభావితం చేసింది. ఈ దశాబ్దాలలో సామాజిక శాస్త్ర విజ్ఞానంలో వ్యవస్థా దృక్పథం వ్యవస్థా సిద్ధాంతం సామాజిక శాస్త్రాల పరిశోధనలో ఒక విడదీయని అంశం అయినది. విజ్ఞాన శాస్త్రాలైన భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాలలో ఊపిరి పోసుకొన్న వ్యవస్థా సిద్ధాంతం క్రమంగా సామాజిక శాస్త్రాలైన సమాజశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రాలలో కూడా అడుగుపెట్టింది. సామాజిక శాస్త్రాలలో వ్యవస్థా దృక్పథం సారాంశం ఏమిటంటే సమాజం పరస్పర ఆధారితాలైన అనేక వ్యవస్థల కలయిక. ఈ వ్యవస్థలన్నీ తమ పరిసరాలలో ఉత్పాదకాలు, ఉత్పత్తులను మార్పిడి చేసుకొనడం ద్వారా తమ మనగడను కొనసాగిస్తాయి.

ప్రతి వ్యవస్థ అనేక ఉపవ్యవస్థలుగా విభజింపబడుతుంది. ఈ వ్యవస్థలన్నీ సరిహద్దు మార్పిడిలు (boundary - Exchanges)అనే లంకెల (Networks) ద్వారా మొత్తం వ్యవస్థతో సమైక్య పర్చబడతాయి. ప్రతి ఉపవ్యవస్థ తిరిగి అనేక తక్కువ స్థాయి ఉపవ్యవస్థలుగా విభజింపబడుతుంది. ఉత్పత్తులు (Outputs) ఉత్పాదకాలు (Inputs) పరిసరాలు (Environments) ప్రతిస్పందన (Response) పునఃశ్చరణ (Feed back)మార్పిడి ప్రక్రియ (Conversion Process) సమతౌల్యత (Equilibrium) మొ||నవి వ్యవస్థా దృక్పథంలో తరచుగా ఉపయోగించే భావనలు.

సమాజ శాస్త్రాలలో వ్యవస్థా దృక్పథాన్ని అవలంభించిన మొట్టమొదటి శాస్త్రం సమాజ శాస్త్రం. టాల్కాట్ పార్సన్స్ సమాజ శాస్త్రంలో సామాజిక వ్యవస్థ అధ్యయనానికి వ్యవస్థా దృక్పథాన్ని వర్తింపజేసిన ప్రథమ శాస్త్రవేత్త పార్సన్స్ నిర్మాణాలు, విధుల (Structural-Functional) సిద్ధాంత వేత్తగా ప్రసిద్ధి చెందాడు. పార్సన్స్ దృక్పథం ప్రకారం సమాజం తన మనుగడను కొనసాగించేందుకు అనేక అవసరాలు (Needs) ఆవశ్యకాలను (requisites) సంతృప్తి పర్చాలి. పార్సన్స్ సమాజ మనుగడకు అవసరమయిన నాలుగు కార్యపర అవసరాలను (Functional requisites) గుర్తించాడు. లక్ష్యసాధన (goal attainment) సమైక్యత (Integration), విధానం కొనసాగింపు (Pattern maintenance). ఈ నాలుగు అవసరాలను తీర్చేందుకు సమాజం నాలుగు ఉపవ్యవస్థలను (నిర్మాణాలను) కలిగి వుంటుందని పార్సన్స్ వివరించాడు. అవి ఆర్థిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, సమాజీకీకరణ ( కుటుంబం, విద్యావ్యవస్థ ) సంస్కృతి (మతం). ప్రతి ఉపవ్యవస్థ తిరిగి నాలుగు ఉపవ్యవస్థలుగా విభజింపబడుతుంది. ఉదాహరణకు రాజకీయ వ్యవస్థ ప్రధానంగా లక్ష్యసాధన అవసరాన్ని సంతృప్తి పరుస్తూనే కొంతమేరకు రాజకీయ సామాజికీకరణ ద్వారా సమైక్యత అవసరాన్ని, వనరుల కేటాయింపు ద్వారా అనుసరణీయత అవసరాన్ని సంతృప్తి పరుస్తుంది. పార్సన్స్ వ్యవస్థా దృక్పథం పెక్కు సామాజిక శాస్త్రవేత్తలను ప్రభావితం చేసింది. వ్యవస్థా దృక్పథాన్ని అన్వయించడంలో వివిధ సామాజిక శాస్త్రాలకు చెందిన రచయితలు విభిన్న పంథాలను అనుసరించారు. వారి అన్వయీకరణను ఆయా సామాజిక శాస్త్రాల మౌలిక భావనలకు (basic content) అనువుగా మలచడం జరిగింది. వివిధ సామాజిక శాస్త్రాలు వ్యవస్థా దృక్పథాన్ని ఎలా అన్వయించిందీ తెలుసుకొనడం ఎంతైనా అవసరం.

### 2.3.1 డేవిడ్ ఈస్టన్ దృక్పథం

డేవిడ్ ఈస్టన్ వ్యవస్థా దృక్పథాన్ని రాజనీతి శాస్త్రంలో ఉపయోగించిన మొట్టమొదటి ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్త. ఈస్టన్ రాజకీయ వ్యవస్థను శక్తి (Power)వినియోగం, పంపిణీచేత ప్రభావితం అవుతూ విలువలను అధికార యుతంగా కేటాయించే యంత్రాంగంగా పేర్కొన్నాడు. ఈస్టన్ భావనలో అధికార యుతమైంది అంటే చట్టబద్ధమైంది. విలువలు అంటే కొరతగా వున్న వస్తువులు, వనరులు. ఈస్టన్ వ్యవస్థా దృక్పథం ప్రకారం రాజకీయ వ్యవస్థ పరిసరాల నుంచి ఉత్పాదకాలను స్వీకరించి వాటిని ఉత్పత్తులుగా మార్చి తిరిగి పరిసరాలలో విడుదల చేస్తుంది. పరిసరాలనుంచి రాజకీయ వ్యవస్థలో ప్రవేశించే ఉత్పాదకాలు ఏవంటే డిమాండ్లు, సేవలు, వస్తువుల సరఫరాను, ప్రవర్తనను క్రమబద్ధం చేసే డిమాండ్లు మద్దత్తు (ఓట్లు, పన్నులు) రాజకీయ వ్యవస్థ డిమాండ్లను, మద్దతును మార్పిడి ప్రక్రియ ద్వారా నియమాలు, విలువల కేటాయింపు, ఉమ్మడి సంజ్ఞాత్మక విలువలు (Symbolic Values)అనే ఉత్పత్తులుగా మార్చి పరిసరాలలోకి విడుదల

BRAOU

చేస్తుంది. దీని వెంటనే ఈ ఉత్పత్తుల పరిణామాలు (లేదా) ప్రభావం ఉత్పాదకాల రూపంలో తిరిగి రాజకీయ వ్యవస్థలో ప్రవేశిస్తాయి. ఈ ప్రక్రియ పునఃర్భరణ ప్రక్రియ ఈ విధంగా రాజకీయ వ్యవస్థ ఒక నిరంతర ప్రక్రియ ద్వారా తన మనుగడను కొనసాగిస్తుంది.

ఈ స్టన్ విశ్లేషణ వల్ల రెండు స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి, ఈ విశ్లేషణ వ్యవస్థలోని గతిశీలత (dynamism)తో పాటు సమాజంలోని మార్పు స్థిరత్వంల మధ్య భిన్నత్వాన్ని వివరిస్తుంది. రెండు, ఈస్టన్ ప్రతిపాదించిన భావనా చట్రం రాజకీయ వ్యవస్థల స్థూల, తులనాత్మక విశ్లేషణకు ప్రయాణీకరించబడిన వర్గీకరణలను సమకూరుస్తుంది. దీరాన్ యంగ్ ఈస్టన్ ప్రతిపాదించిన వ్యవస్థా దృక్పథం రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు ఇంతవరకు ఏ రాజనీతి శాస్త్రవేత్త రూపొందించనంత సమగ్రమైందని ప్రశంసించాడు.

రాజనీతి శాస్త్రంలో వ్యవస్థా సిద్ధాంతం పరిధిలో ఈస్టన్ దృక్పథం ప్రధానమైంది. ఆల్మండ్, పార్సన్స్ ప్రతిపాదించిన నిర్మాణాలు, విధులను ఉపయోగించి రాజకీయ వ్యవస్థను విశ్లేషించాడు ఆల్మండ్ తన విశ్లేషణలో రాజకీయ వ్యవస్థ నిర్మాణం అది నిర్వర్తించే విధులతో పాటు రాజకీయ సంస్కృతిని, విభిన్న రాజకీయ పాత్రలను సమగ్రంగా పరిశీలించాడు. ఈ విధంగా ఆల్మండ్ రాజకీయ వ్యవస్థ మొత్తం అంశాలను తన విశ్లేషణలో చేర్చాడు.

## 2.3.2 గేబ్రియల్ ఆల్మండ్ వ్యవస్థా దృక్పథం

ఆల్మండ్ ఈస్టన్ రూపొందించిన ఉత్పాదకాలు, ఉత్పత్తుల నమూనాను అనుసరిస్తూ రాజకీయ వ్యవస్థ నిర్వర్తించే ఉత్పాదక విధులను, ఉత్పత్తి విధులను గుర్తించాడు. ఆల్మండ్ పేర్కొన్న రాజకీయ వ్యవస్థ ఉత్పాదక విధులు ఈ క్రిందివి.

1. రాజకీయ సామాజీకరణ
2. ప్రయోజనాల వ్యక్తీకరణ
3. ప్రయోజనాల సమీకరణ
4. రాజకీయ ప్రసారాలు

పై ఉత్పాదక విధులతోపాటు రాజకీయ వ్యవస్థలు మూడు ఉత్పత్తి విధులను కూడా నిర్వర్తిస్తుంది. అవి :

1. నియమాల రూపకల్పన
2. నియమాల అమలు
3. నియమాల తీర్పు

ఆల్మండ్ రాజకీయ వ్యవస్థ విభిన్న విధులను, నిర్మాణాలు నిర్ధారిస్తాయని పేర్కొన్నాడు. ఉత్పాదక విధులను రాజకీయేతర సంస్థలైన కుటుంబం, పాఠశాల, చర్చి, రాజకీయ సంస్థలైన రాజకీయ పక్షాలు, ప్రయోజన గణాలు నిర్వర్తించగా, ఉత్పత్తి విధులను ప్రభుత్వ అంగాలైన శాసనసభ, కార్యనిర్వాహక వర్గం, న్యాయస్థానాలు నిర్వహిస్తాయని పేర్కొన్నాడు.

ఆల్మండ్ తన వ్యవస్థా విశ్లేషణ ద్వారా రాజకీయ వ్యవస్థ ఒక గతిశీలక, చైతన్యపూరిత వ్యవస్థ అని నొక్కి చెప్పాడు. రాజకీయ వ్యవస్థ విధులను కేవలం రాజకీయ సంస్థలే కాక రాజకీయేతర సంస్థలు కూడా నిర్వర్తిస్తాయిని ప్రతిపాదించడం ద్వారా ఆల్మండ్ రాజకీయ వ్యవస్థ, పరిసరాల మధ్య సంబంధాలను, రాజకీయ ప్రక్రియలో విలువల పాత్రను వక్కాణించాడు.

BRAOU

1950 నుంచి రాజనీతిశాస్త్రం అధ్యయనం అభివృద్ధిలో వ్యవస్థా దృక్పథం కీలక పాత్ర వహించింది. వ్యవస్థా సిద్ధాంతాలు రాజకీయ సంస్థల కంటే రాజకీయ విధులు, ప్రక్రియలపై అధికంగా దృష్టిని కేంద్రీకరించాయి. ఈ సిద్ధాంతాలు రాజకీయ ప్రక్రియ సమాజంలోని ఇతర ప్రక్రియల మధ్యగల సంబంధాలను విశ్లేషించేందుకు అవసరమైన భావనా చట్రాన్ని రూపొందించాయి. సంస్థలపై కన్నా ప్రక్రియలపై విధులపై తమ ఆసక్తిని కేంద్రీకరించటంద్వారా వ్యవస్థా సిద్ధాంతాలు తులనాత్మక రాజకీయాలు అభివృద్ధికి మేథోపరంగా నిర్దిష్టమైన ఆధారాన్ని సమకూర్చాయి. వ్యవస్థా సిద్ధాంతాలు రాజకీయ ప్రవర్తనపై అనేక సాధారణ ఊహాలను సామాజిక, ప్రకృతి శాస్త్రాలను సమైక్య పర్చే మార్గాన్ని సూచించాయి. అంటే ఈ సిద్ధాంతాలు సామాజిక, ప్రకృతి శాస్త్రాలను అనుసంధానికి వారధిగా రూపొందాయి. మొత్తం మీద వ్యవస్థా విశ్లేషణ రాజకీయ సంస్థలు, వాటి సామాజిక పరిసరాల మధ్య సంబంధాలపై దృష్టిని కేంద్రీకరించటం ద్వారా, సామాజిక వ్యవస్థను మొత్తం వ్యవస్థగా పరిగణించటం ద్వారా రాజనీతి శాస్త్రం సరిహద్దులను విస్తరింపజేసింది. అయితే వ్యవస్థా సిద్ధాంతాలు తమ రచయితల ఆశయాలకు అనుగుణంగా ఆచరణాత్మక, వివరణాత్మక రాజనీతి సిద్ధాంతాన్ని రూపొందించలేక పోయాయి.

## 2.3.3 తులనాత్మక పాలన అధ్యయనంలో వ్యవస్థాదృక్పథం

తులనాత్మక పాలన రచయితలు ఉపయోగించిన వివిధ సైద్ధాంతిక దృక్పథాలలో వ్యవస్థా దృక్పథం ప్రధానమైంది. ప్రభుత్వ పాలన శాస్త్రంలో వ్యవస్థా దృక్పథం తులనాత్మక పాలన అధ్యయనం ప్రవేశించిన తరువాతే అభివృద్ధి చెందింది. తులనాత్మకపాలన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా దృగ్గోచర విశ్లేషణకు వ్యవస్థా దృక్పథాన్ని విస్తృతంగా ఉపయోగించారు. అయితే ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో వ్యవస్థా దృక్పథం తులనాత్మక పాలన ఉద్యమ ఆవిర్భావానికి ముందు కాలం లోనే చోటు చేసుకొంది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు కాలంనాటి రచయితలైన చెస్టర్ బెర్నార్డ్, థామ్సన్, విలియం స్కాట్, చార్లెస్ పెరో (Charless Perrow), కాన్ (Kahn) కట్జ్ (Katz) రచనల్లో వ్యవస్థా దృక్పథం చిహ్నాలను (Traces) ను గురించవచ్చును . అయితే ఈ రచయితలు వ్యవస్థా దృక్పథాన్ని అతి పరిమితంగా మాత్రమే ప్రయోగించారు. కాగా తులనాత్మక పాలనా అధ్యయనంలో రిగ్స్ ప్రతిపాదించిన వ్యవస్థా దృక్పథం గొప్ప ప్రాచుర్యాన్ని పొందింది.

BRAOU

- ### రిగ్స్ వ్యవస్థా దృక్పథం

తులనాత్మక అధ్యయనంలో వ్యవస్థా దృక్పథం ఫ్రెడ్ రిగ్స్ రచనలలో అత్యంత సన్నిహితంగా ముడిపడివుంది. తులనాత్మక పాలనలో రిగ్స్ అత్యంత ప్రధానమైన వ్యవస్థా సిద్ధాంతవేత్త రిగ్స్ వ్యవస్థా సిద్ధాంతంలోని ప్రధాన అంశం ఏమిటంటే అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థలు వాటి పరిసరాలతో అతి సన్నిహితంగా ప్రతిస్పందిస్తాయి. అందుచేత పాలనా వ్యవస్థల సమగ్ర అవగాహనకు అవి పని చేసే సమాజాల సందర్భం అవగాహన అవసరం. అందుచేత పాలన వ్యవస్థల విశ్లేషణకు ముందు ఆయా సమాజాల విశ్లేషణను చేపట్టడం ఆవశ్యకం. వ్యవస్థా దృక్పథాన్ని వర్తింపజేసేందుకు రిగ్స్ అభివృద్ధి చెందుతున్న సమాజాలు వాటి విభిన్న ఉపవ్యవస్థల అధ్యయనానికి ఒక ఉత్కృష్టమైన సైద్ధాంతిక కార్య చట్రాన్ని రూపొందించాడు.

రిగ్స్ వ్యవస్థా దృక్పథంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలను విశ్లేషించేందుకు నిర్మాణాలు - విధుల కార్యచట్రాన్ని ఆధారంగా ఉపయోగించాడు. ఎందుచేతనంటే రిగ్స్ అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థపై సిద్ధాంతీకరణకు నిర్మాణాలు, విధుల దృక్పథం ఉపయోగపడినంతగా మరే ఇతర దృక్పథం ఉపయోగపడదని రిగ్స్ విశ్వసించాడు. రిగ్స్ ప్రతి సమాజం తన మనుగడకు కొన్ని

విధులను విధిగా నిర్వర్తించాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఈ ఆవశ్యక విధులను నిర్వర్తించేందుకు ప్రతి సమాజంలో కొన్ని నిర్మాణాలు ఉంటాయి. సమాజంలోని నిర్మాణాలు , విధుల మధ్య గల సంబంధాలే సమాజం స్వభావాన్ని నిర్ధారిస్తాయిని రిగ్స్ వాదించాడు. ఈ సంబంధాలే సమాజాల మధ్య గల గుణాత్మక, మౌళిక వ్యత్యాసాన్ని నిర్ధారించేందుకు తోడ్పడతాయని కూడా రిగ్స్ సూచించాడు. ఈ సిద్ధాంతం ప్రాతిపదికగా రిగ్స్ మూడు పరస్పర వ్యతిరేకమైన ఊహాత్మక (Ideal) సమాజ నమూనాలను రూపొందించాడు. రిగ్స్ ఒకే నిర్మాణం అనేక విధులను నిర్వర్తించే విధానం గల సమాజాలను విధుల పరంగా విభిన్నీకరణ (Functional Diffusion)గల సమాజాలన్నీ ఒకే నిర్మాణం ఒకే విధిని నిర్వర్తించే విధానం గల సమాజాలను విధులపరంగా ప్రత్యేకీకరణ (Functionally Specific) సమాజాలని పేర్కొన్నాడు. రిగ్స్ విధులపరంగా విభిన్నీరణ సమాజాలను సంయోజిత సమాజాలనీ, విధులపరంగా ప్రత్యేకీకరణ సమాజాలను ప్రతిఫలన సమాజాలని (Diffracted Societies) పేర్కొన్నాడు. కాగా ఈ రెండు సమాజాల మధ్యస్థంగా ఉండే సమాజాలను రిగ్స్ పారదర్శనిక సమాజాలని పిలిచాడు. పట్టకం (Prism) తెల్లని కిరణాన్ని ఇంద్ర ధనస్సులోని విభిన్న రంగులు కలిగిన కిరణాలుగా ప్రతిఫలించినట్లు పారదర్శనిక సమాజాలు సంయోజిత, ప్రతిఫలన సమాజాల లక్షణాలను కలిగి ఉంటాయని రిగ్స్ పేర్కొన్నాడు.

రిగ్స్ మూడు ప్రధాన పారదర్శనిక సమాజ లక్షణాలను గుర్తించాడు. అవి: భిన్నత్వం (Heterogeneity), లాంచనత్వం (Formalism), అతివ్యాప్తి (Over lapping). ఈ సమాజాలలో సాంప్రదాయ పద్ధతుల కొనసాగింపు భిన్నమైన, సంగతత్వం లోపించిన నిర్మాణాలకు, పద్ధతులకు దృక్పథాలకు దారి తీస్తుంది. నూతనంగా ఏర్పడిన భిన్నత్వం గల నిర్మాణాలలోని ప్రవర్తనను సాంప్రదాయ ప్రమాణాలు శాసిస్తాయి. ప్రజలలో పెరుగుతున్న భిన్నత్వం వల్ల అనేక రకాల వేర్పాటు సముదాయాలు అవతరిస్తాయి. ఈ సమాజంలో అంతరించే నూతన సంస్థలు ఆధునిక వ్యవస్థల స్వభావాన్ని కలిగి ఉంటాయి. కనీస అవసరాలు (Subsistence) తీర్చే ఆర్థిక వ్యవస్థ స్థాయి నుంచి మార్కెటు ఆర్థిక వ్యవస్థకు పరివర్తన చెందే ఈ సమాజాలలో వ్యాపార కార్యకలాపాలను తక్కువ స్థాయి వ్యాపారస్థులు, ఉద్యమకారులు నిర్వహిస్తారు. ఈ సమాజాలలో మార్కెటు శక్తులను ఆర్థికేతర శక్తులు ప్రభావితం చేయటం వలన ధరల అస్థిరత్వం (Indeterminacy) ఏర్పడుతుంది. ప్రభుత్వ అధికారాన్ని చట్టబద్ధత చేకూర్చడంలో సాంప్రదాయ, ఆధునిక వ్యవస్థల మధ్య ఏర్పడే పోటీ రాజకీయ అస్థిరత, సంఘర్షణలకు దారి తీస్తుంది. ఈ విధంగా పారదర్శనిక సమాజాలలో ఉత్పన్నమయ్యే అనేక విధానాలను వివరించేందుకు రిగ్స్ నూతన భావాలను రూపొందించాడు. పారదర్శనిక సమాజాలలోని ఆర్థిక వ్యవస్థను బజార్ క్యాంటిన్ నమూనా, వృత్తి సమూహాలకు క్లెక్ట్స్ (Clects), రాజకీయ వ్యవస్థకు కాక్‌పిట్ (Cockpit), పాలనా వ్యవస్థకు సాలా (Sala) అనే పేర్లను ప్రతిపాదించాడు.

రిగ్స్ వివరించిన పారదర్శనిక సమాజం నమూనాలో అభివృద్ధి చెందుతున్న దేశాల సమాజాల స్వభావాన్ని వివరించేందుకు నూతనంగా రెండు దీర్కోణాల కార్య చట్రాన్ని (Two dimensional framework) ప్రతిపాదించాడు. అవి ప్రత్యేకీకరణ (Differentiation), సమైక్యీకరణ (Integraton), రిగ్స్ సమాజంలో భాగాలైన విభిన్న నిర్మాణాల మధ్య సామరస్య పూరిత సమన్వయాన్ని సాధించే సమాజం సామర్థ్యాన్ని సమైక్యీకరణ అని, సమాజంలోని విభిన్న నిర్మాణాల మధ్యవిభజన విస్తృతిని, ఈ ఉపనిర్మాణాలు నిర్వర్తించే కార్యాలను ప్రత్యేకీకరణను విభిన్నీకరణ అని నిర్వచించాడు. తన నూతన కార్య చట్రంలో రిగ్స్ సమైక్యీకరణ, విభిన్నీకరణలు గల సమాజాలను ప్రతిఫలన సమాజాలనీ, విభిన్నీకరణ, అనుచిత సమైక్యీకరణ (Malintegration) కల సమాజాలను పారదర్శనిక సమాజాలనీ వివరించాడు. రిగ్స్ రెండు రకాల సమాజాలను వాటి విభిన్నీకరణ పరిమాణం ప్రతిపాదికగా తిరిగి అనేక రకాలుగా విభజించాడు. రిగ్స్ నూతన కార్యచట్రం

BRAOU

పరిమితంగా విభిన్నీకరణ కలిగినా, తీవ్రమైన అనుచిత సమ్మైక్యకరణ కల సమాజాల అధ్యయనానికి ఉపకరిస్తుంది. ఈ సమాజాలనే రిగ్స్ సాంప్రదాయ పారదర్శనిక (Ortho - Prismatic)సమాజాలని పిలిచాడు. ఈ సమాజానికి వర్తమాన తృతీయ ప్రపంచదేశాలకు అనేక లక్షణాలలో సామ్యం ఉందని రిగ్స్ వివరించాడు.

రిగ్స్ వ్యవస్థా దృక్పథం అభివృద్ధి చెందుతున్న దేశాలపాలన వ్యవస్థలపై సిద్ధాంతీకరణను పరిశోధనను క్రమబద్ధం చేసింది. రిగ్స్ దృక్పథం ఈ దేశాల పాలనా వ్యవస్థలకు సంబంధించిన అనేక నిగూఢ వాస్తవాలను వెలికి తీసింది. రిగ్స్ దృక్పథం ఎంత ప్రతిభావంతమైనప్పటికీ పూర్తిగా దోషరహితమైందని పాలనా తత్వవేత్తలు అంగీకరించలేదు. అనేక పరిమితుల వల్ల రిగ్స్ వ్యవస్థా సిద్ధాంతం తన ప్రధాన లక్ష్యమైన అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థల సమగ్ర విశ్లేషణలో పాక్షికంగా మాత్రమే విజయాన్ని సాధించ గలిగిందని ఈ పాలనా రచయితలు వాదించారు. ఏమైనప్పటికీ తులనాత్మక సాహిత్యంలో రిగ్స్ వ్యవస్థా దృక్పథానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. దాని ప్రభావం అతి శక్తివంతమైంది.

- ## సాల్‌కాట్జ్ వ్యవస్థా దృక్పథం

రిగ్స్ ప్రభావం వల్ల పెక్కుమంది తులనాత్మకపాలనా రచయితలు వ్యవస్థా దృక్పథాన్ని వర్తింపజేసి అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా దృగ్గోచరాన్ని అధ్యయనం చేశారు. వీరిలో సాల్ కాట్జ్ (Saul Katz) ను ప్రధానంగా పేర్కొనవచ్చును. కాట్జ్ తన వ్యవస్థా దృక్పథాన్ని ప్రభుత్వ పాలనా వ్యవస్థ, సామాజిక వ్యవస్థల సంబంధాలపై నిర్మించాడు. కాట్జ్ వ్యవస్థా దృక్పథం ప్రకారం ఒక వ్యవస్థగా అభివృద్ధి చెందుతున్న పాలనా వ్యవస్థ పరస్పరం ఆధారితమైన నాలుగు అంశాలను కలిగి ఉంటుంది. అవి. 1. ఉత్పత్తులు, 2 2.ఉత్పాదకాలు, 3. భాగాలు, 4. అవరోధాలు.

BRAOU

కాట్జ్ జాతీయ అభివృద్ధి అవసరాలను తీర్చగలిగిన చర్యలను పాలనా వ్యవస్థ ఉత్పత్తులుగా పేర్కొన్నాడు. పాలనా వ్యవస్థ ఉత్పాదకాలు : 1. నైపుణ్యం కలిగిన మానవశక్తి, 2. విత్తం, 3. వ్యూహ రచనా శిల్పం (Logistics), 4. సమాచార ప్రసారాలు, 5. ప్రజల భాగస్వామ్యం, 6. చట్టబద్ధమైన అధికారం. ఈ ఆరు ఉత్పాదకాలలో ప్రతి ఉత్పాదకాన్ని ఒక వ్యవస్థగా భావించ వచ్చునని కాట్జ్ పేర్కొన్నాడు. ప్రతి వ్యవస్థలో కొన్ని ఉప వ్యవస్థలు ఉన్నాయి. ఈ ఉపవ్యవస్థలే పాలనా వ్యవస్థ భాగాలు. చివరగా పాలనా వ్యవస్థ సాంకేతిక అవరోధాలు, సామాజిక అవరోధాలని రెండు రకాల అవరోధాలను ఎదుర్కొంటుంది. పాలనా వ్యవస్థ లక్షణాలు ఆ వ్యవస్థకు సాంకేతిక అవరోధాలను కల్పిస్తాయి. పాలనా వ్యవస్థ ఎదుర్కొన్న సామాజిక అవరోధాలు సామాజిక పరిసరాల నుంచి ఉత్పన్నమవుతాయి. పాలనా సంస్థలలో పనిచేసే ఉద్యోగులు సమాజంలోని విశ్వాసాలు, ప్రేరణలు, అలవాట్లు, బలహీనతల వల్ల ప్రభావితమవుతారు. ఈ విధంగా కాట్జ్ వ్యవస్థా దృక్పథాన్ని అవలంబించి అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలను అధ్యయనం చేశాడు.

- ## ఇతర దృక్పథాలు

తులనాత్మక పాలనలో వ్యవస్థా విశ్లేషణను అవలంబించిన రచయితల సాహిత్యాన్ని పరిశీలిస్తే రెండు భిన్న దృక్పథాలను గుర్తించవచ్చును. అవి: 1. పాలనా వ్యవస్థల దృక్పథం 2. సామాజిక వ్యవస్థల దృక్పథం.

మొదటి దృక్పథంలో పాలనా వ్యవస్థ విశ్లేషణ కేంద్రబిందువైతే రెండవ దృక్పథంలో సామాజిక వ్యవస్థ విశ్లేషణ కీలక స్థానం ఆక్రమిస్తుంది. ఈ రెండు దృక్పథాలు అభివృద్ధి సాధనలో పాలన వ్యవస్థ కీలక పాత్రను నిర్వహిస్తుందనే అంశాన్ని వక్కాణించాయి. పాలన వ్యవస్థ, దాని సామాజిక పరిసరాల మధ్యగల సన్నిహిత సంబంధాలపై కూడా ప్రాధాన్యత నొక్కి చెప్పాయి. ఈ రెండు దృక్పథాల అభివృద్ధిని సాధించడంలో పాలనా వ్యవస్థ సమర్థతను మెరుగు పర్చేందుకు అనేక సూచనలను చేశాయి. పాలన వ్యవస్థలోని వివిధ విభాగాలను సమానంగా అభివృద్ధి పర్చాలని అవి సూచించాయి. అదే విధంగా ప్రగతిని వేగంగా సాధించేందుకు సమాజంలోని వివిధ సంస్థలను మెరుగు పర్చాల్సి ఉందని అవి వాదించాయి. ఈ రెండు దృక్పథాలు అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పాత్రపై తమ దృష్టిని కేంద్రీకరించి, దానిపై అనేక ఊహనలను ప్రతిపాదించాయి. పాలనా వ్యవస్థల దృక్పథాన్ని ప్రతిపాదించిన రచయితలలో మెర్లీ పెయిన్ సాడ్, వెస్ట్‌కోట్‌లు ప్రముఖులు కాగా, రిగ్స్, వీడ్నర్ సామాజిక వ్యవస్థల దృక్పథాన్ని ప్రతిపాదించిన ప్రముఖ రచయితలు. రిగ్స్ ప్రతిపాదించిన పారదర్శనిక సమాజ నమూనా సామాజిక వ్యవస్థల దృక్పథానికి ఒక ప్రధాన దృష్టాంతం.

### 2.3.4 వ్యవస్థా దృక్పథం విశిష్టత

పాలనా దృగ్గోచరం అధ్యయనానికి వ్యవస్థా దృక్పథాన్ని అవలంబించడం ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఒక గొప్ప మలుపుగా భావించవచ్చును. ఈ దృక్పథం వల్ల ప్రభుత్వ పాలనా శాస్త్రానికి రెండు గొప్ప ప్రయోజనాలు చేకూరాయి. ఒకటి, వ్యవస్థా దృక్పథం పాలనా వ్యవస్థ, దాని పరిసరాల మధ్య సంబంధాల విశ్లేషణ ద్వారా పాలనా వ్యవస్థ సమగ్ర అవగాహనను పెంపొందింప జేసింది. రెండు వ్యవస్థా దృక్పథం వల్ల పాలనా శాస్త్రానికి అంతర్ శాస్త్ర (లేదా) బహుళ శాస్త్ర దృక్పథం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రభుత్వ పాలన శాస్త్ర పరిధి విస్తృతమైంది. ఈ అధ్యయనంలో అనుభవైక పరిశోధనకు అవసరమైన కార్య చట్రాలు ఏర్పడి పరిశోధన పరిమాణం గణనీయంగా అభివృద్ధి చెందింది. గెరాల్డ్ కైడన్ వ్యవస్థా దృక్పథం ప్రయోజనాన్ని ఈ విధంగా వివరించాడు. 'వ్యవస్థా దృక్పథం వల్ల పాలనా సిద్ధాంతం మొత్తం పాలనా వ్యవస్థలకు వర్తించే సార్వజనీన సిద్ధాంతంగా రూపొందింది. వ్యవస్థా సిద్ధాంతం ప్రభావం వల్ల పాలనా సిద్ధాంతం లాంఛన ప్రాయమైన సంస్థలపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించటం అనే సాంప్రదాయ బంధం నుంచి విముక్తి పొంది పాలనా సందర్భం పాలనా నిర్మాణాలు, విధులు, పాలనా ప్రవర్తన, పాలన దాని పరిసరాల మధ్య సంబంధాలు మొదలైన అనేక అంశాలపై దృష్టిని కేంద్రీకరించే విస్తృత, సమగ్ర సిద్ధాంతంగా రూపొందింది. ప్రధానంగా వ్యవస్థా సిద్ధాంతం వల్ల స్వజాతి ఆధిక్యతా వాదానికి కట్టుబడిన నమూనాగా పేరుపొందిన పాలనా సిద్ధాంతం పాశ్చాత్యేతర సార్వజనీన నమూనాగా పరివర్తన చెందింది'.

## 2.4 సంస్థాగత దృక్పథం

సామాజిక శాస్త్రాలలోని సంప్రదాయ దృక్పథాలలో సంస్థాగత దృక్పథం ( Institutional Approach) ఒకటి. ఈ దృక్పథం 1920 – 40 దశాబ్దాల మధ్యకాలంలో సామాజిక శాస్త్రంలో విరివిగా ఉపయోగించబడినది. ఈ దృక్పథం సామాజిక శాస్త్రాలలో ఇతర దృక్పథాల కంటే కాఠిన్యవంతమైన పరిశోధనా పద్ధతులను

BRAOU

అనుసరించటం వలన ఆచరణాత్మకమైందిగా పరిగణింపబడింది. సంస్థాగత దృక్పథం లాంఛన ప్రాయమైన (Formal) చట్టబద్ధంగా (Legalistic) రూపొందింపబడిన నిర్మాణాలు (లేదా) సంస్థల అధ్యయనంపై ప్రధాన్యతను వక్కాణిస్తున్నది. ఈ దృక్పథం సమర్థవంతమైన, ప్రతిభావంతమైన సంస్థల రూపకల్పనపై వాటి విశ్లేషణ, అవగాహనలపై తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. అందుచేత ఈ దృక్పథాన్ని నిర్మాణ దృక్పథం (Structural Approach) అని కూడా వ్యవహరించడం జరిగింది. సంస్థాగత దృక్పథాన్ని అవలంభించిన రచయితలు నిశ్చయితా వాద (Positivist) ధోరణితో సంక్లిష్ట వ్యవస్థలలో క్రమబద్ధత కొరకు వాటి మధ్య గల పరస్పర సంబంధాల విధానాల కొరకు అన్వేషించటంపై ఆసక్తిని ప్రదర్శించారు.

## 2.4.1 రాజనీతి శాస్త్రంలో సంస్థాగత దృక్పథం

రాజనీతి శాస్త్ర అధ్యయనం లో 1940 దశాబ్దం వరకు సంస్థాగత దృక్పథం బహుళ ప్రచారంలో ఉన్న దృక్పథం. ఈ శాస్త్రంలోని సంస్థాగత వాదులను రెండు తరగతులుగా విభజింపవచ్చును. అవి :

1. సంప్రదాయిక సంస్థాగత వాదులు, 2. ఆధునిక సంప్రదాయిక వాదులు ,సాంప్రదాయిక సంస్థాగత వాదులు. రాజకీయ వ్యవస్థలోని కీలక సంస్థలైన రాజ్యాంగం, శాసనసభ, కార్య నిర్వాహక వర్గం, న్యాయ... రాజకీయ పార్టీలు, ప్రయోజన ఒత్తిడి గణాలు, ఎన్నికలపై తమ విశ్లేషణను కేంద్రీకరించారు. సంప్రదాయి... సంస్థాగత వాదుల స్వభావం ఆధారంగా రాజకీయ వ్యవస్థలపై అనేక వర్గీకరణలను ప్రతిపాదించారు. వారు రాజకీయ వ్యవస్థలను ప్రధానంగా మూడు తరగతులుగా విభజించారు. అవి: 1. నిరంకుశ వ్యవస్థలు, 2. అధికారయుత వ్యవస్థలు, 3. ప్రజాస్వామ్య వ్యవస్థలు. వారు ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి అధ్యక్షపాలన తరహా ప్రజాస్వామ్యాలనీ, పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్యాలనీ రెండు తరగతులుగా విభజించారు. సాంప్రదాయ సంస్థాగత వాదులలో హెర్మన్, ఫైనర్, బొజిహాట్, హెచ్. జె. లాస్కీ, మున్రో, డువర్జర్ (Duverger) సి.ఎఫ్.స్ట్రాంగ్, జేమ్స్ బ్రైస్ ప్రముఖులు.

BRAOU

ఆధునికి సంస్థాగత వాదులు, సంప్రదాయిక వాదులకు భిన్నంగా రాజకీయవ్యవస్థలో కీలకాంశమైన శక్తి (Power)విశ్లేషణపై తమ దృష్టిని కేంద్రీకరించారు. ఈ రచయితలు శక్తి రాజకీయాలకు ప్రధాన ఆధారమనీ నిరాపేక్ష (absolute) శక్తిని, ప్రజాస్వామ్య శక్తిగా మార్చుటనే మానవ చరిత్ర ఎదుటనున్న ప్రధాన సమస్య అని వాదించారు. ప్రజాసార్వభౌమత్వం (Popular - Sovereignity) ప్రజాస్వామ్యం అత్యంత కీలక లక్షణమనీ ఆధునిక సంస్థాగత వాదులు బలంగా విశ్వసించారు. అయితే పరిమితులులేని ప్రజాసార్వభౌమత్వం మెజారిటీ ప్రజల నియంతృత్వానికి దారి తీయగలదని వారు హెచ్చరించారు. అందుచేత ప్రభుత్వం పరిధి పరిమితంగా ఉండాలని వారు సూచించారు. ఆధునిక సంస్థాగత వాదులు వక్కాణించిన మరో భావన క్రమబద్ధమైన స్వేచ్ఛ. క్రమబద్ధమైన స్వేచ్ఛ ను సాధించుటయే ఆధునికి సంస్థాగత వాదుల ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించే సంస్థలను పరిణామ క్రమంలో (లేదా) విప్లవం ద్వారా ఏర్పరచవచ్చునని వారు సూచించారు.

రాజనీతి శాస్త్రంలో సంస్థాగత వాదం సంకుచితమైందిగా, యాంత్రికమైందిగా, నిశ్చలమైందిగా విమర్శింపబడింది. అనేక పరిమితులను కలిగా ఉండడం చేత సంస్థాగత వాదం 1940 దశాబ్దంలో రాజనీతి శాస్త్రంలో తలెత్తిన ప్రవర్తనా వాద ఉద్యమం నుంచి తీవ్రమైన సవాలును ఎదుర్కొంది. రాజనీతి శాస్త్రవేత్తలు వివిధ సంస్థల విశ్లేషణ నుండి రాజకీయ ప్రవర్తన విశ్లేషణవైపు తమ దృష్టిని మరల్చారు. దానితో సంస్థాగత వాదం క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోయింది.

### 2.4.2 ప్రభుత్వ పాలనా శాస్త్రంలో సంస్థాగత దృక్పథం

ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనం తొలిదశలో అనుసరింపబడిన వివిధ సాంప్రదాయ దృక్పథాలలో సంస్థాగత దృక్పథాన్ని చేర్చవచ్చును. ప్రభుత్వపాలనా శాస్త్రం తొలిదశ రచయితలందరూ దాదాపుగా ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనాన్ని సంస్థాగత దృక్పథం మార్గంలోనే కొనసాగించారు. ప్రభుత్వపాలనా శాస్త్ర పితామహుడైన ఉడ్రోవిల్సన్ ప్రభుత్వపాలనా శాస్త్ర అధ్యయనం వివిధ పాలనా సంస్థల విశ్లేషణపైనే తన దృష్టిని కేంద్రీకరించాలని వక్కాణించాడు. విల్సన్ అమెరికా పాలనా వ్యవస్థలో అత్యంత (లేక) అతి కీలకమైన అధ్యక్షునిపై విస్తృతంగా రచనలను సాగించడం విల్సన్ సంస్థాగత దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వ పాలనా శాస్త్రంలో మొట్టమొదటి పాఠ్యగ్రంథాలుగా పరిగణింపబడిన ఎల్.డి.వైట్, విల్లోబీ రచించిన గ్రాంథాలు సంస్థాగత దృక్పథాన్ని అనుసరిస్తూ రచించిన గ్రంథాలే. ఎందుచేతనంటే ఈ గ్రంథాల్లో అమెరికా పాలనా వ్యవస్థలోని ప్రధాన నిర్మాణాలైన కార్య నిర్వాహక శాఖ, వివిధ పరిపాలనా శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగిబృంద వ్యవస్థ, బడ్జెట్ ప్రక్రియల విశ్లేషణ ప్రధాన ఇతి వృత్తం. ఈ ఇరువురు రచయితల తదనంతరం రచయితలైన డిమాక్, ఫెలిక్స్ నీగ్రో, ఎఫ్. ఎమ్. మూర్క్స్, పిఫ్నర్, ప్రెస్థస్, బర్క్లీ, ఫ్రెడిక్, మోషర్ ల గ్రంథాలు కూడా సంస్థాగత దృకథంతో రచించిన గ్రంథాలే. ఈ విధంగా దాదాపు 1950 దశాబ్దం వరకు ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో సంస్థాగత దృక్పథం ప్రధాన దృక్పథంగా ఉంది.

పైన వివరించిన సంస్థాగత వాదుల రచనలను పరిశీలిస్తే వారు సమర్థవంతమైన, ప్రతిభావంతమైన, ఉత్పాదకమైన నూతన సంస్థలను సృష్టించడంపై కంటే వాడుకలో ఉన్న సంస్థల విశ్లేషణపైనే తమ దృష్టిని కేంద్రీకరించారని గుర్తించవచ్చును. ఈ రచయితలందరూ నిశ్చయతా వాద ధోరణితో పాలనా వ్యవస్థల్లో క్రమబద్ధతను, వాటి మధ్యగల పరస్పర సంబంధాలను గుర్తించటం పైనే ఆసక్తిని ప్రదర్శించారు. సంస్థాగత వాదులు ప్రభుత్వ పాలనను సమర్థవతంగా, ప్రయోజనాత్మకంగా తీర్చిదిద్దటంపై కంటే విభిన్న పాలనా వ్యవస్థలు, సంస్థలు ఏ విధంగా పని చేస్తాయో వివరించడానికే తమ విశ్లేషణను పరిమితం చేశారు. ఈ విధంగా ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో సంస్థాగత దృక్పథం తులనాత్మకేతర ( Non - Comparative), వివరణాత్మక, సంకుచిత, నిశ్చల దృక్పథంగా రూపుదిద్దుకుంది. తన పరిమితులు, బలహీనతల వల్ల సంస్థాగత దృక్పథం 1940 దశాబ్దంలో ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ప్రారంభమైన ప్రవర్తనా వాద ఉద్యమం వల్ల తన ప్రాధాన్యతను కోల్పోయింది.

### 2.4.3 తులనాత్మకపాలన, ప్రగతిపాలన అధ్యయనాల్లో సంస్థాగత దృక్పథం

తన బలహీనత వల్ల సంస్థాగత దృక్పథం ప్రాధాన్యతను కోల్పోయినప్పటికీ తన ఉనికిని పూర్తిగా కోల్పోలేదు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రభుత్వపాలనా శాస్త్రంలో ప్రవేశించిన తులనాత్మక పాలన, ప్రగతి పాలన వంటి నూతన అధ్యయనాలలో కూడా సంస్థాగత వాదం ఛాయలను గుర్తించవచ్చును. తులనాత్మక పాలనా రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా సంస్థల తులనాత్మక అధ్యయనం పై అసాధారణమైన ఆసక్తిని ప్రదర్శించారు. రిగ్స్,సైన్ సాడ్, ఫెరల్ హేడీ, ఆల్ఫ్రెడ్ డెమంట్ వంటి ప్రముఖ తులనాత్మక పాలనా రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలనా వ్యవస్థలు, నిర్మాణాలను విస్తృతంగా అధ్యయనం చేశారు. ప్రధానంగా వారు పాలన సంస్థలలో అత్యంత కీలకమైన ఉద్యోగిబృంద వ్యవస్థపై తమ దృష్టిని కేంద్రీకరించి అనేక పరికల్పనలను, ఊహలను ప్రతిపాదించారు. రిగ్స్ అభివృద్ధి

BRAOU

చెందుతున్న దేశాల పాలనా సంస్థలు, నిర్మాణాల అవగాహన ఆవశ్యకతను వక్కాణించటమే గాక వాటిపై తన అధ్యయనాల ఆధారంగా విశిష్టమైన, ఉత్తేజపూరితమైన ఊహనలను ప్రతిపాదించాడు. రిగ్స్ వివిధ సమాజాలలోని పాలనా సంస్థలనే గాక సమాజంలోని మొత్తం సంస్థలను అధ్యయనం చేశాడు. రిగ్స్ సంస్థాగత దృక్పథానికి విస్తృత ప్రాతిపదికను ఏర్పరచాడు.

ప్రగతి పాలనా రచయితలైన వీడ్నర్, ఈస్మన్, స్వేడ్లో, పాయ్‌పనన్ దీకర్, షేర్ ఉడ్, వేస్ట్‌కాట్, కేంపే హస్‌లు ప్రగతిపాలనలో ప్రణాళికా సంస్థలు, అభివృద్ధి శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు మొదలగునవి నిర్మాణాల ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ఈ రచయితలు ప్రగతి పాలన నిర్వాహణకు సంస్థీకృతం చేసిన వ్యవస్థలను ఏర్పాటు చేయాలనీ, పాలనా వ్యవస్థల సామర్థ్యాన్ని మెరుగు పర్చేందుకు చేపట్టే సంస్కరణలను, నవ కల్పనలను లాంఛన ప్రాయమైన వ్యవస్థల ద్వారా ప్రవేశ పెట్టి కొనసాగించాలని వాదించారు. కాగా హెరాల్డ్ కెడన్ పాలనా సంస్కరణలను సంస్థీకృతం చేయాలని బలంగా వాదించిన ప్రగతి పాలన రచయిత.

## 2.4.4 సంస్థాగత నిర్మాణం భావన

1960 దశాబ్దంలో ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో సంస్థాగత దృక్పథాన్ని పునరుజ్జీవింప చేసే ఒక నూతన పోకడ ప్రారంభమైంది. కొందరు పాలనా శాస్త్ర వేత్తలు సంస్థాగత నిర్మాణం ( Institutional Building) అనే నూతన భావనను ప్రవేశపెట్టి, దానిని అభివృద్ధి పర్చేందుకు ప్రయత్నించారు. 1960 లో ఈ భావనను తొలిసారిగా హెర్లాన్ క్లీన్ లాండ్ అనే రచయిత ప్రతిపాదించాడు. 1964 లో అమెరికాలో ఏర్పాటు అయిన అంతర్ విశ్వవిద్యాలయాల సంస్థాగత నిర్మాణ పథకం ( Inter - University Programme in Institutional Building) సంస్థాగత నిర్మాణం భావనపై అనేక పరికల్పనలను, ఊహనలను ప్రతిపాదించింది. ఈ పథకం సంస్థాగత నిర్మాణాన్ని ఈ విధంగా నిర్వచించింది. "సంస్థాగత నిర్మాణం అంటే నూతన వ్యవస్థలను సృష్టించటంలో (లేదా) అమలులో ఉన్న వ్యవస్థల పునః వ్యవస్థీకరణలో అనుసరించే ప్రణాళికీకరణ, రూపకల్పన మార్గదర్శక సూత్రాలు". ఈ పథకం సంస్థా నిర్మాణం నిర్వహించే విధులను కూడా పేర్కొంది. అవి : 1. ప్రామాణిక (Normative) క్రియాశీలక విధులను అభివృద్ధి పర్చి పరిరక్షించటం , 2. పరిసరాలలోని విలువైన విధులను, సేవలను నిర్వర్తించటం, 3. నూతన భౌతిక, సామాజిక, సాంకేతిక పరిజ్ఞానాలను సమైక్య పర్చడం. ఈ పథకం ప్రభావం అనేక మంది పాలనా రచయితలపై ప్రసరించటంతో వారు సంస్థాగత నిర్మాణం ప్రక్రియను వివరించే అధ్యయనాలను చేపట్టారు. వారిలో సాల్ కాట్జ్‌ను ప్రధానంగా పేర్కొనవచ్చును.

కాట్జ్ వ్యవస్థా దృక్పథాన్ని వర్తించి సంస్థాగత నిర్మాణం ప్రక్రియను విశ్లేషించాడు. వ్యవస్థా దృక్పథానికి అనుగుణంగా కాట్జ్ ప్రతి సంస్థను ఒకే వ్యవస్థ (System) గా పరిగణించాడు. ఈ వ్యవస్థ ఉత్పత్తి, ఉత్పదకాలు, అంశాలు, అవరోధాలు అనే నాలుగు భాగాలను ఉప వ్యవస్థలుగా పరిగణించవచ్చును. అవి పరస్పరం సంబంధం కలిగి ఉండుటయేకాక పరస్పర ఆధారితాలు. అభివృద్ధి సంస్థలు తమ పరిసరాలతో ప్రతిస్పందిస్తూ వాటిని ప్రభావితం చేస్తూ, వాటి చేత ప్రభావితం అవుతాయని కాట్జ్ వివరించాడు.

## 2.4.5 సంస్థాగత దృక్పథం విశిష్టత

ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనం తొలి దశలో సంస్థాగత దృక్పథం ఆధిక్యత వహించింది. ఈ దశలో ప్రభుత్వ పాలనా శాస్త్రంలోని దాదాపు మొత్తం అధ్యయనాలు, పరిశోధనలు సంస్థాగత దృక్పథానికి

అనుగుణమైనవే. ప్రభుత్వ పాలనా శాస్త్ర తరువాత దశల్లో ప్రవర్తనా దృక్పథం, ఉద్యోగి స్వామ్య దృక్పథం తులనాత్మక పాలన దృక్పథం, ప్రగతి పాలన దృక్పథం, ఆవరణ దృక్పథం ప్రాబల్యాన్ని సంతరించుకొనటంతో సంస్థాగత దృక్పథం ప్రాముఖ్యత క్షీణించింది. అయినప్పటికీ, ఈ దృక్పథాన్ని పాలనా రచయితలు పూర్తిగా తిరస్కరించలేదు. తులనాత్మక పాలన, ప్రగతి పాలన రచయితలు పాలనా సంస్థల ప్రాధాన్యతను వక్కాణించి, వాటిని తులనాత్మక, ఆవరణ దృక్పథాల దృక్కోణం నుంచి అధ్యయనం చేశారు. ఈ విధంగా సంస్థాగత దృక్పథం వర్తమాన ప్రభుత్వ పాలనా శాస్త్ర దృక్పథాలలో అంతర్లీనంగా వుంది. పాలనా లక్ష్యాలను సాధించుటలో పాలనా సంస్థలు కీలక పాత్ర వహిస్తాయనే వాస్తవమే సంస్థాగత దృక్పథానికి ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో శాశ్వత స్థానాన్ని ఏర్పరచింది.

## 2.5 ముగింపు

ఈ భాగంలో వివరించిన తులనాత్మక పాలన అధ్యయనంలోని మూడు ప్రధాన దృక్పథాలు (ఉద్యోగిస్వామ్య దృక్పథం, వ్యవస్థా దృక్పథం, సంస్థాగత దృక్పథం) విశిష్టమైనవి, ప్రయోజనాత్మకమైనవి. తులనాత్మకపాలన తన ప్రధాన లక్ష్యమైన సిద్ధాంత నిర్మాణం (లేదా) నమూనా నిర్మాణాన్ని సాధించటంలో ఈ మూడు దృక్పథాలు కీలకమైన పాత్రను నిర్వహించాయి. ప్రధానంగా ఉద్యోగిసామ్య నమూనా వల్ల తులనాత్మక పాలన అధ్యయనానికి చేకూరిన ప్రయోజనం అమోఘం. పెక్కుమంది తులనాత్మక పాలనా రచయితలు వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనా ప్రాతిపదికగా అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగిబృంద వ్యవస్థను అధ్యయనం చేశారు. ఈ నమూనా తులనాత్మక పాలనలో విశేషమైన స్థాయిలో ఆచరణాత్మక పరిశోధన జరిగేందుకు మూలకారణమైంది. కాగా రిగ్స్ వ్యవస్థా దృక్పథం తులనాత్మక పాలనా అభివృద్ధికి చేసిన సేవ అద్వితీయం. రిగ్స్ వ్యవస్థా దృక్పథం వల్ల తులనాత్మక పాలనా అధ్యయనానికి సృజనాత్మక విలువ ఏర్పడటవేగాక, ఆ అధ్యయన సరిహద్దులు విస్తృతమయ్యాయి. రిగ్స్ పారదర్శనిక సమాజం నమూనా తులనాత్మక పాలనలో ఆచరణాత్మక, బహుళ శాస్త్ర పరిశోధనకు విస్తృతమైన అవకాశాలను, మార్గాలను సూచించింది. తులనాత్మక పాలన పరిశోధనకు రిగ్స్ నమూనా కల్పించినంత ప్రేరణ మరే ఇతర నమూనా కల్పించలేదనేది వాస్తవం. రిగ్స్ నమూనా ప్రభావం వల్ల చైనా, భారతదేశం, పాకిస్తాన్, జపాన్, ఈజిప్ట్, మలేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ మొదలైన అనేక వర్ధమాన దేశాల పాలనా వ్యవస్థలపై వినూత్న పంథాలో, విస్తృతమైన స్థాయిలో పరిశోధనలు సాగుతున్నాయి. ఈ పరిశోధనల వల్ల ఈ దేశాల పాలనా వ్యవస్థలపై విలువైన, ప్రయోజనాత్మకమైన సమాచారం లభ్యమవుతున్నది. ఈ సమాచారం అధ్యయన, ఆచరణాత్మక రంగాలకు ఎంతో ఉపయోగిస్తున్నది. చివరిగా సంస్థాగత దృక్పథం పాలనా సంస్థల విశ్లేషణపై ప్రాధాన్యతను వక్కాణించి వాటి అధ్యయనానికి అవగాహనకు తోడ్పడింది. ఈ మూడు దృక్పథాలు విభిన్న అంశాలపై తమ దృష్టిని కేంద్రీకరించినప్పటికీ వాటిని భిన్నమైన దృక్పథాలుగా గాక పరస్పర ఆధారితమైన దృక్పథాలుగా పరిగణించాలి. ఈ మూడు దృక్పథాలు తరచు అంతర్లీనంగా సంయోగం చెందడం గుర్తించవచ్చును. ఉద్యోగి స్వామ్య దృక్పథం, ఉద్యోగి బృందం సమాజంలోని గత వ్యవస్థల సంబంధాలపై కూడా తన దృష్టిని కేంద్రీకరించినట్లే వ్యవస్థా దృక్పథం విశ్లేషణలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థకు కీలకస్థానం ఉంది. కాగా ఈ రెండు దృక్పథాలలో పాలనా సంస్థల విశ్లేషణ ప్రధాన అంశం. కాబట్టి ఈ మూడు దృక్పథాలను సమగ్ర దృష్టితో పరిశీలించాలి. మొత్తం మీద ఈ మూడు దృక్పథాల వల్ల తులనాత్మక పాలన అధ్యయనమేగాక మొత్తం ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనం సైద్ధాంతికంగా ఆచరణాత్మకంగా బలపడ్డాయన్నది నిర్వివాదాంశం.

BRAOU

## 2.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I** ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. మాక్స్ వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాను విమర్శనాత్మకంగా పరిశీలింపుము?
2. తులనాత్మకపాలన సాహిత్యంలో ఉద్యోగిస్వామ్య సిద్ధాంతం ప్రాముఖ్యతను వివరింపుము?
3. తులనాత్మక పాలన అధ్యయనంలో ఫ్రెడ్ రిగ్స్ ప్రతిపాదించిన వ్యవస్థా దృక్పథం ప్రధాన అంశాలను చర్చింపుము?
4. ప్రభుత్వపాలన శాస్త్ర అధ్యయనంలో ప్రతిపాదింపబడిన సంస్థాగత దృక్పథాన్ని పరిశీలింపుము?

**II** ఈ క్రింది ప్రశ్నలకు 10 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. మాక్స్ వెబర్ ప్రతిపాదించిన అధికార వర్గీకరణను వివరింపుము?
2. వెబర్ ప్రతిపాదించిన ఉద్యోగిస్వామ్య సిద్ధాంతం పైగల విమర్శలను పరిశీలింపుము?
3. డెవిడ్ ఈస్టన్ వ్యవస్థా దృక్పథాన్ని విశ్లేషింపుము?
4. గేబ్రియల్ ఆల్మండ్ ప్రతిపాదించిన నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని చర్చింపుము?
5. సంస్థాగత నిర్మాణ దృక్పథంలోని కీలక అంశాలను పరిశీలింపుము?

## 2.7 చదువదగిన రచనలు


1. Ramesh K. Arora, Comparative Public Administration: An Ecological Approach, New Delhi ; Associated Publishing House, 1972
2. F.W. Riggs, Adiministation in Developing Countries: The Theory of Prismatic Society, Bostan, Houghton Miffin co, 1964.
3. F.W. Riggs(ed), Frontiers of Development Administration, Duke University Press, Durham 1970
4. Max Weber, From Max Weber, Essays in Sociology : Translated edited and with an introduction by H.H.Gerth Andt C. Wright Mills, Oxford University Press, New York, 1946.
5. Faisal S.A. Al-Salem, The Ecological Dimension of Development Administration , Associated Publishing House, New Delhi 1977.
6. Gerald R. Caiden, The Dynamics of Public Administration : Guidelines to Current Trasformations in Theory and Practice, Hort, Rinhart Winston, New York 1971.


రచయిత: యం. బాపూజీ

BRAOU

# భాగం – 3 : ప్రగతిపాలన: భావన, పరిధి, ప్రాధాన్యత

విషయక్రమం


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 ప్రగతి పాలన నిర్వచనం

3.3 ప్రగతిపాలన లక్షణాలు

3.3.1 లక్ష్యసాధన, క్రియాశీలక దృక్పథం

3.3.2 మార్పు దృక్పథం

3.3.3 ప్రణాళికీకరణ

3.3.4 నవకల్పనత్వం

3.3.5 లబ్ధిదారుల దృక్పథం

3.3.6 ప్రజాభాగస్వామ్యం

3.3.7 ద్విముఖత్వం

3.4 ప్రగతిపాలన సాధనాలు

3.4.1 పాలనా వ్యవస్థ

3.4.2 రాజకీయ వ్యవస్థ

3.4.3 స్వచ్ఛంద సేవా సంస్థలు

3.4.4 ప్రజాసంస్థలు

3.5 ప్రగతిపాలన – సంప్రదాయ పాలన ద్విభాజత్వం

3.6 ప్రగతిపాలన సందర్భాలు

3.6.1 రాజకీయ సందర్భం

3.6.2 ఆర్థిక సందర్భం

3.6.3 సామాజిక, సంస్కృతిక సందర్భం

3.7 ప్రగతిపాలన నమూన వైఫల్యం

3.8 ప్రగతిపాలన నమూన విశిష్టత

3.9 ముగింపు

3.10 నమూన పరీక్షా ప్రశ్నలు

3.11 చదువదగిన రచనలు


## 3.0 లక్ష్యాలు

ప్రగతిపాలన భావనలో నిబిడీకృతమైన అంశాలను మీకు పరిచయం చేయడమే ఈ భాగం ప్రధానాశయం. ఇది చదివితే మీరు కింది అంశాలు వివరించగలుగుతారు.

BRAOU

- ప్రగతిపాలన అంటే ఏమిటి?
- ప్రగతిపాలన లక్షణాలు,
- ప్రగతిపాలన ప్రధాన సాధనాలు,
- ప్రభుత్వపాలనకు, ప్రగతిపాలనకు మధ్యబేధం
- ప్రగతిపాలన ప్రాధాన్యత, లోపాలు.

## 3.1 పరిచయం

సామాజిక శాస్త్రాలలోని వివిధ ఉప అధ్యయనాంశాల మాదిరే ప్రగతి పాలన కూడా ఒక విశిష్టమైన ప్రత్యేకమైన అధ్యయన ఆచరణాత్మక విషయంగా స్థిరపడింది. ప్రధానంగా ప్రగతి పాలన రెండవ ప్రపంచయుద్ధానంతరం అవతరించిన దృగ్గోచరం. ప్రగతి పాలన సమాజంలో గరిష్టస్థాయిలో సామాజిక, ఆర్థిక, అభివృద్ధిని సాధించే ఆశయంతో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలను అమలు, నిర్వహణా ప్రక్రియలను అధ్యయనం చేసే విషయంగా అవతరించి, అభివృద్ధి చెందింది. 1960 దశాబ్దంలో ప్రభుత్వపాలన శాస్త్రంలో ఒక ఉప అధ్యయన రంగంగా ప్రగతిపాలన తులనాత్మక పాలన రచయితల కృషి వలన మేథో పరస్థాయిని చేరుకుంది. తులనాత్మక పాలన చేత గుర్తింపు పొందిన నాటినుండి ప్రగతి పాలన అధ్యయనా రంగంలో వేగంగా అభివృద్ధి చెందిన సాహిత్యం, ప్రగతిపాలన విజ్ఞాన సముదాయాన్ని సృష్టించాయి. నెఫ్, ద్వివేదీలు ప్రగతిపాలన భావన అవతరణకు దోహదం చేసిన నాలుగు చారిత్రక కారణాలను గుర్తించారు. అవి : (1) శాస్త్రీయ నిర్వహణ ఉద్యమం, (2) రెండవ ప్రపంచ యుద్ధం, గొప్ప ఆర్థిక మాంధ్యం, (3) రెండవ ప్రపంచయుద్ధానంతరం ప్రపంచ ఆర్థిక రంగ పునరుద్ధరణకు చేపట్టిన కృషి, (4) ప్రపంచ ఆదిపత్యం కోసం అమెరికా, రష్యాల మధ్య తలెత్తిన ప్రచ్ఛన్న యుద్ధం.

ఐక్యరాజ్యసమితి ప్రకటించిన మొదటి దశాబ్దం (1961-71) తృతీయ ప్రపంచ దేశాలలో అనేక ఆశలను చిరుగింపచేసింది. దీని ప్రభావం అధ్యయన రంగంపై కూడా ప్రసరించడంలో ప్రభుత్వపాలన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో సాగుతున్న ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ప్రభుత్వపాలన పాత్రపై తమ దృష్టిని కేంద్రీకరించడం ప్రారంభమైంది. ఫ్రెడ్ రిగ్స్, వీడ్నర్, స్వేడ్లో, హ్యాన్‌సన్, గాల్‌బ్రిత్, హిర్స్‌మన్ మొదలైన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి ప్రక్రియలో నిర్వహిస్తున్న ప్రభుత్వం ఉద్యోగి బృంద వ్యవస్థల పెరుగుతున్న పాత్ర మొదలైన అంశాలపై అమితమైన ఆసక్తిని ప్రదర్శించి వాటిపై అనేక అధ్యయనాలను సాగించారు. ఈ పరిణామాల ఫలితంగా ప్రగతి పాలన భావన గుర్తింపు పెంపొందటంతో అది సామాజిక శాస్త్రాలలో ఒక ప్రధాన అధ్యయనాంశంగా అభివృద్ధి చెందింది. మోహిత్ భట్టాచార్య పేర్కొనట్లు ప్రగతిపాలన తన స్వీయ భావనలు, ఊహాగానాలు, పరికల్పనలు, సిద్ధాంతాలు కలిగిన పరిపూర్ణమైన అధ్యయనాంశంగా అవతరించింది. 1960 నుంచి ప్రభుత్వ పాలన శాస్త్రం ఒక నూతన జ్ఞాన సంబంధమైన శాస్త్ర (Epistomology) మైన ప్రగతిపాలన అధ్యయనంగా రూపుదాల్చింది. అంతేగాక ప్రగతి పాలన వివిధ సామాజిక శాస్త్రాలలోని అభివృద్ధి తత్వం (Development Philosophy) ఆచరణలపై విపరీతమైన ప్రభావాన్ని కనబరచి ప్రభుత్వం పాలన సంబంధిత సామాజిక శాస్త్రాల మధ్య సంబంధం ఏర్పరచిన అధ్యయన విషయమైంది. అయినప్పటికి ఒక భావనగా ప్రగతి పాలన అభివృద్ధి చెందుతున్న

BRAOU

దేశాలు తన లక్ష్యాల సాధనలో ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించే స్తోమతను పెంపొందించుకోలేక పోయింది. రిగ్స్ సూచించినట్లు ప్రగతిపాలన అధ్యయనం ఒక స్పష్టమైన నమూనా కానీ స్థిరమైన కార్యచట్రాన్ని కాని రూపొందించుకోలేక పోయింది. రిగ్స్‌తో ఏకీభవిస్తు స్ప్రింగర్ ప్రగతిపాలన అధ్యయన రంగంలో ఆచరణాత్మక పరిశోధనకు మార్గదర్శకత్వం వహించగల, అధ్యయన రంగానికి ఒక నూతన దృక్పధాన్ని సూచించగల సిద్ధాంతాలను రూపొందించక పోవటం ప్రగతి పాలన సిద్ధాంతం ప్రధాన లోపమని పేర్కొన్నాడు.

## 3.2 ప్రగతి పాలన నిర్వచనం

ప్రగతి పాలన అనే భావనను నిర్వహించేందుకు అనేక మంది రచయితలు తీవ్రంగా ప్రయత్నించారు. కేంప్ హోప్ (Kamp Hope) ఒక భావనగా ప్రగతి పాలన తులనాత్మక పాలన ఉప ఉత్పాదకం (by product). అయినప్పటికి, సారాంశం, ఆశయం, దృక్పథాలలో ప్రగతి పాలన తులనాత్మక పాలన కన్నా భిన్నమైందని పేర్కొన్నాడు. ప్రగతిపాలన అనే పదం 1955లో రూపొందించబడింది. ఈ పదం శాంతి భద్రతల పాలన నుంచి అభివృద్ధిని నిర్వహించేపాలనను వేరు పర్చేందుకు రూపొందించబడింది. ఎడ్వర్డ్ వీడ్నర్ ప్రగతి పాలనను నిర్వచించేందుకు ప్రయత్నం చేశాడు. వీడ్నర్ ప్రగతి పాలనను విభిన్న పద్ధతుల ద్వారా అధికారయుతంగా నిర్ధారించబడిన ప్రగతి శీలక రాజకీయ, ఆర్థిక, సామాజిక ఆశయాలను ఎంపిక చేసి సాధించే సాధనం అని నిర్వచించాడు. మెర్లీఫైన్‌సాడ్ ప్రగతి పాలన నవకల్పన (Innovation) తత్వాన్ని నొక్కి చెపుతూ ఈ విధంగా నిర్వచించాడు. 'ప్రగతిపాలన నవకల్పనా విలువల భరితమైంది. సాధారణ అర్థంలో ప్రగతి పాలన ఆధునికీకరణ పారిశ్రామికీకరణ పథంలో పయనిస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలు చేపట్టే మొత్తం నూతన చర్యలను వివరిస్తుంది. సాధారణంగా ప్రగతిపాలన జాతీయాదాయాన్ని పెంచేందుకు ఆర్థికాభివృద్ధి, ప్రణాళికీకరణ, వనరుల సమీకరణ, కేటాయింపుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పరచడంలో నిమగ్నమై ఉంటుంది. ' మాంట్‌గోమరి నిర్వచనం ప్రకారం ప్రగతి పాలన అంటే ఆర్థిక వ్యవస్థలో (వ్యవసాయ రంగం లేదా పారిశ్రామిక రంగం లేదా వాటిని నిర్వహించే పెట్టుబడి') తక్కువ స్థాయిలో రాజ్యం నిర్వహించే సామాజిక సేవల (ప్రధానంగా విద్య, ప్రజారోగ్యం) లో ప్రణాళికా బద్ధమైన మార్పును ప్రవేశపెట్టడం. అయితే మాంట్‌గోమరీ సాధారణంగా ప్రగతిపాలన రాజకీయ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందింప చేయటంలో ఎటువంటి పాత్ర నిర్వహించదని అభిప్రాయపడ్డాడు. జార్జిగాంట్ పాలనా నిర్మాణాలపై ప్రాధాన్యతను వక్కాణిస్తూ ప్రగతి పాలనను ఈ విధంగా నిర్వచించాడు. నిర్ణాంత సామాజిక, ఆర్థిక పథకాలను ఉద్దీపింపజేసి, అమలు చేసే విధంగా ప్రభుత్వ సంస్థల వ్యవస్థీకరణ, పాలనపై దృష్టిని కేంద్రీకరించే ప్రభుత్వపాలన అంశమే ప్రగతిపాలన ప్రగతి పాలన. ప్రగతి ప్రక్రియకు నిర్వహణ నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా వర్తింప చేస్తుంది.

జార్జి గాంట్ దృక్పథాన్ని అనుసరిస్తూ డోనాల్డ్ స్టోన్ (Donald Stone) ప్రగతి పాలనను ఈ విధంగా నిర్వచించాడు. ప్రగతిపాలన ఆమోదించిన లక్ష్యాలను సాధించేందుకు మానవ, భౌతిక వనరులను, అంశాలను సమైక్యపరిచే ఒక నిర్దిష్ట ప్రయత్నం. ప్రగతిపాలన నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధి లక్ష్యాల సాధనకు పరస్పర సంబంధం గల ప్రణాళికలు, విధానాలు, పథకాలు, ప్రాజెక్టులు, ఇతర చర్యలను రూపొందించి అమలు పర్చి,

BRAOU

మూల్యాంకన చేసే ప్రక్రియ. ఈ దృక్పథానికి భిన్నంగా బెట్రాంగ్రాస్ (Betram Gross) ప్రగతిపాలన పాలనా సంకేతిక పద్ధతులూ, ప్రక్రియలపైన కాక ఫలితాల సాధనపైన తన దృష్టిని కేంద్రీకరిస్తుందని పేర్కొన్నాడు. ఇంకా కొందరు రచయితలు ప్రగతి పాలన మార్పు ప్రణాళికీకరణ లక్షణాలపై ప్రాధాన్యతను వక్కాణిస్తూ ఆ పదాన్ని నిర్వచించారు. ఉదాహరణకు పాయ్ పనన్ దీకర్ (Pai Panandiker) ప్రగతి పాలన అనేపదం మార్పు ప్రక్రియ లేదా ప్రణాళికా బద్ధమైన మార్పు పాలనతో ముడిపడి వుందని పేర్కొన్నాడు. పాయ్ పనన్‌దీకర్ సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పు సాధనకు ఉద్దేశింపబడిన పథకాలు, ప్రణాళికలను అమలు పర్చేందుకు అవసరమైన నిర్మాణం, వ్యవస్థీకరణ, వ్యవస్థ ప్రవర్తనలను ప్రగతిపాలనగా భావించవచ్చునని పేర్కొన్నాడు.

ప్రగతి పాలనపై ఫ్రెడ్ రిగ్స్ రూపొందించిన నిర్వచన చట్రం ప్రగతి పాలన పరస్పర సంబంధం కలిగిన రెండు అంశాలైన అభివృద్ధి పథకాల పాలన, పాలనాభివృద్ధుల మధ్య ఆవశ్యక భిన్నత్వం ఉందనే అంశాన్ని నొక్కి వక్కాణిస్తుంది. ప్రగతిపాలనకు రిగ్స్ రూపొందించిన నిర్వచనం ఈ విధంగా ఉంది. అభివృద్ధి ఆశయాల సాధనలో నిమగ్నమైన వ్యక్తులు రూపొందించిన పథకాలు ప్రాజెక్టులను నిర్వహించే వ్యవస్థీకృత కృషి ప్రగతిపాలన అనవచ్చును. ప్రగతి పాలన అనేపదం వ్యసాయం, విద్య, సాంఘిక, సంక్షేమ రంగాల అభివృద్ధి అవసరమైన పథకాలను అమలు పర్చేందుకు వ్యవస్థీకృత కృషి సాగించే వ్యవసాయ పాలన, విద్యాపాలన, సాంఘిక సంక్షేమ పాలన మొదలైన భావాలతో సారూప్యత కలిగి వుంది. రిగ్స్ భౌతిక, మానవ, సాంస్కృతిక పరిసరాలను పునర్ నిర్మించేందుకు రూపొందించిన పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం చేపట్టే కృషినే గాక పై పథకాలను అమలు పర్చేందుకు ప్రభుత్వ పాలన సమర్థతను పెంపొందింప చేసేందుకు చేపట్టే కృషిని కూడా ప్రగతిపాలనగా భావించవచ్చునని పేర్కొన్నాడు.

రిగ్స్ దృక్పథంతో ఏకీభవిస్తూ కేంపేహూప్ సందర్భం (context) ఆచరణాత్మక భావాలతో ప్రగతి పాలనను అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఒక దేశం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వ్యవస్థీకరణ, నిర్వహణను తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రభుత్వ పాలనా పరిస్థితుల చైతన్యం పూరిత అధ్యయనంగా పరిగణించవచ్చునని సూచించాడు. కేంపేహూప్ పరిపూర్ణ అర్థంలో ప్రగతిపాలన అభివృద్ధి లక్ష్యాలు, ఆశయాలకు సంబంధించిన నిర్ణయీకరణ ప్రణాళికా రూపకల్పన మొదలైన ప్రభుత్వ విధానాలను నిర్దేశించే ప్రతిచర్యను నిర్వహిస్తుందని పేర్కొన్నాడు.

BRAOU

1970 దశాబ్దంలో ప్రగతిపాలనను నిర్వచించడంలో ప్రభుత్వ పాలనా రచయితల దృక్పథంలో గణనీయమైన మార్పు సంభవించింది. ప్రగతిపాలనను నిర్వచించడంలో ప్రగతి అంశానికి గతం కన్నా అధిక ప్రాధాన్యత కనబర్చబడింది. ప్రధానంగా ఈ పోకడను ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన పాలనా రచయితలలో గుర్తించవచ్చును. ఉదాహరణకు బి.ఎస్.ఖన్నా (భారతదేశం) ప్రగతిపాలనను రాజకీయ శ్రేష్ఠులు, ప్రజా సమూహాలు సృష్టించే పెరుగుతున్న ఒరవడి (Trend) , ఊపు (Tempo) విభిన్నత్వం వల్ల ప్రేరేపింపబడిన ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కర్తవ్యాల సాధనకు అనుగుణంగా రూపొందించిన పాలన అని నిర్వచించాడు. కాగా ఇనాయతుల్లా (పాకిస్తాన్) సామాజిక ఆర్థికాభివృద్ధి, జాతి నిర్మాణ సాధనకు ప్రభుత్వం ఏర్పరచిన సంక్లిష్ట వ్యవస్థీకరణ ఏర్పాటు ప్రగతిపాలన అని పేర్కొన్నాడు. కాగా ఇస్లాం, హీనస్ట్‌లు (అరబ్) సామాజిక, ఆర్థిక మార్పుకు దోహదం చేసే విధానాలు పథకాల రూపకల్పన అమలు, మూల్యాంకనను

ప్రగతిపాలన అని నిర్వచించారు. దానికి అనుగుణంగా గ్రామీణ విద్యుద్దీకరణ పథకాలు, కుటుంబ నియంత్రణ పథకాలు, నీటుపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయాభివృద్ధి పథకాలు మొదలైన అభివృద్ధి పథకాలను ప్రగతిపాలన అంశాలుగా భావించవచ్చునని వారు పేర్కొన్నారు.

ఇటీవలికాలంలో ప్రగతిపాలనను నిర్వచించటంలో రచయితల దృక్పథంలో వచ్చిన మరో మార్పు ఏమిటంటే ఈ నిర్వచనాలలో ప్రాధాన్యత ప్రమాణాత్మక దృక్పథం నుంచి ఆచరణాత్మక, నిర్బంధపూర్వక దృక్పథాలకు మార్పు చేయబడింది. ఈ మార్పుకు అనుగుణంగా పాలన రచయితలు ప్రగతిపాలనను కాలాంశ (Temporal), ప్రాదేశిక (Spatial) దృక్కోణాల నుంచి అధ్యయనం చేశారు. జేమ్స్ హూపే ప్రగతి పాలనలో ప్రాదేశిక దృక్కోణం కీలకమైందని సూచించగా హాన్ బీన్ లీ అభివృద్ధి పాలకులలో ప్రగతిశీలక కాలాంశ దృక్పథం ప్రగతిసాధనకు అత్యంత ఆవశ్యక మని వాదించాడు. కాగా జాన్ ఎస్.టి క్వా (John S.T Quah) నిర్వంధ పూర్వక ప్రగతి పాలన భావనను ప్రతిపాదించాడు. క్వా ప్రగతిపాలన ఏకరేఖీయ (Unilrnear) భావన కావటం చేత అది రాజకీయ అవకాశాలను, వైఫల్యాలను పరిగణలోకి తీసుకోదని వాదించాడు. దానికి అనుగుణంగా క్వా ప్రగతి పాలనను జాతి నిర్మాణం, సామాజిక ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు రూపొందించిన అభివృద్ధి పథకాల పాలనే కాక ఈ పథకాలను అమలు పరచేందుకు అవసరమైన పాలనా పద్ధతులు, సంస్థలను అభివృద్ధి పరిచే పాలన అని నిర్వచించబడును.

ప్రగతి పాలనపై వెలువడిన వివిధ నిర్వచనాలను విశ్లేషిస్తూ ఆచరణాత్మక సందర్భం, కోణాల నుంచి ప్రగతిపాలనను అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఒక దేశం చేపట్టే చర్యల సమర్థవంతమైన వ్యవస్థీకరణ, నిర్వహణ అని అర్థం చేసుకోవచ్చును.అంతేగాక తక్కువ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ పాలన పరిస్థితుల చైతన్యపూరిత అధ్యయనమే ప్రగతిపాలన. ఈ దేశాలలో ప్రభుత్వపాలన నుంచి ఆశించే అంశాల అధ్యయనమే ప్రగతి పాలన, అంటే తక్కువ అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రభుత్వపాలన లక్ష్యాలు, వాటిని సాధించేందుకు చేపట్టే కార్యక్రమాలు, ఉపయోగించే పద్ధతులు, సంస్థలు, ప్రక్రియలు, ఉద్యోగి బృందం మొదలైన మొత్తం అంశాల సమగ్ర చైతన్య పూరిత అధ్యయనమే ప్రగతిపాలన. ప్రగతిపాలన విభిన్న ఆశయాలు, విధులు, నిర్మాణాలు, ప్రవర్తనా అంశాలు, కాలాంశ దృక్కోణం కలిగిన ప్రభుత్వ పాలన ప్రత్యేక అంశం. ప్రగతిపాలన కేవలం అభివృద్ధి పథకాలు, విధానాలను అమలు పర్చుటకే కాక సామాజిక, ఆర్థిక రంగాలలో నిర్మాణ పరమైన మార్పును ప్రవేశపెడుతుంది.

BRAOU

## 3.3 ప్రగతిపాలన లక్షణాలు

ప్రగతిపాలనపై గల అనేక నిర్వచనాలను పరిశీలిస్తే ఆ భావన లక్షణాలను గుర్తించవచ్చును. వాటిలో ప్రధానమైన లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 3.3.1 లక్ష్యసాధన, క్రియాశీలక దృక్పథం (Goal action orientation)

ప్రగతిపాలన భావనపై గల వివిధ నిర్వచనాల విశ్లేషణ వల్ల సందర్భం, ఆచరణాత్మక దృక్కోణాల నుంచి ప్రగతిపాలనను అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఒక దేశం నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల వ్యవస్థీకరణ,

నిర్వాహణగా భావించవచ్చును. అంటే అభివృద్ధి ప్రణాళికలు పథకాల సమర్థవంతమైన అమలుకు శక్తివంతమైన పాలనా యంత్రాంగాన్ని ఏర్పరచేందుకు నాడుకలో వున్న పాలన సంస్థలను సమాయత్తపర్చడం, నూతన సంస్థలను సృష్టించడం ప్రగతిపాలన అని దీని భావం. అంతేగాక పాలనా నిర్మాణాలను ఉద్యోగి బృంద విధానాలను, భావప్రసారం, నాయకత్వకార్యశైలిని అభివృద్ధి లక్ష్యాల సాదనకు ఉన్ముఖం చేయటం కూడా ప్రగతిపాలనగా పరిగణించాలి. ఈ విధంగా ప్రగతిపాలనను ప్రధానంగా, లక్ష్యసాధన, క్రియాశీలక దృక్పథాలు గల పాలన వ్యవస్థగా పరిగణించాలి. ప్రగతిపాలన లక్ష్యసాధన, క్రియాశీలక దృక్పథాన్ని ఏడ్వర్డ్ వీడ్నర్ ప్రతిపాధించగా రిగ్స్ మొదలైన రచయితలు బలపర్చారు. వీడ్నర్ ప్రగతిపాలన ప్రగతిశీలక రాజకీయ, ఆర్థిక, సామాజిక లక్ష్యాలసాధనలో నిమగ్నమైన పాలనా వ్యవస్థగా పరిగణించాడు. రిగ్స్ ఆర్థిక ఉత్పత్తి, వినియోగాల స్థాయిలో పెరుగుదల, న్యాయం, భద్రత సమైక్యతలు ప్రగతిపాలన లక్ష్యాలని పేర్కొన్నాడు.

### 3.3.2 మార్పు దృక్పథం (Change Orientaion)

ప్రగతి పాలన మార్పుశీలక దృక్పథం గల భావన. సామాజిక, ఆర్థిక మార్పు ప్రగతిపాలనలో కీలకాంశం. అందుచేత ప్రగతిపాలన గతిశీలమైన భావన. ప్రగతిపాలన భావన సాంప్రదాయ దశ నుంచి ఆధునిక దశకు పరివర్తన చెందే సమాజాలకు వర్తిస్తుంది. ప్రగతిపాలన అంతర్లీనంగా దాగిన మార్పు భావన. పాలనా వ్యవస్థ బాహ్య పరిసరాలతో సర్దుబాటు చేసుకునే స్థోమతతోపాటు అంతర్గత నిర్మాణాల క్రియాశీలకత్వం పెంపొందింపజేసే స్థామతను అలవర్చుకునేందుకు దోహదం చేసే వ్యూహం. ప్రగతి పాలనకుగల మార్పు దృక్పథం ప్రగతిపాలనను యథాస్థితిని కొనసాగించే దృక్పథంగల సాంప్రదాయ లేదా నిర్బంధ పాలన నుంచి వేరు పరుస్తుంది.

### 3.3.3 ప్రణాళికీకరణ (Planning)

ప్రగతి పాలనకు ప్రణాళికీకరణ అత్యవసరము. భౌతిక, ఆర్థిక, మానవ వనరులు కొరతగా వున్న వెనుకబడిన దేశాలలో ప్రణాళికీకరణ ప్రాధాన్యత మరంత కీలకమైంది. కొరతవున్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రణాళీకీకరణ ఒక చక్కని సాధనంగా గుర్తించబడింది. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక, సామాజికాభివృద్ధికి ప్రణాళికా బద్ధమైన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ప్రగతిపాలన ప్రణాళికా దృక్పథాన్ని పాయ్‌పసన్ దీకర్, ఫైన్‌సాడ్ మాంట్‌గోమరి మొదలైన రచయితలు నొక్కి చెప్పారు. ఫైన్‌సాడ్ ప్రగతిశీలక ప్రణాళికీకరణలో నిమగ్నమైన ప్రభుత్వం అవలంబించే నూతన మార్గాన్ని ప్రగతి పాలనగా పరిగణించాడు. మాంట్‌గోమరి ప్రగతిపాలన అంటే ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికా బద్ధమైన మార్పును ప్రవేశపెట్టడంలో నిమగ్నమైన పాలన అని పేర్కొన్నాడు. కాగా పాయ్‌పసన్ దీకర్ ప్రగతిపాలన భావన మార్పు ప్రక్రియతో లేదా ప్రణాళికాబద్ధమైన మార్పును సాధించే పాలనతో సన్నిహితంగా ముడిపడి వుందని సూచించాడు. ఈ రచయితల వాదనతో విభేదిస్తూ వీడ్నర్ ప్రగతి పాలనకు ప్రణాళికీకరణ అత్యవసరం కాదని వాదించాడు.

BRAOU

### 3.3.4 నవకల్పన తత్వం (Innovativeness)

ప్రగతిపాలన సాంప్రదాయబద్ధమైన ఛాందస భావన కాదు. దీనికి భిన్నంగా ప్రగతిపాలన నవ్యత్వం, నవకల్పనా విలువల భరితమైన భావన. ఎందుచేతంటే ప్రగతిపాలన అభివృద్ధి లక్ష్యాలసాధనకు నూతన నిర్మాణాలు, పద్ధతులు, ప్రక్రియలు, నైపుణ్యం, విధానాలు, పథకాలను గుర్తించి అనుసరిస్తుంది. ప్రగతిపాలన నవకల్పన తత్వాన్ని వక్కాణించిన రచయితలలో ఫైన్‌సాడ్ ప్రముఖుడు. ఫైన్‌సాడ్ ప్రగతిపాలనను నవకల్పనా విలువల భరితమైన భావనగా వర్ణించాడు. ఇదే ధోరణిలో డోనాల్డ్ స్టోన్ ప్రగతిపాలన అభివృద్ధి లక్ష్యాల సాధనకు నవకల్పనను ప్రోత్సహించుటకు గాక సాంప్రదాయ పద్ధతులను, దృక్పథాలను నిరుత్సాహ పరుస్తుందని సూచించాడు.

### 3.3.5 లబ్ధిదారుల దృక్పథం (Clientele Perspective)

ప్రగతిపాలన లబ్ధిదారులు దృక్పథం గల పాలన వ్యవస్థ. ప్రగతి పాలన నిర్ధారిత లబ్ధిదారుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన సేవలను వారికి అందజేస్తుంది. తనలబ్ధిదారుల అభివృద్ధి సాధనే ప్రగతిపాలన ఏకైక లక్ష్యం. ఈ లక్ష్యసాధన దిశలో ప్రగతిపాలన అనేక పథకాలు, ప్రణాళికలు, విధానాలను రూపొందించి, అమలు పరుస్తుంది. ఈ విధంగా లబ్ధిదారుల ప్రయోజనాలకు అవసరాలకు ప్రతిస్పందించే లక్షణం ప్రగతిపాలనను సాధరణ పాలన నుంచి వేరు పర్చి ఆ పాలనకు ఒక విశిష్టతను చేకూరుస్తుంది.

### 3.3.6 ప్రజా భాగస్వామ్యం (Peoples Participation)

ప్రగతి పాలనలో ప్రజల భాగస్వామ్యానికి కీలకమైన ప్రాధాన్యత ఉంది. ప్రగతిపాలన లక్ష్యాలైన ఆర్థిక ప్రగతి, సామాజిక మార్పులను సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని గుర్తించబడింది. ఇటీవలి కాలంలో అభివృద్ధి వ్యూహాలను రచిస్తున్న ప్రణాళికాకర్తలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, ప్రజల భాగస్వామ్యంతో కూడిన అభివృద్ధి విలువలను నొక్కి చెప్తున్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని సాధించడం అసాధ్యమని వారు ఉద్ఘాటిస్తున్నారు. రాండ్‌వెల్లి, ఛీమా అనే రచయితలు అభివృద్ధి ప్రక్రియ విజయం వికేంద్రీకృత నిర్ణయీకరణ, ప్రజల భాగస్వామ్యంపైనే ఆధారపడి ఉన్నాయని వాదించారు. కేంప్‌హెహాప్ ప్రజల భాగస్వామ్యం ప్రగతి పాలనకు అవశ్యకమైనట్లు ప్రభుత్వ పాలన మరే ఇతర అంశానికి ఆవశ్యకం కాదని ఉద్ఘాటించాడు. కాగా డోనాల్డ్ స్టోన్ అభివృద్ధి పథకాల లక్ష్యాల రూపకల్పనలో విధానాలు, వాటిని అమలు పరిచేసాధనాలను నిర్ధారించడంలో ప్రజల భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలని సూచించాడు. కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం ప్రగతి పాలన ప్రక్రియలోని నాలుగు దశలలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించవచ్చును. అవి (1) నిర్ణయీకరణ, (2) అమలు, (3) లాభాలను అనుభవించటం, (4) మూల్యాంకనం.

ప్రగతి పాలనలో ప్రజల భాగస్వామ్యం కల్పించేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలు వివిధ పథకాలను రూపొందించాయి. భారతదేశంలో స్థాపించిన పంచాయితీ రాజ్ వ్యవస్థ, బంగ్లాదేశ్‌లో ప్రారంభించిన స్వానివర్ (Swanivar) ఉద్యమం, మెక్సికోలో అమలు పరుస్తున్న పైడర్ (Paider) పథకం, దక్షిణ కొరియాలో ప్రారంభించిన సాయిమువుల్ అన్ దంగ్ (Saemual undog) ఉద్యమం ఇజ్రాయిల్‌లో

BRAOU

స్థాపించిన కిబూటిన్ (Kibutin) సంస్థలు పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చేపట్టిన పథకాలే.

### 3.3.7 ద్విముఖత్వం (Two sidedness)

ప్రగతి పాలనపై గల సాహిత్యాన్ని విశ్లేషిస్తే ఈ భావన పరస్పర సంబంధం కలిగిన రెండు భావాలలో ఉపయోగించినట్లు గుర్తించవచ్చును. ఒక భావంలో అభివృద్ధి పథకాల పాలన, అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలు, విధానాలలో ఉపయోగించే సాంకేతిక పద్ధతులు, సాధనాలను ప్రగతి పాలనగా భావించవచ్చును. కాగా రెండవ భావంలో ప్రగతి పాలన అభివృద్ధి పథకాలను విధానాలనుసమర్థవంతంగా అమలు పర్చేందుకు, పాలనా వ్యవస్థ సమర్థతను పెంపొందింప చేసేందుకు పాలనా పద్ధతులను, సంస్థలను అభివృద్ధి పరుస్తుంది. ఈ విధంగా ప్రగతి పాలన భావనలో అభివృద్ధి పాలన, పాలనాభివృద్ధి అనే రెండు పరస్పర సంబంధం కలిగిన అంశాలు ఇమిడివున్నాయి.

ప్రగతి పాలన ద్విముఖత్వాన్ని నొక్కి వక్కాణించిన రచయితలలో ఫ్రెడ్ రిగ్స్ ప్రముఖుడు. రిగ్స్ ప్రగతిపాలన ఒక ప్రక్క వివిధ పథకాలను అమలు పర్చడం ద్వారా భౌతిక అవసరాలను మార్పు చేసేందుకు ప్రయత్నిస్తుందనీ, మరో ప్రక్క ఈ పథకాలను విజయవంతంగా అమలు పర్చేందుకు పాలనా వ్యవస్థ సమర్థతను మెరుగు పర్చేందుకు ప్రయత్నిస్తుందనే వాదించాడు. రిగ్స్ తన వాదనను కొనసాగిస్తు పరిసరాలలో మార్పులను ప్రవేశపెట్టకుండా పాలన వ్యవస్థను పటిష్టపర్చటం, సాధ్యం కాదనీ, అయితే పాలన వ్యవస్థను పటిష్ట పర్చకుండా పరిసరాలను మార్పు చేయటం అసాధ్యమని పేర్కొన్నారు. ఈ రెండు అంశాల మధ్య వున్న పరస్పర సంబంధం ఎంత సన్నిహితమైందంటే వాటిలో ఏది ప్రధానమైందీ, ఏది ముందు అనే అంశాన్ని తెల్పడం సాధ్యం కాదు. అందుచేత రిగ్స్ ఈ రెండు అంశాల మధ్య సంబంధాన్ని కోడిగుడ్డుల మధ్య ఉన్న కారణకారక సంబంధంతో పోల్చాడు. రిగ్స్ ఇంకా ఈ విధంగా సూచించాడు. పరిపాలనను మెరుగు పర్చడంలో ఎదురయ్యే పరిసరాలలోని అవరోధాలను తొలగిస్తే తప్ప పరిపాలనను మెరుగుపర్చడం సాధ్యం కాదు. కాని అభివృద్ధి పథకాల అమలు పరిచే పాలనా వ్యవస్థను పటిష్ట పరిచే లోపు పరిసరాలు మెరుగుపడవు.

BRAOU

## 3.4 ప్రగతి పాలన సాధనాలు

ప్రగతిపాలన ప్రక్రియ సంక్లిష్టమైంది. ప్రగతి పాలన సాధించవలసిన అభివృద్ధి లక్ష్యాలు, వాటిని సాధించే పద్ధతులు, మార్గాలు కూడా సంక్లిష్టమైనవే. అందుచేత ప్రగతి పాలన కేవలం పాలన వ్యవస్థపై ఆధారపడిమాత్రమే తన లక్ష్యాలను సాధించలేదు. కాబట్టి ప్రగతిపాలన అనేక ఇతర సాధనలపై ఆధార పడక తప్పదు. ప్రగతి పాలన ఆధారపడే సాధనాలలో ప్రధానమైనవి ఈ క్రిందివి.

- పాలనా వ్యవస్థ
- రాజకీయ వ్యవస్థ
- స్వచ్ఛంద సేవా సంస్థలు
- ప్రజావ్యవస్థలు

### 3.4.1. పాలనా వ్యవస్థ (Administrative system)

ప్రగతి పాలన లక్ష్యాలను సాధించటంలో పాలన వ్యవస్థ కీలక పాత్ర వహిస్తుంది. తన అభివృద్ధి లక్ష్యాలైన సామాజిక ఆర్థిక ప్రగతి, జాతి నిర్మాణాలను సాధించటంలో ప్రగతి పాలనకు పాలనా వ్యవస్థ ప్రధాన సాధనం. పాలనా వ్యవస్థ అనేక అభివృద్ధి పథకాలను, ప్రణాళికలను, విధానాలను అమలు పరుస్తుంది. ప్రజల అవసరాలను తీర్చేందుకు వారికి అనేక సేవలను అందిస్తుంది. ఈస్‌మన్ పేర్కొనట్లు అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి పథకాలను ప్రణాళికలను అమలు పర్చేందుకు పాలన వ్యవస్థ ఏకైక సాధనం. ఈ దేశాలలో సామాజిక, ఆర్థిక సాధనలో ప్రభుత్వ పాత్ర విస్తృత మవటంలో పాలన వ్యవస్థ కీలకమైన పాత్రను సంతరించుకుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థను సామాజిక ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు తగిన సాధనంగా తీర్చిదిద్దటం కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు పాలన వ్యవస్థ సమర్థతను మెరుగు పర్చేందుకు పాలన సంస్కరణలను చేపట్టాయి. ఈ సంస్కరణలు మొత్తం పాలనా వ్యవస్థను లేదా ఆ వ్యవస్థలోని కొన్ని కీలక అంశాలను (పాలనా నిర్మాణాలు, బడ్జెట్ విధానం, నిర్వహణ పద్ధతులు, ఉద్యోగి బృందపాలన) మెరుగు పర్చేందుకు రూపొందించబడ్డాయి.

### 3.4.2 రాజకీయ వ్యవస్థ (Political system)

తన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రగతి పాలనకు రాజకీయ వ్యవస్థ సహకారం అత్యంతావశ్యకం. వాస్తవానికి దేశ సామాజిక, ఆర్థిక, అభివృద్ధిని సాధించే ప్రక్రియలో రాజకీయ వ్యవస్థ నిర్వహించే పాత్ర అత్యంత కీలకమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ వ్యవస్థ ప్రగతి శీలక కార్యక్రమాల అమలులో ఉద్యోగి బృందానికి మార్గదర్శకత్వం వహిస్తుంది. ఇస్‌మన్ పరివర్తన చెందుతున్న సమాజాలలో ఆధునీకీకరణ, సామాజిక ఆర్థిక, అభివృద్ధి, జాతి నిర్మాణం, సామాజిక మార్పు మొదలైన లక్ష్యాల సాధనలో అధిక బాధ్యత రాజకీయ శిష్టవర్గాల (Political Elite) పైన ఉంటుందని పేర్కొన్నాడు. ఇస్‌మన్ వివరించినట్లు ఈ దేశాలలో రాజకీయ వ్యవస్థ పాలనా వ్యవస్థను పరిరక్షించుటయేగాక, దాన్ని చైతన్యవంత చేస్తుంది. రాజకీయ నాయకత్వం ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రయోజన గణాల నుంచి ఎదురయ్యే ప్రతిఘటనను నివారిస్తుంది. రాజకీయ పక్షాలు, విద్యావంతులైన పట్టణాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజల మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తాయి. మొత్తం దేశాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు పర్చటంలో, సరళీకృతమైన, కీలకమైన చర్యలను నిర్వహించంలో రాజకీయ వ్యవస్థ శక్తివంతమైన, సమర్థత మైన సాధనంగా పనిచేస్తుంది. కేంపేహెూప్ ప్రగతి పాలనలో రాజకీయ వ్యవస్థ పాత్రను విశ్లేషిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థ సమర్థత రాజకీయ నాయకత్వంపై ఆధారపడి వుంది. జాతీయ అభివృద్ధి ప్రక్రియలో రాజకీయ నాయకత్వం తోడ్పాటు అత్యంత ఆవశ్యకం. సానుకూలమైన రాజకీయ పరిసరాలు నెలకొని ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. అభివృద్ధి ప్రక్రియలో సామాజిక మార్పు, సామాజిక చర్యలు కీలకాంశాలు కావడంచేత ఈ ప్రక్రియకు చైతన్యపూరితమైన రాజకీయ నాయకత్వం, సమాజంలోని కీలక స్థానంలో

BRAOU

ఉన్న ప్రముఖుల సహకారం ఆవశ్యకం. ఈ రెండు పరస్పర సంబంధం కలిగిన అంశాలు. తగిన రాజకీయ సిద్ధాంతాలు, విప్లవాత్మకమైన రాజకీయ చర్యలు, ప్రజల మద్దతును సమీకరించే సమర్థవంతమైన రాజకీయ నాయకత్వం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కాలేవు.

### 3.4.3 స్వచ్ఛంధసేవా సంస్థలు (Voluntary Organisations)

అభివృద్ధి పాలనలో స్వచ్ఛంద సంస్థలు కీలపాత్ర వహిస్తాయనే వాస్తవం విశ్వవ్యాప్తంగా గుర్తించబడింది. ఇంకోమాటలో చెప్పాలంటే, స్వచ్ఛంద సేవా వాదం ఒక సార్వజనీన దృగ్గోచరమైంది. ప్రగతిపాలనకు ప్రధాన సాధనమైన ఉద్యోగి బృంద వ్యవస్థ అనేక దోషాలకు, లోపాలకు కేంద్రంగా పరిగణించబడటం వలన అభివృద్ధి పాలనలో స్వచ్ఛందసేవా సంస్థల పాత్ర, ప్రాముఖ్యత గణనీయంగా పెరిగాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాలు ఘోరంగా విఫలం చెందటంతో అధికార వికేంద్రీకరణ వ్యూహంపై కనపరుస్తున్న ఆసక్తి కూడా స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రాముఖ్యత పెరిగేందుకు కారణమైంది. స్వచ్ఛంద సేవా సంస్థలు వికేంద్రీకృత అభివృద్ధిని సాధించేందుకు అనేక మార్గాలలో తోడ్పడగలవు.

స్వచ్ఛంద సేవా సంస్థలు అభివృద్ధి ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని సమీకరించడంలో చక్కని సాధనాలుగా ఉపయోగపడతాయి ఈ సంస్థలు స్థానిక స్థాయిలో ప్రణాళికీకరణ లక్ష్యాల నిర్ధారణలో తోడ్పడగలవు. ఈ సంస్థలు ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలు (delivery systems) సవర్థవంతంగా పని చేసేందుకు ఆవసరమైన సేవలు అందించగలవు. లబ్దిదారులను గుర్తించడంలో, వారికి ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తేవటంలో, వారికి అవసరమైన సేవలను సకాలంలో అందజేయడంలో స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సంస్థలకు తోడ్పడతాయి. స్వచ్ఛంద సేవా సంస్థలు స్థానిక వనరులను, సమీకరించటం, స్థానిక అవసరాలను గుర్తించటం, అభివ్యక్తం చేయటం ద్వారా అభివృద్ధి పాలన సమర్థతను మెరుగు పరుస్తాయి. ఈ సంస్థలు క్షేత్ర స్థాయి పాలన ప్రజల కోర్కెలకు అవసరాలకు వేగంగా ప్రతిస్పందించేలా ప్రభావితం చేస్తాయి. ఒక రకంగా స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రజలకు ప్రధానంగా బలహీన వర్గాల ప్రజలకు ఉమ్మడి నిర్ణయాలను చేసే అవకాశం ఏర్పరచడం ద్వారా వారిలో బలీయమైన చైతన్యాన్ని పురికొల్పుతాయి. ఈ విధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు అభివృద్ధి పాలనకు ఆవవ్యకమైన అనేక విధులను నిర్వహిస్తాయి.

BRAOU

### 3.4.4 ప్రజాసంస్థలు (Peoples Organisations)

ప్రగతి పాలనకు స్వచ్ఛంద సేవాసంస్థలతోపాటు ప్రజాసంస్థలు కూడా సమర్థవంతమైన సాధనాలుగా ఉపయోగపడతాయి. ప్రజలు ప్రభుత్వ సంస్థలలో కన్న తాము స్వయంగా ఏర్పరుచుకున్న సంస్థలలో చేరేందుకు ఎక్కువగా ఆసక్తిని కనబరుస్తారు. పేద, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు మెరుగైన సేవలను అందించగలగటం వలన ప్రజాసంస్థలకు అనేక దేశాలలో అత్యంత ప్రజాదరణ లభిస్తున్నది. ప్రజా సంస్థలలో పాల్గొనేందుకు ప్రజలు ఉత్సాహం కనబర్చటానికి పెక్కు కారణాలు ఉన్నాయి. వీటి పరిధి పరిమిత ప్రాంతానికే విస్తరించటం వలన అవి ప్రజల సమస్యలను, పరిస్థితులను సులువుగా అవగాహన చేసుకోగలవు. ఈ సంస్థల నాయకులు ప్రజలను సమీకరించటంలో అధిక శ్రద్ధను కనపరుస్తారు. ఈ సంస్థలు ప్రజలు

ఎదుర్కొనే సమస్యలను, విశాల దృక్పథంతో అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఈ సంస్థల నాయకులు, వాటి సభ్యులు సమానమైన సామాజిక, ఆర్థిక, నేపథ్యాన్ని కలిగి ఉంటారు. షబీర్ చీమా పేర్కొన్నట్లు ప్రజా సంస్థలు తమ నికృష్ట పరిస్థితుల పట్ల ప్రజలలో చైతన్యాన్ని పురికొల్పి వాటిని మెరుగు పర్చేందుకు వారిని పోరాటానికి సమాయాత్తపరుస్తాయి.

మిల్టన్ ఇస్మన్ అభివృద్ధి చెందుతున్న దేశాలలోని అనేక గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా వ్యవహరించే కొన్ని నూతన ప్రజా సంస్థలు అవతరించాయని పేర్కొన్నాడు. మధ్యవర్తి (Constituency) సంస్థలుగా వ్యవహరింపదగిన ఈ సంస్థలు రైతు సంఘాలు, మహిళా సంఘాలు, యువకుల సంఘాలు మొదలైన రూపాల్లో ఏర్పాటు చేయబడుతున్నాయని ఇస్మన్ వివరించాడు. అభివృద్ధిచెందుతున్న దేశాల ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధి పట్ల అమితమైన ఆసక్తిని కలిగి ఉన్నప్పటికీ వాటికి గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా వివిధ సేవలను అందచేయటంలో తగిన సమర్థత లోపించడం వలన మధ్యవర్తులైన సంస్థలైన ప్రజాసంస్థల ప్రాధాన్యత క్రమంగా విస్తరిస్తున్నదని ఇస్మన్ సూచించాడు.

## 3.5 ప్రగతిపాలన – సంప్రదాయ పాలన ద్విభాగత్వం

ప్రభుత్వ పాలనా శాస్త్ర రచయితలు ప్రగతిపాలనను సంప్రదాయ పాలన నుంచి వేరు పర్చేందుకు ప్రయత్నించారు. వీరు సంప్రదాయ పాలనను, సాధారణ ప్రభుత్వ పాలనకు సమానంగా భావించారు. కొన్ని అంశాలలో సంప్రదాయ పాలనకు, ప్రగతి పాలనకు సామ్యం ఉన్నప్పటికీ, అనేక ఇతర అంశాలలో వాటి మధ్య బేధం ఉందని ఈ రచయితలు గుర్తించారు. తమ కర్తవ్యాల నిర్వహణలో అనుసరించే పాలనా సంబంధమైన నియమ నిబంధనలు, పద్ధతులు, ప్రమాణాలను పాటించడంలో ప్రగతిపాలనకు సంప్రదాయ పాలనకు సామ్యం ఉంది. కాని ఆశయాల పరిధి, సంక్లిష్టతలు, నవకల్పన పరిమాణం మొదలైన అంశాలలో ప్రగతిపాలన, సంప్రదాయపాలనకు పూర్తి వ్యత్యాసం ఉంది. సంప్రదాయ పాలన పరిధి, ఆశయాలు అతిసాధరణమైనవి కాగా ప్రగతిపాలన ఆశయాలు, పరిధి సంక్లిష్టమైనవి. జాతి నిర్మాణం, సామాజిక, ఆర్థిక ప్రగతి, మార్పులను ఉద్దీపింపజేసే పథకాలను ప్రణాళికలను అమలు పర్చడం ప్రగతిపాలన ప్రధాన లక్ష్యం. కాగా, శాంతి భద్రతల పరిరక్షణ, వనరుల సేకరణ, సంప్రదాయ పాలన ప్రధాన కర్తవ్యాలు.

BRAOU

కొందరు రచయితలు వలసపాలనా కాలంలోని పాలనా వ్యవస్థను ప్రగతిపాలన అని పరిగణించారు. ఈ విధంగా వారు వలసపాలన, వలసానంతర పాలన అని విభజన చేశారు. అయితే ఈ విభజన పూర్తిగా వాస్తవమైనది కాదు. ఎందుచేతనంటే ఈ విభజన వలసపాలనా కాలంలో సైతం ప్రభుత్వం కొన్ని అభివృద్ధి ప్రణాళికలను, పథకాలను అమలు పర్చిందన్న వాస్తవాన్ని మరుగు పరుస్తుంది. దీని ప్రకారం వలస పాలన కాలంలోని పాలనను శాంతి భద్రత పాలనగా స్వతంత్ర్యానంతరం ఏర్పడిన పాలనను ప్రగతిపాలనగా పరిగణించడం మితిమీరిన సాధారణీకరణ మాత్రమే.

ప్రగతి పాలన, సంప్రదాయ పాలనల మధ్య విభజనకు ప్రగతి పాలన కేవలం అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించిన పాలనా వ్యవస్థ అనే భావన ఒక ప్రాతిపదిక.అయితే ఈ ఆలోచన విభిన్న దేశాల తులనాత్మక విశ్లేషణలో ప్రగతి పాలన ఉపయోగాన్ని తగ్గిస్తుంది. వాస్తవ పరిస్థితులలో పూర్తిగా ప్రగతి శీలకమైన పాలనా వ్యవస్థలను, పూర్తిగా ప్రగతిశీలకం కాని పాలనా వ్యవస్థలను గుర్తించడం అసాధ్యం. కాగా

కొందరు రచయితలు ఒకే పాలనా వ్యవస్థలో కొన్ని వ్యవస్థలను అభివృద్ధి వ్యవస్థలుగా, మరికొన్నివ్యవస్థలను అభివృద్ధేతర వ్యవస్థలుగా పరిగణించారు. ఈ విభజన కూడా అసమంజసమైనదే ఎందుచేతనంటే కొన్ని పూర్తిగా అభివృద్ధేతర వ్యవస్థలంటూ ఉండటం అసాధ్యం. ఈ విభజన వల్ల ప్రభుత్వ ఉద్యోగుల మధ్య సమైక్యత క్షీణించడంతోపాటు కొందరు ఉద్యోగులలో సుస్థితి కూడా క్షీణించే ప్రమాదం ఉంది. అంతేగాక ఈ విభజన వల్ల అభివృద్ధి పాలకులు నూతన సంస్థలను ఏర్పాటు చేయడంపై అధిక ప్రాధాన్యతను కనబర్చి ప్రస్తుతం పని చేస్తున్న సంస్థలను నిర్లక్ష్య పరిచే అవకాశం కూడా లేకపోలేదు.

ప్రభుత్వ పాలనా శాస్త్ర రచయితలు ప్రగతి పాలనను అత్యున్నతస్థాయిలో నూతనత్వం (Innovativness) గల పాలనా వ్యవస్థగా గుర్తించారు. నవకల్పనత్వం ప్రగతిపాలన కీలక స్వభావం ప్రగతిపాలన లక్ష్యాలైన ఆధునికీకరణ, సామాజిక, ఆర్థిక ప్రగతి సాధనలో ఉద్యోగిస్వామ్యవ్యవస్థలోని నవకల్పనాసక్తులను పటిష్టపరచడం కీలకాంశమని వీడ్నర్ పేర్కొన్నాడు. అయితే నవకల్పనత్వం లోపించిన పాలనా వ్యవస్థలను అభివృద్ధేతర పాలనా వ్యవస్థలుగా పరిగణించాలని దీని భావం కాదు. కానీ మార్పు, ప్రగతి సాధనలో నిమగ్నమైన పాలనా వ్యవస్థలకు పరిపాటి కార్యకలాపాలను నిర్వహించే సాధారణ పాలన కంటే ఎక్కువ సృజనాత్మకత, నవకల్పనత్వం అవసరమని గుర్తించాలి.

ఈవిధంగా ప్రగతిపాలన, సంప్రదాయ పాలనల ద్విభాగత్వం వల్ల వెల్లడయ్యే వాస్తవం ఏమిటంటే ఈ రెండు పాలనా వ్యవస్థల మధ్య స్పష్టమైన, ఖచ్చితమైన విభజన సాధ్యం కాదు. ఈ విధమైన విభజన అవాస్తవికమైందీ, అనవసరమైంది. ఈ ద్విభాగత్వం ఊహాత్మక లేదా ఆదర్శ పరిస్థితులలో అర్థవంతమైందీ తప్ప యదార్థ పరిస్థితులలో అర్థరహితమైంది. రాజకీయాలు, పాలన ద్విభాగత్వం మాదిరే ప్రగతి పాలన, సాంప్రదాయ పాలనల దిభాగత్వం కూడా దోషపూరితమైందే. ఎందుకంటే ఈ రెండు పాలనా వ్యవస్థల మధ్య భిన్నత్వం వాటి వక్కాణింపు పరిమాణంలో ఉంది, తప్ప వాటి స్వభావంలో లేదు. ఒక సన్నివేశంలో ప్రగతిశీలకమైన వ్యవస్థ మరో సన్నివేశంలో ప్రగతి శీలక వ్యవస్థ కాకపోవచ్చును. ఏ సంస్థ పూర్తిగా అభివృద్ధేతర సంస్థకాదు. ఇదే విధంగా వలసపాలన కాలంలోని పాలనా వ్యవస్థను అభివృద్ధేతర పాలనా వ్యవస్థగా, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన పాలనా వ్యవస్థనుప్రగతి పాలనగా భావించటం కూడా సరికాదు. ఏమైనప్పటికీ ప్రభుత్వ పాలనా శాస్త్ర సాహిత్యంలో ప్రగతి శీలక, రాజకీయ , సామాజిక, లక్ష్యాల సాధనలో నిమగ్నమైన, ఆచరణలో, దృక్పథంలో నవ కల్పనా తత్వం కలిగిన పాలనా వ్యవస్థలనే ప్రగతి పాలనగా భావించడం జరిగింది. అయినప్పటికీ ప్రగతి పాలన, సంప్రదాయ పాలన ద్విభాగత్వం వల్ల ప్రగతిపాలన అధ్యయన రంగం ప్రాముఖ్యతను తగ్గిస్తుందే తప్ప దాని అభివృద్ధికి ఏమాత్రం తోడ్పడదనేది వాస్తవం.

## 3.6 ప్రగతి పాలన సంధర్భాలు (Contexts of Development Administration)

ప్రగతి పాలనలోఒక ప్రధాన భావన ఏమిటంటే ప్రభుత్వపాలన దాని పరిసరాలు పరస్పరం ప్రతిస్పందిస్తాయి. అంటే ఏ సమాజంలోనైనా సామాజికి, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు పాలనా వ్యవస్థను ప్రభావితం చేయటమే గాక, దాని వల్ల ప్రభావితమవుతాయి. అందుచేత పాలనా వ్యవస్థ, దాని పరిసరాలు ఏవిధంగా పరస్పరం ప్రభావితం చేసుకుంటున్నాయో అవగాహన చేసుకునేందుకు పాలనా పరిసరాలను అధ్యయనం చేయాలని నాక్కి చెప్పారు. ఈ సందర్భంలో రిగ్స్ పేర్కొనట్లు ప్రగతి పాలన తన పరిసరాల



BRAOU

నుంచి ఎదురయ్యే అనేక సవాళ్ళను, సమస్యలను అధిగమించాల్సి వుంటుంది. ఎందుచేతనంటే ఈ సమస్యల పరిష్కారం ప్రగతి పాలనా సామర్థ్యాన్ని నిర్ధారిస్తుంది. రిగ్స్ పరిసరాలలోని విభిన్న అంశాలనే ప్రగతిపాలన సందర్భాలుగా పరిగణించాలని పేర్కొన్నాడు. ఈ సందర్భాలలో రాజకీయ సందర్భం, ఆర్థిక సందర్భం, సామాజిక, సంస్కృతిక సందర్భాలు ప్రధానమైనవని రిగ్స్ అభిప్రాయం. ఈ మూడు సందర్భాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

## 3.6.1. రాజకీయ సందర్భం

ప్రగతి పాలనా పరిసరాలలోని మొత్తం దృక్కోణాలు లేదా సందర్భాలలో రాజకీయ దృక్కోణం లేదా సందర్భం కీలకమైంది. వాస్తవానికి ప్రగతి పాలనా సాహిత్యంలో ప్రగతిపాలన రాజకీయ దృక్కోణం పట్ల కనబర్చినప్రాధాన్యత మరే ఇతర దృక్కోణానికి కనబర్చలేదు. ఎందుచేతనంటే అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ వ్యవస్థ ప్రగతిపాలన లక్ష్యాల నిర్ధారణలో కీలక పాత్ర వహిస్తుంది. రాజకీయ దృక్పథాలు, విలువలు ప్రగతి పాలనను, ప్రధానంగా ఉద్యోగి బృందాన్ని అమితంగా ప్రభావితం చేస్తాయి. ఈ కారణం చేత అనేకమంది ప్రగతి పాలనా రచయితలు, రాజనీతి శాస్త్రవేత్తలు ప్రగతి పాలన రాజకీయ దృక్కోణంపై అమితమైన ఆసక్తిని ప్రదర్శించారు. ప్రధానంగా ఈ రచయితలు రాజకీయాభివృద్ధిలో ఒకకీలక చలాంశంగా ప్రగతిపాలన పాత్రపై విస్తృతమైన చర్చను కొనసాగించారు.

ఈ రచయితలు వెబర్ ఉద్యోగి స్వామ్య నమూనా కార్యచట్రం పరిధిలో రాజకీయాభివృద్ధి ప్రక్రియలో ఉద్యోగిబృందం పాత్రపై అనేక వర్గీకరణల (Typologies) ను రూపొందించారు. ఈ వర్గీకరణల్లో రిగ్స్ ప్రతిపాదించిన సమతుల్య రాజకీయ వ్యవస్థ (Balanced Polity), అసమతుల్య రాజకీయ వ్యవస్థ (Unbalanced Polity) వర్గీకరణ ప్రధానమైంది. ఈ వర్గీకరణ ప్రాతిపదికగా అనేక మంది రచయితలు అనేక వ్యూహాలను ప్రతిపాదించారు. వీటిలో వారెన్ ఇల్చ్‌మన్స్, మిల్టన్ ఇస్‌మన్, రాల్ఫ్ బ్రైచంటే మొదలైన రచయితలు ప్రతిపాధించిన సామాజిక వృద్ధి వ్యూహం (Social Growth Strategy) ఫెరల్ హెడీ ప్రతిపాధించిన పాలనా వ్యవస్థల దృక్పథా (Administrative systems approach) లు ప్రధానమైనవి. ఈ విధంగా ప్రగతిపాలనా రాజకీయ సందర్భం లేదా దృక్కోణం ప్రగతిపాలన సాహిత్యంలో అత్యంత కీలకాంశమైంది.

## 3.6.2. ఆర్థిక సందర్భం

ప్రగతిపాలన ఆర్థిక దృక్కోణం బహుళ ప్రచారం పొందిన దృక్కోణం. కాని ఈ దృక్కోణం ఇటీవల కాలంలో మాత్రమే ప్రాచుర్యం సంతరించుకుంది. అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధిలో వివిధ కారకాల పాత్రను విశ్లేషించారు. హేజన్, మెక్‌లాలాండ్ వంటి మనస్తత్వ శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో మూర్తిమత్వ పాత్రను విశ్లేషించారు. మాక్స్‌వెబర్ వంటి సమాజ శాస్త్రవేత్తలు మతం, కుటుంబం మొదలైన సామాజిక సంస్థల పాత్రను వివరించారు. కాగా రాస్టవ్, రిచర్డ్‌గిల్ వంటి ఆర్థిక శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధికి అవశ్యకమైన పెట్టుబడి, సాంకేతిక నైపుణ్యం, ప్రకృతి వనరులు, కార్మికశక్తి మొదలైన కారకాలను వివరించారు.

BRAOU

ఆర్థికాభివృద్ధి ప్రక్రియ పాలనా దృక్కోణంపై ఆసక్తి కనబర్చిన పాలనా రచయితలు లేకపోలేదు. ఫ్రెడ్ రిగ్స్, ఇల్చ్‌మన్, భార్గవ వంటి పాలనా శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వం పాత్రపై కొన్ని సాధారణీకరణలను ప్రతిపాదించారు. రిగ్స్ ఆర్థికవృద్ధిలో పాలనా వ్యవస్థ పాత్రను వివరిస్తు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక వ్యవస్థపై సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కారకాల ప్రభావాన్ని పరిశీలించాడు. ఇల్చ్‌మన్, భార్గవలు వివిధ ఆర్థికాభివృద్ధి సిద్ధాంతాల అమలులో ప్రభుత్వం నిర్వహించవలసిన పాత్రను గురించి చర్చించారు. ఈ విధంగా ప్రగతిపాలన ఆర్థిక సందర్భాన్ని విభిన్న సామాజిక శాస్త్రాలకు చెందిన రచయితలు విభిన్న కోణాల నుంచి పరిశీలించారు.

### 3.6.3. సామాజిక, సాంస్కృతిక సందర్భం

ప్రగతి పాలన సామాజిక, సాంస్కృతిక దృక్కోణం విశ్లేషణ క్లిష్టమైన ప్రక్రియ. ఎందుచేతనంటే ఈ దృక్కోణం విలువల భరితమైంది (Value Ridden). అయినప్పటికీ కొందరు పాలనా రచయితలు. పాలనా ప్రవర్తనపై సాంస్కృతిక విలువల ప్రభావాన్ని విశ్లేషించేందుకు ప్రయత్నించారు. వీరిలో రిగ్స్, ఆల్మండ్, వెర్బా, జోసే ఆబూవే, సుబ్రహ్మణ్యం లను ప్రముఖంగా పేర్కొనవచ్చును. రిగ్స్ తన పౌరదర్శనిక సమాజం సిద్ధాంతంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఉద్యోగిబృంద వ్యవస్థ, పాలనా ప్రవర్తనలపై సామాజిక, సాంస్కృతిక వ్యవస్థల ప్రభావం పై విశ్లేషణ కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఆల్మండ్ వెర్బాలు రాజకీయ, పౌర జీవితంపై సంస్కృతి ప్రభావాన్ని విశ్లేషించి, పౌరసంస్కృతి (Civic culture) అనే భావనను ప్రతిపాధించారు. అబువే, సుబ్రహ్మణ్యంలు ఉద్యోగిబృంద ప్రవర్తనపై సామాజిక, సాంస్కృతిక విలువల ప్రభావాన్ని పరిశీలించారు. ఏమైనప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రగతి పాలన సామాజిక, సాంస్కృతిక సందర్భంపై ఇప్పటి వరకు జరిపిన అధ్యయనాలు పరిమితమైనవి. అందుచేత ఈ సందర్భంపై పూర్తి అవగాహనకు విస్తృతమైన అధ్యయనాలను చేపట్టవలసి ఉంది.

BRAOU

## 3.7 ప్రగతిపాలన నమూనా వైఫల్యం

1960 దశాబ్దం ప్రగతి పాలన భావనకు ఒక ఉత్కృష్టమైన దశ. ఈ శతాబ్దంలో ప్రగతిపాలన సిద్ధాంత నిర్మాణం, పరిశోధన, ఆచరణ రంగాలలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే 1970 దశాబ్దంలో సంభవించిన పెక్కు సంక్షోభాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రగతి పాలనను దాదాపు నిర్వీర్యం చేశాయి. ఈ దశాబ్దంలో సంభవించిన జనాభా విస్ఫోటన, విస్తృతమైన రాజకీయ డిమాండ్లు, ప్రగతి పాలకులు, విధాన నిర్ణేతలు అభివృద్ధి ప్రణాళికా కర్తల అంచనాలను తారుమారు చేశాయి. అభివృద్ధి అసాధ్యమైన అంశమైంది. సమానత్వం కలిగిన సామాజిక, ఆర్థిక వ్యవస్థ కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ధనిక, పేద దేశాల మధ్యఅంతరం మరింత విస్తృతమైంది. దీనితోపాటు రాజకీయ రంగం అనేక సంక్షోభాలకు గురైంది. ప్రభుత్వ ఉద్యోగిబృంద వ్యవస్థపై రాజకీయ నాయకుల ఆధిపత్యం పెరిగింది. రాజకీయ నాయకులు తమ అధికారానికి, తమ చర్యలకు చట్ట బద్ధతను (Legitimacy) సంతరించేందుకు, తమ స్వార్థ ప్రయోజనాలను సంతృప్తి పరుచుకునేందుకు దుర్వినియోగం చేయటం ప్రారంభమైంది. ఉద్యోగిబృందం, పాలనా వ్యవస్థలు రాజకీయ శ్రేష్టుల పట్ల పక్షపాత వైఖరిని పెంపొందించుకున్నాయి.

వాగాడంబరత్వం (Rhetoric), జనాకర్షణ వాదాలు (Populism) ప్రభుత్వ విధానాల కంటే అధిక ఆధిక్యతను పొందాయి. ఈ పరిణామాల ఫలితంగా ప్రగతి పాలన జాతీయ, అంతర్జాతీయ రంగాలలో ఏర్పడిన రాజకీయ ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొనవలసి వచ్చింది. దీని ఫలితంగా ప్రగతి పాలన పరిసరాలు, జఢత్వాన్ని సంతరించు కోవడంతోపాటు ఈ భావన అందరి ఆశలను వమ్ముచేసింది. ప్రగతి పాలన అధ్యయనం ప్రాధాన్యత క్షీణతకు నెఫ్, ద్వివేదీలు రెండు కారణాలను పేర్కొన్నారు. ఒకటి స్థానిక (Proxis) స్థాయిలో, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి కృషి ఆశించిన ఫలితాలను కలుగచేయలేదు. రెండు, భావనా (Conceputal) స్థాయిలో అభివృద్ధి వాదం, సంస్కరణ వాదాల వైఫల్యం మేధోపరమైన శూన్యాన్ని (Intellectual void) సృష్టించింది. అంతేగాక ఈ రచయితల అభిప్రాయం ప్రకారం సందర్భవాదం (Contextualism) విభిన్న శాస్త్ర విశ్లేషణంపై మితిమీరిన ప్రాధాన్యత కనపర్చడం ద్వారా ప్రగతి పాలన ప్రభుత్వ పాలనా సిద్ధాంత సారాన్ని గందరగోళ పర్చింది.

## 3.8 ప్రగతి పాలన నమూనా విశిష్టత

1960 దశాబ్దంలో తులనాత్మక పాలన అభివృద్ధిలో భాగంగా అవతరించిన ప్రగతి పాలన భావన పెక్కు విశిష్టతల వలన సామాజిక శాస్త్రాలలో ఒక ప్రధాన అంశమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక, ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో నిమగ్నమైన పాలనా దృగ్గోచరాన్ని వివరించే భావనగా ప్రగతిపాలన ఈ దేశాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు, సవాళ్ళకు పరిష్కార మార్గాలను సూచించింది. ప్రగతి పాలన పోస్డ్ కార్బ్ (posdcarb) దృక్పథం విధించిన సంకుచిత హద్దుల నుంచి ప్రభుత్వ పాలనా సిద్ధాంతాన్ని విముక్తి కావించి, ఆ సిద్ధాంతానికి ఒక విశ్లేషణాత్మకతను సందర్భవాదాన్ని (Contextulism), ఉపయుక్తతను సంతరించింది. 1970-80 శతాబ్దాలలో ప్రగతి పాలన తృతీయ ప్రపంచదేశాల పాలనకు ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థా నమూనాగా రూపొందింది.

BRAOU

ఒక అధ్యయనాంశంగా ఆచరణాత్మక వ్యవస్థగా ప్రగతిపాలన ఆర్థిక, సామాజిక లక్ష్య సాధనలో నిమగ్నమైన పాలనా వ్యవస్థలలో విడదీయలేని అంశం అనే వాస్తవం ఋజువైంది. ప్రగతిపాలనా పెక్కు సంక్షోభాలను అధిగమించటమే గాక తన నుంచి ఆశించిన శక్తిసామర్థ్యాలతో, తాను సాధించవలసిన ప్రగతి లక్ష్యంతో అనుగుణ్యతను సాధించింది. అధిక సంఖ్యలో తృతీయ ప్రపంచదేశాలకు చెందిన మేధావులు, పరిశోధకులు చేసిన సేవల వల్ల, తమ సమాజాల అధ్యయనం నుంచి సేకరించిన విజ్ఞానం అనుభవాల ఆధారంగా వారు ప్రవేశపెట్టిన నిగూఢ భావాల వల్ల ప్రగతిపాలన సుదీర్ఘకాలం తన మేధోపరదృఢత్వాన్ని (Vitality) ఉపయుక్తతను నిలుపుకోగలదనడంలో సందేహం లేదు. 1960 దశాబ్దం తొలిదశలో ప్రగతి పాలన భావన ప్రభుత్వ పాలన సిద్ధాంతంలో సృష్టించిన విప్లవాత్మక పోకడ (Revolutionary trend) పూర్తిగా అంతరించలేదనటానికి ఈసిద్ధాంతంలో అభివృద్ధి ప్రక్రియపై నేటికీ జరుగుతున్న ఆసక్తికరమైన ఉపయుక్తమైన చర్చ, భావాల మార్పిడీలను ఒక నిదర్శనంగా పేర్కొనవచ్చును. ఇటీవల కాలంలో తృతీయ ప్రపంచ దేశాలకు చెందిన మేధావులు మొత్తం ప్రపంచానికి వర్తించే సార్వజనీన ప్రగతిపాలన భావనను రూపొందించారు. ఈ నమూనా ప్రకారం ప్రగతికి విశాలమైన అర్థం ఉంది. సామాజిక పరివర్తన ప్రగతి కీలక లక్ష్యం. ప్రగతి పరిధి

మొత్తం నాగరికత అభివృద్ధికి విస్తరించింది. ఈ దృక్పథంతో విశ్లేషిస్తే తృతీయ ప్రపంచ దేశాల అభివృద్ధి మొత్తం ప్రపంచ అభివృద్ధితో ముడిపడివుంది. ఈ విధంగా ప్రగతిపాలన భావనకు గతం కన్నా విశాలమైన ప్రాతిపదికను ఏర్పరచే ప్రయత్నాలు సాగుతున్నాయి.

## 3.9 ముగింపు

తులనాత్మక పాలన అనుబంధంగా ప్రవేశ పెట్టబడినప్పటికీ ప్రగతి పాలనా దృక్పథం ప్రభుత్వ పాలనా శాస్త్రానికి సమకూర్చిన ప్రయోజనం అద్వితీయం. ప్రగతిపాలనవల్ల ప్రభుత్వ పాలనా శాస్త్రానికి విశ్లేషణాత్మక, బహుళశాస్త్ర దృక్పథాలు ఏర్పడ్డాయి. ప్రగతిపాలన నమూనా ప్రభుత్వ పాలనను దాని పరిసరాలతో అనుసంధానించడంవలన ఆ శాస్త్ర సందర్భం విస్తృతమైంది. దీని ఫలితంగా పాలనా దృగ్గోచరం క్రమబద్ధమైన, శాస్త్రీయమైన అవగాహనకు విస్తృతమైన అవకాశం ఏర్పడింది. ఈ విధమైన సైద్ధాంతిక ప్రయోజనంతో పాటు ప్రగతి పాలన నమూనా వల్ల ఆచరణాత్మక ప్రయోజకం కూడా చేకూరుతుంది. ప్రగతిపాలన అభివృద్ధి చెందుతున్న దేశాలపాలనా వ్యవస్థలు మెరుగుపడేందుకు అనేక సంస్కరణలను సూచించింది. మొత్తం మీద ప్రగతి పాలనా నమూనా వల్ల ప్రభుత్వ పాలనా శాస్త్రం పాశ్చాత్య సంస్కృతి ఆధిక్యత లేదా స్వజాతి ఆధిక్యతావాద సంకెళ్ళనుండి బయటపడి సార్వజనీనతను పెంపొందించుకుంది. ఈ పరిణామం భవిష్యత్తులో ప్రభుత్వ పాలనా శాస్త్రం క్రమబద్ధమైన విజ్ఞాన శాస్త్రంగా రూపొందటానికి దోహద పడగలదనటంలో సందేహం లేదు.

## 3.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రగతిపాలన భావనను నిర్వచింపుము? ప్రగతిపాలన ప్రధానలక్షణాలను వివరింపుము?
2. ప్రగతి పాలన వివిధ సందర్భాలను తెలుపుము?
3. ప్రగతి పాలన నమూనాను విమర్శనాత్మకంగా పరిశీలింపుము?

2. ఈ క్రింది వాటికి 15 పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రగతి పాలన భావన అర్థాన్ని వివరింపుము?
2. ప్రగతి పాలన సాధనాలను తెలుపుము?
3. ప్రగతి పాలన నమూనా వైఫల్యాన్ని చర్చింపుము?
4. ప్రభుత్వ పాలనా శాస్త్రానికి ప్రగతిపాలన భావన సేవను విశ్లేషింపుము?
5. ప్రగతి పాలన, సాంప్రదాయపాలన ద్విభాజత్వాన్ని పరిశీలింపుము?

## 3.11. చదువదగిన రచనలు

1. Marina R. Pinto : Development and Administration, Himalaya Srinivasan Publishing House, Delhi, 1990

2.R.K. Sapru: Development Administration, Deep and Deep Publications , New Delhi, 1986

3.William J.D. Montgomery & Siffins (Eds): Approaches to Development, Politics Administration and Change, MaCGrawHill, New York, 1986



BRAOU

4.George F. Grant : Development Administration, Concept , Goals Methods, London, Wisconsin, 1979

5.E.W. Weidner(Ed) : Development Administration in Asia, Durham, North Carolina, Duke University Press 1970

6.Dwight Waldo (Ed) : Temporal Dimensions of Development Administration, North Carolima Duke University Press, 1970.

రచయిత : యం. బాపూజీ.

BRAOU

# భాగం–4 : ప్రగతి దృక్పథాలు : నిర్మాణ, విధుల కృక్పథం

విషయక్రమం


**4.0** లక్ష్యాలు

**4.1** పరిచయం

**4.2** నిర్మాణ విధుల దృక్పథం చరిత్ర

**4.3** సమాజ శాస్త్రంలోని నిర్మాణ విధుల దృక్పథం

**4.3.1** టాల్కాట్ పార్సన్ నిర్మాణ విధుల భావన

**4.3.2** రాబర్ట్ మెర్టన్ నమూనా

**4.4** రాజనీతి శాస్త్రంలో నిర్మాణాలు, విధుల దృక్పథం

**4.5** తులనాత్మక పాలన అధ్యయనంలో నిర్మాణాలు, విధుల విశ్లేషణ

**4.6** ఫెడ్‌రిక్ రిగ్స్ నిర్మాణ విధుల విశ్లేషణ

**4.6.1** వ్యవసాయిక, పారిశ్రామిక సమాజాల నమూనా

**4.6.2** సంయోజిత, ప్రతిఫలన సమాజాల నమూనా

**4.6.3** పారదర్శనిక సమాజ లక్షణాలు

**4.6.4** సాలా నమూనా

**4.6.5** బజార్ కాంటీన్ నమూనా

**4.6.6** పారదర్శనిక సమాజంతో మార్పు

**4.6.7** రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంత విమర్శనాత్మక పరిశీలన

**4.7** ముగింపు

**4.8** నమూనా పరీక్షా ప్రశ్నలు

**4.9** చదువదగిన రచనలు


BRAOU

## 4.0 లక్ష్యాలు

నిర్మాణ విధుల దృక్పథంలోని వివిధ అంశాలను మీకు పరిచయం చేయడమే ఈ భాగం ప్రధానాశయం. ఇది చదివితే మీరు కింది విషయాలు వివరించగలుగుతారు.

- నిర్మాణ విధుల దృకథం అంటే ఏమిటి? దాని చరిత్ర,
- నిర్మాణ విధుల దృక్పథంపై వివిధ సైద్ధాంతీకుల అభిప్రాయం,
- రిగ్స్ నిర్మాణ విధుల ధృక్పథంలోని ప్రధానాంశాలు.

ప్రస్తుతం దేశంలో ఉన్న పాలనా వ్యవస్థలు,పద్ధతులు, ఉద్యోగ క్రమాలు బ్రిటీష్ వారిచే సృష్టించబడ్డాయి. వలస రాజ్య అవసరాలకు అవి అనుగుణంగా రూపొందింపబడ్డాయి. భారతీయులకు అధికారం అప్పచెప్పబడినా పాలనలో వ్యవస్థాపరమైన మౌళిక మార్పులు రాలేదు. ఆచార్య రజని కొఠారి మాటల్లో 'వ్యవస్థ నిర్మాణం భారతదేశ పాలన విఫలానికి మూలకారణం' అని అభిప్రాయపడ్డాడు. పి.వి.ఆర్. రావ్ అనే మరో సాంఘిక శాస్త్రజ్ఞుడు "సంక్షేమరాజ్య సాధనకు పాలనాయంత్రాంగాన్ని సమర్థవంతమైనదిగా తీర్చిదిద్దడానికి సాంఘిక, రాజకీయ పాలన రంగాల్లో విస్తృత మార్పులు రావాలి" అని అన్నాడు.

## 6.2.1 సంస్కరణల ఆవశ్యకత

అయితే పాలనా రంగంలో సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణ అవసరాన్ని గుర్తించారని చెప్పాలి. కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనకు సంబంధించిన అంశాల అధ్యయనానికి ఎన్నో సంఘాలను నియమించారు. ఉదాహరణకు – విద్య, సాధారణ పరిపాలన, పోలీసు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రణాళికాభివృద్ధి, సివిల్ సర్వీసుల స్థితిగతులు, పాలనా పద్ధతులను, ఇతర అంశాలపై ఇప్పటికి ఎన్నో సంఘాలు పరిశీలించాయి. ప్రభుత్వ ప్రస్తుత వ్యవస్థలో తీసుకురావలసిన సంస్కరణలను ఎన్నో సిఫార్సుల ద్వారా సూచించాయి.

అయితే ఈ ప్రయత్నాలు నిష్ప్రయోజనమయ్యాయని చెప్పాలి. ఎందుచేతనంటే, ప్రభుత్వం పాలనా సంస్కరణలను అమలు చేయటడంలో, పునర్వ్యవస్థీకరించడంలో మార్పును తీసుకురావడానికి విముఖత చూడడంవల్ల, అవస్తి ఉద్దేశంలో పాలనా సంస్కరణలు ఫలప్రదం కాకపోవడానికి ముఖ్య కారణం వాటిని రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితిని నుంచి వేరు చేసి ప్రయత్నించడమే. అసరళ పాలనా వ్యవస్థలు మార్పు కోరుకోవు. ఎందుచేతనంటే అవి సంప్రదాయ బద్ధమైనవి. ఏళ్ళతరబడి సామర్థ్యం తగ్గే లక్షణాలతో కొనసాగుతూనే ఉంటాయి. కాని కొత్త లక్ష్యాలకు అనుగుణంగా మార్పు చెంది వాటి సాధనకై సమీకరణ చెంది ముందుకు సాగవు అని రజనీ కొఠారీ అభిప్రాయపడ్డాడు.

మరికొందరి ఉద్దేశంలో పాలనా సంస్కరణల అమలు రాజకీయ బాధ్యత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా అభివృద్ధి రంగంలో, ప్రభుత్వరంగ పరిశ్రమ కొత్త పాలనా వ్యవస్థలను సృష్టించారు. అయితే వాటి బాధ్యతలు, ధ్యేయాలు క్రమబద్ధపాలనకు విభిన్నంగా ఉన్నా, ఇంచుమించు పూర్వపు పాలనా వ్యవస్థల తరహాలోనే స్థాపింపబడ్డాయి. ఈ విధంగా దీర్ఘకాలిక ప్రణాళికా దృష్టితో కాకుండా, క్రమబద్ధ, అభివృద్ధి, వ్యాపార, పారిశ్రామిక, సాంఘిక సంక్షేమం పరిపాలనా వ్యవస్థలు అస్తవ్యస్తంగా సృష్టించబడ్డాయి. ఈ వ్యవస్థలు మన అవసరాలకు యుక్తం కానివిగా నిరూపింపబడింది. ఆశించినంతగా ఈ వ్యవస్థలు ప్రజలకు సమర్థవంతంగా సేవలను అందించలేకపోయాయి. పాలనావ్యవస్థను ప్రజోన్ముఖఅభివృద్ధి కార్యక్రమాలు అనుకూలించే యంత్రాంగంగా తీర్చిదిద్దవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉద్యోగి స్వామ్యం స్వతహాగా మార్పును ప్రతిఘటిస్తుంది. కావున దాని వల్ల పాలనా సంస్కరణ, మార్పు ఆశించడం కష్టం. కాబట్టి మార్పు, సంస్కరణలు నిబద్ధమైన రాజకీయనాయకుల ద్వారానే సాధ్యం అవుతుంది. అయితే పాలనా ద్వారా మార్పు ఎందుకు సాధ్యం కాదు. అన్న ప్రశ్న తలెత్తుతుంది. భారతదేశంలో పాలనా యంత్రాంగ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ కావల్సిన మార్పుకు ఆదేశించే ప్రబలమైన రాజకీయ సంస్థలు లోపించడం ఇందుకు కారణం అని చెప్పవచ్చు.

కాబట్టి పాలనావ్యవస్థపై ప్రజాస్వామిక రాజకీయ నియంత్రణ ఎంతకాలం వరకూ సుస్థాపితం కాదో అంతవరకు ఉద్యోగిస్వామ్య వ్యవస్థ, రాజకీకరణ చెందిన పాలన భారత దేశంలో కొనసాగుతూనే ఉంటాయి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – అభ్యాసం 1

1 పాలనా సంస్కరణల సంఘం (ARC) ప్రధాన ఆశయాలు ఏమిటి.

BRAOU

మలుపు తిరిగాయి. ఈ దృక్పథాన్ని అనుసరిస్తూ వివిధ సామాజిక శాస్త్రాలలో రూపొందించిన భావనలు, నమూనాలు ఆయా శాస్త్రాలను సైద్ధాంతిక పరంగా ఎంతో అభివృద్ధి పర్చాయి.

సామాజిక శాస్త్రాలలో నిర్మాణ, విధుల దృక్పథం మొట్టమొదటి సారిగా మానవీయ శాస్త్ర రచయితలైన రాడ్‌క్లిఫ్ బ్రౌన్, మాలినోవిస్కీలు వర్తింపచేసి మానవ సమాజం అవతరణను అధ్యయనం చేశారు. మానవీయ శాస్త్రంలో నిర్మాణ, విధుల దృక్పథం సాధించిన ఫలితాల పట్ల ఆకర్షితులైన సమాజ శాస్త్రవేత్తలు సామాజిక దృగ్గోచర (Social Phenomena) అధ్యయనానికి నిర్మాణ విధుల దృక్పథాన్ని ప్రయోగించారు. తొలి సామాజిక శాస్త్రవేత్తలైన కామ్టే, స్పెన్సర్, డర్‌కైమ్‌లు సమాజంలోని విభిన్న నిర్మాణాలు, విధులను అనుసంధానిస్తూ అనేక భావనలను ప్రతిపాదించారు. వీరి భావనల వల్ల ప్రభావితులైన ఆధునిక సమాజ శాస్త్రవేత్త టాల్కట్ పార్సన్స్, రాబర్ట్ మెర్టన్, మెరియన్ లెవీలు నిర్మాణ, విధుల దృక్పథాన్ని సమాజ అధ్యయనానికి విస్తృతంగా ఉపయోగించారు.

సమాజ శాస్త్రంలో నిర్మాణ, విధుల దృక్పథం గొప్ప ప్రాచుర్యాన్ని సంతరించుకోవడంతో మిగిలిన సామాజిక శాస్త్రాలకు చెందిన శాస్త్రవేత్తలు కూడా ఈ దృక్పథం పట్ల ఆకర్షితులైయ్యారు. 1950 వ దశాబ్దంలో రాజనీతి శాస్త్రంలో అవతరించిన తులనాత్మక రాజకీయాల ఉద్యమానికి చెందిన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయ పరిస్థితుల తులనాత్మక అధ్యయనానికి నిర్మాణ, విధుల దృక్పథం చక్కటి ప్రాతిపదిక అనే వాస్తవాన్ని గుర్తించడంతో రాజనీతి శాస్త్రంలో నిర్మాణ విధుల దృక్పథం ప్రవేశానికి మార్గం ఏర్పడింది. పెక్కుమంది తులనాత్మక రాజకీయాల రచయితలు ఈ దృక్పథం ప్రాతిపదికగా అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయ ప్రక్రియపై అమోఘమైన సిద్ధంత నిర్మాణం చేశారు. ఈ సిద్ధాంతం వల్ల ప్రభావితులైన తులనాత్మక పాలన రచయితలు అభివృద్ధి చెందుతున్న దేశాల పాలన వ్యవస్థల తులనాత్మక అధ్యయనానికి నిర్మాణ, విధుల దృక్పథాన్ని చేపట్టారు. ఈ విధంగా మానవీయ శాస్త్రంలో అడుగు పెట్టిన ఈ దృక్పథం మొత్తం సామాజిక శాస్త్రాలకు విస్తరించింది.

BRAOU

## 4.3 సమాజశాస్త్రంలో నిర్మాణ, విధుల దృక్పథం

ప్రస్తుతం సామాజిక శాస్త్రాలలో ఈ దృక్పథం అత్యంత ప్రాముఖ్యత వహించే సిద్ధాంతమని టర్నర్, కింగ్స్ లీడెవిస్, ఆల్విన్ గౌల్డనర్ మొదలైన సామాజిక శాస్త్రవేత్తలు అంగీకరించారు. వర్తమాన నిర్మాణాలు, విధుల దృక్పథం పై సంప్రదాయ సమాజ శాస్త్రవేత్తలైన ఆగస్ట్ కామ్టే, హెర్బర్ట్ స్పెన్సర్స్, ఎమిల్ డర్ కైమ్‌ల ప్రభావం బలంగా ఉంది. ఆధునిక నిర్మాణాలు, విధుల దృక్పథం ఈ ముగ్గురు సంప్రదాయ సమాజ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ఊహాగానల ఆధారంగా రూపొందించబడింది. వర్తమాన నిర్మాణాలు, విధుల సిద్ధాంత వేత్తలు సామాజిక దృగ్గోచరాన్ని స్థూల దృక్పథంతో అధ్యయనం చేశారు. ఈ సిద్ధాంత వేత్తలు మొత్తం సామాజిక వ్యవస్థపై, ఆ వ్యవస్థపై వివిధ సామాజిక నిర్మాణాల ప్రభావంపై తమ దృష్టిని కేంద్రీకరించారు. దానితో పాటు ఈ సిద్ధాంత వేత్తలు సామాజిక వ్యవస్థ వివిధ భాగాల మధ్య గల సంబంధాలపై, విశ్లేషణ పై ప్రాధాన్యతను కనబర్చారు.

సామాజిక శాస్త్రాలలో నిర్మాణ, విధుల దృక్పథాన్ని వివరించిన సైద్ధాంతికులలో టాల్కట్ పార్సన్‌కు ఎక్కువ ప్రాధాన్యత గలదు. పార్సన్స్ తో పాటు అతని ప్రధాన శిష్యులైన మెరియన్ లెవీ, రాబర్ట్ మెర్టన్,

కింగ్స్ లీడేవిస్ మొదలైన సమాజ శాస్త్రవేత్తలు కూడా నిర్మాణ, విధుల దృక్పథాన్ని అభివృద్ధి పర్చారు.

## 4.3.1 టాల్కాట్ పార్సన్స్ నిర్మాణ , విధుల దృక్పథం

సామాజిక వ్యవస్థ నిర్వచించడంలో పార్సన్స్ తన నిర్మాణ, విధుల సిద్ధాంతాన్ని ప్రారంభించాడు. పార్సన్స్ సామాజిక వ్యవస్థను వ్యక్తుల పరస్పర ప్రతిచర్యగా పరిగణించాడు. పార్సన్స్ హోదాపాత్ర (Status role) ను వ్యవస్థ మౌళికాంశం (Basic Unit) గా భావించాడు. హోదా వ్యవస్థలోని నిర్మాణం అంశాలకు, పాత్రవిధులకు ప్రతిరూపాలు. పార్సన్స్ తన విశ్లేషణలో నిర్మాణాంశాలపై ప్రాధాన్యత కనబరచినప్పటికీ విధులను విస్మరించలేదు. పార్సన్స్ ఒక సామాజిక వ్యవస్థ నిర్వహించే అనేక ఆవశ్యక విధులను గుర్తించాడు.ప్రధానంగా తను విశ్లేషణ లో ప్రతి సామాజిక వ్యవస్థ తన మనుగడకు నాలుగు ఆవశ్యక విధులను నిర్వర్తించాలని పేర్కొన్నాడు. అవి :

- అనుసరణీయత (Adaptation) :- ప్రతి వ్యవస్థ తనకు హఠాత్తుగా ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొగలగాలి.
- లక్ష్యసాధన:- ప్రతి వ్యవస్థ తన మౌళిక లక్ష్యాలను సాదించాలి.
- విధానం కొనసాగింపు (Pattern Maintenance):- ప్రతి వ్యవస్థ ప్రేరణ, సాంస్కృతిక విధానాలను వివర్ధించి, కొనసాగించాలి.
- సమైక్యత (Integration):- ప్రతి వ్యవస్థ తను నిర్వర్తించవలసిన ప్రధానవిధుల మధ్య పరస్పర సంబంధాలను క్రమబద్ధం చేయాలి.

పైన వివరించిన నాలుగు ప్రధాన విధులను వ్యవస్థలు అన్ని స్థాయిల్లో నిర్వర్తిస్తాయనీ భావించినప్పటికీ పార్సన్స్ తన దృష్టిని పెద్ద సామాజిక వ్యవస్థలు, వాటి మధ్యగల సంబంధాల పైనే కేంద్రీకరించాడు. అంతేగాక పార్సన్స్ తన విశ్లేషణలో వివిధ పాత్రధారులు, సామాజిక నిర్మాణాల మధ్యగల సంబంధాలను పూర్తిగా నిర్లక్ష్య పర్చలేదు. వాస్తవానికి పార్సన్స్ సామాజిక వ్యవస్థలు, పాత్రధారుల మధ్యగల సమైక్యత సామాజిక శాస్త్రంలో మౌళిక గతిశీలక సిద్ధాంతమని వాదించాడు. పార్సన్స్ తన విశ్లేషణలోసమైక్య ప్రక్రియలోని అంతరంగీకరణ (Integration) సామాజీకరణ (Socialiazation)ప్రక్రియలకు ప్రాధాన్యత నిచ్చాడు.

## 4.3.2 రాబర్ట్ మెర్టన్ నమూనా

రాబర్ట్ మెర్టన్ నిర్మాణ, విధుల దృక్పథంలోని తీవ్రమైన, బలహీనమైన అంశాలను విమర్శించి దాని ఉపయోగాన్ని పెంపొందించేందుకు నూతన భావనలను ప్రతిపాదించాడు. మెర్టన్ నిర్మాణ, విధుల దృక్పథంలోని మూడు ప్రధాన ఊహనలను విమర్శించాడు. అవి ఏవంటే :

- సమాజంలో ప్రామాణీకరించబడిన సాంస్కృతిక విశ్వాసాలు, పద్ధతుల మధ్య ఐక్యత ఉంది.
- ప్రామాణీకరించబడిన సామాజిక, సాంస్కృతిక నిర్మాణాలు, రూపాలు సకారాత్మక (Positive) విధులను నిర్వర్తిస్తాయి.

BRAOU

## 6.5 సివిల్ సర్వీసుల ప్రతిష్ఠ

ప్రజలకు పాలనా వ్యవస్థల, సంక్లిష్టతల గురించిన అజ్ఞానం, పాలనపై ప్రభుత్వానికి సరైన నియంత్రణ లేకపోవటం పౌర సర్వీసుల అప్రశస్తతకు కారణాలు. సామాన్య మానవుడి పాలనా పద్ధతులు, ప్రక్రియలు అర్థం చేసుకోనేటట్లు చేయడం పాలనా వ్యవస్థ బాధ్యత. కాని ప్రభుత్వం పౌర సంబంధాలను అతి తక్కువ స్థాయిలో నిర్వహిస్తోంది. వాటి పట్ల ఆసక్తి కూడా కనబరచటం లేదు. పౌర సర్వీసులు వాటి భర్తీలోను, శిక్షణలోను ప్రజల నుండి దూరంగా ఉంటూరు. శ్యామలా కుమార్ అనే రచయిత పౌర సర్వీసుల జనవ్యతిరేక వైఖరికి కొన్ని కారణాలు పేర్కొన్నాడు.

పాలనా వ్యవస్థ అధికార పూర్వకంగా ప్రవర్తిస్తూ అనవసరమైన రహస్య పద్ధతిని అవలంబిస్తుంది. దీని వల్ల ప్రజల సహకారం అవసరమైన ప్రభుత్వ విధానాలకు కూడా సరైనా ప్రచారం ఇవ్వరు. ప్రజాసేవయే తమ ధ్యేయమని, ప్రజాస్వామ్య సంస్కృతి అలవరుచుకోవాలన్న విషయం పాలన ఇంకా విస్మరిస్తూనే ఉండడం చూస్తూన్నాం. ప్రజాభిప్రాయాన్ని చాలా అరుదుగా గౌరవించడం జరుగుతోంది. శాసన సభలు, కార్యవర్గం పాలనా యంత్రాంగం పైన నియంత్రణను కోల్పోవడం వల్ల ప్రజలపైన యాజమానిగా పాలన ఆధిపత్యం వహిస్తోంది.

### మీ అవగాహనను పరీక్షించుకోండి – అభ్యాసం 4

1 ఈ క్రింది వాటిలో సివిల్ సర్వీసులు అప్రతిష్ఠ పాలు కావడానికి ఏది కారణమో సూచించండి.

(అ) పాలనా వ్యవస్థల గూర్చిన ప్రజల అజ్ఞానం

(ఆ) పాలనపై రాజకీయ నాయకుల అసమర్థ నియంత్రణ

(ఇ) రాజకీయ నాయకుల జోక్యం

## 6.6 పాలనలో అసమర్థత – సమస్యలు

అన్నిరకాల అసమానతలు తొలగిస్తూ సార్వభౌమిక, ప్రజాస్వామ్య, మతరహిత, సామ్యవాద సమాజం ఏర్పాటు వంటి రాజ్యాంగ ధ్యేయాసాధన భారత రాజకీయ వ్యవస్థ భుజస్కంధాలపై ఉంది. పాలనా యంత్రాంగం సమర్థవంతంగాను, ఫలప్రదమైనదిగాను, ఉద్యోగి బృందం పూర్తిగా నిబద్ధులైతేనే ఈ ఆదర్శాల సాధన సాధ్యం అవుతుంది.

అయితే ఈ ఆశయాల సాధనలో కొన్ని సమస్యలున్నాయి. వాటిని గూర్చి పరిశీలిద్దాం.

### 6.6.1 వర్గ స్వభావం

ప్రభుత్వ సర్వీసులలో సమాజాన్నంతటికి సమాన ప్రాతినిధ్యం లేదు. ఉన్నత శ్రేణి వర్గాల వారే భారత ఉద్యోగ బృందంలో ఎక్కువ ప్రాతినిధ్యం కలిగి ఉన్నారని కొందరు వాదిస్తారు. అంచేత ఉద్యోగ బృందం బాధ్యత గలదిగా , స్పందించేలా, నిబద్ధత కలిగి ఉండాలంటే అన్ని వర్గాల ప్రజలకు పాత్రఉండేటట్లు " "ప్రాతినిధ్య ఉద్యోగ బృందాన్ని" వృద్ధిచేయాలని మరి కొందరి వాదన.

ప్రపంచం అంతా ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో సాంఘిక మార్పంటే ఉద్యోగి బృంద నిర్లిప్తత అందరికి తెలిసిందే. వలసపాలకులకు ఎంతో విశ్వాసంతో సేవ చేసి అధికారాన్ని, ఎన్నో ప్రత్యేక హక్కులు, అనుభవించిన భారతదేశ పాలనా వ్యవస్థ స్వతంత్ర్యం తర్వాత మార్పును తప్పక ప్రతిఘటిస్తుంది. ఉద్యోగి స్వామ్యంలో సమాజంలోని ఉన్నత, మధ్య తరగతికి చెందిన వారే అధిక ప్రాతినిధ్యం కలిగియున్నందున స్వభావరీత్య అది సామాజిక, ఆర్థిక మార్పుకు సుముఖంగా ఉండదని భావించడం జరుగుతుంది.

అయితే భారతదేశ పాలనా వ్యవస్థ ప్రభుత్వ ఆశయాలను అమలు చేయగల సమర్థత లేదని చెప్పలేం. బ్రిటీష్ వారి నుండి మనం బాగా శిక్షణ పొందిన పాలనా వ్యవస్థను సంక్రమించుకొన్నాం. 1953లో పాల్ అప్లెబి చెప్పినట్లు

BRAOU

పన్నెండు అతి సమర్థవంతమైన పాలనా వ్యవస్థలలో భారత దేశ పాలనా యంత్రాంగం ఒకటి అని పేర్కొన్నాడు. మిగతా తృతీయ ప్రపంచ దేశాలతో పోలిస్తే తన పౌర సర్వీసులు, వైజ్ఞానిక సాంకేతిక నిపుణులు, బాగా అర్హత, శిక్షణ, అనుభవం కలిగినవారు. కాని రాజకీయ జోక్యం, ప్రతికూల పని పరిస్థితులు, తక్కువ వేతనాల వల్ల, ఈ సర్వీసులు ప్రభుత్వ సాంఘిక, ఆర్థిక కార్యక్రమాల పట్ల నిర్లిప్తత చూపుతున్నారు.

### 6.6.3 రాజకీయ జోక్యం

పాలనలో సామర్థ్యం పడిపోవడానికి మరో కారణం రోజు వారి పాలనా ప్రక్రియలలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడమని కొందరి అభిప్రాయం. ఇందుకు సంబందించిన ప్రత్యక్ష సంఘటనలు మనం ఎన్నో చూస్తుంటాం. అలాగే మంత్రి కార్యదర్శి ఒకరితో ఒకరు సర్దుబాటు కాకపోవడం వల్ల జరిగే అనర్థాలు, సమస్యలు పాలన విద్యార్థులకు కొత్త ఏమి కాదు. పాలనలో రాజకీయ నాయకుల జోక్యం అనేది ప్రపంచ దేశాలన్నింటిలో కనబడుతుంది. అయితే వారి జోక్యం ఏ మేరకు ఉందనే విషయంలో ఒకదేశానికి మరోదేశానికి భేదం ఉంది. అలాగే ఎక్కువగా పరిణతి చెందిన రాజకీయ వ్యవస్థలు గల దేశాల అనుభవంతో పోలిస్తే తక్కువ పరిణతి చెందిన రాజకీయ వ్యవస్థలు గల దేశాలలో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువగా ఉంటుంది.

### 6.6.4. అసంతృప్తి కరమైన పని పరిస్థితులు

పాలన సామర్థ్యం దెబ్బతినడానికి మరోకారణం ఉద్యోగుల పని పరిస్థితులు ( Service conditions) మెరుగ్గా లేకపోవడం. ఇవి ముఖ్యంగా జీతభత్యాలు, పదవి విరమణ సౌకర్యాలు , పనిగంటలు, ఉద్యోగ భద్రత, గృహ సౌకర్యం, తరుచుగా జరిగే బదిలీలు మున్నగు సమస్యలు వీటి కిందికి వస్తాయి. పని పరిస్థితులు అధ్వాన్నంగా ఉండే ఉద్యోగులలో అలజడి రేకెత్తుతుంది. ఇది ఉద్యోగులలో అస్థిరతకి దోహదం చేసి పాలనా సామర్థ్యం పడిపోవడానికి దోహదం చేస్తుంది. ఉద్యోగులలో అసంతృప్తి చోటు చేసుకుని నిరసనలకు, ఉద్యమాలకు దోహదం చేస్తుంది. దీని వల్ల ప్రజాజీవనం స్తంభించిపోతుంది. ఇటువంటి సమస్యలు ఇతర దేశాలలో లేవని కావు. అయితే భారతదేశం లాంటి పెద్ద దేశంలో ఇటువంటి సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పవచు. ఉద్యోగుల పని పరిస్థితులు ప్రభుత్వానికి ఒక సమస్యగా తయారై, సమాజం నడవడికపై కూడా ప్రభావం కనబరుస్తుంది.

BRAOU

పైన వివరించిన కారణాల వల్ల మన పాలనా వ్యవస్థ (సివిల్ సర్వీసులు) రాజ్యాంగ ఆశయాలను పూర్తిగా సాధించలేక పోయింది. పాలనాయంత్రాంగం చిత్తశుద్ధితో, సమర్థవంతంగా ప్రణాళికా పథకాలను త్వరితంగా అమలు చేసి, లక్ష్యాలను సాధించాలని ప్రణాళికా సంఘం పేర్కొంది.

బ్రిటిష్ వారి ఉద్యోగి పాలనా లక్షణాలు, భారతపాలనలో ఇంకా కొనసాగుతున్నాయని ఇంతకు ముందే చెప్పాం. పౌర సర్వీసులు అసమర్థమైనవికావు కాని వాటి శక్తినంతా వారి వర్గ స్వప్రయోజనాలకోసం వినియోగించబడుతున్నాయి. అయితే వర్తమాన సమజాలన్నింటిలోను ఈ ధోరణి కనిపిస్తూనే ఉంటుంది.

సమర్థులైన, అభివృద్ధి బద్ధులైన అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నా పాలకులను భర్తీ చేస్తేనే సంక్షేమరాజ్య ఆదర్శాల సాధన సాధ్యమౌతుంది. ప్రగతిశీల, మానావతా దృక్పథంలోను శిక్షణ ఇవ్వాలి. మారుతున్న ప్రభుత్వ విధులకు ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలలో ఇతర విషయాలలో శిక్షణ ఇచ్చి అనుసరణ మనస్తత్వాన్ని పెంపొంది, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే సమర్థతను పెంపొందించాలి. అంటే ప్రస్తుతం అనుసరిస్తున్న శిక్షణా పద్ధతులలో ఉద్యోగ బృంద విధానాలలో మౌలిక మార్పును తీసుకురావాలి.

## మీ అవగాహనను పరీక్షించుకోండి – అభ్యాసం 5

1 ఉద్యోగుల అసంతృప్తికరమైన పని పరిస్థితుల వల్ల పాలన సామర్థ్యం ఎందుకు పడిపోతుంది.?

ఈ విధంగా విభిన్న రాజనీతి శాస్త్రవేత్తలు నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని వర్తింప చేసి రాజకీయ వ్యవస్థ నిర్మాణాలు, విధులపై విభిన్న భావనలను ప్రతిపాదించారు.

## 4.5 తులనాత్మక పాలన అధ్యయనంలో నిర్మాణాలు, విధుల విశ్లేషణ

ప్రభుత్వ పాలన అధ్యయనంలోని సంప్రదాయ సిద్ధాంతాలు పాశ్చాత్య దేశాలలో పాలనా కార్యాలను నిర్వర్తించే ఉద్యోగిస్వామ్య నిర్మాణాలను వివరించాయి. ఈ సిద్ధాంతాలను పాశ్చాత్యేతర ప్రభుత్వాల అధ్యయనానికి వర్తించినప్పుడు ఈ ప్రభుత్వ నిర్మాణాలు భిన్నమైన మార్గాలలో తమ విధుని నిర్వర్తించినట్లు వెల్లడైంది. దాని వల్ల సంప్రదాయ సిద్ధాంతాలు లాంఛన ప్రాయమైన నిర్మాణాల ప్రవర్తనా విధానం అధ్యయనంలో విఫలమై పోయాయి. అందుచేత పాశ్చాత్యేతర దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా సమస్యల ఖచ్చితమైన అవగాహనకు సమాజ శాస్త్రం నుంచి గ్రహింపబడిన నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని ఉపయోగించబడింది. ఈ దృక్పథం ఈ దేశాలలోని పాలన ప్రవర్తనపైనే గాక, దాని ఆవరణపై సమగ్ర అవగాహనకు అవశ్యకమైంది. కానీ ఆవరణ సిద్ధాంతం ప్రభుత్వాలు కేవలం ప్రధాన చరాంశం (Variable) అనే అతి సాధారణ నిర్ధారిత అభిప్రాయానికి దారి తీసినట్లే నిర్మాణాలు, విధుల దృక్పథం నిర్మాణాలను నిర్లక్ష్యం చేసి విధులపై మితిమీరిన ప్రాధాన్యతను కనపర్చింది. సక్రమంగా అర్థం చేసుకొంటే ఆవరణ దృకథం ఒక వ్యవస్థ తన పరిసరాలపై ఆధారపడినప్పటికీ అది ఒక స్వయం ప్రతిపత్తి (విచక్షణ) ని కలిగి ఉంటుందని వివరిస్తుంది. అదే విధంగా నిర్మాణాలు, విధుల దృక్పథం విధులనే కాక నిర్మాణాలను కూడా సమానంగా విశ్లేషిస్తుంది.

BRAOU

## 4.6. రిగ్స్ నిర్మాణ, విధుల విశ్లేషణ

రిగ్స్ నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తింపచేయడంలో అనేక సమస్యలున్నట్లు గుర్తించాడు. అభివృద్ధిచెందుతున్న దేశాలలో రాజకీయాలు, పాలనా రంగాలలో లాంఛన ప్రాయమైన నిర్మాణాలతో పాటు, లాంఛన ప్రాయం కాని నిర్మాణాలు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఈ దేశాలలో చట్టబద్ధమైన (Legal) నిర్మాణాలతో పాటు చట్ట బద్ధంకాని (Illegal) నిర్మాణాలు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఇదే విధంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిర్మాణాలు లాంఛనప్రాయమైన, చట్టబద్ధమైన విధులతో పాటు లాంఛన ప్రాయం కానీ, చట్ట బద్ధంకానీ కారణాలను నిర్వర్తిస్తాయి. కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో విధి, చర్య (Activity) పథకం (Programme) ల మధ్య అతి వ్యాప్తి ఉండటం చేత వాటిని ఖచ్చితంగా వేరు పర్చడం సులభం కాదు. ఈ విధంగా నిర్మాణాలను, విధుల, దృక్పథాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు వర్తింప చేయటంలో ఎదురయ్యే సమస్యలను రిగ్స్ గుర్తించాడు. ఈ సమస్యల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని వర్తింప చేసేముందు ఆ దృక్పథంలోని కీలక భావనలైననిర్మాణాలు, విధులలో తగిన మార్పులు, సవరణలు చేయాలని రిగ్స్ వాదించాడు. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాల పరిస్థితులకు అనుగుణంగా ఈ రెండు భావనల అర్థాన్ని విస్తృత పర్చాలని రిగ్స్ వక్కాణించాడు.

రిగ్స్ పాలనా వ్యవస్థల అధ్యయనానికి నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని వర్తింప చేయటంలో డేవిడ్

ఈస్టన్ ఉత్పాదితాలు, ఉత్పాదకాల విశ్లేషణను ప్రాతిపదికగా ఉపయోగించాడు. లక్ష్యాలు, వనరులు, డిమాండ్లను పాలనా వ్యవస్థ ఉత్పాదకాలుగా భావించవచ్చునని రిగ్స్ పేర్కొన్నాడు. ఈ ఉత్పాదకాలు, సేవలు, వస్తువులు, నిర్బంధచర్యలు అనే ఉత్పాదితాలు గా పరివర్తన చెందుతాయి. పాలనా వ్యవస్థను విస్తృత సమాజం ఉపవ్యవస్థగా పరిగణించినప్పుడు ఈ ఉపవ్యవస్థ ఉత్పాదకాలను విస్తృత సమాజం ఉత్పాదితాలుగా పరిగణించవచ్చును. ఈ విధంగా పరిగణించినప్పుడు ప్రభుత్వ పాలనను అంతర్గత ఏర్పాట్లు సంబంధాల ప్రాతిపదిక మీద గాక పాలనా వ్యవస్థపై, సమాజంలోని ఇతర ఉప వ్యవస్థల మధ్య అంతర్ చర్య ప్రాతిపదికగా అవగాహన చేసుకోవాలని రిగ్స్ సూచించాడు.

రిగ్స్ నిర్మాణాన్ని ఒక సామాజిక వ్యవస్థ ప్రమాణిక లక్షణంగా రూపొందించిన ప్రవర్తనా విధానం అని నిర్వచించాడు. ఈ దృక్కోణం నుంచి ప్రతిప్రభుత్వ శాఖను ఒక నిర్మాణంగా పరిగణించవచ్చునని రిగ్స్ పేర్కొన్నాడు. ఈ నిర్మాణంలో ప్రాధాన్యత వ్యక్తులు, వస్తువుల పై గాక వారి ప్రవర్తనపై కేంద్రీకృతమై ఉంటుంది. అయితే ఈ నిర్మాణంలో వారి మొత్తం చర్యలు గాక ఆ శాఖలక్ష్యాలకు, కార్యకలాపాలకు సంబంధించిన చర్యలు మాత్రమే ఉంటాయి. ఈ చర్యలతో పాటు ప్రభుత్వ శాఖలో విధి నిర్వహణలో ఆ శాఖ ప్రతిస్పందించే వ్యక్తుల (లబ్దిదారులు, శ్రోతలు) చర్యలు కూడా ఉంటాయి.

రిగ్స్ విధిని నిర్వచిస్తూ విధి అంటే నిర్మాణం వల్ల కలిగే పరిణామం అని పేర్కొన్నాడు. ఈ పరిణామం ఇతర నిర్మాణాలను లేదా మొత్తం వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఈ విధంగా విధి రెండు లేక అంతకంటే ఎక్కువ నిర్మాణాల పరస్పర ఆధార విధానం లేదా వివిధ చరాంశాల మధ్య సంబంధం అని రిగ్స్ వివరించాడు.

BRAOU

### 4.6.1 వ్యవసాయిక పారిశ్రామిక సమాజాల నమూనా

ప్రతి సమాజం తన మనుగడకు కొన్ని విధులను విధిగా నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ ఆవశ్యక విధుల విశ్లేషణ తులనాత్మకంగా విశ్లేషించేందుకు అనువైన నిర్మాణాలను గుర్తించేందుకు అవసరమైన వర్గీకరణలకు (Categories) సమకూరుస్తుంది. ఈ పద్ధతి వివిధ నిర్మాణాల మధ్యగల సంబంధాలను లేదా పరస్పర ఆధారాన్ని పరీక్షించేందుకు కూడా తోడ్పడుతుంది. అంతేగాక పాలనా పద్ధతులు, తమ సామాజిక పరిసరాల మధ్య పరస్పర ప్రభావాన్ని కూడా పరిశీలించేందుకు తోడ్పడతాయి. రిగ్స్ నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని వర్తింపచేసి సమజాలను వ్యవసాయ సమాజాలనీ (Agraria), పారిశ్రామిక (Industria) సమాజాలనీ వర్గీకరించాడు. వ్యవసాయ సంస్థల కార్యకలాపాలు ఆధిక్యత వహించే సమాజాలను వ్యవసాయిక సమాజాలనీ, పారిశ్రామిక కార్యకలాపాలు ఆధిక్యత వహించే సమాజాలను పారిశ్రామిక సమాజాలనీ వర్గీకరించాడు. రిగ్స్ ఈ రెండు నమూనాలను వివిధ సమాజలలోని సామాజిక, రాజకీయ, పాలనా విధానాలు, వాస్తవాలను విశ్లేషించేందుకు వర్గీకరించేందుకు ఉపయోగపడే ఊహాత్మక సాధనాలను సమకూర్చేందుకు రూపొందించాడు. వ్యవసాయక పారిశ్రామిక సమాజాల నమూనాలు సామ్రాజ్యవాద చైనా, వర్తమాన అమెరికాలను ప్రాతినిధ్యం వహించే భిన్న ధృవాల వంటి నమూనాలు రిగ్స్ వ్యవసాయిక, పారిశ్రామిక సమాజ లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించాడు.

## 6.11 సంప్రదించిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | R.K. Sapru | : | Civil Service Administration in India. |
| 2. | C.N. Balerao (Ed.) | : | Administration, Politics and Development in India. |
| 3. | Haridwar Rai & S.K.Singh | : | Current Ideas and Issues in Indian Administration. |
| 4. | Basudeva Panda | : | Indian Bureaucracy: An Inside Story |
| 5. | Mohit Bhattacharya | : | Bureaucracy and Development Administration. |
| 6. | C.P.Bambri | : | Bureaucracy and Politics in India |
| 7. | R.B. Jain | : | Issues in Contemporary Indian Administration |


రచయిత : వి. భాస్కరరావు.

BRAOU

నమూనాను పోలిన సమాజాలు అతి అరుదుగా గోచరించే అవకాశం లేకపోలేదని రిగ్స్ వివరించాడు. రిగ్స్ టాల్కట్ పార్సన్స్‌ను అనుసరిస్తూ ప్రతిఫలన, సంయోజిత సమాజాల లక్షణాలను ఈ విధంగా వివరించాడు. ప్రతిఫలన సమాజాలు కార్యపరంగా నిర్దిష్టత, సాధనాత్మకత, సార్వజనీనత లక్షణాలను కలిగి ఉండగా, కార్యపరమైన భిన్నత్వం, ఆపాదిత విలువలు, ప్రత్యేకీకరణ సంయోజిత సమాజాల లక్షణాలు.

రిగ్స్ సంయోజిత సమాజంలో విభిన్నీకరణ పూర్తిగా లోపిస్తుందనీ పేర్కొన్నాడు. దీనికి భిన్నంగా ప్రతిఫలన సమాజాలలో విభిన్నీకరణ, సమైక్యీకరణ అత్యున్నత స్థాయిలో గోచరిస్తాయని రిగ్స్ వాదించాడు. రిగ్స్ ప్రపంచంలో ఈ రెండు తరగతులకు చెందని నమూనాలున్నట్లు పేర్కొన్నాడు. సంయోజిత సమాజాలకు, ప్రతిఫలన సమాజాలకు మధ్యస్థంగా ఉండే ఈ సమాజాలలో కొంత స్థాయిలో విభిన్నీకరణ వున్నప్పటికీ వాటిలో సమైక్యరణ లోపించడం కానీ, లేదా అనుచిత సమైక్యీకరణ (Malintegration) చోటు చేసుకోవడం జరుగుతుందని రిగ్స్ పేర్కొన్నాడు. ఈ సమాజాలనే రిగ్స్ పాదర్శనిక సమాజాలని పిలిచాడు. రిగ్స్ పారదర్శనిక సమాజాన్ని ఈ విధంగా నిర్వచించాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందింప చేసేందుకు కొంత స్థాయి వరకు విభిన్నీకరణ లేదా పాత్రల ప్రత్యేకీకరణను సాధించినప్పటికీ ఈ పాత్రలను సమైక్య పర్చటంలో విఫలమైన సమాజాలను పారదర్శనిక సమాజాలనవచ్చును.

రిగ్స్ వివిధ సమాజాలను వివరించేందుకు ఉపయోగించిన సంయోజిత, ప్రతిఫలన, పారదర్శనిక అనే పదాలను భౌతిక శాస్త్రం నుంచి గ్రహించాడు. సంయోజిత కాంతి (fused light) తెల్లని రంగు లాగే అనేక ఫ్రీక్వెన్సీల (Frequencies) సమ్మేళనం. ప్రతిఫలన కాంతి (Diffracted light) ఇంద్రధనస్సు లాగా వివిధ ఫ్రీక్వెన్సీలను వేరు పరుస్తుంది. ఇదే విధంగా సంయోజిత సమాజంలోని భాగాలైన నిర్మాణాలలో తీవ్రమైన వైవిధ్యం ఉంది. ప్రతిఫలన సమాజంలో నిర్మాణాలు నిర్దిష్టమైనవి.

ఇవే రూపకాలనుపయోగిస్తూ సంయోజిత వెలుగు కిరణాన్ని ఒక పటకం (Prism) ద్వారా ప్రవేశపెట్టినప్పుడు అది తెరమీద ఇంద్రధనస్సులోకి వివిధ రంగులలో ప్రతిఫలిస్తుందనీ, ఈ పరిస్థితి పారదర్శనిక పరిస్థితి అని రిగ్స్ పేర్కొన్నాడు.

పారదర్శనిక సమాజం సంయోజిత, ప్రతిఫలన సమాజాల లక్షణాల సమ్మేళనం అని రిగ్స్ పేర్కొన్నాడు. పారదర్శనిక సమాజాల లక్షణాలు ఇవి: ఎంపిక తత్వం ( సార్వజనీనత, నిర్దిష్టత మధ్యస్థం) అర్జిత విలువలు (అపాదిత విలువలు, సాధనాత్మక విలువల మధ్యస్థం ) బహుళ విధుల వాదం ( కార్యపర నిర్దిష్టత, కార్యపర వైవిధ్యం మధ్యస్థం). రిగ్స్ సమాజాల వర్గీకరణ విభిన్నీకరణ భావన ప్రాతిపదికగా రూపొందించబడింది. వాస్తవానికి విభిన్నీకరణ అభివృద్ధికి అవశ్యక పరిస్థితి. అయితే రిగ్స్ కేవలం విభిన్నీకరణ మాత్రమే అభివృద్ధి సాధనకు తోడ్పడలేదనీ, విభిన్నీకరణతోపాటు సమెక్యీకరణకూడా అభివృద్ధి సాధనకు అవసరమని వక్కాణించాడు. రిగ్స్ సంయోజిత, ప్రతిఫలన సమాజాలు కొలబద్ద మీదా భిన్నధృవాల (Polar) వంటి సామాజాలనీ పేర్కొన్నాడు. రిగ్స్ సియామీథాయ్‌లాండ్, సామ్రాజ్య వాద చైనాలు సంయోజిత సమాజానికి, పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన అమెరికాను ప్రతిఫలన సమాజానికి, అనేక వర్తమాన అభివృద్ధి చెందుతున్న దేశాలను పారదర్శనిక సమాజానికి దృష్టాంతాలుగా పేర్కొన్నాడు.

BRAOU

### 4.6.3 పారదర్శనిక సమాజ లక్షణాలు

రిగ్స్ పారదర్శనిక సమాజం ప్రధానంగా మూడు లక్షణాలను, (లాంఛనత్వం (Formalism), భిన్నత్వం (heterogenity), అతివ్యాప్తి (Overlapping).) కలిగి వుంటుందని సూచించాడు. లాంఛనప్రాయంగా రూపొంధించిన నియమాలు, నిబంధనలకు వాస్తవంలో ఆచరణకు మధ్యగల అంతరమే లాంఛనత్వం. అంటే సిద్ధాంతానికి, ఆచరణకు మధ్య గల వ్యత్యాసాన్ని లాంఛనత్వం అనవచ్చును. ఇంకోవిధంగా చెప్పాలంటే ప్రకటించిన ఆశయాలకు, వాస్తవ ఆచరణకు ఎక్కడ పొంతన లేకపోవటానికి లాంఛనత్వంగా పేర్కొనవచ్చును. భిన్నత్వం అంటే సమాజంలో విభిన్న విధానాలు, పోకడలు, దృక్పథాలు, పద్ధతులు, అభిప్రాయాలు కలిసికట్టుగా కొనసాగటమే భిన్నత్వం. పారదర్శనిక సమాజాలలో భిన్నత్వం పాలన రంగంలో సహా అన్ని రంగాలలో గోచరిస్తుంది. ఈ సమాజాలలో భిన్నత్వం పరిమాణం అధికంగా ఉండటం చేత సామాజిక మార్పు అసంపూర్ణంగా, అసమతుల్య పంథాలో సంభవిస్తుంది. చివరగా పారదర్శనిక సమాజాలలో లాంఛనప్రాయంగా భిన్నత్వం గల నిర్మాణాలు (ఆధునిక నిర్మాణాలు) భిన్నత్వం లేని నిర్మాణాలు (సాంప్రదాయ నిర్మాణాలు) కలిసి పని చేయటాన్నే రిగ్స్ అతివ్యాప్తిగా పరిగణించాడు. ప్రతిఫలన, సంయోజిత సమాజాలలో గోచరించని అతి వ్యాప్తి పారదర్శనిక సమాజాలలో అధిక పరిమాణంలో గోచరిస్తుంది. ఈ సమాజాల్లో అనేక నూతన లేదా ఆధునిక సమాజాలను ఏర్పాటు చేసినప్పటికీ వాస్తవంలో సాంప్రదాయ నిర్మాణాలే సామాజిక వ్యవస్థ పై ఆధిపత్యం వహిస్తాయి.

BRAOU

### 4.6.4 సాలా నమూనా

రిగ్స్ పారదర్శనిక సమాజాలలోని పాలనా ఉపవ్యవస్థను సాలా (Sala ) అనే పేరు ప్రతిపాధించాడు. సాలా అనే స్పానిష్ పదానికి కార్యాలయం, మత సంబంధమైన కార్యకలాపాలను నిర్వర్తించే సభ, గది అనే అర్థాలు ఉన్నాయి. సాలాలో ప్రతిఫలన సమాజానికి చెందిన బ్యూరో, సంయోజిత సమాజాలకు చెందిన ఛాంబర్ లక్షణాలు మిళితమై ఉంటాయి. పారదర్శనిక సమాజం లక్షణాలైన లాంఛత్వం, భిన్నత్వం, అతివ్యాప్తి సాలా వ్యవస్థలో గోచరిస్తాయి.

సాలాలోని పాలనోద్యోగులు తమ అధికారాలను పాలనా లక్ష్యాల సాధనకు గాక తమ స్వార్థ ప్రయోజనాల సాధనకు ఉపయోగిస్తారు. సమాజంలో తమకు గల ప్రాధాన్యత కారణంగా సాలా ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాలలో విస్తృతమైన జోక్యాన్ని కల్పించుకుంటారు. సాలా ఉద్యోగులు పాలనా వ్యవస్థలోని వైవిధ్యాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటారు. వారు పాలనా నియమాలను తమకు సంబంధించిన వ్యక్తుల విషయాలలో ఖచ్చితంగా అమలు పర్చినప్పటికీ తమ స్నేహితులు, బంధువులు, ఆశ్రితులు, తమ కులానికి లేదా మతానికి చెందినవ్యక్తుల విషయాల్లో వాటిని పూర్తిగా ఉల్లంఘిస్తారు.

సాలాలోని ఉద్యోగి బృంద భర్తీ, పదోన్నతి, వేతనాలు, క్రమశిక్షణా చర్యలు, బోనస్ వంటి ప్రేరకాలు చెల్లింపు మొదలైన అంశాలలో ప్రతిభకంటే బంధుత్వం, స్నేహం, కులం, మతం ప్రాంతం మొదలైన సంకుచిత సామాజిక అంశాలే ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈ విధంగా సాలా వ్యవస్థలో ప్రతిచర్యపై సామాజిక

సంస్కృతిక, ఆర్థిక వ్యవస్థల ప్రభావం ప్రగాఢంగా ఉంటుంది. దీని ఫలితంగా సాలా పాలనా వ్యవస్థ అవినీతికి, ఆశ్రిత జన పక్షపాతానికి, అసమర్థతకు నిలయమై ఉంటుంది.

### 4.6.5 బజార్ క్యాంటిన్ నమూనా

పారదర్శనిక సమాజపు ఆర్థిక వ్యవస్థలను బజార్ కాన్యటీన్‌గా ప్రతిపాధించాడు. పారదర్శనిక సమాజాలలో సంయోజిత సమాజపు ఎరేనా (arena) కారకాలు, ప్రతిఫలన సమాజపు మార్కెట్ కారకాలు సమ్మేళనం చెంది ధరల అనిశ్చిత పరిస్థితి (Indeterminancy) ని సృష్టిస్తాయి. రిగ్స్ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల సంబంధాలను కొనుగోలు దార్లు, అమ్మకం దార్లు మధ్యగల సంబంధాల ప్రాతిపదికగా విశ్లేషించాడు. పారదర్శనిక సమాజంలో ప్రభుత్వ సేవలకు ప్రజలు చెల్లించవలసిన విలువ ప్రజలు, ప్రభుత్వ అధికారులు మధ్య సంబంధాలకు అనుగుణంగా నిర్ధారించబడుతుందని రిగ్స్ వివరించాడు. ప్రభుత్వ సేవలు సమాజంలో ఉన్నత వర్గాలకు చెందిన వ్యక్తులకు, ప్రాధాన్యత గణాల (క్లెక్ట్స్) కు చెందిన వ్యక్తులకు స్వల్ప వెలకు, ఈ వర్గాలకు చెందని వ్యక్తులకు అధిక వెలకు సమకూర్చబడతాయి. ఇంకో విధంగా చెప్పాంటే పారదర్శనిక సమాజంలోని ఆర్థిక వ్యవస్థకు సబ్సిడీ క్యాంటీన్‌తో సారూప్యత ఉందని రిగ్స్ భావించాడు. పారదర్శనిక సమాజంలో సాంప్రదాయ బజారు వ్యవస్థలో మాదిరి పన్నులు, సుంకాలు, పర్మిట్లు, లైసెన్సుల మంజూరులాంటి బేరసారాలు నిత్యపాలనను ప్రభావితం చేస్తాయి. దాని ఫలితంగా ప్రభుత్వ ఆదాయం తగ్గుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ వేతనాలు చెల్లించబడతాయి. అందుచేత ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి, అక్రమ మార్గాల ద్వారా ఆదాయాన్ని సంపాదించేందుకు పూనుకుంటారు. ఈ విధంగా పారదర్శనిక సమాజాలలో ప్రభుత్వ పాలన, ఆర్థిక ఉపవ్యవస్థలు పరస్పరం ప్రభావితం అవుతాయి.

### 4.6.6 పారదర్శనిక సమాజంలో మార్పు

రిగ్స్ పారదర్శనిక సిద్ధాంతంలో మార్పు అంతర్లీనంగా దాగి వున్న భావన. రిగ్స్ మార్పు ఫలితాలు, సాధనాలు, బహుళ రేఖీయ మార్పు సిద్ధాంతం ప్రాధాన్యతను వక్కాణించాడు,. రిగ్స్ సమాజాలన్నీ ప్రతిఫలన స్థాయిని పొందలేవనీ, ప్రతిఫలన స్థాయి పొందిన సమాజాలు అమెరికా, బహుల రాజకీయాలు, పాలనా లక్షణాలను సంతరించుకోలేవనీ సూచించాడు. కొన్ని సమాజాలు పారదర్శనిక సమాజాలుగా శాశ్వతంగా కొనసాగినప్పటికీ సంయోజిత సమాజాలు శాశ్వతంగా కొనసాగవని రిగ్స్ ఉద్ఘాటించాడు.

రిగ్స్ సమాజాలను ప్రతిఫలన లక్షణం అంతర్గతంగా ఉత్పన్నమయ్యే సమాజాలు (అంతర్గత పారదర్శనిక సమాజాలు), ప్రతిఫలన లక్షణం బహిర్గత కారణాల వల్ల ఉత్పన్నమయ్యే సమాజాలు (బహిర్గత పారదర్శనిక సమాజాలు) అని రెండు తరగతులుగా విభజించాడు. ఈ రెండు రకాల సమాజాలలో ప్రతిఫలన లక్షణం మారుతున్న ఉత్పత్తి విధానాల సంచిత (cumulative) ప్రభావానికి లోనవుతుందని రిగ్స్ వాదించాడు.

### 4.6.7 రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంతం : విమర్శనాత్మక పరిశీలన

రిగ్స్ నిర్మాణాలు, విధుల దృక్పథం ప్రాతిపదికగా రూపొందించిన పారదర్శనిక సమాజం సిద్ధాంతం అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక పాలన వ్యవస్థలను భావనాత్మకంగా (Conceptualization)

BRAOU

విశ్లేషించటంలో చాలా వరకు సఫలీకృతమైనప్పటికీ, ఆ దేశాల పాలనా వ్యవస్థలను సమగ్రంగా వివరించడంలో విఫలమైందని చెప్పటం జరిగింది. దీని ఫలితంగా రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంతాలు పొగడ్తలను అందుకొనడంతో పాటు అనేక విమర్శలకు కూడా గురైంది. రిగ్స్ అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలు సమాజం నుంచి పొందే ఉత్పాదకాలను నివారించటం పైన కనబర్చిన ఆసక్తిని సమాజం పై పాలనా వ్యవస్థ ప్రభావాన్ని విశ్లేషించటంపై కనబర్చలేదని విమర్శింపబడింది.

రిగ్స్‌కు అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక, సాంస్కృతిక వ్యవస్థల పై నిగూఢ అవగాహన లోపించటం వలన అతను ప్రతిపాదించిన లాంఛనత్వం, అతివ్యాప్తి మొదలైన భావనలలో లోపాలు చోటు చేసుకున్నాయని కొందరు విమర్శించారు. ఉదాహరణకు అతివ్యాప్తిని పారదర్శనిక సమాజాలలోనే గాక అమెరికా వంటి ప్రతిఫలన సమాజాలలో కూడా గుర్తించవచ్చునని దయా కృష్ణ పేర్కొన్నాడు. ఇదే విధంగా లాంఛనత్వం కేవలం నకారాత్మక ఫలితాలనే కాక సకారాత్మక ఫలితాలను కూడా సమకూరుస్తుందని వాల్సన్, మిలిసీ అనే రచయితలు వాదించారు. రిగ్స్ తన పారదర్శనిక సమాజ నమూనాను పాశ్చాత్య పక్షపాత వైఖరితో రూపకల్పన చేయటం వలన ఆ నమూనా అభివృద్ధి చెందుతున్నసమానకారాత్మక లక్షణాలను మాత్రమే వెల్లడించె అవాస్తవిక నమూనా అని రమేష్ కె. అరోరా విమర్శించాడు. ఈ విమర్శలకు ప్రతి స్పందించి రిగ్స్ తన పారదర్శనిక సమాజ నమూనాలో కొన్ని సవరణలు చేస్తూ మరో నూతన నమూనాను ప్రతిపాదించాడు. ఏమైనప్పటికీ రిగ్స్ నిర్మాణాలు, విధుల దృక్పథం ఆధారంగా ప్రతిపాదించిన పారదర్శనిక సమాజం సిద్ధాంతం ఫలనా సిద్ధాంతంలో అత్యంత విశిష్టమైన, ప్రతిభావంతమైన, ప్రభావ పూరితమైన నమూనా అనడం నిర్వివాదాంశం. తన నమూనా ద్వారా రిగ్స్ పాలనా సిద్ధాంతంలో అత్యంత ఉత్కృష్టమైన నమూనా సృష్టికర్తగా సుస్థిరమైన స్థానాన్ని పొందగలిగాడు.

BRAOU

## 4.7 ముగింపు

సమాజ, రాజకీయ శాస్త్రాలకు ఉపయోగపడినట్లు నిర్మాణాలు, విధుల దృక్పథం ప్రభుత్వ పాలనా శాస్త్రానికి కూడా ఎంతో ఉపకరించింది. ఈ దృక్పథం వల్ల విభిన్న దేశాలకు చెందిన సామాజిక అంశాలతో పాటు అనేక పాలనాంశాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఫలితంగా వీటిపట్ల అవగాహన పెంపొందింది. నిర్మాణాలు, విధుల దృక్పథం ప్రభుత్వ పాలన శాస్త్రంలో సిద్ధాంత నిర్మాణం కొరతను కొంత వరకు తీర్చగలిగింది. ఈ దృక్పథం ఆధారంగా రిగ్స్ ప్రతిపాదించిన పారదర్శనిక సమాజంనమూనా, ఈ నమూన ప్రభావంతో ఇతర పాలనా రచయితలు ప్రాతిపాదించిన నమూనాలు, భావనలు పాలనా సిద్ధాంతాన్ని సైద్ధాంతిక పరంగా పరిపుష్టం చేశాయి. అంతేకాక, ఈ దృక్పథం అన్ని సమాజాలకు వర్తించే విధంగా ప్రభుత్వ పాలనా సిద్ధాంతానికి విస్తృత, సార్వజనీన ప్రతిపాదికను ఏర్పరచింది. ఏమైనప్పటికీ, ఈ దృక్పథాన్ని సమాజ శాస్త్రం, రాజనీతి శాస్త్రాల్లో వర్తింప చేసినంత విస్తృతంగా ప్రభుత్వ పాలన శాస్త్రంలో వర్తింప చేయలేదు.

అందుచేత నిర్మాణాలు విధుల దృక్పథం నుంచి పూర్తి ప్రయోజనాన్ని పొందేందుకు ఈ దృక్పథం ప్రాతిపదికగా అనేక అధ్యయనాలను సాగించవలసి వుంది.

## 4.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I.** ఈ క్రింది ప్రశ్నలకు 30పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. తులనాత్మక పాలన అధ్యయనంలో రిగ్స్ ప్రతిపాధించిన నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని క్లుప్తంగా వివరింపుము?
2. రిగ్స్ ప్రతిపాదించిన పారదర్శనిక సమాజ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా వివరింపుము.
3. రిగ్స్ నిర్మాణాలు, విధుల దృక్పథం ప్రాతిపదికన రూపొందించిన సమాజాల వర్గకరణను చర్చింపుము?

**II.** ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు వ్రాయండి?

1. సంయోజిత, ప్రతిఫలన సమాజాల లక్షణాలను వివరింపుము?
2. రిగ్స్ ప్రతిపాధించిన సాలా నమూనాను పరిశీలింపుము?
3. తులనాత్మక పాలన అధ్యయనంలో రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంత విశిష్టతను వివరింపుము?

## 4.9 చదువదగిన రచనలు

BRAOU


1. F.W. Riggs, Administration in Developing Countries:The Theory of Prismatic Society, Boston : Houghton Miffin, 1964.
2. Ramesh K. Arora, Comparative Public Administration : An Ecological Perspective, New Delhi : Associated Publishing House, 1972
3. Gabriel Almond and Bringham Powell, Comparative Politics : A Developmental Approach, Boston Little Brown, 1966
4. Tallcott Parsons, The Social System, Glencoe, Ill : Free Press, 1951
5. Faisal S.A Al Salen, The Ecological Dimensions of Development Administration, New Delhi : Associated Publishing House, 1977
6. S.P. Verma , Modern Political Theory, New Delhi : Sterling Publishing House, 1975.


రచయిత : యం. బాపూజీ

# భాగం – 5 ప్రగతి దృక్పథాలు : గాంధేయ, మార్క్సిస్టు దృక్పథాలు

విషయక్రమం


5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 ప్రగతికి సంబంధించిన గాంధేయ దృక్పథం

5.3 ప్రగతికి సంబంధించి, మార్క్సిస్టు దృక్పథం

5.4 ముగింపు

5.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

5.6 చదువదగిన రచనలు


## 5.0 లక్ష్యాలు

ప్రగతి పాలన నేపథ్యంలో గాంధేయ, మార్క్సిస్టు దృక్పథాలను వివరించడమే ఈ భాగం ప్రధానాంశం. ఇది చదివితే కింది అంశాలు వివరించగలుగుతారు.

- ప్రగతికి సంబంధించి గాంధీ, మార్క్స్‌ల భావాలలో సారుపత్యాలు,వ్యతిరేకతలు,
- గాంధీ ప్రగతి భావాలలోని ప్రధానాంశాలు.
- మార్క్స్ ప్రగతి భావాలలోని ప్రధానాంశాలు.

BRAOU

## 5.1 పరిచయం

ప్రపంచ చరిత్రలో మహాత్మాగాంధీ, కార్ల్‌మార్క్స్‌లకు ప్రత్యేక స్థానం ఉంది. వారిద్దరి తాత్విక చింతన ప్రపంచ చరిత్రను గొప్పగా ప్రభావితం చేసింది. మానవ అభ్యుదయాన్ని గురించి, దానిని సాధించే పద్ధతులను గురించి వారు చెప్పిన సైద్ధాంతిక విషయాలు, వారు చేసిన కృషి పలు దేశాల ప్రజలను ప్రభావితం చేశాయి. వారి అభిప్రాయాలలో అనేక సారుప్యాలు ఉన్నాయి. అనేక విషయాలలో మౌలికమైన విభేధాలున్నాయి. సమాజాలను గురించి ఒక సమగ్రమైన దృక్పథంతో వారు కొన్ని సూత్రీకరణలు చేశారు. సామాజిక మార్పును గురించి, మానవ స్వభావాన్ని గురించి విశ్లేషించారు. ఈ సందర్భంలో ప్రగతిలేక అభివృద్ధిని గురించి కూడా కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఈ భాగంలో మహాత్మాగాంధీ, కార్ల్‌మార్క్ ప్రగతిని గురించి చెప్పిన అంశాలను వివరించాం.

## 5.2 ప్రగతికి సంబంధించి గాంధేయ దృక్పథం

● గ్రామస్వరాజ్: గాంధీ అభిప్రాయం ప్రకారం భారత దేశంలోని గ్రామాలు ఒక రిపబ్లిక్‌గా ఏర్పడాలి. ఇవి ఇతరగ్రామాలపై ఆధారపడక స్వయం సమృద్ధి సాధించుకోవాలి. అయితే కొన్ని విషయాలలో పరస్పరం సహకరించుకోవాలి. ప్రతి గ్రామం తన విధులకు సంబంధించి ధర్మకర్తలు (Trusteeship) గా వ్యవహరించాలి. తగిన అధికారం, పరిధి గల ప్రజల చేత ఎన్నుకోబడిన పంచాయితీ గ్రామ పరిపాలన నిర్వహించాలి. దేశ పాలన అట్టడుగు స్థాయి నుండి ప్రారంభం కావాలి. ప్రతి గ్రామం రిపబ్లిక్‌గా రూపొందించబడాలి అంటే తగినంత మంది అధికారులు కలిగి స్వయం పోషకత్వంలో తన కార్యకలాపాలు తానే నిర్వహించుకోవాలి. ప్రతి గ్రామం ప్రజలలో గౌరవ, సామర్థ్యాన్ని పెంపొందించి సాముదాయక భాగస్వామ్యాన్ని పెంపొందించాలి. ఇతర రచయితల వలనే గాంధీ లాంఛనప్రాయం కాని, సంబంధాలపై ఆధారపడిన సమాచార ప్రసార ప్రక్రియ వల్ల గ్రామ ప్రాంతాలలో నిర్ణయీకరణ (decision making) ఏకాభిప్రాయ సాధన సులభమని విశ్వసించాడు.

పంచాయితీలు నిర్వహించలేని కార్యకలాపాలకే ప్రభుత్వ పాత్ర పరిమితం కావాలని గాంధీ అభిప్రాయం. గాంధీ సామాజిక నిర్మాణంలో పార్లమెంటరీ సంస్థలకు సమానాంతరంగా స్వయం ప్రతిపత్తిగల పంచాయితీ వ్యవస్థను ఊహించాడు. గాంధీ పేర్కొన్నట్లు అపరిమిత సంఖ్యలో గ్రామాలు కలిగిన సామూహిక నిర్మాణంలో నిరంతరం విస్తృతమైన వలయాలు అభివృద్ధి చెందుతాయి. ఈ నిర్మాణ క్రమంలో వ్యవస్థ అట్టడుగు స్థాయి మీద ఆధారపడిన శీర్షభాగం (apex) కలిగిన పిరమిడ్ రూపంలో ఉండదు. వ్యక్తి కేంద్ర బిందువుగా కలిగిన విస్తృత చక్రం ఆకృతిని కలిగి ఉంటుంది.

ఈ విస్తృత వలయంలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తులు అట్టడుగు స్థాయి వ్యక్తులను అణిచి వేసే విధంగా తమ అధికారాలను చెలాయించకపోగా, మొత్తం వ్యవస్థను బలోపేతం చేసి దాని నుంచి శక్తి పొందుతారు.

గాంధీ అభిప్రాయంలో అధికంగా కేంద్రీకృతమైన రుణమయ ఆర్థిక వ్యవస్థ, కాఠిన్యమైన ఉద్యోగి స్వామ్యం అణిచివేతకు దారి తీస్తుంది. దీని వల్ల అధికారం ఉన్నత స్థాయిలో కేంద్రీకృతమై అట్టడుగు స్థాయి లోని వ్యక్తులు తమ స్వాతంత్ర్యాన్ని, గౌరవను కోల్పోతారు. తన పంచాయితీ వ్యవస్థ భావనకు పూర్వావసరంగా గాంధీ గ్రామాల ఆర్థిక స్వయం పోషకత్వం ప్రాధాన్యతను వక్కాణించాడు. స్వయం ప్రతిపత్తి కల ఆర్థిక పునాది లేకుండా సమాంతర రాజకీయ వ్యవస్థ మనలేదని గాంధీ ఉద్ఘాటించారు.

గాంధీ గ్రామ స్వరాజ్ భావనను జయప్రకాష్ నారాయణ్ ఈ విధంగా వివరించాడు "గాంధీ ఆశించిన సమాజం గ్రామీణ సమాజం కాదు. పట్టణాలతో కూడిన సమాజం కాదు. గాంధీ సాముదాయిక (Communitarian) సమాజాన్ని ఆశించాడు. భారత రాజకీయ వ్యవస్థకు భిన్నమైన విలోమ (Invert) పిరమిడ్ ఆకారంలో పునర్ నిర్మించాలని భావించాడు.

గ్రామ ప్రాంతాలలోని ప్రాథమిక సమూహాలు ప్రాంతీయ సమూహంగా, ఈ ప్రాంతీయ సమూహాలు రాష్ట్ర సమూహంగా (Provincial), రాష్ట్ర సమూహాలు జాతీయ సమూహంగా ఏర్పడాలని, ఈ పథకంలో, సాముదాయిక జీవనం, వ్యవస్థీకరణలో ఉన్నత స్థాయిలోని వ్యక్తుల కంటే అట్టడుగు స్థాయి లోని వ్యక్తులకే

BRAOU

ప్రాధాన్యత లభించడం వలన ఉన్నత స్థాయిలోని వ్యక్తులకు చేయవలసింది పరిమితం. కేవలం సాముదాయిక రాజకీయ వ్యవస్థ మాత్రమే ప్రజల భాగస్వామ్యంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని పెంపొందింప చేస్తుందనీ, ఇదే ప్రజాస్వామ్య వాదుల ఆదర్శం కావాలని జయప్రకాష్ నారాయణ్ సిద్ధాంతీకరించాడు.

## ● అపరిగ్రహి

గాంధీ ప్రతిపాదించిన అధికార వికేంద్రీకరణ ప్రతిపాదన ఉపయుక్తతను అంచనా వేసేందుకు దానిలో ఇమిడి ఉన్న ఊహలను, వాటిపై వచ్చిన విమర్శలను పరిశీలించాలి. దీని వలన ఆ ప్రతిపాదన ఆధారంగా రూపొందించిన ప్రత్యమ్నాయ విధానాల పరిణామాలను ఊహించుకునేందుకు తోడ్పడుతుంది.

గాంధీ వికేంద్రీకరణ నమూనా ప్రధానంగా నాలుగు ఊహనలపై ఆధారపడింది. అవి: (1) గ్రామ పంచాయితీల ద్వార సాముదాయిక ప్రమాణాలను పాటించడం, (2) గ్రామ స్థాయిలో ఏకాభిప్రాయ పద్ధతుల (సమ్మతి) ద్వారా ఘర్షణలను, వివాదాలను పరిష్కరించడం, (3)ప్రభుత్వ నిబంధనలతో నిమిత్తం లేకుండాగ్రామ స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడం, (4) అపరిగ్రహి లేదా సిద్ధాంత ప్రభావం వల్ల ప్రజా సంక్షేమ సాధన కొరకు కాక ఇతర లక్ష్యాల సాధనకు అధికారాన్ని సంపాదించాలనే ఆకాంక్ష లేదా ఆశ ప్రజల్లో పరిమితంగా ఉంటుంది.

గాంధీ ప్రతిపాదించిన అధికార వికేంద్రీకరణ సిద్ధాంతం అనేక విమర్శలకు గురైంది. మార్క్సిస్టులు, ఉదారవాదులు గాంధీ ప్రతిపాదించిన గ్రామాలకు కేంద్ర స్థానం కల్పించే రాజకీయ వ్యవస్థ సిద్ధాంతం పూర్తిగా పురాతనమైందనీ విమర్శించారు. పాశ్చాత్య ఆధునికీకరణ నమూనా సవర్థతపై విశ్వాసం గల ఉదారవాదులు గాంధీ సర్వోదయ సిద్ధాంతం స్వయం వైఫల్య (Selfdefeating) సిద్ధాంతమని వాదించారు. మార్క్సిస్టులు భారత దేశంలోని గ్రామాలు మూఢాచారాలకు నిలయాలని, పూర్తిగా వెనుక బడినవనీ, సాంకేతిక మార్పుకు, నవకల్పనలకు బద్ధ వ్యతిరేకమైనవీ కాకపోవడం చేత గాంధీ దృక్పథం గ్రామీణ ప్రాంతాల సాంప్రదాయ లక్షణాలను కొనసాగించుటకు కాక అవాస్తవిక గ్రామీణ తత్వాన్ని పెంపొందింప జేస్తుందని విమర్శించింది.

గ్రామ ప్రాంతాల ఆర్థిక స్వయం ప్రతిపత్తి, ఆర్థిక స్వేచ్ఛలపై గాంధీ ప్రతిపాదించిన ఊహనలు కూడా అనేక విమర్శలకు గురైయ్యాయి. చివరకు గాంధీని ప్రశంసించే గాంధేయ వాదులు కూడా వీటిపై అనేక అనుమానాలను వ్యక్తపరిచారు. వారు స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో సంభవించిన అనేక పరిమాణాల ప్రాతిపదికగా గాంధీ ఊహనలను ప్రశ్నించారు. ఉదాహరణకు గాంధీ ఊహనలకు భిన్నంగా స్వాతంత్రానంతరం ప్రజల ఆశలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా రాజకీయ వ్యవస్థ జనాకర్షణ వాదాన్ని అనుసరించింది. తక్కువ వ్యవధిలో ప్రజల సంక్షేమాన్ని సాధించేందుకు అవసరమైన పథకాలకు ప్రాధాన్యత నివ్వబడుతుంది.

గాంధీ వాదానికి వ్యతిరేకంగా సంభవించిన మరో ప్రధాన పరిణామం రాజ్యం అధికార విస్తరణ. గాంధీ ఊహలకు భిన్నంగా ఆర్థిక కార్యకలాపాలలో రాజ్యం జోక్యం దాని అధికారాలు విపరీతంగా పెరిగాయి. గ్రామ సమూహాలు, స్థానిక రాజకీయ సంస్థలు, చివరకు స్వచ్ఛంద సంస్థలు కూడా రాజ్య అధికార పరిధిలో చేర్చబడ్డాయి. స్థానిక సంస్థల కార్యకలాపాలలో రాజకీయ పక్షాలు జోక్యం పెరిగింది. గాంధీ ప్రతిపాదించిన

BRAOU

దానికి భిన్నంగా అధికారం ఊర్ధ్వ స్థాయి నుండి అధోస్థాయి లేదా అట్టడుగు స్థాయికి పయనిస్తున్నది.

## 5.2.3 గాంధీ ఆర్థికాభి వృద్ధి సిద్ధాంతం

గాంధీ ఆర్థికాభివృద్ధి సిద్ధాంతం సాధారణ వృద్ధి సిద్ధాంతం నుండి గ్రహింపబడింది. ఈ సిద్ధాంతం ప్రకారం వృద్ధిలో ఆర్థిక, రాజకీయ, మేధో, నైతిక చలాంకాలు కలవు. ఈ విధంగా వృద్ధి బహుల చలాంకాల ప్రక్రియ. ఇది వ్యక్తి మొత్తం అవసరాలు ఆర్థిక, రాజకీయ, నైతిక మేధోపరమైన అవసరాలను సంతృప్తి పరుస్తుంది. గాంధీ అభిప్రాయం ప్రకారం వ్యక్తి సంపూర్ణ మేధోపరమైన నైతిక వృద్ధితో మిళితమైన ఆనందాన్ని సాధించుటకు ఆర్థిక వృద్ధి ప్రధాన లక్ష్యం. ఈ విధంగా గాంధీ ఆర్థిక వృద్ధి సిద్ధాంతాన్ని కేవలం ఆర్థిక శాస్త్రదృక్పథంగా పరిగణించటం సహేతుకం కాదు.

ఆర్థిక వృద్ధిని బహుళ ప్రక్రియగా భావించటం వలన వివిధ వృద్ధి లక్ష్యాల మధ్య సంఘర్షణ తలెత్తే అవకాశం ఉన్నట్లు గాంధీ గుర్తించాడు. ఉదాహరణకు భౌతికవృద్ధి , నైతిక వృద్ధికి మధ్య సంఘర్షణ అనివార్యమని గాంధీ ఉద్ఘాటించాడు. గాంధీ ఆలోచనలు భారత తాత్వికవిచారణలో వేళ్లూనుకోవడం వల్ల భారతీయులలో పేరుకుపోయిన పేదరికం పట్ల ఆయనకు గల ఆసక్తి వల్ల గాంధీజీ వృద్ధిలోని విభిన్న లక్ష్యాల మధ్య తలెత్తే సంఘర్షణలను సామరస్య పూరితంగా పరిష్కరించాలని ఉద్ఘాటించాడు. సక్రమమైన ప్రణాళికీకరణ, మార్గదర్శకత్వం ద్వారా ఆ సంఘర్షణలను పూర్తిగా నివారించ వచ్చునని గాంధీ విశ్వసించాడు. ఆర్థికాభివృద్ధిని సాధించకుండా పేదరికాన్ని నిర్మూలించలేమని గాంధీ భావించాడు. అయితే గాంధీ హద్దులు లేని ఆర్థిక వృద్ధివల్ల ఏర్పడే దుష్పరిమాణాలను విస్తృతపరిధిలో నిర్వచించాల్సి ఉంది. ఈ దుష్పరిమాణాలు వ్యక్తి మొత్తం సంబంధాలలో ఏర్పడుతాయని గాంధీ పేర్కొన్నాడు. అయితే సరైన అభివృద్ధి వ్యూహాలను, సామాజిక ప్రయోగాలను అనుసరించడం ద్వారా ఎటువంటి దుష్ఫలితాలను కలుగచేయని వ్యక్తి, సమాజం ఆర్థిక ప్రగతిని సాధించగల క్రమబద్ధమైనచ ఆర్థికృద్ధి ప్రక్రియను ఏర్పరచవచ్చునని గాంధీ భావించాడు.

ఆర్థిక వృద్ధి పై గాంధీ అభిప్రాయాలను విశ్లేషిస్తూ గాంధీ సమతుల్య ఆర్థిక వృద్ధి భావనను రూపొందించినట్లు గుర్తించవచ్చు. ఈ సమతుల్య వృద్ధి భావనలో ఈ క్రింది అంశాలు గుర్తించవచ్చును.

### 1. తాత్విక సమతుల్యత

ఆర్థిక ప్రగతికి, నైతిక ప్రగతి మధ్య సమతుల్యతను సాధించేందుకు గరిష్ఠ ఉత్పత్తి సాధన కంటే అభిలషణీయ ఉత్పతి సాధన పట్ల ఎక్కువ ప్రాధాన్యత కనబరచాలి.

### 2. నిర్మాణాత్మక సమతుల్యత

ఆర్థిక వ్యవస్థలో గ్రామీణ, పట్టణ రంగాల మధ్య సమతుల్యత. ఈ సమతుల్యత సాధనకు గ్రామీణ రంగ అభివృద్ధిని నిర్లక్ష్య పర్చకుండా పట్టణాభివృద్ధి సాధించాలి.

### 3. పరిసరాల సమతుల్యత

మనిషి, అతని పరిసరాల మధ్య సమతుల్యత, ఉత్పత్తి స్థాయిని పెంచెందుకు తగిన సాంకేతిక

BRAOU

పరిజ్ఞానాన్ని ఎంపిక చేయడం ద్వారా, ఉత్పత్తిపై నిర్బంధాలను విధించడం ద్వారా మనిషి, పరిసరాల మధ్య సమతుల్యతను సాధించవచ్చునని గాంధీ పేర్కొన్నాడు.

## 4. సాంకేతిక సమతుల్యత

చిన్న తరహ, భారీ సాంకేతిక సమతుల్యత. గాంధీజీ సాంకేతిక పరిజ్ఞానాన్ని తరుచు దుర్వినియోగపర్చడం జరుగుతుందని పేర్కొన్నాడు. గాంధీజీ ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యధాతథంగా వినియోగించటాన్ని వ్యతిరేకించాడు. గాంధీ భారతదేశం దిగుమతి చేసుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విచక్షణరహితంగా ఉపయోగించడం కంటే స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వలన ఎక్కువ లాభం పొందవచ్చునని సూచించాడు. గాంధీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరాన్ని గుర్తించాడు. అయితే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ఉత్పత్తికి, కార్మికులకు నష్టం కలిగించకుండా వినియోగించడం అవసరమని గాంధీ ఉద్ఘాటించారు.

## 4. పంపిణీ సమతుల్యత

ఆదాయ పంపిణీలో సమతుల్యత భారతదేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తొలగించేందుకు, ఆదాయాన్ని పునః పంపిణీ చేసేందుకు అవసరమైన వ్యూహాలను రచించి, అమలు పరచాలని గాంధీ వాదించాడు.

BRAOU

గాంధీ సిద్ధాంతాన్ని ఆదాయం పంపిణీ విధానంలో దోపిడీని నివారించగల గతిశీలక సమతుల్య నమూనాగా పరిగణించవచ్చును. అధిక ఆర్థికవృద్ధిని సాధించటం వల్ల ఆదాయం పంపిణీలో సమానత్వం సమకూరుతుందని గాంధీ విశ్వసించలేదు.

గాంధీ రూపకల్పన చేసిన వృద్ధి నమూనాను ఉజ్జ్వలమైన గతిశీలకత్వంగా పరిగణించవచ్చును. ఈ గతిశీలకత్వం ఆర్థిక వ్యక్తికి (Economic man) కాక చైతన్య పూరితమైన వ్యక్తికి ఉద్దేశింపబడినది.

గరిష్ఠ లాభాలకోసం ఆత్రుత పడే ప్రవర్తన కంటే సులభంగా సంతృప్తి చెందే ప్రవర్తన కల వ్యక్తి వేగంగా పెరుగుతున్న సమాజానికి ఆవశ్యకమని గాంధీ ఉద్బోధించాడు.

## ● గాంధీ ఉపాధి సిద్ధాంతం

గాంధీ ఉపాధి సిద్ధాంతం ఆయన ఆర్థిక వృద్ధి సిద్ధాంతంతో ముడిపడి ఉంది. గాంధీ, పేదరికం, నిరుద్యోగ సమస్యలపట్ల తీవ్రమైన ఆందోళనను వ్యక్త పరిచారు. గాంధీ గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని, నిరుద్యోగ సమస్యలను తొలగించగల ఆర్థిక పారిశ్రామికాభివృద్ధి విధానాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించాలని ఉద్ఘాటించాడు. అంతేగాక ఈ విధానాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ఆదాయ స్థాయిలో గల వ్యత్యాసాలు తొలగించ గలగాలని గాంధీ పేర్కొన్నాడు.

ఉత్పత్తి, సంబంధమైన విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని విచక్షణారహితంగా అనుసరించడం వలన గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగం ప్రబలడమే కాకుండా, గ్రామీణ పరిశ్రమ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందని గాంధీ ఉద్ఘాటించాడు. గాంధీ పరిశ్రమల వికేంద్రీకరణ ద్వారా చిన్న తరహా గ్రామీణ పరిశ్రమల పునరుద్ధరణ, ఆధునీకరణ ద్వారా గ్రామీణ పరిశ్రమ అవసరాలను తీర్చేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ సమస్యను తొలగించవచ్చునని పేర్కొన్నాడు. దీనిని బట్టి గాంధీ ఆధునిక సంకేతిక పరిజ్ఞానానికి వ్యతిరేకం కాదని భావించవచ్చును. అంతే గాక భారత దేశంలోని గ్రామీణ పట్టణ ప్రాంతాల జనాభ స్వభావాన్ని విశ్లేషిస్తూ ఇతను గ్రామీణ ప్రాంతాలలో పారిశ్రామికీకరణవల్ల, ఈ ప్రాంతాల నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారో అర్థం చేసుకోవచ్చును. భారత దేశంలోని జనాభాలో అధిక శాతం గ్రామ ప్రాంతాలలో నివసించడం వలన పేదరికం, నిరుద్యోగ సమస్యలను ప్రధాన గ్రామీణ సమస్యలుగా పరిగణించవలసి ఉంది. నిర్మాణపరమైన స్వభావంగల సమస్యల పరిష్కారానికి ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మించడం ప్రధమ పరిష్కారమార్గం. గాంధీ ఉపాధి సిద్ధాంతం సరిగ్గా ఈ వాస్తవాన్నే వివరిస్తుంది.

గాంధీ ప్రతిపాధించిన ఆర్థిక వృద్ధి ఉపాధి సిద్ధాంతాలు ఆయన మౌలిక సామాజిక తాత్వికతకు అనుగుణంగా ఉన్నాయి. ఈ సిద్ధాంతాల వెనుక వ్యక్తి, సమాజ సంక్షేమం పట్ల గాంధీకి కల ఆసక్తి దాగి ఉంది.

## ● గాంధీ ధర్మకర్తృత్వ సిద్ధాంతం

గాంధీ అభివృద్ధి సాధనకు ధర్మకర్తృత్వం ద్వారా సమాజంలోని ఆర్థిక సంబంధాల మధ్య సంఘర్షణలను తొలగించి సామరస్యాన్ని పెంపొదింపచేయవచ్చునని పేర్కొన్నాడు.

ధర్మకర్తృత్వం ప్రైవేటు, ప్రభుత్వ రంగం మధ్య సామరస్యాన్ని ఏర్పరుస్తుందని గాంధీ పేర్కొన్నాడు. ప్రైవేటు రంగం వలన సమాజంలో విపరీతమైన, సమర్థనీయం కాని అంతరాలు ఏర్పడతాయనీ, ఈ అంతరాలు కొనసాగించినంత కాలం అహింసా యుత సమాజం ఏర్పడదని గాంధీ విశ్వసించాడు.

ధన గర్వంతో ధనిక వర్గాలు పేద ప్రజలను అణిచివేతకు గురిచేసాయని కూడా గాంధీ భావించాడు. ఆస్థి సంపాదన నైతిక అభివృద్ధికి తీవ్రమైన అవరోధాన్ని ఏర్పరుస్తుందని గాంధీ వాదించాడు. ఈ విధంగా సమాజ ప్రగతికి ప్రమాదకరమైన ప్రైవేటు ఆస్థిని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించాడు.

ప్రైవేటు ఆస్థికి ప్రత్యమ్నాయంగా గాంధీ దర్మకర్తృత్వ వ్యవస్థను ప్రతిపాదించాడు. దీని ప్రకారం దనవంతుడు తన సంపదను తన ఆధీనంలో ఉంచుకుంటాడు. ఆ సంపదలో కొంత భాగాన్ని తన అవసరాలకు వినియోగించుకొని, సమాజం కొరకు వినియోగించి మిగిలిన సంపదకు దర్మకర్తగా వ్యవహరిస్తాడు. ఈ సిద్ధాంతాన్ని అమలు పరిస్తే ప్రైవేటు,ప్రభుత్వ రంగాల వల్ల జరిగే కీడును నివారించవచ్చును. ధర్మకర్తృత్వం వల్ల ప్రైవేటు రంగం వల్ల ఏర్పడే దోపిడీని, ఆర్థిక అసమానతలను ప్రభుత్వ రంగం వల్ల ఉత్పన్నమయ్యే హింసను, స్వేచ్ఛారాహిత్యాన్ని అంతమొందించవచ్చును. ఇంతే కాక ధర్మకర్తృత్వ భావాన

Dr. BRAOU LIBRARY Acc. No Class No 115069 350 P.R.A

సమాజంలో చెలరేగే వర్గ సంఘర్షణలను తొలగించి ధనిక, పేద వర్గాల మధ్య సహకారాన్ని, సామరస్యపూరిత సంబంధాలను ఏర్పరుస్తుంది. దీని వల్ల భూస్వాములు, పెట్టుబడి దారులు స్వతహాగా దోపిడి దారులనే అభిప్రాయం పేద వర్గాల ప్రజల మనస్సులలో నుండి తొలగిపోవడమే కాక, దనిక పేదవర్గాల ప్రజల మధ్య బద్ధ శత్రుత్వం ఉందనే భావం అంతరిస్తుంది.

ధర్మకర్తృత్వం పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య సంబంధాలలో విప్లవాత్మకమైన పరివర్తనను ప్రవేశపెడుతుందని గాంధీ ఉద్ఘాటించాడు, అయితే యజమానులు తాము ఆర్జించిన సంపదను సంపూర్ణంగా తామే వినియోగించుకోకుండా నివారించడమే ధర్మకర్తృత్వంలో కీలకాంశం.

గాంధీ చట్టబద్ధమైన యజమాన్యం నైతిక బద్ధమైన యజమాన్యం మధ్య విభజన చేశారు. చట్టబద్ధమైన సంపద దానిని ఆర్జించిన యజమానికి చెందినప్పటికీ, నైతికంగా సంపదమొత్తం సమాజానికి చెందుతుంది. నైతిక బద్ధమైన యజమాన్యం భావనలో దనవంతులు, భూస్వాములు వీరికి చెందిన సంపదకు రైతులు, కార్మికులు కూడా భాగస్థులే, ఈ విధంగా గాంధీ సమాజానికి చెందిన సంపదను పెట్టుబడిదారుల, కార్మికులు ఉమ్మడిగా యజమానులుగా వ్యవహరించడమే ధర్మకర్తృత్వమని గాంధీ తరచు పేర్కొనేవారు.

పై విధంగా ధర్మకర్తృత్వ భావన గురించి గాంధీ విపులంగా చర్చించాడు. ఆదర్శవంతమైన సమాజంలో ఉత్పత్తి సంబంధాలు చట్టబద్ధంగా ప్రైవేటు పెట్టుబడిదారులు, భూస్వాముల యజమాన్యంలో ఉన్నప్పటికీ, నైతికంగా రైతుల, కూలీల,పెట్టుబడిదారుల ఉమ్మడి యజమాన్యంలో ఉంటాయి. రైతులు, కార్మికులు మొదటగా భూస్వాములు, పెట్టుబడి దారులను వారి సంపదలో భాగస్వాములుగా పరిగణించమని అర్థించాలి. దీనికి వారు అంగీకరించని పక్షంలో అహింసా పద్ధతుల ద్వారా వారిపై ఒత్తిడిని కలిగించాలి. ఈ పద్ధతి కూడా విఫలమైనప్పుడు రాజ్యం సంపన్న వర్గాల సంపదను బలవంతంగానైనా స్వాధీన పరచుకోవాలి. ఈ విధంగా ప్రైవేటు యజమాన్యం, ప్రభుత్వ యజమాన్యం మధ్య రెండవ దానికి ప్రాధాన్యత నిచ్చాడు.

BRAOU

గాంధీకి ధర్మకర్తృత్వ భావనలో స్వేచ్ఛా, సమానత్వం అనే విలువలను నైతిక ప్రయత్నాల ద్వారా సాధించాలే తప్ప హింసాపూరిత ప్రయత్నాల ద్వారా సాధించరాదనే సూత్రం కీలకమైంది. దోపిడీ అసమానతలు, క్రమబద్ధం కాని ప్రైవేటు రంగ లక్షణాలు, ఈ రెండు చెడులు ఆర్థిక వ్యవస్థలు సామాజికి పునర్ వ్యవస్థీకరణకు అవశ్యకతను నొక్కి వక్కాణిస్తాయి. గాంధీ భారతదేశంలోను, పాశ్చాత్యదేశాలలోను నెలకొని ఉన్న క్రమబద్ధం కాని ప్రైవేటు రంగం పట్ల తీవ్ర వ్యతిరేకత గాంధీ ధర్మకర్తృత్వ సిద్ధాంతానికి పునాది. ఇదే సందర్భంలో గాంధీకి రాజ్య అధికారం పట్ల ఏమాత్రం విశ్వాసం లేకపోవడం వల్ల ఆయన ఉమ్మడి వాదాన్ని ఒక ఆదర్శవంతమైన సిద్ధాంతంగా పరిగణించాడు.

## ● గాంధీ సిద్ధాంత సమీక్ష

గాంధీ గ్రామ స్వరాజ్యాన్ని సమర్థించాడో, ప్రతిగ్రామం స్వయం పోషకంగా ఉంటూనే, తప్పని సరి పరిస్థితులలో మాత్రమే ఇతర గ్రామాలపై ఆధారపడాలని భావించాడు. గాంధీ దృష్టిలో ప్రజాస్వామ్యమనేది కేవలం కేంద్రంలోని కొద్దిమంది చేతులలోనే ఉండదు. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే గ్రామ ప్రజల

నుండే రావాలని ఆయన ఉద్దేశ్యం.

గాంధీ సర్వోదయ సమాజాన్ని ఆకాంక్షించాడు. సర్వోదయ సమాజం సత్యం, అహింసలపై ఆధారపడిన వికేంద్రీకృత రాజకీయ ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా కలిగి ఉంటుంది.

వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ కావాలనే సిద్ధాంతాన్ని, ఆదేవిధంగా సమాజం లేకుండా వ్యక్తిలేడు అనే వాదాన్ని కూడా గాంధీ త్రోసిపుచ్చాడు. మధ్య వాదాన్ని గాంధీ బలపరుస్తూ, వ్యక్తికి స్వేచ్ఛ ఉండాలి వ్యక్తి సామాజిక నియమాలకు లోబడి ఉండాలన్నాడు.

గాంధీ యంత్రాల ఉపయోగానికి వ్యతిరేకికాడు. కాని అవి శ్రామికున్ని నిస్సహాయతకు గురిచేస్తాయని భావించాడు. సమాజంలో దోపిడి కాని, పోటీ కాని ఉండకూడదని భావించాడు.

ప్రతి వ్యక్తి తన ఆహారానికి పనిచేయాలి అనే సూత్రాన్ని పాటించడం ద్వారా సమాజంలో శాంతియుత విప్లవాన్ని తీసుకురావచ్చునని గాంధీ భావించాడు. బ్రతకడానికి పోటీ పడే బదులు, పరస్పర సహకారానికి పోటీ అవసరం అని గాంధీ భావించాడు.

గాంధీ అభిప్రాయంలో సంపద, శ్రమ, మేధస్సు ఇవన్నీ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలి. వ్యక్తి, తనకంటూ ఏమీ ఉంచుకోకూడదు. భూస్వాములు భూమికి, పెట్టుబడి దారులు ఫ్యాక్టరీలకు ధర్మకర్తలు. వారు తమ ఆదాయాన్ని ప్రజా సంక్షేమానికి ఉపయోగించాలి. పెట్టుబడి దారులు, కార్మికుల మధ్య సత్సంబంధాలు ఉండాలి. ఈ విధంగా దర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాధించాడు.

ఏది కలిగి ఉండకుండా ఉండటం (అపరిగ్రహ), దొంగిలించకుండా ఉండటం అనే వాటిని భగవద్గీతనుండి గ్రహించాడు. గాంధీ అభిప్రాయంలో ఉన్నవారు తమకు సరిపోయింది ఉంచుకొని, మిగతా ఆస్థికి దర్మకర్తలుగా ఉండాలంటూ, మిగులు ఆస్తిని లేని వారికి ఇచ్చినట్లయితే ఆర్థిక అసమానతలు ఉండవని భావించాడు.

ఈ విధంగా గాంధీ పంచాయితీ రాజ్ వ్యస్థలను బలపరచడం, దర్మకర్తృత్వం, అపరిగ్రహ వంటి వాటికి భారతీయ సాంఘిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత ఇచ్చాడు.

## 5.3 ప్రగతికి సంబంధించి మార్క్సిస్ట్ దృక్పథం

మార్క్సిస్టు దృక్పథం గాంధేయ దృక్పథానికి భిన్నంగా ఉంటుంది. మార్క్సిస్టు దృక్పథాన్ని దేశ సామాజిక ప్రగతి నేపథ్యంలో అవగాహన చేసుకోవాలంటే సామాజిక విశ్లేషణ ముఖ్యంగా రాజ్యస్వభావం, ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలపై మార్క్స్ వ్యక్తపరిచిన అభిప్రాయాలను, భావాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. మార్క్స్ విశ్లేషణలో చారిత్రక భౌతిక వాదం, గతితార్కిక భౌతికవాదం, పునాది ఉపరితలం, మిగులు విలువ సిద్ధాంతం, శ్రామిక నియంతృత్వం, వర్గపోరాటం రాజ్యరహిత వర్గ రహిత సమాజ స్థాపన మొదలగునవి ప్రధానాంశాలు.

వీటికి సంబంధించిన వివరాలు ఎం.ఏ ప్రథమ సంవత్సరం రాజనీతి సిద్ధాంతం (కోర్సు1) భాగం-

BRAOU

15లో కూలంకషంగా చర్చించాం.

సమాజంలో వ్యక్తిగత ఆస్తి ఏర్పడిన తరువాత వర్గాలు ఏర్పడతాయని ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం వలననే తమకంటూ ఏలాంటి ఆస్థిలేని శారీర శ్రమను అమ్ముకుని జీవించే ప్రోలెటేరియట్ అనే శ్రామిక వర్గం ఏర్పడిందని మార్క్స్ అభిప్రాయం. కావున శ్రామికులు పాలక వర్గస్థాయికి ఎదగాలంటే వర్గపోరాటమే మార్గమని మార్క్స్ సిద్ధాంతం వివరిస్తోంది. కమ్యూనిస్టు మేనిఫెస్టోలో గత సామాజిక చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రేనని" మార్క్స్ పేర్కొన్నారు. అభివృద్ధి అంటే వర్గరహిత రాజ్యరహిత సమాజస్థాపనే. వ్యక్తిగత ఆస్థి సమాజంలో వర్గాలు ఏర్పడడానికి కారణమని, వర్గ రహిత సమాజ స్థాపన, వ్యక్తిగత ఆస్థి రద్దుతో మాత్రమే సాధ్యమవుతుందని మార్క్సిస్టు భావన. చైనాలో భూమిపైన ఉమ్మడి యజమాన్య పద్ధతిని, సంపదను అందరూ కలిసి అనుభవించే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఉమ్మడి కృషిని, సంపద పంపిణీని నిర్వహించడం కోసం కమ్యూన్ లను స్థాపించారు. మార్క్సిస్ట్ దృక్పథంలో వర్గ సంఘర్షణ అభివృద్ధికి దారితీస్తుందని భావించబడింది. కొంతమంది విమర్శకుల అభిప్రాయంలో మార్క్స్ సిద్ధాంతం వర్గ సంఘర్షణల సిద్ధాంతమే కాని మానవతా సిద్ధాంతం కాదంటారు. అయితే మార్క్స్ మానవులందరి అభివృద్ధి కోసం, అందరూ అనుభవించే ప్రజాస్వామ్యవ్యవస్థ కోసం వర్గపోరాటం తప్పని సరి అంటాడు.

మార్క్స్ గతి తార్కిక దృక్పథం ప్రకారం సమాజంలోని ధనిక (భూస్వామ్య పెట్టుబడిదారి), పేద (వ్యవసాయ, పారిశ్రామిక) వర్గాలకు జరిగే సంఘర్షణ వల్ల నూతన సమాజం ఆవిర్భవిస్తుందని, దీని వల్ల మెజారిటీ ప్రజలు అధికారాన్ని పొందగలుగుతారనీ, వారి అధికారాన్ని అభివృద్ధికోసం ఉపయోగించడం ద్వారా దోపిడిలేని సమాజాన్ని నిర్మించగలుగుతారని మార్క్సిస్టుల వాదన. ఆస్థి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండటం వల్ల దోపిడికి అవకాశం ఏర్పడుతుంది. సంపదను సమాజపరం చేసినట్లయితే దోపిడి లేని సమాజాన్ని నిర్మించవచ్చునని మార్క్సిస్టుల వాదన.

BRAOU

సమాజంలో మార్పు కేవలం సంఘర్షణల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, ఈ మార్పుకోసం జంగే పోరాట క్రమంలో హింసా, అహింసాపద్ధతులను రెండింటిని అవసరం మేరకు ఉపయోగించాలని మార్క్స్ అభిప్రాయం. అంటే దోపిడిదారులు హింసను ఆయుధంగా వాడుతారు కాబట్టి, మార్పు ఆశించేవారు ప్రతి హింసను ఆయుధంగా వాడతారు. కాబట్టి, మార్పు ఆశించేవారు ప్రతిహింస ద్వారా దానినిఎదుర్కోవాలని మార్క్స్ భావన. కావున మార్క్స్ ప్రకారం అసమానతలున్న సమాజంలో సంఘర్షణలకు సానుకూల స్వభావముంటుంది. వ్యక్తిగత ఆస్థి అన్ని అనార్థలకు మూలమని దీనిని సమాజపరం చేయాలంటాడు మార్క్స్. వ్యక్తీగత ఆస్తి శ్రామికుడు యజమాని అనే రెండు వర్గాలను సృష్టిస్తుందని, ఇది శ్రమదోపిడి, అణచివేతకు దారితీసి పెట్టుబడిదారుడు ఉత్పత్తి సాధనాలపై పూర్తి అజమాయిషి కలిగియుండేటట్లు చేసి పెట్టుబడిదారు తన లాభాలను రెట్టింపు చేసుకునే ప్రక్రియలో శ్రామికుడు పూర్తిగా పరాయీకరించి శ్రమదోపిడికి, అణచివేతకు గురికాబడతాడు. ఈ ప్రక్రియలో రాజ్యాం కేవలం పెట్టుబడిదారు, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే సంస్థగా మారి శ్రామిక అణచివేతలో

ఒక ఆయుధంగా మారుతుందని మార్క్సిస్టుల వాదన. శ్రామిక, కార్మిక కర్షక వర్గం పాలక వర్గ స్థానానికి ఎదగాలంటే వర్గపోరాటమే మార్గమని మార్క్స్ వాదన.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కూడా ఉత్పత్తి సాధనాలపై అజమాయిషీగల దోపిడి వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగానే రూపొందించబడిందని, ఈ స్వభావం గల సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం వర్గ పోరాటం ద్వారానే సాధ్యమవుతుందని మార్క్సిస్టుల వాదన. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో శ్రామికులు పోగొట్టుకున్న మానసిక స్థైర్యం విప్లవ విజయం ద్వారానే కూడగట్టుకోగలుగుతారని ఇది శ్రామిక నియంతృత్వం ద్వారా ఉత్పత్తి సాధానాలపై శ్రామికులే అజమాయిషీ కలిగి సంపదను అందరూ సమానంగా అనుభవించడానికి వీలవుతుందని మార్క్స్ వాదన. శ్రామిక నియంతృత్వం ద్వారా శ్రామికులే రాజ్యాధికారాన్ని చేపట్టడం వలన రాజ్యం దానిలో భాగమైన ఉద్యోగిస్వామ్యం అంతరించిపోతుందని, ఉత్పత్తి పంపిణీని సామాజీకరణం చేయడం మూలంగా పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలించబడి సమసమాజవ్యవస్థ ఏర్పాటు చేయబడుతుందని మార్క్సిస్టుల వాదన.

సామాజిక మార్పు క్రమంలో మార్క్సిజం ప్రాతిపదికగానే రష్యా, చైనాలలో విప్లవాలు వచ్చాయి. కొరియా, తూర్పు జర్మనీ, బల్గేరియాల ప్రగతి పంథాను మార్క్సిజం ప్రభావితం చేసింది. అయితేఇటీవలి కాలంలో మార్క్సిజం ఆచరణపై పునరాలోచనలు బయలుదేరాయి. రష్యాలో మార్పులు వచ్చాయి. చైనాలో ఉదారవాద దృక్పథం అవలంబించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. మార్క్సిజం ప్రాతిపదిక గల సమాజంలో దాని సంబద్ధతపై చర్చలు జరుగుచున్నాయి.

BRAOU

## 5.4 ముగింపు

సామాజిక పరివర్తన అభివృద్ధికి సంబంధించిన అంశాలపై గాంధీ, మార్క్స్‌లు వ్యక్తపరిచిన భావాలను పరిశీలించాం. రాజ్యం, సమాజం, వ్యక్తికి సంబంధించిన విశ్లేషణలో వీరిరువురు కొన్ని విషయాలలో ఒకే అభిప్రాయాన్ని కలిగియున్నప్పటికి వారి దృక్పథాలలో కొన్ని మౌలిక భేదాలున్నట్లు పరిశీలించాం. ఉదాహరణకు మార్క్స్, గాంధీ లిద్దరు వర్గరహిత సమాజస్థాపనను ఆశించారు. కాని ఇద్దరు ఆశించిన వర్గరహిత సమాజస్థాపన పద్ధతులు వేరువేరు. గాంధీ అహింసాయుత పద్ధతుల ద్వారా మార్పును ఆశిస్తే, మార్క్స్ హింసాయుత పద్ధతులలో కూడిన విప్లవం ద్వారానే కార్మిక రాజ్యస్థాపన వీలవుతుందని భావించాడు.ఆర్థికాభివృద్ధి, ఉపాధి, కర్మకర్తృత్వం వంటి గాంధి వెలిబుచ్చిన భావాలను పరిశీలించాం. గాంధీ సామాజిక పరివర్తనలో వ్యక్తపరిచిన భావాలను పరిశీలిస్తే ఆయనపై మార్క్స్ ప్రభావం తప్పకుండా ఉండి ఉంటుందని, అయితే వాటిని భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా మార్చుకున్నాడేమో ననే భావంకలుగుతుంది. ఏదిఏమైనా 1920 వరకు ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానమే ఏకైక ప్రగతి నమూనాగా ఉండేది. 1920 తరువాతే మార్క్సిస్ట్ ఆధారిత ప్రగతి నమూనా పెట్టుబడి దారీ నమూనాకు ప్రత్యామ్నాయంగా

ఆచరించబడింది. అలాగే నేడు గాంధీ ఆలోచనా విధానం సామాజిక మార్పు, ప్రగతిని గురించిన భావాలపై ప్రభావాన్ని కలిగి ఉంది.

## 5.5 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. **ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సామాజిక మార్పు క్రమంలో గాంధి వివరించిన భావాలను వివరించండి.
2. గాంధీ ధర్మకర్తృత్వ భావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
3. సామాజిక మార్పుక్రమంలో కార్ల్‌మార్క్స్ భావాలను వివరించండి.

II. కింది వాటికి 15 పంక్తులలో జవాబు రాయండి

1. గాంధీ ఉపాధి సిద్ధాంతాన్ని వివరించండి
2. మార్క్స్ వివరించిన వర్గపోరాటం సమసమాజ నిర్మాణానికి ఎలా దోహదం చేస్తుంది.
3. గాంధీ, మార్క్స్ భావాలలో పోలికలను, విభిన్నతలను వివరించండి.

## 5.6 చదవదగిన రచనలు

BRAOU

1. Marina R. Pinto,and R. Srinivasan Development and Administration, Himalaya Publishing House, Delhi, 1990
2. R.K. Sapru, Development Adminstration, deep & deep Publications, New Delhi, 1986
3. K. Marx, F. Engels, Manifesto of the Communist Pary, Progress Publishers, Moscow 1952.
4. R,P Mishra, Gandhian Model of Development and World Peace, Newdelhi, Concept 1988.
5. M.M. Sankhadhar, Gandhi, Gandhisim, and the Partition of India, Deep & Deep Publications, Delhi, 1982

రచయితలు : కె. మురళీమనోహర్

కె. రఘునాథ్

# భాగం – 6: ప్రగతి పాలనా సాధనాలు

విషయక్రమం :

6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 ప్రగతి సాధనా కార్యక్రమాలు

6.3 ప్రగతి సాధనాలు

6.4 రాజకీయ వ్యవస్థల వర్గీకరణ

6.5 ముగింపు

6.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

6.7 చదువ దగిన రచనలు

## 6.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు :

- ప్రగతి పాలనా సాధనాలు వివరించగలుగుతారు,
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రగతి పాలనా లక్ష్యాలు వివరించగలుగుతారు,
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజకీయ వ్యవస్థల వర్గీకరణను తెలుసుకోగలుగుతారు.

BRAOU

## 6.1 : పరిచయం

ప్రగతి పాలనా సాధనాలను వివరించడం ఈ భాగం ప్రధాన ఉద్దేశ్యం. ప్రగతి పాలనా సాధనాలను తులనాత్మక దృష్టితో, రాజకీయ నేపథ్యంలో వివరించాల్సిన అవసరం ఉంది. రాజకీయ వ్యవస్థల స్వభావం, ప్రక్రియలు, పద్ధతులు ప్రగతి సాధనాలపై ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఈ విషయాలను గురించి అమెరికాకు చెందిన మిల్టన్ జె. ఇస్‌మన్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు విశేషమైన కృషి చేశాడు. ఈ భాగంలో ప్రగతి సాధనాలను గురించి ప్రధానంగా ఇష్‌మన్ భావాలను వివరించడం జరిగింది. ఇస్‌మన్ అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రగతిపాలనా వ్యవస్థల లక్ష్యాలను, ఈ లక్ష్య సాధనలో ముఖ్యపాత్ర వహించే సాధనాలను గురించి విశ్లేషించాడు. అభివృద్ధి చెందుతున్న దేశాల రాజకీయ వ్యవస్థలను వర్గీకరించి ప్రగతి పాలనా సాధనాలపై వాటి ప్రభావాన్ని గురించి కూడా వివరించాడు. స్థూలంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రగతి లక్ష్యాలను గురించి, ప్రగతిని సాధించే సాధనలను గురించి, రాజకీయ నేపథ్యం గురించి మిల్టన్ జె.ఇస్‌మన్ అభిప్రాయాలను ఈ భాగంలో వివరించాం.

## 6.2 ప్రగతి సాధన కార్యక్రమాలు

ఇన్‌మన్ "ప్రగతిపాలన రాజకీయ ప్రక్రియ" అనే వ్యాసంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ముఖ్యంగా జాతి నిర్మాణం, సాంఘిక, ఆర్థిక అభివృద్ధి అనే రెండు లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నాడు. జాతి నిర్మాణాన్ని రాజకీయంగా సుస్థిరమైన సమాజాన్ని నిర్మించుటకుగాను, సాంఘిక ఆర్థిక అభివృద్ధి అంటే దేశ సంపదను ప్రజలందరూ అనుభవించే సమసమాజాన్ని స్థాపించడం గాను ఇన్‌మన్ భావించాడు. ఈ రెండు లక్ష్యాలను సాధించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈక్రింది కార్యక్రమాలు చేపట్టాలని ఇన్‌మన్ పేర్కొన్నాడు. అవి:

- **దేశరక్షణ, శాంతి భద్రతల స్థాపన**

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడం కోసం, అంతర్గతంగా శాంతి భద్రతలు నెలకొల్పడం కోసం ప్రభుత్వాలు ధృడమైన చర్యలు తీసుకోవాలి. దేశంలో శాంతిభద్రతలు లేనట్లయితే అభివృద్ధి సాధ్యం కాదు. విదేశాల దాడిని ఎదుర్కోవడానికి రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి.

- **ప్రభుత్వ చట్ట బద్ధతపై విశ్వాసాన్ని కలిగించడం**

బల ప్రయోగం ద్వారానే ప్రభుత్వాలను నడపడం సాధ్యం కాదు. చర్చల ద్వారా, సరియైన విధానాలను అనుసరించడం ద్వారా, సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడే చర్యలను తీసుకోవడం ద్వారా ప్రభుత్వాలు తమ చట్ట బద్ధతను కాపాడుకోవాలి. ఏకాభిప్రాయం సాధన ద్వారా ప్రజల మద్దతుతో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ జరగాలి.

- **జాతీయ రాజకీయ సంఘటిత వ్యవస్థ నిర్మాణం**

సామాజిక భిన్నత్వం అభివృద్ధి చెందుతున్న దేశాల సామాజిక స్వభావంలో ముఖ్యమైన అంశం. ప్రజల మధ్య జాతి, మత, కుల, ప్రాంతీయ భావాల ఆధారంగా విభజనలు ఉంటాయి. వీటన్నింటికి కలుపుకుని పోతూ జాతియ రాజకీయ వ్యవస్థను నిర్మించడం అవసరం. జాతీయ విధానాలను, సంస్థలను, గుర్తులను అభివృద్ధి చేయడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. జాతి జీవనంలో అందరూ అంతర్భాగమేననే అభిప్రాయం ప్రజలందరిలో కలిగించాలి.

BRAOU

## ● వివిధ స్థాయిల మధ్య అధికారాల పంపిణీ:

సామాజిక మార్పుల కనుగుణంగా కేంద్ర, ప్రాంతీయ, స్థానిక ప్రభుత్వం మధ్య అధికారాల పంపిణీ న్యాయ బద్ధంగా ఉండాలి. వివిధ స్థాయిలోనివారు తమకు అధికారంలో సమానమైన స్థానం ఉందనే అభిప్రాయం కలిగేటట్లుగా విభజన ఉండాలి.

## ● స్వార్థ పూరిత సాంప్రదాయ వ్యవస్థలను తొలగించుట

సమాజంలో మార్పును వ్యతిరేకించే స్వార్థ పూరిత సాంప్రదాయిక నిర్మాణాలు ఉంటాయి. కులం పేరుతో, మతం పేరుతో స్వప్రయోజనాలను రక్షించుకోవడం కోసం అనేక సంస్థలు ఉంటాయి. వీటన్నింటినీ తొలగించి మార్పుకి మార్గం సుగమనం చేసుకోవాలి.

## ● ఆధునిక నిపుణతలను, సంస్థలను అభివృద్ధి పరచడం

సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి సాధించడానికి ఉపయోగించుకోవాలి. శాస్త్ర, సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధిని మానవ వనరులను పెంపొందించుకోవడానికి ఉపయోగించుకోవాలి. ప్రత్యేకీకరణను ప్రవేశపెట్టి జాతి నిర్మాణానికి అవసరమైన సంస్థలను పద్ధతులను అభివృద్ధి చేసుకోవాలి.

## ● భద్రతా భావం కలిగించడం

BRAOU

సామాజిక మార్పులకు లోనయ్యే సమాజాల ప్రజలలో మానసిక అభద్రతా భావం కలుగడానికి అవకాశం ఉంది. సందర్భాలవల్ల గతంలో సామాజిక భద్రతను కలిగించే సంస్థలు, విధానాలు అంతరిస్తాయి. కొత్త విధానాలకు అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది. దీనివల్ల పరాయికరణ, గుర్తింపు సంక్షోభం, విద్వేషం, క్రమరాహిత్యం లాంటి మానసిక అవలక్షణాలు పెంపొందే అవకాశం ఉంది. వ్యక్తి గౌరవానికి, భద్రతకు భంగం లేనటువంటి విధానాల ద్వారా ప్రజలలో భద్రతాభావాన్ని కలిగించవచ్చు.

## ● వనరుల సమీకరణ:

అభివృద్ధికి అవసరమైన పెట్టుబడిని సమకూర్చుకోవలెను. ఉత్పాదక రంగంలో, అనుస్థాపక రంగంలో అధిక పెట్టుబడుల ద్వారా అభివృద్ధిని సాధించవచ్చు. పొదుపు ద్వారా వనరులను సమీకరించుకోవచ్చు.

## ● వనరుల సహేతుక ఉపయోగం

దేశంలోని పరిమితమైన వనరులను సహేతుకంగా ఉపయోగించుకోవాలి. ఎక్కువ మంది ప్రజల ఉపయోగాలను, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వనరులను ఉపయోగించుకోవాలి. ప్రణాళికా బద్ధమైన పథకాల రూపకల్పన ద్వారా వనరులను సద్వినియోగం చేసుకోవచ్చు.

## ● సమర్థవంతమైన నిర్వహణ:

అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ పద్ధతులను మెరుగు పరచాలి. సంస్థల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పరిమిత వనరుల నుంచి ఎక్కువ ప్రయోజనాన్ని పొందవచ్చు.

- **ప్రజా కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం**

అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలో ప్రజల భాగస్వామ్యం ఉన్నట్లయితే సత్ఫలితాలు సాధించవచ్చు. ప్రభుత్వ సంస్థలు మాత్రమే జాతి నిర్మాణాన్ని సాధించలేవు. స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలు తమ సహకారాన్ని అందిచినప్పుడే సామాజిక మర్పు సాధ్యమవుతుంది. ప్రజల భాగస్వామ్యానికి వీలయ్యే సాధనాలను, సంస్థలను ఏర్పాటు చేయడం అవసరం.

- **అంతర్జాతీయ ప్రాధాన్యత**

ప్రపంచ దేశాలలో గౌరవప్రదమైన స్థానం దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. దేశరక్షణ, అభివృద్ధికి వనరులను సమీకరించుకోవడం అంతర్జాతీయంగా ఆ దేశానికున్న గౌరవ ప్రతిష్టలపై ఆధారపడి ఉంటుంది.

## 6.4 ప్రగతి సాధనాలు

పైన పేర్కొనబడిన కార్యక్రమాలను విశ్లేషించినట్లయితే అందులో కొన్ని జాతి నిర్మాణానికి సంబంధించినవి, మరికొన్ని సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి సంబంధించినవి. వీటిని సాధించడానికి నాలుగు రకాలైన సాధనాలు ఉపయోగపడతాయని ఇన్‌మన్ భావించాడు. అవి:

BRAOU

### 1. రాజకీయ పార్టీలు, రాజకీయ ఉద్యమాలు

అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ పార్టీలు సమాజంపై అత్యంత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇన్‌మన్ ప్రకారం రాజకీయ పక్షాలను నాలుగు రకాలుగా విభజించవచ్చు. మొదటి రకపు రాజకీయ పక్షంలో సభ్యత్వం సమాజంలోని ఉన్నత వర్గాల వారికే ఉంటుంది. రెండవరకపు రాజకీయ పక్షంలో విధానాల ఎడల సంఘీభావం ఉన్నవారు సభ్యులుగా ఉంటారు. కానీ వారికి రాజకీయాలను తమ లక్ష్యాల సాధనకు అనుగుణంగా మలుచుకునే ఆసక్తి ఉండదు. మూడవ తరగతి రాజకీయ పక్షాలను మధ్యతరగతి రాజకీయ పక్షాలుగా పేర్కొనవచ్చు. వాటిలో ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. వారు గ్రామప్రజల ఎడల అనాసక్తి కలిగి, ప్రజలతో సంబంధాలు కలిగి ఉండరు. ఈ మూడు రకాల రాజకీయ పక్షాలు ప్రజలతో దగ్గర సంబంధాలు కలిగి ఉండనందువల్ల ప్రగతి సాధనాలుగా ఉపయోగపడవు.

నాల్గవరకపు రాజకీయ పక్షాలు ప్రజా సమీకరణ ప్రాతిపదికపై ఏర్పడినటువంటివి. ఈ రాజకీయ పక్షాలు ప్రజలతో దగ్గర సంబంధాలను కలిగి ఉంటాయి. ఈ రాజకీయ పక్షాలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తాయి. నాయకుల సమ్మోహన శక్తిని ఉపయోగించుకుని పార్టీ యంత్రాంగం ప్రజలను అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేటట్లుగా ప్రేరేపిస్తుంది. అంతే కాకుండా పాలనా యంత్రాంగంపై పర్యవేక్షణ జరిపి అధికార దుర్వినియోగాన్ని అరికడుతుంది. నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న సమాజాలలో ఇ లాంటి రాజకీయ పార్టీల పాత్ర చాల ఎక్కువగా ఉంటుంది.

### 2. పాలనా వ్యవస్థ

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగిస్వామ్య ప్రాబల్యం రోజు రోజుకు పెరిగిపోతుంది. ఈ ఉద్యోగి స్వామ్యం ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలను రూపొందించడంలో, అమలు పరుచుటలో, ప్రజల సహకారాన్ని తీసుకోవడంలో కూడా ప్రభుత్వ పాలన ఒక సాధనంగా పనిచేస్తుంది. ప్రజలతో

సంబంధాలు ఏర్పరచుకొని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో కూడా ప్రభుత్వపాలన ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థ ఎన్నోలోపాలతో కూడకుని ఉన్నదనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తించాలి. దేశం లోని ఉద్యోగి స్వామ్యం సమాజాభివృద్ధి కంటే, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తుంది. అంతే కాకుండా విధానాలను అమలు పర్చడంలో కూడా తగిన సమర్థతగానీ, చొరవగానీ ఉద్యోగి స్వామ్యంలో లేదు. అధికారులు ప్రజలతో అధికార అహంకారంతో వ్యవహరిస్తారు. ఈ లోపాలను తొలగించుకోగలిగినప్పుడే ఉద్యోగి స్వామ్యం అభివృద్ధిని సాధించడంలో సరైన పాత్ర నిర్వహించగలుగుతుంది.

## 3. ప్రయోజన గణాలు

అభివృద్ధి కృషిలో ప్రజా సంఘాలు గణనీయమైన పాత్రనుకలిగి ఉంటాయి. అభివృద్ధివల్ల ప్రయోజనం పొందే గణాలు వ్యవస్థీకృతమై కార్మికసంఘాలు, వ్యవసాయ దారుల సంఘాలు, పారిశ్రామికవేత్తల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు వంటి సంఘాలుగా ఏర్పడి సామాజిక మార్పులలో క్రియాశీలక మైన పాత్రలు నిర్వహించగలుగుతాయి. ఈ సంఘాలను ప్రయోజనగణాలు లేక నిర్బంధక సముదాయాలు అని పిలుస్తున్నారు. వ్యక్తులుగా సాధించలేని ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం ఈ సంఘాలు ఏర్పడతాయి. ప్రభుత్వం కూడా వ్యక్తులందరితో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం కష్టం కాబట్టి ప్రయోజనగణాల ద్వారా ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకుంటుంది. ఈ సంబంధాలు ప్రభుత్వ సంస్థలు ప్రజలకు ఎక్కువ సేవ చేయడానికి తోడ్పడతాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రయోజన గణాలు ఎక్కువగా పట్టణ ప్రాంతాలలోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఈ సంఘాల ప్రభావం చాలా తక్కువగా ఉంది. కాబట్టి ప్రభుత్వమే గ్రామీణ ప్రాంతాలలో ఈ సంఘాలను ఏర్పాటు చేసి, వాటికి కావలసిన ధన సహాయాన్ని, సలహాలను, శిక్షణను ఇవ్వాలి. ప్రయోజన గణాలు సంకుచితమైన కుల, మత, ప్రాంతీయ ప్రభావాలకు దూరంగా ఉండేట్లు చూడాలి. రాజకీయాలకు అతీతంగా ఈ సంఘాలు తమ సభ్యుల ప్రయోజనాల కోసం కృషి చేస్తుంటాయి. కొన్ని సందర్భాలలో రాజకీయ సంస్థలకు అనుబంధ సంస్థలు గా కూడా ఉంటాయి.

## 4. ప్రసార సాధనాలు

రేడియో, దూరదర్శన్, వార్తా పత్రికల వంటి ప్రసారసాధనాలు కూడా అభివృద్ధి సాధించడంలో ప్రధాన ప్రాతను కలిగి ఉంటాయి. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో, ప్రభుత్వ కార్యక్రమాలను గురించి ప్రజాభిప్రాయాలను తెలుసుకోవడంలో ప్రసారాసాధనాలు చాలా ఉపయోగపడతాయి. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రేడియో, దూరదర్శన్ లాంటి ప్రసార సాధనాల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను గురించి ప్రజలకు తెలియజేయడం సులభమవుతుంది. నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న సమాజాలలో రేడియో, టెలివిజన్ ద్వారా ప్రజలను విజ్ఞాన వంతులుగా చేయడానికి చాలా అవకాశం ఉంది. వార్తాపత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంబధాలకు సాధనాలుగా ఉపయోగపడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రసార సాధనాలు పని చేయడంలో అనేక పరిమితులున్నాయి. అభివృద్ధి కృషిలో ప్రజలను సమీకరించడానికిప్రసార సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించకోలేక పోతున్నారు.

పైన వివరించిన నాలుగు సాధనాలు అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతి నిర్మాణాన్ని సామాజిక, ఆర్థికాభివృద్ధిని సాధించడానికి తోడ్పడతాయి. ఒక్కొక్కసారి ఒక కార్యక్రమం అమలుకు ఒక్కొక్క సాధనం ఉపయోగపడవచ్చు. సాధారణంగా ఈ నాలుగు సాధనాలు ఒక దానితో ఒకటి ముడిపడి

BRAOU

ఉంటాయి. ప్రత్యేకంగా రాజకీయపక్షమూ, పాలనా వ్యవస్థ దగ్గరి సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఒక్కొక్కసారి ఈ నాలుగు సాధనాల మధ్య ఘర్షణలు వచ్చే అవకాశం కూడా ఉంది. కాబట్టి వీటిని సక్రమంగా ఉపయోగించుకోవడానికి రాజకీయ నాయకులకు వీటిని గురించిన స్పష్టమైన అవగాహన ఉండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ నాలుగు సాధనాలను ఉపయోగించుకోకుండా ప్రజా సమీకరణ చేయడం సాధ్యం కాదు. ప్రజాసమీకరణ లేకుండా మార్పు సాధ్యం కాదు. ప్రపంచంలో ఈ నాడున్న వివిధ రాజకీయ వ్యవస్థలు ప్రగతి సాధనకు వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయి. ప్రగతిసాధనాలను ఉపయోగించే పద్ధతుల్లో తేడాలున్నాయి. ఏ రాజకీయ వ్యవస్థ ఈసాధనాలను ఏ విధంగా ఉపయోగించుకుంటుంది అనే విషయాన్ని గురించి కొంత వివరంగా తెలుసుకుందాం.

## 6.5 రాజకీయ వ్యవస్థల వర్గీకరణ

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వివిధ రకాలైన రాజకీయ వ్యవస్థలున్నాయి. జాతి నిర్మాణం, సామాజిక ఆర్థిక ప్రగతి లక్ష్యాలను సాధించేటందుకు కొన్ని పరిస్థితులు అవసరమని ఇస్‌మెన్ భావించాడు. అవి:

- మార్పుకు బద్ధులైన పాలనా నాయకులు;
- అభివృద్ధి లక్ష్యాల సాధనకు తగిన చర్యలు చేపట్టేలా ప్రేరణ నిచ్చే సిద్ధాంతం;
- అభివృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమయిన ప్రసార సాధనాలు.

పరిస్థితులను కల్పించే సామర్థ్యం అన్ని రకాల రాజ్య వ్యవస్థలకు సమానంగా ఉండదు. రాజ్య వ్యవస్థలు భిన్న విలువలు, నిర్మాణాలు, అధికార సమ్మేళనాలు, ప్రవర్తనా సరళిని కలిగి ఉండడం చేత అభివృద్ధిని సాధించడంలో వాటి సామర్థ్యంలో తేడాలుంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలోని రాజకీయ వ్యవస్థలను ఇస్‌మెన్ ఐదు రకాలుగా విభజించవచ్చునని పేర్కొన్నాడు. అవి :

### 1. సాంప్రదాయ కులీన వ్యవస్థలు (Conservative oligarches) :

ఇది సాంప్రదాయ బద్ధమైన సమాజాలలో ఉన్న రాజకీయ వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలోని ఈ అధికార వర్గాలు సాంప్రదాయమైన విలువలను కలిగి ఉంటాయి. వీరు తాము పుట్టి పెరిగిన సామాజిక వ్యవస్థలను గౌరవిస్తారు. వీరు ఎలాంటి కార్యక్రమాలను చేపట్టినా తమ అధికారానికి భంగం వాటిల్లకుండా కాపాడుకుంటారు. వీరు రాజకీయాలను ప్రోత్సహించరు. కొన్నివేళలలో సహించరు కూడా. ప్రజా ఉద్యమాలకు స్వచ్ఛంద సంస్థల స్థాపనకు వీరు అవకాశం కల్పించరు. ప్రజల అభివృద్ధికి ఏ కార్యక్రమం చేపట్టకపోతే తమ అధికారానికి మోసం కల్గుతుందని తెలుసు కాబట్టి వీరు ప్రజల కొరకై కొన్ని పరిమితమైన కార్యక్రమాలను చేపడతారు. ఒకవేళ ఆ కార్యక్రమాల వలన వ్యవస్థ రక్షణకు ఏమైనా ముప్పు కల్గునని తెలిస్తే వాటిని విరమిస్తారు.

ఈ దేశాల్లోని రాజకీయ నాయకులకు సరయిన సిద్ధాంతాలు ఉండవు. అవి ప్రజలను మోసం చేస్తాయని, అవి కేవలం ఊహకల్పితాలని వీరు భావిస్తారు. వీరు భవిష్యత్తు గురించి స్పష్టమైన కార్యక్రమాలను వెలిబుచ్చరు. మార్పు క్రమంగా కాలక్రమేణా దానంతటదే వస్తుందని నమ్ముతారు. అంతేకాకుండా మార్పు వేగంగా వస్తే ప్రజలలోని వివిధ వర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిని సమాజ సుస్థిరతకు భంగం వాటిల్లుతుందని వీరు వాదిస్తారు. అందువలన వీరు భవిష్యత్తును గూర్చి మాట్లాడకుండా కేవలం ప్రస్తుత సమస్యల మీద దృష్టిని కేంద్రీకరిస్తారు. వీరు హాన్ - బీన్‌లీ విశ్లేషణలో పేర్కొన్న దోపిడీ మనస్తత్వదారుల పోలికలను కల్గి ఉంటారు.

ప్రభుత్వ కార్యక్రమాలను అమలు పరచుటకు ప్రజా సమీకరణలో నమ్మకం కలిగి ఉండరు. ఈ వ్యవస్థ

BRAOU

కేవలం పాలనా యంత్రాంగం పై ఆధారపడును. దీనిని కూడా తమ అధికారాన్ని కాపాడుకొనుటకై చాలావరకు వినియోగించుకుంటారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియజేయుటకు ఏ ఇతర సాధనాలు లేకపోవుట వలనను, ప్రజలు సహకారము లేనందు వలనను ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఎంతో అసమర్థత ఉంటుంది. ఉద్యోగి స్వామ్యంలో సుస్థితి సరిగా లేకపోవడం వల్ల వారిలో ప్రజా కార్యక్రమాల పట్ల ఒక రకమైన వైరాగ్యత ఏర్పడుతుంది. దీనివలన ప్రభుత్వ యాంత్రాంగంలో ఎలాంటి సామర్థ్యం మనకు కనిపించదు.

ప్రభుత్వ యంత్రాంగంలో సైన్యం, పోలీసులకు ఈ వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత నిస్తుంది. ఈ వ్యవస్థలలో సాంప్రదాయమైన రాజకీయ నాయకులంతా అభ్యుదయ రాజకీయ సిద్ధాంతాలు కల్గిలేనందున ప్రజా సమీకరణ పై ఎలాంటి సాధనాలను ఉపయోగింపక ప్రజలలో ఎక్కడైనా చైతన్యం కల్గుతుంటే, సైన్యం, పోలీసుల సహాయంతో వాటిని మొగ్గలోనే త్రుంచివేయ ప్రయత్నిస్తారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎలాంటి మార్గాలు లేకపోవడం వల్ల, ప్రజాహిత చర్యలు తీసుకోకపోవడం వలన మార్పు కాంక్షించే మధ్య తరగతి మేధావులలో ఎంతో నిరాశ కన్పిస్తుంది. ఈ నిరాశ వలన మేధావులు ప్రజా సమీకరణకు పూనుకొనుట వలన కొన్ని సామాజిక మార్పు లక్షణాలు మనకు అక్కడక్కడా కనిపిస్తాయి. నిజానికి ప్రపంచంలో ఈ వ్యవస్థల సంఖ్య రోజు రోజు కు పూర్తిగా తగ్గిపోతుంది.

## 2. పోటీ పద్ధతి రాజకీయ వ్యవస్థలు (Competative Interest Oriented Party System)

ఈ వ్యవస్థ పాశ్చాత్య రాజకీయనమూనాకు దగ్గరగా ఉంటుంది. ఈ వ్యవస్థలో ఎన్నిక పద్దతులు, ప్రజా సంస్థలు, న్యాయ వ్యవస్థలు, రాజకీయ భావ ప్రకటన స్వాతంత్ర్యం, ప్రైవేటు రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. మూడవ ప్రపంచ దేశాలు తమ రాజకీయ ప్రారంభదశలో ఈ నమూనాను అవలంబించాయి. ఈ నమూనాను అమెరికన్ రాజకీయ శాస్త్రజ్ఞులు ఎక్కువగా మద్దతు నివ్వడమే కాకుండా అన్ని వ్యవస్థలలో ఇదే చాలా ఉత్తమమయిన నమూనాగా కూడా భావిస్తారు. కానీ దాదాపు మూడవ ప్రపంచ దేశాలన్నింటిలో ఈ వ్యవస్థ పనిచేయకపోవడమో, చేసినా లాంఛనప్రాయంగా మారడమో జరిగింది. అందువలన పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన సమాజాలలో పనిచేస్తున్న ఈ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమాజాలకు ఎంతవరకు ప్రయోజనకరంగా ఉంటుందనే అనుమానం ఇప్పుడు అమెరికన్ రచయితలే వెల్లడిస్తున్నారు.

ఈ రాజకీయ వ్యవస్థలోని అధికార వర్గంలో భూస్వాములు, పట్టణ వ్యాపారస్తులు, వివిధ సాంప్రదాయ సంఘాల ప్రతినిధులు ఎక్కువగా ఉంటారు. దీనికి కారణం వారికి సమాజంలో ఉన్న హోదా, ఉన్నత విద్య, రాజకీయాలలో పాల్గొనుటకు కావలసిన సమయం, పదవిని కాపాడుకొనుటకు కావలసిన ఆర్థిక స్థోమత, ఇతర వనరులు ఉండుటయే. అయితే సాంప్రదాయ లీపన వ్యవస్థ పద్ధతి వలే గాక ఈ వ్యవస్థలో చురుకుగా ఉన్న కార్మిక నాయకులు, ప్రాంతీయ నాయకులు, వివిధ వృత్తుల వారు, పారిశ్రామిక రంగంలోని వారు కూడా రాజకీయాల్లో పాల్గొనే అనకాశం ఉంది. ఈ వ్యవస్థలో ప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే అవకాశం ఉండుట వలన వర్గ పోరాటానికి దారితీసే అవకాశం చాలా వరకు ఉన్నది.

ఈ వ్యవ్థలో నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం ఉండదు. ఎన్నికలలో విజయం ఎలా సాధించాలన్నదే రాజకీయ ప్రధాన సిద్ధాంతం కావడంతో స్వల్పకాలిక లక్ష్యాలకు ప్రాధాన్యత పెరిగి మౌలికమైన సమస్యల పరిష్కారానికి కావల్సిన దీర్ఘకాలిక ప్రణాళికలు కుంటుబడతాయి. అంతేగాక మౌలికమైన మార్పులను భూస్వాములు, వ్యాపారస్తులు వ్యతిరేకిస్తారు. ఎందుకనగా ఈ మార్పువలన వారి ఆర్థిక, సామాజిక హోదాకు భంగం వాటిల్లుతుందని వారికి తెలును. మౌలిక మార్పులను కాంక్షించే మేధావులు, కార్మిక నాయకులు, పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు మొదలగు వారికి రాజకీయ పలుకుబడి లేనందున విధాన రూప కల్పనను ఎక్కువగా ప్రభావితం చేయలేరు.

BRAOU

ఈ వ్యవస్థలో అభివృద్ధికి కావలసిన వనరులను సమీకృతం చెయటం కూడా చాలా కష్టం ఎందువలన అనగా వనరుల సమీకరణ ధనిక వర్గాల నుండి చేయివలె. ఈ వర్గాలకు విపరీతమైన రాజకీయ పలుకుబడి ఉండుటవలన వీరు ప్రభుత్వం తీసుకునే ఏ చర్యనైనా ఎదురించుటయే గాక ఆ చర్యను సఫలీకృతం కాకుండా చూస్తారు. ఈ కారణం వలన ఈ వ్యవస్థలలో ఆర్థిక వనరులలో ఒక శాశ్వతమైన సమస్యగా ఉంటుంది. దీని ఫలితంగా రాజకీయ సిద్ధాంతాలలో మౌలికమైన మార్పుకు ఎలాంటిచోటు లేక ప్రగతి చాలా తక్కువగా ఉండి సామాజిక అభివృద్ధి తీరు తెన్నులు స్పష్టంగా అగుపించవు.

ఈ వ్యవస్థలో అన్ని అభివృద్ధి సాధనాలు ఉపయోగించబడతాయి. కాని వీటి ద్వారా ప్రజాసమీకరణ అనుకున్నంతగా సాధింపబడదు. ప్రజా సమీకరణకు ఉపయోగపడే నాల్గు సాదనాలలో మొదటిదైన రాజకీయ పార్టీకి బలమైన సిద్ధాంత ప్రాతిపదిక లోపించి, మతాల పేరిట, వేరువేరు తెగల పేరిట, ప్రాంతీయ విభేధాల పేరిట పార్టీలు పనిచేయుట వలన ప్రజా సమీకరణకు ఇది ఉపయోగపడదు. అంతేగాక స్వల్పకాలికమైన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చి ఎన్నికలలో విజయం సాధించటమెల అన్న సమస్యే వారిని వేధించుటవలన సిద్ధాంత పరమైన దీర్ఘకాలిక ప్రణాళికలను, సమాజంలో మౌలికమైన మార్పులను గురించి ఈ పార్టీలు అంతగా పట్టించుకోవు.

ఈ వ్యవస్థలో పాలనా యంత్రాంగం కేవలం వర్గాల ప్రయోజనాలను కాపాడటంలోనే నిమగ్నమై ఉంటుంది. పాలనాధికారులకు ప్రగతి పట్ల, ప్రజా సమీకరణ పట్ల నిబద్ధత (commitment) లోపించుట వలన వారు ప్రగతి సాధనకు అంతగా దోహదపడలేరు. రాజకీయ అధికారం ఉన్నత వర్గాల చేతులలో ఉండుట వలన ప్రగతి కార్యక్రమాల రూపకల్పనలోను, వాటి ఆచరణలోను వారికి వీటో అధికారమున్నదని చెప్పవచ్చును, ఈ వర్గాల జోక్యముండట వలన ఈ పాలనా యంత్రాంగం ప్రగతి సాధనంగా మారుటకు అవకాశం చాలా తక్కువ.

ఈ వ్యవస్థ ప్రైవేటు రంగాన్ని, స్వచ్ఛంద సంస్థలను చాలా వరకు ప్రోత్సహిస్తుంది. ఈ వ్యవస్థలలో స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయుటలోను వాటి నిర్వహణలోను ప్రభుత్వ జోక్యం చాలా ఉంటుంది. ప్రభుత్వం తన మనుగడకు ఈ స్వచ్ఛంద సంస్థల మీద ఆధారపడి ఉంటుంది కానీ అభివృద్ధి చెందుతున్న సమాజాలలో ప్రవేటు రంగం బలపడుటకు గానీ, స్వచ్ఛంధ సంస్థలు సమర్ధవంతంగా పనిచేయుటకు గానీ, తగిన వాతావరణం లేకపోవడం వలన ఈ సాధనం కూడా ప్రజా సమీకరణకు ఉపయోగపడలేక పోతున్నది. ప్రచార సాధనాలు కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలకు తెలియజేయుటకు మాత్రమే ఉపయోగించి, ప్రజా సమీకరణమునకు మాత్రం ఉపయోగింపబడవు

## 3. అధిక ప్రజా బాహుళ్య పార్టీ వ్యవస్థలు (Dominent Mass Party System)

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గల రాజకీయ వ్యవస్థలలో, ఏకపక్ష ఆధిక రాజకీయ వ్యవస్థ ఒకటి. ఇది కూడా పాశ్చాత్య దేశాల్లో గల వ్యవస్థ నమూనాకు చెందినదే. అయితే ఆ వ్యవస్థలలో రెండు లేదా మూడు బలవత్తరమైన రాజకీయ పార్టీలు ఉండి ఒకదానితో ఒకటి పోటీపడి ఏ పార్టీ అయినా అధికారం లోకి వచ్చే అవకాశముంటుంది. కానీ ఈ వ్యవస్థలలో వివిధ రాజకీయ పార్టీలు ఉన్నా ఒకే పార్టీ అత్యధిక మెజార్టీ కల్గి ఉండి దాదాపు ఎప్పుడూ అధికారంలో కొనసాగుతూ ఉంటుంది. అయితే సమ్మోహనాత్మక అధికారం ఈ వ్యవస్థ ముఖ్య లక్షణాలలో ఒకటి. ఈ పార్టీ ఆ నాయకుని చుట్టు అల్లుకుని ఉంటుంది.

ఈ వ్యవస్థలోని రాజకీయ నాయకులు వివిద వృత్తులు, సంఘాలు, వర్గాలు, ప్రాంతాలు, భాషలకు సంబంధించిన వారు కూడా ఉంటారు. ఈ వ్యవస్థలలో వివిధ పార్టీలకు చెందిన వారు ఒక చోట చేరి మిశ్రమ ప్రభుత్వం స్థాపించవచ్చు. అంతే గాక సాంప్రదాయకంగా వస్తున్న నాయకులందరూ ఈనూతన వ్యవస్థలోని పార్టీలో సభ్యులుగా చేరి రాజకీయ పలుకుబడిని సంపాదించుకొనవచ్చు.

BRAOU

రాజకీయ సిద్ధాంతం ప్రాముఖ్యతను పరిశీలిస్తే ఈ వ్యవస్థలో కూడా నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం ఉండదు. అందువలన సిద్ధాంతం దృఢంగా (Flexible) ఉంటూ కాలానుసారంగా మారుతుంది. సాధారణంగా జాతీయ భావనకు, సాంఘిక ఆర్థికాభివృద్ధికి ప్రాముఖ్యత ఇవ్వబడుతుంది. కాని సమాజంలో మౌలికమైన మార్పులను కావలసిన వాతావరణం లోపించిన కారణం రాజకీయ నాయకులలో చాలా మటుకు భూస్వాములు, కుల, మతపెద్దలు ఉండుటవలన వీరు మౌలికమైన మార్పులను వ్యతిరేకిస్తారు.

అధికారంలో ఉన్న పార్టీ ప్రజల మద్దతును సంపాదించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రజా మద్దతు కొరకై సమాజంలో జరిగే అన్యాయాన్ని సంప్రదాయకంగా వస్తున్న అధికారాన్ని, కులమత విదేశీ ప్రభావాలను కూడా తొలగించి నూతన వ్యవస్థను నివారింపవలె. ఈ లక్ష్యాలను సాధించుటకు ప్రజా సమీకరణను చేయవలసిన అగత్యం చాలా ఉంది. ఈ వ్యవస్థ మిగతా మూడు వ్యవస్థల వలెకాక కొంతవరకు ప్రాధాన్యత నిస్తుంది. అంతేకాక ఈ పద్ధతి కల దేశాల్లో సామ్యవాద సిద్ధాంతం ఎక్కువ పలుకుబడిలో ఉండును. సాధారణంగా ప్రభుత్వం, ప్రైవేటు రంగాలు రెండు ఉన్నా ప్రతి ఆర్థిక విషయంలో ప్రభుత్వ జోక్యం ఉంటుంది. అంతేగాక కొన్ని ఆర్థిక బాధ్యతలను ప్రభుత్వం స్వయంగా నిర్వహిస్తుంది.

ప్రజా సమీకరణకై రాజకీయ పార్టీని ముఖ్యంగా ఉపయోగించుకుంటుంది. ఒకే బలవత్తరమైన పార్టీ ఉండుట వలన వీరి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు దేశమంతటా విస్తరించి ఉంటారు. వీరి సహాయంతో ప్రభుత్వం ఏ పెద్ద కార్యక్రమాన్ని ప్రారంభించినా వీరు దానిని ప్రజలకు తెలుపుటకు ప్రయత్నిస్తారు. సాధారణంగా ఈ వ్యవస్థలో రాజకీయ పార్టీ ఎన్నికల సందర్భంలో తన శాయశక్తులను ఉపయోగిస్తుంది. ఇతర వేళలయందు ప్రజా సమీకరణను చేయుటలో ఎక్కువ ఆసక్తిని చూపదు.

రాజకీయ పార్టీయే గాక ఈ వ్యవస్థ మిగతా మూడు సాధనాలు అనగా ప్రభుత్వ యాంగం, స్వచ్ఛంధ సంస్థలు ప్రసార సాదనాలన్నింటినీ ఉపయోగిస్తుంది. నిర్దిష్టమైన సిద్ధంతం లేక అన్ని సాధనాలు ఉపయోగించినప్పుడు పరస్పర ఘర్షణలు ఏర్పడతాయి. ఉదాహరణకు ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకుల మధ్య అప్పుడప్పుడు తల యెత్తే గర్షణలను పేర్కొనవచ్చు. అంతేగాక స్వచ్ఛంధ సంస్థలు, రాజకీయ పార్టీలు కూడా సర్వసాధారణమైన విషయమే. ఈ ఘర్షణలు రాకుండా ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి ఎథకాలు తయారు చేస్తారు. కానీ సిద్ధాంతాల్లలో అ దృఢత వలన ప్రణాళికలున్నా ఈ ఘర్షణలు తొలగించుట చాలా కష్టం

ఈ వ్యవస్థకు సమ్మోహిత నాయకత్వం హృదయం వంటిది. ప్రజాభిమానాన్ని చూరగొన్న నాయకత్వంఉన్నంత కాలం పార్టీ పలుకుబడికి, పటిష్టతకు అపాయం లేదు. కానీ సమ్మోహిత నాయకత్వం ఎల్లప్పుడూ ఉండుట అన్నది అనూయ్యమే. ఈ నాయకత్వం లోపించినప్పుడల్లా వ్యవస్థ చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. అంతేగాక చాలా కాలం అధికారంలో ఉండుట వలన అధికార పార్టీలో ఉన్నత, దనిక వర్గాలకు చెందిన వారికే ఎక్కువ ప్రాముఖ్యత లభించి, పార్టీ వాళ్ళ చేతులలో నుండుట వలన క్రమేణా పార్టీ ప్రజలకు దూరమై వారి మద్దతును కోల్పోయే అవకాశం కూడా ఈ వ్యవస్థలో ఎంతైనా ఉంది. దీనికి తోడు పార్టీకి అధిక మద్దతు ఉండుట వలన వీరు ప్రతిపక్షాలను పూర్తిగా అణచివేయ ప్రయత్నించవచ్చును. అలాంటప్పుడు ఈ నమూనా పాశ్చాత్య ప్రజాస్వామ్య వ్యవస్థలకు గల లక్షణాలను కోల్పోతుంది.

ఈ వ్యవస్థలోకొంతవరకు రాజకీయ సుస్థిరత ఉండుట వలన ప్రజా సమీకరణకు ప్రయత్నాలు సల్పుట వలన కొంతరవకు మౌలికమైన మార్పులను ప్రవేశపెట్టి ప్రగతిని సాధించుటకు అవకాశం ఉన్నది.

BRAOU

## 4. అధికార సైనిక సంస్కరణ వ్యవస్థలు (Authoritative Military Reforms)

స్వాతంత్ర్యం పొందిన చాలా దేశాలు పాశ్చాత్య రాజకీయ వ్యవస్థలను నెలకొల్పుకున్నాయి. కాని చాలా దేశాలలో ఈ వ్యవస్థలు మనలేక రాజకీయ సుస్థిరత లోపించినప్పుడు వాటి స్థానంలోనే మిలటరీ వ్యవస్థలు అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. సాధారణంగా సాంప్రదాయ మిలిటరీ అధికారుల వలె గాక ఈ అధికారులు జాతీయ నిర్మాణాన్ని సాంఘి, ఆర్థిక అభివృద్ధిని సాధించాలనే ఆకాంక్ష కల్గినవారు. వీరు చేపట్టిన కార్యక్రమాలన్ని త్వరితంగా ఫలితాలివ్వాలని తలుస్తారు. వీరు జాప్యాన్ని క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించరు. సామాజిక ఆర్థిక కార్యక్రమాలన్నింటిలో ప్రభుత్వ జోక్యముంటుంది. కానీ ఈ వ్యవస్థ ప్రజా సమీకరణలో అసలు నమ్మకాన్ని కల్గి ఉండరు. అందువలన ఈ వ్యవస్థలలో ప్రగతి పూర్తిగా కుంటుపడే అవకాశం ఉంది.

ఈ వ్యవస్థలో అధికారంలో ఉన్న మిలిటరీ అధికారులు సాధారణంగా మధ్య తరగతికి చెందినవారు మిలటరీలో నుండి వచ్చుట వలన వీరు క్రమశిక్షణకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. వీరికి సామాజిక ప్రగతిని గురించి ఎలాంటి రాజకీయ సిద్ధాంతం ఉండదు. సమాజంలోని ప్రస్తుత సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా భావిస్తారు. తక్కువ మాట్లాడి ఎక్కువ కార్యక్రమాలను తాము సాధిస్తున్నామని వీరు భావిస్తారు. అంతే కాకుండా లక్ష్యానికి తమకుతాము అంకితం చేసుకుని పని సాధిస్తున్నామని కూడా భావిస్తారు. సాధారణంగా వీరు సిద్ధాంతపరంగా జాతీయసేవకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు.

ప్రగతిని సాధించుటకు ఉపయోగించే సాధనాలలో రాజకీయ పార్టీలను తిరస్కరిస్తారు. అంతేగాక రాజకీయ భావ ప్రకటనలను రద్దు పరుస్తారు. రాజకీయాలు అనవసరమని,అవి అవినీతికి, కపటానికి, అసమర్థతకు దారి తీస్తాయని వీరి అభిప్రాయం. రాజకీయాల వలన ఉద్భవించే ఘర్షణలకు తొలగించుట వలన ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి గ్వరితగతిన ఫలితాలను సాధించవచ్చని వీరు భావిస్తారు. పాలనా యంత్రాంగంపై చాలా వరకు ఆధారపడతాయి. కార్యక్రమ నిర్వహణలో పాలనా యంత్రాంగాన్ని పూర్తిగా ఉపయోగిస్తారు. పాలనా యంత్రాంగారనికి కూడా వ్యవస్థలో కొంతవరకు నమ్మకం కలిగి మిలటరీ అధికారులకు చేదోడు వాదోడుగా ఉంటారు. కానీ పాలనా యంత్రాంగాన్ని ప్రజా సమీకరణ కొరకవి ఉపయోగించరు.

ఈ వ్యవస్థ స్వచ్ఛంధ సంస్థలను ప్రోత్సహించదు. స్వచ్ఛంద సంస్థల వలన కలహాలు, రాజకీయాలు ఉత్పన్నమై సామాజిక సుస్థిరతకు భంగం వాటిల్లునని వీరు భావిస్తాడు. అదే విధంగా ప్రచార, ప్రకార సాధనాలు ప్రజా సమీకరణకు ఉపయోగించరు.

ఈ వ్యవస్థ యాంత్రిక క్రమశిక్షణ నమ్మకమున్న మిలటరీ అధికారులు అధికారంలో ఉండడం వలన స్పష్టమైన రాజకీయ సిద్ధాంతం లేక రాజకీయ పార్టీని స్వచ్ఛంద సంస్థలను తిరస్కరించుట వలన పాలనా యంత్రంగాన్ని, ప్రచార, ప్రసార సాధనాలను ప్రజా సమీకరణకు ఉపయోగించక పోవడం వల్ల ప్రగతి సాదనకు కావలసిన వాతావరణం ఈ వ్యవస్థలోలోపించినట్లుగా విధితమౌతుంది.

## 5. కమ్యూనిష్టు వ్యవస్థలు (Communist Systems)

రాజకీయ వ్యవస్థలలో ఐదవదైన ఈ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలామంది మేధావులను ఆకర్షిస్తుంది. ముఖ్యంగా సమాజంలోని అన్యాయాన్ని, అసమగ్రతలను తీసివేయడానికి, అభివృద్ధి సాధనకు, పేదరిక నిర్మూలనానికి కమ్యూనిష్టు వ్యవస్థే మార్గమని వీరి నమ్మకం. అందువలన కమ్యూనిష్టు రాజకీయ వ్యవస్థలో మేధావులను ఒక ప్రధాన ఆంశంగా పరిగణించాలి. మేధావులకే కాక, బీద ప్రజలకు అనాధలకు కూడా ఈ వ్యవస్థ నచ్చుతుంది.

BRAOU

కమ్యూనిష్టు వ్యవస్థలో అత్యంత ప్రధానమైంది రాజకీయ సిద్ధాంతం వీరు మార్క్సిస్టు లెనినిస్ట్ సిద్ధాంతాలను కట్టుబడి సామాజిక న్యాయం, చెదిరిపోని శాస్త్రీయగతి తార్కికానికి కట్టుబడి ఉంటారు. ఆర్థికంగా వెనుకబడిన దేశంలోని ధనికవర్గాల పెత్తనాన్ని తొలగించి వ్యక్తులందరికి న్యాయాన్ని కల్పించే నూతన శాస్త్రీయ సమాజాన్ని నెలకొల్పడమే కమ్యూనిష్టు సిద్ధాంత ముఖ్య లక్షణం. దీని కొరకై అంతర్గత వర్గ శత్రువులంతో సామ్రాజ్యవాద దేశాలలో పోరాటం తప్పదని వీరు భావిస్తారు. కమ్యూనిజమ్ అంతర్జాతీయ వాదనను బలపరచినప్పటికి ఈనాడు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్న కమ్యూనిష్టు వ్యవస్థలో జాతీయతా భావన ఆధారంగా పనిచేస్తున్నాయని ఇస్మన్ అభిప్రాయపడినాడు. ప్రగతిని ప్రణాళిక ద్వార, శాస్త్రీయ విజ్ఞానం ద్వారా సాధించవచ్చుననే నమ్మకం కమ్యూనిష్టు సిద్ధాంతంలో నిబిడీకృతమై ఉన్నది. ప్రగతిని సాధించుటకు కమ్యూనిష్టు వ్యవస్థలు తమ రాజకీయ పార్టీలమీద పూర్తిగా ఆధారపడి యుండును. కమ్యూనిష్టు పార్టీలో ఉన్న కార్యకర్తలు, సభ్యులు, పార్టీ నాయకులు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తారు. పార్టీలో క్రమశిక్షణ లేకపోతే సామాజిక మార్పును తీసుకురావడం, నూతన ప్రపంచాన్ని నిర్మించడం చాలా కష్టమని వారు భావింతురు. దేశంలోని ఆర్థిక విధానాలను పార్టీ రూపొందించుటేగాక వాటి అమలులో కూడా పార్టీ యంత్రాంగం ఎంతో చురుకుగా పనిచేస్తుంది. నిజానికి మిగతా మూడు చర్య సాధనాలను పార్టీయే నియంత్రిస్తుంది.

పాలనా యంత్రాంగం కమ్యూనిష్టు పార్టీ పర్యవేక్షణలో పనిచేస్తుంది. పాలనా యంత్రాంగంలో పార్టీ సిద్ధాంతాలతో నమ్మకం ఉన్న వారిని సమర్థవంతమైన వారిని నియమిస్తారు. సామాజిక, ఆర్థికాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వమే ప్రణాళికలను తయారు చేయవలసి ఉంటుంది. కాబట్టి పాలనా వ్యవస్థ ప్రధానమైన బాధ్యతను స్వీకరించవలసి ఉంటుంది.

ఈ వ్యవస్థలో నిర్ణయాధికారం కేంద్రీకృతం కావడం వలన లక్ష్య సాధనలో బలాన్ని భయాన్ని 9ఉపయోగించటం జరుగుతుందని ఇస్మన్ అభిప్రాయపడినాడు. అంతేగాక ఆర్థికపరమైన ప్రేరకాలు ఎక్కువగా లేనందున వ్యక్తులు సంపూర్ణమైన శ్రద్ధతో పనిచెయ్యలేరేమోననే అనుమానం వ్యక్తపరచినాడు. ప్రజా సమీకరణకు అత్యంత ప్రాముఖ్యత ఉన్నప్పటికి శారీరక శ్రమ ఎక్కువగా చేయవలసిన అవసరం ఉన్నదని ఇస్మన్ పేర్కొన్నాడు. అంతేగాక ఈ వ్యవస్థ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ ప్రజలు ఈ వ్యస్థలను నిర్మించుటకు చేయవలసిన త్యాగం చాలా ఎక్కువ అని కూడా అతడి అభిప్రాయం.

## 6.6. ముగింపు

ప్రగతి పాలనా సాధనాలను గురించి ఇస్మన్ విస్తృతమైన ప్రాతిపదికపైన పరిశీలన చేశాడు. తులనాత్మక పద్ధతిలో,, రాజకీయ వ్యవస్థల నేపథ్యంలో ప్రగతి పాలన సాధనాలను గురించి వివరించారు. సంక్లిష్టమయిన ప్రగతి ప్రక్రియను గురించి, భిన్న సాధనాల స్వభావాన్ని, పాత్రను గురించి అర్థం చేసుకోవడానికి ఈ దృక్పథం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇస్మన్ అభివృద్ధి చెందుతున్న దేశాలలోని బీదరికానికి, వైరుధ్యాలకు సరిఅయిన ప్రాధాన్యత ఇవ్వరాదనే విమర్శ ఉన్నది. జాతి నిర్మాణం, సామాజిక, ఆర్థిక అభివృద్ధి అనే అంశాలను పాశ్చాత్య దేశాల అభివృద్ధి చట్రంలో విశ్లేషించారునే విమర్శ కూడా ఉంది. అయితే ప్రగతి పాలనా అంశాలను రాజకీయ ప్రక్రియ నేపథ్యంలో పరిశీలించుట వలన ఇస్మన్ విశ్లేషణ అభివృద్ధి చెందిన దేశాలోని ప్రగతి సాధనాల పాత్రను అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగకరం అని చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తారు.

BRAOU

## 6.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. ఇస్మన్ అభిప్రాయంలో ప్రగతి సాధనకు అవసరమయిన కార్యక్రమాలు వివరించండి?
2. ప్రగతి సాధనాల పాత్రను వివరించండి.
3. ప్రగతి సాధనాల పాత్రపై రాజకీయ వ్యవస్థల ప్రభావాన్ని వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు రాయండి

1. ఇస్మన్ అభిప్రాయంలో ప్రగతి అంటే ఏమిటి ?
2. ప్రగతి పై రాజకీయ ప్రక్రియ ప్రభావం ఏ విధంగా ఉంటుంది.
3. ప్రగతిని సాధించడంలో రాజకీయ పార్టీల పాత్రను వివరించండి.

## 6.8 : చదువదగిన రచనలు


1. ఎం. బాపూజీ, తులనాత్మక పాలన, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1994
2. డి. రవీంద్రప్రసాదు, డి. హరగోపాల్, కె. మురళీమనోహర్ (సం), ప్రగతిపాలన, సౌత్ ఇండియన్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 1981.
3. Milton J Esman, Politics of Development Administration, In John D. Montgomery and William J. Siffin (Eds) Approaches to Development, Politics, Administration and change, New York, Mc. Graw Hill, 1966
4 Ferrel Heady, Public Administration. A comparative Perspective, Engle Wood cliffs, N.J Prenlice Hall, 1966


ఆచార్య వి.యస్. ప్రసాద్.

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

## ప్రభుత్వపాలనా శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం

ఎం.ఏ : రెండవ సంవత్సరం

## పాఠ్యాంశం – 1 ప్రగతిపాలన


ఖండం – 1 ప్రగతిపాలన : భావనలు

- భాగం – 1 తులనాత్మక ప్రభుత్వపాలనా శాస్త్రం : అర్థం, పరిధి, ప్రాధాన్యత
- భాగం – 2 తులనాత్మక ప్రభుత్వపాలనా దృక్పథాలు – సంస్థాగత, ఉద్యోగిస్వామ్య, వ్యవస్థా దృక్పథాలు
- భాగం – 3 ప్రగతిపాలన : భావన, పరిధి ప్రాధాన్యత
- భాగం – 4 ప్రగతి దృక్పథాలు : నిర్మాణ విధుల దృక్పథం
- భాగం – 5 ప్రగతి దృక్పథాలు , మార్క్సిస్టు, గాంధేయ దృక్పథం
- భాగం – 6 ప్రగతిపాలన సాధనాలు

ఖండం – 2 ప్రగతిపాలన : భారతదేశ అనుభవం

- భాగం – 7 ప్రగతి : సామాజిక , ఆర్థిక అంశాలు
- భాగం – 8 ప్రగతి వ్యూహాలు : ప్రణాళికీకరణ
- భాగం – 9 ప్రగతి : ఉద్యోగుల పాత్ర
- భాగం –10 ప్రగతిపాలన – నిబంధనల పాలన
- భాగం –11 ప్రగతి కార్పొరేషన్లు
- భాగం –12 సంక్షోభ నివారణ పాలన
- భాగం –13 ప్రగతి పాలన : లబ్ధిదారులు
- భాగం –14 పాలన : సంస్కృతి
- భాగం –15 రాజకీయ అధికారులు – ప్రభుత్వ ఉద్యోగుల సంబంధాలు
- భాగం –16 ప్రగతిపాలనలో సాధారణోద్యోగులు– విషయ నిపుణుల పాత్ర
- భాగం –17 ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం
- భాగం –18 పాలనా జవాబుదారీ పద్ధతులు
- భాగం –19 పాలనలో నిజాయితీ
- భాగం –20 పాలనా సంస్కరణలు
- భాగం –21 ప్రగతి పాలన : భారతదేశ పాలనలో పోకడలు


BRAOU

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం ప్రభుత్వ పాలనా శాస్త్రం

### కోర్సు – 1 ప్రగతిపాలన

### మాదిరి పరీక్షాపత్రం

సమయం : 3 గంటలు | మార్కులు : 100

I. ఈ క్రింది వాటిలో ఏ నాల్గింటికైనా 30 పంక్తులలో సమాధానాలు రాయండి

1. తులనాత్మక పాలన అధ్యయన ప్రాధాన్యతలను దానిలోని విభిన్న నమూనాలను వివరింపుము
2. మాక్స్‌వెబర్ ఉద్యోగిస్వామ్య నమూనాను విమర్శనాత్మకంగా పరిశీలించండి
3. రిగ్స్ వ్యవస్థా దృక్పథంలోని ప్రధానాంశాలను వివరించండి
4. గాబ్రియల్ ఆల్మండ్ ప్రతిపాదించిన నిర్మాణాలు, విధుల దృక్పథాన్ని పరిశీలించండి
5. ప్రగతి పాలన సందర్భాలను, నమూనాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి
6. రిగ్స్- నిర్మాణ, విధుల దృక్పథాన్ని పరిశీలించండి
7. ప్రగతికి సంబంధించి గాంధీ, మార్క్సుల భావాలను పరిశీలించండి.
8. ఇన్‌మన్ ప్రతిపాదించిన విధాన సాధనాల ప్రాధాన్యత ఎట్టిది.

II. ఈ క్రింది వాటిలో ఏ ఐదింటికైనా జవాబులు రాయండి

1. డేవిడ్ ఈస్టన్ వ్యవస్థాసిద్ధాంతాన్ని విశ్లేషించండి
2. రిగ్స్ పారదర్శనిక సమాజ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి
3. ప్రగతి పాలన అర్థాన్ని, ప్రాధాన్యతను వివరించండి
4. ప్రగతి సాధనలో స్వచ్ఛంద సంస్థల పాత్రను పరిశీలించండి
5. ప్రగతికి సంబంధించి మార్క్స్ భావాలను వివరించండి
6. గాంధీ ధర్మకర్తృత్వ సిద్ధాంత ప్రాధాన్యతను వివరించండి
7. ప్రగతిపాలనలోని వివిధ సందర్భాలను వివరించండి
8. తులనాత్మక పాలన ఆధారాలను వివరించండి
9. తులనాత్మక పాలన ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించండి
10. సాల్ కాట్జ్ వ్యవస్థా దృక్పథాన్ని పరిశీలించండి.

BRAOU

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

### ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం   ప్రభుత్వ పాలనా శాస్త్రం

### కోర్సు – 1   ప్రగతిపాలన

### అభ్యాసం – 1

సూచన :

1. ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు పుస్తకాలను చూసి రాయకూడదు
2. జవాబుల సాధ్యమైనతంతవరకే మీ స్వంత పదాలలోనే రాయాలి
3. మీరు రాసే జవాబు సరియైనదేనని నిరూపించుకొనుటకు తగిన ఆధారాల కోసం మీరు సంప్రదించిన గ్రంథాలను పేర్కొనండి
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి
5. మీరు రాసిన జవాబులు మూల్యాంకణం చేయడానికి మీరు ఉపయోగించే పుటల ( పేజీలు)కు ఒక ప్రక్కన పరీక్షకుడి వాఖ్యానం కోసం తగినంత స్థలం (Margin) వదలండి
6. మీరు ఈ అభ్యాసం రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

I. ఈ క్రింది వాటికి 30 పంక్తులలో జవాబు రాయండి

1. తులనాత్మక ప్రభుత్వపాలనా శాస్త్రపరిధి, ప్రాధాన్యతను దాని అధ్యయనానికి దారి తీసిన పరిస్థితులను పరిశీలించండి.
2. వ్యవస్థా దృక్పథానికి సంబంధించి ఫాల్ కాట్జ్ గేబ్రియల్ ఆల్మండ్ ల దృక్పథాన్ని పరిశీలించండి
3. ప్రగతి పాలనపై మార్క్సిస్టులు, గాంధేయ వాదుల అభిప్రాయాలను వివరించండి.

II. ఈ క్రింది వాటికి 15 పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రగతిపాలన ప్రాధాన్యతను, ప్రగతి సాధనాలను పరిశీలించండి
2. రిగ్స్ నిర్మాణ, విధుల దృక్పథాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి

BRAOU

BRAOU

BRAOU

# అందరికీ అందుబాటులో
# ఉన్నత విద్య




**డా. బి.ఆర్.**
**అంబేద్కర్**
**సార్వత్రిక**
**విశ్వవిద్యాలయం**

రోడ్డు నెం: 46,
జుబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

M.A.P.A. (F)-1

# ప్రభుత్వ పాలనా శాస్త్రం

## ప్రగతి పాలన

## 2

BRAOU

BRAOU

# ప్రభుత్వ పాలనా శాస్త్రం

## ప్రగతి పాలన

**ఖండం : 2**

BRAOU

**డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

రోడ్ నెం.46, జూబ్లి హిల్స్, హైదరాబాద్ - 500 033

**2004**

# రచయితల బృందం


## సంపాదకుడు

ఆచార్య సి.వి. రాఘవులు

## సహ సంపాదకులు

ఆచార్య వి.యస్. ప్రసాద్
డా॥ పంజాల నరసయ్య
శ్రీ సి. వెంకటయ్య

## రచయితలు

ఆచార్య వి.ఎస్. ప్రసాద్
డా॥ పంజాల నరసయ్య
ఆచార్య ఎమ్. బాపూజీ
ఆచార్య కె. మురళీమనోహర్
డా॥ రఘునాథ్
డా॥ బి.పి.సి. బోస్
డా॥ ఏ.జి. ప్రసాద్
డా॥ సి.హెచ్. చాముండేశ్వర ప్రసాద్
డా॥ వై. పార్థసారథి


ముఖ చిత్రం
'చంద్ర'

B R A O U


**డా॥బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,**
**హైదరాబాద్.**

ప్రథమ ముద్రణ 1995 [illegible] 2000 - 2001, 2002 ,2004


**ఈ కోర్సు చివరలో పాఠ్యాంశము, మాదిరి పరీక్షా పత్రము, రెండు అభ్యాసాలు (ఒకటి నుండి రెండు వరకు) యివ్వబడినవి.**


**© డా॥బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో ఒక భాగం.



*ఇతర వివరాలకు : డైరెక్టర్ (అకడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, జూబిలీహిల్స్, రోడ్డు నంబర్ - 46, హైదరాబాద్ - 500 033.*

Lr. No. 985/Dr. BRAOU/DMP/PTG/F.No. 56/J. O. 62/2004-2005/Dt. 07-09-2004/Copies 300
Printed at **Sudha Offset Printers,** Narayanaguda, Hyderabad - 29. Phone : 27562293

# పాఠ్యాంశ పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన వర్ధమాన దేశాల (మూడవ ప్రపంచ దేశాల) రాజకీయ చర్చలలో 'ప్రగతి' కీలకాంశంగా పరిణమించి, జాతీయాభివృద్ధి, సామాజికార్థిక ప్రగతి సాధన రాజ్య ప్రధానాశయాలుగా రూపొందాయి. ఈ ఆశయసాధనలో ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృత పరచబడి, పాలనాయంత్రాంగంపై గురుతర బాధ్యతలు మోపబడ్డాయి. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం గణనీయంగా పెరిగిన ప్రభుత్వ విధులు ప్రజల ఆశయాలకు - వాస్తవాలకు మధ్య, ప్రగతి ఆశయాలకు - వాటి అమలుకు మధ్య అగాధాన్ని సృష్టించి జాతీయాభివృద్ధి ఆశయాలకే సవాలుగా నిలిచాయి. అప్పటి వరకు కేవలం శాంతి భద్రతల పరిరక్షణ, శిస్తు వసూళ్ళకే పరిమితమైన పాలనా యంత్రాంగం ప్రగతి కార్యక్రమాల నూతన సవాళ్ళను ఎదుర్కొనే స్థితిలో లేకుండా పోయింది. కాబట్టి పాలనా యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించి, జాతీయాభివృద్ధి కార్యక్రమాల ఆశయసాధనాల కనుగుణంగా పాలనాయంత్రాంగం శక్తి యుక్తులను, ప్రతిభాపాటవాలను మెరుగుపరచటానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రగతి లక్ష్యసాధనలో నిమగ్నమైన పాలనా యంత్రాంగాన్నే 'ప్రగతి పాలన' అంటున్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో నేడు ప్రగతిపాలన అనే పదం విస్తృతంగా వాడుతున్నారు. ఎడ్వర్డ్ వీడ్నర్, ఎఫ్. డబ్ల్యు. రిగ్స్, జోసెఫ్ లాపలంబర, ఆల్బర్ట్ వాటర్ సన్ లాంటి అనేక మంది పాశ్చాత్య రచయితలు ప్రగతిపాలనభావాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఈ భావన ఎలా అభివృద్ధి చెందినప్పటికి ప్రభుత్వపాలనా శాస్త్రానికి చెందిన మేధావులు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలనా వ్యవస్థలను, అవి నిర్వహిస్తున్న విధుల స్వభావాన్ని బట్టి ప్రగతి పాలనగా గుర్తిస్తున్నందున అసలు ప్రగతి పాలన అంటే ఏమిటి? అది నిర్వహించే విధులేమిటి ? ప్రభుత్వ పాలనా శాస్త్రానికి, ప్రగతిపాలనా శాస్త్రానికి మధ్యగల తేడా లేమిటి అనే అంశాలు పాలనా శాస్త్ర విద్యార్థులలో ఆసక్తి రేకెత్తిస్తుంది.

ఈ నేపథ్యంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రభుత్వపాలనా శాస్త్ర పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఈ కోర్సును రూపొందించింది. ప్రగతిపాలన శాస్త్రం అభివృద్ధికి దోహదం చేసిన తత్త్వవేత్తల భావాలను, వివిధ ప్రగతి దృక్పథాలను, ఈ కోర్సులో చేర్చాం. ప్రగతి సమస్యలను, ప్రగతి దృక్పథాలను, ప్రగతి పథంలో నిమగ్నమైన ఉద్యోగిబృందం స్వరూప స్వభావాలను అవగాహన చేసుకోడానికి, ప్రగతి సాధనలో సమాజాలు ఎదుర్కొంటున్న సవాళ్ళను అర్థంచేసుకోడానికి, ప్రభుత్వ యంత్రాంగం సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఉన్న సమస్యలను విశ్లేషించడానికి 'ప్రగతి పాలన' అనే ఈ పాఠ్యాంశం దోహదం చేయగలదని భావిస్తుంది.

ఈ పాఠ్యాంశంలో మొత్తం రెండు ఖండాలు, 21 భాగాలున్నాయి. అధ్యయన సౌలభ్యంకోసం ఈ కోర్సును రెండు పుస్తకాలుగా ముద్రించబడింది. మొదటి పుస్తకంలో మొదటి ఖండానికి చెందిన ఆరు భాగాలుంటాయి. రెండవ పుస్తకంలో రెండవ ఖండానికి చెందిన 15 భాగాలుంటాయి. ప్రగతిపాలనపై మీ అవగాహనను పెంపొందించటానికి ఈ పుస్తకం దోహదం చేస్తుందని విశ్వవిద్యాలయం ఆశిస్తుంది.

BRAOU

BRAOU

# విషయ సూచిక


| భాగం | పేరు | పేజి సంఖ్య |
|---|---|---|
| 7. | ప్రగతి - సామాజిక, ఆర్థిక అంశాలు | 1 |
| 8. | ప్రగతి వ్యూహాలు | 13 |
| 9. | ప్రగతి - ఉద్యోగుల పాత్ర | 26 |
| 10. | ప్రగతి పాలన - నిబంధనల పాలన | 32 |
| 11. | ప్రగతి కార్పొరేషన్లు | 50 |
| 12. | సంక్షోభ నివారణ పాలన | 72 |
| 13. | ప్రగతి పాలన - లబ్ధిదారులు | 85 |
| 14. | పాలన - సంస్కృతి | 96 |
| 15. | రాజకీయ అధికారులు - ప్రభుత్వ ఉద్యోగుల సంబంధాలు | 102 |
| 16. | ప్రగతిపాలనలో సాధారణోద్యోగులు - విషయనిపుణుల పాత్ర | 115 |
| 17. | ప్రాతినిధ్య ఉద్యోగిస్వామ్యం | 132 |
| 18. | పాలనా జవాబుదారీ పద్ధతులు | 141 |
| 19. | పాలనలో నిజాయితీ | 153 |
| 20. | పాలనాసంస్కరణలు | 167 |
| 21. | ప్రగతిపాలన : భారతదేశ పాలనలో పోకడలు | 180 |


BRAOU

BRAOU

# ఖండం - 2

## ప్రగతి పాలన : భారతదేశ అనుభవం

BRAOU

మొదటి ఖండంలోని ఆరు భాగాలలో ప్రగతిపాలనకు సంబంధించిన భావనలు, దృక్పథాల గురించి చర్చించబడింది. ఈ రెండవ ఖండంలో 15 భాగాలు భారతదేశ అనుభవం గురించి తెలియపరుస్తాయి. తద్వారా సిద్ధాంతానికి ఆచరణకు మధ్య పొంతన వున్నది, లేనిది గ్రహించవీలవుతుంది. చాలా మట్టుకు పొంతన లేనందున రిగ్స్ పేర్కొన్న 'లాంఛనత్వం' నిజమని అనిపిస్తుంది. పొంతన సాధించుటకవసరమైన ఏ చర్యలు అవసరమో ఆలోచించవీలవుతుంది.

BRAOU

# భాగం -7: ప్రగతి - సామాజిక, ఆర్థిక అంశాలు

## విషయక్రమం :


7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 అభివృద్ధి - ఆర్థిక అంశాలు

7.3 అభివృద్ధి - సామాజిక అంశాలు

7.3.1 కుటుంబం

7.3.2 వర్గ నిర్మాణం

7.3.3 జాతి సంబంధాలు

7.3.4 మతం

7.3.5 గ్రామీణ, పట్టణ ప్రాంతాల వ్యత్యాసం

7.3.6 సాంప్రదాయాలు

7.4 భారతదేశంలో అభివృద్ధిపై సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రభావం

7.5 ఆర్థికాభివృద్ధిపై కుల ప్రభావం

7.6 సారాంశం

7.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

7.8 చదువదగిన రచనలు


BRAOU

## 7.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* అభివృద్ధిని ప్రభావితం చేసే ఆర్థిక, సామాజిక అంశాలు, వాటిని వివరించే సిద్ధాంతాలు, నమూనాలు
* భారతదేశంలో అభివృద్ధిని ప్రభావితం చేస్తున్న సామాజిక, సాంస్కృతిక అంశాలను వివరించగల్గుతారు.

## 7.1 పరిచయం

అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియ అస్థిరమైంది. అదే విధంగా ఏకరూపత కలిగిన ప్రక్రియ కాదు. అభివృద్ధి స్వభావం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతుంది. అభివృద్ధి ఒక బహుముఖ దృక్కోణ ప్రక్రియ. కాగా రెండో ప్రపంచ యుద్ధానంతరం అభివృద్ధి పట్ల మేధావుల ఆలోచనలో విపరీతమైన మార్పులు కలిగాయి. క్రమంగా అభివృద్ధి ప్రక్రియలో ఇమిడి ఉన్న కీలకాంశాలపై సామాజిక శాస్త్రవేత్తల దృష్టికేంద్రీకృతమైంది. క్రమంగా అభివృద్ధి భావనను వివరించే అనేక నూతన భావనలు ప్రతిపాదింపబడినాయి. మొదట్లో అభివృద్ధి అంటే

ఆర్థికాభివృద్ధి అని పరిగణింపబడింది. ఆడమ్ స్మిత్, ముత్తాపియన్, రికార్డో మొదలైన సాంప్రదాయ ఆర్థికవేత్తలు ఆర్థిక అంశాలపైన తమ దృష్టిని కేంద్రీకరించి అనేక భావనలను, సిద్ధాంతాలను ప్రతిపాదించారు. అయితే 1950 దశాబ్దంతరువాత కాలంలో మానవీయ శాస్త్ర, సమాజశాస్త్ర, మనస్తత్వ శాస్త్ర, రాజకీయ శాస్త్రవేత్తలు అభివృద్ధిలో ఆర్థికేతర అంశాల పాత్రను గురించి సిద్ధాంతీకరించటం ప్రారంభించారు. అభివృద్ధిపై నూతన సిద్ధాంతీకరణ ప్రారంభించిన సామాజిక శాస్త్రవేత్తలలో మాక్స్ వెబర్ తొలి శాస్త్రవేత్త. మాక్స్ వెబర్ ఆసియా దేశాలు ఆర్థికాభివృద్ధి సాధించటంలో విఫలం చెందటానికి ఈ సమాజంలో మతం వల్ల వ్యక్తులలో ఉద్భవించిన కొన్ని మానసిక పోకడలు, పాశ్చాత్యదేశాలలో ఆర్థిక విప్లవం సంభవించడంలో ప్రధాన పాత్ర వహించిన ప్రొటెస్టంట్ పనినీతి (Work ethic) ఈ సమాజంలో లోపించడం ప్రధాన కారకాలని పేర్కొన్నారు. లూయిస్-రాస్టవ్ అనే రచయితలు సాంప్రదాయ, ఆధునిక సమాజంలో సామాజిక, సాంస్కృతిక లక్షణాలను తులనాత్మకంగా విశ్లేషించి, సాంప్రదాయ సమాజంలో ఈ లక్షణాలను మార్చవలసిన, ఆధునీకరించవలసిన అవసరాన్ని వక్కాణించారు. హేజన్ సాంస్కృతిక మూర్తిమత్వం (Cultural Personality) లో మార్పు ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో ఆర్థిక కారకాలు కేవలం ప్రమాణాలు (Parameters) లేదా నియంత్రణా పరిస్థితులు మాత్రమేనని, సాంస్కృతిక మార్పు ఆర్థిక స్తబ్ధతను, ఆర్థికాభివృద్ధిగా మార్పుచేస్తుందని కూడా హేజన్ పేర్కొన్నాడు. కాగా మెక్‌లాండ్, లింటర్ బాయ్ అనే మనస్తత్వ శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధిని ప్రేరేపించడంలో సాధన ప్రేరణ (Need Achievement) పాత్రను వక్కాణించారు. ఉద్యమదారులలో సాధన ప్రేరణ పెంపొందినప్పుడు ఆర్థిక కార్యకలాపాలు ఉధృతం అవుతాయని వారు వివరించారు. ఇదే విధంగా ఇంకిల్స్ (Inkles) స్మిత్ అనే మనస్తత్వ శాస్త్రవేత్తలు మానసిక పోకడలు ఆధునీకరణ ఆర్థికాభివృద్ధికి మూలమని వాదించారు.

ఈ విధంగా 1950 దశాబ్దానికి మునుపు కల సంకుచిత అభివృద్ధి నమూనాలో మౌలిక మార్పు సంభవించింది. ఆర్థికేతర అంశాలను చేర్పడం ద్వారా ఈ నమూనా విస్తృతపర్చబడింది. ఈ నూతన అభివృద్ధి నమూనాలో వ్యక్తి మూలకేంద్రం. ఈ నమూనా సమాజం అంతర్గత లక్షణాలను, సమైక్యీకరణ శక్తులను పరిగణనలోకి తీసుకుంది. ఈ నమూనా సమాజం తన వ్యక్తిగత స్వభావాన్ని వదిలంగా కొనసాగించడంతో పాటు, తన అంతర్గత ఆలోచనలు, చర్యలు, విలువలకు అణుగుణమైన లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని ఉద్ఘాటించింది. ప్రతి దేశం తను సాధించిన అభివృద్ధికి తన సాంప్రదాయ విలువల పట్ల గౌరవం, తన ప్రజల సృజనాత్మక దృక్పథాలు ప్రధాన ప్రాతిపదికలు కావాలి.

ఈ నూతన అభివృద్ధి నమూనా వెబర్ సిద్ధాంతానికి అణుగుణమైన పాశ్చాత్య దేశాల అనుభవంపైన ఆధారపడిన ఏకీకృత (monoistic) నమూనా వంటిది కాదు. ఈ నమూనా సామాజిక విలువలు, సాంప్రదాయ పద్ధతులు, లక్షణాలు ప్రాధాన్యతను గుర్తించింది. ఈ నమూనా వివిధ దేశాలలో అభివృద్ధి ఆయా సమాజాల చరిత్రక అనుభవాలు, సంస్థలు సాంస్కృతిక సాంప్రదాయాలకు అనుగుణంగా మలచబడుతుందనే వాస్తవాన్ని గుర్తించింది. ఈ విధంగా విభిన్న సమాజాల సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడిన నూతన ఆర్థిక నమూనా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి ప్రక్రియ అవగాహనకు తోడ్పడుతుంది.

BRAOU

## 7.2 అభివృద్ధి - ఆర్థిక అంశాలు

ఆర్థికాభివృద్ధి ఆర్థికాంశాలపై రూపొందించిన సిద్ధాంతాలు ఉదార వాదంపై ఆధారపడ్డాయి. ఆర్థిక ఉదారవాదం ఆడమ్‌స్మిత్, రికార్డో, మాల్థస్ మొదలైన సాంప్రదాయ రచయితల రచనలలో రూపుదిద్దుకొంది. 18వ శతాబ్దంలోని ఆర్థిక వేత్తల ఆలోచనల ఫలితంగా ప్రైవేటు సంస్థలను, వ్యవస్థలను రాజ్యం నియంత్రణ నుంచి విముక్తి చేయాలనే భావన ఉద్భవించింది. వ్యక్తిశ్రేయో వాదంగా పిలువబడిన ఈ సిద్ధాంతాన్ని రికార్డో అభివృద్ధి పర్చాడు. రికార్డో ప్రతి దేశం స్వేచ్ఛాపూరిత వ్యాపారాన్ని ప్రోత్సహిస్తే కొన్ని వస్తువుల ఉత్పత్తిలో వ్యతిరేకీకరణను సాధించి, తన ఎగుమతి, దిగుమతులను పెంపొందింప చేసుకోగలదని వాదించాడు. కాగా మాల్థస్ ఆర్థికాభివృద్ధిలో జనాభా పెరుగుదల ప్రాధాన్యతను వక్కాణించాడు. ఆడమ్ స్మిత్ అడుగుజాడలలో మాల్థస్, రికార్డోలు ఆర్థికాభివృద్ధి సాధనకు వ్యక్తి శ్రేయోవాదం సరైన విధానం అనీ, అధికోత్పత్తి సాధనకు పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థవంతమైన సాధనమని వాదించారు. కాగా పెట్టుబడిదారీ విధానానికి కారల్ మార్క్స్, లెనిన్ తదితరుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. ఈ సిద్ధాంతవేత్తలు పెట్టుబడిదారీ విధానాన్ని ప్రత్యక్షంగా వ్యతిరేకించినప్పటికీ ఈ విధానం సామ్రాజ్యవాదానికి, అంతిమంగా సామ్యవాదానికి దారి తీస్తుందని సిద్ధాంతీకరించారు. కాగా వాస్తవంలో వ్యక్తి శ్రేయోవాదం రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఆర్థికంగా శిథిలమైన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థపై సమగ్రమైన ప్రభుత్వ నియంత్రణను సాధించేందుకు చర్యలను ప్రారంభించాయి.

కాగా ఈ దశలోనే కీన్స్ వ్యక్తి శ్రేయోవాదానికి ఒక నూతన సిద్ధాంతపరమైన చేకూర్చేందుకు ప్రయత్నించాడు. కీన్స్ ఆర్థిక రంగంలో ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలను కల్పించాలనే వాదనను బలపర్చాడు. కీన్స్ ఆర్థికాభివృద్ధిలో ఉపాధి కల్పన పాత్రను వక్కాణించాడు. కాగా కీన్స్ తరువాత వచ్చిన అనేక మంది ఆర్థిక శాస్త్ర సిద్ధాంతవేత్తలు పారిశ్రామిక దేశాలలో ఉపాధికల్పన సమస్యలపై, పొదుపు రేట్లు పెట్టుబడి కల్పన వడ్డీరేట్లు, జాతీయ ఆదాయం మొదలైన అంశాలను వివరించే నమూనా (Model) ను రూపొందించారు. ఈ నమూనాలలో హరోడ్ (Harrod) డోమర్ (Domar), డబ్ల్యూ, డబ్ల్యూ, రాస్టవ్ నమూనాలు ప్రసిద్ధి చెందాయి. హరోడ్, డోమర్ నమూనా క్రమంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి సాధనకు రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలకు ప్రధాన ఆధారమైంది; అయితే కీన్స్ సిద్ధాంతం ఆధారంగా రూపొందించిన ఆర్థికాభివృద్ధి నమూనాలు ఆర్థికాభివృద్ధిలో స్థూలజాతీయ ఉత్పత్తి (GNP) మితిమీరిన ప్రాధాన్యతను కనపర్చాయనే విమర్శకు గురిచేయబడ్డాయి. స్థూలజాతీయ ఉత్పత్తి దృక్పథం ఆర్థికాభివృద్ధిలో కీలకమైన అనేక అంశాల పాత్రను విస్మరించిందని విమర్శింపబడింది. గున్నార్ మిర్దాల్, మిల్టన్ సింగర్‌లు ఆర్థికాభివృద్ధి ఏకరేఖీయ (Unilinear), ఏకీకృత (Monoistic) భావన కాదనీ, అది బహుళదృక్కోణాలు కలిగిన ద్వైదీ (dualism) భావన అని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలలో పరస్పర సంఘర్షణ కలిగిన ఆధునిక, సాంప్రదాయ రంగాలు ఉంటాయనీ, ఈ సంఘర్షణ దేశ ఆర్థికాభివృద్ధి పై తీవ్రమైన పరిణామం కలిగి ఉంటుందని వారు వాదించారు.

1950, 60 దశాబ్దంలో ఆర్థిక శాస్త్రవేత్తల దృష్టి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి సాధించే మార్గాలపై కేంద్రీకృతమైంది. ఈ దేశాలలో నెలకొన్న తక్కువ ఉత్పత్తి పరిమిత మార్కెట్, పరిమిత పొదుపు, పెట్టుబడి మొదలైన విషయాలను ఛేదించేందుకు బిగ్‌పుష్ (Big Push) మూలధన సంచయనం (Capital formation) వంటి

BRAOU

నమూనాలు ప్రతి పాదించబడ్డాయి. రాగ్నర్ నర్క్సే (Nurkse) సమతుల్యత వృద్ధి (Balanced Growth) దృక్పథాన్ని బలపర్చాడు. నర్క్సే మార్కెట్ పరిమాణాన్ని పరిధిని విస్తృత పర్చటం, పెట్టుబడి పలు రంగాలకు విస్తరింపచేయడంపై ప్రాధాన్యతను కనపర్చడం. అయినప్పటికీ నర్క్సే పొదుపును ప్రోత్సహించడంపై అత్యధిక ప్రాధాన్యతను కనపర్చాడు. కాగా లూయిస్ అభివృద్ధి చెందుతున్న దేశాలలో కార్మికుల సరఫరా, ఆర్థిక వ్యవస్థ పరిమాణం మధ్య సంబంధాలపై దృష్టిని కేంద్రీకరించాడు. లూయిస్ మూలధన సంచయనం, పారిశ్రామిక అభివృద్ధి పెట్టుబడిదారుల పొదుపు చేసే సామర్థ్యాన్ని పొదుపు చేసిన మొత్తాన్ని పరిశ్రమలలో పెట్టుబడిగా పెట్టగల వారి స్తోమత ప్రాధాన్యత వహిస్తాయని విశ్వసించాడు. ఏ దేశమైన తన జాతీయ ఆదాయంనుంచి అధిక మొత్తాలను పొదుపు చేయగలిగితేనే పారిశ్రామిక, విప్లవాన్ని దాని ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించగలవని లూయిస్ బలంగా విశ్వసించాడు. ఈ విధంగా హారడ్, డోమర్‌లు ప్రతిపాదించిన, లూయిస్, రాగ్నర్ నర్క్సేలు అభివృద్ధి పర్చిన వృద్ధి నమూనాలు ఆర్థికాభివృద్ధిలో పొదుపు పాత్రపై దృష్టిని కేంద్రీకరించారు.

కాగా ఆర్థికాభివృద్ధిపై నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తొలి పాశ్చాత్య ఆర్థిక శాస్త్రవేత్త గున్నర్ మిర్డల్. మిర్డాల్ ధనిక పేద దేశాలమధ్య, సమాజంలోని ధనిక, పేద వర్గాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రాధాన్యతను గుర్తించాడు. మిర్డాల్ ఆర్థికాభివృద్ధిపై పేదరిక విషవలయం ప్రభావాన్ని గురించి వివరించాడు. మిర్డాల్ సంచిత కారణీకరణ సంబంధాలు (Cumulative causation) అనే ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ఆర్థిక వ్యవస్థలోని ఒక రంగం సాధించిన విజయం లేదా పొందిన వైఫల్యాల ప్రభావం మిగిలిన రంగాలపై ప్రగాఢంగా ప్రసరిస్తుందని పేర్కొంది. ఈ విధంగా మిర్డాల్ సిద్ధాంతం సంచిత కార్యాకరణ సంబంధాల సిద్ధాంతంలో ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల పరస్పర సంబంధాలు ఆశ్రయతలపై ప్రాధాన్యతను వక్కాణించాడు.

ఈ విధంగా సాంప్రదాయ, నవ్య సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తలు ఆర్థికాభివృద్ధిలో కీలక అర్థికాంశాలపైన పెట్టుబడి, పొదుపు, జనాభా, మార్కెట్, ఉపాధికల్పన, కార్మికుల శక్తిపై పెక్కు సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. అయితే కేవలం ఈ అంశాల విశ్లేషణ మాత్రమే అభివృద్ధి సమగ్ర అవగాహనకు తోడ్పడకపోవడం చేత ఆర్థిక శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు అభివృద్ధి ఆర్థికేతర అంశాలపై తమ దృష్టిని సారించి వాటిపై అనేక భావనలు, సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

BRAOU

## 7.3 అభివృద్ధి - సామాజిక అంశాలు

సామాజిక శాస్త్రవేత్తలలో సామాజిక, సాంస్కృతిక కారకాలు ఆర్థికాభివృద్ధిని నిర్దేశిస్తాయని వాదించేవారికి, ఆర్థికాభివృద్ధి సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలను తీర్చిదిద్దుతుందని వాదించేవారి మధ్య ఒక ప్రధాన వ్యత్యాసముంది. మనస్తత్వ శాస్త్రవేత్తలు, సమాజ శాస్త్రవేత్తలు, మానవీయ శాస్త్రవేత్తలు అభివృద్ధి ప్రక్రియలో ఆర్థిక కారకాలకంటే సామాజిక, సాంస్కృతిక కారకాలే ప్రాధాన్యత వహిస్తాయని వాదించటంలో ఔచిత్యం వుంది. అయితే హేజన్ అనే ఆర్థిక శాస్త్రవేత్త ఆర్థికాభివృద్ధి సాధనకు సాంస్కృతిక మార్పు కీలకమని వాదించటం కొంత ఆశ్చర్యం కలిగించక మానదు. ఏమైనప్పటికీ ఆర్థిక శాస్త్రవేత్తలందరూ అభివృద్ధి ప్రక్రియలో సాంస్కృతిక అంశాలను విస్మరించారని చెప్పడం సరికాదు. రాస్టోవ్‌లు ఆర్థికాభివృద్ధి ప్రక్రియ వ్యక్తుల ప్రవర్తనలోని భిన్నత్వాలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వివరించేందుకు ప్రయత్నించాడు. రాస్టోవ్ వ్యక్తులలోగల అనేక మానసిక పోకడలను (Propernsities) గురించి వివరించాడు. వాటిలో విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి పరచడం, విజ్ఞానశాస్త్రాన్ని దైనందిక కార్యకలాపాలకు, పిల్లల పెంపకానికి భౌతిక పరిస్థితుల అభివృద్ధికి వర్తింపచేయడం మొదలైనవి కీలకమైనవి. ఈ పోకడలను ఆర్థిక శాస్త్ర సామాజిక శాస్త్రాలకు చెందిన

శాస్త్రవేత్తలు అధ్యయనం చేసే పరిస్థితిలో వుండగా, ఆర్థికశాస్త్రవేత్తలు పెట్టుబడి కల్పన విదేశీ వ్యాపారం మొదలైన అంశాలను అధ్యయనం చేయడంపై ఆసక్తిని ప్రదర్శించారు.

కాగా ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే సామాజిక, సాంస్కృతిక కారకాలలో సామాజిక శాస్త్రవేత్తలు దృష్టిని కేంద్రీకరించిన అంశాలలో వ్యక్తి, సమాజం సంబంధాలు, వర్గం, జాతి, మతం, పట్టణ గ్రామీణప్రాంతాలలో భిన్నత్వం, జాతీయ స్వభావం, సాంస్కృతిక వ్యవస్థ ప్రభావం ప్రధానమైనది.

## 7.3.1 కుటుంబం

సామాజిక, మానవీయ శాస్త్రవేత్తలు కుటుంబాలను పితృస్వామిక, మాతృస్వామిక కుటుంబాలుగా విభజించారు. ఈ కుటంబాలమధ్య అనేక విషయాలలో భిన్నత్వం వుంది. ఉమ్మడి ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేయడంలో కూడా ఈ వివిధ రకాల కుటుంబాలమధ్య భిన్నత్వం వుంది. ఉదాహరణకు ఉమ్మడికుటుంబ వ్యవస్థ అభివృద్ధికి దోహదంపడే అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. చలనం (Mobility) పొదుపు, చొరవ, పనిచేయాలనే అభిలాష మొదలైన అంశాలను ఉమ్మడి కుటుంబ వ్యవస్థల ప్రభావితం చేస్తుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కష్టించి పనిచేసేందుకు తగిన ప్రేరణ వుండదు. ఎందుచేతనంటే కష్టించి పనిచేయడం వల్ల లభించే ఫలితంలో వ్యక్తులకు లభించే వాటా పరిమితం. ఇదే విధంగా ఈ కుటంబ సభ్యులలో పొదుపు చేసే తత్వం అలవడదు. ఎందుచేతనంటే వృద్ధాప్యం, రోగగ్రస్తతవంటి అత్యవసర పరిస్థితులలో సభ్యులను మొత్తం కుటుంబం ఆదుకుంటుంది. ఇదే విధంగా ఈ కుటంబ వ్యవస్థలో ప్రాంత, వృత్తిపరమైన చలనం పరిమితంగా వుంటుంది.

ఈ విధంగా కుటుంబం ఆర్థికాభివృద్ధిని అనేక మార్గాలలో ప్రభావితం చేస్తుంది. పైన వివరించిన అంశాలతోపాటు వారసత్వ (Inheritence) విధానం ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ఈ విధానంవల్ల భూమి చిన్న చిన్న ఖండాలుగా విభజింపబడి తన ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతుంది. కాగా కుటుంబములో స్త్రీకి కల్పించే పాత్ర ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. స్త్రీకి కల్పించే పాత్ర జనాభా పెరుగుదల రేటు మొత్తం జనాభాలో పనిచేసేవారి వంతు, కార్మిక శక్తిలో పొదుపు మొదలైన ఆర్థిక అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది.

## 7.3.2 వర్గ నిర్మాణం

ఆర్థిక వ్యవస్థ వర్గాలుగా విభజింపబడిన సమాజంలో కంటే, బహిరంగ (Open) వర్గ వ్యవస్థగల సమాజంలో వేగంగా అభివృద్ధి చెందుతుంది. కాగా మధ్య తరగతి బలంగా వున్న సమాజంలోని ఆర్థికాభివృద్ధి వేగంగా సాధించబడుతుంది. సమాజంలోని వివిధ వర్గాల మధ్య అంతరం అధికంగా ఉన్న సమాజంలో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి సాధించడం సులభసాధ్యం కాదు ఎందుచేతనంటే ఈ సమాజాలలో వర్గాలమధ్య సంఘర్షణ అనివార్యం కావడం చేత పాలక వర్గం తన ప్రయోజనాల రక్షణకు అధిక ప్రాధాన్యతను కనపర్చి మొత్తం సమాజం అవసరాలను నిర్లక్ష్యం చేస్తుందని కాగా వర్గ సంఘర్షణవల్ల సంభవించే అందోళనలు, హింసాత్మక చర్యలు అభివృద్ధిని ఆటంక పరుస్తాయి.

BRAOU

## 7.3.3 జాతిసంబంధాలు

ఆర్థికాభివృద్ధికి సంబంధంవున్న ఆర్థికేతర అంశాలలో జాతి (Race) ఒకటి. కొన్ని జాతులు ఇతర జాతులకంటే ఆర్థికంగా ఎక్కువ ఆధిక్యతను కలిగి వున్నాయి. ఉదాహరణకు శ్వేతజాతి ప్రజలు ఇతర జాతులకన్నా ఎక్కువ ఆర్థికాభివృద్ధిని సాధించినట్లు పేర్కొనబడింది. ఆధునిక మానవీయ శాస్త్రవేత్తలు జాతులలోని భౌతిక వ్యత్యాసాలను వెల్లడించేందుకు ప్రయత్నించారు. వీరి అభిప్రాయాల ప్రకారం జాతి సంబంధాలు అభివృద్ధి సాధించాలనే ప్రజల తపనను ప్రభావితం చేస్తాయి. కాగా జాతి అనే పదం అతి విచక్షణారహితంగా వాడబడుతున్నది. అందుచేత జాతిని సంస్కృతి నుంచి వేరు పరచడం సులభం కాదు. గతంలో మత సామాజిక, సాంస్కృతిక ధోరణులు కొన్ని అత్యవసర వృత్తులను నిషేధించాయి. కాగా కొన్ని సందర్భాలు కొన్ని జాతులను ఇతర జాతులకు బానిసలుగా మార్చివేసాయి. కాగా వడ్డీ వ్యాపారం చేపట్టకుండా కొన్ని జాతులపై నిషేధం ఉండడం చేత ఇతర జాతులు ఈ వ్యాపారాన్ని చేపట్టగలిగాయి. ఉదాహరణకు క్రైస్తవమతం దోపిడీని నిషేధించడం వల్ల యూదు వ్యాపారులు వడ్డీ వ్యాపారాన్ని స్వీకరించారు. ముస్లింల పై ఇదే విధమైన నిషేధం వల్ల పాకిస్తాన్‌లో వడ్డీ వ్యాపారాన్ని, హిందువులు చేపట్టారు. ఇదే కారణం చేత టర్కీలో వడ్డీ వ్యాపారం అమెరికన్లు, యూదులు, గ్రీకులు నిర్వహిస్తున్నారు.

## 7.3.4 మతం

ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే అంశాలలో మరో ప్రధానమైన అంశం మతం. మార్క్స్ వెబర్, టోని (Tony) లు ఆర్థిక ప్రగతికి ప్రొటెస్టెంట్ పునర్వికాసం (Reformation) మధ్య సంబంధాలను విశ్లేషించారు. ఎరిక్‌ఫ్రామ్ (Erich Fromm) మతాలను స్త్రీలింగ (Feminist) మతం పులింగ (Masculine) మతాలని రెండు రకాలుగా విభజించారు. పులింగ మతానికి ప్రొటెస్టెంట్ మతం ఒక ఉదాహరణ కాగా క్యాథలిక్ మతం స్త్రీలింగ మతానికి ఉదాహరణ. పులింగ మతాలు పని ద్వారా ముక్తిని సాధించాలని ఉద్భోదించింది. ముక్తిసాధనకు ధన సంపాదన ప్రధాన మార్గమని ఈ మతాలు విశ్వసించాయి. దీనికి భిన్నంగా స్త్రీలింగ మతాలు ఉన్న దానితో సంతృప్తిని పొందడం ద్వారా ముక్తిని పొందవచ్చునని ఉద్భోదించాయి.

BRAOU

వెబర్ ప్రతిపాదించిన ప్రొటెస్టెంటు నీతిని లేదా ఆర్థికాభివృద్ధిని మతం నిర్ధారిస్తుందనే అతని సాధారణీకరణను అంగీకరించడం సాధ్యం కాదు. కేథలిక్ మతం బలంగా వున్న అనేక దేశాలు వాణిజ్య, పారిశ్రామిక పరంగా అభివృద్ధి చెందాయి. కాగా మతం వ్యక్తులందరిలో ఒకే విధమైన మూర్తి మత్వాన్ని పెంపొందింప చేస్తుందని లేదా మత పరమైన భావాలు మార్పు చెందవనే వెబర్ ఊహలను రుజువుచేసే సాక్ష్యాధారాలు లేవు. ఉదాహరణకు స్పెయిన్, ఐర్లాండ్, ఇటలీకి చెందిన క్యాథలిక్‌ల మధ్య విపరీతమైన భిన్నత్వముంది. ఇదే విధంగా దక్షిణ సహారాలోని ముస్లింలకు ఉత్తర ఆఫ్రికా దేశాలలోని మొరాకో, అల్జీరియా, ట్యూనిష్, ట్యూనిష్‌లకు చెందిన ముస్లింలకు మధ్య భిన్నత్వం ఉంది. కాగా రెండవ ప్రపంచానంతరకాలంలో యూరప్‌కు చెందిన రోమన్ క్యాథలిక్ మతస్తులు శాస్త్రీయంగా అభివృద్ధి చెందారు.

## 7.3.5 గ్రామీణ పట్టణ ప్రాంతాల వ్యాత్యాసం

రాబర్ట్ రెడ్ ఫీల్డ్ ప్రతి దేశంలో గ్రామీణ ప్రాంతాలు, నగర ప్రాంతాల మధ్య సంబంధాలలో విపరీతమైన మార్పులు సంభవిస్తున్నాయనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. గ్రామీణ ప్రాంతాల వంటరితనం, ప్రకృతి చేసే డిమాండ్లు, సామాజిక జీవితాన్ని, విలువలను స్థిరపరచడమే కాక వాటి దృఢత్వాన్ని చేకూర్చాయి. దానికి భిన్నంగా నగర

ప్రాంతాలలో వ్యక్తులు, వ్యక్తులు తయారుచేసే వస్తువుల మధ్య సంబంధాలు వుంటాయి. ఇది వ్యక్తి పరిసరాల మధ్య సంబంధాలలో హేతుబద్ధత, సార్వత్రికత, ప్రత్యేకతలను పెంపొందింపజేస్తుంది. ఐతే దానివల్ల కుటుంబం, వర్గం, జాతి, మత సంబంధమైన అలవాట్లు, అడ్డంకులు నిషేధాలు విచ్ఛిన్నం కావడం, సామాజిక జీవితానికి చలనం పెంపొందించడం సంభవిస్తుంది.

## 7.3.6 సాంప్రదాయాలు

అభివృద్ధిపై సాంప్రదాయాల (Tradition) పాత్రవుందని అందరూ గుర్తించిన అంశం. అయితే అన్ని సమాజాలకు చెందిన సాంప్రదాయాలు అభివృద్ధిపై ఒకే విధమైన ప్రభావాన్ని కనపరుస్తాయన్న అంశంపై సామాజిక శాస్త్రవేత్తలలో ఏకాభిప్రాయం లేదు. అభివృద్ధిపై సాంప్రదాయాల ప్రభావంపై కల విశ్లేషణలో వెబర్ విశ్లేషణ కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది. వెబర్ సాంప్రదాయాలను ఒక ప్రవర్తనా విధానంగా గుర్తించాడు. వెబర్ సాంప్రదాయ, హేతుబద్ధమైన (Rational) సామాజిక చర్యల మధ్య విభజన చేసాడు. వెబర్ సాంప్రదాయ సామాజిక చర్యను దైనందిక కార్యకలాపాలకు అలవాటు పడ్డ దినచర్యలను ఉల్లంఘించలేదు ప్రవర్తనా నియమంగా భావించే వ్యక్తులలోని మానసిక దృక్పథం అని నిర్వచించాడు. వెబర్ నిర్వచనంలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి అలవాటు పడిన ప్రవర్తన రెండు యాంత్రికంగా నిర్వహించే సామాజిక చర్యను ఒక ప్రవర్తనా నియమంగా భావించడం. వెబర్ అభిప్రాయం ప్రకారం సాంప్రదాయబద్ధమైన సామాజిక చర్య పవిత్రమైన గతం అవశేషాలుగల సమాజంలో లేదా రాజకీయ మత సాంప్రదాయాల పునరుద్దరింపబడిన సమాజాలలో మాత్రమే అభివృద్ధి చెందుతుంది. దాన్నే ఇంకో విధంగా చెప్పాలంటే సాంప్రదాయచర్య సుధీర్ఘ చరిత్రక వారసత్వమున్న దేశాలలోనే సంభవిస్తుంది. ఉత్కృష్టమైన సాంప్రదాయాలు ఉన్న సమాజాలు మాత్రమే అభివృద్ధి చెందాయి.

BRAOU

అభివృద్ధిపై సాంప్రదాయాల ప్రభావాన్ని వివరించేందుకు సామాజిక శాస్త్రవేత్తలు మూడు సిద్ధాంతాలను ప్రతిపాదించారు. 1. ప్రాపంచిక దృక్పథం (World View) 2. పరిమిత శ్రేయస్సు (Limited good) 3. జ్ఞానసంబంధమైన (Cognative) ధృక్పథం. ఈ విశ్వం పట్ల ప్రపంచం అనుసరించే వివిధ మార్గాలపట్ల, ఈ విశ్వంలో అతని స్థానం పట్ల ఒక వ్యక్తికి కల దృక్పథాన్నే ప్రాపంచిక ధృక్పథం అనవచ్చు. వ్యక్తి ప్రాపంచిక దృక్పథంలో అనేక మతతాత్విక పరమైన విశ్వాసాలు ఇమిడి ఉంటాయి.

కాగా సామాన్య ప్రజలు ఈ ప్రపంచంలో భూమి, సంపద, అధికారం మొదలైనవి అనంత పరిమాణంలో వున్నప్పటికీ వాటికి కొరత అయిన వస్తువులుగా భావించి తదనుగుణంగా ప్రవర్తించటమే పరిమిత శ్రేయస్సుకు అర్థం. చివరగా జ్ఞాన సంబంధమైన దృక్పథం వ్యక్తులలో ప్రవర్తనను లోకజ్ఞతను అదేశించే, ప్రశ్నించేందుకు వీలులేని ఊహలను పెంపొందింపజేస్తుంది. ఈ విధంగా అభివృద్ధిపై సాంప్రదాయాల ప్రభావం అవగాహనకు సామాజిక శాస్త్రవేత్తలు మూడు సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

సాంప్రదాయ తత్వం ఆధునీకీకరణ, అభివృద్ధి, నవకల్పన (Innovation) లకు వ్యతిరేకం అనే వాదనను కొందరు సామాజిక శాస్త్రవేత్తలు తిరస్కరించారు. సాంప్రదాయ సమాజాలకు అభివృద్ధి సాధించే స్తోమత లేదనే ఊహను ఈ రచయితలు ఖండించారు. అతి సాధారణమైన ఈ ఊహనలు, సాంప్రదాయాలు, అభివృద్ధి, ఆధునీకరణల మధ్య సంబంధాలను మితిమీరి సిద్ధాంతీకరించడం వలన కలిగిన ఫలితమని పేర్కొనబడింది. రొడాల్ఫ్ వాదించినట్లు

సాంప్రదాయ సమాజాలలో సాంప్రదాయాన్ని తప్పుగా భావించడం వల్ల, ఆధునిక సమాజంలో ఆధునీకరణను తప్పుగా అవగాహన చేసుకోవటం వలన సాంప్రదాయాలు, అభివృద్ధి పూర్తిగా విరుద్ధమైన భావనలుగా చిత్రీకరించబడ్డాయి.

ఈ విధంగా సాంప్రదాయ తత్వం అభివృద్ధి పరస్పర విరుద్ధమైనవి కాగాపోగా అభివృద్ధి సాధించాలనే తపన సాంప్రదాయతత్వం ఆధారం. ఉదాహరణకు జపాన్‌లో సాంప్రదాయ విలువలు, సంస్థలు అభివృద్ధి సాధనకు అపారమైన నిపుణత్వాన్ని అందించాయి. జపాన్‌లో కుటుంబ వ్యవస్థ వ్యక్తులలో సాధన ప్రేరణను (Need achievement) పెంపొదింప చేసే అతి శక్తి వంతమైన ఆధారంగా పనిచేస్తున్నదని పేర్కొన్నారు. జపాన్‌లోని సాంప్రదాయ సామాజిక సంబంధాలు ఆధునీకీకరణను, అభివృద్ధిని సాధించటంలో కీలక పాత్ర వహించినట్లు కూడా వాదించబడింది. ఇదే విధంగా భారతదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, తదితర సాంప్రదాయాలు ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడుతున్నాయో హోస్ట్‌లిట్జ్, బౌర్ని, ఫోస్టర్ మొదలైన సామాజిక శాస్త్రవేత్తలు నిరూపించారు.

## 7.4 భారతదేశంలో అభివృద్ధి పై సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రభావం

మార్క్స్ వెబర్ ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే కొన్ని సాంస్కృతిక అంశాలను గురించి వివరించాడు. పాశ్చాత్య దేశాలలో క్రైస్తవమతం వ్యాఖ్యానం వల్ల వ్యక్తుల దృక్పథాలు ప్రేరణలో కలిగిన మార్పులు ధనార్జనకు పవిత్రతను చేకూర్చడం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిందని వెబర్ సిద్ధాంతీకరించాడు. వెబర్ హిందూమతం పై తన వ్యాఖ్యానంలో అనేక లోపాలు వున్నవని గుర్తించినప్పటికీ అది అహేతుకమైందని కర్మ సిద్ధాంతం పెంపొందించిన భయంకరమైన, నిరాశావాదంలోకి వెళ్లాలనుకుందని వాదించాడు. హిందూమతం పాశ్చాత్యదేశాలలో కీలక పాత్ర వహించిన ప్రొటెస్టెంట్ నీతి (Protestant ethic) లోపించిందని వెబర్ వాదించాడు. దానివల్ల భారతదేశంలో ఆర్థిక రంగంలో వైఫల్యం అనివార్యమయిందనీ వెబర్ ప్రతిపాదించాడు. హిందూమతంపై వెబర్ సిద్ధాంతీకరణ అనేక విమర్శలకు గురైనప్పటికీ ఈ సిద్ధాంతీకరణ భారతదేశంలో మౌలికమైన మతం, సాంస్కృతిక విలువలను గుర్తించడంలో, ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో వాటి పాత్రను వివరించడంలో అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలకు ప్రేరణను కల్పించింది. ఈ విధమైన ప్రయత్నాలు వివాదాస్పదమైనవి అయినప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి ప్రక్రియను వివరించడంలో తోడ్పడే దృక్పథాన్ని ప్రతిపాదించాయి. వాస్తవానికి ఆర్థికాభివృద్ధి అధ్యయనం ఒక ప్రత్యేక సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో అభివృద్ధి చెందే విలువలను, సంస్థలను, విశ్వాసాలను, ప్రవర్తనా పోకడలను నిర్లక్ష్యం చేయలేదు. సెగాల్ అనే రచయిత భారతదేశంలో పెరుగుతున్న ఆశల విప్లవం (revolution of raising expectations) స్థిరమైన ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందకపోవటానికి ప్రజలలో ఏ పరిస్థితినైన అంగీకరించే (Pervasive) దృక్పథం వ్యతిరేకతను మనస్తత్వం ప్రధాన కారణాలని వాదించాడు. భారతదేశంలో ఆర్థిక ప్రక్రియ పై ఆర్థికేతర అంశాల ప్రభావాన్ని వివరిస్తూ సోవని (Sovani) ప్రస్తుతం భారతదేశంలో నెలకొన్న నికృష్ట పరిస్థితులకు యధాస్థితి (Status quo) ని కొనసాగిస్తూండడంలో విపరీతమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్న హిందూసంస్కృతి, మూర్తిమత్వం ప్రధాన కారణాలని వాదించాడు. దాని ఫలితంగా హిందూ సమాజంలో సామాజిక మార్పు సంభవించగలదని ఊహించడం అవివేకమే అవుతుంది. మౌళిక హిందూ విలువలను, స్వభావాన్ని వివరిస్తూ వికాస్ మిశ్రా ఆధునిక కాలంలో హిందూమతం అంతర్భాగాలైన దృక్పథాలు, సంస్థలు ఆర్థికాభివృద్ధికి అవరోధాలైనట్లు విమర్శించాడు.

కాప్ (Kapp) భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి చేపట్టిన ప్రణాళికీకరణ ప్రక్రియలో హిందూ సంస్కృతి మూర్తిమత్వం పాత్రను సమగ్రంగా వివరించే ప్రయత్నం చేసాడు. భారతదేశంలో అందుబాటులో ఉన్న వనరులను హేతుబద్ధంగా వినియోగించకుండా మత, సాంస్కృతిక సంస్థలు అవరోధం కలిగిస్తున్నాయనీ కాప్ పేర్కొన్నాడు. ఈ

BRAOU

దేశంలో ఆర్థికాభివృద్ధి మందకొడిగా సంభవించటానికి ఈ పరిస్థితి ప్రధాన కారణమని కాప్ వివరించాడు. మాక్స్ వెబర్ విశ్లేషణను అనుసరిస్తూ కాప్ హిందుమతంలోని మౌలిక విలువలైన మాయ, కర్మ, సన్యాస (Sanyasa) సామాజిక వ్యవస్థలైన కులం, ఉమ్మడి కుటుంబం ఆర్థికాభివృద్ధికి ప్రధాన అవరోధాలని వాదించాడు. కాప్ హిందూ సంస్కృతి, సామాజిక వ్యవస్థలు భారతదేశంలో అభివృద్ధి అతి మందకొడిగా సంభవించేందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నాడు. దేశంలో ఆర్థికాభివృద్ధిని నిరోధిస్తున్నది పెట్టుబడి, నైపుణ్యం కల మానవ శక్తి కొరత కాదని, అలౌకిక సాంప్రదాయ వ్యవస్థలైన కుల వ్యవస్థ తక్కువ స్థాయి ఆశలు, నైతిక ఒంటరితనం (Moral aloofness) మత తత్వంలు ప్రధాన కారణాలని కాప్ వాదించాడు. కాప్ భారతదేశంలో ఆర్థికాభివృద్ధి సమస్యను పరిష్కరించేందుకు ఈ దేశ సామాజిక వ్యవస్థను, వ్యక్తిగత ఆశల స్థాయిని క్రమబద్ధంగా మార్పు చేయడం ఒకటి మార్గమని వాదించాడు.

భారతదేశంలో కర్మవాదం, హిందూమతం, వేదాంతములోనే కాక దేశ భౌతిక, వాతావరణ పరిస్థితులలో కూడా వేళ్ళూనుకున్నాయి. కార్ల్ జంగ్ భారతదేశంలో విస్తృతంగా వున్న పర్వతాలు వ్యక్తుల మనస్తత్వ పరిధిని పరిమితం చేసాయని సూచించాడు. కాగా భాష్యం భారత ఉపఖండములో విశిష్టత్వం కల ప్రకృతి, భౌగోళిక దృగ్గోచరాలు భారతీయ ప్రజల మనోభావాలను తీర్చిదిద్దాయని పేర్కొన్నాడు.

భారతదేశంలో ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేసే అనేక ఇతర విలువలు వున్నాయి. హిందూమతంలో కీలక అంశమయిన మోక్షం (Salvation) హిందువుల అంతిమ లక్ష్యం. ఆత్మ పరమాత్మలో లీనమవడమే మోక్షం. అంటే ప్రాపంచిక విషయలాలసత్వం నుంచి విముక్తి పొందడం మోక్ష సాధనకు ప్రధాన మార్గం. ఈ విధంగా అలౌకిక దృక్పథం భౌతిక ప్రపంచంతో సంబంధాలను తెగతెంపులు చేసుకోవడం భారతీయులలో ఆర్థిక లక్ష్యాలపట్ల వైముఖ్యతను పెంపొందింపచేసాయి.

హిందువుల దృష్టిలో నాలుగు పురుషార్థాలయిన అర్థ, కామ, ధర్మ, మోక్షాలలో అర్థానికి, కామానికి, మిగిలిన రెండు విలువలకన్నా అతి తక్కువ ప్రాముఖ్యత వుంది. ఈ రెండు విలువలను హిందువులు కేవలం మిధ్యగా మాత్రమే పరిగణిస్తారు. కాప్ హిందువుల జీవన పరిస్థితిలో పరిష్కరించలేని ద్వదీభావం (Dualism) దాని ఫలితంగా భారతీయ సంస్కృతిలో పరస్పర విరుద్ధమైన విలువలు, ప్రవర్తన పద్ధతులు కలిసికట్టుగా వున్న వైరుధ్యపూరితమైన పరిస్థితి ఏర్పడిందని కాప్ పేర్కొన్నాడు. ద్వైదీ భావం సందిగ్ధభావాలకు, పరస్పర విరుద్ధమైన ప్రయత్నాలకు తావిచ్చి వ్యక్తుల ప్రేరణలను బలహీన పరిచింది. దానితోపాటు భగవద్గీత అన్ని దుఃఖాలకు ఆశా మూలం. అందుచేత దానిని నిర్మూలించాలనే ఉద్బోధ, ఫలాపేక్ష రహితంగా వ్యక్తులు తమ విధులను నిర్వర్తించాలనే మరో సూక్తి ఉద్రిక్తలకు ఉద్వేగాలను నిరోధించినప్పటికి అవి వ్యక్తులు ప్రణాళిక భద్దంగా తమ కర్తవ్యాలను నిర్వహించడంలో ఆశక్తిని నశింపజేశాయి. వీటితో పాటు భారతీయులలో పాతుకుపోయిన మిధ్యావాదం, ప్రపంచ అశ్వాశ్వతమనే భావం వారి ప్రేరణను మరింత బలహీన పరుస్తున్నాయి. ఏమైనప్పటికి ఫలితం పట్ల అనాసక్తత, వైరాగ్యపూరిత ధోరణిని, కర్మ సిద్ధాంతంపై ప్రభలమైన విశ్వాసం హిందువులలో జడత్వాన్ని, స్తబ్ధతలను పెంపొందింపజేసాయి. టేలర్ తక్కువ స్థాయి కోర్కెలు, నిస్తేజం నిర్లిప్తతలు సాధారణ హిందువులు మూర్తిమత్వం ప్రధాన లక్షణాలని వాదించాడు. కుసుమ్ నాయర్ తన పరిశోధన ద్వారా భారతీయ రైతులలో తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలనే తపన ఏ మాత్రం లేనట్లు నివేదించింది. అంతేగాక భారతీయ రైతులు నిరాశాపూరిత మనస్తత్వానికి ప్రతీకలని కుసుమ్ నాయర్ పేర్కొంది. సిన్హా నిర్వహించిన పరిశోధనలు కూడా ఇదే ఫలితాలను వెల్లడించాయి. సిన్హా తన పరిశోధనలలో తమ ఆర్థికాభివృద్ధి ఏ స్థాయిలో ఉన్నప్పటికీ భారతీయ రైతులలో నిరాశ, అశక్తత, చొరవ మితిమీరిన జాగ్రత్త, పలాయనతత్వం, మొదలైన లక్షణాలు పేరుకున్నాయని వెల్లడించాడు. ఈ విధమైన మనస్తత్వం అభివృద్ధిని సాధించాలనే తపనను

BRAOU

భారతీయ రైతులలో పెంపొందింపచేయలేదని సిన్హా వాదించాడు. పరిమితమైన ఆశల స్థాయి కృషిహీనత, నిర్లిప్తత దేశంలో అభివృద్ధి పథకాలకు స్వయం పోషకత్వం లోపించడానికి ప్రధాన కారణాలని సిన్హా పేర్కొన్నాడు.

భారతదేశంలో ఆర్థికాభివృద్ధిపై మత, సాంస్కృతిక విలువల వ్యతిరేక ప్రభావాన్ని కలిగి వున్నాయని అవి అభివృద్ధి, ఆధునీకీకరణలను నిరోధిస్తున్నాయనీ వాదనలను కొన్ని పరిశోధనలు తిరస్కరించాయి. ఉదాహరణకు సిన్హా తన అధ్యయనంలో భారతదేశంలో గ్రామీణులలో ఆశలు, చొరవ పరిమిత స్థాయిలో వుండడానికి ఈ ప్రాంతాలలో సాధించిన ఆర్థిక, వ్యవసాయాభివృద్ధికి ఎలాంటి సంబంధము లేదని వెల్లడించాడు. కాగా మానసిక పరమైన సమగ్రత లోపం ఉన్నతాధికారుల అపరిమితమైన నియంత్రణ వ్యక్తుల నిర్వర్తన, సంతృప్తులపైన కారాత్మక ప్రభావం కనపర్చినట్లు వెల్లడైంది.

## 7.5 ఆర్థికాభివృద్ధిపై కులం ప్రభావం

భారతదేశంలో ఆర్థికాభివృద్ధి ప్రభావం పై సామాజిక శాస్త్రవేత్తలు అనేక అధ్యయనాలు సాగించారు. సామాజిక శాస్త్రాల సాహిత్యంలో ఆర్థికాభివృద్ధికి కులం తీవ్రమైన అవరోధం అనే విశ్వాసం బలంగా వ్యక్తపరచబడింది. కులం ఆర్థికాభివృద్ధికి అవసరమైన వృత్తిపరమైన చలనాన్ని (Ocupational mobility) నిరోధిస్తుంది. ప్రజలు వృత్తిలో మార్పులు తమ సామాజిక, కుల పరమైన హోదాను భంగపరుస్తాయనే విశ్వాసం కలిగివుంటారు. సాధారణంగా ఉన్నత కులాలకు చెందిన వ్యక్తులు తక్కువ కులాలు నిర్వహించే వృత్తులను పద్ధతులను అవలంబించేందుకు ఇష్టపడరు కాగా ఆర్థిక కార్యకలాపాలలో ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించకుండా కులం నిరోధిస్తుంది. కులం ప్రతిపాదికపై రూపొందిన వృత్తి వ్యవస్థను అవలంభించడం ఉద్యోగాల మార్కెట్టులో డిమాండు, సరఫరాల మధ్య సంబంధాలను క్షీణింపచేసింది. ఉన్నత కులాలకు చెందిన వ్యక్తులలో నిరుద్యోగం తీవ్రంగా వుండడానికి వారికి ఉద్యోగ అవకాశాలు లభించకపోవడం వల్ల కాక అందుబాటులో వున్న క్రింది తరగతులకు చెందిన ఉద్యోగాలపట్ల వారిలో వున్న విముఖత ప్రధాన కారణమని చెప్పబడుచున్నది. దాని ఫలితంగా ఉన్నత కులాల వ్యక్తులు తమకు తగవని తిరస్కరించే అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉండటం వల్ల దేశంలో ఉత్పత్తికి నష్టం వాటిల్లడం జరిగిందని కొందరు సామాజిక శాస్త్రవేత్తలు వాదించారు.

BRAOU

కులతత్వం ఉన్నత కులాలకు చెందిన వ్యక్తులలో బూటకపు ఆధిక్యత భావాన్ని తక్కువ కులాల వ్యక్తులలో న్యూనత భావాన్ని పెంపొందింపజేయడం వలన నిమ్నకులాలకు చెందిన ప్రజలలో ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవం లోపించేందుకు కారణమైంది. దానితో పాటు వారిలో నైతికపరమైన వంటరితనం, విముఖత్వం, నిర్లిప్తత మొదలైన లక్షణాలు చోటుచేసుకున్నాయి. దాని ఫలితంగా ఉన్నత కులాల వ్యక్తులలో తక్కువ కులాల వ్యక్తుల పట్ల సానుభూతి, దయ మొదలైనవి నశించాయని పరిశోధకులు వెల్లడించారు.

భారతదేశంలో ఆర్థికాభివృద్ధి పై కులం ప్రభావంపై కల విశ్లేషణల్లో వెబర్ ప్రతిపాదించిన విశ్లేషణ విశిష్టమైనది. ఈ దేశంలో అభివృద్ధి ప్రక్రియలో కులంపాత్రను వెబర్ విశ్లేషించినంత నిఘూడంగా మరే ఇతర విదేశీ సామాజిక శాస్త్రవేత్త విశ్లేషించలేదు. వెబర్ కులం ఆర్థికాభివృద్ధికి బద్ధ వ్యతిరేకం అని విశ్వసించాడు. వెబర్ అభిప్రాయంలో స్వాభావికమైన కులం పూర్తిగా సాంప్రదాయ బద్ధమైనది, హేతుబద్ధరహితమైంది. కుల వ్యవస్థ కారణంగానే భారతదేశంలో ఆధునిక పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందలేదని, సాంకేతిక ఆర్థిక విప్లవం సంబంధించలేదని వెబర్

బలంగా వాదించాడు. దానికి భిన్నంగా ఖర్మ సిద్ధాంతంలో వేళ్ళూనుకున్న కులతత్వం వల్ల భారతదేశంలో సాంప్రదాయతత్వం అభివృద్ధి చెందినట్లు వెబర్ విశ్వసించాడు. వెబర్ ధోరణిలోనే మరో సమాజ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ షిల్స్ కులతత్వం వ్యక్తులమధ్య అడ్డుగోడలు నిర్మించి వారిమధ్య సాన్నిహిత్యాన్ని తగ్గించివేసిందని పేర్కొన్నాడు. కులం భారతీయుల మేధా శక్తిని సృజనాత్మకతను నిర్వీర్య పర్చిందని, ఉన్నత కులాలకు చెందిన వ్యక్తులలో తక్కువ కులాలకు చెందిన ప్రజాబాహుళ్యం పట్ల మానవత్వ ధోరణిని ప్రదర్శించకుండా నిరోధించదనీ షిల్స్ వాదించాడు. కుల వ్యవస్థవల్ల ఆర్థికాభివృద్ధికి అవశ్యకమైన పని విభజన సాధ్యపడుతుందనే వాదన ఉన్నప్పటికీ దానివల్ల సంభవిస్తున్న దుష్పరిమాణాలగురించి అనేక విమర్శలు చేయబడ్డాయి. ఇటీవలి కాలంలో నిర్వహించిన కొన్ని అధ్యయనాలలో కుల వ్యవస్థ ప్రభావం క్రమంగా క్షీణిస్తున్నట్లు వెల్లడైంది. ప్రధానంగా పట్టణ, నగర ప్రాంతాలలో కుల వ్యవస్థ ప్రభావం చాలా మట్టుకు అంతరించినట్లు తేలింది. ఉదాహరణకు 1960 దశాబ్దంలో మిల్టన్ సింగర్ మద్రాస్ నగరంలో బ్రాహ్మణ కులానికి చెందిన పారిశ్రామిక వేత్తలు విద్యావేత్తలపై నిర్వహించిన పరిశోధనలలో ఈ వ్యక్తులలో కులతత్వం గణనీయంగా సమసిపోయిందని, వారు ఇతర కులాల ప్రజలతో స్వేచ్ఛగా కలిసిమెలసి తిరగడం, భోజనాలు చేయడం మొదలైన వాటికి అలవాటుపడినట్లు వెల్లడి అయింది.

## 7.6 సారాంశం

ఈ పాఠంలో వివరించినట్లు అభివృద్ధి విస్తృతమైన, సంక్లిష్టమైన ప్రక్రియ. ఈ ప్రక్రియను ఆర్థిక అంశాలతో పాటు అనేక ఆర్థికేతర అంశాలు కూడా ప్రభావితం చేసాయి. అభివృద్ధిని ప్రభావం చేసే ఆర్థిక అంశాలలో జనాభా, పొదుపు రేటు, పెట్టుబడి, ఉపాధి కల్పన, కార్మికులు కీలకమైన ఆర్థికేతర అంశాలలో ఆచారాలు, జాతి, మతం, కుటుంబం, కులం, సాంప్రదాయాలు ప్రధానమైనవి. సాంప్రదాయ, సాంప్రదాయేతర ఆర్థిక శాస్త్రవేత్తలు అభివృద్ధి ప్రక్రియ ఆర్థికాంశాలపై పెక్కు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ, సమాజ మానవీయ, మనస్తత్వ శాస్త్రవేత్తల ఆర్థికేతర అంశాలపై పెక్కు సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఈ నమూనాలన్ని అభివృద్ధి వివిధ దృక్కోణాల సమగ్ర అవగాహనకు ఉపకరిస్తాయి. ఈ నమూనాలను వర్తించి భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధికి సంబంధించిన ఆర్థికేతర, ఆర్థిక అంశాలపట్ల చక్కని అవగాహనను ఏర్పరుచుకోవచ్చు.

BRAOU

## 7.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

### I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి

1. అభివృద్ధిపై ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావాన్ని వివరించండి ?
2. భారతదేశంలో ఆర్థికాభివృద్ధిపై సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రభావాన్ని చర్చించండి ?
3. అభివృద్ధిపై ఆర్థిక అంశాల ప్రభావాన్ని వివరించే సిద్ధాంతాలను పరిశీలించండి ?

### II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి

1. ఆర్థికాభివృద్ధిలో సామాజిక అంశాల పాత్రపై వెబర్ విశ్లేషణను వివరించండి ?
2. భారతదేశంలో ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో కులం పాత్రను విశ్లేషించండి ?
3. భారతదేశంలో అభివృద్ధి ప్రక్రియలో కులం పాత్రను విశ్లేషించిన వివిధ పరిశోధనల వివరాలను తెలపండి ?

## 7.8 చదువదగిన రచనలు


1. Bert F. Hoselitz : Sociological Aspects of Economic Growth, Amerind Publishing House, New Delhi, 1960.

2. W.A. Lewis : Theory of Economic Growth Allen & Urwin, London, 1955

3. Durganand Sinha Henry S.R. Rao (eds) : Social Values and Development, Sage Publications, New Delhi, 1988

4. Max Weber : The Religions of India : The Sociology of Hinduism and Budhism, Glencoe, Free Press, 1958.

5. Gunnar Myrdal : Asian Drama : An enquiry into the poverty of Nations, Penguin, New Delhi, 1968.

6. J.S. Uppal : Economic Development in South Asia, Tata Mc Graw Hill, New Delhi, 1977.

7. J.J. Spengler & R. Braibanti (eds) : Traditions, Values and Socio-Economic Development, Duke University Press, Durham 1961.

8. సి.వి. రాఘవులు, ఎమ్. బాపూజీ : ప్రగతి పాలన, తెలుగు అకాడమి, హైదరాబాదు - 19.


BRAOU

**రచయిత : ఎం. బాపూజీ.**

# భాగం - 8 : ప్రగతి వ్యూహాలు

## విషయక్రమం

8.0 లక్ష్యాలు
8.1 పరిచయం
8.2 భారతదేశగ్రామీణాభివృద్ధివ్యూహాలు

8.2.1 సాముదాయిక అభివృద్ధి వ్యూహం
8.2.2 సాంద్రవ్యవసాయాభివృద్ధి వ్యూహం
8.2.3 నిర్దేశిత లక్ష్య సమూహాల అభివృద్ధి వ్యూహం
8.2.4 ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి వ్యూహం
8.2.5 సమగ్ర గ్రామీణాభివృద్ధి వ్యూహం

8.3 సారాంశం
8.4 నమూనా పరిక్షా ప్రశ్నలు
8.5 చదువదగిన రచనలు

BRAOU

## 8.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులు,
* భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రవేశపెట్టిన వ్యూహాలు, వాటి ఫలితాలను చక్కగా అవగాహన చేసుకోగల్గుతారు.

## 8.1 పరిచయం

భారతదేశం ప్రధానంగా గ్రామీణ దేశం. దేశంలో దాదాపు 5.75 లక్షల గ్రామాలు ఉన్నాయి. దేశ జనాభాలో 80 శాతం గ్రామాలలో నివశిస్తున్నారు. దేశ సామాజిక ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో గ్రామాలు కీలక పాత్ర వహిస్తున్నాయి. అయినప్పటికి చాలాకాలంపాటు ఈ గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిననాటికి దేశంలోని గ్రామాల నికృష్టమైన , దుర్బలమైన పరిస్థితిలో ఉన్నాయి. పేదరికం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం కనీస సౌకర్యాల లేమి సమస్యలు గ్రామీణ ప్రాంతాలలో తాండవించాయి.

రాజ్యాంగం ఆదేశాల మేరకు దేశరాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్య, సంక్షేమ రాజ్యం, సామాజిక న్యాయం, సామ్యవాదము మొదలైన ఆదర్శాలకు కట్టుబడటంతో ప్రభుత్వం దేశంలోని గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి నడుంబిగించక తప్పలేదు. దేశాభివృద్ధికి గ్రామీణాభివృద్ధి పర్యాయ పదంగా రూపొందింది. రాజ్యం లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికా బద్ధమైన భిన్న వృద్ధి విధానంలో గ్రామీణాభివృద్ధి అత్యంత ప్రాధాన్యత కల్గిన రంగంగా రూపొందింది. దేశ సామాజిక ఆర్థికాభివృద్ధికి రూపొందించిన మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేక స్థానం కల్పించడం ద్వారా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి క్రమబద్ధమైన కృషిని ప్రారంభించింది.

గ్రామీణాభివృద్ధి సాధన కష్టభరితమైన, సంక్లిష్టమైన ప్రక్రియ. ఈ వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాలను రూపొందించి, అమలు పర్చడం ద్వారా గ్రామీణాభివృద్ధిని సాధించడం ఒక లక్ష్యంగా ఏర్పరచుకొంది. ఈ లక్ష్యం దేశాభివృద్ధి సాధనాలైన పంచవర్షప్రణాళికలలో ప్రతిబింబించింది. మొదటి పంచవర్షప్రణాళిక గ్రామీణాభివృద్ధికి సాముదాయిక అభివృద్ధి వ్యూహాన్ని (Community Development Project Strategy) ఏర్పరుచుకుంది. ఈ విధంగా గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక వ్యూహాలను చేపట్టే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే మొదటి పంచవర్షప్రణాళికలో చేపట్టిన వ్యూహం విఫలం కావటంతో ప్రభుత్వం తరువాత ప్రణాళికల్లో నూతన వ్యూహాలను అనుసరించక తప్పలేదు. ఈ విధంగా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సాధనకు వివిధ ప్రణాళికల్లో వివిధ వ్యూహాలను అనుసరిస్తూ వచ్చింది. ఈ వ్యూహాలే దేశంలో గ్రామీణాభివృద్ధి కృషికి మార్గదర్శకత్వం వహిస్తున్నాయి. అందుచేత భారతదేశంలో గ్రామీణాభివృద్ధి అవగాహనకు ఈ వివిధ వ్యూహాల పరిశీలన అవసరం.

## 8.2 భారతదేశ గ్రామీణాభివృద్ధి వ్యూహాలు

BRAOU

ప్రభుత్వం మొదటి పంచవర్షప్రణాళిక నుంచి ఆరవ పంచవర్షప్రణాళిక వరకు అనుసరించిన గ్రామీణాభివృద్ధి వ్యూహాలను ఈ క్రింది విధంగా విభజింపవచ్చును.

1. సాముదాయిక అభివృద్ధి వ్యూహం.
2. సాంద్ర వ్యవసాయాభివృద్ధి వ్యూహం.
3. నిర్దేశిత లక్ష్య నమూనా అభివృద్ధి వ్యూహం.
4. ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి వ్యూహం.
5. సమగ్ర గ్రామీణ అభివృద్ధి వ్యూహం.

పై వ్యూహాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 8.2.1 సాముదాయిక అభివృద్ధి వ్యూహం

స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే భారత ప్రభుత్వం నెహ్రూ నాయకత్వంలో గ్రామీణ అభివృద్ధికి చర్యలు చేపట్టింది. స్వాతంత్ర్యానికి ముందు కొన్ని రాష్ట్రాలలో అమలు పరిచిన గ్రామీణ అభివృద్ధి పథకాల అనుభవం ప్రాతిపదికపై సాముదాయక అభివృద్ధి ప్రాజెక్టు అనే ఒక నూతన పథకాన్ని రూపొందించి, అమలు పర్చారు. ఈ

పథకాన్ని అక్టోబర్ 2, 1952 న అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ప్రారంభించాడు. ఈ పథకం క్రింద దేశాలలోని వివిధ ప్రాంతాలలో 55 బ్లాకుల్లో సాముదాయిక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ప్రతి సాముదాయిక ప్రాజెక్టు పరిధిలో 300 గ్రామాలను, లేదా 3 లక్షల జనాభాను చేర్చారు. ప్రతి ప్రాజెక్టు అమలుకు మొదటి మూడు సంవత్సరాల కాలానికి రూ. 6.50 లక్షలకు కేటాయించారు.

1952 లో 55 బ్లాకుల్లో ప్రారంభమైన సాముదాయక అభివృద్ధి పథకం మొదటి ప్రణాళికాంతానికి (1956) 1114 బ్లాకుల్లో కల దాదాపు 1 లక్ష 63 వేల గ్రామాలకు విస్తరించింది. దాదాపు 11 మిలియన్ల ప్రజలు ఈ పథకం పరిధి క్రిందకు చేర్చబడ్డారు. కాగా 1960 నాటికి ఈ పథకం దేశంలోని మొత్తం అన్ని ప్రాంతాలకు విస్తరించబడింది.

సాముదాయిక అభివృద్ధి పథకం గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను మెరుగు పర్చేందుకు ఉద్దేశింపబడిన సమగ్ర పథకం. గ్రామీణప్రాంతాలలోని అన్ని రంగాల అభివృద్ధి ఈ పథకం ఏకైక లక్ష్యం. అందుచేత వ్యవసాయ రంగం, పశుపోషన, రోడ్లు, ఆరోగ్యం, విద్యా, గృహకల్పన, ఉపాధికల్పన మొదలైన రంగాలన్నీ ఈ పథకం పరిధిలోకి తీసుకుని రాబడ్డాయి. ఈ విధంగా సాముదాయికాభివృద్ధి పథకం బహుళరంగాల దృక్పథం కల్గిన సమగ్ర దృక్పథం అయినప్పటికి వాస్తవంలో ఈ పథకం వ్యవసాయ రంగం అభివృద్ధి పట్ల అత్యంత ప్రాధాన్యత కనపర్చింది.

సాముదాయిక అభివృద్ధి గతంలో అమలు పరిచిన గ్రామీణాభివృద్ధి పథకాలకన్న ఎంతో విశిష్టమైనది. ఈ పథకం కేవలం ఒక ప్రభుత్వ అభివృద్ధి పథకంగా మాత్రమే రూపొందింపబడలేదు. ఈ పథకం ప్రధానంగా నిరంతరం స్వయం సేవ (Self - help) ప్రజల భాగస్వామ్యం అనే ఉదాత్త సూత్రాలపై ఆధారపడిన ప్రజాఉద్యమమం ( People's Movement)గా తీర్చిదిద్దబడింది. ఈ పథకంలో ప్రజల భాగస్వామ్యం అనే అంశానికి కీలక స్థానం కల్పింపబడి, దానిని సాధించేందుకు అవసరమైన యంత్రాంగం సాధనాలు ఏర్పరచబడ్డాయి. కేవలం ఈ అంశం వల్లే గతంలో అమలుపరచబడిన గ్రామీణాభివృద్ధి పథకాలకు లేని విశిష్టత సాముదాయక అభివృద్ధి పథకానికి చేకూరింది.

కాగా సాముదాయిక అభివృద్ధి పథకం మరో విశిష్ట లక్షణ ఏమిటంటే ఈ పథకం అమలుకు పరిమిత విస్తీర్ణం కల ప్రాంతం ప్రధాన కేంద్రంగా పరిగణింపబడింది. ఈ కేంద్రానికి బ్లాకు (Block) అనే పేరుతో పిల్చారు. ప్రతి బ్లాక్ పరిధిలో 300 గ్రామాలను చేర్చారు. ఈ బ్లాక్‌కు ఒక బ్లాకు అభివృద్ధి అధికారి, వివిధ అంశాలలో నిపుణులైన కొందరు విస్తరణాధికారులు, గ్రామస్థాయి కార్యకర్తలతో కూడిన పాలనయంత్రాంగాన్ని సమకూర్చారు.

సాముదాయికాభివృద్ధి పథకం గ్రామీణప్రాంతాల సామాజిక, ఆర్థిక వికాసాన్ని సాధించేందుకు ప్రారంభించిన మొట్టమొదటి సంమగ్ర పథకంగా భావించబడినది. సాంప్రదాయ బద్ధమైన విశ్వాసాలు, దృక్పథాలు కల గ్రామీణ ప్రజలకు సాముదాయిక అభివృద్ధి పథకం నూతనత్వాన్ని ప్రసాదించే చర్య కాగా పాలన వ్యవస్థ పరంగా ఈ పథకం ఒక వినూత్న ప్రయోగంగా పరిగణించబడింది. ఈ పథకం దేశంలో మొట్ట మొదటి సేవాదృక్పథంతో రూపొందింపబడిన పథకం. ఈ పథకం ప్రభుత్వ పాలనాయంత్రాంగం తన గత అధికారయుతమైన (Authoritarian) దృక్పధాన్ని విసర్జించి, దాని స్థానంలో సేవాదృక్పధాన్ని అలవరుచుకోవలసిన అవసరాన్ని సృష్టించింది. ఈ విధంగా సాముదాయిక అభివృద్ధి పథకం దేశపాలన వ్యవస్థలో ఒక **విప్లవాత్మకమైన మార్పుకు దోహదం** చేసింది.

BRAOU

సాముదాయిక అభివృద్ధి పథకం అనేక విశిష్ట లక్షణాలు కలిగిన పథకంగా రూపొందించబడినప్పటికి, అది తన లక్ష్యాలను సాటించడంలో విఫలమైందని చెప్పక తప్పదు. ఈ కారణం వల్ల ఈ పథకం అనేక విమర్శలకు గురైంది. ఈ పథకం సాధించిన విజయాలు అతి స్వల్పం అని విమర్శింపబడింది. చివరకు, ఈ పథకం అధిక ప్రాధాన్యత కనపర్చిన వ్యవసాయ రంగంలో కూడా సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా లేవు. కాగా పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, కుటీర పరిశ్రమలు, రవాణాసౌకర్యాలు మొదలైన ఇతర రంగాలలో ఈ పథకం సాధించిన ఫలితాలు మరింత నిరాశను కలిగించాయని పేర్కొనబడింది. మరో విమర్శ ప్రకారం సాముదాయిక అభివృద్ధి పథకం ఆశించినంత మేరకు ప్రజలలో ప్రేరణ ఉత్సాహాలను కల్పించడంలో విఫలమైంది. అందువల్ల ఈ పథకం పట్ల ప్రజలు ఎలాంటి ఆసక్తిని కనపరచలేదు. ఈ పథకం ఆధునిక వ్యవసాయం పద్ధతులను ప్రవేశపెట్టినప్పటికి రైతులు ఈ నూతన పద్ధతులను అనుసరించడంలో ఆసక్తి కనపరచలేదు. దానికి ఈ పథకం రూపకల్పనలో అమలులో ఉన్న లోపాలే ప్రధాన కారణం అని పేర్కొనబడింది. కాగా ఈ పథకం పై చెలరేగిన మరో తీవ్ర విమర్శ ప్రకారం సమాజంలోని బలహీన వర్గాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏలాంటి ప్రత్యేక చర్యలు చేపట్టలేదు.

వ్యవస్థీకరణ పాలనా పరంగా సాముదాయిక అభివృద్ధి పథకంలో అనేక లోపాలు, లోటు పాటులు చోటుచేసుకున్నట్లు పరిశోధనలు వెల్లడించాయి. ఈ పథకం కఠినవంతమైన ( Rigid) పాలన పద్ధతులను అవలంబించటం అట్టడుగుస్థాయి ఉద్యోగులకు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు చేసే అధికారాన్ని కల్పించకపోవడంతో ఈ పథకం ఉద్యోగి స్వామ్యవాదానికి ( Bureancralism) ప్రతీకగా రూపొందించిందని భావించబడింది. దాని ఫలితంగా ఈ పథకం సాధారణ ప్రజలలోకి చొచ్చుకుని వెళ్ళడంలో విపలమైందని విమర్శకులు వాదించారు. ఈ పథకంలోని లోపాలను, పొందిన వైఫల్యాలను ప్రణాళికా సంఘం, ఇతర ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరిశోధకులనుంచి విపరీతమైన స్థాయిలో ప్రచారం లభించింది. 1957లో పథకాన్ని సమీక్షించిన బల్వంతరాయ్ మెహతా సంఘం అది పొందిన వైఫల్యాల కారణంగా దాన్ని రద్దు చేసి దాని స్థానంలో పంచాయితీ రాజ్ అనే మూడు అంచెల వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించింది. ఈ సూచన ఫలితంగా 1959 లో దేశంలోని అనేక రాష్ట్రాలలో పంచాయతీరాజ్ వ్యవస్థ అవతరించింది.

BRAOU

1952 లో ప్రభుత్వం సాముదాయిక అభివృద్ధి పథకంతో పాటు జాతీయ విస్తరణ సేవా పథకం ( National Extension Services) మరో సమానాంతర పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఈ పథకం, సాముదాయిక అభివృద్ధి పథకం లక్ష్యాలు సమానమే అయినప్పటికి జాతీయ విస్తరణా పథకం తక్కువ తీవ్రత (Intensity) కల పథకం. ఈ పథకాన్ని పరిమితమైన బ్లాకులో అమలుపరిచారు. క్రమంగా జాతీయ విస్తరణ సేవాపథకం, సాముదాయిక అభివృద్ధి పథకాల మధ్య గందరగోళం ఏర్పడటంతో జాతీయ విస్తరణ సేవాపథకాన్ని సాముదాయిక అభివృద్ధి పథకంతో విలీనం చేసారు.

## 8.2.2 సాంద్ర వ్యవసాయాభివృద్ధి వ్యూహం

దేశంలో నెలకొన్న ఆహారపదార్థాల కొరత నివారణకు వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పర్చేందుకు 1952 లో సాముదాయిక అభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ సేవా పథకాలను అమలు పర్చినప్పటికి, వ్యవసాయ ఉత్పత్తులు ఆశించిన పరిమాణంలో ఆశించినంత వేగంగా పెరగలేదు. ఇదే సందర్భంలో దేశంలో జనాభా వేగంగా పెరగడం ప్రారంభమైంది. దాంతో దేశంలో ఆహారధాన్యాల కొరత మరింత తీవ్రమైంది. ఫలితంగా దేశంలో ఆహారధాన్యాల

అధికోత్పత్తిని సాధించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రయత్నంలో భాగంగానే 1959 లో భారతప్రభుత్వం ఒక అమెరికా వ్యవసాయ నిపుణుల సంఘాన్ని నియమించింది. ఈ సంఘం రానున్న సంవత్సరంలో దేశంలో ఆహారపదార్థాల కొరత తీవ్రమయ్యే ప్రమాదాన్ని గుర్తించి, ఈ పరిస్థితి ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తన ఆహార విధానాలు (Food Policies) పథకాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని సూచించింది. ఈ సంఘం వ్యవసాయాభివృద్ధికి ఒక నూతన వ్యూహాన్ని సూచించింది. వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రాధాన్యతను కేంద్రీకరించటం ఈ వ్యూహంలోని కీలకాంశం. ప్రభుత్వం ఈ సంఘం చేసిన సూచనలను ఆమోదించి ఆసూచనల ప్రాతిపదికగా సాంద్ర జిల్లా వ్యవసాయ పథకం ( Intensive Agriculture District Programme ) ను అనే ఒక నూతన వ్యూహాన్ని ప్రవేశ పెట్టింది.

1960లో సాంద్ర జిల్లా వ్యవసాయ పథకం ప్రయోగాత్మకంగా ప్రతి రాష్ట్రంలోని ఒక జిల్లాలో అమలు పర్చబడింది. ఎంపిక చేసిన ప్రాంతాలలో వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించడం, ఇతర ప్రాంతాలలో అనుసరించేందుకు వీలైన నూతన వ్యవసాయ పద్ధతులను, నవకల్పనలు (Innovation) సూచించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. ఈ పథకం ఒక వైపు వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించడం ఎలాగో ప్రదర్శించే పథకంగా, మరో వైపు వ్యవసాయ రంగంలో అధికోత్పత్తి సాధనకు నూతనపద్ధతులు, భావాలు, నవకల్పనలను అభివృద్ధి పర్చే ప్రయోగాత్మక పథకంగా రూపకల్పన చేయబడింది.

1960లో ఈ పథకాన్ని మొదటిసారిగా అమలు పర్చేందుకు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడులలో ఒక్కొక్క జిల్లాను ఎంపిక చేసారు. ఈ జిల్లాల ఎంపికలో కొన్ని ప్రమాణాలను పాటించారు. క్రమంగా ఈ పథకాన్ని మిగిలిన రాష్ట్రాలకు విస్తరించారు. 1964లో ఈ పథకాన్ని సాంద్ర వ్యవసాయ ప్రాంతాల పథకంగా ( Intensive Agriculture Area Programme) గా మార్చి వివిధ రాష్ట్రాలలోని ఇతర జిల్లాలలో కూడా ప్రారంభించారు. ఈ నూతన వ్యవసాయాభివృద్ధి వ్యూహం ఆశించిన విధంగా విజయవంతం కాలేదు. ఈ వ్యూహం వల్ల వ్యవసాయ రంగంలో ఆశించినంత మేరకు అధికోత్పత్తి జరగలేదు. దానికి అనేక కారణాలు పేర్కొనవచ్చును. ఈ పథకాన్ని ప్రతిపాదించిన నిపుణుల సంఘం సూచనలను అమలుపర్చకపోవటం, ఈ పథకం అమలుకు జిల్లాల ఎంపిక సక్రమంగా జరగకపోవడం ఈ పథకం అమలులో రాజకీయాలు ప్రవేశించడం మొదలైన కారణాల వల్ల ఈ పథకం తన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైనట్లు పేర్కొనడం జరిగింది. ఈ పథకం అమలులో అనేక ఇతర లోపాలు చోటుచేసుకున్నాయి. క్షేత్ర స్థాయిలో ఈ పథకాన్ని అమలుపరిచిన మండలాభివృద్ధి అధికారి, ( B.D.O.) గ్రామస్థాయి కార్యకర్తలకు ( VLWS) వ్యవసాయంలో తగిన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవటం వల్ల, అధిక పనిభారం వల్ల వారు ఈ పథకం అమలుపై అవసరమైన దృష్టిని కేంద్రీకరించలేకపోయారు. కాగా బ్లాకు స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులకు తగిన ప్రోత్సాహకాలను కల్పించకపోవడం వల్ల వారు ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు పర్చేందుకు తగిన ప్రేరణ వారికి లభించలేదు. ఈ పథకం అమలుకు జిల్లాను ఒక కేంద్రంగా ఎంపిక చేయడం ఒక ప్రధాన లోపంగా గుర్తించబడింది. అనేక వ్యత్యాసాలున్న జిల్లాను ప్రణాళికాకేంద్ర ఎంపిక చేయడం వాంఛనీయంకాదని వెల్లడి అయింది. ఈ విధంగా పెక్కులోపాలు కారణంగా ఈ వ్యూహం విఫలమైనప్పటికీ, దీనివల్ల కొన్ని కీలక ప్రయోజనాలు సిద్ధించాయి. ఒకటి, ఈ వ్యూహం వల్ల శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం సాధారణ రైతులకు చేరువైంది. రెండు ఈ వ్యూహం వ్యవసాయం పట్ల రైతుల దృక్పథంలో గణనీయమైన మార్పును ప్రవేశపెట్టింది.

BRAOU

## 8.2.3 నిర్దేశిత లక్ష్య సమూహాల అభివృద్ధి వ్యూహం

### చిన్నకారు, సన్నకారు రైతులు వ్యవసాయ కూలీల అభివృద్ధి వ్యూహం

1960 దశాబ్దంలో అమలు చేసిన సాముదాయిక అభివృద్ధి పథకం, సాంద్ర వ్యవసాయ అభివృద్ధి వ్యూహాల ఫలితంగా దేశంలో గ్రామీణప్రాంతాలలో అన్యూహమైన పరిణామాలు సంభవించాయి. ఈ వ్యూహాల క్రింద ప్రవేశ పెట్టిన పథకాల వల్ల సాధించబడిన వ్యవసాయ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమానంగా చేరక పోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఈ నూతన వ్యవసాయ వ్యూహాలు ప్రవేశ పెట్టిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు సరఫరా చేసిన ఉత్పాదకాల వలన ఎక్కువ భూమి ఉన్న పెద్ద రైతులు, భూస్వాములు ప్రయోజనం పొందగలిగారే తప్ప, సన్నకారు, చిన్నకారు రైతులు, భూమి లేని వ్యవసాయ కార్మికులు ఎలాంటి ప్రయోజనం పొందలేకపోయారు. క్రమంగా వీరి పరిస్థితి నిక్రుష్టంగా రూపొందించడంతో పాటు, వారు ఋణాల ఊబిలో చిక్కుకొనడం జరిగింది. క్రమంగా దిగజారుతున్నవీరి పరిస్థితి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఫలితంగా ప్రభుత్వం వీరి పరిస్థితిని మెరుగు పర్చేందుకు చర్యలను తీసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించింది.

ప్రభుత్వం ఆలోచనల్లో వచ్చిన మార్పుకు అనుగుణంగా ప్రణాళికా సంఘం భారతీయ రిజర్వు బ్యాంకుకు తమ దృష్టిని సమాజంలోని బలహీనవర్గాలకు చెందిన పేదరైతులు, వ్యవసాయ కూలీల అభివృద్ధి వైపు సారించాయి. భారతీయ రిజర్వు బ్యాంకు ఈ వర్గాలకు చెందిన రైతులు, రైతుకూలీల పరిస్థితిని సమీక్షించి, వారి అభివృద్ధికి తగిన సూచనలు చేసేందుకు 1966లో అఖిల భారత గ్రామీణ పరపతి సమీక్షాసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ సంఘం మొదటి పంచవర్షప్రణాళికా కాలంనుంచి అమలు చేస్తున్న వివిధ వ్యూహాలు, పథకాల వల్ల సన్నకారు, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, వారి జనసంఖ్యకు, అవసరాలకు అనుగుణంగా ఏ మాత్రం ప్రయోజనం పొందలేకపోయారని అభిప్రాయపడింది. దానికి అనుగుణంగా ఈ సంఘం గ్రమీణ ప్రాంతాలలోని సన్నకారు, చిన్నకారు రైతులు, వ్యవసాయకూలీలకు నేరుగా అవసరమైన సహాయం అందచేసేందుకు తగిన సంస్థాగత ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ సంస్థ గ్రామీణ ప్రాంతాలలోని సన్నకారు, బలహీనవర్గాలకు చెందిన రైతుల, వ్యవసాయ కూలీల ప్రత్యేక సమస్యలను గుర్తించి, వారి వ్యవసాయ వృత్తి వాణిజ్యపరంగా లాభసాటిగా రూపొందేందుకు తగిన సహాయాన్ని అందచేయాలని సూచించింది.

BRAOU

గ్రామీణ పరపతి సమీక్ష సంఘం చేసిన పై సూచనలు ప్రణాళికా సంఘం ఆమోదం పొందాయి.ప్రణాళిక సంఘం ఈ సూచనలను నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అములుపర్చింది. ఫలితంగా ఈ ప్రణాళికా ఆరంభంలో 1970 సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ, ( Small Farmer Development Agency ) చిన్నకారు రైతులు, వ్యవసాయకూలీల అభివృద్ధి సంస్థ ( Marginal Farmer and Agricultural Labourers Development Agency) అనే రెండు వేర్వేరు సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. మొదట్లో ప్రయోగాత్మకంగా ఈ రెండు సంస్థలను దేశంలోని వివిధ రాష్ట్రాలలోని 97 జిల్లాలలో ఏర్పాటు చేసారు. ఈ జిల్లాల్లో మొత్తం 46 సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలు, 41 చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీల అభివృద్ధి సంస్థలను ప్రారంభించారు. నాల్గవ పంచవర్ష ప్రణాళికలో ఈ సంస్థలకై ప్రణాళికా సంఘం ప్రత్యేకంగా రూ. 115 కోట్లను కేటాయించింది.

## సన్నకారురైతుల అభివృద్ధి సంస్థ లక్ష్యాలు

1. తన పరిధిలో అర్హతకల సన్నకారు రైతులను గుర్తించడం.
2. వారు ఎదుర్కొనే సమస్యలను గుర్తించటం.
3. ఈ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలతో వివిధ పథకాలను రూపొందించి, వాటిని అమలు పర్చటం

నిర్ధేశించిన స్థోమతగల సన్నకారు రైతులను గుర్తించి వారిని మిగులు ఉత్పత్తిని సాధించే రైతులుగా తీర్చిదిద్దడం సన్నకారు అభివృద్ధి సంస్థ ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ఈ సంస్థలు రైతులకు అవసరమైన ఉత్పదకాలు (ఎరువులు విత్తనాలు మొదలగునవి) సరఫరా చేయడం, తగిన సేవలు అందచేయడం, వారి భూములకు సాగునీటిని అందచేయటం, వారి వ్యవసాయ పనులకు అవసరమైన ఋణాలను వారికి సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకుల ద్వారా అందజేయడం, వారి వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగి, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించటం మొదలైన చర్యలను చేపట్టాయి.

ఇదే విధమైన పాత్ర చిన్నకారు రైతులు, వ్యవసాయకూలీల సంస్థలకు అప్పగించబడింది. చిన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు తగిన ఉపాధి కల్పించటం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడం ఈ సంస్థ ప్రధాన ఆశయం. తన ఆశయ సాధనకు ఈ సంస్థ ఈ క్రింది బాధ్యతలు అప్పగించబడ్డాయి.

BRAOU

1. అర్హత కల్గిన చిన్నకారు రైతులు, వ్యవసాయకూలీలను గుర్తించటం
2. వారి సమస్యలను పరిశీలించటం
3. వారికి లాభసాటి ఉపాధిని కల్పించే పథకాలను రూపొందించి అమలు పర్చడం
4. గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధి పర్చడం
5. వారి అభివృద్ధికి రూపొందించిన వివిధ పథకాలను అమలు పర్చేందుకు అవసరమైన సంస్థాగత, విత్తపరమైన ఏర్పాట్లు చేయడం

ఈ విధంగా ఈ రెండు సంస్థల లక్ష్యాలు, చేపట్టే పథకాలలో సారూప్యత ఉంది. ఈ రెండు సంస్థలు నిర్ధేశిత లక్ష్య సమూహాల ( Target Groups ) అభివృద్ధికి వారి ప్రధాన, ఉపవృత్తులను మెరుగు పర్చే చర్యలను చేపట్టాయి. ఈ సంస్థలు ఈ లక్ష్య సమూహాలు సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి తగిన పథకాలను రూపొందించి వాటి అమలుకు అవసరమైన సంస్థాగత, విత్త, పాలనాపరమైన ఏర్పాట్లను చేయడం మొదలైనవి ఈ సంస్థలో చేపట్టిన ఇతర చర్యలు.

ఈ రెండు సంస్థలు వ్యవసాయరంగంలో అభివృద్ధిపైనే తమ దృష్టిని కేంద్రీకరించాయి. ఈ రంగం అభివృద్ధికి ఈ సంస్థలు చేపట్టిన చర్యలలో సాంద్ర వ్యవసాయ పద్ధతులు బహుళపంటలు చేపట్టిన రైతులను ప్రోత్సహించడం, చిన్నతరహా నీటిపారుదల సౌకర్యాల కల్పన, మేలు రకం విత్తనాల సరఫరా, భూమి అభివృద్ధి భూసార పరిరక్షణ ఉద్యానవనాల అభివృద్ధి మొదలైన అనేక చర్యలను చేపట్టాయి. వీటితో పాటు ఈ సంస్థలు ఈ

తరగతికి చెందిన రైతులు, వ్యవసాయకూలీల ఆదాయాన్ని పెంపొదింపచేసేందుకు వారు పాల ఉత్పత్తి, కోళ్ళు, పందులు, మేకలు, గొర్రెల పెంపకం మొదలైన ఉపవృత్తులను చేపట్టేలా వారిని ప్రోత్సహిస్తారు.

అయిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ రెండు సంస్థలు తమ వివిధ పథకాల అమలులో షెడ్యూల్డు కులాలు తెగలకు చెందిన పేద రైతులు, వ్యవసాయ కూలీలకు అధిక ప్రాధాన్యత కనపర్చాలని ఆదేశించింది. కాగా ఈ పంచవర్షప్రణాళికా కాలంలో ఈ రెండు సంస్థలను ఐక్యం చేసి ఒకే సంస్థగా రూపొందించారు. ఈ రెండు సంస్థలను నియంత్రించేందుకు పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక సమన్వయ, సమీక్షాసంఘాన్ని ఏర్పాటు చేసారు. కాగా ఈ సంస్థలు చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికీకరణను నిర్వహించేందుకు ఒక పాలక వర్గం ( Governing Body ) ని ఏర్పాటు చేసారు. ఈ సంస్థల కార్యనిర్వాహక పాలనను నిర్వహించేందుకు ప్రాజెక్టు అధికారి ఆధిపత్యంలో పనిచేసే ఉద్యోగ బృందాన్ని నియమించారు. వ్యవసాయ శాఖ పశువర్ధక శాఖ, సహకార శాఖ మొదలైన శాఖలకు చెందిన నిపుణులను ఈ సంస్థలో ఉద్యోగులుగా నియమించారు.

ఐదవ పంచవర్షప్రణాళికా కాలంలో ఈ రెండు సంస్థల పని తీరును ప్రణాళికా సంఘం నియమించిన ప్రత్యేక పరిశోదనా బృందం ప్రణాళికా మూల్యాంకన సంస్థ (P.E.O.) మొదలైన ప్రభుత్వ సంస్థలు ఇతర ప్రైవేటు పరిశోధనా సంస్థలు, పరిశోధకులు మూల్యాంకన చేసారు. వీరి మూల్యాంకన ఈ రెండు సంస్థలు తమ లక్ష్యాలను సాధించలేక పోయాయని, వాటి నిర్మాణంలో పాలనా వ్యవస్థలో కల బలహీనతలు, లోపాలు ప్రధాన కారణాలని వెల్లడైంది. మొదటిగా, సన్నకారు, చిన్నకారుల రైతులను వ్యవసాయ కూలీలను గుర్తించేందుకు నైపుణ్యం లేని సిబ్బంది లేకపోవడం వల్ల అది తగిన అర్హతలను కలిగిన లబ్ధిదారులను గుర్తించలేకపోయాయి. దీని ఫలితంగా అర్హతలేని వ్యక్తులు ఈ సంస్థల సహాయం పొందగలిగారు. దీనివల్ల ఈ సంస్థల ప్రధాన లక్ష్యం నెరవేరలేదు. రెండు ఈ సంస్థల సిబ్బంది వైఫల్యం వల్ల ఈ సంస్థలు వాటి లక్ష్యాలను సంబంధిత ప్రజలలో తగిన ప్రచారం లభించకపోవడంవల్ల వారు వాటి నుంచి ఎటువంటి ప్రయోజనాన్ని పొందలేకపోయారు. ఈ సంస్థలు లబ్దిదారులకు ఋణాలు సబ్సిడీలను అందజేయడంలో అనుసరించిన పద్ధతులు, సంక్లిష్టమైన, సుధీర్ఘమైనవి కావడం వల్ల వాటి పట్ల సరియైన అవగాహన లేని లబ్ధిదారులు ఋణాల కొరకు ఈ సంస్థల కంటే ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై నే ఆధారపడటానికి ఇష్టపడినట్లు కొన్ని పరిశోధనలు వెల్లడించాయి.

సన్నకారు, చిన్నకారు రైతులు వ్యవసాయకూలీల అభివృద్ధి సంస్థలు ఐదవ పంచవర్ష ప్రణాళికాంతము వరకు కొనసాగాయి. 1970 లో 87 తో ప్రారంభమైన ఈ సంస్థల సంఖ్య 1975 నాటికి 168కి చేరుకుంది. ఈ సంస్థల పరిధిలోకి దాదాపు 1900 ల బ్లాకులను చేర్చారు. ప్రతి సంస్థపై ప్రతి సంవత్సరం రూ. 2.50 లక్షల వ్యయం చేసారు. గ్రామీణ రంగంలో వర్గ (Class) అసమానతలను తొలగించేందుకు ఏర్పాటైన ఈ సంస్థల వల్ల ప్రాంతీయ అసమానతలు అభివృద్ధి చెందాయి. తమ లక్ష్యాలను సాధించడంలో విఫలమైన ఈ సంస్థలను ఆరో పంచవర్షప్రణాళికా కాలంలో 1980 లో ప్రవేశపెట్టిన సమగ్ర గ్రామీణాభివృద్ధి పథక (IRDP) లో విలీనం చేసారు.

BRAOU

## 8.2.4 ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి వ్యూహం

భారతదేశంలో మొత్తం ప్రాంతంలో అయిదవ వంతు ప్రాంతం వర్షాలు సమృద్ధిగా కురవకపోవడం వల్ల తీవ్రమైన కరువుకు గురిఅవుతున్నది. ఈ కరువు ప్రాంతాలలో అధిక భాగం మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఉంది. దేశం మొత్తం విస్తీర్ణంలో నిరంతర కరువుకు గురయ్యే 19 శాతాన్ని ఆక్రమించింది. దేశంలోని కరువు ప్రాంతాల అభివృద్ధికి స్వాతంత్ర్యానంతరం కొంత ప్రయత్నం చేసినప్పటికి 1970 దశాబ్దంవరకు ఈ రంగంపై ప్రభుత్వం తగిన ఆసక్తిని ప్రదర్శించలేదు. కాగా 1970లో దేశంలో తరచు కరువుకు లోనయ్యే ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల పనుల పథకం (Rural Works Programme) అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకాన్ని అమలు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. దేశంలోని కరువు ప్రాంతాలను గుర్తించడం ఈ సంఘం ప్రధాన కర్తవ్యం. ఈ పథకం క్రింద గుర్తించబడిన కరువు ప్రాంతాలలో అనేక ఉపాధికల్పన కార్యక్రమాలను చేపట్టారు. ఈ ప్రాంతాలలో భూసార పరిరక్షణ, అడవుల పెంపకం, రోడ్ల నిర్మాణం, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం మొదలైన పనులను చేపట్టడం ద్వారా ఆ ప్రాంతాలలో నివసించే ప్రజలకు ఉపాధి కల్పించడం ఈ పథకంలో ప్రధాన అంశం. నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలములో ఈ పథకానికి రూ. 70 కోట్లు కేటాయించారు.

1970లో ప్రారంభించిన గ్రామీణ పనుల పథకం తమ లక్ష్యాన్ని నెరవేర్చడంలో విఫలం కావడంతో రెండు సంవత్సరాల అనంతరం 1972లో ఈ పథకాన్ని కరువు పీడిత ప్రాంతాల అభివృద్ధి పథకం ( Drought Pron Area Development Programme ) గా మార్చారు. ఈ నూతన పథకాన్ని 1972 - 73 లో నాలుగో పంచవర్షప్రణాళికలో చేర్చి దాని అమలుకు 70 కోట్లను కేటాయించారు. కాగా ఐదో పంచవర్షప్రణాళికా కాలంలో, ఈ పథకంపై కేటాయింపును రూ. 161.50 కోట్లకు పెంచారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు బ్లాకును మౌళికాకేంద్రంగా పరిగణించారు.

BRAOU

కరువు పీడిత ప్రాంతం అభివృద్ధి పథకాన్ని అమలుపర్చే బాధ్యతను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు అప్పగించారు. కరువు తీవ్రతను తగ్గించేందుకు నిర్దేశిత లక్ష్యాలు కలిగిన సమర్థవంతమైన పథకాలతో కూడిన మాస్టర్ ప్లాన్ ( Master Plan) రూపొందించడం ఈ పథకంలో కీలకాంశం. ఈ పథకం లక్ష్యములలో కరువు ప్రభావతీవ్రతను తగ్గించడం, ఈ ప్రాంతాలలో నివసించే ప్రజల ఆదాయాన్ని స్థిరీకరించడం ఈ ప్రాంతాలలో పర్యావరణను రక్షించడం ప్రధానమైనవి. ఆచరణలలో ఈ లక్ష్యాల సాధనకు ఈ పథకం క్రింద చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాల కల్పన, రోడ్ల నిర్మాణం, భూసార పరిరక్షణ, అడవుల పెంపకం, పశుగ్రాసం పెంపకం మొదలైన చర్యలకు ప్రాధాన్యత కల్పించి అమలు పరుస్తారు.

కరువు పీడిత ప్రాంతం అభివృద్ధి పథకం అమలులో అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పథకం అమలు ప్రక్రియలో లోపభూయిష్టంగా రూపొందించడంతో అనేక ప్రాంతాలలో ఈ పథకాన్ని మధ్యాంతరంగా విరమించినట్లు ప్రభుత్వ నివేదికలు తెలిపాయి. కాగా, అనేక పథకాలు అమలు విపరీతమైన జాప్యం జరగడం సర్వసాధారణ విషయం అయింది. 1973 -74 సంవత్సరంలో ఈ పథకాన్ని సమీక్షించిన కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలో ఈ పథకంలో చోటుచేసుకున్న వివిధ లోపాలను బహిర్గతం చేసాడు. ఈ నివేదికలో పనులను అమలులో విపరీతంగా జరుగుతున్న జాప్యం అధిక వ్యయం, పాలనా అసమర్థత మొదలైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

## 8.2.5 సమగ్ర గ్రామీణాభివృద్ధి వ్యూహం

1960, 1970 దశాబ్దంలో అనుసరించిన అభివృద్ధి వ్యూహాలు ఆశించిన ఫలితాలను సమకూర్చలేకపోగా అవాంఛనీయమైన ఫలితాలకు దారితీయడంతో ప్రభుత్వం ఒక నూతనాభివృద్ధి నమూనాకై అన్వేషణ ప్రారంభించింది. ఈ అన్వేషణ ఫలితంగా 1980 లో సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ( Integrated Rural Development Programme) అనే నూతన పథకం రూపుదిద్దుకుంది. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకానికి, 1950 దశాబ్దంలో అమలుపర్చబడిన సముదాయికాభివృద్ధి పథకానికి మధ్య ఒక ప్రధాన సారూప్యత ఉంది. ఈ రెండు మౌలికంగా సమగ్ర అభివృద్ధి దృక్పథం కల పథకాలే అయితే సమగ్ర గ్రామీణ పథకం సాముదాయిక అభివృద్ధి పథకానికి భిన్నంగా సమాజంలోని పేదరికంలో మగ్గుతున్న బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడిన పథకం అంటే ఈ పథకం ప్రధానంగా గ్రామీణ పేదలకు పరిమితమైన పథకం అయినప్పటికి ఈ పథకం సమగ్రమైంది. విస్తృతమైన పరిధిని కలిగివుంది. ఈ పథకం గతంలో అమలుపర్చబడిన అన్ని అభివృద్ధి వ్యూహాలకంటె అనేక అంశాలలో మెరుగైంది.

దేశంలోని శాస్త్రజ్ఞుల పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ప్రధానంగా పేదరిక నిర్మూలనా పథకం. ఈ వ్యూహం మౌలిక సిద్ధాంతం 1980లో ప్రారంభమైన ఆరో పంచవర్ష ప్రణాళికా నివేదికలో పొందుపర్చబడింది. మొదట్లో దేశంలోని 2300 బ్లాకులలో ప్రారంభించబడిన ఈ పథకాన్ని ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంనాటికి మొత్తం 5011 బ్లాకులకు విస్తరించారు. దేశంలోని దారిద్ర్యరేఖకు అడుగున వున్న 30 కోట్ల గ్రామీణ కుటుంబాలను దశలవారిగా ఈ రేఖను అధిగమించేలా చేయడమే ఈ పథకం ఏకైక లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ఈ పథకం క్రింద లబ్ధిదారుల దృక్పథంగల కార్యక్రమాలు రూపొందించబడి అమలు పర్చబడ్డాయి. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం క్రింద వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత రంగాలలో ఉత్పత్తిని ఉత్పాదకతను పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాలలోని బలహీన వర్గాల కుటుంబాల నైపుణ్యాన్ని పెంపొందింప చేయడంవల్ల వారి ఆదాయం పెంచటానికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తారు.

సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం క్రింద గ్రామీణ ప్రాంతాలలో నివశించే 3500కు తక్కువ వార్షిక ఆదాయం గల పేదరైతులు, షెడ్యూల్డు కులాలు, తెగలు, వ్యవసాయ వ్యవసాయేతర కులాలు, వృత్తి నిపుణులు మొదలైన బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వివిధ రూపాలలో ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుంది. ఈ పథకం క్రింద కుటుంబాన్ని ఒక ప్రధాన యూనిట్‌గా తీసుకుని, గుర్తించిన కుటుంబాలకు వివిధ ఆర్థిక కార్యకలాపాలను చేపట్టేందుకు తగిన సహాయం అందిస్తారు. ఆరో పంచవర్ష ప్రణాళికలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు రూ. 1500 కోట్లకు కేటాయించారు. ఏడు, ఎనిమిది పంచవర్ష ప్రణాళికలలో ఈ మొత్తాన్ని గణనీయంగా పెంచారు. ఆరవ ప్రణాళికా కాలంలో మొత్తం పదిహేను మిలియన్ల కుటుంబాలను పేదరికం నుంచి విముక్తి చేయాలని సంకల్పించారు. కాని నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడం జరగలేదని ఏడో పంచవర్ష ప్రణాళిక నివేదిక వెల్లడించింది.

BRAOU

సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకాన్ని అమలు పర్చేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ( District Rural Development Authority) అనే ఒక నూతన సంస్థను సృష్టించారు. ఈ సంస్థకు జిల్లా కలెక్టరు అధిపత్యం వహిస్తాడు. ఈ సంస్థ కార్యనిర్వాహక పాలనను నిర్వహించేందుకు ఐ.ఎ.యస్. కు చెందిన ఒక ప్రాజెక్టు అధికారి ఉంటారు. అతనికి సహాయపడేందుకు వివిధ అభివృద్ధి శాఖలకు చెందిన కొందరు సహాయక అధికారులు ఉంటారు. ఈ సంస్థలో ప్రణాళికీకరణ విధిని చేపట్టేందుకు ఒక ప్రణాళికా మూల్యాంకన బృందము ఉంటుంది. ఈ సంస్థ రూపొందించిన ప్రణాళికను గ్రామ స్థాయిలో అమలు పర్చే బాధ్యతను మండలాధికారి అధిపత్యం క్రింద పనిచేసే బ్లాకు యంత్రాంగం వహిస్తుంది.

అరవ పంచవర్షప్రణాళికలో చేపట్టిన సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంపై జరిగిన మూల్యాంకనలు, పరిశోధనలు ఈ పథకం వల్ల కొన్ని ప్రయోజనాలు సిద్ధించినప్పటికీ, అది ఆశించిన మేరకు గ్రమీణ పేదరికాన్ని తగ్గించటంలో విఫలమైనట్లు పేర్కొన్నాయి. దీనికి ఈ పథకం రూపకల్పన, అమలులో చోటుచేసుకున్న లోపాలు, బలహీనతలు ప్రధాన కారణమని పేర్కొనబడింది. ఏమైనప్పటికీ, ఈ వ్యూహం నిర్ధేశించిన లక్ష్యాన్ని కొంత మేరకైనా సాధించటంవల్ల ప్రభుత్వం ఈ వ్యూహాన్ని ఏడు, ఎనిమిదవ పంచవర్ష ప్రణాళికల్లో కొనసాగించటమే కాక, దాన్నిమెరుగు పర్చేందుకు పెక్కు మార్పులు చేసింది. అంతకాక ఈ పథకం అమలుకు అవసరమైన నిధులను గణనీయంగా పెంచారు.

## 8.3 సారాంశం

BRAOU

ఈ భాగంలో వివరించినట్లు భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి వివిధ ప్రణాళికలలో వివిధ వ్యూహాలను ప్రవేశపెట్టింది. ఒక ప్రణాళికలో అనుసరించినవ్యూహం సమకూర్చిన అనుభవాలకు అణుగుణంగా తరువాత ప్రణాళికలో మరో నూతన వ్యూహాన్ని ప్రవేశ పెడ్తూ వచ్చింది. ఫలితంగా మొదటి పంచవర్షప్రణాళిక నుంచి ఏడవ పంచవర్ష ప్రణాళిక వరకు దాదాపు అరు విభిన్న వ్యూహాలను అనుసరించినట్లు గుర్తించవచ్చు. ఈ విభిన్న వ్యూహాల లక్ష్యం ఒకటే అయినప్పటికీ అవి అనుసరించిన పద్ధతులు, అవలంబించిన భావన చట్రాలు భిన్నంగా ఉన్నాయి. ఈ విధంగా మార్పు చేయటంద్వారా ప్రభుత్వం ప్రతి తదుపరి వ్యూహాన్ని మెరుగు పర్చేందుకు ప్రయత్నించింది.

ఈ విధమైన కసరత్తు ద్వారా ప్రభుత్వం సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా లేవు. ప్రభుత్వం మొదటి పంచవర్షప్రణాళికలో అనుసరించిన సాముదాయిక అభివృద్ధి వ్యూహం మొదట ఆరవ పంచవర్షప్రణాళికలో అనుసరించిన సమగ్ర గ్రామీణాభివృద్ధి వ్యూహం వరకు అనుసరించిన వ్యూహాల వల్ల కలిగిన ఫలితాలు గ్రామీణ ప్రాంతాలలోని స్థితి గతులలో మౌళికమైన మార్పులను ప్రేరేపించలేదు. వీటివల్ల ఈ ప్రాంతాలను పీడిస్తున్న పేదరికం, అనారోగ్యం, నిరక్ష్యారాస్యత, నిరుద్యోగం, కనీస సౌకర్యాల లోపం వంటి మౌళిక సమస్యల తీవ్రత తగ్గలేదు. పైగా గ్రామీణ ప్రాంతాల సమస్యలు రాను రాను సంక్లిష్టంగా రూపొందుతున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అనుసరిస్తున్న ప్రస్తుత వ్యూహాన్ని వివేచనాత్మకంగా మార్పు చేయటం అవసరం.

## 8.4 నమూనా పరిక్షా ప్రశ్నలు

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో జవాబు రాయండి

1. భారతదేశంలొ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వివిధ గ్రామీణాభివృద్ధి వ్యూహాలను పేర్కొని, వాటి విజయాలు, వైఫల్యాలను పేర్కొనండి ?

2. భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల సమస్యలను పేర్కొనుము ? ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలు వీటిని ఏ మేరకు పరిష్కరించాయో చర్చింపుము ?

3. సమగ్ర గ్రామీణాభివృద్ధి వ్యూగం సాధించిన విజయాలను వివరించండి ?

**II** ఈ క్రింది ప్రశ్నలలో **15** పంక్తులలో జవాబు రాయండి

1. భారత ప్రభుత్వం 1952 లో ప్రవేశ పెట్టిన సాముదాయిక అభివృద్ధి పథకం అమలును విశ్లేషించండి ?

2. ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి వ్యూహం ఫలితాలను అంచనా వేయండి ?

3. భారతదేశంలొ వివిధ అభివృద్ధి వ్యూహాలు విఫలమయ్యేందుకు దోహదం చేసిన కారణాలను పరిశీలించండి ?

BRAOU

## 8.5 చదువ దగిన రచనలు


| | | |
|---|---|---|
| 1. S.R. Maheswari | : | Rural Development in India, New Delhi : Sage 1985. |
| 2. J.S. Brara | : | The Political Economy of Rural Develop ment, New Delhi, Allied, 1983 |
| 3. B. Mukherji | : | Community Development in India, Bombay : Orient Longman, 1961 |
| 4. Franda Marcus | : | Indian Rural Development: An Assessment and Alternatives, New Delhi, 1979. |
| 5. M.L. Dantawala | : | Poverty in India : Then and Now, Bombay, Macmillan, 1975. |
| 6. N.R. Inamdar | : | Development Administration in India, 1972. |
| 7. Planning Commission | : | Five Year Plans (First Plan to Eight Plan) |


BRAOU

రచయిత : ఏమ్. బాపూజీ

# భాగం - 9 : ప్రగతి - ఉద్యోగుల పాత్ర

## విషయక్రమం


9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 ప్రగతిపాలన అర్థం, నిర్వచనం

9.3 మూడవ ప్రపంచ దేశాలు - లక్షణాలు

9.4 వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం - విమర్శ

9.5 వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం - అశక్తత

9.6 భారత దేశ ఉద్యోగిస్వామ్యం

9.7 సాంప్రదాయ, అభివృద్ధి కాముక ఉద్యోగిస్వామ్యం - భేదాలు

9.8 కొన్ని పరిశోధనలు - ఫలితాలు - సంక్షిప్తంగా

9.9 సారాంశం

9.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

9.11 చదువదగిన రచనలు


## 9.0 లక్ష్యాలు

ఈ భాగం చదివాక మీరు

* ప్రగతిపాలన అవసరం, అర్థం
* వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం - అశక్తత
* ఉద్యోగిస్వామ్యం - పరిశోధన - ఫలితాలు ,
* న్యూ బ్యూరోక్రసి - లక్షణాల గురించి తెలుసుకుంటారు.

BRAOU

## 9.1 పరిచయం

`ప్రగతిపాలన' అనే భావం ఈ మధ్యకాలంలో ప్రాచుర్యంలోకి వచ్చినా, దాని ప్రాముఖ్యత, ప్రభావం - ప్రభుత్వ పాలనా శాస్త్ర అధ్యయనంలో, దేశ ప్రగతిలో చెప్పలేనంతగా చొచ్చుకొనిపోయింది. `ప్రగతిపాలన' అనే పదం గురించి భేధాభిప్రాయాలుండవచ్చు కాని, దాని ఉపయోగం గురించి మాత్రం ఏకాభిప్రాయమే ఎల్లెడల కనిపిస్తుంది. `ప్రగతి' అనే భావన యొక్క ప్రభావం, మూడవ ప్రపంచ దేశాల `మాయాజాలం'గా పనిచేస్తుందనడం సత్యదూరం కానేరదు. కాలే కడుపులకు, మండే గుండెలకా పదం అమృతపు జల్లులా, తేనే వానలా వినిపిస్తుంది.

## 9.2 ప్రగతిపాలన అర్థం - నిర్వచనం

ప్రగతిపాలన అర్థం నిర్వచనాలకై
'ప్రగతిపాలన' భాగం - 1 పేజీలు 41, 42, 43 చదవండి

## 9.3 మూడవ ప్రపంచ దేశాలు - లక్షణాలు

మూడవ ప్రపంచ దేశాలు పేదరికం, అనారోగ్యం, ఆకలి, నిరక్షరాస్యత-తదితర రుగ్మతల పుట్టలుగా, పేర్కొనబడుతున్నవి. ఆ దేశాల ప్రభుత్వాలు తమ ప్రజలకు `కనీస అవసరాలు' తీర్చే కార్యక్రమాన్ని తమ విధానంగా ప్రకటిస్తున్నాయి. సామాజిక న్యాయం. శ్రేయోరాజ్యస్థాపన, సమసమాజ, నవసమాజ నిర్మాణం అశక్తత ప్రభుత్వాలు తమ ప్రజలకు హామీగా ఇస్తున్నాయి. అయితే వాగ్దానాలను ఆచరణలో పెట్టాల్సింది, ఆలోచనలను ఆచరించాల్సింది, కలలను కార్యరూపంలో పెట్టాల్సింది ప్రభుత్వ యంత్రాంగం. అనగా ఆలోచన ప్రభుత్వానిది (రాజకీయ నాయకులది-మంత్రులది) కాగా, ఆచరణ ప్రభుత్వ ఉద్యోగులదవుతుంది. ఆలోచనకు, ఆచరణకు మధ్య ఉండాల్సింది అవగాహన, సానుభూతి, సామరస్యధోరణి అన్నింటికి మించి `సమర్పిత భావం'

## 9.4 వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం - విమర్శ

ఈ పై లక్షణాలు వెబర్ ప్రతిపాదించిన ఉద్యోగిస్వామ్యం నమూనా ద్వారా ఎన్నికై, తర్ఫీదుపొంది పనిచేస్తున్న ఉద్యోగులలో కొరవడటం జగద్విదితం. పని విభజన, క్రమానుగత శ్రేణి, అధికారం, వ్రాత పూర్వకమైన నియమనిబంధనలు, అమూర్తిమత్వం, వగైరాలు ఉద్యోగిస్వామ్య లక్షణాలని మనకు తెలుసు. ఈ మూసలో తయారైన ఉద్యోగి బృందం ప్రగతిపాలనకు మార్గదర్శకులు, పనిముట్లు కాలేరనేది సర్వత్రా వినిపిస్తున్న వాదన. నియమనిబంధనలను పట్టుకొని ప్రాకులాడటం, అధికార కేంద్రీకరణ, అధికార పరిధికి అధిక ప్రాధాన్యతనివ్వడం, ప్రగతికి అవరోధం అనే అభిప్రాయం కూడ ఉంది. సృజనాత్మకత, అనుకూల ధోరణి ప్రగతికి ప్రధానమని, అవి గల ప్రగతికాముకులైన ఉద్యోగిబృందం ప్రగతిపాలనకవసరమని అనుకోవటం కూడా వింటున్నాం. ఈ సంక్షిప్త నేపథ్యంలో వెబర్ నమూనా ఉద్యోగిబృందం యధాతథంగా ప్రగతిపాలనను చేపట్టగలదా, లేక మార్పులు, చేర్పులతో దానికి ఆ పనిని అప్పగించాలా అనే విషయం చర్చనీయాంశమవుతుంది.

క్రమబద్ధీకరణ పాలనలో ప్రభుత్వం ప్రజాశ్రేయస్సును చిన్న చూపుచూచి, క్రమబద్ధీకరణకు పెద్ద పీట వేసింది. పన్నుల విధింపు, వసూలు, శాంతి భద్రతలను కాపాడడంలాంటి పరిమిత విధుల నిర్వహణకే ప్రభుత్వం పరిమితమైంది. ప్రజావ్యతిరేక, ప్రభుత్వ అనుకూల పాలనగా పిలువబడే క్రమబద్ధీకరణ పాలనకు వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం చక్కగా సరిపోయింది. పాలకుల ప్రయోజనాలు కాపాడుతూ పొట్టబోసుకునే నాటి ఉద్యోగిస్వామ్యం, ప్రజల శ్రేయస్సుకు పాటుపడుతూ మారిన తమ పాత్రను నిర్వహించడానికి ఎంతవరకు పనికి వస్తుందనేది మనముందున్న ప్రశ్న.

BRAOU

యథాతథ స్థితిని వీడి, సృజనాత్మకలిగి, దృక్పథాన్ని ధోరణులను మార్చుకుని ప్రగతి పథంలో పయనిస్తూ, దేశాన్ని ప్రగతి మార్గంలో నడిపించే సత్తా వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యానికుందా అనేది ప్రశ్న `లేదు అనేది జవాబు. ఎందుకు లేదో పరిశీలిద్దాం.

## 9.5 వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం - అశక్తత

వలసవాద, సామ్రాజ్యవాద ప్రభుత్వాల పని ముట్టుగా పనిచేయగల లక్షణాలు కలిగిన వెబర్ ప్రతిపాదిత ఉద్యోగిస్వామ్యం ప్రగతిపాలన కనర్హం. నేటి ఉద్యోగిస్వామ్యం బ్రిటిష్ హయాం నాటి ఉద్యోగిస్వామ్యానికి ప్రతీక. ఇది వారొదిలిన `చేదుగుర్తు' సాంప్రదాయ లక్షణాలు కలిగిన ఆ ఉద్యోగిస్వామ్యం ప్రగతిపాలనకు పనికి రాదు. ఇదొక విమర్శ. స్థిరప్రభుత్వాలను దృష్టియందుంచుకొని వెబర్ తన ఉద్యోగిస్వామ్యాన్ని రూపొందించాడు. సామాజిక మార్పు, ప్రగతిని విస్మరించాడు. లక్ష్యసాధనాసక్తి, ఇబ్బందుల నెదుర్కొనే శక్తి ఆ నమూనాకు లేదు. ప్రగతిపాలకులు సమయానుకూలంగా, సృజనాత్మకతో కూడిన నవీన నిర్ణయాలు తీసుకోవాల్సుంటుంది. అభివృద్ధి చెందుతున్న సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలను అవగాహన చేసుకోవటంలో భారతదేశంలో మొదలుకొని, అన్ని దేశాలలోని ఉద్యోగిస్వామ్యాలు విఫలమయ్యాయి. చొరవ, ఉత్సాహం చూపించాల్సిన సందర్భాలలో `తటస్థత' ముసుగులో దాక్కున్నాయనేది మరో విమర్శ. నియమనిబంధనాలకు పెద్దపీటవేసి, లక్ష్యాలను తుంగలో తొక్కి, అసలు కంటె `కొసరు' ముద్దనే ధోరణి ప్రదర్శిస్తున్న వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం ప్రగతిపాలనకు అవరోధం, ఆయుధం కాదనేది సర్వజనాభిప్రాయం. ఈ సాధారణ నేపథ్యంలో భారతదేశ ఉద్యోగిస్వామ్య చరిత్ర పరిశీలించటం అవసరమవుతుంది.

## 9.6 భారతదేశ ఉద్యోగిస్వామ్యం

భారతదేశంలో నేడున్న ఉద్యోగిస్వామ్యం బ్రిటిష్ ప్రభుత్వ కాలంనాటిది. దేశ వనరులను తన ప్రయోజనాలను పరిరక్షించుటకు వినియోగించి, దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిని విస్మరించింది. శాంతి, భద్రతల పరిరక్షణే అది. అంతంగా ఎంచింది. స్వాతంత్ర్య సముపార్జన అనంతరం భారత ప్రభుత్వం శ్రేయోరాజ్య స్థాపనకు నడుము బిగించింది. అందువలన ప్రభుత్వం ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రవేశించాల్సి వచ్చింది. జాతి నిర్మాణంలో ఇదొక మలుపు. ఈ బృహత్తర కార్యక్రమం, పెద్ద మొత్తంలో, ఉద్యోగిస్వామ్యంపై పడింది. జాతి నిర్మాణ కార్యక్రమం చేపట్టాల్సిన ఉద్యోగిస్వామ్యపు `పని పద్ధతి' 'దృక్పథం' జాతీయ లక్ష్యాలను, సాధించుటకనుగుణంగా మారాల్సి ఉంటుంది. మారిన రాజకీయ, సామాజిక పరిస్థితులకనుగుణంగా, అదికూడా మారాల్సి ఉంటుంది. ప్రజల కొరకు పనిచేసిన ఉద్యోగిస్వామ్యం ప్రజలతో కలిసి, ప్రజల బాగోగుల అభివృద్ధికై పాటుపడాల్సి ఉంటుంది. సామ్రాజ్యవాద, పరాయి ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఉద్యోగిస్వామ్యం మారిన పరిస్థితులకనుగుణంగా `మారి' తన `కొత్త' పాత్రను నిర్వహించగలదా? అనేది ప్రశ్న.

BRAOU

మారిన ఆర్థిక, సామాజిక పరిస్థితులలో పని చేస్తూ, దేశాభివృద్ధికి పాటుపడాల్సిన ఉద్యోగిస్వామ్యం సాంప్రదాయ అలవాట్లను, అనగా, నియమనిబంధనలను, కాలం చెల్లించిన పద్ధతులను, వదిలి, కొత్త పద్ధతులను, కొత్త అలవాట్లను, కొత్త దృక్పథాలను అలవర్చుకోవాల్సి ఉంటుంది. అంటే, బ్రిటీష్ కాలం నాటి అలవాట్లు, పాలనా పద్ధతులు, నిర్లక్ష్య భావం, నేటి పరిస్థితులకు సరిపడవు. కావున, ముందుచూపు, అభివృద్ధి కాముకత, ఫలితాలు సాధించాలనే తపన గల ఉద్యోగిస్వామ్యం నేటి అవసరంగా తోస్తుంది.

## 9.7 సాంప్రదాయ, అభివృద్ధికాముక ఉద్యోగిస్వామ్యం - భేదాలు

సంక్షిప్తంగా, మనమిప్పుడు, సాంప్రదాయ భావాలుగల ఉద్యోగిస్వామ్యం, అభివృద్ధి పాలనకవసరమైన ఉద్యోగిస్వామ్యం మధ్యగల భేదాల గురించి ముచ్చటించుకుందాం.

సాంప్రదాయ ఉద్యోగిస్వామ్యం వెబర్ నమూనానుసారంగా పనిచేస్తుంది. సామర్థ్యం, అమూర్తిమత్వం, వేగం, ఖచ్చితత్వం, వివేచనాధికారం, స్పష్టత, నిరంతరత, ఏకత, అధికార పరంపర దీని ముఖ్య లక్షణాలు. అధికారాన్ని చలాయించుట, విస్తరించుట దీని లక్షణం. ప్రజలను అదుపులో పెట్టుట, ప్రభువులను కొలుచుట - మరో లక్షణం. ఇంత వరకు ప్రజల ప్రయోజనాల `రక్షకుడి'గా ఇది పనిచేసిన దాఖలాలు అతి తక్కువ అనే విమర్శవుంది. కొలబద్ధ (స్కేలు) కు మరో కొసలో అభివృద్ధి పాలన కనిపిస్తుంది. అభివృద్ధిపాలనలో పనిచేస్తున్న ఉద్యోగిబృందం సృజనాత్మకత, కలిగి, దేశాభివృద్ధి, సమాజాభివృద్ధి వైపు పయనిస్తూ, ప్రజల యోగక్షేమాలను కాపాడుతూ, వ్యవస్థను స్థిరంగా నిలిపి ఉంచాల్సి ఉంటుంది. ప్రజల ఆలోచనలలో, భావాలలో, ప్రవర్తనలో మార్పులు కూడ తేవాల్సి ఉంటుంది. ప్రజల భాగస్వామ్యం లేని అభివృద్ధిని సాధించుట కష్టం. అందుకని ప్రజామోదం, భాగస్వామ్యం అభివృద్ధికి అవసరం. అభివృద్ధి కాముకత, అనుకూల ఆలోచనా-అభివృద్ధి ఉద్యోగిస్వామ్యానికి ఉండాల్సిన అవసరమైన లక్షణాలు. సాంప్రదాయ పాలనకొక ఉద్యోగిస్వామ్యం, అభివృద్ధి పాలనకు మరొక ఉద్యోగిస్వామ్యం అవసరమా? అనే ప్రశ్న, ఈ సందర్భంలో తలెత్తుతుంది. అనగా, ఉద్యోగిస్వామ్య నిర్మాణం (Structure), ప్రవర్తన (Behaviour) లో మార్పు అవసరమా?

BRAOU

వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం ఆలస్యానికి, నియమ నిబంధనల కట్టుబాటుకు, యధాతథస్థితి కొనసాగింపుకు పిరికితనానికి, జంకుకు - పెట్టింది పేరు. ఈ లక్షణాలు అభివృద్ధికి అవరోధాలు. ప్రజలకు, ముఖ్యంగా, గ్రామీణ, నిరుపేద, నిరక్షరాస్య - ప్రజలకు సేవలందించుటలో `లాంఛనత్వాన్ని' పట్టుకొని ప్రాకులాడే వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్య లక్షణాలు కలిగిన - ఉద్యోగులు - పురోభివృద్ధికాముకులు కారని, తిరోగమన వాదులని వాదన ఉండదనే ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనకు `వెబర్ నమూనా' పనికిరాదనే మాట కూడా వినబడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, అభివృద్ధి చెందిన, చెందుతున్న సమాజాలలో వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యమే ప్రత్యక్షమవుతుంది. అది

a) పని విభజన
b) అధికార పరంపర
c) నియమనిబంధనల కట్టుబాటు
d) అమూర్తిమత్వం
e) పోటి పరీక్షల ద్వారా ఉద్యోగాల ఎంపిక

ముఖ్యమైన లక్షణాలుగా కలిగి ఉంటుంది.

అనగా, భారతదేశంలోని ప్రభుత్వోద్యోగి రెండు రకాల ప్రపంచాలలో నివసించాల్సి వస్తుంది. తన కార్యాలయం, నియమనిబంధనలు, ఫైళ్ళు ఒక ప్రపంచం కాగా, దినదినం పెరుగుతున్న ప్రజల ఆశలు, కోరికలు, వారి ప్రయోజనాల రక్షణార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమాలు వాటి అమలు - మరో ప్రపంచం. మొదట ప్రపంచానికి, రెండవ ప్రపంచానికి - ప్రవర్తనలో - వ్యత్యాసముంది. యథాతథస్థితి కొనసాగింపు మొదటి ప్రపంచంలో ముఖ్యంకాగా, మార్పు, సానుభూతి, అభివృద్ధి కాముకత- రెండవ ప్రపంచంలోని యదార్థస్థితి.

హేతుబద్ధత, అమూర్తిమత్వం, అధికారం, మరియు మార్పులేక ఫలితాల కొరకు పాటు పడుట - అనేవి ఉద్యోగుల ప్రవర్తనలో ఉండాల్సిన భాగాలుగా పేర్కొనవచ్చును. ఇవి అభివృద్ధిని శాసించే కారకాలుగా పేర్కొనబడుతున్నవి. ఇవి ప్రజలకు, ప్రజా కార్యక్రమాల అమలుకు అనుకూలంగా వుంటే అభివృద్ధి సాధ్యమని, ప్రతికూలంగా వుంటే అభివృద్ధి అనుమానాస్పదమని భావింపబడుతుంది. ఈ ప్రవర్తనాంశాలను, భారతదేశ నేపథ్యంలో, కొన్ని పరిశోధనాధ్యయనాలు పరిశీలించినవి. అవి ఇప్పుడు తెలుసుకుందాం :

## 9.8 కొన్ని పరిశోధనలు - ఫలితాలు - సంక్షిప్తంగా

అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ప్రగతిపాలన రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రవర్తనాంశములకు సంబంధించి కొన్ని అధ్యయనాలు చేపట్టబడినవి. వాటి ఫలితాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం :

రాల్ఫ్ బ్రేయాంతి, అతని అనుచరులు Asian Bureaucratic System in 1966 అనే తమ ఉద్గ్రంథంలో "భారతదేశంలోని ఉద్యోగిస్వామ్యం బ్రిటీష్ పాలన నాటి విలువలను యింకా పట్టుకొని ప్రాకులాడుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం వున్న ప్రవర్తనలో కొట్టొచ్చే మార్పులేవి కనిపించుట లేదు" అని పేర్కొన్నది. మరో అధ్యయనంలో రజనీ కొఠారి, రామ్‌ప్రేరాయ్, భారతదేశంలోని ఉద్యోగిస్వామ్యం నిన్నటి (బ్రిటీష్ ప్రభుత్వ కాలంనాటి) వలెనే నియమనిబంధనాల యెడల ఆరాధనా భావం, పై అధికారుల ఆజ్ఞలకై ఎదురుచూపు, ఉష్ట్ర పక్షివలె మారుతున్న వాతావరణ పరిస్థితుల నుండి తల దాచుకొనే దృక్పథం కలిగి ఉన్నదని వ్యాఖ్యానించారు. కులదీప్ మాథుర్ బ్లాక్ అభివృద్ధి అధికారులపై నిర్వహించిన అధ్యయనంలో "అభివృద్ధేతర కార్యక్రమాల యెడలనే వారి ధ్యాస ఎక్కువ అని తేల్చాడు. రామ్‌ప్రేరాయ్ తన స్వంత అధ్యయనంలో "స్వంత నిర్ణయాలు తీసుకొనుటలో స్వేచ్ఛనిచ్చే సాంప్రదాయం లేనందున, ఉద్యోగులు తమ అనుభవాన్ని ఉపయోగించి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయలేకపోతున్నారనే" అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు. H.R. చతుర్వేది తన అధ్యయనంలో "శాంతి, భద్రతలు, పన్ను వసూలునకై ఏర్పాటు చేయబడిన ఉద్యోగిస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుటకు సరిపడదని" తేల్చాడు. N.K. సింఘీ, "ప్రస్తుత ఉద్యోగిస్వామ్యం జాతీయాభివృద్ధి లక్ష్యాలను సాధించుటకై అనువుగా మలచబడలేదని, అది అధికార కేంద్రీకరణ, హోదా యెడల శ్రద్ధకలిగి ఉన్నదని" ముగించాడు. R.B. Jain, P.N. Chaudari తమ Bureaucratic Values in Development అనే అధ్యయనంలో క్రమబద్ధీకరణ పాలన, అభివృద్ధి పాలనా రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల దృక్పథాలు, విలువలు, భావనలకు సంబంధించిన - తులనాత్మక అధ్యయనంలో - ఇరురంగాలలో పనిచేస్తున్న వారిలో వెబర్ నమూనాలో ప్రతిపాదించిన `లాంఛనత్వం' అధిక భాగం కనిపించినట్లుగా పేర్కొన్నారు.

BRAOU

## 9.9 సారాంశం

క్రమబద్ధీకరణ పాలన, అభివృద్ధి పాలన వేరు వేరనే విషయం నిర్వివాదాంశం. అందుకని ఈ రెండు రకాల పాలనలకు రెండు వేరు వేరు రకాల ఉద్యోగిస్వామ్యాలు అవసరమా అనే ప్రశ్న తలెత్తుంది. వెబర్ ప్రతిపాదిత `అదర్శ నమూనా' అభివృద్ధి పాలనావసరాలు తీర్చగలదా, లేదా అనే ప్రశ్నకు జవాబు కనుగొనుటకై భారతదేశంలో చేపట్టిన పరిశోధనలు ఏకకంఠంతో వెబర్ నమూనాకు మార్పులు, చేర్పులు అవసరమని తేల్చాయి. ఇవి నిర్మాణంలో, ప్రవర్తనలో రావాలని పేర్కొన్నాయి. క్షేత్రస్థాయిలో క్రమానుగత శ్రేణిలోని అంచెలు తగ్గించుట, అభివృద్ధి కార్యక్రమాల అమలు పనులు నిర్వహించే ఉద్యోగులకు `అక్కడికక్కడే ' నిర్ణయాలు తీసుకునే అధికారం కల్పించుట, నిరంతర శిక్షణా కార్యక్రమాల ద్వారా సమాజాభివృద్ధి, ప్రజాశ్రేయస్సు, అభివృద్ధి లక్ష్యాల సాధన, ప్రజాసేవ - భావాలను నూరిపోయుట తేవాల్సిన నిర్మాణపర, ప్రవర్తనా పర మార్పులు, అనగా నూతన భావాలు గల నూతన ఉద్యోగిస్వామ్యం New - Look Bureaucracy అవసరమన్నమాట.

## 9.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I** ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు **30** పంక్తులలో రాయండి

1. "వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం ప్రగతిపాలనకు సరైన సాధనం కాదు"
2. భారతదేశంలో ఉద్యోగిస్వామ్యం పై చేపట్టిన పరిశోధనల ఫలితాలను పేర్కొనుము.

**II** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబులు రాయండి

1. క్రమబద్ధీకరణ పాలనకు, అభివృద్ధి పాలనకు మధ్యగల వ్యత్యాసాలు
2. అభివృద్ధి పాలనకు చేపట్టే ఉద్యోగిస్వామ్యంలో అవసరమైన సంస్థాపర, ప్రవర్తనా పర మార్పులు.

BRAOU

## 9.11 చదువదగిన రచనలు


1. F.W. Riggs, (ed) : Frontiers of Development Administration, (Durham, N.C., 1970)

2. F.W. Riggs : The Ecology of Development (Bloomington, Indian University Press, 1964)

3. Joseph La Palombara, : Bureauoracy Political Development (Princeton University Press, 1963.


**రచయిత : పంజాల నరసయ్య**

# భాగం - 10 : ప్రగతి పాలన - నిబంధనల పాలన

## విషయక్రమం

10.0 లక్ష్యాలు
10.1 పరిచయము
10.2 సాంప్రదాయ, ప్రగతి పాలనకు మధ్య గల వ్యత్యాసం
10.3 భారతదేశంలో నిబంధనల పాలన లక్షణాలు
10.4 భారతదేశంలో చేపట్టిన ప్రగతి పాలనా చర్యలు
10.5 సారాంశం
10.6 నమూనా పరీక్షా ప్రశ్నలు
10.7 చదువదగిన రచనలు

## 10.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

* సాంప్రదాయ పాలన నిబంధనల పాలన, ప్రగతిపాలనల మధ్య గల వ్యత్యాసం
* నిబంధనల పాలన లక్షణాలు
* భారతదేశం చేపట్టిన ప్రగతి పాలనా చర్యలు తదితరముల గురించి తెలుసుకుంటారు.

BRAOU

## 10.1 పరిచయము

"పాలన", ఒక శాస్త్రంగా అభివృద్ధి చెందే క్రమంలో అనేక దశలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. మొట్టమొదట ఉడ్రోవిల్సన్ తన "పాలనా అధ్యయనం" అనే వ్యాసంలో నిర్వచించిన "రాజకీయ - పాలనా ద్విబాగత్వం" తో ఆవిర్భవించిన పాలనా శాస్త్రం, నేడు వివిధ మార్పులకు లోనైంది. లూథర్ గల్లిక్, మాక్స్ వెబర్, ఉర్విక్, ఫైలర్ వంటి సంప్రదాయ రచయితలు రూపొందించిన ఉద్యోగి స్వామ్యం, వ్యవస్థా సూత్రాలు, అప్పటి పాలనా వ్యవస్థలకు శాస్త్రీయమైన సిద్ధాంత ప్రాతిపదికను కల్పించడానికి ప్రయత్నించాయి. ఆ తరువాత వ్యవస్థలోని నిర్ణయీకరణ ప్రక్రియలను, మానవ సంబంధాలను, అధికార ఉనికిని, పాలనా ప్రవర్తనను గురించి హెర్బర్ట్ సైమన్, చెస్టర్ బెర్నార్డ్, ఫాలెట్ వంటి రచయితల ఆలోచనా క్రమం నుంచి పాలన ఒక శాస్త్రంగా రూపుదిద్దడానికి ప్రయత్నం చేసింది. ఆ తరువాత పాలనా వ్యవస్థలను విస్తృతంగా పరిశీలించిన రిగ్స్ ఆవరణ దృక్పథం ద్వారా విషయాంతర ప్రాతిపదికలను పాలనలో ప్రవేశ పెట్టినాడు.

పాలనలో నైతేనేమి, పరిసరాలలో జరుగుతున్న ప్రాపంచిక సామాజిక, ఆర్థిక సాంఘిక పరిమాణాలవల్ల నైతేనేమి, పాలనా శాస్త్రాలు "ప్రగతి" కొరకు ఉద్దేశించబడినవి అనే భావన బలపడడం. ప్రగతిపాలన ఆవిర్భవానికి దారి తీసింది. పాలనా సిద్ధాంతాలు, నిర్మాణాలన్ని పాశ్చాత్య దేశాలలో అభివృద్ధి పరచబడి, ఆ దేశాలలో పాలనా వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడినాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో సంభవించిన అనేక పరిణామాలు ప్రగతిపాలన సిద్ధాంతం అవతరణకు తోడ్పడ్డాయి. రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఆవిర్భవించిన తృతీయ ప్రపంచ దేశాలపై ఆధిపత్యానికై అమెరికా, రష్యా దేశాలమధ్య ప్రారంభమైన అంతర్యుద్ధం, ఐక్యరాజ్యసమితి, అమెరికాలు వర్ధమాన దేశాలలో చేపట్టిన సాంకేతిక సహాయ పథకాలు, బహుళ సంస్కృతుల, శాస్త్రాల పరిశోధనల పట్ల పెరుగుతున్న ధోరణి ప్రభుత్వపాలన సిద్ధాంతీకరణ, నమూనా నిర్మాణంలో గణనీయమైన మార్పులను ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఆసియా, ఆఫ్రికా, లాటిన్, అమెరికా దేశాలు వలస రాజ్య విముక్తి పొంది, తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి నూతన వ్యవస్థలను ఏర్పరుచుకోవలసి వచ్చింది. ఆ దేశాలు అప్పటికే అభివృద్ధి పరచబడిన పాశ్చాత్య దేశాలపాలనా వ్యవస్థ పద్ధతులను ఎంపిక చేసుకొని, తమ దేశాలలో ప్రవేశ పెట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చేయడం జరిగింది. ఈ ధోరణి ప్రధానంగా 1955-63 ల మధ్య ఉధృతమైంది. అయితే పాశ్చాత్యదేశాల పాలనా వ్యవస్థ పద్ధతులు మూడవ ప్రపంచ దేశాలలో విఫలం కావడం జరిగింది. ఈ విధంగా పాశ్చాత్యదేశాల పాలనా నమూనాలు, పద్ధతులు, వర్ధమాన దేశాలలో సరిపడక పోవడానికి గల కారణాలగురించి వివిధ శాస్త్రజ్ఞులు ముఖ్యంగా తులనాత్మక పాలనా సంస్థవారు ఫోర్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిపిన వివిధ పరిశోధనలలో అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల పాలనా అనుభవం వర్ధమాన దేశాలకు ఏ మాత్రం ఉపయోగపడదని తెలిసింది. ముఖ్యంగా F.W. రిగ్స్, వాల్ట్, స్కాపర్ సిఫిన్ మొదలైన రచయితలు చేసిన పరిశోధనలు ఈ విషయం గురించి కూలంకషంగా చర్చిస్తాయి. పాలనా ఆవరణం, అభివృద్ధి చెందిన, వర్ధమాన దేశాలలో భిన్నంగా ఉన్న ఫలితంగా పాశ్చాత్య దేశాలు రూపొందించిన పాలనా నమూనాలు, పద్ధతులు, వర్ధమాన దేశాలలో విజయవంతమైన ఫలితాలను ఇవ్వలేక పోయినాయి. అందువలన వర్ధమాన దేశాల అభివృద్ధికి పనికి వచ్చే పాలనా యంత్రాంగాల నిర్మాణానికి సంబంధించి వివిధ శాస్త్రజ్ఞులు పాలనా నమూనాలను అన్వేషించడానికి ప్రయత్నాలు చేయడం జరిగింది. ఈ అన్వేషణలు ప్రగతి పాలనా భావనా ఆవిర్భావానికి దారితీసింది.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంకాక ముందు వరకు కేవలం శాంతి భద్రతల పరిరక్షణ, పన్నుల వసూలుకే పరిమితమైన నిబంధనాత్మక పాలనా యంత్రాంగం వర్ధమాన దేశాలలో ప్రగతి భావన వ్యాప్తి ఫలితంగా ప్రగతి సాధనకు ఉద్దేశించబడిన కార్యక్రమాల నూతన సవాళ్ళను ఎదుర్కొనడానికి సిద్ధంగా లేదు. అందువలన వర్ధమాన దేశాల పాలనా యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించి, ప్రగతి కార్యక్రమాల ఆశయ సాధనాల కనుగుణంగా పాలనా యంత్రాంగం శక్తియుక్తులను, ప్రతిభా పాటవాలను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టడం జరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రగతిని సాధించడానికి ఉద్దేశించబడిన పాలనా యంత్రాంగాన్ని "ప్రగతి పాలన" గా పేర్కొనడం జరగుతున్నది. ఎడ్వర్డ్ వీడ్నర్, F.W.రిగ్స్, జోసఫ్ లాపలంబర్, ఆల్బర్ట్ వాటర్సన్ వంటి అనేక మంది పాశ్చాత్య రచయితలు ప్రభుత్వ పాలనలో ప్రగతిపాలనా భావాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

ఈ పాఠ్యాంశంలో రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఉన్న సంప్రదాయ పాలన (Traditional Administration) కు, ప్రగతిపాలనకు గల వ్యత్యాసాన్ని, బ్రిటీషు పరిపాలన కాలంలో భారతదేశంలో ఉన్న నిబంధనాత్మక పాలన (Regularty administration) లక్షణాలను, స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో చేపట్టిన ప్రగతి పాలనా చర్యల గురించి వివరించబడుతుంది.

BRAOU

## 10.2 సాంప్రదాయ పాలనకు, ప్రగతిపాలనకు మధ్యగల వ్యత్యాసం

ప్రభుత్వ పాలనా శాస్త్ర రచయితలు ప్రగతి పాలన భావనకు స్పష్టత సమకూర్చేందుకు, ప్రగతి పాలనను, సంప్రదాయ పాలన నుంచి విభజన చేసేందుకు ప్రయత్నించారు. ఈ రెండు పాలనల మధ్యగల వ్యత్యాసాన్ని జార్జి గాన్ట్ (George Gant), ఫెరిల్‌హెడ్డీ (Ferrel Heady) వంటి రచయితలు వివరించారు. కొన్ని అంశాలలో రెండు పాలనల మధ్య సారూప్యత ఉన్నప్పటికీ, అనేక అంశాలలో అవి విభేదిస్తున్నాయని వారు పేర్కొన్నారు. తమ లక్ష్యాల నిర్వహణలో అనుసరించే పాలనా విధానాలు, నియమ నిబంధనలు, పద్ధతులు, ప్రమాణాల విషయంలో సాంప్రదాయపాలన, ప్రగతి పాలనల మధ్య సామీప్యం ఉన్నది. కాని లక్ష్యాల పరిధి, సంక్లిష్టతలు నవకల్పనాతత్వం (Innovativeness) మొదలైన అంశాలలో ప్రగతిపాలన, సాంప్రదాయ పాలనతో ఖచ్చితంగా విభేదిస్తుంది. సంప్రదాయ పాలన పరిధి, ఆశయాలు అతిసాధారణమైనవి కాగా, ప్రగతి పాలన ఆశయాలు, పరిధి సంక్లిష్టమైనవి. జాతి నిర్మాణం, సామాజిక, ఆర్థిక ప్రగతిసాధన కొరకు పథకాలను, ప్రణాళికలను, అమలు పరచడం ప్రగతిపాలనలో ప్రధాన లక్ష్యం కాగా, శాంతి భద్రతలను పరిరక్షించడం, వనరుల సేకరణ, సంప్రదాయపాలన ప్రధాన కర్తవ్యాలు. సంప్రదాయ, ప్రగతి పాలనల మధ్యగల వ్యత్యాసాలను S.P. వర్మ మరియు S.K. శర్మ అనే రచయితలు ఈ క్రింది విధంగా వివరించారు.

| సాంప్రదాయ పాలన | ప్రగతి పాలన |
|---|---|
| 1. నిబంధనాత్మక పాలన, ఇది యధావిధి (routine) కార్యక్రమాలను నిర్వహిస్తుంది. | 1. త్వరితగతిన మార్పుకు లోనౌతున్న వాతావరణంలో ఊహించ శక్యంకాని నూతన పనులకు, సమస్యలకు సంబంధించినవి. |
| 2. సమర్థత మరియు మిత వ్యయానికి ప్రాధాన్యతను ఇస్తుంది. వ్యక్తి సామర్థ్యం పై దృష్టిని చూపుతుంది. | 2. లక్ష్యసాధనలో వ్యవస్థ పెరుగుదల మరియు సమర్థత పై దృష్టిని చూపుతుంది. పని సమూహాల సమర్థతపైన, వివిధ పని సమూనాలు కలిసి పనిచేయడం పైన దృష్టినిచూపుతుంది. |
| 3. నియమాలకు, పద్ధతులకు లోబడి పనులను నిర్వహించడానికి ఉద్దేశించబడినది. భద్రతకు, అధికారానికి, హోదాకు ప్రాధాన్యతను ఇస్తుంది. | 3. ఉన్నత కార్యక్రమ ప్రమాణాల పై దృష్టిని చూపుతుంది. పనుల నిర్వహణలో ఉత్పన్న మయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఆసక్తిని నవకల్పనను, మరియు మార్పును ప్రోత్సహిస్తుంది. |
| 4. విశాలమైన క్రమానుగత పాలనా నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ధృడత్వాన్ని, అధికారతత్వాన్ని అపనమ్మక వాతావరణాన్ని కలిగి ఉంటుంది. | 4. లక్ష్యాల సాధనకు అనుగుణంగా వ్యవస్థా నిర్మాణాన్ని రూపొందించబడుతుంది. వ్యవస్థలో పని చేసే వ్యక్తుల మధ్య విశ్వాసం, నమ్మకం, మార్పులకు గురి అవుతున్న వారి పాత్రలతో వ్యవస్థ నిర్మాణం సరళత లక్షణాన్ని కలిగి ఉంటుంది. |

BRAOU

| | |
|---|---|
| 5. నిర్ణయాకరణ కేంద్రీకృతమై ఉంటుంది. సమస్యల పరిష్కారంలో పాత అనుభవాలను ప్రధాన సూచనలుగా ఉపయోగిస్తారు. | 5. నిర్ణయీకరణ ఏకలక్షధోరణి కలిగి ఉండక, విశాల ప్రతిపాదికగా చేపట్టడం జరుగుతుంది. నిర్ణయీకరణలో మెరుగుపరచబడిన పద్ధతులను, సమస్యల పరిష్కారానికి ప్రయోగాత్మక భావనను పాటించడం జరుగుతుంది. |
| 6. హోదాను కొనసాగించడానికి దృష్టిని కేంద్రీకరిస్తుంది. వ్యవస్థీకరణ మార్పును ప్రతిఘటిస్తుంది. | 6. పాలనా వాతావరణ డిమాండులకు అనుగుణంగా ప్రతిస్పందించడానికి వ్యవస్థలను నిరంతరం అభివృద్ధి పరుస్తుంది. వ్యవస్థను మార్పులకు గురి అయ్యే విధంగా శక్తి వంతమైన, చురుకైనదిగాను, భవిష్యత్ దృష్టిలో అభివృద్ధి పరుస్తుంది. |

సామాజిక స్థిరీకరణను కొనసాగించడానికి, న్యాయసంబంధ అవసరాలను తీర్చడానికి సంప్రదాయ పాలన ప్రాధాన్యత ఇస్తుంది. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు, శిస్తును వసూలు చేయడానికి, రాజ్యాంగ పరిధిలో జాతీయ జీవాన్ని కొనసాగించేటట్లు చట్టాలను, నిబంధనలను రూపొందించడం వంటి చర్యలకు మాత్రమే సంప్రదాయ పాలన పరిమితమై ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రగతి పాలన స్వాతంత్ర్యానంతర దశలో మాత్రమే ప్రారంభమైంది. అనగా ఈ దేశాలలో వలసకాలం నాటి పాలనను సాంప్రదాయ పాలన గాను వలసకాలనాంతరం ఉన్నపాలనను ప్రగతి పాలనగాను పరిగణించవచ్చును. అయితే ఈ రకమైన విభజన పూర్తిగా వాస్తవమైనది కాదు. ఎందుకంటే, కొన్ని దేశాలలో వలస ప్రభుత్వాలు కొన్ని అభివృద్ధి పథకాలను, ప్రగతి సాధనా కార్యక్రమాలను అమలు చేశాయన్న వాస్తవాన్ని విస్మరింపజాలము. అదే విధంగా వలసపాలనకు లోనుకాని కొన్ని స్వతంత్ర దేశాలలో చాలా కాలం వరకు ప్రగతి సాధనా కార్యక్రమాలు చేపట్టబడలేదు. అందువలన అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలసకాలంలోని పాలనను శాంతి భద్రతలకే పరిమితమైన సంప్రదాయ పాలనగాను, స్వతంత్ర్యానంతరం ఆ దేశాలలో ఏర్పడిన పాలనను ప్రగతి పాలనగా పరిగణించడం సక్రమమైనది కాదని కొందరి విమర్శకుల అభిప్రాయం.

BRAOU

సంప్రదాయ ప్రభుత్వపాలన గణాత్మక లక్ష్యాలకు, అనగా పాలనా నియమనిబంధనల అమలుకు ప్రాధాన్యత యివ్వగా, ప్రగతి పాలన ప్రజల మద్దతు, సహకారం వంటి గుణాత్మక లక్ష్యాలకు ప్రాధాన్యతను ఇస్తుంది. ప్రగతిపాలన సంప్రదాయ పాలన మాదిరిగా అంతర్గత ప్రక్రియలకు మాత్రమే పరిమితమైనది కాదు. ప్రగతిపాలనలో కేంద్ర నిర్మాణం కంటే బాహ్య అంశాలైన ప్రత్యేకీకరణ చెందిన వ్యక్తులు, స్థానిక స్థాయి సంస్థల, ప్రజల సంబంధాలకు ప్రాముఖ్యతను యివ్వడం జరుగుతుంది. ప్రగతిపాలన, పాలనా నిర్మాణం, పద్ధతులకన్నా, పాలనా ప్రవర్తనకు, పాలనా చర్యలకు ప్రాధాన్యతను ఇస్తుంది.

సంప్రదాయ, ప్రగతిపాలన ద్విభాజిత్వాన్ని W.Wood వంటి రచయితలు ఈ క్రింది కారణాల మూలంగా అంగీకరించలేదు :

(1) ప్రగతి పాలనలో కొన్ని వ్యవస్థలు అభివృద్ధి సంస్థలు, మరికొన్ని సంస్థలు అభివృద్ధేతర సంస్థలుగా పరిగణించబడుతాయి. ఈ విధంగా ఖచ్చితంగా విభజించటం సహేతుకంకాదు. ఈ విభజన ప్రభుత్వ ఉద్యోగులను కూడా సంప్రదాయ బద్ధులు, ప్రగతి కారకులుగా విభజించి, ప్రగతి కారకులకు ప్రాముఖ్యతను కల్పిస్తుంది. ఈ కారణం వలన ప్రభుత్వ ఉద్యోగులలో సుస్థితి దిగజారే ప్రమాదం ఉంది.

(2) నవకల్పనాతత్వం, నూతన పాలనా నమూనాల రూపకల్పన విస్మరించబడుతుంది.

(3) ప్రగతిపాలన కేవలం అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రమే వర్తిస్తుందనే భావన వల్ల ప్రగతిపాలనా భావన ఉపయుక్తత, విలువ క్షీణించే ప్రమాదం ఉంది. వాస్తవ పరిస్థితులలో పూర్తిగాప్రగతి శీలకమైన పాలనా వ్యవస్థలు, పూర్తిగా ప్రగతి శీలకం గాని పాలనా వ్యవస్థలు మనకు గోచరించవు.

సంప్రదాయ, ప్రగతిపాలనల మధ్యగల సామీప్యం గురించి కూడా V.A. Pai Panandikar ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

1. ప్రగతి పాలన పటిష్టత మరియు బలహీనతలపై సంప్రదాయ పాలన వ్యవస్థ నిర్మాణం నిర్ధిష్టమైన ప్రభావాన్ని చూపుతుంది.

2. ఈ రెండు పాలనలు ప్రభుత్వ నిర్మాణం నుంచే అధికారాన్ని పొందుతాయి. ఉదాహరణకు మంత్రిమండలి శాసన సభకు బాధ్యత వహించవలసి ఉండడం.

3. ప్రభుత్వపాలనలో విధులను నిర్వహించే అనేక మంది అధికారులు సంప్రదాయ, మరియు ప్రగతి పాలనా విధులను కలిగి ఉంటారు. ఉదాహరణకు డివిజినల్ కమీషనర్లు, జిల్లాకలెక్టర్లు.

4. ప్రజలు ప్రభుత్వ పాలన సామర్థ్యాన్ని మొత్తం పాలనా చర్యల ప్రాతిపదికగా నిర్ధారిస్తారు. ప్రజలు సంప్రదాయ, ప్రగతిపాలన మధ్యగల వ్యత్యాసాన్ని గుర్తించరు.

BRAOU

సాంప్రదాయ, ప్రగతి పాలన ద్విభాజత్వం పై వివిధ రచయితలు వెలువరిచిన భిన్న ధోరణులు అసంపూర్తి చర్చకు దారితీస్తున్నది. అయినప్పటికి ప్రగతి లక్ష్యాల సాధనకు ఉద్దేశించిన పాలనను ప్రత్యేకంగా అధ్యయనం చేసి వివరించ వలసిన అవసరం ఉన్నది. సాంప్రదాయ పాలన యొక్క విధులుగా పిలువబడే శాంతి భద్రతల పరిరక్షణ, పన్నులు వసూలు వంటి విధుల నిర్వహణలో అసమర్థత చోటు చేసుకున్న ఫలితంగా నూతనమైన, ప్రత్యేకమైన అభివృద్ధి ఏజన్సీలను ఏర్పాటు చేయవలసి వస్తున్నవి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో ప్రగతి పాలనా దృష్టితో డిప్యూటి డెవలప్ మెంట్ కమీషనర్, జిల్లా అభివృద్ధి అధికారులను నియామకం చేయడం జరుగుతున్నది. ప్రగతి పాలన, ప్రభుత్వ పాలన యొక్క పర్యాయ పదం కాదని Gant అనే రచయిత ఈ క్రింది వాక్యాల ద్వారా వివరించాడు:

"ప్రగతిపాలనను, ప్రభుత్వపాలన నుంచి విభజించవచ్చును. శాంతి భద్రతల పరిరక్షణ తప్పనుండా ప్రభుత్వం యొక్క ప్రధాన విధి. ప్రగతి సాధనకు అది మూలం కూడా. అయితే ఈ విధి ప్రగతిపాలన పరిధిలోకి రాదు. అదే విధంగా ప్రభుత్వపాలన నిర్వహించే అత్యవసర ప్రసార సౌకర్యాల కల్పన, విద్యా , సౌకర్యాల కల్పన, న్యాయవ్యవస్థ నిర్వహణ ప్రగతి పాలనపై ప్రభావాన్ని చూపినప్పటికీ ఈ పాలనా చర్యలను ప్రగతిపాలనలో అంతర్గత భాగంగా పరిగణించబడవు".

ప్రగతిపాలన, సంప్రదాయ పాలనల ద్విభాగత్వ చర్య వల్ల వెల్లడయ్యే వాస్తవం ఏమిటంటే ఈ రెండు పాలనా వ్యవస్థల మధ్య స్పష్టమైన, ఖచ్చితమైన విభజన సాధ్యంకాదు. ఈ విధమైన విభజన అవాస్తకమైనది, అవసరమైనది. ఈ ద్విభాగత్వం ఊహాత్మక పరిస్థితులలో అర్థవంతమైందే తప్ప వాస్తవ పరిస్థితులలో అర్థరహితమైనది. రాజకీయ-పాలనా ద్విభాగత్వం మాదిరే ప్రగతి పాలన, సాంప్రదాయ పాలనల ద్విభాగత్వం కూడా దోషపూరితమైనదే. ఎందుకంటే ఒక సన్నివేశంలో ప్రగతి శీలకమైన వ్యవస్థ, మరొక సన్నివేశంలో ప్రగతి శీలక వ్యవస్థ, కాకపోవచ్చును. ఏ పాలనా వ్యవస్థ పూర్తిగా అభివృద్ధేతర వ్యవస్థకాదు. ఇదే విధంగా వలసపాలనా కాలంలోని పాలనా వ్యవస్థను అభివృద్ధేతర సాంప్రదాయ పాలనా వ్యవస్థగా, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన పాలనా వ్యవస్థను ప్రగతి పాలనగా భావించడం కూడా సరికాదు. ఏమైనప్పటికి ప్రభుత్వ పాలనా శాస్త్రసాహిత్యంలో ప్రగతిశీలక, రాజకీయ, సామాజిక లక్ష్యాల సాధనలో నిమగ్నమైన, ఆచరణలో నవకల్పనాతత్వం కలిగిన పాలనా వ్యవస్థలను ప్రగతి పాలనగా భావించడం జరుగుతుంది. ఈ లక్షణాలను కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనా వ్యవస్థలను ప్రగతిపాలనగా భావించడం సమంజసం.

ఈ క్రింది విభాగాలలో భారతదేశంలో వలసపాలన కాలంలో ఉన్న బ్రిటీషుపాలన సాంప్రదాయ లక్షణాలను, స్వాతంత్ర్యానంతరం చేపట్టిన ప్రగతి పాలనా చర్యల గురించి చర్చిస్తాం.

## 10.3 భారతదేశంలో నిబంధనాత్మక పాలన లక్షణాలు :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలసకాలం నాటి పాలనను సాంప్రదాయ పాలనగా పరిగణించ బడుతున్నది. సాంప్రదాయ పాలన నిబంధ నాత్మకమైనది. పాలనా నియమాలకు, పద్ధతులకు, అధికారానికి, హోదాకు, భద్రతకు లోబడి పనులను నిర్వహించడానికి ఈ పాలన ఉద్దేశించబడినది. అందువలన సాంప్రదాయ పాలనను, నిబంధనాత్మక పాలన (Regulatory administration) గా భావించవచ్చును. నిబంధనాత్మక పాలనా పరిధి పరిమితంగా ఉండి, కేంద్రీకృత పాలనా లక్షణాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటీషు పాలన పై లక్షణాలను కలిగి ఉండడం వలన, బ్రిటీషు పాలనను నిబంధనాత్మక పాలనగా పేర్కొనడం జరిగింది. బ్రిటీషు పాలన లక్షణాల గురించి వివరంగా చర్చిస్తాం.

BRAOU

బ్రిటీష్ వారు భారతదేశానికి రాకపూర్వమే పోర్చుగీసు వారు, డచ్ వారు వచ్చి వ్యాపారం చేస్తూ ఉండేవారు. భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యాపార నిమిత్తం గుత్తాధిపత్యం కల్పిస్తూ క్రీ. శ. 1600 సంవత్సరపు చివరి రోజున ఎలిజబెత్ రాణి ఆజ్ఞా పత్రం (Charter) మీద సంతకం చేసింది. ఈస్ట్ ఇండియా కంపెనీ పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్ వారితో యుద్ధాలు చేసి ఓడించి కీ.శ. 1773 నాటికి భారతదేశంలో తన ఆధిక్యతను నెలకొల్పింది. అనగా కీ.శ. 1773 సంవత్సరానికి ముందు భారతదేశంలో కేంద్రీకృత అధికారంలేదు. బ్రిటీషువాళ్లు మనదేశాన్ని పరిపాలించిన సుమారు రెండువందల సంవత్సరాలలో, వందసంవత్సరాలు అంటే 1757 నుంచి 1858 వరకు ఈస్ట్ ఇండియా కంపెనీయే భారతదేశాన్ని పాలించింది. తరువాత 1858 నుంచి1947 లో స్వాతంత్ర్యం వచ్చేటంతవరకు బ్రిటీషు ప్రభుత్వం వైస్రాయ్ మరియు గవర్నర్-జనరల్ ద్వారా పాలన కొనసాగించింది.

### భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన మొదట్లో వ్యాపారోన్ముఖ సరళితో జరిగేది. కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ (Board of Directors) విధాన రూపకల్పన కర్తగా వ్యవహరించేది. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ సాధారణమైనవి. కంపెనీ

పాలన ప్రారంభంలో ఐదు శాఖలనే కలిగి ఉండేది. ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ప్రత్యేక కార్యదర్శి, వీరందరిపై ఆధిపత్యం కలిగి ప్రధాన కార్యదర్శి ఉండేవారు. ఈస్ట్ ఇండియా కంపెనీ క్రమక్రమంగా వ్యాపార కార్యకలాపాల నుండి సంస్థానాలు (Territories) సంపాదించడం ఆక్రమించడంలో నిమగ్నమైంది. యుద్ధాలు చేసి ఎక్కువ భూ భాగాన్ని ఆక్రమించు కోవడం కంపెనీ ముఖ్య ఆశయంగా ఉండేది. ఈస్ట్ ఇండియా కంపెనీకి పటిష్టమైన పునాది వేయడంలో ``రాబర్ట్‌క్లయివు" (Robert Clive) దోహదం చేశాడు. ఇతని తరువాత ఎందరో గవర్నర్ జనరల్ కంపెనీ ప్రతిష్ఠతను ఇనుమడింప చేసారు. కేంద్రీకృతపాలనా నిర్మాణం, విశాలమైన పాలనా యంత్రాంగం ఉద్యోగి స్వామ్యం కంపెనీ పాలన ముఖ్య లక్షణాలుగా పేర్కొనవచ్చును. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన భారతీయుల యెడ కనబరిచిన నిరాధరణ 1857 లో సిపాయిల తిరుగుబాటుకు దారితీసి బ్రిటీషు ప్రభుత్వం భారతదేశపాలనను ప్రత్యక్షంగా కైవసం చేసికొనుటకు దారితీసింది. బ్రిటీషు ప్రభుత్వ చట్టం 1858 ప్రకారం భారతదేశంలో ప్రభుత్వం, పాలనలపై బాధ్యతాధికారాలను బ్రిటీషు ప్రభుత్వమే స్వీకరించింది. అప్పటినుంచి బ్రిటీషు ప్రభుత్వం భారతదేశాన్ని చక్రవర్తిచే నియమింపబడిన వైస్రాయ్ మరియు గవర్నర్ - జనరల్ ద్వారా పాలించింది. భారతదేశ పాలనకు సంబంధించి బ్రిటీషు పార్లమెంటుకు "సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా" బాధ్యత వహించేవాడు.

## బ్రిటీషు పాలన ఈ క్రింది లక్షణాలను కలిగి ఉండేది :

### 1. కేంద్రీకృత పాలన :

బ్రిటీషు పాలన కేంద్రీకృత లక్షణం మొదటి సారిగా 1773 రెగ్యులేటింగ్ చట్టంలో విశదమవుతాయి. ఈ చట్టం ద్వారా ప్రెసిడెన్సీల అధికారాలను కుదించబడినవి. అదేవిధంగా 1774 పిట్స్ ఇండియా చట్టం మరింత కేంద్రీకరణకు దోహదం చేసింది. దీని ద్వారా కంపెనీ ఇండియా వ్యవహారాలన్ని నియంత్రణ బోర్డును స్థాపించడం ద్వారా బ్రిటీషు ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలోకి తేబడింది. రెగ్యులేటింగ్ చట్టం 1773 తరువాత ప్రతి ఇరవై సంవత్సరాల కొకసారి ఈస్టిండియా కంపెనీకి ఇచ్చిన ఆజ్ఞాపత్రాన్ని (Charter) బ్రిటీషు ప్రభుత్వం చట్టాల ద్వారా పునరుద్ధరించేవి. ఆ విధంగా 1793, 1813,1833 మరియు చివరిగా 1853 లో చట్టాలను చేయడం జరిగింది. మన దేశంలోని కంపెనీ ప్రభుత్వ వ్యవస్థపై బ్రిటీషు ప్రభుత్వానికి ఎక్కువ నియంత్రణాధికారాలు కలిగించడం మరియు కేంద్ర ప్రభుత్వాన్ని మరింత పటిష్టవంతమైనదిగా చేయడం ఈ చట్టాల ముఖ్య లక్షణాలు. బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను 1833లో పెంచి భారత గవర్నర్ జనరల్‌గా చేయడం మరొక కేంద్రీకృత లక్షణంగా పేర్కొనవచ్చును. ఇతని ద్వారా నిర్వహించబడిన ప్రభుత్వాన్నే భారత ప్రభుత్వంగా గుర్తించబడింది. భారతదేశంలో ఉన్న బ్రిటీషువారి ఆస్తులకు వర్తించే విధంగా ప్రభుత్వపాలనా పరిధి నిర్ణయించబడింది.

### 2. ప్రభుత్వ కార్యదర్శి (Secretary of State)

భారత ప్రభుత్వ చట్టం 1858 ద్వారా బ్రిటిషురాణి ఈస్ట్ ఇండియా కంపెనీ నుండి భారత ప్రభుత్వ పరిపాలనను పూర్తిగా హస్తగతం చేసుకున్న తరువాత క్యాబినెట్ మంత్రి హోదాగల ప్రభుత్వ కార్యదర్శి (Secretary of State) అనే నూతన కార్యాలయం, భారతదేశంలో వెలసింది. భారతదేశ ప్రభుత్వ కార్యదర్శి ప్రముఖమైన, శక్తివంతమైన ప్రయోగాత్మగా కొనసాగబడినాడు.

BRAOU

కేంద్రీకృత లక్షణాలతో కొనసాగబడుతున్న భారతదేశ పరిపాలన 1915 ఏకీకరణ చట్టం ద్వారా మరింత ధృవ పరచబడింది. బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల శాసనాత్మక అధికారాలను రద్దుచేయబడ్డాయి. గవర్నర్ జనరలుకు ఆర్థిక విషయాలకు సంబంధించిన అధికారాలు ఇవ్వబడ్డాయి. ఈ విధంగా ప్రాంతీయ ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వ ఆధీన సంస్థలుగా భావించబడ్డాయి. అయితే 1919 చట్టం, 1935 చట్టాలు బ్రిటీషు పాలనలో పాలన వికేంద్రీకరణకు చర్యలు చేపట్టి, ప్రాంతీయ ప్రభుత్వాలకు కొంత స్వేచ్ఛను కల్పించడానికి దోహదం చేశాయి.

## 3. విస్తృత రాజ్య నిర్మాణం :

ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రారంభంలో రహస్య కమిటీ, సెలెక్టు కమిటీల సహాయంతో పనిచేయడం మొదలైంది. పాలనా నిర్వహణలో గవర్నర్ జనరల్‌కు సహాయపడడానికి నలుగురు సభ్యులు గల కౌన్సిలును ఏర్పాటు చేయబడింది. క్రమంగా ప్రభుత్వ శాఖల సంఖ్య పెరిగి విస్తృతమైన పాలనా వ్యవస్థను బ్రిటీషు పాలన సృష్టించింది.

రాజ్యం యావత్తూ రాష్ట్రాలుగా, జిల్లాలుగా మరియు తాలూకాలుగా విభజించ బడ్డాయి. తిరిగి కొన్ని జిల్లాల సమూహాన్ని "డివిజన్లు" గా ఏర్పరచబడ్డాయి. పట్టణాలు ``మున్సిపాలిటీ" పాలనా వ్యవస్థ కలిగి ఉండేవి. ఈ పాలనా యంత్రాంగం శాంతి భద్రతలను పరిరక్షించడానికి అధిక, ప్రాధాన్యతను ఇచ్చేది. రాజ్య నిర్మాణం అణగ ద్రొక్కు స్వభావము కలిగి యుండి, పాలనా పరమైన ఆజ్ఞలను పాటించడంలో క్రూరమైన పద్ధతులు అవలింభించెడిది.

## 4. సమన్యాయ పాలన :

బ్రిటీషువారు వ్యవస్థాపరమైన అవ్యక్తిగత ప్రభుత్వాన్ని స్థాపించారు. ప్రభుత్వ చట్టాలు అందరికీ వర్తించేటట్లు, అధికార దుర్వినియోగానికి అవకాశం లేకుండా, సమన్యాయపాలనను బ్రిటీషు వారు ప్రవేశపెట్టారు.

BRAOU

## 5. పాలనా యూనిట్‌గా జిల్లా:

బ్రిటీషు వారి కాలంలో రాష్ట్రాలు చాలా పెద్దవిగా ఉన్నందున సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో భూమి శిస్తు వసూలు చేసే ఉద్దేశంతో, రాష్ట్రాలను వివిధ జిల్లాలుగా విభజించి, 1786 లో జిల్లాను పాలనా యూనిట్‌గా గుర్తించడం జరిగింది కలెక్టర్‌ను జిల్లాకు అధికారిగా నియమించారు. పన్నులు వసూలు చేయడం, జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడం కలెక్టర్ యొక్క ప్రధాన విధులుగా ఉండేవి.

## 6. స్థానిక ప్రభుత్వం:

లార్డ్ రిప్పన్ 1882 తీర్మానం భారతదేశంలో స్థానిక స్వపరిపాలనా సంస్థల ఆవిర్భావానికి మూలంగా పేర్కొనవచ్చును. గ్రామ ప్రాంతాల అవసరాలను తీర్చుటకు, భారతీయులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించుటకు, అధికారుల ఆధిపత్యాన్ని పాలనలో తగ్గించుటకు స్థానిక స్వపరిపాలనా సంస్థల ఏర్పాటు జరిగింది.

### 7. సమీకృత సివిల్ సర్వీసు వ్యవస్థ :

ఈస్ట్ ఇండియా కంపెనీ తన స్థానాన్ని భద్రపరుచుకొని, రెవెన్యూ వనరులను, అధికంగా రాబట్టుకొనుటకు సమీకృత సివిల్ సర్వీసు ఆవశ్యకతను గుర్తించింది. ప్రభుత్వ సర్వీసులను కవెనెంటడ్, అన్‌కవెనెంటెడ్ సివిల్ సర్వీసులుగా విభజించి, బ్రిటీషు వారిని ఆసర్వీసులలో నియమించి పాలనను కొనసాగించేది. చార్లెస్ అచిసన్ కమిటి సివిల్ సర్వీసులను ఇంపీరియల్ సర్వీసులు, రాష్ట్రీయ సర్వీసులు, ఆధీన సర్వీసులుగా విభజించాలని సిఫారసు చేసింది. ఈ సర్వీసుల భర్తీ కొరకు 1926 లో పబ్లిక్ సర్వీసు కమీషన్ ప్రారంభించబడింది. ఈ విధంగా అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనను పటిష్ఠవంతంగా నిర్వహించడానికి సివిల్ సర్వీసుల భర్తీవిధానం ప్రవేశపెట్టబడింది. బ్రిటీషువారు అధిక కేంద్రీకృత లక్షణం గల ఉద్యోగి స్వామ్య వ్యవస్థను అభివృద్ధి చేశారు.

భారతదేశంలో బ్రిటీషు పరిపాలనా లక్షణాలను పరిశీలించినట్లయితే సాంప్రదాయ పాలనా లక్షణాలు మనకు స్పష్ఠంగా గోచరిస్తాయి. బ్రిటీషు పాలన కేంద్రీకృత లక్షణాన్ని కలిగి శాంతిభద్రతల పరిరక్షణకు, పన్నుల వసూళ్ళకు అధిక ప్రాధాన్యతను ఇచ్చినట్లుగా మనకు తెలియవస్తుంది. పటిష్టమైన ఉద్యోగి స్వామ్యాన్ని కలిగి ఉండి, సివిల్ సర్వీసులు బ్రిటీషు పాలనకు ఉక్కు కవచం లాగా ఉండేవి. బ్రిటీషు వారు వివిధ చట్టాల ద్వారా పాలనను నిబంధనాత్మకంగా కొనసాగించే వారు. క్లుప్తంగా చెప్పాలంటే స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో ఉన్న బ్రిటీషు పాలనను నిబంధనాత్మక పాలనగా పేర్కొనవచ్చును. ఈ పాలన శాంతి భద్రతల పరిరక్షణకు, పన్నుల వసూళ్ళకు అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ విధులను సమర్థవంతంగా చేపట్టడానికి వివిధ చట్టాలను రూపొందించి, పటిష్టమైన సివిల్ సర్వీసు వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. రైల్వేల నిర్మాణం, స్థానిక స్వపరిపాలనా వ్యవస్థల అభివృద్ధి వంటి అభివృద్ధి చర్యలను బ్రిటీషువారు చేపట్టినప్పటికీ, ఆ చర్యలను భారతదేశ దృష్టితో కాకుండా, వారి పాలనా లక్ష్యాలను సమర్థవంతంగా సాధించడానికి, స్వలాభం కొరకు చేపట్టినవిగా భావించవచ్చును.

స్వాతంత్ర్యానంతరం భారతదేశ పాలన ప్రగతి సాధన కొరకు, వివిధ రంగాలలో పాలనలో చేపట్టిన ప్రగతి చర్యల గురించి ఈ క్రింది విభాగంలో చర్చిస్తాం.

BRAOU

## 10.4 భారతదేశంలో చేపట్టిన ప్రగతి పాలనా చర్యలు

భారతదేశంలో ఆగష్టు 15, 1947 నాడు వలసపాలన అంతం అయి, స్వాతంత్ర్యం వచ్చింది. స్వతంత్ర్య ప్రకటనతో పాలనా లక్ష్యాలు గణనీయంగా మారాయి. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న పాలనా వ్యవస్థ వలస పాలకుల ప్రయోజనాలను పరిరక్షించేటట్లు ఉండగా, స్వాతంత్ర్యానంతరం భారత పాలనా వ్యవస్థ ప్రజలకు సేవ కల్పించేటట్లు ప్రజాస్వామిక విధానంలో రూపొందించబడింది. అయితే నేడు దేశంలో ఉన్న పాలనా వ్యవస్థలు, పద్ధతులు, ఉద్యోగ క్రమాలు బ్రిటీషువారిచే సృష్టించబడి వారసత్వంగా మనకు సంక్రమించాయి.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం **పార్లమెంటరీ** విధాన ప్రజాస్వామ్యాన్ని అమోదించుకుని పాలనగావించుటకు నిర్ణయించబడింది. భారత రాజ్యాంగం **జనవరి 26, 1950** నుంచి అమలు లోకి రావడంతో భారతదేశం సర్వస్వతంత్ర ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత రాజ్యాంగంలో 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో

"సామ్యవాద", "లౌకిక" అనే పదాలను చేర్చడం ద్వారా నేడు భారతదేశం సర్వస్వతంత్ర సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా పిలువబడుతున్నది. స్వాతంత్ర్య సాధన, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రవేశపెట్టడం దేశ రాజకీయ పాలనావ్యవస్థలో అనూహ్యమైన మార్పులను తీసుకొని వచ్చింది. ప్రజాస్వామ్య విధానంలో పాలనా వ్యవస్థ, ప్రజా ప్రతినిధుల ప్రాముఖ్యతను గుర్తించవలసి ఉంటుంది. పాలనా ప్రక్రియలలో ప్రజా ప్రతినిధులు ప్రముఖ పాత్ర వహిస్తారు.

సంక్షేమ లేదా శ్రేయోరాజ్యస్థాపన ఉద్దేశంతో ప్రభుత్వ అన్నిరంగాలలో జోక్యం చేసుకొని, వివిధ సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి, అమలు పరిచి సమాజంలో మార్పును సాధించే ప్రతినిధిగా పాలనా వ్యవస్థను నిర్మాణం చేయవలసి వచ్చింది. సంక్షేమ రాజ్యానికి పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతమైనదిగా తీర్చిదిద్దడానికి సాంఘిక, రాజకీయ పాలన రంగాల్లో విస్తృత మార్పులు రావాలని, P.V.R. రావ్ అనే సాంఘిక శాస్త్రవేత్త పేర్కొన్నాడు. స్వాతంత్ర్య సాధన తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలన రంగంలో సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణ అవసరాన్ని గుర్తించి, వివిధ పాలనా అంశాల అధ్యయనానికి ఎన్నో సంఘాలను కూడా నియమించారు. క్లుప్తంగా చెప్పాలంటే స్వతంత్ర్యం తరువాత వలసపాలన నుంచి వారసత్వంగా సంక్రమించిన పాలనా వ్యవస్థలో పటిష్టమైన మార్పులను ప్రవేశపెట్టి, సమాజంలో ప్రగతిని సాధించడానికి పాలనా వ్యవస్థను ఒక సాధనంగా గుర్తించడం జరిగింది. సమాజంలో ప్రగతిని సాధించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న వివిధ ప్రగతి పాలనా చర్యల గురించి క్రింద చర్చిస్తాం.

## ప్రణాళికా బద్ధమైన మార్పుకు చేపట్టిన చర్యలు:

సామాజిక పునర్ నిర్మాణానికి, ప్రణాళికా బద్ధమైన ప్రగతి సాధనకు భారతదేశం "ప్రణాళికీకరణ" ను ప్రధాన వ్యూహంగా స్వాతంత్ర్యం తరువాత చేపట్టింది. సమాజంలో ఆధునికీకరణను, సామాజిక ఆర్థిక ప్రగతిని సాధించడానికి ప్రణాళికీకరణను ఒక సాధనంగా వినియోగించింది.

BRAOU

స్వాతంత్ర్యం రాకముందే భారతదేశంలో ప్రణాళికా ప్రక్రియ మొదలైంది. పారిశ్రామికరణకు 1936 లో డా. ఎమ్. విశ్వేశ్వరయ్య ప్రణాళికీకరణ అవసరాన్ని గుర్తించాడు. కేంద్రంలో అభివృద్ధి శాఖను, రాష్ట్రాలలో ఆర్థిక కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేయాలని, ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డా. విశ్వేశ్వరయ్య సిఫారసు చేసారు. రాష్ట్రాలలో 1937 లో కాంగ్రెసు పార్టీ అధికారానికి వచ్చిన తరువాత జాతి పునర్ నిర్మాణానికి మరియు ప్రణాళికీకరణకు పథకాలను రూపొందించడానికి ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని ఫలితంగా 1944 లో జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన ప్రణాళికా కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీ బొంబాయి ప్రణాళిక, గాంధీ ప్రణాళిక మరియు ప్రజల ప్రణాళిక అనే మూడు ప్రణాళికలను ప్రకటించింది. ప్రణాళికీకరణ మరియు సలహా బోర్డు 1946లో ఏర్పాటు చేయబడింది. ప్రజల యొక్క జీవన ప్రమాణాలను త్వరితగతిన మెరుగు పరచడం ఈ చర్యల యొక్క ముఖ్యఉద్దేశం.

స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగ బద్ధంగా ప్రగతిని సాధించడానికి, ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడానికి ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకొనబడ్డాయి. భారతదేశంలో ప్రణాళికీకరణ ఈ క్రింది ఉద్దేశాలను మరియు లక్ష్యాల **సాధనకు** నిర్దేశించబడింది.:

1. జాతీయ ఆదాయం పెరుగుదల
2. ఆదాయము మరియు ఉత్పత్తి కారకాలను కలిగి ఉండడంలో ఉన్న అసమానతలను తగ్గించడం
3. సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడాన్ని అరికట్టడం.
4. నిరుద్యోగాన్ని తగ్గించి, బీదరికాన్ని నిర్మూలించడం.
5. ప్రాథమిక మానవ అవసరాలను కల్పించడం.
6. పరిసరాల పరిరక్షణ
7. జాతీయ ఆర్థిక వ్యవస్థలో స్వావలంభనాన్ని సాధించడం.

పైన వివరించిన ప్రణాళికా లక్ష్యాలను, సామాజిక న్యాయం ద్వారా ప్రగతిని, మరియు స్వయం సంవృద్ధిని సాధించడానికి ప్రధానంగా ప్రణాళికలు ఉద్దేశించబడినవి. ప్రణాళికలను రూపకల్పన చేసి, అమలు పరచడానికి ప్రణాళికా సంఘాన్ని, కేంద్రమంత్రి మండలి తీర్మానం ద్వారా మార్చి 15, 1950 ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టడం జరిగింది. ప్రణాళికా సంఘానికి ప్రధాన మంత్రి ఛైర్మెన్‌గా వ్యవహరిస్తాడు. వనరులను అంచనా వేయడం, ప్రాధాన్యతలను నిర్ధారించడం, పరిమిత వనరులను అభివృద్ధి పరచడం, ప్రణాళికలను రూపొందించడం, ప్రణాళికల అమలును పరిశీలించి, మౌల్యాంకన చేయడం ప్రణాళికా సంఘం యొక్క విధులుగా పేర్కొన వచ్చును. ప్రణాళికా సంఘం విధులు దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తానికి సంబంధించినవి.

ప్రణాళికా పథకాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన అమలు పరచడానికి 1956 లో దేశ వ్యవహారాల మంత్రి అధ్యక్షతన ప్రణాళికా పథకాల కమిటీని (Committee on Plan Projects) ఏర్పాటు చేయబడింది. అయితే ఈ కమిటీ 1970 నుంచి ప్రత్యేక సంస్థగా కొనసాగడం లేదు. సమాజాభివృద్ధి కార్యక్రమాలను మౌల్యాంకన చేయడానికి ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో " కార్యక్రమాల మౌల్యాంకన వ్యవస్థ " 1952 లో ఏర్పాటు చేయబడింది. అభివృద్ధి ప్రణాళికీకరణ మరియు విధానాల రూపకల్పనకు సంబంధించి "జాతీయ అభివృద్ధి మండలి" (National Development Council) అనే సంస్థను కూడా ఏర్పాటు చేయబడింది. ఈ మండలికి ప్రధాన మంత్రి ఛైర్మెన్‌గా వ్యవహరిస్తారు. కేంద్రమంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు, ప్రణాళికా సంఘం సభ్యులు ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు. జాతీయ అభివృద్ధి మండలి కేంద్రప్రభుత్వానికి, ప్రణాళికా సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తుంది. జాతీయ ప్రణాళికా రూపకల్పనకు సూచనలు చేస్తుంది. ప్రణాళికా సంఘం రూపొందించిన ప్రణాళికలను జాతీయ అభివృద్ధి మండలి ఆమోదిస్తుంది. భారతదేశ ప్రణాళికకు జాతీయ లక్షణాన్ని కలిగించడానికి జాతీయ అభివృద్ధి మండలి కృషిచేస్తుంది.

BRAOU

భారతదేశంలో స్వాతంత్ర్యం ముందు నుంచి ప్రణాళికీకరణ చర్యలు మొదలైనా, స్వాతంత్ర్యం తరువాత వాటికి వ్యవస్థీకృతను చేకూర్చి, పరిమితంగా లభ్యమౌతున్న వనరులను గరిష్ఠస్థాయిలో వినియోగించుకొని ప్రగతిని సాధించడానికి కృషిచేయడం జరిగింది. భారతదేశంలో ఇంతవరకు ఏడు పంచవర్ష ప్రణాళికలను అమలు పరిచి, ఎనిమిదవ ప్రణాళిక అమలులో ఉన్నది. భారతదేశ ప్రణాళికీకరణ కొన్ని విమర్శలకు గురి అయినప్పటికి, స్వాతంత్ర్యం తరువాత వివిధ రంగాలలో దేశం సాధించిన ప్రగతిలో ప్రణాళికల కీలక పాత్రను విస్మరింపజాలము.

## పారిశ్రామిక విధాన తీర్మానాలు :

స్వాతంత్ర్య సాధన తరువాత దేశ పారిశ్రామికాభివృద్ధికి మిశ్రమ ఆర్థిక వ్యవస్థను పాటించడానికి నిర్ధారించడం జరిగింది. ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో ప్రభుత్వ జోక్యాన్ని విస్తృత పరిచి, ప్రభుత్వరంగానికి అధిక ప్రాధాన్యతను కల్పించడం జరిగింది. పారిశ్రామిక విధానాలు 1948 మరియు 1956 భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ ప్రాధాన్యతను పెంచి, ప్రవేటు రంగంపై నియంత్రణలను ప్రకటించాయి. తరువాత రూపొందించిన పారిశ్రామిక విధానాలు 1974, 1977 మరియు 1980, ప్రభుత్వరంగం యొక్క ప్రాధాన్యతనే బలపరచడానికి చర్యలు తీసుకున్నాయి. భారత రాజ్యాంగ పీఠికలో పేర్కొనిన సామ్యవాద నమూనా సమాజ స్థాపనకొరకు ప్రభుత్వ రంగానికి, ప్రణాళికీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రధానంగా పారిశ్రామిక విధానం 1956, ప్రభుత్వ రంగ పాత్రను విశదపరిచింది. మౌళికమైన, కీలకమైన పరిశ్రమలను, ప్రజోపయోగకరమైన సేవలను అందించే పరిశ్రమలను ప్రభుత్వ రంగమే చేపట్టాలని నిర్ధారించింది. ఈ విధానం పరిశ్రమలను మూడు రకాలుగా వర్గీకరించి, ప్రభుత్వ, ప్రవేటు రంగాల పరిధులను నిర్దేశించింది.

ప్రభుత్వ రంగం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ప్రాధాన్యతను, ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ రంగం యొక్క పనితీరు తీవ్రవిమర్శలకు గురిఅవుతున్నది. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ప్రభుత్వరంగం విఫలమైందని కొందరి విమర్శ. ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక, నూతన పారిశ్రామిక విధానం 1991, ప్రభుత్వ రంగ పనితీరును తీవ్రంగా విమర్శించి, ప్రభుత్వ రంగం పెట్టుబడులను పునఃసమీక్షించాలని, ప్రవేటు రంగానికి ప్రాముఖ్యతను కల్పించి, ప్రభుత్వరంగ సంస్థలలో పోటీ తత్వాన్ని, సామర్థ్యాన్ని పెంచవలెనని సూచించాయి. ప్రభుత్వరంగ సంస్థలు సామాజిక బాధ్యత అనే నెపంతో పొందే నష్టాలను సమాజం భరించే స్థితిలో లేవని, అందువలన ప్రవేటీకరణకు ప్రాధాన్యతను కల్పించాలని, ఆర్థిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఆలోచనల ఫలితంగానే భారతదేశంలో నూతన ఆర్థిక సంస్కరణలను 1990 తరువాత ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సంస్కరణల గురించి ఈ పాఠంలోనే మరొకచోట చర్చిస్తాం.

BRAOU

ప్రభుత్వరంగం యొక్క పనితీరు విమర్శలకు గురి అయినప్పటికీ, దేశం పారిశ్రామికీకరణను త్వరితగతిని సాధించడంలో ప్రభుత్వరంగం కీలక పాత్రను పోషించినదనటం అతియోశక్తికాదు. భారీ పరిశ్రమల స్థాపన, మౌళిక సదుపాయాల కల్పన వంటి చర్యల ద్వారా ప్రభుత్వరంగం దేశపారిశ్రామిక ప్రగతిని పునాది వేసింది. అయితే ప్రభుత్వరంగం యొక్క పనితీరును మెరుగు పరచడం ద్వారా ఆ రంగం యొక్క సామర్థ్యాన్ని పటిష్టపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## గ్రామీణాభివృద్ధికి చేపట్టిన చర్యలు

భారతదేశం గ్రామాల సముదాయం. దేశ జనాభాలో దాదాపు ఎనభై శాతం ప్రజలు గ్రామాలలో నివశిస్తున్నారు. దేశ ప్రగతి గ్రామీణాభివృద్ధిపై ఆధారపడి ఉంది. దీనిని గుర్తించి గ్రామీణాభివృద్ధిని సాధించడం ప్రభుత్వం ప్రధాన ఆశయంగా పెట్టుకున్నది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎదురౌతున్న సమస్యలను పరిష్కరించి, గ్రామీణ ప్రాంతాలలో ప్రగతిని సాధించడానికి 1951-52 సంవత్సరం నుంచి వివిధ ప్రణాళికా వ్యూహాలను ప్రభుత్వం రూపొందించి అమలు పరుస్తున్నది.

గ్రామీణాభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం ద్విముఖ వ్యూహాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకున్నది. అనగా గ్రామీణాభివృద్ధి సాధన కొరకు సంస్థాగతమైన ( Institutional) మరియు ప్రత్యేక సంస్థల (Special Agency) వ్యూహాలను ప్రభుత్వం అమలు పరిచింది. సమాజాభివృద్ధి కార్యక్రమాల, జాతీయ విస్తరణ కార్యక్రమాల అమలు, పంచాయితీ రాజ్ వ్యవస్థల స్థాపన, బ్యాంకింగ్, సహకార రంగాలలో గ్రామీణాభివృద్ధి చేపట్టిన చర్యలు, గ్రామీణాభివృద్ధి లో స్వచ్ఛంద సంస్థలకు పాత్రను కలిగించడం వంటి చర్యలను సంస్థాగత చర్యలుగా పేర్కొనవచ్చును. గ్రామీణ వ్యవసాయ రంగాన్ని, అభివృద్ధి పరచడానికి, సామాజిక ప్రగతిని సాధించడానికి కొన్ని ప్రత్యేకమైన వ్యూహాలను, సంస్థలను రూపొందించడం ద్వారా కూడా గ్రామీణాభివృద్ధి సాధనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

స్వాతంత్ర్యానంతరం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధిని పెంచడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం వంటి లక్ష్యాలను సాధించడానికి సమాజాభివృద్ధి కార్యక్రమాలను (Community Development Programmes) మరియు జాతీయ విస్తరణ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. అధిక ఆహారోత్పత్తి విచారణ సంఘం సిఫారసులను అనుసరించి 1952 అక్టోబరు 2న సమాజాభివృద్ధి కార్యక్రమాలను, పరిమితమైన ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని 1953 లో జాతీయ విస్తరణ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ఈ కార్యక్రమాలు వనరులు పరిమితంగా ఉన్నందువలన, వ్యవసాయాభివృద్ధికి ఉపయుక్తమైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వలన ఆశించిన ప్రభావాన్ని కనబరచలేక పోయాయి. సమాజాభివృద్ధి కార్యక్రమాల పని తీరును పరిశీలించిన బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ ఈ కార్యక్రమాల రూపకల్పన, అమలులో ప్రజలకు సరిఅయిన పాత్రను కల్పించని కారణంగా ఈ కార్యక్రమాలు విఫలమయ్యాయని పేర్కొన్నది. ఈ కమిటీ ప్రజలకు గ్రామీణాభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడానికి ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరగాలని సూచించి, అందుకొరకు సమితి ప్రాథమిక యూనిట్‌గా మూడు అంశాల పంచాయితీ రాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ కమిటీ సిఫారసుల ననుసరించి, భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో 1959 లో పంచాయితీ రాజ్ సంస్థలను స్థాపించడం జరిగింది.

BRAOU

అయితే ఈ మధ్యకాలం వరకు పంచాయితీ రాజ్ సంస్థల పనితీరు సంతృప్తికరంగా లేదు. ఈ సంస్థలు అస్తవ్యస్థంగా, మందకొడిగా కొనసాగాయి. ఈ మధ్యనే భారత ప్రభుత్వం పంచాయితీరాజ్ సంస్థలను పటిష్టపరచడానికి 73 మరియు 74 రాజ్యాంగ సవరణలను ప్రవేశపెట్టి, విప్లవాత్మక మార్పులను తీసుకొని వచ్చి, రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించడం జరిగింది. ప్రభుత్వం పంచాయితీ రాజ్ వ్యవస్థలో చేపట్టిన ఈ నూతన సంస్కరణల ద్వారా ఈ సంస్థలు రాజకీయ, ఆర్థిక స్వచ్ఛతను పొంది, ప్రజలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో అధికంగా పాల్గొనడానికి వీలు కలుగుతుంది.

గ్రామీణాభివృద్ధి సాధనకు పైన పేర్కొనిన సంస్థాగతమైన చర్యలేకాకుండా, సాంద్రవ్యవసాయ కార్యక్రమం (1964), సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థ (SFDA), మధ్యకారు రైతుల అభివృద్ధి సంస్థ (MFDA), పనికి ఆహారపథకం, క్షామపీడిత ప్రాంతాల కార్యక్రమం (DPAP), జాతీయ గ్రామీణ ఉద్యోగితా కార్యక్రమం (NREP) మొదలైన ప్రత్యేక వ్యూహాలను ప్రభుత్వం రూపొందించింది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో అతివ్యాప్తిని తొలగించి, సామర్థ్యాన్ని పెంపొందించి సత్వర ప్రగతిని సాధించడానికి వివిధ సంస్థలు చేపట్టే కార్యక్రమాలు సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IRDP) క్రిందికి తీసుకొనిరాబడ్డాయి.

గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను కల్పించడానికి, సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి నూతనంగా జవహర్ రోజ్‌గార్ యోజన, ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన వంటి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పైన వివరించిన సంస్థాగత మరియు ప్రత్యేక వ్యూహాల ఫలితంగా ఆశించినంత కాక పోయినా, గుర్తించదగిన ప్రగతిని గ్రామీణ సమాజంలో తీసుకొనిరావడానికి కృషిచేశాయి. స్వాతంత్ర్యం తరువాత గ్రామీణాభివృద్ధికి చేపట్టిన చర్యలు

గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడంలోను, వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేయడంలోను, గ్రామీణ ప్రజలకు స్వయం ఉపాధిని కల్పించడంలోను కీలకపాత్రను పోషిస్తున్నాయి. ప్రభుత్వం ఎన్నో వ్యూహాలను గ్రామీణాభివృద్ధి సాధనకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నది. ఈ వ్యూహాలన్ని గ్రామీణ సమాజంలో సంపూర్ణ ప్రగతి సాధనకు ఉద్దేశించబడినవి.

## భూసంస్కరణలు:

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సమాజంలో ఉన్న ప్రధాన సమస్య సాంఘిక అసమానతలు, భూ యాజమాన్యం కొందరి చేతులలోనే కేంద్రీకృతం కావడం వలన సాంఘిక అసమానతలు తీవ్రతరం అయినాయి. అనగా సమాజంలో పాక్షికంగా భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతూ ఉండినది. ఈ పరిస్థితుల ఫలితంగా బీదరిక నిర్మూలనా కార్యక్రమాలకు స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. భూయాజమాన్యంలో ఉన్న అసమానతలను తగ్గించి, గుణాత్మకమైన, మరియు గణాత్మకమైన మార్పును సమాజంలో తీసుకొని రావడానికి ప్రభుత్వం భూసంస్కరణలను ప్రవేశ పెట్టింది.

జమిందారి వ్యవస్థను రద్దు పరచడం, కౌలుదారీ వ్యవస్థలో సంస్కరణలను తీసుకుని రావడం, భూ గరిష్ఠ పరిమితి నిర్ధారించి, మిగులు భూమిని పంపిణీ చేయడం మొదలైనవి భూసంస్కరణల ముఖ్య లక్ష్యాలు. "దున్నేవాడిదే భూమి" అనే నిర్వచనాన్ని అమోదించిన ఫలితంగా 1950 ప్రాంతంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు జమిందారీ వ్యవస్థను రద్దుచేయడానికి చట్టాలను రూపొందించాయి. వివిధ రాష్ట్రాలలో చట్టాల ద్వారా భూగరిష్ఠ పరిమితిని నిర్ధారించడం జరిగింది. అయితే ఈ చట్టాలను లోపభూయిష్టంగా రూపొందించడం వలన నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఈ చట్టాలు విఫలమైనాయి. ఈ రంగంలో సాధించిన ప్రగతి చాలా పరిమితమైనదిగా పేర్కొనవచ్చును. ఉద్యోగి స్వామ్యవ్యవస్థలో ఉన్న లోపాలు, రాజకీయ - సాంస్కృతిక కారకాలు, పాలనా నిర్మాణం, భూసంస్కరణ చట్టాలను సమర్థవంతంగా అమలు పరచడంలో అవరోధాలను కల్గిస్తున్నాయి. ప్రభుత్వ పాలనలో వలసవాదపాలనా పద్ధతులు, ప్రవర్తన నేటికీ కొనసాగడం భూసంస్కరణల అమలుకు అవరోధాన్ని కల్గిస్తున్నది. భూసంస్కరణలను సమర్థవంతంగా అమలు పరచుటకు నూతన సంస్థలను, లక్ష్య నిబద్ధత కలిగిన ఉద్యోగి బృందాన్ని ఏర్పరచవలసిన అవసరం ఉన్నది.

BRAOU

## ప్రజాస్వామ్య వికేంద్రీకరణ

భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందు ఉన్న పాలనా వ్యవస్థ కేంద్రీకృత లక్షణాన్ని కలిగి వలసపాలన లక్ష్యసాధనకు ఉద్దేశించబడినది. స్వాతంత్ర్యం తరువాత, ప్రగతిపాలనా చర్యలను త్వరితగతిని అమలు పరచడానికి పాలనను వికేంద్రీకరించాలని వివిధ సంఘాలు, కమిటీలు సిఫారసు చేశాయి. ప్రధానంగా సమాజాభివృద్ధి పథకాలను సమీక్షించిన బలవంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు పంచాయితీ రాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ కమిటీ సిఫారసుల ప్రాతిపదికగా వివిధ రాష్ట్రాలు 1959 నుంచి ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు పంచాయితీ రాజ్ వ్యవస్థను ప్రవేశ పెట్టాయి. అయితే పంచాయితీరాజ్ వ్యవస్థను రాష్ట్రాలు స్థాపించినను, వాటికి రాజ్యాంగ ప్రతిపత్తిలేని కారణంగాను, వనరుల కొరతవల్లను, ఆ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయలేకపోయాయి. ఈ వ్యవస్థలను పటిష్ఠ పరచడానికి చర్యలను సూచించడానికి కేంద్ర ప్రభుత్వం అశోక మెహతా అనే మరొక కమిటీని నియమించింది. ఈ కమిటీ బలవంతమెహతా కమిటీ సిఫారసు చేసిన మూడు అంచెల పంచాయతి వ్యవస్థ నిర్మాణం స్థానంలో రెండు అంచల నిర్మాణాన్ని జిల్లా, మండల స్థాయిలలో సిఫారసు చేసింది. జిల్లా పరిషత్ ఛైర్మెన్ పరోక్షంగా ఎన్నికైన

సభ్యులనుంచి ఎన్నుకోవాలని సూచించింది. అశోకమెహతా సిఫారసులను ఆధారంగా చేసుకొని కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు మండల వ్యవస్థలను ప్రవేశపెట్టాయి. అయితే ఈ సిఫారసులు కూడా పంచాయితీరాజ్ వ్యవస్థ పటిష్ఠతకు దోహదపడలేదు.

కేంద్రప్రభుత్వం 1992-93 ప్రాంతాలలో పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్ఠపరిచి, ప్రజలకు పాలనలో భాగస్వామ్యమును కలిగించడానికి 73 మరియు 74 రాజ్యాంగ సవరణలను ప్రవేశపెట్టి, ఆమోదించడం జరిగింది. ఈ సంస్కరణల ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ ప్రతిపత్తి కలగడమే కాకుండా, ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి తప్పకుండా స్థానిక ప్రభుత్వాల ఎన్నికలను జరిపించుటకు రాష్ట్ర ప్రభుత్వాలు "ఎన్నికల సంఘాన్ని" నియమించాలని, ఈ వ్యవస్థలకు వనరులను కేటాయించడానికి, "ఆర్థిక సంఘాన్ని" ఏర్పాటు చేయాలని పంచాయితీ రాజ్, నగరపాలక సంస్థల చట్టాలలో పేర్కొనడం జరిగింది. ఈ నూతన సవరణల స్థానిక ప్రభుత్వాలు పటిష్టవంతమై, సమర్థవంతంగా నిర్వహించి, ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు, గ్రామీణాభివృద్ధి సాధనకు దోహదపడతాయి.

## పాలనా సంస్కరణలు

ప్రగతిపాలనలో పాలనా అభివృద్ధి ఒక అంతర్భాగం. సమర్థవంతమైన పాలనా వ్యవస్థలేనట్లయితే ప్రగతిని సమాజంలో సాధించడం కష్టం. ప్రగతి సాధనకు ఉద్దేశించబడిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు పరచడానికి పటిష్ఠమైన పాలనా వ్యవస్థ అవసరం. అందువలన ప్రగతిపాలన లక్ష్యాలను సాధించడానికి పాలనావ్యవస్థలో మార్పులను తీసుకొనిరావలసిన అవసరం స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో ఏర్పడింది. వలసపాలనా లక్షణాలతో కూడిన పాలనావ్యవస్థ, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎన్నో అవరోధాలను కలిగిస్తున్నవి. పాలకులలో నూతన దృక్పథాన్ని ప్రోత్సహించి, వారిని ప్రగతి సాధకులుగాను, మారుతున్న పరిస్థితులను, సవాళ్ళను ఎదుర్కొనే సమర్థవంతులుగా తీర్చిదిద్దవలసిన అవసరం ఏర్పడింది. ప్రగతి సాధనకు ఉద్దేశించిన విధానాలను, ప్రణాళికలను, కార్యక్రమాలను, పథకాలను రూపకల్పన చేసినంత మాత్రాన సరిపోదు. వాటిని సమర్థవంతంగా అమలు పరిచినప్పుడే ప్రగతిసాధన సాధ్యపడుతుంది. అందుకొరకు పాలనా సామర్థ్యాలను అభివృద్ధి పరచవలసిన అవసరం ఉన్నది. ఇందు కొరకు బ్రిటీషు పాలన మనకు వారసత్వంగా అందించిన సివిల్ సర్వీసు వ్యవస్థ నిర్మాణం, పద్ధతులు మరియు ప్రవర్తనలో మార్పు చోటుచేసుకోవలసి ఉన్నది. ఈ కారణాల వలన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పాలనా సామర్థ్యాలను మెరుగుపరచడానికి సూచనలను చేయడానికి ఎన్నో కమిటీలను, కమీషన్‌లను నియామాకం చేశాయి. వాటిలో ఎన్. గోపాల స్వామి అయ్యంగార్ కమిటి (1949), A.D. గోరావాల కమిటీ (1951) పాల్.హెచ్. ఆపిల్ బై కమిటీ (1953 & 1956) ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చును. ఈ కమిటీల, కమిషన్‌లన్ని, పాలనను వికేంద్రీకరించాలని, నియమ నిబంధనలను సరళతరం చేయాలని, ప్రజలకు పాలనలో భాగస్వామ్యాన్ని కల్పించాలని సిఫారసు చేశాయి. అయితే ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపం వలన ఈ కమిటీల, కమీషన్‌ల సిఫారసులను కంటితుడుపు కోసం కొన్ని అమలు పరచడం జరిగింది. పాలనా వ్యవస్థలో సమూలంగా సంస్కరణలను తీసుకొని వచ్చి, ప్రగతిసాధనకు అనువుగా పాలనను పటిష్టపర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి ప్రధానంగా రాజకీయ చిత్తశుద్ధి చాలా అవసరం.

## నూతన ఆర్థిక సంస్కరణలు

భారతదేశ ఆర్థిక విధానాలలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ నూతన పోకడలను తీసుకుని వచ్చాడు. ఉత్పాదకతను పెంచడం, అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం, మరియు పూర్తి సామర్థ్యాన్ని వినియోగించడం

BRAOU

వంటి లక్షణాలతో ఆర్థిక విధానాన్ని రూపొందించాలని రాజీవ్‌గాంధీ సూచించాడు. ఆర్థిక విధానంలో ప్రవేటు రంగానికి కీలకపాత్రను కల్పించి ప్రవేటు రంగాన్ని వ్యాపింపజేసి దేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలను స్వేచ్ఛగా సాధించడానికి దోహదం కలిగేటట్లు చేయాలని అతను సూచించాడు. అతని ఆలోచన ధోరణికి అనుగుణంగా 1991 లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వం పి.వి. నరసింహారావు నేతృత్వంలో నూతన ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. జూలై 24, 1991 సం. లో ప్రవేశ పెట్టిన నూతన సరళీకృత ఆర్థిక విధానం ప్రవేటు రంగానికి, ఆర్థికాభివృద్ధి సాధనలో పెద్ద పీట వేసింది. నూతన ఆర్థిక విధానాల సముదాయం మూడు లక్ష్యాలకు ఉద్దేశించ బడినవి.

(1) భారత ఆర్థిక విధానాన్ని స్థిరంగా ఉండేటట్లు చూడడం.

(2) భారత ఆర్థిక విధానాన్ని పునర్ నిర్మాణం చేయడం.

(3) భారత ఆర్థిక విధానాన్ని అంతర్జాతీయం చేయడం.

నూతన ఆర్థిక విధానం దేశ విత్త విధానం, ద్రవ్య విధానం, వాణిజ్య విధానం, విదేశాంగ విధానం, పారిశ్రామిక విధానం, విదేశీయ పెట్టుబడుల విధానం, ఎగుమతి దిగుమతుల విధానం, ప్రభుత్వరంగ సంస్థల విధానాలలో పలు సంస్కరణలను తీసుకుని వచ్చింది. పరిశ్రమలు లైసెన్స్‌ను మంజూరు చేసే విషయంలో ఉత్పన్నమయ్యే విత్తపరమైన మరియు పాలనా పరమైన అడ్డంకులను, నియంత్రణలను హేతు బద్ధపరిచి, సరళతరం చేయడం ద్వారా ప్రవేటురంగాన్ని అభివృద్ధి పరిచి, వాటి మనుగడకు సరిఅయిన వాతావరణాన్ని కల్పించి ప్రవేటురంగం యొక్క పెట్టుబడుల ద్వారా ఆధునిక పరిచి సత్వర అభివృద్ధి సాధనకు నూతన ఆర్థిక విధానపర చర్యలు ఉద్దేశించబడినవి.

నూతన ఆర్థిక విధానం ప్రభుత్వం యొక్క సామాజిక బాధ్యతను విస్మరించకుండా బీదరిక నిర్మూలనకు, ప్రాథమిక విద్య, గ్రామీణ మంచినీటి సరఫరా, చిన్న మరియు సన్నకారు రైతుల సహాయం, మహిళల, చిన్నపిల్లల అభివృద్ధి, షెడ్యూలుకులాలు, తెగలు, ఇతర వెనకబడిన వర్గాల సంక్షేమ, గ్రామీణ ప్రాంతాలలో మౌళిక సదుపాయాల కల్పన, ఉపాధికల్పనా కార్యక్రమాలను చేపట్టడం వంటి సంక్షేమ కార్యక్రమాలకు అధిక మొత్తాలను కేటాయించి పాలనకు మానవతోన్ముఖం (Humanface) కల్పించాలని భావించింది.

BRAOU

నూతన సరళీకృత ఆర్థిక విధానంలో భాగంగా నూతన పారిశ్రామిక విధానం 1991పరిశ్రమల స్థాపన, విస్తరణ విషయంలో లైసెన్స్ రాజ్యాన్ని ``రద్దుపరిచింది. కేవలం పదునెనిమిది పరిశ్రమలకు తప్ప మిగిలిన పరిశ్రమలకు పారిశ్రామిక లైసెన్స్‌లను రద్దుచేసింది. ఈ విధానం Monopolies and Restricted Trade Practices ( MRTP) చట్టంలో భారీ పరిశ్రమల స్థాపనకు విస్తరణకు అవసరమైన సవరణలను చేసింది. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులను నిరుత్సాహ పరిచి, ప్రవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ విధానం చర్యలు చేపట్టింది.

సాంకేతికత్వం బదిలీ, మార్కెటు ప్రత్యేకీకరణ, ఆధునిక నిర్వహణ శిల్పపద్ధతులు వంటి ప్రయోజనాలను పొందడానికి, విదేశీయ పెట్టుబడులను ప్రోత్సహించడానికి నూతన సరళీకృత ఆర్థిక విధానం చర్యలు చేపట్టింది. ఇందు కొరకు ఎగుమతి -దిగుమతి విధానం, బ్యాంకింగ్ మరియు ఋణ సదుపాయాల విధానాలలో సంస్కరణలను ప్రవేశపెట్టింది. కరెంటు అకౌంట్ చెల్లింపులలో రూపాయికి కన్వర్టబిలిటినీ ప్రకటించింది. ఈ చర్యలన్ని విదేశి పెట్టుబడులను ఆకర్షించి తద్వారా ఆర్థిక ప్రగతి సాధనకు ఉద్దేశించడినవి. విదేశీ మారక ద్రవ్యానికి సంబంధించిన అంక్షలను జాగ్రత్తగా సరళీకరించడం, అనేక మార్గాల ద్వారా చెల్లించాల్సిన రుణాలను భారీగా తగ్గించడంలో భారత రిజర్వు బ్యాంకు (RBI) సఫలమైందని ప్రపంచ బ్యాంకు ``వర్ధమాన ఆసియాబాంక్ మార్కెటు భారత్" అన్ని నివేదికలో

వివరించింది. ఎగుమతులలో 1993 మార్చి నెలకు ముందు ద్వంద్వ మారకపు రేటు అమల్లో ఉండేదని, దీనివల్ల ఎగుమతులు వివక్షకు గురయ్యేవని, తరువాత ఏకీకృత మారకపురేటును ప్రవేశ పెట్టి ఎగుమతి దారులకు మేలు కలిగించిందని ప్రపంచ బ్యాంకుకు వివరించింది. ఏకీకృత మారకపు రేటు అమల్లోకి వచ్చాక భారత్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని ఆ నివేదిక పేర్కొంది.

నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేటీకరణను విదేశీయ పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరచడానికి ఉద్దేశించబడినవి. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రగతి సాధించడానికి పారిశ్రామిక, రాజకీయ, పాలనా రంగాలలో చేపట్టిన సంస్కరణల గురించి పైన చర్చించడం జరిగింది. ఈ సంస్కరణలన్ని ప్రభుత్వపాలనను పటిష్టపరిచి, ప్రగతోన్ముఖం చేయడానికి ఉద్దేశించబడినవి. ఈ సంస్కరణలు భారతదేశ పాలనలోను వలసపాలనా లక్షణాలను తొలగించి, దేశం సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి చేపట్టిన చర్యలు, భారతదేశ పాలనలో ఆర్థిక, పాలనా రంగాలలో చేపడుతున్న మార్పులు పాలనను పటిష్ఠ పరిచి, భవిష్యత్‌లో శీఘ్ర గతిన అన్నిరంగాలలో ప్రగతిని సాధించడానికి దోహద పడతాయని ఆశిద్దాం.

## 10.5 సారాంశం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రభుత్వ పాలనలో నూతన ధోరణులు చోటుచేసుకున్నాయి. వర్ధమాన దేశాల ఆవిర్భావం, ఆదేశాలలో పాశ్చాత్య పాలనా నమూనాలు పాలనా సమస్యలను పరిష్కరించడంలో విఫలం కావడం ప్రగతిపాలన ఆవిర్భావానికి దారి తీసింది. అంతవరకు ఆదేశాలలో ఉన్న వలసపాలన శాంతి భద్రతల పరిరక్షణకు, పన్నుల వసూలుకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి నిబంధనాత్మక పాలనగా కొనసాగించి. స్వాతంత్ర్యం సంపాదించిన తరువాత వర్ధమాన దేశాలు శ్రేయోరాజ్యస్థాపన లక్ష్యంతో వివిధ రకాలైన ప్రగతి చర్యలను సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించడానికి చేపట్టడం జరిగింది. భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందున్న వలసపాలనా లక్షణాలను, స్వాతంత్ర్యానంతరం ప్రగతిని సాధించడానికి వివిధ రంగాలలో చేపట్టిన, చేపడుతున్న చర్యలను ఈ పాఠంలో వివరించడం జరిగింది. భారతదేశ పాలనలో వారసత్వంగా సంక్రమించిన బ్రిటిషుపాలనా లక్షణాలను తొలగించి, సంస్కరణలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాలనను ప్రగతోన్ముఖం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో నియమనిబంధనలను సరళతరం చేసి, ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించి, ప్రైవేటీకరణ, వికేంద్రీకరణ మొదలైన చర్యల ద్వారా పాలనలో దృఢత్వ లక్షణాన్ని తగ్గించి, సరళతను పెంచడం ద్వారా సమాజంలో సామాజిక న్యాయం ప్రాతిపదికగా సామాజిక ప్రగతిని తీసుకొని రావడానికి చర్యలు తీసుకొనవలయును. భారతదేశంలో నేడు చేపడుతున్న నూతన ఆర్థిక సరళీకృత చర్యలు ఇందుకు ఉద్దేశించబడినవిగా భావించవచ్చును.

## 10.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రగతిపాలనా ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను వివరింపుము.
2. సాంప్రదాయ పాలనకు, ప్రగతి పాలనకు మధ్యగల వ్యత్యాసాన్ని పేర్కొనుము.

BRAOU

3. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలో ఉన్న నిబంధనాత్మక పాలన లక్షణాలను, లక్ష్యాలను వివరింపుము.

4. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం వివిధ రంగాలలో చేపట్టిన ప్రగతిపాలనా చర్యలను వివరింపుము.

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు రాయండి

1. సాంప్రదాయ పాలన లక్ష్యాలను వివరింపుము.
2. భారతదేశంలో వలసపాలనా లక్షణాలను వివరింపుము.
3. నూతన ఆర్థిక సంస్కరణల గురించి తెలియజేయుము.
4. గ్రామీణాభివృద్ధికి భారతదేశంలో చేపట్టిన వ్యూహాలను వివరింపుము.

## 10.7 చదువదగిన రచనలు


1. Ferrel Heady : Public Administration : A Comparative Perspective (3rd Edition), Newyork, Marcal Dekker 1984.

2. F.W. Riggs : Administration of Developing Nations : The Theary of Prismatic Society, Boston, Honghmittin 1964.

3. కె. మురళీ మనోహర్ : ``ప్రగతి పాలనా శాస్త్రం '' తెలుగు అకాడమీ, హైదరాబాదు. 1988.

4. బాపూజీ : తులనాత్మక పాలన, తెలుగు అకాడమీ, హైదరాబాదు. 1994



**రచయిత : సి. హెచ్. చాముండేశ్వర ప్రసాద్.**



BRAOU

# భాగం - 11 : ప్రగతి కార్పొరేషన్లు

## విషయక్రమం


11.0 లక్ష్యాలు
11.1 పరిచయం
11.2 పారిశ్రామికీకరణ
11.3 అభివృద్ధి సంస్థల భావన
11.4 భారతదేశంలో అభివృద్ధి సంస్థల స్థాపన
11.5 అమలులో నున్న పబ్లిక్ కార్పొరేషన్లు
11.6 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ
11.7 భారత పారిశ్రామిక విత్త కార్పొరేషన్
11.8 ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కార్పొరేషన్
11.9 చిన్నతరహా పరిశ్రమ
11.10 ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్
11.11 ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అంతర్మిమిత కార్పొరేషన్
11.12 సారాంశం
11.13 నమూనా పరీక్షా ప్రశ్నలు
11.14 చదువదగిన రచనలు


BRAOU

## 11.0 లక్ష్యాలు

ఈ భాగంలో మీరు

* అభివృద్ధి సంస్థల భావన
* భారతదేశంలో అభివృద్ధి సంస్థల స్థాపన
* ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సరళీయుత సంస్థ
* ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కార్పొరేషన్
* ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్
* ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అంతర్మిమిత కార్పొరేషన్లు

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి పడుతున్న పాటు గురించి తెలుసుకుంటారు.

## 11.1 పరిచయం

సుమారు 16వ శతాబ్దం నుంచి ఆర్థిక కార్యకలాపాలలో ఒక నూతన శకం అరంభమయినది. కేవలం వర్తకం పై ఆధారపడిన కార్యకలాపాలు ఉత్పత్తి వైపు దారితీసినవి యీ ప్రక్రియ 18వ శతాబ్దపు మధ్యకాలంలో సంభవించిన

పారిశ్రామిక విప్లవంతో మరింత బలపడినది. మానవుని శారీరక శ్రమకు బదులుగా యంత్రాలను ప్రవేశపెట్టడం, ఆ ఉత్పత్తి వేగాన్ని పెంచటం, మొదలైన చర్యలు పారిశ్రామిక రంగంలో ఏర్పడడంతో పాటు వ్యవసాయం, రవాణా, తదితర రంగాలలో కూడా మార్పులు సంభవించినవి. ఇంగ్లాండ్‌లో ప్రారంభమయిన యీ మార్పులు క్రమంగా మిగిలిన యూరప్ దేశాలకు విస్తరించినవి. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలో ప్రభుత్వ కృషితో పాటు, సాంకేతిక, పరిణామాల వలన పారిశ్రామికీకరణ సాధ్యపడినట్లు చెప్పవచ్చు. James Watt కనిపెట్టిన ఆవిరియంత్రం పారిశ్రామికీకరణకు నాంది పలికినట్లు పలువురి విశ్వాసం.

క్రీస్తు పూర్వం 2000సం. నాటినుంచి భారతదేశంలో పరిశ్రమలు నైపుణ్యంతో నిర్వహించబడినట్లు చరిత్ర సూచిస్తున్నది. మనదేశంలో అధునాతన పారిశ్రామికీకరణ 1818 తరువాత ప్రారంభమయినట్లు చెప్పవచ్చు. మనదేశంలో మొదటి నూలు మిల్లును 1819లో కలకత్తాలో స్థాపించారు. అట్లాగే 1855లో మొదట తోళ్ళను శుభ్రపరిచే కర్మాగారాన్ని, 1852లో జనపనార మిల్లును నెలకొల్పినారు. ఈ విధంగా మొదలయిన పరిశ్రమల స్థాపన 19వ శతాబ్దపు అంతానికి టీ, కాఫీ, ప్రత్తి, జనపనార వంటి అనేక పురాతన పరిశ్రమల స్థాపనకు వీలయినవి. అయితే నిజమైన పారిశ్రామికీకరణ మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పంచవర్ష ప్రణాళికలతో మొదలయినట్లు చెప్పవచ్చు.

## 11.2 పారిశ్రామికీకరణ

### అర్థం :

Prof. Sargent Florance ప్రకారం వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలను స్థాపించటం, అభివృద్ధి చేయటాన్ని పరిశ్రమగా చెప్పవచ్చు. దీనిలో వ్యవసాయం, గనుల త్రవ్వకం, ప్రజాసేవలకు సంబంధించిన తదితర అంశాలు చేరవు. దీనివలన పారిశ్రామికీకరణ సంకుచితమైన అర్థం వచ్చినట్లు చెప్పవచ్చు.

BRAOU

**Paul M. Sweazy :** - ఇతడు క్రొత్త పరిశ్రమల స్థాపన, కొత్త ఉత్పత్తి కారకాల సృష్టిని పారిశ్రామికీకరణగా చెప్పవచ్చునన్నాడు.

**Sie - King Chang :** - ఇతని ప్రకారం ఉత్పత్తి విధానాలలో నిరంతరం వచ్చే మౌలిక మార్పుల ప్రక్రియలను పారిశ్రామికీకరణగా గుర్తించవచ్చునన్నాడు. దీనిలో కొత్త పరిశ్రమలను స్థాపించడం, వ్యవస్థలను యాంత్రీకరించడం, కొత్త మార్కెట్‌లను కనుగొనడం, మొదలగు ప్రక్రియలు ఇమిడి ఉంటాయి.

**Harry Johnson :-** వ్యాపార సంస్థలలో ఉత్పత్తి వ్యవస్థలను పారిశ్రామికీకరణగా చెప్పవచ్చు. అంటే శ్రమవిభజన ప్రత్యేకీకరణ వంటి లక్షణాలపై ఉత్పత్తి వ్యవస్థ ఆధారపడి ఉంటుంది.

### లాభాలు :

1.దేశంలో నిక్షిప్తంగానున్న సహజ వనరులను వెలికితీసి సమర్థవంతంగా వినియోగించటానికి వీలవుతుంది.
2. దీని వలన ఉత్పాదకత పెరిగి జాతీయ ఆదాయం అధికమై, తద్వారా ప్రజల జీవన ప్రమాణం మెరుగు అవుతుంది.

3. దీని సహాయంతో కార్మికులకు ఉపాధి కల్పించడం, ఎరువులను అందించడం పురుగుమందులను సప్లయి చేయడం లాంటి చర్యలను వ్యవసాయాభివృద్ధి సాధించవచ్చు.
4. ఇది విదేశవర్తకం యొక్క రూపాన్ని మార్చగలుగుతుంది. వాటి అభివృద్ధికి సహాయ పడుతుంది.
5. ఇది దేశ రక్షణకు దోహదకారిగా ఉంటుంది. ఇదీ ప్రజల సాంఘిక దృక్పథాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.

## 11.3 అభివృద్ధి సంస్థల భావన

ఈ సంస్థలకు ఈక్విటీ మూలధనముతో సంబంధం ఉండటమే కాకుండా, కంపెనీల నిర్వహణ, వాటికి ఆర్థిక సహాయం అందించటంతో సంబంధం ఉంటుంది. ప్రపంచంలోని వివిధ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ సంస్థల యొక్క స్వభావం, స్వరూపం ధ్యేయాలు భిన్నంగా ఉన్నవి. అయితే ప్రతి దేశం తన రాజకీయ, సాంఘిక, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకుంటాయి. ఈ అభివృద్ధి సంస్థల ప్రధాన ఆశయం పారిశ్రామికీకరణ నిమిత్తం తగిన మూలధనం సమకూర్చడం ఔత్సాహికులకు ప్రోత్సాహం కల్పించుట, నిర్వహణ, మరియు సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అనుబంధ సముదాయము (infrastructure) కల్పించడం మొదలగునవి. తద్వారా సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడు కారణాలను కల్పించి, ప్రగతిని సాధించి, సామాజిక అభివృద్ధికి అనుగుణమైన వాతావరణాన్ని కల్పించుట, దేశ ప్రగతికి తోడ్పడటం అని అభిప్రాయపడినారు.

## 11.4 భారతదేశంలో అభివృద్ధి సంస్థల స్థాపన

BRAOU

మనదేశంలో పారిశ్రామికీకరణకు దీర్ఘకాలిక ప్రాతిపదికపై ఆర్థిక వనరులను (ద్రవ్యసహాయం) సమకూర్చవలసిన అవసరాన్ని గుర్తించారు. యీ అంశాన్ని దృష్టిలో వుంచుకొని వివిధ స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలు ( Madras State Aid to Industries Act, 1922) అనే చట్టాన్ని 1922లో ప్రారంభించి, పాలకాభివృద్ధికి నాంది పలికినది. (భారత పారిశ్రామిక కమిషన్) 1918 బహిర్గత మూలధన కమిటీ 1925 (External Capital Committee 1925) & కేంద్రీయ బ్యాంకింగ్ విచారణ కమిటీ ( Central Banking Enquiry Committee, 1930) మొదలగునవి పారిశ్రామికీకరణకు దోహదపడు సంస్థల ఆవశ్యకతను వర్ణించినది.

పారిశ్రామిక మరియు వాణిజ్య ద్రవ్య కార్పొరేషన్ పరిశ్రమల ద్రవ్య కార్పొరేషన్ లిమిటెడ్ (Industrial and Commercial Finance Corporation & the Financial Corporation for Industries Limited ) అనే రెండు బ్రిటీషు సంస్థలను 1945లో ప్రారంభించటం వలన ఈ అభివృద్ధి సంస్థల యొక్క ఆవశ్యకతను గ్రహించినారు. పార్లమెంటు యొక్క ప్రవేశ చట్టం ద్వారా జులై 1948లో మొదటి భారతదేశ దీర్ఘకాలిక ద్రవ్య సహాయక సంస్థను (Industrial Finance Corporation of India (IFC) స్థాపించినారు. 26 మార్చి 1949లో తమిళనాడు పారిశ్రామిక పెట్టుబడుల కార్పొరేషన్‌ను స్థాపించినారు. దీని తర్వాత 17 అనుబంధ సంస్థలను రాష్ట్రాల ప్రాతిపదికపై పారిశ్రామిక విత్తం నిమిత్తం ఏర్పాటు చేసినారు. వీటినే రాష్ట్ర ద్రవ్య సహాయక సంస్థలంటారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వాల భారతీయ రిజర్వు బ్యాంకు (RBI) ద్వంద నియంత్రణలో పనిచేస్తాయి.

1955లో మనదేశం ప్రపంచ బ్యాంకు నుంచి అధిక మొత్తంలో విదేశిమారక ద్రవ్య రుణాలను సంపాదించుటకు అదనంగా మరో సంస్థను ప్రారంభించుటకు నిర్ణయించినది. దానినే పారిశ్రామిక పరపతి మరియు పెట్టుబడుల

కార్పొరేషన్ (ICICI)ను జాయింట్ స్టాక్ కంపెనీగా నమోదు చేసినది. 1963సం.లో చిన్న పెట్టుబడిదారులను ఆకర్షించుటకు ద్రవ్యసహాయక సంస్థలు అందించే సహాయంతో యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI) అనే సంస్థను ప్రారంభించినది. పార్లమెంటుచే ఆమోదించబడిన చట్టం ప్రకారం 1964 సం.లో భారతదేశం పారిశ్రామికాభివృద్ధి బ్యాంకును (IDBI) స్థాపించింది. 1971 సం.లో ఖాయిలా పడిన సంస్థలను పునర్నిర్మాణ నిమిత్తం సహాయపడటానికి ఒక ప్రత్యేక సంస్థను "భారత పారిశ్రామిక పునర్నిర్మాణ కార్పొరేషన్" ( Industrial Re-Construction Corporation of India)ను స్థాపించినది.

భారతదేశంలో **1982** లో స్థాపించబడిన వివిధ కార్పొరేషన్‌లలో ప్రధానమైనవి :

1. చిత్ర ద్రవ్య సహాయక కార్పొరేషన్ (Film Finance Corporation)
2. వార్తాపత్రికల ద్రవ్య సహాయక కార్పొరేషన్( Newspaper Finance Corporation)
3. చేనేత ద్రవ్య సహాయక కార్పొరేషన్ ( Handloom Finance Corporation)
4. గృహనిర్మాణ అభివృద్ధి ద్రవ్య సహాయక కార్పొరేషన్ ( Housing Development Finance Corporation)
5. ఎగుమతి పరపతి గ్యారంటి కార్పొరేషన్ (Export Credit Guarantee Corporation)
6. వ్యవసాయక మరియు గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు (National Bank for Agriculture and Rural Development Bank (NABARD)

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ద్రవ్య సహాయక, ద్రవ్యేతర (Infrastructural ) సహాయక సంస్థల ఏర్పాటు నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగం యొక్క విధానం ఏమనగా, ప్రైవేటు రంగం ప్రభుత్వ రంగం ఉమ్మడి రంగం (Joint Sector) లలోని సంస్థల ద్వారా పారిశ్రామికీకరణ జరపదలచినది. పై ఆశయాన్ని దృష్టిలోనుంచుకుని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ (Andhra Pradesh Industrial Development Corporation - A.P.I.D.C.), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ద్రవ్య సహాయ సంస్థ (Andhra Pradesh State Finance Corporation), ( A.P.S.F.C.) ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ద్రవ్యేతర సహాయ సంస్థ (Andhra Pradesh Industrial Infrastructural Corporation - A.P.I.I.C) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న తరహా పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ (Andhra Pradesh Small Scale Industrial Development Corporation -A.P.S.S.I.D.C.) మొదలగునవి స్థాపించినారు. వీటి గురించి ప్రత్యేకంగా తదుపరి అంశాలలో వివరించబడుతుంది.

BRAOU

అంతేగాకుండా పారిశ్రామికేతర మరియు ఉత్పత్త్యేతర (Non-Industrial Non-Manufacturing Industries) పరిశ్రమల స్థాపన ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ రంగంలో ఈ మధ్యకాలంలో జరిగినది. ఉదాహరణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (A.P.S.R.T.C. 1970) నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ (Irrigation Development Corporation 1974), ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రామాభివృద్ధి కార్పొరేషన్ ( Andhra Pradesh Dairy Development Corporation 1974), మరియు ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్పొరేషన్ (A.P. Fisheries Corporation 1974) మొదలగునవి.

**ఈ కార్పొరేషన్‌ల యొక్క ప్రధాన ఉద్దేశాలు రెండు**

a. ప్రజలకు నాణ్యమైన వస్తువులు సేవలను అందించుట

b. తద్వారా సామాజిక ప్రయోజనాలను ఒనగూర్చుట.

**కొన్ని అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలలో కార్పొరేషన్‌ల స్థాపన**

1. బర్మా - పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ (1952)
   పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (1961)
2. సిలోన్ ( శ్రీలంక) - వ్యవసాయ మరియు పారిశ్రామిక వనరుల కార్పొరేషన్ (1945)
   ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ సిలోన్ (1955)
3. చైనా - చైనా అభివృద్ధి కార్పొరేషన్ (1959)
4. ఇరాన్ - పారిశ్రామిక మరియు గనుల అభివృద్ధి బ్యాంకు, ఇరాన్ (1959)
   పారిశ్రామిక వనరుల బ్యాంకు, ఇరాన్ (1963)
5. ఇరాక్ - పారిశ్రామిక బ్యాంకు, ఇరాక్ (1946)
6. ఇండోనేషియా - అభివృద్ధి బ్యాంకు, ఇండోనేషియా (1960)
7. కొరియా - కొరియా పునర్‌నిర్మాణ బ్యాంకు (1954)
8. మలేషియా - పారిశ్రామిక, అభివృద్ధి సంస్థ, మలేషియా (1960)
9. పాకిస్తాన్ - పారిశ్రామిక అభివృద్ధి మరియు పెట్టుబడుల కార్పొరేషన్
   పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్
   చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్
10. తాయ్‌లాండ్ - ఆర్థిక పారిశ్రామిక కార్పొరేషన్ (1959)
11. నేపాల్ - నేపాల్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ (1959)
12. సింగపూర్ - ఆర్థిక అభివృద్ధి బోర్డు - సింగపూరు
13. నైజీరియా - నైజీరియా పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు లిమిటెడ్ (1959)
14. యుగాండా - యుగాండా అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (1952)
15. ఎతియోపియా - ఎతియోపియా అభివృద్ధి బ్యాంకు (1951)
16. ఫిలపైన్స్ - జాతీయ పెట్టుబడి అభివృద్ధి కార్పొరేషన్, ఫిలిపైన్స్ అభివృద్ధి, బ్యాంకు (1958)
17. సిపిరస్ - సిపిరస్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (1963)
18. లాటిన్ అమెరికన్ దేశాలు - ఆర్థిక అభివృద్ధి జాతీయ బ్యాంకు (1952)

BRAOU

## 11.5 అమలులో ఉన్న పబ్లిక్ కార్పొరేషన్‌లు

U.Kలో ప్రభుత్వ పరమైన సంస్థలు దాదాపు అన్నియును పబ్లిక్ కార్పొరేషన్‌ల క్రింద చలామణి అగుచున్నవి. ఇదే విధంగా ఈ పబ్లిక్ కార్పొరేషన్ తరహా వ్యవస్థలు అమెరికాలోను, కెనడా, ఫ్రాన్స్‌లోను కూడా కలవు. భారతదేశంలో వివిధ చట్టాల ద్వారా శాసనాల ద్వారా ఈ కార్పొరేషన్‌లు ఉద్భవించినవి. భారతదేశం స్వాతంత్ర్యము సిద్ధించకమునుపు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, బొంబె పోర్టు ట్రస్టు, కలకత్తా పోర్టు కమీషన్ మరియు మద్రాసు పోర్టు ట్రస్టులు పబ్లిక్ కార్పొరేషన్‌ల క్రింద నమోదు అయినవి. ప్రస్తుతానికి అమలులో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్‌లు ఈ దిగువ ఇవ్వబడినవి.

1.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా

2.స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా

3.యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

4.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

5.ఇండస్ట్రియల్ ఫైనాన్సియల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

6.నేషనల్ బ్యాంకు మరియు వ్యవసాయ తిరిగి నిధులు సమకూర్చే కార్పొరేషన్

7.దామోదర్ వేలీ కార్పొరేషన్

8.ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

9. ఆయిల్ మరియు గాస్ కమీషన్

10.భారత ఆహార కార్పొరేషన్

11.ఎయిర్ ఇండియా మరియు ఇండియన్ ఏర్‌లైన్స్

12.పోర్టు ట్రస్టు మరియు అంతర్జాతీయ ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా

13.కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్

14.భారతదేశ సహకార అభివృద్ధి కార్పొరేషన్

15.కార్మికుల ప్రభుత్వ భీమాపథకం

ఈ దిగువ తెల్పిన రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు (కార్పొరేషన్‌లు)

1. విద్యుచ్ఛక్తి బోర్డు

2. రాష్ట్ర రవాణా సంస్థ

3. ద్రవ్య కార్పొరేషన్

4. భూమి తనఖా బ్యాంకులు

5. రాష్ట్ర గిడ్డంగి (Ware Housing) కార్పొరేషన్

BRAOU

## 11.6 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ

చిన్నతరహా మధ్యతరహా పారిశ్రామిక సంస్థల వ్యవస్థాపనకు, విస్తరణకు కావలసిన ఆర్థిక సహాయాన్ని సమకూర్చుటలోని రాష్ట్ర స్థాయిలో సంస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నదని స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం గుర్తించినది. 1948లో పారిశ్రామిక విత్త సహాయ సంస్థను, భావితరహా సంస్థను ద్రవ్య అవసరాలను తీర్చడం కోసం స్థాపించినపుడే దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఉన్న చిన్న, మధ్య తరహా సంస్థల ద్రవ్య అవసరాలను తీర్చడంకోసం అదే మాదిరి సంస్థల ఏర్పాటు అవసరమని భావించినది. అందుచేతనే 1951 సెప్టెంబరులో పార్లమెంటు చే ఆ రాష్ట్ర విత్త సహాయ సంస్థల చట్టం ఆమోదించబడి, 1952 ఆగస్టు 1వ తేది నుంచి అమలులోకి వచ్చింది. ఆ ఫలితంగా రాష్ట్ర విత్త సహాయక సంస్థలు స్థాపించబడ్డాయి.

మొట్టమొదట పంజాబు రాష్ట్ర ప్రభుత్వం 1953లో పంజాబు విత్త సహాయక సంస్థను స్థాపించినది. తర్వాత వివిధ రాష్ట్రాలలో యీ సంస్థలు ప్రారంభించబడినవి. ప్రస్తుతం భారతదేశంలో వివిధ రాష్ట్రాలలో 18రాష్ట్ర విత్త సహాయ సంస్థలు పనిచేస్తున్నవి. కార్యకలాపాల పరిధిలో తప్ప యివి అన్ని విధాల భారత పారిశ్రామిక విత్త సంస్థవలె పనిచేస్తాయి. పారిశ్రామిక విత్త సంస్థ పెద్ద సంస్థలకు ధన సహాయం చేస్తుండగా, రాష్ట్ర విత్త సహాయ సంస్థలు చిన్న

సంస్థలుగా మాత్రమే ద్రవ్య సహాయం చేస్తుండగా, రాష్ట్ర విత్త సహాయ సంస్థలు చిన్న సంస్థలుగా మాత్రమే ద్రవ్యసహాయం చేస్తాయి. సాధారణంగా వీటి కార్యకలాపాలు ఒక పారిశ్రామిక పరిమితమవుతాయి. కొన్ని సంస్థల కార్యకలాపాలు, ప్రత్యేక రాష్ట్ర విత్త సహాయ సంస్థలు లేని పొరుగు రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించబడినవి.

## 11.6.1 ధ్యేయాలు

బ్యాంకులనుండి ఋణసౌకర్యం పొందలేని చిన్న సంస్థలకు కావలసిన మధ్య కాలిక, దీర్ఘకాలిక ధనసహాయం సమకూర్చడమే రాష్ట్రవిత్త సహాయ సంస్థలయొక్క ముఖ్య ధ్యేయంగా నున్నది. ఆ సంస్థల మూలధన అవసరాలకు ఈ ఆర్థిక సహాయం అందించబడుతుంది.

## 11.6.2 వ్యాపార పరిధి

కొత్త సంస్థల స్థాపనకు, అమలులోగల పాత సంస్థల ఆధునీకరణకు, పునరుద్ధరణకు, విస్తరణకు, ఉత్పత్తిలో వైవిధ్యానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని ఈ సంస్థలు అందిస్తాయి. వ్యాపార సంస్థ అంటే పబ్లిక్ కంపెనీ, ప్రైవేటు కంపెనీ లేదా స్వంత భాగస్వామ్య సంస్థలైన కావచ్చు.

A.P.S.F.C. 1951 రాష్ట్ర విత్త సహాయ సంస్థల చట్టం (Sec.2 (c) అనుసరించి ఈ క్రింది కార్యకలాపాలలో నిమగ్నమైన ఏ సంస్థ అయిన రాష్ట్ర విత్త సహాయక సంస్థ నుంచి ఆర్థిక సహాయాన్ని పొందవచ్చు. (a) మైనింగ్ (b) హోటల్ (c)రోడ్డు రవాణ (d) విద్యుచ్ఛక్తి, ఉత్పత్తి పంపిణీ (e) షిప్పింగ్ (f) వస్తువుల ఉత్పత్తి మరియు ప్రాసెసింగ్, నిల్వ చేయడం.

## 11.6.3 మూల ధన వనరులు

రాష్ట్ర విత్త సంస్థలకు మూలధనం కనిష్ట పరిమితి 50లక్షలు గరిష్ట పరిమితి 10కోట్లు మించ కుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలను బట్టి వుంటుంది. ఈ మూలధనంలో నాల్గింట మూడు వంతులు రాష్ట్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు, నిర్దుష్టమైన బ్యాంకులు, సహకార బ్యాంకులు, భీమా కంపెనీలు ముందుగానే నిర్ణయించబడిన నిష్పత్తిలో సమకూర్చుతాయి. మిగిలిన నాల్గవ వంతు మూలధనాన్ని ప్రజలకు జారీ చేస్తారు. చెల్లించిన మూలధనాన్ని రిజర్వులకు పది రెట్లకు మించకుండా బాండ్లను, డిబెంచర్లను జారీ చేసి నిధులు సమకూర్చుకోవచ్చు. అంతేకాక ఇవి రిజర్వు బ్యాంకునుంచి రాష్ట్ర ప్రభుత్వాలనుంచి వాణిజ్య బ్యాంకులనుంచి ఋణాలు తీసుకోవచ్చు. ఐయిదు సం.లలోపు పబ్లిక్ డిపాజిట్లను అంగీకరించవచ్చు. 1987-88 నాటికి మొత్తం 18సంస్థల మొత్తం నిధులు 1857కోట్లుగా ఉన్నవి.

## 11.6.4. నిర్వహణ

ప్రతి సంస్థను పది మంది సభ్యులతో కూడిన డైరెక్టర్ల బోర్డును నిర్ణయిస్తుంది. ఆ రాష్ట్రానికి చెందిన ప్రభుత్వం అధ్యక్షుని, మ్యానేజింగ్ డైరెక్టరును ముగ్గురు డైరెక్టర్లను నియమిస్తుంది. పారిశ్రామిక విత్త సంస్థ ఒకరిని, పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు మరొకరిని నియమిస్తుంది. షెడ్యూలు బ్యాంకులు ఒక డైరెక్టరును, సహకార బ్యాంకులు ఒక డైరెక్టరును, మిగిలిన ఆర్థిక సంస్థలన్నీ కలిసి మరొక డైరెక్టరును ఎన్నుకొంటారు. మిగిలిన ఒకరిని వాటాదారులు తమ ప్రతినిధిగా ఎన్నుకుంటారు.



BRAOU

రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేసే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్త సంస్థను 1955వ సం. లో స్థాపించడమైనది.

## 11.6.7 విధులు

ఈ సంస్థ విధులను ఈ దిగువ విధంగా చెప్పవచ్చు.

1. భూములు, భవనాలు, యంత్రాల కొనుగోలుకు కావలసిన దీర్ఘకాలిక ఋణాలను మంజూరు చేయడం.
2. భారతదేశంలోని సప్లయి దారులనుంచి కొనుగోలు చేసిన యంత్రాలకు చెందిన విలంబిత వాయిదా చెల్లింపులకు వ్యవస్థాపకుని తరఫున హామి ఇవ్వడం.
3. పారిశ్రామిక సంస్థలు జారీ చేసిన వాటాలకు, డిబెంచర్లకు బాండ్లకు చందా-పూచీ ఇవ్వడం.
4. 20సం.లకు మించకుండా వ్యవస్థాపకులకు మార్కెట్ నుండి పొందిన ఋణాలకు హామి ఇవ్వడం.
5. స్థిరాస్తుల కొనుగోల్లుకై వాణిజ్య బ్యాంకులనుండి సహకార బ్యాంకులనుండి తెచ్చుకొన్న ఋణాలకు హామి ఇవ్వడం.
6. పారిశ్రామిక సంస్థల డిబెంచర్లను కొనడం.
7. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయం కింద సంస్థలకు విదేశీ కరెన్సీ ఋణాలను ఏర్పాటుచేయడం.
8. 20 లక్షల రూపాయల వరకు ప్రత్యేక మూలధన సహాయం అందించడం
9. కేంద్ర ఋణ సహాయ సంస్థలైన పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు, పారిశ్రామిక విత్త సంస్థ, పారిశ్రామిక పరపతి - పెట్టుబడి సంస్థలతో కలిసి ఋణాలను ఇవ్వడం, సంయుక్త ఆర్థిక పథకాల కింద వాణిజ్య బ్యాంకులతోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి బ్యాంకులు కలిసి ఋణాలివ్వడం.
10. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గాని; ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వంచేత గుర్తించబడిన ఏ ఇతర ఆర్థిక సహాయక సంస్థలకు గాని ప్రతినిధిగా గాని వ్యవహరించడం.

BRAOU

ఈ కార్పొరేషన్లు వివిధ పారిశ్రామిక సంస్థలకు ఋణాల రూపంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. అయితే ఆయా సంస్థల మూలధనం, స్వేచ్ఛా రిజర్వుల మొత్తం ఒక కోటి రూపాయలకు మించకూడదు. రాష్ట్ర విత్త కార్పొరేషన్ల చట్టం 1972 చేయబడిన సవరణ ప్రకారం కార్పొరేషన్లు అందజేసే ఋణసహాయం కంపెనీలకు, సహకార సంస్థలకు 30లక్షల రూపాయలు కాగా ఇతర సంస్థలకు 15లక్షల రూపాయలు గరిష్ట పరిమితిని నిర్ణయించినవి.

A.P.S.F.C. : ఒక రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఈ విత్త సంస్థలు ప్రత్యేక పాత్రను పోషిస్తున్నట్లు చెప్పవచ్చు. ఈ సంస్థలు రెండు పరస్పర విరుద్ధమైన విధులను సమన్వయం చేస్తాయి. (a) మధ్యతరహా చిన్నతరహా సంస్థలకు అవసరమైన మూలధనాన్ని సంపాదించుటకు తోడ్పడటం, బ్యాంకులవలె ఋణాన్ని పొందే సంస్థల యొక్క ఆర్థిక స్తోమతను ఆస్తుల రూపంలో హామీలను పొందడం.

దిగువ పేర్కొన్న అంశాలు ప్రత్యేక ద్రవ్య సహాయక సంస్థల పాత్రను నొక్కి వక్కాణిస్తాయి.

1. ప్రధానంగా అభివృద్ధి విత్తమును ఏర్పాటు చేయడం - స్థిరాస్తుల సంపాదనకు విత్తమును సమకూర్చుట.
2. అవి వ్యాపార సిద్ధాంతాలపై వ్యవహరించిన ప్రజల ఆస్తులపై దృష్టిని ఉంచటం.

3. ఇవి సాధారణ విత్త సహాయ సంస్థలతో పోటిపడవు. ఇతర వనరుల ద్రవ్యం లభ్యంకానప్పుడు ఇవి సహాయ పడతాయి.

4. ఇవి పరిశ్రమలకు ద్రవ్య సహాయాన్ని కాకుండా ఇతర కార్యకలాపాలను కూడా మద్ధతు నిస్తూ పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి.

## 11.6.8 సహాయాన్ని అందజేసే పద్ధతులు

వివిధ పరిశ్రమలకు ద్రవ్య సహాయాన్ని అందచేసే నిమిత్తం ప్రతి సంవత్సరం పరిశ్రమలను మూడు భాగాలుగా విభజిస్తుంది. ప్రాధాన్యత నిస్తూ (Priority List) ఋణాత్మక నిస్తూ (Negative list) and పరిమిత ప్రాతిపదికపై నిర్ణయించే లిస్టు (List of industries on restrictive basis) దీనికి APSFC - రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల లాభదాయకత గల అంశాలను స్థానిక పరిస్థితులను దృష్టిలో నుంచుకొని పరిశ్రమల జాబితాలను తయారు చేస్తుంది. డిమాండును తక్కువగా సామర్థ్యం ఉన్న పరిశ్రమలను ప్రాధాన్యత జాబితాలో చేర్చుతారు. తగినంత సామర్ధ్యాన్ని సాధించిన పరిశ్రమలను ఋణాత్మక జాబితాలో చేర్చుతారు. ఇవి ద్రవ్య సహాయాన్ని పొందడానికి అనర్హులుగా చెప్పవచ్చు. సామర్థ్యం యొక్క పరిమాణంపై పరిమితులు విధించడం, స్థలనిర్ణయంపై ఆంక్షలు విధించడం వాటిని పరిమితులుగల జాబితాలో చేర్చుతారు. 1976 - 77సం.లో గుంటూరు, ప్రకాశం జిల్లాలో ప్రత్తిని వేసే సంస్థలలో అనేక సంస్థలకు ద్రవ్య సహాయం అందజేయుట వలన, వాటి మధ్య పోటి నెలకొని నష్టాలు రావటం కార్పొరేషన్‌కు ఋణవాయిదాలను, చెల్లించకపోవటం వలన ఆ సంస్థలను కార్పొరేషన్లు ప్రోత్సహించలేదు.

**సహాయాన్ని అందించటం, పంపిణీ చేయడం (1980-1993)**

| సం.లు | మంజూరు చేయుట | పెరుగుదల రేటు శాతం | పంపిణీలు | పెరుగుదల రేటు శాతం |
|---|---|---|---|---|
| 1980-81 | 370.5 | 40.4 | 248.0 | 34.2 |
| 1981-82 | 509.6 | 37.5 | 317.7 | 28.1 |
| 1982-83 | 611.6 | 20.0 | 404.0 | 27.2 |
| 1983-84 | 644.9 | 5.4 | 435.5 | 7.8 |
| 1984-85 | 743.1 | 15.2 | 497.7 | 14.3 |
| 1985-86 | 1009.1 | 35.8 | 608.5 | 22.3 |
| 1986-87 | 1210.8 | 20.0 | 791.9 | 30.1 |
| 1987-88 | 1305.0 | 7.8 | 942.5 | 19.0 |
| 1988-89 | 1391.1 | 6.6 | 1055.2 | 12.0 |
| 1989-90 | 1514.2 | 8.8 | 1156.5 | 9.6 |
| 1990-91 | 1863.9 | 23.1 | 1270.8 | 9.9 |
| 1991-92 | 2190.3 | 17.5 | 1536.8 | 20.9 |
| 1992-93 | 2025.4 | (-7.5) | 1569.7 | 2.1 |
| మార్చి 93అంతానికి సంచితం చేసినది | 15491.8 | | 11909.6 | |

**(Source IDBI 1992-93 Report)**

BRAOU

పై పట్టిని పరిశీలించినపుడు, ఈ దిగువ అంశములు విశదమగును.

1. నిధులు మంజూరులు గడిచిన 12 సం.రాల కాలంలో సుమారు 7 రెట్లు పెరుగుదల.
2. అదే విధంగా, పంపిణీలలో గమనించినచో పెరుగుదల శాతంలో హెచ్చుతగ్గులు కనబడుచున్నవి. కాని 1992-93లో గత సం.తో పోల్చినచో తక్కువ మొత్తాలు మంజూరుచేయుట మరియు పంపిణీ చేయడం జరిగింది. యివి SFC యొక్క పని తీరుపై ఒక ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

# 11.7 భారత పారిశ్రామిక విత్త కార్పొరేషన్

వాణిజ్య పారిశ్రామిక సంస్థలను విత్తం సమకూర్చడానికి 1882లో Balgiumలో Society General De Belgim అనే మొదటి అభివృద్ధి సంస్థను స్థాపించడం జరిగింది. అట్లాగే 1852లో Franceలో Credit Mobilities అనే సంస్థను స్థాపించెను. అదే విధంగా కెనడా పారిశ్రామికాభివృద్ధి బ్యాంకుల (1944), గ్రేట్ బ్రిటన్ పారిశ్రామిక విత్త కార్పొరేషన్ లిమిటెడ్, పారిశ్రామిక వాణిజ్య విత్త కార్పొరేషన్ లిమిటెడ్, (1946)లో నెలకొల్పినారు. 1948లో భారతదేశంలో "భారతపారిశ్రామిక విత్త కార్పొరేషన్"లను ప్రారంభించినారు.

## 11.7.1 లక్ష్యాలు

ఒక దేశంలో పారిశ్రామికాభివృద్ధి కోసం పరిస్థితులను అనుకూల పరచడమనేది అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధనం కొరతగా వుండటం ప్రతిభావంతమైన వ్యవస్థాపకుల కొరత ఉంటడంవలన, అభివృద్ధి విత్త సంస్థల కార్యకలపాలు దీర్ఘకాలిక ప్రాతిపదికలో లాభాలు సమకూర్చుటమే కాకుండా, పారిశ్రామిక సంభావ్య పరిశీలనలు జరపటం, పెరుగుదల వలన ప్రాజెక్టులను గుర్తించటం, మొదలైన వ్యవస్థాపనాంశాలు కూడా చేపట్టినవి.

BRAOU

యీ సంస్థల ప్రధాన ధ్యేయాలను దిగువ పేర్కొన్న విధంగా చెప్పవచ్చును.

1.పరిశ్రమలకు, ముఖ్యంగా ప్రాధాన్యరంగాలకు, మధ్యతరహా దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చడం.
2.చిన్న తరహా పరిశ్రమలకు విత్తం సమకూర్చడం.
3.సమాన ప్రాంతీయ అభివృద్ధి స్థాపించుట.
4.దిగుమతి పరిశ్రమలను దిగుమతి ప్రత్యామ్నాయ పరిశ్రమలను ప్రోత్సాహించడం.
5.సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేయుట
6.ఖాయిలా పడిన పరిశ్రమలను పర్యవేక్షించి, తీసుకొనటం, మొదలగునవి.

### భారతదేశంలో పరిస్థితి

భారతదేశంలో స్వాతంత్ర్యం రాకపూర్వం దేశంలోని మూలధన మార్కెట్ పెద్దగా అభివృద్ధి చెందలేదు. పరిశ్రమలకు కావలసిన దీర్ఘకాలిక విత్త అవసరాలను తీర్చడానికి ఈ మార్కెట్ అనువుగా లేకుండినది. స్వాతంత్ర్యం

వచ్చిన పిదప, మూలధన మార్కెట్‌లోని యీ లొసుగులను సవరించడానికి, అభివృద్ధి బ్యాంకులను, కార్పొరేషన్లను స్థాపించవలసిన ఆవశ్యకత ఏర్పడినది. భారతదేశంలో వాణిజ్య బ్యాంకులు విత్త సంస్థలు బ్రిటీషు వ్యవస్థ దేశ వ్యవస్థ నమూనాలు ఉండుటవలన అవి సాంప్రదాయకంగా వ్యాపారం, పరిశ్రమలకు స్వల్పకాలిక, ఋణసదుపాయాలను మాత్రమే కల్పించగలిగినవి. మూలధన మార్కెట్ మేనేజింగ్ ఏజెన్సీ ఆధీనంలో ఉన్నప్పటికీ, ప్రణాళిక పారిశ్రామికాభివృద్ధి అవసరాలను తగినట్లుగా, ఆ సంస్థలు లాభాలు సమకూర్చలేకపోయెను. ఆ కాలంలో పూచీదారు సంస్థలు ఏర్పడలేదు. కాని పరిశ్రమల యొక్క దీర్ఘకాలిక మూలధన అవసరాలు మాత్రం పెరుగుతూ వచ్చినవి. అప్పట్లో ఉన్న పరిశ్రమలు వాటి పునర్‌నిర్మాణానికి, ఆధునీకరణకు, విస్తరణకు, దీర్ఘకాల మూలధనం కోట్ల రూపాయలతో సమకూర్చవలసిన ఆవశ్యకత ఏర్పడినది.

అవసరమయిన ఆర్థిక, ఇతర అభివృద్ధి సహాయాలు చేసే, భారీ లేదా మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలను త్వరితగతిని అభివృద్ధి చేయడంకోసం 1948సం.లో పారిశ్రామిక ఆర్థిక సంస్థను ఏర్పాటుచేయటంతో పాటు చాలా ఇతర అభివృద్ధి బ్యాంకులను, విత్త సహాయక సంస్థలను, జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 5 ప్రధాన సంస్థలు గలవు. అవి భారత పారిశ్రామిక విత్త సహాయ సంస్థ (IFCI) భారత పరిశ్రమల పరపతి పెట్టుబడి సంస్థ (ICICI) భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు (IDBI) భారత పారిశ్రామిక పునర్‌నిర్మాణ బ్యాంకు (IRCI), భారత ఎగుమతి - దిగుమతి బ్యాంకు (IEBI).

వీటితో పాటు అనేక రాష్ట్ర ఆర్థిక సంస్థలను కూడా నెలకొల్పడం జరిగింది. ఈ సంస్థలను రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీ చట్ట ప్రకారం ఏర్పాటు చేసినవి. ఇవి ఆయా రాష్ట్రాలలో త్వరితగతిని పారిశ్రామికీకరణ సాధించుటకు తగిన సహాయ సహకారాలను అందజేసినవి.

## 11.7.2 వీటి ప్రధాన లక్ష్యాలు

1. ఔత్సాహికులైన వృత్తులను, ఈక్విటీ మూలధనం చేపట్టడం ద్వారా, విత్తనాల పెట్టుబడికి సహాయపడుటద్వార, నష్టధన మూలధనాన్ని సమకూర్చడం
2. పారిశ్రామిక సంస్థలను ఋణాలు హామీలు, కౌలుపై ఋణసౌకర్యం మొదలగు వసతులను కల్పించడం.
3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన, ప్రోత్సాహక పథకాలను అమలుచేయడం.
4. పారిశ్రామిక రంగంలో సక్రీలు చూపించటం Availability Reports అనుకూల నివేదికలను తయారుచేయడం. ఔత్సాహులకు శిక్షణ ఇచ్చి ఎంపికచేయడం వంటి వ్యవస్థాపన చర్యలు చేపట్టడం.
5. పరిశ్రమలకు అవసరమైనటువంటి అనుబంధ సదుపాయాలను (Infrastrucural Facilities) కల్పిస్తూ పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పర్చడం మొదలగునవి.

ఒక దేశపు పారిశ్రామికాభివృద్ధిలో, పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ ప్రోత్సాహనీయమైనదిగా చెప్పవచ్చును. రాష్ట్రాల స్థాయిలో పారిశ్రామిక పెరుగుదలను ప్రగతిని సాధించే విషయంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్లు 1960 కాలంలో ఏర్పడి ఉపయోగకరమైన పాత్రను పోషిస్తున్నట్లు చెప్పవచ్చు. ఉమ్మడి రంగంలో ప్రాజెక్టులను స్థాపించుటకు లైసెన్సులు ఆమోదపత్రాలను సంపాదిస్తూ కార్యకలాపాలను పెంపొందించుకుంటూ, ఈ సంస్థలు రూ.550కోట్లకు పైబడిన పెట్టుబడులను సంపాదించగలిగినవి.

BRAOU

భారతదేశంలో ప్రధానంగా ఏర్పడిన సంస్థగా APIDCని పేర్కొనవచ్చు. భారతదేశపు చిత్రపటంలో రాష్ట్రాల అభివృద్ధి కార్పొరేషన్లలో, ఆంధ్రరాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ ఒక ప్రధాన సాధనంగా రాష్ట్ర ప్రభుత్వ స్వాధీనంలో కలదు. మిగిలిన రాష్ట్రాలలో ఈ రకపు అభివృద్ధి కార్పొరేషన్లు దేశవ్యాప్తంగా 19 కలవు. అవి ప్రారంభమైన నాటినుంచి March 1977వరకు, మంజూరు చేసిన సొమ్ము మొత్తం రూ. 252.96 కోట్లు కాగా, పంపిణీ చేసిన సొమ్ము మొత్తం రూ.173-01కోట్లుగా ఉన్నవి. వాటిలో ఆంధ్రరాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ (APIDC) మూడో స్థానాన్ని ఆక్రమించినది. అంటే March 1977 నాటికి APIDC యొక్క మంజూరు చేసిన వాటా 12.38 శాతంగా పంపిణీచేసిన వాటా 8.9 శాతంగా వుండినది.

March 1977 అంతం నాటికి పంపిణీ మొత్తంలో మొట్టమొదటి కార్పొరేషన్‌గా, మహారాష్ట్ర పారిశ్రామిక మరియు పెట్టుబడుల కార్పొరేషన్ (Maharastra Industrial & Investment Corporation) 30.14 శాతం వాటా, రెండవది గుజరాత్ పారిశ్రామిక మరియు పెట్టుబడుల కార్పొరేషన్ లిమిటెడ్ (Gujarath Industrial and Investment Corporation Limited) 15.8 శాతపు వాటాలతో వుండినవి. దీనిని బట్టి చూస్తే భారతదేశం మొత్తం దృష్ట్యా APIDC పరిశ్రమల వ్యవస్థాపనలో వెనకడుగులేదని చెప్పవచ్చు.

## 11.8 ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ 1960వ సం.లో ప్రైవేటు కంపెనీగా నమోదైనది. దాని అధీకృత మూలధనం అప్పట్లో ఒక కోటి రూపాయలు కాగా, 1977నాటికి, అవి 20కోట్లకు చేరుకున్నవి. 31మార్చి 1977అంతానికి, అవి చెల్లించిన మూలధనం 15.77కోట్ల రూపాయలుగా వుండినది.

BRAOU

### 11.8.1 ప్రధాన ధ్యేయాలు

a. రాష్ట్రంలో ఔత్సాహికులైన వారి ఆధారాలను పెంపొందించుట.
b.సత్వర పారిశ్రామికీకరణకు భారీ, మధ్యతరహా పరిశ్రమలను స్థాపించుట
c.ప్రాంతీయ అసమానతలను తగ్గించుటకు, క్రమపద్ధతిలో వనరులను బదిలిచేయుట
d.అదనపు ఉద్యోగావకాశాలను ఏర్పాటుచేయుట మొదలగునవి.

సంస్థాపన పత్రంలోని మొదటి ధ్యేయం యొక్క అనుబంధ అంశాలు ఇవి కేవలం భారీ, మధ్య తరహా పరిశ్రమలకు పరిమితం కాదని స్పష్టంగా పేర్కొనలేదు. మొదటి ధ్యేయంలోని అనుబంధ అంశాలు:

i) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, వ్యవస్థాపన అభివృద్ధి పరుచుట :
ii) పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు చేయటం, అమలు చేయటం లేదా ఉత్పత్తి విధానాలను అభివృద్ధి చేయటం.
iii) ప్లాంట్లు, యంత్రాలు, రసాయనాలను తయారుచేయటం లేదా పారిశ్రామిక వాణిజ్య వస్తువులను తయారుచేయడం:
iv) విద్యుచ్ఛక్తిని తయారుచేసి, పంపిణీ లేదా అమ్మకానికి నిమగ్నంకావడం : మొదలగునవి.

ఇంకా కార్పొరేషన్ ప్రధానంగా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా వృద్ధిచేయుటకు ఏర్పరచినారు. పంచవర్షప్రణాళికలలో సూచించినట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని వెనుక బడిన ప్రాంతాలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా పెట్టుకొన్నది. పాండే వాంచూ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా 1971సం. నుంచి ప్రతి రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వాటికి ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహాలను ప్రతిపాదించడానికి కొన్ని విధానాలను అనుసరించినవి. అందుచేత ప్రస్తుతం గుర్తించబడిన ప్రాంతాలలో అమలులోనున్నAPIDCసంస్థ యూనిట్‌లన్ని ఈ మధ్య కాలంలో ప్రభుత్వం చేపట్టిన ప్రోత్సాహకాలు లేదా రాయితీల విధానానికి సంబంధించినవిగా భావించబడినవి. వాస్తవానికి APIDC కొన్ని ప్రాంతాలలో అదివరలో స్థాపించిన యూనిట్లు ప్రస్తుతం వెనుకబడిన వాటిగా గుర్తించడమైనది.

# 11.8.2 కార్పొరేషన్ యొక్క పథకాలు

కార్పొరేషన్ చేపట్టిన పథకాలు దిగువ పేర్కొన్న విధంగా ఉన్నవి :

1. ఉమ్మడి వ్యాపారం
2. అనుబంధమైనవి
3. సహాయక యూనిట్లు

1.ఉమ్మడి వ్యాపార యూనిట్లను స్థాపించడానికి, ప్రాజెక్టులను గుర్తించి, ప్రాథమిక నివేదికలను తయారుచేసి, వివరాలతో కూడిన ప్రాజెక్టు రిపోర్టులను తయారుచేసే బాధ్యత ఈ కార్పొరేషన్‌లపై ఉంటుంది. విదేశి సంస్థలతో అవసరమైన సాంకేతిక సహకారానికి ఒప్పందాలను సమకూర్చుకొంటుంది. ప్రాజెక్టులను గుర్తించిన మీదట కేంద్రీయ ఆర్థిక సంస్థలకు దరఖాస్తు పంపుతుంది. ఈ ప్రాథమిక పని ముగిసిన తర్వాత సహ వ్యవస్థాపకుని గుర్తించవలసి ఉంటుంది. సహజ వ్యవస్థాపకుని గుర్తించిన అతనికి యీక్విటిలో 25% వాటా యివ్వడం అవుతుంది. ఉమ్మడి వ్యాపారం ఒప్పందం యిరువురి మధ్య కుదిరిన తదుపరి కొత్త కంపెని స్థాపన జరుగుతుంది.

BRAOU

2.కార్పొరేషన్లు హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తున్న సబ్సిడీమనీ కంపెనీలు జారిచేసిన వాటాలన్నింటిని పొందివుంటూ, రెండు సందర్భాలలో అమలుకు వస్తుంది. a) రాష్ట్రపారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం గల వస్తువును తయారుచేయుటకు ఒక కంపెనీని సబ్సిడిమనీగా స్థాపించుటకు b) ఒక ప్రత్యేక ప్రాజెక్టును గుర్తించి ఉమ్మడివ్యాపారంగా ప్రారంభించుటకు, పని అయిన సహవ్యవస్థాపకుడు గుర్తించబడినపుడు. కొన్ని సందర్భాలలో సహ వ్యవస్థాపకులు సహాయాన్ని అందించినపుడు, ప్రాజెక్టును Subsidiaryగా అమలు చేస్తారు.

3.సహాయక యూనిట్ల విషయంలో, ఔత్సాహికులు వ్యవస్థాపకుల పాత్రను పోషిస్తారు. తాను ప్రాజెక్టును గుర్తించటం, స్థలాన్ని ఎంపిక చేయుట తన పేరిట లైసెన్సును పోషించుట, యీక్విటీ రూపంలో ధన సహాయాన్ని చేయమని విశ్లేషించిన పిదప, కార్పొరేషన్ యీక్విటీలో పాలుపంచుకొంటుంది. ఇవి 10 లేదా 15 శాతం వరకు వుంటుంది. అంతేగాకుండా, కేంద్రీయ ద్రవ్య సంస్థల నుంచి ఋణసౌకర్యం యేర్పాటుకు కార్పొరేషన్ తోడ్పడుతుంది. 10 లక్షల రూ.లకు మించిన స్థిరమూలధనం కలిగిన సంస్థలకు APIDC సహాయపడుతుంది.

సహాయాన్ని మంజూరు చేసినది - పంపిణీ చేసినది

| సం.లు | మంజూరు చేయుట | పెరుగుదల రేటు శాతం | పంపిణీలు | పెరుగుదల రేటు శాతం |
|---|---|---|---|---|
| 1980-81 | 216.4 | 37.2 | 124.6 | 46.1 |
| 1981-82 | 299.6 | 38.4 | 191.1 | 53.4 |
| 1982-83 | 296.6 | (-1.0) | 208.0 | 8.8 |
| 1983-84 | 364.6 | 22.9 | 236.5 | 13.7 |
| 1984-85 | 477.9 | 31.1 | 297.6 | 25.8 |
| 1985-86 | 527.0 | 10.3 | 364.0 | 22.3 |
| 1986-87 | 570.3 | 8.2 | 425.5 | 16.9 |
| 1987-88 | 641.5 | 12.5 | 448.6 | 5.4 |
| 1988-89 | 722.1 | 12.6 | 472.1 | 5.2 |
| 1989-90 | 691.0 | (-4.3) | 545.2 | 15.5 |
| 1990-91 | 523.7 | 23.1 | 598.3 | 9.7 |
| 1991-92 | 1009.0 | 22.5 | 678.7 | 13.4 |
| 1992-93 | 1058.8 | 4.9 | 739.1 | 8.9 |
| మార్చి 93 అంతానికి సంచితం చేయబడినది | 7402.7 | 5658.8 | | |

**(Source IDBI 1992-93 Report)**

పై పట్టీలోని నిధుల మంజూరు - పంపిణీ చేసిన వివరాలను గడిచిన 12సం.రాల కాలంలో పరిశీలించినపుడు నిధుల మంజూరి సుమారు 5 రెట్లు పెరిగినది. అట్లాగే పంపిణీల విషయంలో కూడా సుమారు 6 రెట్లు పెరుగుదల కనబడుతుంది. ఆయా సంవత్సరాలలో మంజూరులో పెరుగుదల శాతం రేట్లు సుమారు 9 శాతం మేరకు, పంపిణీల పెరుగుదల శాతం రేటు సుమారు 6 శాతం మేరకు తగ్గుదల చూపుతున్నది.

## 11.9 చిన్నతరహా పరిశ్రమ

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పురాతన కాలంనుంచి చిన్నతరహా పరిశ్రమల పాత్ర విశిష్టంగా ఉన్నట్లు చెప్పవచ్చు. అయితే దురదృష్టవశాత్తు బ్రిటీషు వారు అవలంబించిన వ్యతిరేక విధానాలవలన ఈ పరిశ్రమల ప్రాధాన్యత సన్నగిల్లినది. స్వాతంత్ర్యం సంపాదించిన పిదప ఆర్థిక వ్యవస్థలో ఈ పరిశ్రమలకున్న ప్రాధాన్యత దృష్ట్యా, వీటి అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషిచేసిన, పూర్వపు ప్రాముఖ్యతను సంతరించుకోలేక పోయినది.

BRAOU

## 11.9.1 నిర్వచనాలు

శ్రీ కె. టి. షా ప్రకారం స్వంత బాధ్యతపై తన నైపుణ్యాన్ని ఉపయోగించి, తానే మార్కెట్ చేసుకునే విధంగా, ఒక కార్మికుడు చేపట్టిన ఉత్పత్తి కార్యకలాపాలను చిన్న పరిశ్రమగా చెప్పవచ్చు.

ఫిస్కల్ కమిషన్ ప్రకారం 10నుంచి 50వరకు వేతనంపై పనిచేసే కార్మికులున్న సంస్థను చిన్నతరహా పరిశ్రమగా చెప్పవచ్చు. చిన్నతరహా పరిశ్రమల బోర్డు 1955లో జరిపిన సమావేశంలో ఏదైనా సంస్థ విద్యుచ్ఛక్తి సహాయంతో 50మంది కార్మికులతోను, విద్యుచ్ఛక్తి లేకుండా 100మంది కార్మికులను ఉపయోగిస్తూ మూలధన ఆస్తులు రూ. 5లక్షలకు మించకుండావుంటే దానినే చిన్నతరహా పరిశ్రమగా చెప్పవచ్చునని తీర్మానించినది.

1960 సం.లో ప్రభుత్వం కార్మికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా రూ. 5 లక్షల పెట్టుబడితో కొనసాగే ఏ సంస్థ నైనా చిన్న తరహా పరిశ్రమగా చెప్పవచ్చునన్నది. ఆ తరువాత 1963 లోను, 1975 లోను ఈ నిర్వచనం రెండు సార్లు సవరించబడినది. 1985సం.లో సవరించబడిన ప్రస్తుతపు నిర్వచనం ప్రకారం 35 లక్షల రూపాయలలోపు పెట్టుబడిగల సంస్థలను చిన్నతరహా పరిశ్రమలుగా పరిగణిస్తారు.

## 11.9.2 ప్రాముఖ్యత

దేశ ఆర్థికాభివృద్ధిలో చిన్నతరహా పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్యత కలదు. ఉద్యోగావకాశాలను కల్పించడంలో, పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడంలో, ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో, దేశంలోని వ్యవస్థాపక శక్తిని పెంపొందించడంలో చిన్నతరహా పరిశ్రమలకు విశేష ప్రాధాన్యం కలదు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ పారిశ్రామిక అభివృద్ధిలో ఈ పరిశ్రమలను అభివృద్ధికి పారిశ్రామిక వాడలను (Industrial Estates) నిర్మించటం, ఈ దేశాలతోనే మొదలయినది.

ఈ పరిశ్రమలకు గల ప్రాముఖ్యత దిగువ పేర్కొన్న అంశాలలో గ్రహించవచ్చు :

### 1.ఉద్యోగ కల్పన

చిన్నతరహా పరిశ్రమలను సమర్థించడానికి ముఖ్య కారణం వీటిలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండటం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో నిరుద్యోగం ఎక్కువగా ఉండటం వలన, వీటి ప్రాధాన్యత పెరిగినది. సాధారణంగా భారీ పరిశ్రమల స్థాపనకు అధిక మూలధనం అవసరమవుతుంది. కాని చిన్నతరహా పరిశ్రమలు శ్రామిక శక్తిపై ఎక్కువగా ఆధారపడతాయి. కాబట్టి మూలధనం కొరతగా ఉంటూ, శ్రామిక శక్తి అధికంగా ఉన్న దేశాలకు ఈ పరిశ్రమలు అనుకూలంగా ఉంటాయి.

BRAOU

మనదేశంలో 1973 - 74లో చిన్నతరహా పరిశ్రమలలో పనిచేస్తున్న వారి సంఖ్య 176.36లక్షలు కాగా, 1984-85నాటికి అది 315లక్షలకు పెరిగినది. వీటిలో చిన్నతరహా పరిశ్రమలు 122 లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్నది.

## 2.పారిశ్రామిక ఉత్పత్తి

ఈ పరిశ్రమలు ఉపాధికల్పనతో పాటు వస్తు ఉత్పత్తిలో కూడా ముందంజ వేస్తున్నది. భారీ సంస్థలలో ఉత్పత్తి సూచిక 5.2 శాతం పెరుగగా, చిన్న తరహా పరిశ్రములలో ఉత్పత్తి, ఉద్యోగకల్పనలు పెద్ద పరిశ్రములలో కంటే మెరుగ్గా ఉన్నాయని చెప్పవచ్చు. కేంద్ర గణాంక సంస్థ సమాచారం ప్రకారం 1979-80లో చిన్న తరహా పరిశ్రమల రంగం మొత్తం పారిశ్రామిక రంగం యొక్క ఉత్పత్తి విలువలో 49 శాతం సమకూర్చినది.

## 3.ఎగుమతులు

స్వాతంత్ర్యం సంపాదించిన పిదప స్థాపించబడిన అనేక అధునాతన చిన్న పరిశ్రమలు ఎగుమతుల ద్వారా, విదేశీ మారక ద్రవ్యం సంపాదించడానికి తోడ్పడుతున్నది. ఈ పరిశ్రమలు ఎగుమతి చేసిన వస్తువుల విలువ 1973-74లో ఉన్న 852.5 కోట్ల నుంచి 1984-85 నాటికి 4,557.6 కోట్లకు పెరిగినది. అధునాతన వస్తువుల ఎగుమతులలో చిన్నతరహా పరిశ్రమల వాటా 53 శాతం ఉన్నది.

## 4.ఆదాయాల వ్యత్యాసం తగ్గింపు

భారతదేశంలో ఆదాయం, సంపద పంపిణీలో గల తేడాలను తగ్గించడానికి చిన్న తరహా పరిశ్రమలు దోహదపడుతున్నవి. ఈ పరిశ్రమలు ముందుగా ఉత్పత్తి కార్యకలాపాలు విస్తృత పరచడానికి తద్వార, వనరుల న్యాయాత్మక పంపిణీ శక్తి, ఆదాయాల వ్యత్యాసాలలో తగ్గుదలకు కృషి చేస్తాయి.

## 5.సమతల ప్రాంతీయాభివృద్ధి

దేశంలోని పరిశ్రమలు కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా వివిధ ప్రాంతాలకు విస్తరించుటకు ఈ పరిశ్రమలు తోడ్పడుతాయి. మనదేశంలో మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లో పరిశ్రమలు ఎక్కువగా కేంద్రీకరించబడినవి. దాని వలన ప్రాంతీయ అసమానతలు ఏర్పడినవి. అంతేకాకుండా పారిశ్రామిక కేంద్రాలలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం మురికివాడలను నిర్మూలించడంలో ఈ పరిశ్రమల పాత్ర ఎంతగానో ఉన్నది.

## 6.మూలధన సమీకరణ

చిన్న చిన్న పొదుపు మొత్తాలను పారిశ్రామిక రంగంవైపు మళ్లించడంలో ఈ పరిశ్రమల ప్రాముఖ్యం సాటిలేనిది. ఈ పరిశ్రమల స్థాపనకు అతితక్కువ మూలధనం సరిపోతుంది.

BRAOU

## 7.వ్యవస్థాపనకు ప్రోత్సాహం

ప్రజలలో వ్యవస్థాపనను పెంపొదించడంలో చిన్న తరహా పరిశ్రమలు విశేషంగా కృషిచేస్తాయి. ఈ సంస్థల ద్వారా వ్యవస్థాపకుడు నిధులను సమీకరించడం, కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యం సంపాదిస్తాడు. స్వాతంత్ర్యం సంపాదించిన తర్వాత కాలంలో, ఈ పరిశ్రమల ద్వారా అనేక మంది వ్యవస్థాపకులుగా మారారు.

## 8.వనరుల వినియోగం

ఈ పరిశ్రమలు దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించిఉంటాయి. కాబట్టి ఆయా ప్రాంతాలలో నిరుపయోగంగా ఉన్న వనరులను ఉపయోగించి ఉత్పత్తిని అధికం చేస్తాయి. ఈ విధంగా ఆయా ప్రాంతాలు స్వయం సమృద్ధిగా తయారయ్యే అవకాశం ఉన్నది.

## 9.సామాజిక ప్రాముఖ్యత

ఈ పరిశ్రమలు ప్రజలను ఉత్పత్తి కార్యకలాపాల వైపు ఆకర్షిస్తాయి. తద్వార దేశంలోని పొదుపు మొత్తాలు పారిశ్రామిక రంగానికి మళ్ళించబడతాయి. వివిధ ప్రాంతాలలో ఈ పరిశ్రమల అభివృద్ధి పట్టణాల జనసాంద్రతను తగ్గిస్తుంది.

## 10.పారిశ్రామిక శాంతి

సాధారణంగా పెద్ద పరిశ్రమలకు ఎదురయ్యే పారిశ్రామిక వివాదాలకు చిన్న తరహా పరిశ్రమలు గురికావు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా యజమానులకు, కార్మికులకు మధ్య సత్సంబంధాలు నెలకొనే వీలు వుంటుంది. పారిశ్రామిక శాంతి నెలకొంటుంది.

BRAOU

# 11.9.3 చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి - ప్రభుత్వ కృషి

ఆర్థికాభివృద్ధిలో చిన్నతరహా పరిశ్రమలకున్న ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం వీటి అభివృద్ధికి అవసరమైన అనేక చర్యలను 1948 పారిశ్రామిక విధాన తీర్మాన కాలంనుంచే చేపట్టినది. వినియోగ వస్తువులలో స్వయం సమృద్ధి సాధించడానికి, స్థానిక వనరులను పూర్తిగా వినియోగించుకోడానికి చిన్న తరహా పరిశ్రమల పాత్ర ఎంతైన కలదని పై తీర్మానం పేర్కొన్నది. ఈ విధానాలకు అనుగుణంగానే పంచవర్షప్రణాళికలో అనేక చర్యలను ప్రతిపాదించడం జరిగింది. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి అందజేస్తున్న కృషిలో దిగువ పేర్కొన్న చర్యలను ప్రధానంగా పేర్కొనవచ్చు.

## 1.ముడి పదార్థాలు, యంత్రపరికరాల సప్లయి

దేశంలోని చిన్నతరహా పరిశ్రమలు ముడి పదార్థాల సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గమనించి వాటి నివారణకు గాను జాతీయ చిన్న పరిశ్రమల కార్పొరేషన్ (NSIC) ఆధ్వర్యంలో అధిక నిల్వలను

సృష్టించినది. అదే విధంగా, విదేశాలనుండి యంత్రాలను, యంత్ర పరికరాలను దిగుమతి చేసుకోవడంలో ఉదార విధానాలను అనుసరిస్తున్నది.

## 2.విత్త సహాయం

ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ఈ పరిశ్రమలను పెద్ద ఎత్తున ధన సహాయం చేస్తున్నది. ప్రభుత్వ సంస్థలైన రాష్ట్ర ద్రవ్య కార్పొరేషన్లు (SFCs) వాణిజ్య బ్యాంకులు, స్వల్ప కాల, దీర్ఘకాల పరపతి సౌకర్యాలను కల్పిస్తున్నాయి. ఈ సంవత్సరములో రీ ఫైనాన్స్ సౌకర్యం కల్పించడం కోసం చిన్న తరహా పరిశ్రమలను బ్యాంకులను ప్రభుత్వం స్థాపించాలని సంకల్పించినది. వ్యవస్థాపకులు విత్తం కోసం ఇబ్బంది పడకుండా వుండేందుకు రిస్క్ మూలధనాన్ని, మార్జిన్ ధనాన్ని కూడా అందిస్తున్నవి. ప్రస్తుతంలో వున్న విత్త సౌకర్యాలను బట్టి ప్రాజెక్టు వ్యయంలో కేవలం 10 శాతంలో ఏ వ్యవస్థాపకుడైన సంస్థను నెలకొల్పవచ్చు.

## 3.మార్కెటింగ్ సహాయం

ఏ సంస్థ మనుగడైనా అది ఉత్పత్తి చేసిన వస్తువులను, సమర్థవంతంగా అమ్ముటపై ఆధారపడివుంటుంది. అనేక కారణాల వలన ఈ సంస్థలు ఉత్పత్తి చేసిన వస్తువులకు సరైన డిమాండు ఉండటం లేదు. ఈ లోపాన్ని సరిదిద్దుటకు ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తున్నది. ప్రభుత్వ విభాగాలు ఈ సంస్థల వస్తువులను తప్పనిసరిగా కొనేటట్లు చేయటం, ధరలో 15 శాతం ఆధిక్యాన్ని ఇవ్వటం, పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక బోర్డులను స్థాపించడం మొదలైన చర్యలను ప్రభుత్వం చేపట్టినది.

## 4.సాంకేతిక సహాయం

చిన్న తరహా పరిశ్రమలలో వస్తువుల ఉత్పత్తి, నాణ్యత సామర్థ్యాన్ని పెంచడంకోసం, (Extension) శిక్షణా కేంద్రాలు అందజేస్తున్నాయి. ఈ పథకంలో భాగంగా చిన్న పరిశ్రమల యాజమాన్యాలకు, నిర్వాహకులకు శిక్షణా సౌకర్యాలను కల్పిస్తున్నవి.

## 5.వస్తువుల రిజర్వేషన్

మార్కెట్‌లో పోటీ పరిస్థితులను తట్టుకుని, క్రమంగా అభివృద్ధి చెందేటట్లు చేయడం కోసం ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని అనుసరిస్తున్నది. 1966-68లో 46 వస్తువులతో ప్రారంభించిన ఈ విధానాన్ని ప్రస్తుతం 843 వస్తువులకు విస్తరింపచేసింది. ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కమీషన్‌కి రాష్ట్ర చిన్న పరిశ్రమల బోర్డు, పరిశ్రమల డైరెక్టరేట్ మొదలగు వాటిని ఏర్పరిచి చిన్న పరిశ్రమలకు రక్షణతో పాటు, అభివృద్ధికి పాటు పడినది.

# 11.10 ఆంధ్రప్రదేశ్ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్

1959సం.లో భారత ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి ఒక ప్రత్యేక కార్పొరేషన్ ప్రతి రాష్ట్రంలో ఉండవలెనని సూచించినది. ఆ కారణంగా, 1961సం.లో ఆంధ్రప్రదేశ్ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్‌ను

(APSSIDC)ను ఒక ప్రభుత్వ కంపెనీగా నమోదు చేసారు. దీని ప్రధాన ధ్యేయం రాష్ట్రంలోని చిన్న తరహా పరిశ్రమలను స్థాపించడం లేదా సలహాలు ఇవ్వడం లేదా ద్రవ్య సౌకర్యాలను కల్పించడం మొదలగునవి.

ఈ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్‌ల విధులు ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి మారుతూ ఉంటాయి. కొన్ని రాష్ట్రాలలో చిన్న సంస్థలకు ఈ అభివృద్ధి కార్పొరేషన్‌లు సరైన స్థలాలు ఏర్పరచడం, పారిశ్రామిక వాడలను నిర్వహించటం వంటివి చేస్తాయి. ఈ కార్పొరేషన్‌లు మరికొన్ని రాష్ట్రాలలో ముడి సరుకుల సేవా సంస్థలతో పాటు యీక్విటీ రూపంలో ద్రవ్య సహాయాన్ని అందిస్తాయి. మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో ఈ కార్పొరేషన్‌లు సరుకుల ఎగుమతితో పాటు విదేశాలలో విక్రయశాలలు (Showrooms)కూడా ఏర్పాటు చేసినవి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో ఈ కార్పొరేషన్‌లు ఉత్పత్తి కేంద్రాలుగా పనిచేస్తాయి.

ఈ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ దిగువ పేర్కొన్న కార్యకలాపాలను నిర్వహిస్తున్నది.

1.వీటి నియంత్రణలో ఉత్పత్తి సంస్థలను నిర్వహించడం

2.యీక్విటీ రూపంలో, చిన్న తరహా యూనిట్‌లను వ్యవస్థాపించటం. సానుకూలత నివేదికలను (Feasibility Reports) తయారు చేయటం.

3.రాష్ట్రంలోని చిన్న తరహా యూనిట్‌లకు ముడి సరుకును సంపాదించి పంపిణి చేయటం, ముఖ్యంగా ఇనుము, దుక్క యినుము, కోకింగ్ బొగ్గు, మొదలగునవి.

4.చిన్న తరహా యూనిట్‌ల వస్తువులను విక్రయించడం.

రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్పత్తి లేదా ప్రదర్శన యూనిట్లను ఏర్పాటు చేసినది. ఇది 1962సం.లో 21 అట్లాంటి ఉత్పత్తి యూనిట్‌లను, 1965సం.లో మరో రెండు యూనిట్‌లను కార్పొరేషన్‌కు బదిలీచేసినది. ఈ యూనిట్లు అధునాతన యంత్రాంగంలో రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపించియున్నవి. ఈ యూనిట్ల యొక్క పరోక్ష చార్జీల భారంతో కార్పొరేషన్ రాష్ట్రంలోని ఇతర చిన్న తరహా పరిశ్రమ యూనిట్లతో పోటీపడవలసి వచ్చినది. ఆ కారణంగా, 11ఉత్పత్తి యూనిట్‌లను అమ్మివేయాలని నిర్ణయించినది. ప్రస్తుతంలో కార్పొరేషన్ 19ఉత్పత్తి యూనిట్లను నిర్వహిస్తున్నది.

ఈ ఉత్పత్తి యూనిట్ల నిర్వహణ 1974-75వరకు తృప్తికరంగా లేకుండినది. ఎందుకంటే 1962-63నుంచి 1973-74వరకు నష్టాలు వచ్చినవి. ఈ కార్పొరేషన్‌ల ఉద్దేశం వ్యవస్థాపన కావడంతో, ఇదొక వాణిజ్య సంస్థగాను లేదా లాభాపేక్షలేని సంస్థగాను పనిచేయుటకు వీలులేదు. కార్పొరేషన్‌లతో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు పనిచేయడంతో, ఈ కార్పోరేషన్‌లు తమ మనుగడకు, వనరులను మెరుగుపరుచుటకు, లాభార్జన చేయక తప్పదు.

## 11.11 ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అంతర్నిమిత కార్పొరేషన్

1973సం. సెప్టెంబరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అంతర్నిమిత (Infrastructure) కార్పొరేషన్‌ను, ఒక ప్రైవేటు కంపెనీగా స్థాపించినది. ఈ కార్పొరేషన్ల ముఖ్య ధ్యేయాలు ఏవనగా :

BRAOU

## 11.11.1 ధ్యేయాలు

a)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ఒక క్రమపద్ధతిలో, త్వరితగతిని పరిశ్రమలను స్థాపించి, వాటి పురోభివృద్ధికి పాటు పడే నిమిత్తం, సంస్థలకు అవసరమైన అంతర్గత వసతులను కల్పించడం, ఉదాహరణకు ఫ్యాక్టరీ స్థలాలకు, ఫ్యాక్టరీ ఆవరణలు, విద్యుచ్ఛక్తి, నీరు, గృహవసతి, విద్యాలయాలు, హాస్పిటల్స్ మొదలగునవి.

b)కంపెనీలు నెలకొల్పిన ఫ్యాక్టరీ ఆవరణలకు తగిన ద్రవ్య సహాయాన్ని అందజేయడం అవసరమైన మూలధనాన్ని సమకూర్చడం, ఆ సంస్థల నిర్వహణను మెరుగుపర్చడం, ఉత్పత్తి విధానాలను, మార్కెటింగ్ పద్ధతులను మెరుగుచేయడం.

c)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, వివిధ ప్రోత్సాహకాలను అమలుచేయటం, రాయితీలను ఇవ్వటం ద్వారా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పరిశ్రమల అభివృద్ధికి పథకాలను అమలుచేయటం.

d)పరికరాల గదులు, సర్వీసు దుకాణాలు మరమత్తు దుకాణాలను పారిశ్రామిక వాడలలో నెలకొల్పుటకు లేదా నడుపుటకు మొదలగునవి.

## 11.11.2 విధులు

1.పారిశ్రామిక వాడలను, పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలను వాటికి రోడ్డు, నీరు వంటి సదుపాయాలతో ఏర్పరచటం:
2.పారిశ్రామిక వాడలలో పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలలో నివసించే పారిశ్రామిక కార్మికులకు ఇళ్ళ నిర్మాణం చేయడం :
3.పారిశ్రామిక వాడలలో పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలలో పోస్టు,రవాణా, టెలిఫోను వంటి సౌకర్యాల నిమిత్తం ప్రభుత్వ శాఖలతో సమన్వయం కుదుర్చుకోవడం:
4.పెరుగుదల ఉండే కేంద్రాలను గుర్తించడం
5.కేంద్ర సబ్సిడీలను, రాష్ట్ర ప్రోత్సాహకాలను, మార్జిన్ సొమ్ము పంపిణీ చేయుటకు ప్రభుత్వం తరపున ప్రతినిధిగా వ్యవహరించడం
6.ఔత్సాహికులకు బ్రిడ్జిఋణాలను (Bridge Loans) మంజూరు చేయడం
7.విద్యుత్శక్తిని ఏర్పాటు చేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్శక్తి బోర్డ్ (APSEB)నకు ఔత్సాహికుల తరపున ఐచ్ఛికంగా ఋణాల చందాను చెల్లించటం మొదలగునవి.

రాష్ట్రంలోని పరిశ్రమలను అభివృద్ధి చేయుటకు, పారిశ్రామిక అంతర్నిర్మాణవనరులను (Infrastructure) కల్పించుటకు కార్పొరేషన్‌లు విస్తారమైన కఠినమైన బాధ్యతలు చేపడతాయని సంస్థాపన పత్రంలోని ధ్యేయాల క్లాజులో సూచిస్తున్నది. పారిశ్రామిక వాడలలో నెలకొల్పిన సంస్థలు తమ వస్తువుల మార్కెటింగ్ విషయంలో తలెత్తే సమస్యలను తామే పరిష్కరించుకోవలసి వుంటుంది. ఆ యూనిట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్త కార్పొరేషన్ నుంచి (APSFC)ప్రాధాన్యత రీతిలో దీర్ఘకాల ఋణాలను పొందలేవు. అంతేకాక సంస్థాపన పత్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని ఒకానొక అంశంగా ధ్యేయాల క్లాజులో పేర్కొనలేదు.

BRAOU

ఈ కార్పొరేషన్‌లు కేంద్ర సబ్సిడీలను రాష్ట్రం ఇచ్చే ప్రోత్సాహకాలను వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన యూనిట్లకు పంపిణీ చేస్తుంది. పరిశ్రమల శాఖ వారిచ్చే సహాయాన్ని ఈ కార్పొరేషన్ ప్రభుత్వ ప్రతినిధిగా పంపిణీ చేస్తుంది. ఔత్సాహికులు తమ వంతు పెట్టుబడిని ముందుగా చెల్లించిన మీదట కేంద్రం ఇచ్చే సబ్సిడీలు రాష్ట్రం ఇచ్చే ప్రోత్సాహక మొత్తాలు చెల్లిస్తారు. ఈలోగా వారు కొన్ని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. అందుకు ఈ కార్పొరేషన్ వెనుకబడిన ప్రాంతాలలో సంస్థల స్థాపనకుగాను కొన్ని తాత్కాలిక ఋణాలను (Bridge ఋణాలు) మంజూరు చేసి పిదప వాటిని కేంద్ర సబ్సిడీనుంచి లేదా రాష్ట్ర ప్రోత్సాహకాలనుంచి రాబట్టుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు విద్యుచ్ఛక్తి పొందుటకు సంస్థల ఔత్సాహికులను కొంత సొమ్ము చెల్లించవలసిందిగా కోరుతుంది. ఆ సొమ్మును కూడా ఔత్సాహికుల తరుపున ఈ కార్పొరేషన్‌లు APSEB నకు చెల్లిస్తాయి. పారిశ్రామిక వాడలలో నివసించే కార్మికులకు ఇళ్ళ నిర్మాణాన్ని ఈ కార్పొరేషన్ చేపట్టెను.

ఈ కార్పొరేషన్ల స్థాపనకు ముందు పారిశ్రామిక శాఖవారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామిక వాడలను లేదా ప్రాంతాలను అభివృద్ధి చేయటం జరిపేవి. కాని అందులో కొన్ని సమస్యలు ఏర్పడుట వలన ఈ కార్పొరేషన్లను (APIIC) 1973సం.లో స్థాపించినవి. వాటికి ఎదురైన సమస్యలు ఏవనగా:

a) పారిశ్రామిక వాడలకు గల డిమాండును తట్టుకోవడానికి తగినంతగా నిధులు లేకపోవడం
b) మంజూరీలను సంపాదించటంలో జాప్యములు
c) పారిశ్రామిక భూములను అద్దెకివ్వడం ద్వారా, అమ్మడం ద్వారా వచ్చిన మొత్తాలను తిరిగి వాడటానికి వీలుకాకుండా ప్రభుత్వం యొక్క సాధారణ రాబడికి జమకట్టడం.
d) శాఖల నిర్వహణ సంస్థలకు నిర్వహణ స్వాతంత్ర్యము జీవిత భీమ సంస్థ లేదా వాణిజ్య బ్యాంకులనుంచి ఋణాలు పొందటంలో స్వేచ్ఛ ఇవ్వలేదు. అంటే పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదురైనవి.
e) రోడ్లు, భవనాల శాఖవారు నిర్మాణ పనులు చేపట్టిన కారణంగా అనవసర కాలాయాపన, ఎక్కువ ఖర్చులు జరిగినవి.

BRAOU

పైన పేర్కొన్న లోటుపాటులను సరిదిద్దుటకు ప్రభుత్వ విధానాలలో గల జాప్యాన్ని తొలగించుటకు ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు పూనుకొన్నది. పారిశ్రామిక వాడల నిర్వాహణకుగల కావలసిన ప్రతిభ సామర్థ్యం ప్రభుత్వ పారిశ్రామిక శాఖలకు లేని కారణంగా కూడా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించినది. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర సబ్సిడీలు రాష్ట్రం ఇచ్చే ప్రోత్సాహకాలు అనేకం ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాల అభివృద్ధి సంతృప్తికరంగా జరగలేదు. అందుచేత ప్రస్తుతం ఉన్న APIIC పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి పాటుపడుతున్నవి.

## 11.12 సారాంశం

భారతదేశ అభివృద్ధి పారిశ్రామిక అభివృద్ధితో ముడిపడివున్న సత్యం గ్రహించిన భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించుటకై జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో - ప్రగతి కార్పొరేషన్లను స్థాపించాయి.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికీకరణకై స్థాపించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థల కార్పొరేషన్ ఇతరముల గురించి చర్చించబడింది. పారిశ్రామికీకరణకు అవసరమైన విత్తం ఇతర సదుపాయాలు ఈ భాగంలో చర్చించబడినవి. వీటి పనితనం గమనించినట్లైతే ఉద్యోగ కల్పన, పారిశ్రామిక ఉత్పత్తి, ఆదాయాలలో వ్యత్యాసం తగ్గింపు, చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహం తదితర విషయాలలో ప్రగతి సాధించినట్లుగా కనిపిస్తుంది. సత్వర ప్రగతికి ఇంకా చేయాల్సింది ఎంతోఉన్నదన్న విషయంకూడా బోధపడుతుంది.

## 11.13 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. పారిశ్రామికీకరణలో అభివృద్ధి / ప్రగతి కార్పొరేషన్ల పాత్ర పనితనం గురించి వివరించండి.
2. ఆంధ్రప్రదేశ్‌లోని ఏవైన రెండు ప్రగతి కార్పొరేషన్ల గురించి వివరించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు 15 పంక్తులలో రాయండి.**

1. ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ ప్రాముఖ్యత
2. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సహాయ సంస్థ విధుల నిర్వహణ.

BRAOU

## 11.14 చదువదగిన రచనలు

1. S.V. Basu : Theory and Practice of Development Banking, Asia Publishing House, Bombay, 1965.

2. Gupta , N.S. & Amargar Singh : Economy of India, Light & Light Publishers , Delhi, 1978.

3. Report of the working group on State Industrial Development / Investment Corporations/ Industrial Development Banks in India, 1977.

**రచయిత : డా॥ ఏ.జి. ప్రసాద్.**

# భాగం - 12 : సంక్షోభ నివారణ పాలన

## విషయక్రమం


12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 సంక్షోభం : భావన - నిర్వచనాలు

12.3 సంక్షోభాలు - రకాలు

12.4 సంక్షోభాలు - పరిధి, లక్షణాలు

12.5 భారతదేశంలో సంక్షోభాల తీవ్రత

12.6 సంక్షోభాలు-అభివృద్ధి పై ప్రభావం

12.7 సంక్షోభ నివారణ పాలనకు అభివృద్ధికి గల సంబంధము

12.8 సంక్షోభాల నెదుర్కొనటంలో భారతదేశంలో వ్యవస్థాపరమైన ఏర్పాట్లు

   12.8.1 కేంద్రస్థాయి

   12.8.2 రాష్ట్రస్థాయి

   12.8.3 జిల్లాస్థాయి

12.9 ప్రకృతి వైపరీత్యాల సమయాలలో పాలనా వ్యవస్థ పెంపొందించుకునే అనుసరణీయత - ప్రగతి ప్రగతి పాలనపై దాని ప్రభావం

12.10 సారాంశం

12.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

12.12 చదువదగిన రచనలు


BRAOU

## 12.0 లక్ష్యాలు

ఈ భాగం చదివితే మీరు సంక్షోభ నివారణ పాలనా భావన, సంక్షోభాలకు అభివృద్ధికి గల సంబంధం, ప్రగతిపాలనపై సంక్షోభ నివారణ పాలన ప్రభావం, సంక్షోభ సమయాలలో ప్రభుత్వం చేపట్టే వ్యవస్థాపరమైన ఏర్పాట్లు, వ్యవస్థల్లో కలిగే మార్పులను తెలుసుకోగలరు.

## 12.1 పరిచయం

సంక్షోభ నివారణ పాలన ప్రగతి పాలనలో ఒక అంతర్భాగం. ప్రగతి పాలన వివిధ పరిసరాలలో ప్రభుత్వ పాలన ప్రక్రియ తన లక్ష్యాలను సాధించేందుకు ఏ విధంగా మార్పులకు గరవుతుందో వివరిస్తుంది. ప్రగతి పాలనా వ్యవస్థలో పరిసరాలకు అనుగుణమైన మార్పును ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రగతిపాలన అనే పదం (పరస్పర ఆధార పదం) రెండు అర్థాలలో వాడబడుతున్నది. మొదటిగా, అభివృద్ధి లక్ష్యాలను సాధించటానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిమగ్నమైన పాలనా యంత్రాంగాన్ని ప్రగతి పాలనగా భావించవచ్చును. పెద్ద వ్యవస్థలు, తమ

విధానాలను, ప్రణాళికలను అమలు పరచటంలో అనుసరించే పద్ధతులను కూడా ప్రగతి పాలన అనవచ్చును. రెండు ప్రత్యక్షంగా కాక సూచనాత్మకంగా పాలనా యంత్రాంగం శక్తి సామర్థ్యాలను మెరుగు పరచటాన్ని ప్రగతి పాలన అనవచ్చును. ఈ విధంగా ప్రగతి పాలనను అభివృద్ధి కార్యక్రమాల పాలనగా, పాలనా వ్యవస్థ అభివృద్ధిగా పరిగణించవచ్చును. అభివృద్ధికార్యక్రమాలను అమలు పర్చటంలో ప్రగతి పాలన తరచు సంక్షోభాలను (crises), వైపరీత్యాలను లేదా విపత్తులను (Disasters) ఎదుర్కొనవలసిన పరిస్థితులు ఏర్పడుతాయి. అటువంటి సంక్షోభ పరిస్థితులు ముఖ్యంగా రెండు రకాలు. ఒకటి, ప్రకృతి సిద్ధంగా ఏర్పడే వైపరీత్యాలు (Natural Disasters) రెండు, మానవ ప్రేరణ వలన సంభవించే సంక్షోభాలు (Man - made disasters).

ప్రకృతి వైపరీత్యాల నివారణ సమాజం నిర్వర్తిస్తున్న విధులలో ఒకటైనప్పటికీ, తరుచుగా సంభవిస్తున్న తుఫానులు, వరదలు, భూకంపాలు మొదలైన ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ విధిపై ప్రాముఖ్యతతో కూడిన శ్రద్ధ చూపవలసిన అవసరం ఏర్పడింది. దీని ఫలితంగా సంక్షోభాల పాలనా నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పట్ల మరింత ఎక్కువ అవగాహన ఏర్పరుచుకోవటం తప్పనిసరైంది. ఈ అవగాహన సమర్థవంతమైన సంక్షోభ నిర్వహణ వ్యూహాలను రూపొందించి, అమలు పర్చేందుకు దోహదపడుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి అనేక దేశాలు తమ అభివృద్ధి ప్రణాళికలు, విధానాలను వివిధ సంక్షోభాలను ఎదుర్కొనడానికి వీలైన విధంగా రూపొందించు కుంటున్నాయి. అంటే ప్రగతి పాలన లక్ష్యాలలో సంక్షోభ నివారణ అనే లక్ష్యం కూడా ఇమిడి ఉందనే నిజాన్ని ప్రణాళికావేత్తలు, పాలకులు గుర్తించారు. కాగా సంక్షోభ నివారణ మేధావులు, పరిశోధకుల దృష్టిని కూడా ఆకర్షించింది. ఈ రంగంలో తరుచుగా సంభవించే సంక్షోభాలను హాని కల్గించే ప్రవృత్తి కల దృగ్గోచరాలుగా చిత్రీకరించారు. దీనికి ప్రస్తుతం మనం సంక్షోభ దశలో ఉన్నామని ప్రముఖ పాలనతత్వవేత్త (డ్వైట్ వాల్డో) (Dwight-Waldo) పేర్కొనటం ఒక దృష్టాంతం. కొందరు పాలనాతత్వవేత్తల అభిప్రాయం ప్రకారం పాలకులు ప్రతి సందర్భంలోను సంక్షోభాన్ని ఎదుర్కొనవలసిన పరిస్థితులేర్పడవచ్చును. దీనిని బట్టి ప్రభుత్వ పాలనను నిరంతర సంక్షోభ నిర్వహణగా పరిగణించవచ్చును.

## 12.2 సంక్షోభం : భావన - నిర్వచనాలు

ఇటీవల కాలంలో వైపరీత్యం, సంక్షోభం, విపత్తు అనే పదాలను నిర్వచించటం ప్రాముఖ్యతను సంతరించుకుంది. సంక్షోభం అనే పదాన్ని వివిధ సామాజిక శాస్త్రవేత్తలు అనేక విధాలుగా నిర్వచించారు. ఒక సామాజిక శాస్త్రవేత్త నిర్వచనం ప్రకారం "ఏ సంఘటన సాముదాయం లేక వ్యవస్థ పరిపూర్ణ నిర్వర్తనకు విఘాతాన్ని కలిగించటంతో పాటు దాని క్రమపద్ధతిని అంటే శ్రమ విభజన, అధికార పద్ధతులు, ప్రమాణాలను సభ్యుల ప్రేరణ స్థాయిలను దిగజారుస్తుందో ఆ సంఘటననే సంక్షోభంగా పరిగణించవచ్చును". ఎ.హెచ్. బార్టన్ (A.H. Barton) నిర్వచించినట్లు సంక్షోభం అంటే " ఒక సాంఘిక వ్యవస్థ ఉత్పాదకాలలో సమగ్రమైన మార్పు" వి.ఎ. హైప్ (V.A. Hipe) సంక్షోభాన్ని "క్రమరహితంగా నిర్దిష్టకాలంలో, ప్రదేశంలో సంభవించే సంఘటన" అని నిర్వచించాడు. టి.యన్. చతుర్వేది (T.N. Chaturvedi) స్థూలంగా సంక్షోభాన్ని "ఒత్తిడిని లేదా ఒకజాతి చరిత్రలో ఉద్రిక్తతకు లోనయ్యే కాలం" అని నిర్వచించాడు. మహేశ్వరి (Maheswari) సంక్షోభ పాలన స్వభావాన్ని వివరిస్తూ అది పరిపాలకుల కార్యక్రమాలకు సంబంధించినది కాక వివిధ తీవ్రస్థాయిల్లో, కాలాల్లో సంభవిస్తూ పరిపాలనా యంత్రాంగాన్ని ఉద్యోగ బృందాన్ని పరీక్షకు గురిచేస్తుందని పేర్కొన్నారు. ఛార్లెస్ ఫ్రిట్జ్ (Charles E. Fritz) ప్రతిపాదించిన విస్తృతమైన నిర్వచనం ప్రకారం ప్రకృతి వైపరీత్యం ఒక నిర్దిష్టకాలంలో, ప్రాంతంలో సంభవించే సంఘటన. ఈ సంఘటన వలన ఒక సమాజం లేక దానిలో అంతర్భాగంమైన ఉప నిర్మాణం తీవ్ర ప్రమాదానికి లోనై ఆ సమాజ సభ్యులకు, వారి భౌతిక వసతులకు తద్వారా మొత్తం సామాజిక విధుల నిర్వర్తనకు

BRAOU

అవరోధం కల్గుతుంది. ఫామ్ మరియు నో సో (Form and Nosow) నిర్వచించినట్లు కొన్ని పరిస్థితుల్లో సుస్థిరమైన సాంఘిక జీవనం లేదా సాంఘిక వ్యవస్థ అర్థాంతరంగా చైతన్యరహితం కావటమే ప్రకృతి వైపరీత్యం. అంటే మానవ ప్రాణహాని, సామాజిక సంస్థల కార్యకలాపాలు స్థంభించటం ప్రకృతి వైపరీత్యాల్లో ఇమిడి ఉన్న కీలకాంశాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O.) వైపరీత్యాన్ని "ప్రజల ఆరోగ్యానికి ఊహించని, తీవ్రమైన తక్షణ ప్రమాదాన్ని కలిగించే సందర్భంగా " నిర్వచించింది. మరో సందర్భంలో ఈ సంస్థ వైపరీత్యాన్ని ప్రకృతి, లేదా మానవ ప్రేరిత మైన ప్రజలకు తీవ్ర ప్రమాదాన్ని కలిగించి వారికి అత్యవసర సహాయాన్ని అందించవలసిన పరిస్థితికి దారి తీసే సంఘటనగా పేర్కొంది. బ్రాడ్ ఫర్డ్ వైపరీత్య పరిశోధన విభాగం (DRU) నిర్వచనం ప్రకారం వైపరీత్యం అంటే "తీవ్రమైన భౌతిక దృగ్గోచరానికి, బలహీనులైన మానవులకు మధ్య సంభవించే పరస్పర చర్య". ఇండియన్ రెడ్ క్రాస్ సంఘం అంతర్జాతీయ లీగ్ ఆఫ్ సొసైటీస్ పేర్కొన్నట్లు వైపరీత్యం దారుణవిపత్తు కల్గించే సందర్భం. దానివల్ల అనేక సందర్భాలలో సాధారణ పౌరజీవనానికి అర్థాంతరంగా అంతరాయం ఏర్పడటం చేత ప్రజలకు నిస్సహాయ స్థితి దాపురించి వారు అనేక బాధలకు గురికావటం వలన వారికి రక్షణ, దుస్తులు, వసతి, మందులు, సాంఘిక భద్రత మొదలైన జీవితావసరాలను కల్పించవలసిన పరిస్థితి.

## 12.3 సంక్షోభాలు : రకాలు

వైపరీత్యాలు ముఖ్యంగా రెండు కారణాల వలన సంభవిస్తాయి. పరిసరాలు మరియు భౌతిక పరిస్థితులలో కలిగే మార్పులు ఒక కారణం కాగా రెండవ కారణం మానవుని కార్యకలాపాలు. మొదటివి ప్రకృతి వైపరీత్యాలనీ, రెండో వాటిని మానవ ప్రేరిత సంక్షోభాలనీ చెప్పవచ్చును. ఈ రెండు రకాల వైపరీత్యాలు వర్తమాన సామాజిక, ఆర్థిక వ్యవస్థలను తీవ్ర విధ్వంసానికి గురిచేస్తాయి. కొన్ని సందర్భాలలో ఒక రకమైన సంక్షోభ పరిస్థితి, ఇంకో సంక్షోభానికి దారితీయవచ్చును. ఉదాహరణకు కొన్ని సమయాలలో భూకంపాలు లేదా తుఫానుల వలన వెంటనే వరదలు సంభవించవచ్చును. భూకంపాలు, తుఫానుల వలన మట్టి పెళ్ళలు, కొండచరియలు విరిగి పడటం, నదులపై ఆనకట్టలు దెబ్బతినటం, వంతెనలు, రహదారులు దెబ్బతినటం జరుగుతుంది. అతి వృష్టి (అధిక వర్షపాతం) వరదలకు, అనావృష్టి (అతి స్వల్ప వర్షపాతం లేదా పూర్తిగా వర్షాలు లేని పరిస్థితి) కరువు కాటకాలకు దారితీస్తాయి. మరికొన్ని సందర్భాలలో మానవప్రేరిత చర్యల వలన కూడా వరదలు సంభవిస్తాయి. అడవులను నాశనం చేయటం, నీటి పారుదలకు తగిన వసతులులేక పోవటం లేదా ఆటంకం కల్పించడం వలన వరదలు సంభవించవచ్చును.

మానవ ప్రేరిత సంక్షోభాలతో పోల్చితే ప్రకృతి వైపరీత్యాలలో వ్యవస్థా పరమైన ప్రతిస్పందన కొంతవరకు తేలిక అని చెప్పవచ్చును. కాని ఈ రెండు రకాల సంక్షోభాలు హఠాత్తుగా పలు ఒత్తిళ్ళు కల్పించటం, "అసమతౌల్యాన్ని సృష్టించటం ద్వారా సమాజానికి అనేక సమస్యలు కల్పిస్తాయి. అయితే ఈ రెండు రకాల సంక్షోభాల మధ్య కొంత సారూప్యత (సామ్యం) కూడా ఉంది. నిర్దిష్టత లేకపోవటం, వాటి గురించి పూర్వ సమాచారం ముందుగా తెలియకపోవటం, వాటిని ఎదుర్కొనేందుకు తక్కువ సమయం ఉండటం. వాటిని నిరోధించటానికి లేదా నియంత్రణ చెయ్యటానికి మానవునికి తగిన శక్తి సామర్థ్యాలు లేకపోవటం ఈ రెండు రకాల సంక్షోభాలలో గోచరించే ఉమ్మడి లక్షణాలు.

BRAOU

## 12.4 సంక్షోభాలు పరిధి, లక్షణాలు

ప్రకృతి శక్తులు మానవులకు మానసికంగా, భౌతికంగా, భూగోళికంగా తీవ్రనష్టాన్ని కల్గిస్తాయి. సంక్షోభాల పరిధి, లక్షణాలు అవి సంభవించిన తీరు పైనే కాక వాటి పట్ల వ్యక్తుల ప్రతిస్పందన పై కూడా ఆధారపడి ఉంటాయి. కరువును మినహాయిస్తే, మిగితా (మిగిలిన) ప్రకృతి వైపరీత్యాలవల్ల కలిగే ప్రభావం సాధారణమే అయినప్పటికీ, అవి భౌతిక నిర్మాణాలకు, ఉత్పాదక ఆస్తులకు, విపరీతమైన నష్టాన్ని కల్గిస్తాయి. మానవ ప్రేరిత సంక్షోభాల వలన కూడా ఇంతే తీవ్రమైన విధ్వంసం సంభవించవచ్చును. ప్రకృతి సంక్షోభాలకు కొన్ని విశిష్ట లక్షణాలతో పాటు కొన్ని సాధారణ లక్షణాలుంటాయి. కొన్ని సంక్షోభాలు ప్రజా జీవితంపై స్వల్ప ప్రభావాన్ని చూపినా భౌతిక ఆస్తులకు విపరీతమైన నష్టాన్ని కల్గిస్తాయి. మరికొన్ని సంక్షోభాలు భౌతిక వసతులకు తక్కువ నష్టాన్ని కల్గించి, సామాజిక జీవనంపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే ఇతర సంక్షోభాలు స్థానికంగా లేదా నిర్దిష్ట కాల వ్యవధిలో వేగంగా సంభవించవచ్చును. కాని వాటి ఫలితంగా చిన్నా భిన్నమైన పరిస్థితిని చక్కదిద్ది సాధారణ స్థితి పునరుద్ధరించటానికి చేపట్టే సహాయ పునరావాస కార్యక్రమాల అమలుకు దీర్ఘకాలం అవసరం అవుతుంది. కాగా మరికొన్ని సంక్షోభాలు ఎక్కువ భూ భాగానికి విస్తరించటమే కాక వాటి కాలవ్యవధి కూడా అధికంగా ఉంటుంది. సంక్షోభాలకు ఉత్తేరక (Cataclysmic) స్వభావం ఉంది. అవి అరుదుగా సంభవించవచ్చును లేదా అసాధారణమైన రీతిలో తరుచూ పునరావృత్తం కావచ్చు. సంక్షోభాల సంభవాన్ని ముందుగానే ఖచ్చితంగా ఊహించవచ్చును లేదా అవి ఊహించటానికి వీలు లేని విధంగా హఠాత్తుగా సంభవించి సంబంధించిన వారిని ఆశ్చర్యపర్చవచ్చును. ఈ వివరణ వల్ల సంక్షోభాలు, వాటి కారణాలు గురించి సాధారణీకరణలను రూపొందించటం కష్టమని గుర్తించగలం. అంతేగాక పలురకాలైన సంక్షోభాలవల్ల ఏర్పడే సవాళ్ళను ఎదుర్కొనటానికి ఎటువంటి పరిపాలనా వ్యవస్థ అవసరమో నిర్ధారించటం కూడా కష్టం. ఒకవేళ పరిపాలనా యంత్రాంగం లేదా వ్యవస్థ సంక్షోభ సందర్భానికి అనుగుణంగా ప్రతిస్పందించలేక పోతే అది పరిపాలనాయంత్రాంగంలోనే సంక్షోభానికి దారి తీయవచ్చును. కాబట్టి సంక్షోభాలను వివిధ కోణాల్లోంచి పరిశీలన చేయటం ద్వారా వివిధ దశలలో వాటిని ఎదుర్కొనే ప్రక్రియ ద్వారా సంపాదించిన అనుభవం ఆధారంగా రూపొందించిన స్పష్టమైన దృక్పథం మాత్రమే సంక్షోభ పాలన నిర్మాణానికి తోడ్పడుతుంది.

BRAOU

## 12.5 భారతదేశంలో సంక్షోభాల తీవ్రత

పురాతన కాలంనుంచి అనేక సంక్షోభాలు భారతదేశ ఆర్థిక సామాజిక జీవితానికి (వ్యవస్థకు) తీవ్రమైన హాని కల్గిస్తున్నాయి. మన దేశంలో కరువు కాటకాల నెదుర్కొనటానికి, బ్రిటీషు పాలనలో మొదటిసారిగా కొన్ని నిర్దిష్ట చర్యలను చేపట్టటం జరిగింది. భారతదేశంలో 1776 సం.లో సంభవించిన తీవ్రమైన కరువు వల్ల 10 లక్షల మంది మరణించారు. 1943 లో సంభవించిన బెంగాల్ క్షామం వల్ల దాదాపు 30 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. చారిత్రకంగా భారతదేశం మిగతా ప్రపంచ దేశాల కన్నా అధికంగా కరువు కాటకాలకు లోనైంది. 1891-1940 సం.రాల మధ్య కాలంలో మనదేశంలో దాదాపు 520 తుఫానులు/ఉప్పెనలు విభిన్న తీవ్రతలతో సంభవించాయి. వాటిలో 80 శాతం తూర్పుకోస్తాలో ఉన్న రాష్ట్రాలను ప్రభావితం చేశాయి. ఈ మధ్య కాలంలో అంటే 1977 సం.ములో ఆంధ్రప్రదేశ్ లో సంభవించిన (దివి సీమ) తుఫాను వల్ల అధిక మరణాలు (9,920) సంభవించాయి.

మనదేశంలో తరుచు సంభవిస్తున్న వరదల వలన కూడా దేశ ఆర్థిక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. దేశంలో ప్రతి సం.ము దాదాపు ఒక కోటి 10 మిలియన్ హెక్టారుల భూమి వరదలకు గురవుతున్నది.

హిమాలయ పర్వత శ్రేణి ప్రాంతం భూకంపాలకు గురయ్యే ప్రాంతంగా గుర్తించబడింది. 1988సం.లో బీహార్ రాష్ట్రంలోను, 1991లో ఉత్తర ప్రదేశ్‌లో సంభవించిన భూకంపాల వలన 2000 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోవటమే కాక, అనేక వేల నివాసాలు నేల మట్టం కావటం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనదేశం చవి చూసిన సంక్షోభాలలో పూనా ఆనకట్ట ప్రమాదం (1960), బీహార్ క్షామం (1966-67), మహారాష్ట్ర కరువు (1972-73) బీహార్ (1988), ఉత్తర ప్రదేశ్ (1991) భూకంపాలు, మోర్వీ ఆనకట్ట ప్రమాదం (1978), ఆంధ్రప్రదేశ్‌లో తరచూ సంభవించే తుఫానులు/ వరదలు (1969,1977,1979,1983,1986,1991) బీహార్, ఉత్తర ప్రదేశ్ అస్సాంలలో తరుచుగా సంభవించే వరదలను ప్రముఖమైనవిగా పేర్కొనవచ్చును. ఇవికాక వ్యక్తుల నిర్లక్ష్యం వల్ల సంభవించిన భోపాల్ గ్యాస్ ప్రమాదం .(1984) ప్రపంచంలోనే అత్యంత తీవ్ర పారిశ్రామిక సంక్షోభంగా గుర్తించబడింది.

ఆర్థిక పరంగా వరదల వలనే ప్రతి సం.ము రూ.2500 - 3000 కోట్లు (GDP) కి దేశ ఆదాయంలోకి విపరీతమైన నష్టం జరుగుతుందని ఒక అంచనా. 1986-87 ఆర్థిక సం. ములో సంక్షోభ సహాయం కార్యక్రమాల క్రింద రూ. 1114 కోట్లు వ్యయం చెయ్యటం జరిగింది. ఆరవ, ఏడవ పంచవర్షప్రణాళికాకాలంలో ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాలపై వ్యయం విపరీతంగా పెరిగింది. ఒక ప్రక్క ప్రతి సం.ము వివిధ ప్రకృతి వైపరీత్యాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగే నష్టాలు పెరుగుతుంటే మరొక ప్రక్క అత్యాధిక సహాయం కోసం రాష్ట్రాలనుంచి కేంద్రానికి విజ్ఞప్తులు పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాల వలన సంభవిస్తున్న నష్టాలు, రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెటును కూడా మించిపోతున్నాయి. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రకృతి వైపరీత్య సహాయ కార్యక్రమాలను చేపట్టేందుకు తగిన వనరులు లేక ఇబ్బందులకు గురవుతుంటే, మరో వైపునుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం లభించక పోవటం, వరద నిరోధక ప్రాజెక్టులకు సకాలంలో ఆమోదం లభించక పోవటం వల్ల రాష్ట్రాల పరిస్థితి మరింత జటిలంగా రూపొందుతున్నది.

BRAOU

## 12.6 సంక్షోభాలు - అభివృద్ధి పై ప్రభావం

ఇటీవలి కాలం వరకు సంక్షోభాలకు అభివృద్ధి ప్రక్రియకు మధ్యగల సంబంధం గుర్తించబడలేదు. అంతేకాక అభివృద్ధి వ్యవస్థలు సంక్షోభాల నివారణ ప్రక్రియలో పాల్గొన కుండా పలాయన వాద ధోరణిని ప్రదర్శించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, సంక్షోభాల ఫలితంగా అభివృద్ధి వేగం, దశ అనేక మార్పులకు గురవుతున్నాయి. ఈ దేశాల్లో వనరులు పరిమితంగా ఉండటం వలన సాధారణ అభివృద్ధి కార్యక్రమాలు సంక్షోభ పునర్ నిర్మాణ ప్రణాళికలతో పోటీ పడుతున్నాయి.

డైన్స్ (R.R. Dynes) వివిధ దేశాలలో అభివృద్ధి ప్రక్రియపై వైపరీత్యాల ప్రభావాన్ని ఈ క్రింది విధంగా వివరించాడు.

1. తక్కువ జనాభా కలిగి, ఆర్థికంగా ఆహారధాన్యాల ఉత్పత్తి మీద, సామాజికంగా సాంప్రదాయ సంస్కృతి మీద ఆధారపడి సమాజాలలో వైపరీత్యాలు సాంఘిక సంబంధాలను ఆటంక పరుస్తాయి.

2. ప్రధానంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి, కొద్ది పాటి పారిశ్రామికీకరణ జరిగి, కుటుంబం ప్రధాన ఆధారంగా కలిగిన, అభివృద్ధి చెందుతున్న రాజ్య వ్యవస్థను కలిగిన పెద్ద సమాజాలు వైపరీత్య పరిస్థితుల నెదుర్కొనటంలో స్థానిక రాజకీయ ఉపాంగాలనుంచి వనరులను సమీకరించటంలో సమస్యల నెదుర్కొంటాయి.

3. అధిక జనాభాకల, పారిశ్రామికీకరణ ఆధారంగా కలిగి విస్తృతమైన రాజ్య వ్యవస్థతో కూడిన దేశాలలో విపత్తు సంభవించిన కాలంలో సమన్వయానికి సంబంధించిన సమస్యలు ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి.

భారతదేశంలో పైన వివరంచిన లక్షణాలలో చివరి రెండు లక్షణాలు గోచరిస్తాయి. ఈ దేశంలో వైపరీత్యాలు మానవతా సాంఘిక సమస్యలగానే కాక అభివృద్ధికి సంబంధించిన సమస్యలుగా కూడా రూపొందాయి. మన దేశంలో స్థూల జాతీయ ఉత్పాదకత (GNP) నిష్పత్తికి వైపరీత్యాలవలన కలుగుతున్న నష్టం అపారం. ఈ నష్టం ఆర్థిక రంగంలో నిజమైన పెరుగుదలను అరి కడుతుంది. ఉదాహరణకు మనదేశంలో ప్రకృతి వైపరీత్యాల వలన ప్రతి సం.ము సుమారు రూ. 3000 కోట్ల ఆస్థి నష్టం జరగటమే కాక సహాయ పునరావాస కార్యక్రమాలపై అనేక కోట్ల రూపాయలు వెచ్చించటం జరుగుతుంది. అదే విధంగా మన రాష్ట్రంలో 1977 లో సంభవించిన తుఫాను వల్ల దాదాపు రూ. 2000 కోట్ల ఆస్థి నష్టం జరిగిందని ఒక అంచనా. ఈ మధ్య (1991) సంభవించిన తుఫాను వల్ల సుమారు రూ. 2500 కోట్లు మన రాష్ట్ర ఆర్థిక రంగానికి నష్టం జరగటమే కాక, దాదాపు. రూ. 800 కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి ఋణం తీసుకుని పునరావాస కార్యక్రమాలను చేపట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. అంటే మనకు తరుచుగా సంభవించే వైపరీత్యాలవలన ఆర్థికంగా రెండు రకాలుగా ప్రభావితం అయ్యి అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నాయి. మొదటిది, ప్రభుత్వ ఆస్తులకు, పంటలకు తీవ్ర నష్టం కల్గించటం ద్వారాను, రెండోది, వనరుల కొరత వలన, ప్రస్తుతము మనం అభివృద్ధి కార్యక్రమాలపై వెచ్చించే వనరులను సహాయ పునరావాస కార్యక్రమాలకు మళ్ళించటం. ఈ రెండు విధాలుగా దేశ ఆర్థిక ప్రగతికి తద్వారా అభివృద్ధి కార్యక్రమాల పై ప్రభావము చూపుతున్నది.

## 12.7 సంక్షోభ నివారణ పాలనకు అభివృద్ధికి గల సంబంధము

ప్రకృతి వైపరీత్యాలు తరుచుగా ప్రపంచ మంతటా సంభవిస్తూ, వివిధ దేశాల ఆర్థిక పరిస్థితిని విచ్ఛిన్నం చేయటమే కాక అభివృద్ధి కార్యక్రమాలను ఆటంక పరిచి అభివృద్ధి వేగాన్ని కుంటు పరుస్తాయని పలు సామాజిక శాస్త్రవేత్తలు, విధాన నిర్ణాయక వేత్తలు అంగీకరించారు. అందుచేత సంక్షోభ పాలన అభివృద్ధికి చాలా దగ్గర సంబంధం ఉందని వారు గుర్తించారు. కొన్ని సంక్షోభాలు అప్పటివరకు సాధించిన అభివృద్ధిని దెబ్బతీస్తాయి. తుఫానులు, వరదలు వంటి సంక్షోభాలవలన భారీ పరిమాణంలో ప్రాణనష్టమే కాక పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు, నివాస గృహాలకు, పశు, వృక్ష సంపదకు ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో అపార నష్టం కలుగుతుంది.

BRAOU

సాధారణంగా వివిధ దేశాల పరిపాలనా వ్యవస్థలు వివిధ సంక్షోభాలవలన కలిగే పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కొనగలవని ఆశించడం జరుగుతుంది. ఒక దేశం లేక ప్రాంతం తరుచుగా వైపరీత్యాలకు గురవుతున్నపుడు అక్కడ వ్యవస్థాపరమైన ప్రతిస్పందన కూడా ఊహించటానికి వీలైన రూపంలోనే ఉంటుంది. తరుచుగా సంక్షోభాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో జరగబోయే ప్రమాదాన్ని ముందుగానే ఊహించటమే కాక దానిని సమర్థవంతంగా ఎదుర్కొన వచ్చును. కాని కొన్ని సంక్షోభాలకు స్పష్టమైన కాలపరమైన స్థిరత్వం ఉండదు. అటువంటి సందర్భాలలో జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాక వేత్తలు చూపే శ్రద్ధను బట్టి అవి తమ ప్రాముఖ్యత పెరగటమో లేక కోల్పోవటమో జరుగుతుంది. దాంతో పాటు వనరుల కేటాయింపుకు అనుగుణంగా కూడా అవి ప్రభావితమవుతాయి.

సంక్షోభం స్వభావానికి దేశ ఆర్థిక వ్యవస్థ దశతో ప్రభుత్వ ఆర్థిక విధానాలతో సంబంధం ఉండటమే కాక అది వాటి పైనే ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల ఆర్థిక వ్యవస్థలో కరువులు వరదలు, తుఫానులు, వడగళ్ళ వానలు, మిడతల దండు దండయాత్ర మొదలయిన సంక్షోభాలు పరిపాలనా పరంగా శ్రద్ధ చూపవలసిన సందర్భాన్ని సృష్టిస్తాయి. కాగా పారిశ్రామిక రంగం ప్రాముఖ్యత వహించే ఆర్థిక వ్యవస్థల్లో రసాయనిక ప్రేలుళ్ళు, అగ్నిప్రమాదాలు, సాంకేతిక పరమైన సంక్షోభాలు మొదలైనవి ప్రజల్లో గొప్ప ఉపద్రవాన్ని సృష్టిస్తాయి. అయితే సంక్షోభాలు విశిష్టమైనవి. పరిపాలనా యంత్రాంగం వివిధ రకాల సంక్షోభాలను ఎదుర్కొనటానికి తగిన శక్తి యుక్తులను సమకూర్చుకోవాలి. సాధారణంగా సంక్షోభాలను జాతీయ స్థాయిలో ఎదుర్కొనటం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో సంక్షోభాలు ఒక దేశ, జాతి హద్దులకే పరిమితం కాక ఇరుగు పొరుగు దేశాలకు వ్యాప్తి చెందుతాయి. అటువంటి సంక్షోభాలనెదుర్కొనేందుకు బహుళజాతీయ దృక్పథం లేదా అంతర్జాతీయ క్రియాశీలక కార్య చరణ పథకం తప్పని సరి. ఉదాహరణకు గంగానదివంటి అంతర్జాతీయ నదికి వచ్చే వరదల నెదుర్కొనేందుకు నేపాల్, భారత్ బంగ్లాదేశ్‌ల సమిష్టి కృషి అవసరం. ఇదే విధంగా భారతదేశంలోని బీహార్, ఉత్తరప్రదేశ్, అస్సాం రాష్ట్రాలు వరదల నిరోధానికి సమన్వయంతో కృషి చేయవలసిన అవసరం ఉంది. అలాగే బంగాళాఖాతంలో సంభవించే తుఫానుల నెదుర్కొనటంలో ముఖ్యంగా వాతావరణ సమాచారం అందించటంలో, తుఫాను హెచ్చరికలను చేయటంలో అంతర్జాతీయ స్థాయిలో సమన్వయం అవసరం.

BRAOU

ప్రస్తుతం అభివృద్ధి ప్రణాళికల దృక్పథంలో కల మౌలిక లోపం ఏమిటంటే వైపరీత్య నిరోధక చర్యలు **(Disaster Mitigation efforts)** ను అభివృద్ధి వ్యూహాల నుంచి వేరు చేయటం. కాగా ఫాస్టర్ (H.D. Foster) వర్తమాన ప్రకృతి వైపరీత్య ప్రణాళికలలోని ఒక ముఖ్య లోపంగా వాటిని దైనందిక విధాన నిర్ణయాల నుంచి వేరు చేయటాన్ని గుర్తించాడు. ముఖ్యంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కరువు కాటకాలకు సంబంధించిన విధానాలను పంచవర్ష ప్రణాళికలో ఒక అంతర్భాగంగా రూపొందిస్తున్నారు. దీనికి భిన్నంగా తుఫానులు, వరదలు, ఉప్పెనలను తాత్కాలిక ప్రాతిపదిక మీద ఎదుర్కొంటూ వాటిని అగ్నిమాపక చర్యగా పరిగణిస్తున్నారని ఆరవ పంచవర్ష ప్రణాళికా ముసాయిదా ప్రతిలో పేర్కొనటం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను నివారించి ప్రజలకు వాటి నుంచి తగిన రక్షణను కలిగించేందుకు జాతీయ విధాన నిర్ణయాక వేత్తలు ప్రకృతి సంక్షోభాలకు తాత్కాలిక ప్రాతిపదిక మీద ప్రతిస్పందించే కన్నా దీర్ఘకాలిక దృక్పథంతో వాటి నెదుర్కొనవలిసిన అవసరం ఉంది. ప్రభుత్వాలు కూడా వ్యక్తుల వలెనే తాము పొందిన గతానుభవాల ఆధారంగా తమ తప్పులు సరిదిద్దుకునేందుకు ప్రయత్నించవు. విజయవంతమైన వైపరీత్య నిరోధక వ్యూహం దేశాభివృద్ధికి జీవిత భీమా వంటిది. సరైన ప్రణాళికలు, పథకాల ద్వారా వైపరీత్యా నిరోదక సంసిద్ధత చర్యల **(Disaster Mitigation and prepared ness measures)** ను చేపట్టాలి. వైపరీత్యాలు అరుదైన సంఘటనలు కావు. అవి తరుచు పునారావృతం అవుతాయనే

వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వాటి నిరోధానికి తగిన ప్రణాళికలను, పథకాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. అంతే కాక ప్రకృతి వైపరీత్యా నిరోధక పథకాలను విస్తృత అభివృద్ధి పథకాలతో సమైక్య పరిచి రూపొందిచాల్సి ఉంది. వెస్ట్ గేట్, కేఫీలు వెల్లడించిన, "వైపరీత్య నిరోధం మొత్తం అభివృద్ధి సందర్భంలో ఒక భాగం" అనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

## 12.8 సంక్షోభాల నెదుర్కొనటంలో భారతదేశంలో వ్యవస్థాపరమైన ఏర్పాట్లు

సమాఖ్య దేశాలలో ఇతర పాలనా అంశాల వలే సంక్షోభాల నిరోధానికి విధాన నిర్ణయాలను రూపొందించవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉంది. మనదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం, కరువు కాటకాలను వ్యవస్థాపరంగా ఎదుర్కొనటానికి ఆనాటి బ్రిటీషు పాలకులు శాస్త్రీయ దృక్పథం అవలింబించారనేది నిర్వివాదాంశం. ఆనాడు వారు రూపొందించిన క్షామ నిబంధనావళి (Famine code) ననుసరించి స్వాతంత్ర్యానంతరం కొద్ది మార్పులు చేర్పులతో, తుఫాను వరదల నెదుర్కొనటంలో వ్యవస్థా పరమైన ఏర్పాట్లు చేయటం జరిగింది.

భారతదేశంలో ప్రకృతి వైపరీత్యాల నిరోధం, మన రాజ్యాంగం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉమ్మడి బాధ్యత అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ పాత్ర కల్పించటం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల నిరోధానికి కేంద్ర, రాష్ట్ర జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయబడిన పాలనా వ్యవస్థను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 12.8.1 కేంద్రస్థాయి వ్యవస్థ

ప్రకృతి వైపరీత్యాల నివారణకు సంబంధించి స్థూల విధాన నిర్ణయాలు చేసేందుకు కేంద్రస్థాయిలో ప్రధానమంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉపసంఘం ఏర్పాటు చేయబడుతుంది. ఈ ఉపసంఘంలో కేంద్ర ఆహార, వ్యవసాయ, ప్రణాళిక, ఆర్థిక, రక్షణ, ఆరోగ్య పరిశ్రమ శాఖల మంత్రులు సభ్యులు ఈ ఉపసంఘం చేసే నిర్ణయాలకు ప్రణాళికాసంఘం, ఆర్థిక సంఘం సలహాలను, జాతీయ అభివృద్ధి మండలి (NDC), పార్లమెంటులో జరిగిన చర్చలు ఆధారం. మంత్రి మండలి ఉపసంఘంతో పాటు అధికారులతో కూడిన సంక్షోభ నిర్వహణ బృందాన్ని (Crisis Management Group) ఏర్పాటు చేస్తారు. సహాయకమిషనర్ వ్యవసాయ శాఖలో అదనపు కార్యదర్శి అధ్యక్షతన అధికారులతో ఒక వైపరీత్య నిరోధ సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ అధికారి దేశంలో సంభవించే వాతావరణ మార్పులను అధ్యయనం చేసే పంటల వాతావరణ నిఘాబృందం (Crop Weather Watch Group) సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు. ఈ బృందం నిర్ణయాలు చేయటానికి అవసరమైన సమాచారాన్ని మంత్రి మండలి ఉపసంఘానికి అందచేస్తుంది. సంక్షోభం ఏర్పడినపుడు మాత్రమే ఈ బృందం పని చేస్తుంది. భారత వాతావరణ శాఖ (IMD) తనరాడార్ కార్యరూపాల ద్వారా కోస్తా ప్రాంతంలోను, నదులపై ఉన్న పర్యవేక్షక సాధనాలద్వారా, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ISRO) ఉపగ్రహాలు ప్రసారం చేసే స్థిర చిత్రాల ద్వారా తుఫాను రాక గురించిన సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, దానిని సంబంధిత సంస్థలకు ఎప్పటికప్పుడు తెలియచేస్తుంది. భారత వాతావరణ శాఖ కేంద్ర జలవనరుల సంఘం వరద హెచ్చరిక వ్యవస్థకు దేశంలోని వాతావరణ పరిస్థితికి సంబంధించిన ఉత్పాదకాలను సరఫరా చేస్తుంది. దీనికి సంబంధించిన వరద వాతావరణ కార్యాలయాలను దేశంలో అనేక ప్రాంతాలలో ఏర్పరచటం జరిగింది.

BRAOU

ప్రకృతి వైపరీత్యాల నివారణ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వ పాత్ర సహాయ కార్యక్రమాల అమలు దశలో అధికంగా ఉండి పునరావాస దశలో పరిమితంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వ కోరికపై మాత్రమే సహాయ కార్యక్రమాల నిర్వహణలో పాల్గొంటుంది. ఉదాహరణకు భారత రక్షణ దళాలు, హెలికాప్టర్లు, విమానాలు, సహాయ, రక్షణ మరియు వార్తా సమాచార పరికరాలు, పడవలు, బ్రిడ్జిలు, రాష్ట్ర ప్రభుత్వ కోరికపై మాత్రమే విపత్తుకు గురైన ప్రాంతాలకు తరలింపబడతాయి.

## 12.8.2 రాష్ట్రస్థాయి వ్యవస్థ

దేశంలో ని వివిధ రాష్ట్రాలలో వైపరీత్యాల నివారణకు ఏర్పాటు చేసిన వ్యవస్థా పరమైన ఏర్పాట్లు ఒకే విధంగా లేవు. ఈ అంశం క్రింద చర్చించే విషయము ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను దృష్టిలో నుంచుకొని వివరించటం జరిగింది.

భారత వాతావరణ శాఖ మొదలైన కేంద్ర సంస్థలు అందించిన హెచ్చరికలను ఆధారం చేసుకొని వైపరీత్యాల నివారణకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకొనవలసిన భాధ్యత రాష్ట్ర, జిల్లా స్థానిక ప్రభుత్వాల అధికారులది. ఈ హెచ్చరికలు అందగానే రాష్ట్ర సచివాలయం పౌర మిలటరీ అధికారులతో కూడిన ఒక సంయుక్త నియంత్రణ కేంద్రాన్ని తాత్కాలిక ప్రాతిపదికపై ఏర్పాటు చేసి పరిస్థితిని 24 గంటలూ గమనిస్తారు. విపత్తుకు గురవటానికి అవకాశమున్న జిల్లాల్లోని కలెక్టర్లకు తగు సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ నియంత్రణా కేంద్రంలో రెవిన్యూ, రహదారులు భవనాలు, విద్యుచ్ఛక్తి, పోలీసు, ప్రజా పనులు, రక్షణదళాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. మొదటిదశలో రాష్ట్ర ప్రభుత్వం తన ఆజ్ఞలను వైర్‌లెస్ లేదా ఫోను ద్వారా జిల్లా కలెక్టర్లకు అందచేస్తుంది.

విపత్తు సంభవించిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రి మండలి సభ్యులతో అధికారులతోను ప్రతిపక్షనాయకులతోను కలిసిన నష్టాలను అంచనా వేయటానికి విపత్తుకు గురైన ప్రాంతాలలో పర్యటిస్తాడు. దీని తర్వాత వివిధ దశలలో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయబడుతాయి. ఈ సమావేశాలలో విపత్తుకు సంబంధించిన విధాన నిర్ణయాలు చేయబడతాయి. జిల్లా కలెక్టరుకు సంక్షోభ నివారణకు అవసరమైన పూర్తి అధికారాలు ఇవ్వబడతాయి. రాష్ట్ర మంత్రులను సంక్షోభ కార్యక్రమాల పర్యవేక్షణ నిమిత్తం వివిధ జిల్లాలకు నియమిస్తారు.

రాష్ట్రంలో వైపరీత్యాలు సంభవించిన వెంటనే రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక సహాయ చర్యల సహాయ సంఘం **(Relief Advisory Committee)** ఏర్పాటవుతుంది. ఈ సంఘంలో కొందరు ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు సచివాలయంలో ని సంబంధిత శాఖాధిపతులు కొందరు, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులు. దీంతో పాటు ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్రస్థాయి అధికారులతో ఒక సంక్షోభ నివారణ సంఘం ఏర్పాటు చేయబడుతుంది. తుఫాను సహాయ కమీషనర్ (పదవి రీత్యా రెవెన్యూ శాఖ కార్యదర్శి) వివిధ శాఖల విధానాలను కార్యక్రమాలను సమన్వయం చేస్తాడు. ఈ అధికారి ఒక ప్రక్క రాష్ట్ర- జిల్లా అధికారుల ఇంకో ప్రక్క రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ కర్తగా పనిచేస్తాడు. రాష్ట్రస్థాయి అధికారుల సంస్థ మరియు ముఖ్య మంత్రి అధ్యక్షతన గల సంఘం విపత్తువల్ల ఎటువంటి సహాయ కార్యక్రమాలకు సంబంధించిన విధాన నిర్ణయాలను సమన్వయంతో

BRAOU

రూపొందిస్తాయి. విపత్తు జరిగిన తర్వాత తలెత్తే సమస్యలను పరిష్కరించటానికి రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులతో అంతర్ శాఖల సమావేశాలు తరుచుగా నిర్వహించబడతాయి. సాధారణంగా ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి లేదా ముఖ్య కార్యదర్శి అధ్యక్షత వహిస్తారు. విపత్తు సమయంలో రాష్ట్ర స్థాయి శాఖలు వాటి జిల్లా స్థాయి శాఖలతో నిరంతర సంబంధాలు కలిగి ఉంటాయి. కేంద్రంలో ప్రధాన మంత్రి సహాయ నిధి లానే రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఉంటుంది.

### 12.8.3 జిల్లాస్థాయి వ్యవస్థ

బ్రిటీషు పాలనా కాలంనుంచి జిల్లా పరిపాలనా వ్యవస్థలో ఒక మౌళిక కేంద్రంగా ఉంది. సంక్షోభ సమయాలలో వివిధ ఉన్నత స్థాయీ వ్యవస్థలకు పాత్ర ఉన్నప్పటికి జిల్లా యంత్రాంగం ప్రధాన బాధ్యత వహిస్తుంది. జిల్లా కలెక్టరు జిల్లా పాలనా యంత్రాంగానికి సాధారణ సమయాలలో మాదిరే సంక్షోభ సమయాల్లో కూడా ఆదిపత్యం వహిస్తాడు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించేపుడు జిల్లా యంత్రాంగాన్ని సన్నిద్ధం చేసి తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం. విపత్తు సంభవించిన తర్వాత బాధితులకు అవసరమైన సహాయకార్యక్రమాలు చేపట్టడం కలెక్టరు విధి. ఈ సందర్భాలలో సమర్థవంతంగా తన విధిని నిర్వర్తించేందుకు కలెక్టరుకు విస్తృతమైన విచక్షణాధికారాలు అప్పగించబడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్షోభ సమయాలలో జిల్లా కలెక్టరు చెలాయించే విచక్షణాధి కారాలకు ఏ హద్దులు లేవు.

BRAOU

## 12.9 ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో పాలనా వ్యవస్థ పెంపొందించుకునే అనుసరణీయత ప్రగతి పాలనపైదాని ప్రభావం

ఆచార్య రాఘవులు చెప్పినట్లు విపత్తు సమయాలలో వ్యవస్థా పూర్వక అనుసరణీయత యాంత్రికంగా సంభవించే అంశంకాదు. వ్యవస్థ నిర్వర్తించవలసిన చర్యలు కొత్తవి అయినపుడు, డిమాండ్ భారం ఎక్కువైనపుడు పాలనా వ్యవస్థల నిర్మాణాలు, నిబంధనల్లో గణనీయమైన మార్పులు సంభవించి సాధారణ పరిస్థితులు నెలకొనగానే తొలగిపోతాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన తుఫానుల పై నిర్వహించిన పరిశోధనలలో వ్యవస్థలు సంక్షోభ పరిస్థితులలో అనుసరణీయతను పెంపొందించుకుంటాయనీ, వాటి నిర్మాణ నిబంధనలలో తగిన మార్పులు సంభవిస్తాయనే పరికల్పనలు నిర్ధారణ అయ్యాయి.

మార్టిన్ స్మిత్ అభిప్రాయం ప్రకారం సంక్షోభం ఆవిర్భావం వర్తమాన పరిస్థితులకు, గత పరిస్థితులకు మధ్యగల సమతౌల్యాన్ని మార్పు చేస్తుంది. దీని ఫలితంగా, వ్యవస్థీకృత కార్యక్రమాలలో కూడా మార్పు కలుగుతుంది. థాంప్సన్, హాక్స్ సంక్షోభాల సమయంలో విభిన్న వ్యవస్థలు ఏ విధంగా సర్దుబాటు చేసుకుంటాయో తమ వ్యవస్థా సిద్ధాంతంలో వివరించారు.

వైపరీత్యాలలో అనుసరణీయత దృక్పథంకి చెందిన రచయితల పరికల్పన ప్రకారం వర్తమాన వ్యవస్థలు అనిశ్చిత పరిస్థితులలో పలు రూపాల్లో అనుసరణీయతను పెంపొందించుకుంటాయి. ఈ అనుసరణీయత వ్యవస్థ నిర్మాణంలో కాని, పని విధానంలో కాని మార్పులను ప్రవేశ పెట్టుంది లేదా ఆ రెండింటిలోను ఏక కాలంలో మార్పులు ప్రవేశ పెట్టుంది. కాగా కొన్ని సందర్భాలలో నూతన సమ్మిళిత (Synthetic) వ్యవస్థలను అభివృద్ధి పరుస్తుంది.

సంక్షోభాలకు ప్రతి స్పందనలో కేంద్రీకృత సమాజాలకు, వికేంద్రీకృత సమాజాలకు మధ్య భిన్నత్వం ఉంది. కేంద్రీకృత సమాజాలలో విధాన నిర్ణయం ఉన్నత స్థాయి అధికారులకు మాత్రమే పరిమితమై ఉంది. విధాన నిర్ణయాలను ఒక స్థాయి నుంచి మరో స్థాయికి ప్రసారం చేయుటంలో సంభవించే అలస్యం వల్ల విధాన నిర్ణయీకరణ ప్రక్రియను సరళీకృతం చేయటం తగ్గుతుంది. అందుబాటులో ఉన్న కాలాంశాల ప్రభావం వల్ల విధాన నిర్ణయాక వేత్తలు సంక్షోభ సమయాలలో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతారు.

ప్రాచీన కాలంనుంచి భారతదేశం కూడా సంక్షోభాలకు గురవుతున్నది. అయితే పరిపాలనా వ్యవస్థలు సంక్షోభాలకు ఏ విధంగా ప్రతి స్పందిస్తాయి. అనే విషయం మీద శాస్త్రీయ పరిశోధనలను నిర్వహించటం ఇటీవలనే ప్రారంభమైంది. ఇటీవల కాలంలో ప్రకృతి వైపరీత్యాలుపై జరిపిన పరిశోధనల వల్ల ఉద్యోగ స్వామ్య వ్యవస్థ సంక్షోభ సమయాలలో తన సాంప్రదాయక లక్షణాలను పరిస్థితులకు అణుగుణంగా సరళతరం చేసేందుకు సిద్ధపడుతుందని వెల్లడైంది. తరుచుగా వైపరీత్యాలకు గురయ్యే ప్రాంతాలలో ఉద్యోగి స్వామ్య వ్యవస్థ వాటి నెదుర్కొనటానికి నూతన ప్రమాణాలను అనుభవాన్ని, అనుసరణీయతను అభివృద్ధి పర్చుకుంటుంది. 1977 సం.ములో ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన తుఫానుపై కొహెన్ మరియు రాఘవులు జరిపిన పరిశోధనల్లో ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో ఉద్యోగ స్వామ్య వ్యవస్థ కొంతవరకు అనుసరణీయతను పెంపొందించుకున్నా అది సద్యోజనితంగా ఏర్పడిందేనని కాని ఈ అనుసరణీయత పాలనా ప్రక్రియలో ప్రైవేటు వ్యక్తులకు, సమూహాలకు తగిన స్థానం కల్పించలేక పోవటం వలన ఘర్షణలకు దారితీసిందని స్పష్టమైంది.

అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో సంక్షోభ సమయాలలో చేసిన పరిశోధనల ఆధారంగా డైన్స్, క్వారంటెల్లీ సంక్షోభ వ్యవస్థ ప్రతిస్పందన వ్యవస్థీకృతమైన, సద్యోజనితంగా ఉత్పన్నమైన ప్రవర్తనా రూపంలో ఉంటుందని పేర్కొన్నారు. లాంఛనప్రాయ వ్యవస్థల్లో వలే, సంక్షోభ వ్యవస్థల్లోని సభ్యులు ఒక క్రమ పద్ధతిలో పరస్పరం ఆధారపడతారు. అలాగే లాంఛనా ప్రాయంకాని వ్యవస్థలో వలే వారిలో పరస్పర సహకారం ధోరణి ఉంటుంది. ఉదాహరణకు, సంక్షోభ సమయాలలో క్రింది స్థాయి ఉద్యోగులు, ఉన్నత అధికారులకు పరిస్థితిని నివేదించేటప్పుడు లేదా వారి సూచనలను పొందటంలో క్రమానుగత శ్రేణి సూత్రాన్ని పాటిస్తారు. వివిధ రకాల సమూహాలు, వ్యవస్థలు విపత్తు వలన సంభవించిన కార్యకలాపాలను నిర్వర్తిస్తాయి. ఆ సందర్భంలో సుస్థాపిత వ్యవస్థలు తమ దైనందిన కార్యకలాపాలను అంటే సాధారణ సమయాలలో నిర్వర్తించే విధులనే నిర్వర్తిస్తాయి లేదా పరిస్థితికి అనుగుణంగా నూతన కార్యకలాపాలను చేపట్టాయి. అలాగే కొన్ని నూతన సమూహాలు విపత్తుల వల్ల ఉత్పన్నమైన పనులను, అంటే ఆ సమూహాలకు అవితప్పని సరిగా నూతన కార్యకలాపాలు కాకపోవచ్చు. లేదా చేపట్టవచ్చు.

## 12.10 సారాంశం

ప్రకృతి వైపరీత్యాలు మానవుని మనుగడలో అంతర్భాగంగా ఇమిడి ఉన్నాయి. అందుచేత సంక్షోభ నివారణ పాలన ప్రగతి పాలనలో ఒక అంతర్భాగంగా రూపొందింది. అంటే అభివృద్ధి ప్రక్రియలో సంక్షోభ నివారణ ప్రక్రియతో ముడిపడి ఉంది. సంక్షోభాలవలన అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలు పలు సందర్భాలలో నిర్వీర్యం అవుతున్నాయి. కొన్ని సందర్భాలలో ఈ సంక్షోభాల వలన సంభవించే నష్టాలు ప్రభుత్వాల వార్షిక బడ్జెటులను మించిపోతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అవగాహన చేసుకోవచ్చును. ఈ సంక్షోభాల నెదుర్కొనటానికి

BRAOU

వివిధ రకాల వ్యవస్థాపరమైన ఏర్పాట్లున్నప్పటికీ, కాలానుగుణంగా సంభవించే సంక్షోభాల వల్ల నష్టాలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. దాని కనుగుణంగా సహాయం పునారావాస కార్యక్రమాల మీద చేసే వ్యయం కూడా పెరుగుతూ ఉన్నది. భారతదేశంలో సంక్షోభ పాలన నిర్వహణలకు అవసరమయ్యే వనరులు సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్ర, జిల్లా, స్థానిక సంస్థల శక్తిని మించిపోయాయి.

అంతేకాక సంక్షోభాలకు సంబంధించిన విధానాల రూపకల్పన, వాటి నిరోధానికి తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యల కొరకు తగిన నిధుల కేటాయింపు వంటి విషయాల పట్ల ప్రభుత్వానికి సరైన అవగాహన లేదు. ప్రతి సంవత్సరం ఈ సంక్షోభాలవలన పెరుగుతున్న నష్టాలు మన ప్రణాళికా విధానం, సంక్షోభ విధానాల్లోని లోపాలను వెల్లడిస్తున్నాయి. పోతే ఈ పరిస్థితి మెరుగు పర్చేందుకు పెక్కు చర్యలు చేపట్టవలసి ఉంది. సంక్షోభ నివారణ కార్యక్రమాలు సాధారణ ప్రణాళికాభివృద్ధి కార్యక్రమాలతో జతపరచాలి. దీంతో పాటు ప్రభుత్వం సంక్షోభాల నెదుర్కొనటానికి తగిన ప్రణాళికలను, వ్యూహాలను, కార్యక్రమాలను రూపొందించి, వాటిని నియమిత కాల వ్యవధిలో అమలు పరచవలసిన అవసరాన్ని ఒక ప్రాధాన్యత అంశంగా గుర్తించాలి. పెరుగుతున్న సంక్షోభాలు వాటి వల్ల కలిగే నష్టాల నివారణకు తగిన నిరోధక చర్యలు చేపట్టడం మరో కీలకాంశం. ఈ చర్యలు చేపట్టడంలో పాలనా నిర్మాణాలు, వ్యవస్థలను శక్తివంతం చెయ్యవలసిన అవసరం ఉంది.

స్వాతంత్ర్యానంతరం వివిధ రకాల సంక్షోభాల వలన కలిగిన పరిణామాలపై విధాన నిర్ణాయక వేత్తలకు తగిన అవగాహన ఏర్పడలేదు. ఫలితంగా ప్రకృతి వైపరీత్య నిరోధక చర్యలకు కొద్ది మొత్తాలను కేటాయించటం జరిగింది. వివిధ సంక్షోభాల వలన నష్టపోయిన రంగాలకు ఉచిత ధన సహాయం లేదా ఋణసౌకర్యాన్ని కలిగించటంలో పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్థలు, బ్యాంకులు అభివృద్ధి దృక్కోణంనుంచి విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలి.

BRAOU

## 12.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించక సమాధానము వ్రాయుము.

1. సంక్షోభం అంటె నిర్వచించి దాని పరిధి మరియు లక్షణాలు వివరించుము.

2. సంక్షోభాలకు అభివృద్ధికి గల సంబంధమును తెల్పుము.

3. సంక్షోభ సమయాల్లో వివిధ స్థాయిలో గల వ్యవస్థా పర ఏర్పాట్లు వివరించి అవి ప్రగతి పాలనను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో పేర్కొనుము.

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులు మించక సమాధానము వ్రాయుము.

1. సంక్షోభ పాలన అంటే ఏమిటి ?
2. భారతదేశంలో సంక్షోభాల తీవ్రత వివరించుము.
3. సంక్షోభాల నెదుర్కొనటంలో జిల్లా స్థాయిలో వ్యవస్థాపర ఏర్పాట్లు వివరించుము.

## 12.2 చదువదగిన రచనలు


1. C.V. Raghavulu. : "Research Trends in crises Management and Organisation Theory" , Indian Journal of Administrative Science, Vol-II, No. 1, Jan-July 1991, PP 21-35

2. : "Disaster Management and Organisational Adaptation", in T.N. Chaturvedi and Shanta Kohli Chanda (eds) Social Administration Development and Change, II PA New Delhi. 1980, PP 68-81

3. : "Disasters, Development and Foreign Aid : Some Issues and Concerns", Journal of Social Economic Studies, Vol. 2 No.1 1985, PP 343-359.

4. Frederick C. Cuny : Disasters and Development Oxford University Press, Newyork, 1983.

5. A. Avasthi and S.P. Ranga Rao (eds) : Crisis Administration in India, Sterling, New Delhi, 1982


BRAOU

రచయిత : వి.పి.సి. బోస్

# భాగం - 13 : ప్రగతి పాలన లబ్ధిదారులు

## విషయ క్రమం :

13.0 లక్ష్యాలు
13.1 పరిచయం
13.2 ప్రగతి పాలన - లబ్ధిదారుల ప్రాధాన్యత
13.3 ప్రగతి పాలన - లబ్ధిదారులు: సైద్ధాంతిక అంశాలు
13.4 ప్రగతి పాలన - లబ్ధిదారుల సంబంధంలో ప్రధాన అంశాలు
13.5 అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి
13.6 భారతదేశంలో ప్రగతి పాలన - లబ్ధిదారుల సంబంధాలు
13.7 సారాంశం
13.8 నమూనా పరీక్షా ప్రశ్నలు
13.9 చదువదగిన రచనలు

## 13.0 లక్ష్యాలు

BRAOU

ప్రగతి పాలన-లబ్ధిదారుల సంబంధాలలోని వివిధ అంశాలను వివరించటం ఈ భాగం ప్రధాన లక్ష్యం. ఈ భాగాన్ని చదివితే మీరు ఈ క్రింది విషయాలను వివరించ గల్గుతారు.

* ప్రగతి పాలన-లబ్ధిదారుల సంబంధాల ప్రాధాన్యత
* పాలన - లబ్ధిదారుల సబంధంలోని కీలక అంశాలు
* అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలన - లబ్ధిదారుల మధ్య సంబంధాల స్వరూపం
* భారతదేశంలో పాలన- లబ్ధిదారుల సంబంధాల పరిస్థితి

## 13.1 పరిచయం

ఆధునిక కాలంలో ప్రజలకు ప్రభుత్వ పాలనా వ్యవస్థతో అతి సన్నిహిత సంబంధం ఏర్పడింది. ప్రస్తుతం పాలనతో ప్రభావితంకాని ప్రజా జీవితంలోని ఏ అంశం లేదు. ప్రతి పౌరుడు దాదాపు ప్రతి రోజు ఏదో ఒక ప్రభుత్వ శాఖ లేదా ఉద్యోగితో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ప్రతి స్పందిస్తాడు. ఈ విధంగా పాలన-లబ్ధిదారుల మధ్య ఎంతటి సన్నిహిత సంబంధం ఏర్పడినప్పటికీ, దురదృష్టవశాత్తు ఈ అంశంపై పాలనా శాస్త్రవేత్తలు, రచయితలు పరిమితమైన ఆసక్తిని మాత్రమే కనపర్చారు. ప్రభుత్వ పాలనా వ్యవస్థ, నిర్మాణాలు, కార్యకలాపాలు, ఉద్యోగి బృందం పాత్ర, ఉద్యోగి బృందం ప్రవర్తన మొదలైన అంశాలపై అధ్యయనాలు గణనీయమైన పరిమాణంలో ఉన్నప్పటికీ, లబ్ధిదారులు-పాలనా యంత్రాంగం ప్రతిస్పందన లేదా వారి మధ్య పరస్పర సంబంధాలపై తగినంతగా శాస్త్రవేత్తల

విశ్లేషణ జరగలేదు. అందుచేత లబ్ధిదారులు-పాలనా యంత్రాంగం లేదా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి తమకు అవసరమైన సేవలను పొందేందుకు ఎంత సమయాన్ని వెచ్చిస్తున్నారు? ప్రభుత్వోద్యోగులతో ప్రతిస్పందనలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు మొదలైన అంశాలపై విశ్లేషణాత్మకమైన సమాచారం చాలా తక్కువ.

అధ్యయన రంగంలో పాలన-లబ్ధిదారుల మధ్య సంబంధాలు తగిన ప్రాధాన్యతను పొందినప్పటికీ, ఆచరణాత్మకంగా వీరి మధ్య సంబంధాలు క్రమంగా ప్రాధాన్యతను పెంచుకోవటమే కాక, క్లిష్టంగా రూపొందుతున్నాయి. సాంప్రదాయ బద్ధమైన పోలీసు రాజ్యం, సంక్షేమ రాజ్యంగా పరివర్తన చెందాక, ప్రజల సామాజిక, ఆర్థికాభివృద్ధి దేశ ప్రాధాన్యతల్లో ప్రథమ స్థానాన్ని పొందడంతో పాలనా యంత్రాంగంతో లబ్ధిదారుల సంబంధాలు నిర్లక్ష్యం చేయలేని అంశంగా రూపొందింది. లబ్ధిదారుల సహకారం, సద్భావం లేకుండా ప్రగతి పాలన తన లక్ష్యాలను చేరుకోలేదు కాబట్టి పాలనాయంత్రాంగం పై ప్రజల అభిప్రాయాలు, దృక్పథాలు, తీర్పులు ఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయలేని అంశాలు అయ్యాయి. ఈ గుర్తింపు అనేక దేశాలలో పాలన-లబ్ధిదారుల మధ్య స్నేహపూర్వకమైన, పరస్పరం సహకరించుకునే ధోరణితో కూడిన సంబంధాలను ఏర్పరచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి.

## 13.2 ప్రగతి పాలన - లబ్ధిదారుల ప్రాధాన్యత

BRAOU

ప్రజాస్వామ్య దేశాలలో ప్రభుత్వ పాలనా శాస్త్రం పరిధిలో చర్చించే అనేక అంశాలలో పాలన -లబ్ధిదారులపై చర్చ ఒక కీలకాంశం. ఎందుచేతనంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలన చట్ట బద్ధత ప్రజలు లేదా లబ్ధిదారుల పాత్రలో ఇమిడి ఉంది. ఈ వ్యవస్థలో ప్రభుత్వపాలన ప్రజల సంక్షేమం అనే ఏకైక లక్ష్యంతో మాత్రమే తన ఉనికిని కొనసాగిస్తుంది. ఒక దృక్పథం ప్రకారం ప్రభుత్వ పాలనలో లబ్ధిదారులు కేంద్ర బిందువు. వారే పాలనకు చోదక శక్తి, ఈ విధంగా పాలన-లబ్ధిదారుల సంబంధాలు కీలకమైనవి అయినప్పటికీ, అవి స్థిరమైనవి కావు. ఈ సంబంధాలు రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, పాలనా రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారుతున్నాయి. ప్రాచీన, మధ్య యుగాలలో నిరంకుశ రాజరికం, పోలీసుల పాలన, మొదలైన రాజ్య వ్యవస్థలు అమలులో వున్నకాలంలో లబ్ధిదారులు - పాలన మధ్య సంబంధాలు అతి తక్కువ స్థాయిలో ఉన్నాయి. ఆ కాలంలో పాలనా వ్యవస్థ ప్రజల అవసరాలకు, సమస్యలకు అనుగుణంగా ప్రతిస్పందించక బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శించింది. ఈ కారణం వల్ల లబ్ధిదారులు - పాలనా సంబంధాలు చాలా కాలంపాటు పాలనా రచయితల దృష్టిని ఆకర్షించలేదు. అయితే 20వ శతాబ్దం మొదటి భాగంలో ఈ అధ్యయనాంశం ప్రాముఖ్యత పెరిగింది. దీనికి నూతనంగా స్వాతంత్ర్యం పొందిన అభివృద్ధి చెందుతున్న దేశాలు సంక్షేమ రాజ్యం, సామ్యవాదం, ప్రధాన లక్ష్యాలుగా ఏర్పరుచుకోవటమే ప్రధాన కారణం. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఈ లబ్ధిదారుల - పాలనా సంబంధాలు వేరే ఇతర కారణాల వల్ల ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ దేశాలలో ప్రజల పాత సిద్ధాంతమైన స్వేచ్ఛకంటే భౌతిక పరమైన సౌకర్యాల పట్ల ఆసక్తిని పెంపొందించుకున్నారు. రాజ్యం, సమాజాల సంబంధాలను రాజకీయ స్వేచ్ఛనుంచి ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయాలపై కేంద్రీకరించటం ప్రారంభమైంది. దీని ఫలితంగా ప్రభుత్వపాలన ప్రజల జీవితాలలోని మొత్తం అంశాలకు తన పరిధిని విస్తరించింది. ప్రభుత్వ సేవలను పొందడం ప్రతి పౌరుని ఆకాంక్ష అయింది.

ప్రస్తుతం లబ్ధిదారులు, ప్రభుత్వం పని చేస్తున్న సందర్భం వలన కూడా ప్రభుత్వం - ప్రజల సంబంధాలకు చెందిన పాత భావనలను మార్చవలసిన అవసరాన్ని కల్పించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పట్టణీకరణ, సంక్షేమ రాజ్య భావన ఉద్యోగి బృందం పాత్రను విస్తృత పర్చాయి. దీంతో పాటు పాలనా ప్రక్రియలో సంక్లిష్టత పెరిగింది. లబ్ధిదారులు - పాలన మధ్యదూరం అధికమైంది. అధికార వికేంద్రీకరణ భావన ప్రాధాన్యతను అందరూ గుర్తించినప్పటికీ, ఉద్యోగి స్వామ్య వ్యవస్థ ఆధిపత్యంలో మార్పులేదు. ప్రభుత్వ ఉద్యోగులు - లబ్ధిదారుల మధ్య సంబంధాలు పాలనా నిరంకుశత్వాన్ని తగ్గించటానికి, ప్రజలపట్ల ఉద్యోగుల శత్రుత్వ, సంఘర్షణా పూరిత వైఖరిలో మార్పు తీసుకురావడానికి దృష్టిని కేంద్రీకరించ వలసిన ఆవశ్యకత పెరిగింది.

లబ్ధిదారుల సంతృప్తి పెంపొందింపచేయడం పాలన కర్తవ్యం. ప్రభుత్వ చట్ట బద్ధతను, నిర్ధారించటంలో, లబ్ధిదారుల సంతృప్తి ఒక కీలకాంశం. బహుళ పార్టీ వ్యవస్థ ఉన్న ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో లబ్ధిదారుల సంతృప్తికి అధిక ప్రాధాన్యత ఉంది. ఎందుచేతనంటే రాజకీయ పార్టీలు ప్రజల దృక్పథాలను తమకు అనుకూలంగా మలుచుకునే ధోరణిని ప్రదర్శిస్తాయి. అందుచేత ప్రభుత్వ మనుగడకు ప్రజల స్వచ్ఛందమైన సహకారాన్ని సమీకరించటం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ దేశాలలో ఆచరణాత్మక సంస్థీకృత రంగాలలో ప్రజల సంతృప్తి భావనను సుస్థిర పరచవలసిన ఆవశ్యకత ఉంది.

అయితే వాస్తవంలో పై ప్రక్రియ సులభ సాధ్యం కాదు. కారణం పాలనా ప్రక్రియ వైవిధ్య పూరితమైంది. దాని స్వభావం ఖండాలు, ఖండాలుగా వుండటమే కాక అమూర్తికమైంది. దానిని నియంత్రించడం క్లిష్టతరమైంది. పైగా పాలనా నిర్మాణానికి క్రమానుగత శ్రేణి సూత్రం ప్రధాన ఆధారం. దాని సేవలందుకునే లబ్ధిదారులలో బహుళత్వం ఉంది. వివిధ తరగతులకు చెందిన ప్రజలు పలు స్థాయిల్లో పాలనతో సంబంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఈ కారణాల వల్ల పాలనా వ్యవస్థ-లబ్ధిదారుల మధ్య సత్సంబంధాలను ఏర్పరచడం సులభం కాదు.

BRAOU

## 13.3 లబ్ధిదారులు - ప్రగతి పాలన సంబంధాలు : సైద్ధాంతిక అంశాలు

లబ్ధిదారులు-ప్రగతి పాలన సంబంధాలు ప్రభుత్వ పాత్ర పై, ప్రజలతో పరస్పర చర్యపై పలు సైద్ధాంతిక పరమైన అంశాల అవతరణకు దారితీసాయి. కాట్జ్, డెనెట్ అనే రచయితలు ప్రభుత్వ వ్యవస్థలు, వాటి లబ్ధిదారుల మధ్య సంబంధాలను నిర్దేశించే అనేక మార్గదర్శక ప్రమాణాలను రూపొందించారు. అవి: 1. సార్వత్రికత 2. నిర్దిష్టత 3. తటస్థత.

సార్వత్రిక అంటే వ్యవస్థ తన లబ్ధిదారుల పట్ల సమానత్వాన్ని ప్రదర్శించడం. కాగా నిర్దిష్టత అంటే పాలన-లబ్ధిదారుల మధ్య వ్యవస్థను నిర్దేశించే నిర్దిష్టమైన సంబంధాలు. చివరగా తటస్థత అంటే లబ్ధిదారులందరి పట్ల తటస్థ వైఖరిని ప్రదర్శించటం.

పరస్పర చర్యలో పాలనకు లబ్ధిదారుల మధ్య ఏర్పడే నిర్మాణ పరమైన ప్రమాణాలతో పాటు కొన్ని ఇతర అంశాలు కూడా ప్రాధాన్యత వహిస్తాయి. లబ్ధిదారులు-పాలన పరస్పర చర్యలో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి 1. పద్ధతులు 2. వనరులు మార్పిడి 3. ప్రవర్తనా శైలి

లబ్ధిదారులు - పాలన పరస్పర చర్యలో ఇమిడి ఉన్న పాలనా ప్రక్రియలనే పద్ధతులు అనవచ్చును. ఉదాహరణకు లబ్ధిదారుడు ఒక ప్రభుత్వ సంస్థ నుంచి ఋణం పొందేందుకు కొన్ని ఫారాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఋణాన్ని పొందేందుకు ఎంతకాలం వేచి ఉండాలి? అనే అంశాలే పాలనా పద్ధతులు అనవచ్చును. కాగా లబ్ధిదారులు - పాలన పరస్పర చర్య ఫలితాన్నే వనరుల మార్పిడిగా పరిగణించవచ్చును. ఉదా॥ లబ్ధిదారుడు అంతిమంగా ప్రభుత్వ సంస్థ నుంచి తానుకోరిన ఋణాన్ని పొందాడా? లేదా ఒక వ్యక్తి పురపాలక సంఘం నుంచి గృహనిర్మాణానికి అవసరమైన అనుమతిని పొందగలిగాడా? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలే వనరుల మార్పిడి కాగా ప్రవర్తనా శైలి అంటే ఒక పరస్పర చర్య సన్నివేశంలో వ్యక్తుల (ప్రభుత్వఉద్యోగులు- లబ్ధిదారులు) మధ్య సంభవించే ప్రవర్తనా పరమైన సంబంధాలు. పైన వివరించిన నిర్మాణ పరమైన ప్రమాణాలు ఈ పరస్పర చర్య దృక్కోణాలు పాలన- లబ్ధిదారుల మధ్య సంబంధాలపై సిద్ధాంతీకరణకు ఆధారంగా ఉపయోగపడ్డాయి.

వెబర్ ప్రతిపాదిత ఉద్యోగస్వామ్య నమూనా ఉద్యోగి బృందం-లబ్ధిదారుల మధ్య సంబంధాలను సక్రమంగా వివరించలేదు. జేమ్స్.డి. థాంప్సన్ పేర్కొన్నట్లు ఏకీకృత, సమైక్య అధికారం నిర్ధారించే ఉద్యోగి బృందం సంబంధాలపైనే తన దృష్టిని కేంద్రీకరించిన సాంప్రదాయ ఉద్యోగిస్వామ్య నమూనా లబ్ధిదారులను పూర్తిగా విస్మరించింది. నిర్దిష్టమైన ఏకీకృత ఉద్యోగస్వామ్య వ్యవస్థ స్థిరమైన, భావరహిత, అవ్యక్తానుగత యంత్రం. ఈ యంత్రం అన్ని సందర్భాలలో ఏకత్వంతో, సడలింపులేని క్రమ పద్ధతిలో పనిచేస్తుంది. ఈ నమూనాలోని జడీకృతమైన ఊహన ఏమిటంటే ఉద్యోగిస్వామ్య యంత్రాంగానికి ఆధారభూతమైన లబ్ధిదారుడే ఈ యంత్రాంగంతో సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దీని ఫలితంగా ఉద్యోగి బృందం నిర్మాణం వల్ల ఆశించిన పరిమాణాలు సంభవిస్తాయని రాబర్ట్ మెర్టన్ వాదించాడు.

ఐసన్ స్టాట్, ఉద్యోగిస్వామ్య వ్యవస్థ దాని పరిసరాలు (లబ్ధిదారులు) మధ్య సంబంధాలపై ఒక నూతన నమూనాను ప్రతిపాదించాడు. దీని ప్రకారం ఉద్యోగస్వామ్య వ్యవస్థ లక్షణాలు, ఆ వ్యవస్థతన పరిసరాలతో పెంపొందించుకునే గతశీలక సమతుల్యత పై ఆధారపడి ఉంటాయి. ఈ విధంగా ఐసన్ స్టాట్ వెబర్ నమూనాకు విభిన్నంగా ఉద్యోగస్వామ్య వ్యవస్థను పరిసరాల పరిస్థితుల ఆధారంగా వివరించాడు. ఇదే సందర్భంలో ఐసన్‌స్టాట్ ఉద్యోగిస్వామ్య విసర్జన (De Bureaucratisation) అనే భావనను కూడా ఉపయోగించి వ్యవస్థ, దాని లబ్ధిదారుల మధ్య సన్నిహిత సంబంధాల వల్ల ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో వచ్చిన మార్పులను అధ్యయనం చేసాడు. ఉద్యోగిస్వామ్య విసర్జన ప్రక్రియకు శ్రేణిత్వం, అవ్యక్తానుగతం, కాఠిన్యవంతమైన నియమనిబంధనల పట్ల అధిక ప్రాధాన్యతవంటి ఉద్యోగి స్వామ్య లక్షణాల స్థానంలో సరళ, నియమ నిబంధనల ప్రాధాన్యతను తగ్గించడం, వ్యక్తులకు వారి సమస్యలకు ప్రాధాన్యత కల్పించడం, శ్రేణిత్వ స్థాయిలను కుదించడం, నిర్ణయీకరణ ప్రక్రియ వేగవంతం చేయటం వంటి లక్షణాలు ప్రవేశ పెట్టడం, పాలనా, నిర్ణయీకరణ ప్రక్రియల్లో ప్రజల అభిప్రాయాలను, దృక్పథాలను ఒక ప్రాతిపదికగా పరిగణించడం, పాలన ప్రజాసమస్యలకు చురుకుగా ప్రతిస్పందించడం, ప్రభుత్వోద్యోగులు, ప్రజలకు, ప్రజాసంస్థలకు జవాబుదారీగా ఉండటం ఈ ఉద్యోగిస్వామ్య విసర్జన ప్రక్రియలో ముఖ్య అంశాలు.

పీటర్ బ్లౌ, వైట్‌లు వ్యవస్థ-లబ్ధిదారుల సంబంధాలపై పలు ఊహనలను ప్రతిపాదించారు. బ్లౌ వృత్తివాదం (Professoinalism) లబ్ధిదారుల ప్రయోజనాలను నెరవేర్చినప్పటికీ వాటిపట్ల ఆసక్తిని తగ్గిస్తుందని పేర్కొన్నాడు. వైట్ లబ్ధిదారుల ఉద్యోగుల సంబంధాలను మెరుగు పరిచేందుకు పర్యవేక్షణ పద్ధతులను పునర్ వ్యవస్థీకరించాలని సూచించాడు. జానో విట్ ఉద్యోగిస్వామ్యం లబ్ధిదారుల పట్ల సమతుల్యతతో కూడిన వైఖరిని ప్రదర్శించినపుడే ప్రభుత్వ పాలనలో సమతుల్యత నెలకొంటుందని వాదించాడు.

BRAOU

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థ- లబ్ధిదారుల సంబంధాలు ప్రభుత్వ పాలనా శాస్త్ర పరిశోధనలలో ఒక ప్రముఖ అంశం. ఈ అంశంపై అనేక పరిశోధనలు నిర్వహించబడ్డాయి. ఈ పరిశోధనలు వలసపాలన కాలంలో పాలనావ్యవస్థ లక్ష్యాలు, ఉపయోగించిన పద్ధతులు, ఉద్యోగబృంద ప్రవర్తన, జవాబు దారీతనం (accountability) వంటి అంశాలపై సాగాయి. ఈ పరిశోధనల్లో ప్రతిపాదించిన ఊహనల ప్రకారం వలసపాలనలో ప్రభుత్వ పాలన కేవలం శాంతి భద్రతల పరిరక్షణ, పన్నుల వసూలు అనే రెండు లక్ష్యాలకు పరిమితమైంది. పాలనా ప్రక్రియతో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం రహితంగా కొనసాగింది. వలసపాలకులు నిర్బంధపూర్వకమైన లాంఛనప్రాయమైన పద్ధతులపై ఆధారపడిన పాలనా విధానాన్ని అనుసరించారు.

ఆ కాలంలో పౌరులు, ప్రభుత్వపాలన సంబంధాలు, పాలనా స్వభావం-దాని నిర్వర్తన విశిష్ట లక్షణాలపై ఆధారపడ్డాయి. వలసపాలనలో ఉన్న దేశాలు స్వాతంత్ర్యం సాధించిన ప్రభుత్వపాలన ప్రజల సంబంధాలలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. ఈ దేశాలలో ప్రభుత్వ కార్యకలాపాల విస్తరణతోపాటు, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని కల్పించేందుకు తగిన సంస్థాగత ఏర్పాట్లు చేయబడ్డాయి. (ఉదా॥ పంచాయితీరాజ్ వ్యవస్థ) ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అనేక సంస్థలను ఏర్పాటు చేసి పాలనా పద్ధతులలో అనేక మార్పులను ప్రవేశ పెట్టారు.

## 13.4 ప్రగతి పాలన - లబ్ధిదారుల సంబంధాలలో ప్రధాన అంశాలు

BRAOU

ప్రగతి పాలన-లబ్ధిదారుల సంబంధాలలో ప్రధానంగా మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి 1. పాలన-లబ్ధిదారుల మధ్య సహకారం 2. పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం 3. ప్రభుత్వ పాలన వల్ల ప్రజలకు ఏర్పడిన ఇబ్బందులు/సమస్యలు/ఫిర్యాదులు (Grievances) నివారణకు అందుబాటులో ఉన్న సాధనాలు. ఈ మూడు అంశాలను ప్రజలు-పాలనా సంబంధాలను వివరించే సూచికలు. ఈ అంశాలపట్ల తగు శ్రద్ధ వహించి, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తే పాలన-లబ్ధిదారుల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి.

### 1. పాలన లబ్ధిదారుల పరస్పర సహకారం

సహకారం అనే పదంలో పరస్పర అవగాహనతో విశ్వాసంతో కలిసి మెలిసి పనిచేయడానికి ఇరుపక్షాలు సంసిద్ధతను వ్యక్త పర్చటం అనే భావన ఇమిడి ఉంది. ప్రజలకోర్కెలకు, డిమాండ్లకు ప్రభుత్వం స్పందించటంతో పాటు, ప్రజల పాలనావ్యవస్థకు తమ సహాయ సహకారాలను అందచేయటాన్ని ప్రజలు-పాలనా వ్యవస్థ సహకారంగా పరిగణించవచ్చును.

ప్రజలు-ప్రభుత్వం విధానాలు, కార్యక్రమాలతో విభేదించినప్పటికీ ప్రభుత్వ కార్యకలాపాలను ఆటంకపర్చకపోవటం వారి సహకారధోరణిని ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వం - లబ్ధిదారుల మధ్య తలఎత్తే విభేదాలను రాజ్యాంగ పద్ధతుల ద్వారా పరిష్కరించవచ్చును. కొన్ని సందర్భాలలో ఈ విభేదాలను ప్రజలే తమంతటతామే విస్మరించవచ్చును. సామాజిక శాస్త్రవేత్తలు ప్రభుత్వ పథకాలు, విధానాల పట్ల ప్రజల అనుకూలతను లేదా వ్యతిరేకతను కొలచే సూచికలను ఏర్పరచవచ్చును. ఇదే విధంగా ప్రభుత్వ విధానాలలో కొన్నింటిని సమర్థించే మరికొన్నింటిని వ్యతిరేకించే మిశ్రమ

దృక్పథాన్ని కూడా అంచనా వేసే సూచికలను రూపొందించవచ్చు. ఈ దృక్పథాన్ని విమర్శనాత్మక సహకారంగా పరిగణించ వచ్చును. ఈ లక్షణం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సంకేతం.

## 2. ప్రజల భాగస్వామ్యం:

ప్రభుత్వ పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యాన్ని ఎక్కువగా ప్రచారం చేసినప్పటికీ వాస్తవంలో సాధించింది తక్కువనే చెప్పాలి. పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం సాంప్రదాయ లేదా పురాతన ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధ్యమైనప్పటికీ అధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధ్యం కాదనే చెప్పాలి. రాజకీయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యానికి కల అవకాశాలు పాలనా ప్రక్రియలో లేవు. ఏమైనప్పటికీ, పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం రెండు ధోరణులను వెల్లడిస్తుంది. ఒకటి పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్య స్థానంలో ప్రత్యేక ప్రయోజన వర్గాల లేదా రాజకీయ పార్టీల భాగస్వామ్యం అభివృద్ధి చెందింది. ఈ మార్పుకు సమాజం కార్యపరంగా, రాజకీయంగా ఏకత్వాన్ని సాధించడమే ప్రధాన కారణంగా భావించవచ్చును. అయితే దీని వల్ల సాధారణ ప్రజలు నిస్సహాయులుగా మిగిలే ప్రమాదం ఉంది. రెండవ ధోరణి ప్రయోజన సంఘాలు, ప్రభుత్వ శాఖల మధ్య నూతనంగా సంబంధాలేర్పడటం. దీంతో పాలన-ప్రజల ప్రయోజనాల కంటే ప్రయోజన గణాల ప్రయోజనాలకే సంతృప్తి కనపర్చే పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ విధంగా పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే సాంప్రదాయ మార్గాలలో అనేక మార్పులు సంభవించాయి. గత ఊహనలు, పూర్వ సంస్థల పట్ల మోజు పాలనకు తన పరిస్థితులలో అనుగుణ్యత పెంపొందింప చేసుకోకుండా నిరోధిస్తున్నాయి. దానికి అధికార వికేంద్రీకరణ పట్ల కల సాంప్రదాయ భావాలను ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చును. అధికార వికేంద్రీకరణ భావన సార్వత్రిక మాన్యత ఉంది. కానీ వాస్తవంలో సమాచార ప్రసార రంగంలో వచ్చిన అధునిక యంత్రాల (టెలిఫోను, టెలెక్స్) కారణంగా అధికారకేంద్రీకరణ ప్రక్రియ రూపుదిద్దుకొంది. ఒక విధంగా చెప్పాలంటే వికేంద్రీకరణ రాజకీయ లాంఛనంగా మారితే అధికార కేంద్రీకరణ పాలనా వాస్తవం అయింది.

## 3. ఇబ్బందులు/సమస్యలు/ఫిర్యాదుల నివారణ:

ప్రభుత్వ పాలన కార్యకలాపాలలో విపరీతమైన పెరుగుదల వల్ల, ప్రజా జీవితంలో ఉద్యోగి బృందం వహిస్తున్న విస్తృత పాత్రవల్ల ప్రజల ఇబ్బందులు/సమస్యలు/ఫిర్యాదులు పెరిగాయి. ఈ పెరుగుదలతో సమానంగా క్లేశాలను నివారించే పద్ధతులు, యంత్రాంగం పెరగక పోవటమే కాక ప్రభుత్వ ఉద్యోగుల సాంప్రదాయ వైఖరులలో కూడా మార్పులేదు. చివరకు ప్రగతి పాలనకు బాధ్యత వహించే ఉద్యోగులు కూడా ప్రగతి శీలక మనస్తత్వంతో కాక ఉద్యోగిస్వామ్య ప్రవృత్తిని పెంపొందించుకున్నారు. తగిన వనరులు కేటాయించకుండా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలలో అనేక ఆశలు రేకెత్తించినప్పటికీ, వారికి సంతృప్తి కల్గించలేకపోతున్నాయి. దాని ఫలితంగా ప్రభుత్వం చేపడుతున్న సేవల గుణాత్మకత, పరిమాణంపై ప్రజలలో అసంతృప్తిని పెంచటమేకాక అపోహలకు, అభియోగాలకు దారి తీస్తున్నాయి.

ప్రభుత్వ సేవల పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరగటం వల్ల అధికమైన అభియోగాలు ప్రజలలో, ప్రభుత్వం నీతి నిజాయితీ పట్ల, ప్రజల ఇబ్బందులు/సమస్యలు/ఫిర్యాదులు సంతృప్తి పరిచే సమర్థత పట్ల, ప్రజలలో విశ్వాసం సన్నగిల్లింది.

BRAOU

లబ్ధిదారుల ఇబ్బందులు/సమస్యలు/ఫిర్యాదులు నివారణ పట్ల ఆసక్తి కనపర్చాయి. అనేక దేశాలలో ప్రజల సమస్యల నివారణకు ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేశాయి. వీటిలో ముఖ్యంగా విజిలెన్సు కమీషనర్, ప్రొక్యూరేటర్ జనరల్‌ను పేర్కొనవచ్చును. అయితే ప్రజల క్లేశ నివారణకు ఏర్పాటైన సంస్థలలో స్కాండినేవియా దేశాలకు చెందిన అంబుడ్స్ మన్ వ్యవస్థ ప్రపంచంలోని పలు దేశాల దృష్టిని ఆకర్షించింది. కాలక్రమేణా అనేక పాశ్చాత్య పాశ్చాత్యేతర దేశాలలో అంబుడ్స్ మన్ వ్యవస్థ ఏర్పాటు చేయబడింది.

## 13.5 అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి

ఈ దేశాలలో ప్రభుత్వ పాలన ప్రజల అవసరాలను సమస్యలను తీర్చటంలో నిర్లక్ష్యం చేసే వైఖరిని అలవరుచుకుంది. స్వాతంత్ర్యానంతరం తొలి దశాబ్దంలో దానికి కొంతవరకు వలసపాలన ఒక కారణం అయినా ఆ తర్వాత చరిత్రను బట్టి చూస్తే కొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నట్లు ప్రస్ఫుటమవుతుంది. మన సామాజిక -ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విషయాలు, ముఖ్యంగా సామాజిక భిన్నత్వానికి సంబంధించిన పోకడలు, ఉద్యోగి బృందం ప్రవర్తనపై ప్రభావం చూపుతున్నాయి. మరొక అంశం, ప్రభుత్వపాలన సార్వత్రిక/సార్వజనీన దృక్పథాన్ని అలవర్చుకోకుండా నిరోధించడంలో రాజకీయ నాయకుల ధోరణి ప్రభావం కూడా ఉంది.

ప్రధాన విషయాలలో విధాన రూపకల్పన కొద్ది మంది రాజకీయ వేత్తల, పాలనోద్యోగుల్లో కేంద్రీకృతమైంది. ఆర్థిక-సామాజిక వ్యవస్థలోని వ్యత్యాసాల వల్ల, వీటిలోని కొన్ని బలమైన వర్గాలు ప్రభుత్వ యంత్రాంగంపై వారికి సంబందించిన అనేక విషయాలలో ఆధిపత్యాన్ని సంపాదించి దానివల్ల సమకూరే ప్రయోజనాలను మిగతా వారికంటే తమకు ఎక్కువ సంక్రమింపచేసుకోగల్గుతున్నారు. ఈ విధమైన పాలనా యంత్రాంగం పై శక్తి వంతమైన వర్గాల ఆధిపత్యం వల్ల మరొక వైపు జనాభా పెరుగుదల వల్ల ఈ సమాజాల్లో పేదరికం, అజ్ఞానం, ఆర్థిక అసమానతలు వేగంగా పెంపొందాయి. ఆర్థిక పరమైన పేదరికం, అజ్ఞానం వల్ల పేద ప్రజల పరిస్థితులలో పెద్ద మార్పులేదు. దీని ఫలితంగా ప్రభుత్వ పాలన కేవలం కొద్ది వర్గాల ప్రైవేటు ఆస్తిగా రూపొందింది. ఈ దేశాలలోని రాజకీయ పార్టీల స్వభావం, ప్రవర్తన ముఖ్యంగా ఈ పరిస్థితికి దోహదం చేసాయి. ఈ పరిస్థితికి మూడు ఇతర కారణాలు తోడ్పడ్డాయి. ఒకటి, పాలనావ్యవస్థ అన్ని స్థాయిల్లోని ఉద్యోగులు పాలనా విచక్షణాధికారాన్ని చెలాయిస్తున్నారు. విచక్షణాధికారాన్ని చెలాయించే క్రిందిస్థాయి ఉద్యోగులపై సమర్థవంతమైన పర్యవేక్షణ లేదు. రెండు, పెరుగుతున్న ప్రభుత్వ కార్యకలాపాలకు అనుగుణంగా శాసన నిర్మాణ ప్రక్రియ పరిమాణం, సంక్లిష్టతలు పెరిగాయి. దీని ఫలితంగా శాసనసభలు కార్యనిర్వాహక శాఖకు అధిక పరిమాణంలో విచక్షణాధికారాలను దత్తం చేస్తున్నాయి. ఈ దత్త శాసనాధికార విధానం కార్యనిర్వాహక శాఖను బలోపేతం చేయటమేకాక , అది ప్రజాప్రయోజనాలకు ప్రతిస్పందించకుండా, కొన్ని సందర్భాలలో నిరంకుశంగా వ్యవహరించటానికి దారితీసింది. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనోద్యోగులకు న్యాయాధికారాలు కూడా అప్పగించబడ్డాయి.

ఈ విధంగా విచక్షణాధికారం, దత్త శాసనాధికారం, పాలనాన్యాయాధికారాలు ప్రభుత్వోద్యోగుల పరిమిత నిరంకుశత్వానికి దారితీసాయి. దీని ఫలితంగా పాలనా ప్రక్రియపై ప్రభుత్వ అధికారులే పూర్తి ఆధిపత్యం వహిస్తూ, ఆ ప్రక్రియలో ప్రజలకు భాగస్వామ్యాన్ని నిరాకరిస్తున్నారు. అంతేకాక ప్రజల కోర్కెలకు, సమస్యలకు అతితక్కువ స్థాయిలో ప్రతిస్పందించటమే కాక ప్రభుత్వోద్యోగులు తమ అధికారాలను పలు సందర్భాలలో దుర్వినియోగపర్చటం, అవినీతి చర్యలకు పాల్పడటం అధికమైంది. ప్రభుత్వోద్యోగులలో ప్రబలిన వ్యతిరేక దృక్పథం వల్ల ప్రజలు, ప్రభుత్వ పాలనా వ్యవస్థల మధ్య తీవ్రమైన అంతరం ఏర్పడింది.



BRAOU

## సంస్థాగత ఏర్పాట్లు:

పాశ్చాత్య దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడకుండా నిరోధించేందుకు వ్యవస్థాపరమైన సాధనాలు ఉన్నాయి. రాజకీయ పార్టీలు, రాజకీయేతర సంస్థలు, వార్తా పత్రికలు, ప్రజాభిప్రాయం అధికారుల కార్యకలాపాలపై నిఘా ఉంచుతూ వారు అవినీతి చర్యలను చేపట్టకుండా కొంతవరకు నిరోధించగల్గుతున్నాయి. ఈ దేశాలలో ప్రభుత్వ సంస్థలు తమకు తామే తగిన పాలనా నైతిక సూత్రాలను ప్రమాణాలను ఏర్పరుచుకొంటున్నాయి. అయినప్పటికీ ఈ దేశాలు ప్రభుత్వ ఉద్యోగులను అదుపులో ఉంచేందుకు ప్రజల అవసరాలకు తగిన విధంగా ప్రతిస్పందించేలా వారిని తీర్చిదిద్దేందుకు కొన్ని సాధనాలను ఏర్పరుచుకున్నాయి.

కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిస్థితి దీనికి చాలా వరకు భిన్నంగా ఉంది. ఈ దేశాలలో పైన ఉదహరించిన కారణాల వల్ల పాలనా వ్యవస్థ ఆధిక్యతా వాద దృక్పథాన్ని పెంపొందించుకొని సామాన్య ప్రజలకు దూరమైంది. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వాలు ప్రజల సామాజిక ఆర్థికాభివృద్ధిని తమ ఏకైక లక్ష్యంగా పెట్టుకొని దాని సాధనకు అధిక సంఖ్యలో పథకాలను, ప్రణాళికలను రూపొందించి అమలు పర్చటం ప్రారంభమైంది. దీని ఫలితంగా ప్రజాజీవితంలో ఉద్యోగిబృందం పాత్ర విపరీతమైన స్థాయిలో పెరిగింది. అయితే ఈ పరిణామాలకు అనుగుణంగా దేశంలోని ఉద్యోగి సామ్యవ్యవస్థలో తగిన మార్పులు సంభవించలేదు.

## 13.6 భారతదేశంలో ప్రగతి పాలన - లబ్ధిదారుల సంబంధాలు

BRAOU

భారతదేశంలో లబ్ధిదారుడు-పాలన మధ్య సత్సంబంధాలు లేవని, వారిమధ్య తీవ్రమైన అగాధం ఉందని ఈ రంగంలో నిర్వహించిన కొన్ని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ప్రజలలో ప్రభుత్వ పాలన పట్ల, ఉద్యోగుల పట్ల విశ్వాసం, సదాభిప్రాయం లేదని కూడా ఈ పరిశోధనలు పేర్కొంటున్నాయి. దీని ఫలితంగా పౌర పాలనలోని పౌరులు అనే అంశం మరుగున పడిందని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ పరిశోధన ప్రకారం ప్రభుత్వ పాలనా యంత్రాంగం పట్ల లబ్ధిదారుల వైఖరి ఈ క్రింది విధంగా ఉందని వెల్లడైంది.

1. లబ్ధిదారులు-ప్రభుత్వోద్యోగులను నేరుగా కలుసుకొనటం వారు తమ పనులను మధ్య దళారీలు లేదా ఏజంట్ల ద్వారా పూర్తి చేసుకునేందుకు ఇష్టపడుతున్నారు.
2. సాధారణ పౌరుల ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించటం ఒక అనవసర చర్యగా భావిస్తున్నారు. ఎందుచేతనంటే దానివల్ల కాలం వృధా అవటమే తప్ప సాధించేది అతి తక్కువ అని వారి అభిప్రాయం.
3. లబ్ధిదారులు ప్రభుత్వ ఉద్యోగులతో సహకరించటానికి వారి పనిని సులభతరం చేయటానికి వెనుకాడుతున్నారు.

ప్రభుత్వపాలన దాని పద్ధతులలో ప్రవేశ పెట్టిన ప్రవర్తన, నిర్మాణ పరమైన మార్పులు, ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో ప్రజల సేవ అనే అంశాన్ని తగ్గించాయి. దాంతో పాటు అనేక కారణాల వల్ల లబ్ధిదారులు-పాలన మధ్య సంబంధాలు క్షీణించి వారి మధ్య అంతరాన్ని పెంపొందించాయి. వీటిలో భాష ఒక ప్రధాన కారణం. చాలమంది ప్రభుత్వోద్యోగులనుంచి లబ్ధిదారులకు తగిన రీతిలో ప్రోత్సాహం లభించడంలేదు. దీని వల్ల ప్రజలు ఉద్యోగుల మధ్య

సమాచార ప్రసారం లోపించి వారి మధ్య సత్సంబంధాలు, సాన్నిహిత్యం ఏర్పడలేదు. ప్రభుత్వం తన కార్యకలాపాల నిర్వహణలో గుప్తత (Contridentality) కు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ప్రస్తుతం ఈ రహస్యం అనే కారణం చెప్పి ఎంతో సమాచారాన్ని ప్రజలకు చేరకుండా నిరోధిస్తున్నారు.

భారతదేశంలో ప్రగతి పాలన-లబ్ధిదారులు మధ్య దూరం కొనసాగటానికి, ప్రభుత్వోద్యోగుల ప్రవర్తన, వైఖరి ప్రధానకారణమని అనేక మంది ఆమోదించారు. ప్రభుత్వ ఉద్యోగులలో ప్రజలంటే సద్భావం స్నేహభావం, సానుభూతి పూర్తిగా లోపించాయనేది అందరికీ తెలిసిన వాస్తవం. వారు ప్రజలకు పాలనా ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల పట్ల ఏర్పరుచుకున్న వ్యతిరేఖ వైఖరి వల్ల పరిపాలన పట్ల ప్రజలకు సద్భావం సన్నగిల్లింది. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులలో తాండవిస్తున్న అవినీతి, ఆశ్రిత జనపక్షపాతం, సోమరితనం, క్రమశిక్షణారాహిత్యం వల్ల లబ్ధిదారుల్లో ప్రభుత్వం పట్ల కొంత చులకన భావమేర్పడింది. ఈ వాస్తవాలను ప్రభుత్వం నియమించిన విచారణ సంఘాలు కూడా పేర్కొన్నాయి. చివరకు ప్రణాళికా సంఘం కూడా ఈ వాస్తవాన్ని అంగీకరించింది.

లబ్ధిదారులు - ప్రభుత్వ పాలన మధ్య సంబంధాలను పాలన జవాబుదారీతనం, పాలనపై ప్రజల నియంత్రణం అనే కోణం నుంచి విశ్లేషించాల్సి ఉంది. ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రెండు భావనలు తమ విశ్వసనీయతను, ప్రాధాన్యతను కోల్పోయి. ప్రభుత్వపాలనలో ప్రవేశ పెట్టిన అత్యాధునిక పద్ధతులు సమాజంలోని కొన్ని వర్గాలకే తప్ప సాధారణ ప్రజలకు ఉపయోగ పడటం లేదు. ప్రజలకు ప్రభుత్వ కార్యకలాపాలు, విధానాలు, చట్టాలు, నియమనిబంధనల పట్ల సరైన సమాచారాన్ని అందించక పోవడం పట్ల వాటి గురించి అవగాహన లోపించింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఉన్నతాధికారుల పట్ల విధేయతను కనపర్చినా సాధారణ ప్రజలపై ఆధిక్యతను ప్రదర్శిస్తున్నారు. అందుచేత ప్రజలు తమ కార్యకలాపాల నిర్వహణకు మధ్య దళారుల పైనే అధికంగా ఆధారపడుతున్నారు. ఈ దృగ్గోచరం ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వసనీయతను క్షీణింప చేయటమే కాక పాలనావ్యవస్థలో అసమతాల్యతను సృష్టించింది.

BRAOU

లబ్ధిదారుల - పాలన మధ్య అంతరం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇబ్బందులు పాలనా యంత్రాంగం సమర్థతపై చూపిన ప్రభావాన్ని ప్రభుత్వం స్పందించక తప్పలేదు. ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో ఏర్పడిన దురభిప్రాయాన్ని వారి సమస్యలను/ఇబ్బందులను పరిష్కరించడం ద్వారా ప్రజలు-పాలన మధ్య ఏర్పడిన అంతరాన్ని రూపుమాపి, వారిమధ్య సత్సంబంధాలను ఏర్పరచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకున్నాయి. 1964 లో కేంద్ర ప్రభుత్వం కేంద్ర విజిలెన్సు కమీషను ఏర్పాటు చేసింది. ఈ కమీషను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పై వచ్చే ఆరోపణలను విచారించతగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుంది. కేంద్ర ప్రభుత్వం చర్యను అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విజిలెన్సు కమీషన్లు ఏర్పరుచుకున్నాయి. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసి, తన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది. ఈ వ్యవస్థకు అప్పగించిన అధికారాలు పరిమితం కావడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన విధంగా సహకరించకపోవడం, తగిన సిబ్బందిని నియమించక పోవటం మొదలగు కారణాల వల్ల, తన విధి నిర్వహణలో విఫలం కావడం జరిగింది.

1966 లో ఏర్పాటు చేసిన పరిపాలనా సంస్కరణల సంఘం, లబ్ధిదారుల - పాలన మధ్య క్షీణించిన సంబంధాలను సరిచేసేందుకు, ప్రజల క్లేశాలను తొలగించేందుకు దేశంలో అంబుడ్స్ మన్ వ్యవస్థను పెట్టడం అవసరం అని భావించింది. దీనికి అనుగుణంగా ఈ సంఘం దేశంలో అంబుడ్స్ మన్ తరహాలో కేంద్ర, రాష్ట్ర

స్థాయిల్లో లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను నెలకొల్పాలని సూచించింది. లోక్‌పాల్ కేంద్రమంత్రులు, కార్యదర్శులు వంటి ఉన్నత ఉద్యోగులపై వచ్చే అభియోగాలను విచారిస్తే, లోకాయుక్త రాష్ట్రస్థాయిలో అదే పాత్రను నిర్వహించి తగు చర్యలను చేపట్టాలని సంఘం సూచించింది. ఈ సంఘం సూచన మేరకు కేంద్రం మొదటిసారిగా 1968లో లోక్ పాల్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. తర్వాత మరో మూడు సందర్భాలలో కూడా (1971, 1977, 1985) కూడా ఈ అంశం పై బిల్లులు ప్రవేశపెట్టటం జరిగింది కాని ఈ నాటి వరకు శాసనం చేయలేక పోవటం వల్ల లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పడ లేదు.

లోకాయుక్త విషయంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు లోకాయుక్త వ్యవస్థను ఏర్పరుచుకున్నాయి. 1971 లో మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త, ఉపలోకాయుక్తలను నియమించి దేశంలో రాష్ట్రస్థాయిలో ఈ వ్యవస్థకు కారం చుట్టింది. తరువాత బీహారు, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటు చేయబడింది.

ఈ విధంగా భారతదేశంలో పాలనతో తమ ప్రతిస్పందనతో ప్రజలు ఎదుర్కొనే నిర్దిష్టమైన చర్యలను చేపట్టారు. అయితే ఈ చర్యల వల్ల ప్రజలు, పాలనాయంత్రాంగ సంబంధాలు పూర్తిగా మెరుగు పడటం సంభవించలేదు. లబ్ధిదారుల దృష్టిలో పాలనాయంత్రాంగం అసమర్థ, అవినీతిమయం అనే అభిప్రాయం చాలామంది లబ్ధిదారుల్లో ఉంది.

## 13.7 సారాంశం

ఆధునికకాలంలో పాలన-లబ్ధిదారుల సంబంధాలు పెరుగుతున్న ప్రాధాన్యత వల్ల ఈ అంశం అధ్యయన రంగంలో ఒక ప్రధాన పరిశోధనాంశం అవుతుంది. ఈ అంశంపై పలువురు పాలనా రచయితలు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం దృష్టిలో ప్రగతి పాలన - లబ్ధిదారుల సంబంధాలను మెరుగుపరచవలసిన అవసరం గుర్తించాలి. ఎందువల్ల అంటే, ప్రభుత్వ మనుగడ ప్రధానంగా ప్రజల్లో పాలన యడకల విశ్వసనీయతం పైనే ఆధారపడి ఉంది. అయితే ప్రజలు-పాలన మధ్య గల సంబంధాలు మెరుగు పరచటం ఒక క్లిష్ట సమస్యగా రూపొందింది. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో లబ్ధిదారులు-పాలన మధ్య సంబంధాలలో ఉపశమనం కంటె ఆందోళన కలిగించే అంశాలే అధికంగా ఉన్నాయి. దీనికి ఒక ప్రధాన కారణం ప్రభుత్వోద్యోగ బృందం. దానికి తోడు ప్రభుత్వం అనుసరించే పద్ధతులు, విధానాల పాత్రకూడా తక్కువేం కాదు. లబ్ధిదారుల - పాలన మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు ప్రజల ఇబ్బందుల/సమస్యల/ఫిర్యాదుల నివారణకు అంబుడ్స్‌మన్, విజిలెన్సు కమీషనరు వంటి సంస్థాగత ఏర్పాట్లు పలుదేశాలలో ఉన్నప్పటికీ, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనావ్యవస్థ- లబ్ధిదారుల మధ్య సంబంధాలలో ఆశించినంతగా మెరుగుపడలేదనేది వాస్తవం. ఈ పరిస్థితి పాలనా యంత్రాంగం పైనే పూర్తి బాధ్యత మోపటం సరిగాదు. ప్రజలలో సరైన పరిజ్ఞానం, చైతన్యం, వాటితో పాటు పాలనావ్యవస్థతో సహకరించాలనే దృక్పథం లోపించటం కారణంగా ప్రజలు కూడా ఈ పరిస్థితికి దోహదం చేసారని భావించక తప్పదు.

ఏమైనప్పటికీ, లబ్ధిదారులు-ప్రగతి పాలన మధ్య ప్రస్తుత సంబంధాలను పూర్తిగా సంస్కరించవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం లబ్ధిదారులు పాలన యంత్రాంగం సంబంధాలలో నెలకొన్న పరస్పర అవిశ్వాసాన్ని, అవగాహనలో లోపాన్ని, వ్యతిరేకతను తొలగించి వాటి స్థానంలో విశ్వసనీయత, సహకార ధోరణి నెలకొల్పాలి. దీనికి ఇరు వర్గాలు వారివారి దృక్పథాలలో మౌలిక మార్పులు రావటం అవసరం.

## 13.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. భారతదేశంలో లబ్ధిదారులు - ప్రగతి పాలన మధ్యగల సంబంధాలపై విమర్శనాత్మక వ్యాసం వ్రాయుము.
2. విభిన్న దేశాలలో పాలన - లబ్ధిదారుల మధ్య సంబంధాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించండి.
3. ప్రగతి పాలన-లబ్ధిదారుల సంబంధాల ప్రాధాన్యతను చర్చించండి.

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. ప్రగతి పాలనలో ప్రజల భాగస్వామ్యం ప్రాధాన్యతను వివరించండి.
2. భారతదేశంలో అంబుడ్స్ మన్ వ్యవస్థ పనితీరును వివరించండి.
3. ప్రగతి పాలన-లబ్ధిదారుల సంబంధాలపై కల సైద్ధాంతిక ఊహనలను పరిశీలించండి.

BRAOU

## 13.9 చదువదగిన రచనలు


1. Mohit Bhattacharya : Public Administration, The World Press, Calcutta, 1978.

2. S.N. Sadasivan (ed) : Citizen and Administration, I.I.P.A., New Delhi, 1984.

3. A.R. Chaturvedi and S.K. Mitra : Citizen Participation in Rural Development, Oxford and IBH, New Delhi, 1982.

4. Nita Singhvi : Administration and Citizen, Somaiya Pubs, Bombay, 1977

5. Elilu Katz and Brevada Danct : Bureaucracy and the Public, Basic Books Newyork, 1973.


**రచయిత : బి.పి.సి. బోస్**

# భాగం - 14: పాలన సంస్కృతి

## విషయక్రమం


14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 సంస్కృతి, పాలనల మధ్య సంబంధం

14.3 భారతదేశ పాలనపై సాంప్రదాయ విలువల ప్రభావం

14.4 భారతదేశ పాలనపై వలస పాలన విలువల ప్రభావం

14.5 భారతదేశ పాలనపై ప్రజాస్వామ్య విలువల ప్రభావం

14.6 భిన్న విలువల సంఘర్షణ - పాలనపై ప్రభావం

14.7 సారాంశం

14.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

14.9 చదువ దగిన రచనలు


BRAOU

## 14.0 లక్ష్యాలు

**ఈ భాగం చదివిన తరువాత మీరు :**

* సంస్కృతి, పాలనల మధ్య సంబంధాన్ని వివరించగలుగుతారు
* భారత దేశ పాలనపై సంప్రదాయ విలువల, వలస పాలన విలువల, ప్రజాస్వామ్య పాలన విలువల ప్రభావాన్ని విశ్లేషించగలుగుతారు.
* భారతదేశపాలనపై భిన్న విలవల సంఘర్షణ ప్రభావాన్ని వివరించగలుగుతారు.

## 14.1 పరిచయం

భారతీయ సమాజం సంక్లిష్ట సమాజం. సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు ప్రతిరూపం. దీనికి అనేక చారిత్రక కారణాలున్నాయి. చారిత్రకంగా, ప్రధానంగా సాంస్కృతిక ఏకత్వం పై ఆధారపడి భారతదేశం ఒక దేశంగా రూపొందింది. రాజకీయంగా బ్రిటీషు వలస పాలన భారతదేశ భౌగోళిక ఏకత్వానికి తోడ్పడింది. దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధి స్థాయిలో అంతరాలున్నాయి. బాషలలో భావాలలో, జీవన పద్ధతులలో భిన్నత్వం స్పష్టంగా కన్పడుతుంది. వీటన్నిటి ప్రభావం పాలనపై ఉంది. ఈ భాగంలో ప్రధానంగా పాలనపై సంప్రదాయ విలువల వలస పాలన విలువల ప్రభావాన్ని వివరించడం జరిగింది. భారతదేశంలో 1947 తరువాత ప్రజాస్వామ్య రాజ్యాంగ

వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. అందువల్ల పాలనపై ప్రజాస్వామ్య విలువల ప్రభావం పడింది. ఈ విధంగా భారతదేశ పాలనపై సంప్రదాయ విలువల, వలసపాలన విలువల, ప్రజాస్వామ్య విలువల ప్రభావం ఉంది. ఉండడమేగాక ఈ విభిన్న విలువల మధ్యగల సంఘర్షణ ప్రభావం పాలనపై ఉన్నట్లు స్పష్టంగా గమనించవచ్చు. భిన్న విలువల సంఘర్షణ స్వాభావాన్ని అర్థం చేసుకోడానికి కూడా భారత పాలన మంచి ఉదహరణగా పనికొస్తుంది. ఈ భాగంలో వివరించే విషయాలు ముఖ్యంగా ప్రభుత్వ పాలనకు పరిమితం చేయబడ్డాయి. ముఖ్యంగా అభివృద్ధి పాలనా ప్రభావంపై, పనితీరు పై సంస్కృతి ప్రభావాన్ని వివరించడానికి ఈ భాగంలో ప్రయత్నం చేశాం.

## 14.2 సంస్కృతి, పాలనల మధ్య సంబంధం

సంస్కృతిని స్థూలంగా జీవన విధానంగా నిర్వహించవచ్చు. మన ఆలోచనలు, విలువలు, సంపదను సృష్టించుకొనే పద్ధతులు, సమిష్టి జీవన నిర్మాణాలు అన్ని సంస్కృతిలో భాగం. వీటన్నిటి ప్రభావం ఆ సమాజంలోని పాలన వ్యవస్థలపై ఉంటుందనే విషయాన్ని గుర్తించవలెను. పాలన అమూర్త పదార్థంగాదు ( It is not an abstract phenomena) ఆధునిక కాలంలోని పాలన వ్యవస్థలకు, పురాతన పాలన వ్యవస్థలకు తేడాలుండటానికి, ఆ కాలంలో, ఆ దేశాల మధ్య సంస్కృతులలోని తేడాలు ఒక కారణం. అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను గౌరవంగా చూడడానికి ఆ సమాజంలోని ప్రజాస్వామ్య విలువల సంస్కృతి కారణం. భారతదేశం లోని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను, ముఖ్యంగా సామాన్య ప్రజలను తక్కువగా చూసే స్వభావం మన సమాజంలోని ఆధిపత్య లేక క్రమానుగత శ్రేణి విలువల ప్రభావం కారణం. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. వివిధదేశాలలోని పాలన స్వభావాలలోని తేడాలను ఆ దేశాల సంస్కృతిని ఆధారంగా వివరించవచ్చు. ఫ్రెడ్ డబ్ల్యూ. రిగ్స్ లాంటి పాలనా తత్వవేత్తలు పాలనపై పరిసరాల ప్రభావం ఆధారంగా అభివృద్ధి చెందుతున్న దేశాల పాలనల స్వభావాన్ని వివరించడానికి ప్రయత్నం చేశారు.

ఫెలిక్స్ నీగావు అనే అమెరికా పాలనా శాస్త్రజ్ఞుడు సంస్కృతి, పాలన అనే వ్యాసంలో పాశ్చాత్యదేశాలలో, పాచ్యదేశాలలో స్నేహానికుండే స్వభావంలో తేడాలను వివరించి పాలన పై దాని ప్రభావం ఏవిధంగా ఉంటుందో వివరించాడు. పాశ్యాత్య దేశాలలో స్నేహం అంటే విలువలను పంచుకోవడం అని దాని వలన పాలనపై ప్రతికూల ( negative ) ప్రభావం ఉండదని నీగావు భావించాడు. పాశ్చాత్య దేశాలలో స్నేహం ఒకరికొకరు సహాయం చేసుకోవడం అనే సూత్రం ఆధారంగా ఉంటుందని, అధికారంలో ఉన్నవారు తమ .అధికారాన్ని స్నేహితుల కోసం ఉపయోగించడానికి సామాజిక మద్దతు దీని వలన లభిస్తుందని నీగావు భావించినా, నీగావు అభిప్రాయంతో మనం పూర్తిగా ఏకీభవించక పోయినా, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పాలనను అర్థం చేసుకోకపోవడానికి సాంస్కృతిక విలువలశ్లేషణ ఎంతగానో తోడ్పడుతుందనే విషయాన్ని మట్టుకుఅంగీకరించాలి. సంస్కృతి పాలనల మధ్య సంబంధ విశ్లేషణ పాలన చర్యల కార్య కారణ సంబంధాన్ని విస్తృత నైపధ్యంలో అర్ధం చేసుకోడానికి వీలవుతుంది.

భారత దేశంలో సామాజిక నిర్మాణంలో సిద్ధాంతం భావజాలం ( ideology ) ప్రధానమైన పాత్ర నిర్వహించిందని డి.డి. కోశాంబి భావించెను. మన సంప్రదాయ విలువల ప్రభావం సమాజంలో అన్నిరంగాలపై నా ఉంది. ప్రభుత్వ పాలన వ్యవస్థలపైన కూడా మన భావజాల ప్రభావం ఉంది. వి. సుబ్రమణ్యం మన పాలనపై గల హిందూ భావజాల ప్రభావాన్ని వివరించెను. ప్రభుత్వ అధికారులు తమ చర్యల విషయంలో సుబ్రమణ్యం ప్రక్రియకిచ్చిన ప్రాధాన్యత

BRAOU

ఫలితాన్ని వ్యక్తపోవడానికి మన కర్మ సిద్ధాంత ప్రభావం కూడా కొంత వరకు కారణమని భావించెను. గున్నార్ మిర్దాల్ భారతదేశంలోని వ్యవస్థలపై సంస్కృత ప్రభావం చాలా ఎక్కువగా ఉందని భావించెను. కారల్ మార్క్స్ సంస్కృతిని ప్రధానంగా భౌతిక స్థితిగతులపై ఆధారపడి రూపొందే అంశంగా భావించినప్పటికి, భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో సంస్కృతికి తాత్కాలికమైన పరిమిత మయిన స్వతంత్రతా శక్తి కూడా ఉంటుందని చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. పాలన, సంస్కృతుల మధ్య సంబంధం ఒక ప్రత్యేక విశ్లేషనీయ అంశంగా సామాజిక పాలనా శాస్త్రంలో ( Sociology of administration) లో విద్యా విషయక కృషి జరుగుతుంది.

## 14.3 భారతదేశ పాలనపై సాంప్రదాయ విలువల ప్రభావం

భారతదేశ పాలన స్వభావాన్ని గురించి పరిశీలన జరిపిన అనేక మంది శాస్త్రజ్ఞులు, పాలన స్వభావ ముఖ్య లక్షణాలను కొన్నింటిని గుర్తించారు. వ్యక్తి ఆధారంగా నిర్ణయాలు చేయడం, అందరికి సమానంగా నియమనిబంధనలు వర్తించకపోవడం, అధికారాన్ని పూజించడం, సంబంధాలలో ఆధిక్యతాభావాన్ని ప్రదర్శించడం, సమర్థత, నిబద్ధత లేకపోవడం, విలువల రాహిత్యం భారతదేశ పాలన స్వభావంలోని కొన్ని గుణాత్మక అంశాలుగా ఈ పరిశోధకులు పేర్కొన్నారు. వీటిలో కొన్నింటికి కారణాలను మన సంప్రదాయ విలువలో ఉన్నాయని కొందరి భావన. ప్రభుత్వ అధికారులు అందరిని సమానంగా చూడకపోవడానికి మన అంతస్థుల సామాజిక నిర్మాణ విలువలు ప్రభావం కొంత వరకు కారణం. మన కుటుంబ ఆధార సామాజిక విలువలు కూడా పాలనలో అవినీతికి కొంతవరకు కారణం. పాలలోని ఆధిక్యతా భావం సమాజంలో అసమానతను న్యాయ బద్ధీకరించే విలువలు కారణం. రాజరిక వ్యవస్థ విలువలు వ్యక్తి ప్రాధాన్యతకు, అధికారం యడల పూజ్యభావానికి ఆధారాలు. ఈ విధంగా భారతదేశ పాలన ప్రవర్తనను విమర్శ నాత్మకంగా పరిశీలించినట్లయిన, దాని అనేక ఆధారాలు మన సంప్రదాయ చారిత్రక నైపధ్యంలో కన్పడతాయి. డి.డి. కొశాంచి లాంటి వారు చేసిన పరిశోధనలు యిందుకు ఎంతో తోడ్పడుతాయి. సంప్రదాయ విలువల ప్రభావాన్ని గురించి పరిశీలించేటప్పుడు, మన విలువలను గురించి గ్రంథాలలో పేర్కొన్న దానికంటే సంప్రదాయ సమాజాల జీవన విధాన ఆచరణను గీటు రాయిగా తీసుకోవాలని సుబ్రమణ్యం అనే పాలన శాస్త్రవేత్త భావించెను. అహం (Ego) యడల మనకున్న ప్రేమ కూడా పాలనాధికారుల అహంభావ ప్రవర్తనకు కారణమని కె. సుబ్రమణ్యం భావించెను. నిత్య జీవితంలో మన ప్రభుత్వ అధికారుల, ప్రవర్తనను పరిశీలించిన, వారి చర్యలపై మన విలువల ప్రభావం స్పష్టంగా కన్పడుతుంది.

BRAOU

## 14.4 భారతదేశ పాలనపై వలస పాలన విలువల ప్రభావం

దాదాపు రెండు వందల సంవత్సరాలు భారతదేశం బ్రిటీషు వారి పరోక్ష, ప్రత్యక్ష పాలన క్రింద ఉంది. ఆకాలంలోని నేటి భారతదేశంలోని అనేక పాలన వ్యవస్థలకు బీజాలు వేయబడ్డాయి, రూపకల్పించబడింది. చట్టబద్ధమైన పాలనా వ్యవస్థ నిర్మాణం ప్రధానంగా బ్రిటీష్‌వారి కాలంలోనే జరిగింది. అయితే బ్రిటీష్‌వారు నిర్మించిన పాలనా వ్యవస్థ ప్రధానంగా బ్రిటీష్ వలస పాలన ప్రయోజనాలు రక్షించాడానికి ఏర్పాటు చేయబడ్డది. బ్రిటీష్‌పాలనకు న్యాయబద్ధతను కల్పించే కృషిలో భాగంగా చట్టం ఆధారంగా, నియమనిభంధన ప్రకారం పనిచేసే పాలనా యంత్రాంగం రూపొందించబడింది. అయితే ఈ చట్టాలు, నియమనిబంధనలు బ్రిటీష్‌వారి ప్రయోజనాలకు అనుగుణంగానే రూపొందించుకున్నారు.

బ్రిటీషు వలసపాలనలో పాలన ప్రధాన లక్ష్యం పాలకుల ప్రయోజనాలు కాపాడటంగా ఉండేది. దాని ప్రభావం వల్ల నేటికి కూడా ప్రభుత్వ పాల ప్రధాన లక్ష్యం ప్రజల ప్రయోజనంకాకుండా, పాలకుల సేవే అనే భావం చాలామంది అధికారులలో ఉంది. దీనిని కొంతవరకు వలసపాలన విలువల అవశేషంగా గుర్తించవచ్చు. బ్రిటీషు వారు విదేశీ పాలనపై ఆధిపత్యానికి, జవాబు దారితనం కోసం చట్ట బద్ధ పాలన అనే నియమాన్ని ప్రవేశపెట్టారు. నాటి పరిస్థితులలో ఇది ఎంతో అభివృద్ధి కర చర్య అయినప్పటికి, ఆచరణలో చట్టబద్ధత లక్ష్య సాధలకు తోడ్పడే న్యాయ బద్ధమైన సాధనంగా కాకుండా ప్రభుత్వ పాలన అంతా లక్ష్యంగా రూపొందింది. అందుకే ప్రభుత్వ పాలనలో నియమనిబంధనల ఆచరణ కున్న ప్రాధాన్యతను, లక్ష్య సాధనకు లేదు. వలసపాలనలో ప్రభుత్వ పాలన ప్రజలను నియంత్రణ చేసే సాధనంగా ఉండేది. ప్రజలకు దూరంగా ఉండేది. ప్రభుత్వం ఏమి చేస్తుంది, ఎట్లా చేస్తుంది అనే విషయాలను కూడా రహస్యంగా ఉంచేవారు. ఈ పద్ధతులన్నీ బ్రిటీషు వారి ప్రయోజనాలను కాపాడటం కోసం ఉద్దేశించినట్టివి. ఈ వలస పాలన విలువల ప్రభావం నేటి పాలన విలువలపై ఉంది. పై వారికి మాత్రమే జవాబు దారి వహించే స్వభావం, ప్రజలకు దూరంగా ఉండటం, తమ అధికృతను చాటుకోవడం కోసం అధిక దర్పాన్ని ప్రదర్శించడం, ప్రభుత్వ నిర్ణయాలను రహస్యంగా చేయడం, ప్రజలకు తెలియజేయకపోవడం, లాంటి నేటి మన పాలన లక్షణాలు మనకు వలసపాలన వారసత్వమని జి. రాంరెడ్డి లాంటి పాలనాశాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. వలస పాలకుల ఆధిపత్యం భావాలను ప్రభానం నేటి పాలకులను యింకా వదిలి పెట్టలేదు. ప్రభుత్వ పాలనలో జర్నలిస్టుల ప్రభావం కూడా వలస పాలన వారసత్వమే. ముఖ్యంగా వలసపాలకులు మనకంటే తెలివిగల వారనే భావం మనలో వున్నంత వరకు మనకు తెలియకుండానే వారి భావాల ప్రభావం మన పైన ఉంటుంది. వలస పాలన వలన మన పాలనపై కొన్ని ప్రయోజనకర ప్రభావాలు లేకపోలేదు. చట్ట బద్ధమైన పాలనా వ్యవస్థ, క్రమబద్ధమైన పాలనా నిర్మాణాలు వలసపాలన కాలంలో రూపొందాయి. ఇక్కడ మనం ముఖ్యంగా గుర్తించాల్సింది వలస పాలన సంస్కృతి ప్రభావం భారతదేశపాలనపై ఉందనే విషయాన్ని మాత్రమే. పాలనపై వలస పాలన ప్రభావాన్ని మంచిచెడ్డలను అంచనా వేయడం ఈ చర్య ఉద్దేశంకాదు.

## 14.5 భారతదేశ పాలనపై ప్రజాస్వామ్య విలువల ప్రభావం

స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. భారతరాజ్యాంగం ప్రవేశికలో భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా వర్ణించారు. ప్రజాస్వామ్య విలువల ప్రభావం కూడా భారతదేశ పాలనపై ఉంది. ప్రజాస్వామ్య దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల నిర్మాణం ప్రజాస్వామ్య విలువల ఆధారంగా ఉండాలి. ప్రభుత్వ పాలన పై అధికారం ప్రజలకు ఉంటుంది. పాలన ప్రజలకు జవాబు దారిగా ఉండాలి. పాలనా అధికారుల చర్యలకు ప్రజల ప్రయోజనాలు ఆధారాలు ఉండాలి. ప్రభుత్వ పాలన చర్యలన్నీ చట్టబద్ధంగా నియమబద్ధంగా ఉండాలి. చట్టం ముందు ప్రజలందరూ సమానమనే సూత్రం ఆధారంగా ప్రభుత్వ పాలన ఉండాలి. ఈ విలువల ఆధారంగా భారతదేశ పాలన నిర్మాణం జరిగింది. ఆధారంగా ఆచరణలో కూడా ఈ విలువల ప్రభావం కొంత వరకు మాత్రమే ఉంది. అభివృద్ధి పాలనలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యత నిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య విలువల ప్రభావ ఫలితమే. పాలనపై ప్రజాప్రతినిధుల ఆధిపత్యాన్ని అంగీకరిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య విలువల ప్రభావమే. సామాన్య ప్రజలు కూడా ప్రభుత్వ పాలన చర్యలను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాలన చర్యలను బహిరంగంగా నిర్వహించాలని డిమాండు చేస్తున్నారు. పాలన ఆధిపత్యం చర్యలను నిరశిస్తున్నారు. పాలనపై ప్రజాస్వామ్య విలువల ప్రభావాన్ని తెలియచేస్తున్నాయి.

## 14.6 భిన్న విలువల సంఘర్షణ : పాలన పై ప్రభావం

భారతదేశంలో భిన్నత్వాన్ని గురించి చెబుతూ డి.డి. కొశాంబి, మన దేశం ఒకే కాలంలో అనేక శతాబ్దాల పరిస్థితులలో నివశించే ప్రజలు కలిసి ఉండే సమాజం అని వర్ణించాడు. ఆదిమ సమాజ పరిస్థితులలో నివశించే, ప్రజలు, ఆధునిక సమాజ పరిస్థితులలో నివసించే ప్రజలు, ఒకే చోట మనకు తారసపడతారు. ఈ భిన్నత్వం విలువలలో భిన్నత్వానికి కూడా దారి తీస్తుంది. దీని ప్రభావం పాలనపై ఉంటుంది. అందుకే భారతదేశ పాలన స్వభావాన్ని స్థూలీకరించడం చాలా కష్టమైన పని. భారతదేశ పాలనకు కొన్ని మాక్స్ వెబర్ పేర్కొన్న ఉద్యోగి స్వామ్య లక్షణాలున్నాయి. మరికొన్ని కౌటిల్యుడు పేర్కొన్న పాలనాధికారుల లక్షణాలున్నాయి. ప్రజాస్వామ్య విలువల ప్రభావంలో పనిచేసే అనేక మంది ఉద్యోగులున్నారు. ఆధిక్యతాభావాన్ని ప్రదర్శించే ఉద్యోగులు కూడా ఎందరో ఉన్నారు. పూర్తి స్వార్థ దృష్టితో పని చేసే ఉద్యోగులు కొందరు. ప్రజలకు సేవచేయాలని ఆశించే ఉద్యోగులు కొందరు ఉన్నారు. ఇవన్ని వ్యక్తిగతమైన తేడాలే కాకుండా, సమాజంలోని భిన్నత్వ పరిస్థితులకు నిదర్శనంగా కూడా భావించవలెను. సంప్రదాయ విలువలు, వలస పాలన విలువలు, ప్రజాస్వామ్య విలువలు ప్రభావితం చేయడం వలన భారతదేశ పాలన ఒక ప్రత్యేక స్వభావాన్ని సంతరించుకొంది. ఈ ప్రత్యేక స్వభావంలో విరుద్ధాంశాలు కలగలుపుగా ఉంటాయి. దీని వలన ప్రభుత్వ ఉద్యోగులలో మాక్స్ వెబర్ చెప్పిన ఆదర్శ ఉద్యోగి స్వామ్య నమూనాకు చెందిన నియమ నిబంధనల ప్రకారం పనిచేసే ఉద్యోగులు కొందరు, ప్రజాసంక్షేమం కోసం పనిచేసే నిబద్ధత కలిగిన ఉద్యోగులు కొందరు. వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆశించి పనిచేసే ఉద్యోగులు కొందరు. పూర్తి నీతి మాలిన చర్యలు చేయడానికి కూడా సంకోచించని ఉద్యోగులు కొందరు ఉన్నట్లుగా పాలనా శాస్త్ర పరిశోధకులు పేర్కొన్నారు. మన సంస్కృతిలో ఉన్న సంక్లిష్టత (Pluralism) మన పాలనలో కూడా ప్రతిబింబిస్తుంది.

BRAOU

## 14.7 సారాంశం

అభివృద్ధి పాలన స్వభావాన్ని అర్థం చేసుకోడానికి, పాలనపై సంస్కృతి ప్రభావాన్ని అర్థం చేసుకోవడం తప్పనిసరి. సామాజిక వ్యవస్థల స్వభావం చాలావరకు పాలనా వ్యవస్థల స్వభావాన్ని నిర్ణయిస్తుంది. భారతదేశంలో ప్రభుత్వ పాలన అభివృద్ధిని సాధించడంలో అనేక పరిమితులున్నాయి. ప్రధానంగా మన విలువలు, జీవన విధానం అభివృద్ధిని సాధించడానికి ఆటంకంగా ఉన్నట్లు అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రభుత్వ పాలన పరిమితులను అర్థంచేసుకోవాలంటే ప్రజల సంస్కృతి స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. భారతదేశంలోని విలువల స్వభావ నైపథ్యంలో భారతదేశ పాలనలోని విరుద్ధాంశాలను, వ్యతిరేకాంశాలను అర్థంచేసుకోడానికి ఈ భాగంలో ప్రయత్నం చేశాం. ఈ చర్చలోని స్థూలాంశాలు ఇతర దేశాలకు కూడా వర్తిస్తాయి. ప్రభుత్వ పాలనా శాస్త్రంలో సామాజిక పాలనాశాస్త్రం (Sociology of Administration) ఒక ప్రాధాన్యత కలిగిన అధ్యయన విషయంగా గుర్తిస్తున్నారు. అభివృద్ధి పాలన అధ్యయన విషయంలో కూడా సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ భాగంలో భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకొని పాలనపై సంస్కృతి ప్రభావాన్ని చర్చించాము. మీ అనుభవంలోని ప్రభుత్వ ఉద్యోగుల చర్యలను సాంస్కృతిక వ్యవస్థల ఆధారంతో విశ్లేషణ చేయడానికి ప్రయత్నం చేసిన ఈ భాగంలో చర్చించిన విషయాలను అవగతం చేసుకోవడం సులభమవుతుంది.

## 14.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. భారతదేశపాలనపై సమాజంలోని విభిన్న విలువల సంఘర్షణ ప్రభావాన్ని వివరించండి.
2. భారతదేశ పాలనపై వలస పాలన విలువల ప్రభావాన్ని వివరించండి.
3. భారతదేశ పాలనపై ప్రజాస్వామ్య విలువల ప్రభావాన్నివివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు సుమారు **15** పంక్తులలో సమాధానాలు రాయండి

1. సంస్కృతి, పాలనల మధ్య సంబంధాన్ని వివరించండి .
2. భారతదేశ పాలనపై సంప్రదాయ విలువల ప్రభావాన్ని వివరించండి.
3. భారతదేశ అభివృద్ధి పాలన స్వభావంపై వలస పాలన ప్రభావాన్ని వివరించండి.

## 14.9 చదువదగిన రచనలు


1. Almoud, G.A. and S. Verba : The Civic Culture, Princeton, N.J. Princeton University Press, 1963

2. C.P. Bhambhri : Administrators in a changing Society, Delhi National Publishing House, 1972

3. Mohit Bhattacharya : Bureaucracy and Development Administration, New Delhi, Uppal 1979

4. Indian Institute of Public Administration : Special Issues on "Contemporary Administrative Culture of India", The Indian Journal of Public Administrations, July-Sept.1990


రచయిత వి. ఎస్. ప్రసాద్

BRAOU

# భాగం - 15: రాజకీయ అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల సంబంధాలు

## విషయక్రమం


15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాలపై సిద్ధాంతపర భావనలు

15.2.1 రాజకీయ అధికారులకు - ప్రభుత్వోద్యోగులకు మధ్య ఉన్న సంబంధంపై వివిధ దేశాల దృక్పథాలు:

15.2.2 బ్రిటన్

15.2.3 అమెరికా

15.2.4 ఫ్రాన్స్

15.2.5 కమ్యూనిస్టు దేశాలు

15.3 భారతదేశంలో రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాల ఆవిర్భావం

15.3.1 స్వాతంత్ర్యానికి పూర్వం

15.3.2 స్వాతంత్ర్యానంతరం

15.4 వారి మధ్య సంబంధాలపై పరిపాలన సంస్కరణల సంఘం (A.R.C.) అభిప్రాయాలు -సూచనలు

15.5 వారి మధ్య సంబంధాలలో ఆవిర్భవిస్తున్న దృక్పథాలు.

15.6 సారాంశం

15.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

15.8 చదువదగిన రచనలు


BRAOU

## 15.0 లక్ష్యాలు

ఈ భాగం చదివితే క్రింది విషయాలు గ్రహించగలుగుతారు.

* రాజకీయ అధికారులు - ప్రభుత్వోద్యోగుల సంబంధాలపై కల సిద్ధాంత చర్చ
* వివిధ దేశాలలో వారి మధ్య ఉన్న సంబంధాల ఎడ ఉన్న దృక్పథాలు
* భారతదేశంలో వారి సంబంధాల ఆవిర్భావం - వాటి దశలు
* వారి మధ్య సంబంధాలపై పరిపాలనా సంస్కరణల సంఘం సూచనలు
* వారి మధ్య సంబంధాలలో వస్తున్న పోకడలు

## 15.1 పరిచయం

ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ అధికారులు - ప్రభుత్వోద్యోగుల మధ్య సంబంధాల కున్న ప్రాముఖ్యత వలన, వారి సంబంధాలపై అనేక సిద్ధాంత పర భావనలు వెలువడ్డాయి. అయితే ఉద్యోగిస్వామ్య ఆధిక్యత కాని రాజకీయ అధికారుల అధిక్యత కాని ప్రజాస్వామ్య ప్రగతికి తోడ్పడవు.

రాజకీయాలకు - పరిపాలనకు మధ్య ఉన్న సంబంధంపై చర్చ చాలా పురాతనమైనది. పరిపాలనా నిర్మాణాల -ప్రక్రియలపై మేధావుల పరిశోధన మొదలైనప్పటినుంచి ఈ చర్చ జరుగుతూనే ఉంది. రాజకీయ నాయకులకు-ఉద్యోగులకు మధ్య పలు సందర్భాలలో సంబంధ బాంధవ్యాలు ఉంటాయి. ముఖ్యంగా వారు పాలనా ప్రక్రియలో ఎవరి పాత్రలను వారు నిర్వహించినా పరస్పరం ఆధారపడవలసిన అవసరం ఉంది. అయితే వారి మధ్య సంబంధాలలో కాలక్రమేణా అనేక మార్పులు సంభవించి మనం ఆశించిన దానికి భిన్నంగా రూపొందాయి.

సిద్ధాంతపరంగా, పరిపాలనా పరమైన, రాజకీయపరమైన కర్తవ్యాలు భిన్నమైనవి. రాజకీయ యంత్రాంగం లక్ష్యాలను, ప్రాముఖ్యతలను నిర్ధారించటంలో, విధానాలను రూపొందించటంలో అవసరమైన వనరులు కేటాయించటం, ఉద్యోగబృందం పనిచేయటానికి తగిన నిర్దేశిక నియమాలు రూపొందించటంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. రాజకీయ అధికారులు రూపొందించిన నిర్ణయాలను, ప్రణాళికలను అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వోద్యోగులపై ఉంది. సిద్ధాంతపరంగా రాజకీయ ప్రక్రియలో ప్రభుత్వోద్యోగిని తటస్థుడుగా పరిగణించారు. ప్రభుత్వోద్యోగి ప్రభుత్వ పాలనలో నిరంతరతను కొనసాగిస్తూ పాత-నూతన ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తాడు.

ఇటీవలి కాలంలో రాజకీయాధికారులు - ప్రభుత్వోద్యోగుల మధ్య ద్విభాజత్వ సంబంధం ఉన్నదనే సిద్ధాంతం ప్రాముఖ్యతను కోల్పోయింది. వాస్తవంలో విధాన నిర్ణయ ప్రక్రియలో ప్రభుత్వోద్యోగుల పాత్ర పెరిగింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాలలో అధికారులు విధాన రూపకల్పన ప్రక్రియలో చురుకైన పాత్ర వహించడం ద్వారా రాజకీయాలలో పాల్గొనటం పెరిగింది. దీనికి పాలన ప్రక్రియ సంక్లిష్టంగా రూపొందటమే కాక సాంకేతిక స్వభావాన్ని సంతరించుకోవటం ప్రధాన కారణం. రాజకీయనాయకులు సాంకేతిక పరమైన అంశాలను పూర్తిగా ప్రభుత్వోద్యోగుల పరిధికి వదలటం, మరికొన్ని సంక్లిష్టమైన అంశాలలో విధాన నిర్ణయాలను రూపొందించటంలో వారిపై ఆధార పడటం సంభవించింది. విధానాలను అమలు పరిచే అధికారులు తమ విచక్షణను వినియోగిస్తారు. ఈ విధంగా విధాన ప్రక్రియలో ప్రభుత్వోద్యోగులకు కీలకపాత్ర ఏర్పడటంతో రాజకీయ నాయకులు అధికారులను తమకు అనుకూలంగా ఉండాలని కోరుకోవటం ప్రారంభమైంది.

BRAOU

## 15.2 సైద్ధాంతిక భావన

వీరి మధ్యగల సంబంధాల భావనాపరమైన అవగాహనకు 1887లో ఉడ్రోవిల్సన్ రచించిన "THE STUDY OF ADMINISTRATION ", అనే వ్యాసంలోని అంశాలను పరిశీలించాలి. ఈ వ్యాసంలో విల్సన్ రాజకీయాలకు - పరిపాలనకు ఉన్న సంబంధాలలో ద్విభాజత్వం ఉందని పేర్కొన్నాడు. అంటే పరిపాలనను కార్యాపరంగా రాజకీయాలనుంచి వేరు చేయబడి, రాజకీయ వేత్తలు తీసుకునే విధాన నిర్ణయాలను అమలు చేసే సాధనంగా భావించాలని విల్సన్ పేర్కొన్నాడు. విల్సన్ రాజకీయాలను రాజ్యాధికారం, విలువలతో కూడిన విధానపరమైన అంశాలుగా, పరిపాలనను విధాన లక్ష్యాలను సాధించే మార్గంగాను పరిగణించాడు. మౌలికంగా పరిపాలన విధానాలను అమలుపరిచే కార్యక్రమం. ఈ రెండు అంశాల మధ్యగల విశిష్టతను విల్సన్ ఈ క్రింది విధంగా వివరించాడు. "పరిపాలనరంగం ఒక వ్యాపార రంగం వంటిది. అది రాజకీయాల తొందరపాటు, ఉద్రిక్తతలనుంచి వేరుచేయబడింది. అనేక సందర్భాలలో పరిపాలనా ప్రక్రియ రాజకీయాలకు భిన్నంగా ఉంటుంది. పాలన రాజకీయ జీవితంలో ఒక భాగమేకాని అంతర్భాగంకాదు. పాలనా అంశాలు రాజకీయ అంశాలుకావు. అయితే రాజకీయాలు పాలన నిర్వహించవలసిన బాధ్యతలను/విధులను నిర్ణయిస్తాయి.

విల్సన్ రాజకీయాలు - పరిపాలన సంబంధాలపై చేసిన వ్యాఖ్యానం ప్రకారం ఆ రెండు విభిన్న చర్యలు, వ్యవస్థాపరంగా, వృత్తిపరంగా, ఆ రెంటిమధ్య భిన్నత్వం ఉంది. నిర్మాణపరంగా రాజకీయాలు చట్ట సభలలోను రాజకీయ పార్టీలలోను, ఒత్తిడి గణాలలోను ఇమిడి ఉంటాయి. పాలన లాంఛనప్రాయమైన ప్రభుత్వ కార్యక్రమాలను అమలు పర్చే శాఖ. వృత్తిపరంగా చూస్తే రాజకీయాలు రాజకీయనాయకులు నిర్వహించే కార్యకలాపాలు. కాగా పరిపాలన పాలనోద్యోగులు నిర్వహించే చర్యలు. విల్సన్ అభిప్రాయాలను తర్వాత తరానికి చెందిన చాలామంది రచయితలు బలపర్చారు.

1900సం.ములో ఫ్రాంక్ గుడ్‌నౌ రచించిన రాజకీయాలు-పాలన అనే గ్రంథంలో ఈ రెండు భిన్నమైనవి. రాజకీయాలు విధాన నిర్ణయాలను రూపొందించే లేదా రాజ్యం ఇచ్చిన వ్యక్తపరచే చర్యకాగా పాలన వాటిని అమలు పరచే సాధనంగా పేర్కొన్నాడు. ఈ విధంగా గుడ్‌నౌ విశ్లేషణాత్మకంగా నే కాక అవి సంభవించే స్థలం ప్రాతిపదికగా కూడా వాటిని భిన్నమైనవిగా గుర్తించాడు. ఈ విధంగా 1920 దశాబ్ధంలో ప్రభుత్వపాలన శాస్త్రం పై వెలువడిన గ్రంథాలు, వ్యాసాలలో రాజకీయాలు-పాలన వేర్వేరు అంశాలుగా చూపడం జరిగింది. ఈ వైవిధ్యం లక్ష్యాలు, సాధనాల మధ్య వ్యత్యాసంగా చిత్రించారు. అంటే వీటిమధ్య సంబంధం సాంప్రదాయ బద్ధమైన సాధనాలు, లక్ష్యాల మధ్య సంబంధంగా ఊహించబడింది. ఈ దృక్కోణం నుంచి చూస్తే రాజకీయాలు లక్ష్యాల నిర్ధారణకు సంబంధించినవి కాగా పరిపాలన ఈ లక్ష్యాలను సాధించేందుకు ఎంపిక చేసిన విధానాల అమలుకు సంబంధించినది. ఈ విభజనను పని విభజనగా భావించవచ్చును.

1940 దశాబ్ధంలో ప్రభుత్వ పాలనా శాస్త్రం అధ్యయనంలో ప్రవేశించిన మాక్స్ వెబర్ ప్రతిపాదించిన హేతుబద్ధ ఉద్యోగ స్వామ్య నమూనా, అలాగే హెర్బర్ట్‌లు సైమన్ వాస్తవాలు - విలువలు భావన కూడా విల్సన్ ద్విభాజత్వాన్ని బలపర్చాయి.

అయితే 1950దశాబ్దం తరువాత కాలంనాటి పాలనాశాస్త్రవేత్తలు విల్సన్ ద్విభాజత్వాన్ని ఖండించారు.

ఫ్రెడ్‌రిగ్స్ సమతౌల్య-అసమతౌల్య రాజకీయ వ్యవస్థల నమూనాలో రాజకీయాలు -పాలనా సంబంధాలను ఒక నూతన దృక్కోణం నుంచి వివరించాడు. రిగ్స్ సమతౌల్య రాజకీయ వ్యవస్థలో కార్య పరమైన ప్రత్యేకీకరణ అధిక పరిమాణంలో ఉండటంచేత విధి నిర్వహణలో వాటి మధ్య సన్నిహిత సంబంధం ఉంటుందని చెప్పాడు. ఏ విధంగానంటే విధాన నిర్ణయాలను అమలు పరచటంలో ఉద్యోగ బృందం రాజకీయ వ్యవస్థ సహాయాన్ని పొందుతుంది. అలాగే విధాన నిర్ణయాల రూపకల్పనలో రాజకీయ వ్యవస్థ ఉద్యోగ బృంద వ్యవస్థ సహాయం పొందుతుంది. ఈ విధంగా అవి పరస్పరం సహకరించుకుంటాయి. దీనికి భిన్నంగా అసమతౌల్య రాజకీయ వ్యవస్థలో రాజకీయ నాయకులు లేదా రాజకీయ పాలకులు ఉద్యోగస్వామ్య వ్యవస్థపై తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తారు.

ఇటీవల రిగ్స్ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న రాజకీయవ్యవస్థల విశ్లేషణలో రాజకీయాలు-పాలనా ద్విభాజత్వాన్ని ఒక భావనాపరమైన మిధ్యగా (Conceptual Myth) పరిగణించి, దానిని పూర్తిగా తిరస్కరించాడు. ఐసన్‌స్టాడ్ (EISENSTADT) వీరి మధ్య సంబంధాన్ని ఆధునికీకరణలోని వివిధ దశలో ఎలా ఉంటుందో వివరించాడు. సాంప్రదాయ దశలలో ఉద్యోగస్వామ్యం పూర్తిగా రాజకీయ పాలకుని ఆజ్ఞలను లోబడి పనిచేసిందని పేర్కొన్నాడు. అయితే ఆధునీకరణ వివిధ దశలలో వారి మధ్య సంబంధం ఉద్యోగస్వామ్యం -రాజకీయ దృక్పధాల మీద ఆధారపడినదని

పేర్కొన్నాడు. ఆధునీకరణ మొదటి దశలో వారి మధ్య పరస్పర ఘర్షణ అపనమ్మకంతో కూడుకున్నాయని అవి ముఖ్యంగా ఉద్యోగుల పాత్ర, దృక్పథాలు వల్ల మరియు వారి లక్ష్యాలలో సంబంధించిన మార్పులవల్ల ఇలా జరిగిందని పేర్కొన్నాడు. కాగా లూసియన్‌పై ఆధునీకరణవల్ల పరివర్తన మాజాల్లో (TRANSITURIAL SOCETIES) రాజకీయ వేత్తలు ఉద్యోగుల మధ్య సంబంధాన్ని వివరిస్తూ వారి సంబంధం చాలా సున్నితమైందని పేర్కొన్నాడు. వారి పూర్వరంగాలు భిన్నంగా ఉండటమే దీనికి కారణం.

పీటర్ సెల్ఫ్ దృష్టిలో వీరి మధ్య సంబంధాలలో విచిత్రమైన, విశిష్టమైన, ఆసక్తికరమైన అంశాలున్నాయి. తమ ప్రయోజనాల వ్యక్తీకరణ, రాజకీయ జవాబుదారీ హక్కులు, అధికారాలు, విచక్షణలో భిన్నత్వం వారి సంబంధాలలో కీలక అంశాలని పీటర్ సెల్ఫ్ వాదించాడు.

## 15.2.1 ఉదార ప్రజాస్వామ్య దేశాల్లో రాజకీయ అధికారులు-ప్రభుత్వోద్యోగులకు మధ్య సంబంధాలు

ఉదార ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ అధికారుల -ప్రభుత్వోద్యోగుల మధ్య సంబంధాలను పరిశోధకులు ఈ క్రింది విధంగా విశ్లేషించాడు.

అబర్ బ్యాచ్, పుట్‌మన్‌లు పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయవేత్తలు ప్రభుత్వోద్యోగుల సంబంధాలలో నాలుగు దశలు గుర్తించారు.

మొదటి దశలో అంటే 19వ శతాబ్దం చివరలో వారి మధ్య పూర్తి భిన్నత్వం ఉంది. రెండవ దశలో అంటె 20 వ శతాబ్దం మొదటి భాగంలో విధాన నిర్ణయంలో పాలనాధికారికి కొంత పాత్ర కల్పించటం జరిగింది. మూడవ దశలో పాలనాధికారుల రాజకీయ పాత్ర విస్తృతమైంది. ఈ విషయం ప్రముఖంగా 1950 తర్వాత వ్రాసిన గ్రంథాల ద్వారా వెలువడింది. నాల్గవ దశలో ఊహాత్మక ఆదర్శ నమూనా (HYBRID) ఆవిర్భవించటం వల్ల అంటె వారి మధ్య సంబంధాలలో లేదా పాత్రలో విభిన్నత అంతరిస్తుంది. ఫ్రాన్సు, జపాను దేశాలలో నాల్గవ దశలో ఉండే సంబంధాల లక్షణాలు కన్పడతాయి. పూర్వపు పశ్చిమ జర్మనీలో (ప్రస్తుతం రెండు జర్మనీలు ఏకీకరణ చెందాయి) పాలనాధికారులు రాజకీయ పార్టీలలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉంటారు. ఎక్కువ సంఖ్యలో పాలనాధికారులు శాసనసభల సభ్యులుగా ఎన్నికవుతారు.

### వివిధ నమూనాలు:

ప్రభుత్వ పాలనా శాస్త్ర రచయితలు రాజకీయవేత్తలు-పాలనోద్యోగుల సంబంధాన్ని వివరించే మూడ నమూనాలను గుర్తించారు. మొదటిది, వెస్ట్‌మినిష్టర్ నమూనా లేక బ్రిటీష్ పార్లమెంటరీ పద్ధతి. ఈ నమూనా ప్రకారం ఈ రెండు తరగతుల అధికారులు, విధులను లేదా తమ కార్యక్రమాలను తమ హద్దులలో నిర్వర్తిస్తారు. ఈ నమూనా ప్రకారం నిష్పాక్షికత, తటస్థత, ఉద్యోగ బృంద వ్యవస్థ ప్రముఖ లక్షణాలు.

BRAOU

ఉద్దేశించబడినాయి. మన ప్రజాస్వామ్య అవసరాలు వారి మధ్య సంబంధాలలో సమతౌల్యం ఉండాలని వక్కాణిస్తున్నాయి. మనదేశ పాలన కూడా రాజకీయ నాయకులు తీసుకున్న నిర్ణయాలను అమలు పరుచుటలో ఒక సాధనంగా ఉంది.

వాస్తవంలో రాజకీయ వేత్తలు ప్రభుత్వోద్యోగుల సంబంధాలు నెహ్రూ తర్వాత కాలంలో బ్రిటీషు నమూనా నుంచి వైదొలగినట్లు గుర్తించవచ్చును. వారి సంబంధాలలలో సంఘర్షణలు ఉద్రిక్తలు చోటుచేసుకున్నాయి. అయితే కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులు, ఉద్యోగులు అతి సన్నిహితంగా ప్రవర్తించారు. రాజకీయనాయకుల డిమాండ్లను ఉద్యోగులు సంతృప్తి పరుస్తూ తమ లక్ష్యం అయిన ఉన్నత పదవులను పొందారు. ఈ విధంగా రాజకీయ వేత్తలు, ఉద్యోగులు పరస్పరం ఇచ్చి పుచ్చుకొనే ధోరణిని ప్రదర్శించారు.

స్వాతంత్ర్యానంతరం వీరి మధ్య సంబంధాల గురంచి వివరిస్తూ అశోక్ చందా జూనియర్ మంత్రులకు కార్యదర్శులకు మధ్య సత్సంబంధాలు శాశ్వతంగా క్షీణించాయి. దీనికి కారణం జూనియర్ మంత్రులు పరిపాలనలోని మర్మాల అవగాహనకు కార్యదర్శుల సలహాలు పాటించక పోవటమే కారణం. ఎస్.పి. అయ్యర్ కూడా ఈ విధమైన వాదనను చేశాడు.

ఇదే కాలంలో సంబవించిన ముంద్రావ్యవహారం వల్ల మంత్రులు, కార్యదర్శుల సంబంధాలకు చెందిన కొన్ని ప్రధాన సమస్యలు వెలుగులోకి వచ్చాయి. మంత్రుల బాధ్యతపై కొన్ని ప్రశ్నలు చెలరేగాయి. ముంద్రావ్యవహారంపై విచారణ జరిపిన న్యాయమూర్తి చాగ్లా నిస్సంకోచంగా మంత్రి క్రింది అధికారి విధినిర్వహణలో ఏవైన పొరపాట్లు చేసినా దానికి ఆ శాఖమంత్రే బాధ్యత వహించాలని నిర్ద్వంద్వంగా పేర్కొన్నాడు. అయితే చాగ్లా వ్యక్తపరిచిన అభిప్రాయం మీద కొందరు అభ్యంతరం లేవదీశారు. అప్పటి ప్రధాని నెహ్రూ కార్యదర్శులు చేసే నిర్ణాయాలకు మంత్రులు బాధ్యత వహించటం పరిపాలనాపరంగా, నైతికపరంగా సమర్ధనీయంకాదని పేర్కొన్నారు.

BRAOU

## 70వ దశకంలో :

ఈ దశకంలో రాజకీయనాయకులు-ఉద్యోగుల మధ్య సంబంధాలలో ఉద్రిక్తత సంఘర్షణ చోటుచేసుకున్నాయి. ఈ కాలంనాటికి దేశంలో ప్రజాస్వామ్య వేళ్లూను కొనటం వల్ల రాజకీయ సమీకరణ అవసరం ఒత్తిడి పెరిగింది. ఫలితంగా రాజకీయనాయకులు ఎక్కువ డిమాండ్లు చేయటం మొదలైంది. ఈ పరిస్థితిలో పాలనా నిబంధనలను ఆశ్రయించే ప్రభుత్వ అధికారులు ఆరాచకవాదులుగా పరిగణింపబడ్డారు. దీనికి భిన్నంగా రాజకీయ అధికారులను హేతుబద్ధత లేని వారుగా అభిప్రాయ పడటం జరిగింది. భారత రాజకీయ వ్యవస్థలో ఉన్న అచరణాత్మక విశిష్టత వలనకూడా వీరి సంబంధాలలో  అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఫలితంగా వీరి మధ్య సామరస్యరహితమైన భాగస్వామ్యం ఏర్పడింది. వారు భౌతికంగా ఒకే చోట చేసినా వారి మధ్య మానసిక అవగాహన కొరవడింది. వారి సంబంధాలలో  మొదట్లో ఏర్పడిన అసంబద్ధత, పరస్పర ద్వేషభావం తీవ్రమై పరిపాలనా వ్యవస్థలలో సమర్థత ఒక ప్రశ్నార్థకంగా మిగిలింది.

శ్రీ మతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నకాలంలో రాజకీయ నాయకులు ప్రభుత్వోద్యోగుల సంబంధాలు ఒక నూతన దశలో ప్రవేశించాయి. అధికారుల విధి నిర్వహణలో ఒక కొత్త పోకడ ఏర్పడింది. ఆమె ప్రధానిగా ఉన్న మొదటి దశలో అధికారుల ఎడ అనుకూల ధోరణిని ప్రదర్శించింది. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆమె అధికారుల మీద ఎక్కువగా ఆధారపడటం జరిగింది. అయితే తర్వాత దశలో అధికారుల పట్ల ఆమె దృక్పధంలో

తీవ్రమైన మార్పు వచ్చింది. 1970-73 సం.ల మధ్య ఆమె ఉద్యోగస్వామ్య వ్యవస్థలో తీవ్రమైన సంస్కరణలను పెట్టటానికి ఉద్యుక్తురాలైన నిర్మాణవాదిగా గోచరించింది. ఆమె తరుచుగా అధికారులను విమర్శించటం ప్రారంభమైంది. భారత పాలనా వ్యవస్థ కీలక లక్షణాలైన రాజకీయ తటస్థత, నిష్పాక్షికత, నిగూడతలను ప్రశ్నించటం జరిగింది. చివరకు వారిని బద్ధతను గురించి కూడా అనుమానం వ్యక్తం చేసింది. "అనేక సందర్భాలలో ఆమె అధికారులను ప్రభుత్వ లక్ష్యాలకు, విధానాలకు నిబద్ధులై ఉండాలని, భారతదేశానికి నిబద్ధత కలిగిన ఉద్యోగస్వామ్యవ్యవస్థ అవసరం అని నిస్సంకోచంగా ఉద్బోధించింది".

శ్రీమతి ఇందిరాగాంధీ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం కాలంలో అధికారుల పట్ల రాజకీయనాయకుల వైఖరిలో ఏ మార్పు లేదు. జనతా ప్రభుత్వం కూడా కొందరు ఉన్నత ప్రభుత్వ అధికారులను సందేహించటం జరిగిందని ఆనాటి పత్రికలు పేర్కొన్నాయి. 1980లో తిరిగి అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ తన రాజకీయ లక్ష్యాల కోసం ఆమె ఉద్యోగస్వామ్యవ్యవస్థతో సానుకూల సంబంధాలను కొనసాగించినట్లు గుర్తించవచ్చును.

## 1980వ దశకం:

ప్రధానిగా కేంద్రంలో రాజీవ్‌గాంధీ అధికారం చేపట్టిన తరువాత కాలంలో వీరి సంబంధాలలో కొన్ని నాటకీయమైన పరిణామాలు సంభవించాయి. వీరి మధ్య ఉన్న సంబంధాలను కొందరు విశ్లేషకులు ప్రేమ ఏవగింపులు సమ్మేళనంగా అభివర్ణించారు. వీరి దృష్టిలో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వారి మధ్య పరస్పర అవగాహన లోపించింది. రాజీవ్ గాంధీ ప్రధాని అయిన అనంతరం ఒక సందర్భంలో మాట్లాడుతూ ప్రభుత్వోద్యోగులు ఉద్యోగస్వామ్యీకరణకు, రెడ్‌టేప్‌కు ప్రతిరూపంగా మారారని ఆరోపించారు.

BRAOU

1987 సం.లో కాల పరీక్షకు నిలచిన పద్ధతిలో ప్రభుత్వోద్యోగులు రాజకీయనాయకులపట్ల విధేయత కనపర్చాలనే ధోరణి వీరి సంబంధాలను ప్రభావితం చేసింది. దీని ఫలితంగా అనేక సంఘటనలు జరిగినట్లు ఆధారాలు చెప్తున్నాయి. ప్రభుత్వానికి విధేయులైన అధికారులకు అనేక ప్రయోజనాలు చేకూరడం, వ్యతిరేకించిన వారిని శిక్షించటం జరిగినట్లు ఆధారాలు వెల్లడిస్తున్నాయి.

ఈ మధ్యకాలంలో వీరి సంబంధాలలో సంభవించిన మరో ప్రధాన మార్పు ప్రభుత్వం మారిన ప్రతిసందర్భంలో అధికారులను కూడా మార్చటం. ప్రభుత్వం మారినపుడల్లా ఉన్నతాధికారులను మార్చటం ఒక ఆనవాయితీగా మారింది. ఈ విధానాన్ని రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో అనుసరించటం గమనించవచ్చు. క్రమంగా ఈ పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. ఉదాహరణకు 1985సం.ము ఫిబ్రవరిలో 28మంది కార్యదర్శులు మార్చబడుటయే కాక, అదే సం.ము సెప్టెంబరులో మరో 30మంది మార్చబడ్డారు.

క్రిందిస్థాయి రాజకీయ నాయకుల - అధికారుల సంబంధాలు సూక్ష్మ దృష్టితో చూస్తే ఇటువంటి పరిస్థితులే గోచరిస్తాయి. ఒక పరిశోధన ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే రాజకీయ నాయకుల-అధికారుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన జరగలేదని తెలుస్తుంది.

## 15.4 పరిపాలనా సంస్కరణ సంఘం అభిప్రాయాలు : సూచనలు

పరిపాలనా సంస్కరణల సంఘం (1966) రాజకీయనాయకుల-అధికారుల మధ్య సంబంధాలను పరిశీలించి ఈ క్రింది అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

"కొన్ని సందర్భాలలో పనిచేసే విధం, దృక్పధాలు వారి మధ్య సంబంధాలను ఒత్తిడికి గురిచేశాయి. చాలామంది మంత్రుల దృష్ట్యా చూస్తే, కార్యదర్శిగాని అతని సహాయకుడు గాని ఇచ్చే నిష్పక్షపాత, నిజాయితీ పూరితమైన సలహాలు తీసుకోవటంలో అయిష్టత ఉండుటయే కాక ఏం చెపితే అది చేసే వారంటేనే ఇష్టత చూపటం. అనేక సందర్భాలలో మంత్రులు తమకు అనుకూలంగా, సరళంగా ఉండే అధికారులను తమ శాఖలలో నియమించుకోవటం వలన పరుషంగా ఉన్న అధికారులు అసమర్ధులుగా రూపొందడం, అయిష్టతను ప్రదర్శించడంగా మారటం జరుగుతుంది. దీనివల్ల ఎక్కువమంది అధికారులు వారి శాఖల మంత్రుల మనసెరిగి దాని ప్రకారం సలహాలివ్వటం జరుగుతుంది.

వీరిమధ్య సంబంధాలను తెలుపుతూ పాలనా నాయకత్వంలోనే ప్రాథమిక లోపం ఉందని అదే పరిపాలనలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాని ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రభావం వల్ల కాదని పరిపాలనా సంస్కరణల సంఘం పేర్కొంది. ఉద్యోగ ప్రమాణాలలో కూడా గుర్తించగల తిరగోమనం ఉందని దానికి బాధ్యత పాలనాధిపతులదని తెల్పింది. పరిపాలనాధికారుల ఉద్యోగ పరిస్థితుల విషయాలలో రాజకీయ జోక్యం, నచ్చని సలహాలను భరించే శక్తి లేకపోవటం, పై అధికారులకు క్రిందిస్థాయి అధికారుల ఎడ వున్న అభిప్రాయాలే వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి అనే భావన ఉండటం ఈ పరిస్థితికి కారణాలుగా చెప్పబడ్డాయి. ఈ పరిస్థితికి బాధ్యత ఏ ఒక్కరిపై నెట్టకుండా, గతానుభవాలనుంచి పాఠాలను నేర్చుకోవాలని A.R.C సూచించింది. దానికి అనుగుణంగా A.R.C ఈ క్రింది సూచనలను చేసింది.

1. మంత్రికి ఆ శాఖా కార్యదర్శికి లేదా శాఖాధికారికి మధ్య పూర్తిగా ఆదర్శవంతమైన పరిస్థితులుండాలి.
2. అధికారులు సలహాలివ్వటంలో చొరవను నూతనత్వాన్ని ప్రోత్సాహించాలి.
3. పరిపాలనలోని నిష్పక్షికతకు, నిజాయితీకి ప్రాధాన్యతనిచ్చి అధికారులలో ఉన్న అనవసర భయాన్ని పోగొట్టటం.
4. నిజాయితీ ప్రతిభలపై అధికారుల భవిష్యత్తు ఉన్నదన్న నమ్మకాన్ని కల్గించటం.

వీరి మధ్య సంబంధాలను నియంత్రించుటలో కొన్ని సాధారణ వాస్తవాలను దృష్టిలో ఉంచుకోవాలని A.R.C. పేర్కొంది. ఇద్దరూ స్పష్టతతో, సానుభూతితో, పరస్పరం వారి పాత్రలను అర్ధం చేసుకుని, ఒకరి అభిప్రాయాలను వేరొకరు సాధ్యమైనంత వరకు గౌరవించాలని ఈ సంఘం పేర్కొంది.

BRAOU

**రాజకీయ అధికారులకు సంబంధించి :**

1. పరిపాలనా విధులు మరియు వృత్తి పరమైన అంశాలను సరిగా గుర్తించటంలో అవగాహన ఉండటం.

2. సాధ్యమైనంతవరకు ఉద్యోగ విషయాలలో అంటె, నియమకాలు, బదిలీ, పదోన్నతి మొ॥ విషయాలలోను, సర్వీసుకు సంబంధించిన గ్రీవెన్సెసులోను రాజకీయ జోక్యం ఎంతతక్కువగా ఉంటె అంతమంచిది. అంతే గాక, అధికారులు వ్యక్తి గతంగా రాజకీయ నాయకులను కలుసుకోటాన్ని తగ్గించాలి.

3. నిర్ణయించిన విధానాలకు, పాటిస్తున్న పద్ధతులకు భిన్నంగా, రాజకీయ కారణాలవల్ల లేదా ఇతర కారణాల వలన వ్యక్తిగత సమస్యలు, అవసరాల పరిష్కారానికి కోర్కెలు కోరరాదు అని A.R.C. పేర్కొంది. అలాగే అధికారులకు సంబంధించి

1. రాజకీయాధికారకి కావలసినదేమిటో గ్రహించి అతని కోర్కెలకు అనుగుణంగా విధానాలలో, నిబంధనలలో అవసరమైన మార్పులు చేయటంలో మనస్ఫూర్తిగా ప్రయత్నించాలి.

2. అన్ని విషయాలలోను రాజకీయాధికారితో ఏకమవటానికి సిద్ధంగా ఉండి, ఒకవేళ విబేదించే పరిస్థితి ఉంటె దానికి తగిన కారణాలు చూపటం. అటువంటి పరిస్థితిలో రాజకీయాధికారికి వినమ్రతతో తన అసమ్మతిని తెల్పటం, అది రాజకీయ నాయకునికి అంగీకారం కాని పక్షంలో, అతని ఆజ్ఞలను సమ్మతితో అమలు పరచటం, విభేధానలున్నపుడు వ్యక్తిగతంగా కలుసుకుని చర్చించటం చేయాలని A.R.C. వివరించింది.

3. సలహావిధులను బాధ్యతా విధుల నుంచి వేరు చేసేటువంటి ఏర్పాటుకు A.R.C. అంగీకరించలేదు. ఒకవేళ ఆరెండు అంశాలను వేరుచేస్తే బాధ్యత విషయాలలో అస్పష్టత సృష్టించి శాఖలో ఘర్షణకు, ఒత్తిడికి, దారితీయవచ్చు అని సంఘం పేర్కొంది.

BRAOU

## 15.5 రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాలలో ఆవిర్భవిస్తున్న దృక్పధాలు

ఇటీవలికాలంలో ప్రభుత్వ అధికారుల తటస్థతను పూర్తిగా తిరస్కరించటం తీవ్రమైన విషయం. దీనికి పూర్తిగా రాజకీయనాయకత్వాన్ని తప్పుపట్టలేం. ప్రభుత్వోద్యోగులు - రాజకీయనాయకుల మధ్య సంబంధాలలో నెలకొన్న దైన్యస్థితికి కొంత బాధ్యత ఉన్నతాధికారుల మీద కూడా ఉంది. ఎందువల్ల అంటె వారు తమవృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధంగా రాజకీయ వేత్తల చేతుల్లో కీలు బొమ్మలుగా మారుతున్నారు. ఈ సందర్భంగా మన ప్రధాన ఎన్నికల కమీషనర్ టి.యన్. శేషన్ ఈ మధ్య వెలిబుచ్చిన అభిప్రాయాన్ని గమనించాలి. ఐ.ఏ. యస్. అధికారులు "POLISHED CALL GIRLS", అని వెన్నెముక లేనివారని, రాజకీయనాయకుల చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనివల్ల ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అధికారులు పరిస్థితులకు అనుగుణంగా మసలుకోవలసిన అవసరం ఉంది. రాజకీయాధికారులు కూడా ప్రభుత్వోద్యోగులకు విలువ, గౌరవం ఇవ్వటం అలవర్చుకోవాలి.

అంతకన్నా ముఖ్యం వీరి మధ్య ఏర్పడిన వ్యవస్థా పరమైన సంఘర్షణాత్మక వైఖరి. దీని దీర్ఘకాల పరిణామాలు ఒలీయమైనవి. రాజ్యాంగం నెలకొల్పిన వ్యవస్థాపరమైన ఏర్పాట్లను జాగ్రత్తగా పరిరక్షించుకోవాల్సిన అవసరముంది. అయితే భారత రాజకీయ ప్రక్రియలో వ్యవస్థలను నిర్వీర్య పర్చటం ఒక ముఖ్య పోకడగా గోచరిస్తుంది. రాజకీయ నాయకులు-ప్రభుత్వోద్యోగుల మధ్య సంబంధాలు కూడా ఈ పోకడకు మినహాయింపు కాదు. సంస్థాపరమైన సాధనాలను నాశనం చేయకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత శ్రేష్ఠ వర్గం మీద ఉంది. అయితే వీరిమధ్య సామరస్య పూర్వక సంబంధాలు రాబోయే కాలంలో ఏర్పడవచ్చునని ఆశించటం అత్యాశే.

సమకాలీన సమాజంలో వీరి మధ్య సంబంధాలు కాలక్రమేణా చాలా సంక్లిష్టంగా నుండి తరుచుగా అనేక మార్పులకు గురవుతున్నాయి. ఈ సంబంధాలు మన మౌళిక విలువలలో ఉన్న వైరుధ్యాలను ఎత్తి చూపుతున్నాయి. ఒక ప్రక్క వ్యక్తుల విలువలు, లక్ష్యాలు, ప్రయోజనాలు మరో ప్రక్క సమాజవిలువలు, వాటి లక్ష్యాలు పరస్పరం పోటీ పడుతున్నాయి. ఈ రెండింటి మధ్య ఉన్నసమతౌల్యం క్రమంగా వ్యక్తిగత ప్రయోజనాల వైపు మొగ్గు చూపుతూ సమాజపరంగా రాజకీయ పరిపాలనా వ్యవస్థల పనితీరును విపరీత పరిణామాలకు గురిచేస్తున్నాయి. పి.యస్. అప్పు ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితికి రాజకీయ వేత్తలు పాలనోద్యోగులను ఈ విధంగా విమర్శించాడు. "గత కొన్ని దశాబ్దాలుగా పరిస్థితులు రాజకీయ వేత్తలవైపు మొగ్గు కనపర్చుటచేత ఉన్నతాధికారుల పై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది." మరో ఉన్నతాధికారి అభిప్రాయం ప్రకారం రాజకీయాధికారులు ప్రభుత్వోద్యోగుల మధ్య సంబంధాలను పర్యవేక్షించటానికి రాజ్యాంగ బద్ధయంత్రాంగాన్ని ఏర్పాటు చేసి వారికి నిర్దేశించిన నియమావళిని అతిక్రమించి వారిపై చర్య తీసుకోవటమే కాక, వారి మధ్య సంబంధాలను స్పష్టంగా నిర్వచించాలని పేర్కొన్నాడు. రాజకీయనాయక పరిధిలో లేని అంశాలపై వారి ఆధిపత్యాన్ని కొనసాగనీయరాదు. రెండువైపులనుంచి జరిగే అతిక్రమణ వలన క్రమబద్ధమైన రాజకీయ ప్రగతి సమర్థవంతమైన పరిపాలనా నిర్వర్తన తీవ్రంగా కుంటుపడతాయి.

BRAOU

## 15.6 సారాంశం

రాజకీయ అధికారులకు - ప్రభుత్వోద్యోగులకు మధ్య సంబంధం ఏ విధంగా అభివృద్ధి చెందింది-వీరి మధ్య కల సంబంధాల గురించి వివిధ సిద్ధాంతాలలో ప్రతిపాదించిన ఊహనలను ఈ భాగంలో వివరించటం జరిగింది. రాజకీయ-పాలనా ప్రక్రియలు భిన్నమైనవనే ఊహనతో మొదలైన సైద్ధాంతిక చర్చ ప్రస్తుతం ఈ రెంటిని వేరుగా చూడటం సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఈ సిద్ధాంతాల నేపథ్యంలోనే వివిధ దేశాలలో రాజకీయాధికారులు ప్రభుత్వోద్యోగుల సంబంధాలలో సంభవించిన పరిణామాలను గురించి ఈ భాగంలో వివరించటం జరిగింది. అదే విధంగా భారతదేశంలో వీరి మధ్య సంబంధాలలో వస్తున్న పోకడలను మార్పులను కూడా చర్చించటం జరిగింది.

రాజకీయ అధికారులు-ప్రభుత్వోద్యోగులు ప్రతి స్పందించుకుంటూ ఒకరికొకరు ప్రభావితం చేసుకుంటారు. వాస్తవంలో వారి మధ్య సంబంధాలు స్థిరంగా ఉండవు. వారి మధ్య సంబంధాలలో ప్రవర్తనా దృక్కోణం అంతర్భాగంగా ఉండటం వలన అవి తరుచుగా మారుతుంటాయి. ప్రధానంగా వారి పాత్రలలో అతివ్యాప్తి పెంగటం వలన వారి మధ్య సంఘర్షణ కూడా పెరుగుచున్నదనే అంశాన్ని ఈ భాగంలో కూలంకషంగా చర్చించటం జరిగింది.

ఈ భాగంలో చర్చించిన విషయాలనుంచి మనం గుర్తించవలసిన విషయం ఏమిటంటే ప్రభుత్వ అధికారి వృత్తి పరంగా విశ్వాస పాత్రుడుగా అతని బాధ్యతలను నిర్భయంగా అవగాహనతో నిర్వర్తించినపుడు ప్రభుత్వపాలన

సమర్థవంతంగా ఉంటుంది. దీనికి భిన్నంగా ప్రభుత్వ అధికారి నుంచి రాజకీయపరమైన లేదా సైద్ధాంతిక పరమైన నిబద్ధతను ఆశించినపుడు ప్రభుత్వోద్యోగులలో అనైక్యత ప్రబలి వృత్తిపరమైన ప్రమాణాలు లోపిస్తాయి. ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం నిర్వహిస్తున్న కీలక మైన పాత్ర దృష్ట్యా అటువంటి పరిస్థితి అవాంఛనీయం.

### రజనీకోఠారి మాటల్లో :

ప్రభుత్వానికి రాజకీయపార్టీ-ఉద్యోగస్వామ్యం ఎపుడైతే రెండు స్తంభాలై నిలుస్తాయో, రాజకీయ-పరిపాలన ప్రక్రియలు సమైక్యం చెందటం తప్పనిసరి. ఆరోగ్యవంతమైన పద్ధతుల అభివృద్ధి రాజకీయ-పాలనా నాయకత్వాల గుణాత్మకతపై ఆధారపడియున్నది. అటువంటి నాయకత్వం నల్ల పాలనకు హేతుబద్ధత చేకూరుతుంది. అధికారదత్తత ద్వారా వికేంద్రీకరణ జరిగి ఉన్నత స్థాయినుంచి దిగువస్థాయి వరకు పరిపాలన శక్తివంతం చేస్తుంది. పాలనా సామర్థ్యం, సమైఖ్యత రాజకీయ-పాలనల మధ్య ఉండే సమైఖ్యతాభావం మీద కూడా ఆధారపడి ఉంది. పాలన వ్యవస్థ శక్తి, సామర్థ్యాలు నిర్ధేశించిన రాజకీయ లక్ష్యాలను అది ఏ మేరకు సాధించింది అన్న అంశం ప్రాతిపదికగా నిర్ణయించబడుతాయి.

మొత్తం మీద రాజకీయ అధికారులు-ప్రభుత్వోద్యోగుల మధ్య సంబంధాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1. భారతదేశంలో రాజకీయ అధికారులు ప్రభుత్వోద్యోగుల సంబంధాలలో అనేక ఒడుదుడుకులున్నప్పటికీ దైనందిన వ్యవహారాలలో రాజకీయ అధికారులదే పై చేయి అన్న ధోరణి స్పష్టంగా గోచరిస్తుంది. ప్రభుత్వోద్యోగులకు, ఉద్యోగ భద్రత ఉండటం, తమ పదవుల తాత్కాలిక స్వభావం కలిగి ఎన్నికల ద్వారా పదవిలోకి వచ్చే రాజకీయనాయకలలో తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తున్నది. ఈ సందర్భంలో వీరి మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి, చిరకాలం కొనసాగే అనుబంధంతో కూడిన సంబంధాలు రూపుదిద్దుకుంటున్నాయి.
2. వీరి మధ్య సంబంధం సమాజం ఏ విధమైన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పరుకుంది అనే అంశం పై ఆధారపడతాయి.
3. వీరి సంబంధాలు ప్రభుత్వ యంత్రాంగ సమర్థతను నిర్ధేశిస్తాయి. ఎప్పుడైతే వారు నిర్దేశించిన పరిధులను అతిక్రమించి, వారి పాత్రలను సరిగా నిర్వచించరో అప్పుడు ఘర్షణకు, తప్పుడు అవగాహనకు దారితీసి ప్రభుత్వ పనితీరు గమ్యాన్ని నిరోధిస్తాయి. కావున వారిమధ్య పరస్పర అవగాహన తప్పని సరి.

BRAOU

## 15.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రాజకీయ అధికారులు - ప్రభుత్వోద్యోగులు అంటె అర్థాన్ని వివరించి వారి మధ్య సంబంధాలపై సిద్ధాంతపర భావనలు వివరింపుము.
2. రాజకీయ అధికారులకు - ప్రభుత్వోద్యోగులకు మధ్య భారతదేశంలో సంబంధాల ఆవిర్భావం తెల్పుము.
3. పరిపాలనా సంస్కరణల సంఘం రాజకీయ అధికారుల ప్రభుత్వోద్యోగుల సంబంధాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలను /సూచనలును వివరించుము.

**II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ఉదార ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాలను క్లుప్తంగా వివరించుము
2. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాలలో ఆవిర్భవిస్తున్న TRENDS పేర్కొనుము.
3. భారత - అమెరికా దేశాలలో రాజకీయ అధికారుల - ప్రభుత్వోద్యోగుల సంబంధాలపై వివరింపుము.

## 15.8 చదువదగిన రచనలు


1. C.V. Raghavulu and M. Bapuji : "Relationship between Politicians and Civil Servants in India", India Journal of Administrative Science Vol. No. 1, Jan-June 1990 PP 58-76

2. Mohit Bhattacharya : "Public Administration, The World Press Pvt Ltd., Calcutta, 1981.

3. Rumki Basu : "Politico - Administrative Relationship in Development Administration in India", The Indian Journal of Political Science, Vol , No.2, April-June 1989, PP 209-220.

4. S.R. Maheswari : "The Political Executive and the Permanent Executive, An Analysis of the Emerging Role, Patterns", The Indian Journal of Public Administration, Vol XX VI No.3, July - Sept 1980, PP 739-749.

5. : Indian Administration, Orient Longman, New Delhi, 1968, PP. 182-199.

6. R.B. Jain : Contemporary of in Indian Administration, issues Vishal Publications, New Delhi, 1976. PP 149-184.

7. Vajpeyi and Kaul : "Politician - Civil Servant" The Indian Journal of Public Administration, Vol XXXIX, No.1, Jan-May 1993 PP

8. D. Ravindraprasad and P. Satyanarayana : "Woodraw Wilson", in D.R. Prasad et. al (eds). Administrative Thinkers, Sterling Publishers, New Delhi, 1989. PP 41-49.


B R A O U

రచయిత : బి.పి.సి. బోస్

# భాగం - 16 : ప్రగతి పాలనలో సాధారణోద్యోగులు - విషయ నిపుణుల పాత్ర

## విషయక్రమం

16.0 లక్ష్యాలు
16.1 పరిచయం
16.2 సాధారణ ఉద్యోగి - పాత్ర
16.3 విషయనిపుణుడు - పాత్ర
16.4 భారతదేశంలో సాధారణ ఉద్యోగికి - విషయ నిపుణునికి ప్రగతి పాలనలో గల పాత్ర
16.5 భారతదేశంలో సాధారణ ఉద్యోగికి - విషయనిపుణుని పాత్రలకున్న ద్విభాజత్వం
16.6 వీరి పాత్రలపై పరిపాలనా సంస్కరణల సంఘం, ఇతర సంఘాల అభిప్రాయాలు.
16.7 వీరి పాత్రలలో వస్తున్న మార్పులు
16.8 సారాంశం
16.9 నమూనా పరీక్షా ప్రశ్నలు
16.10 చదవదగిన రచనలు

BRAOU

## 16.0 లక్ష్యాలు

ఈ భాగం చదివితే మీరు ఈ క్రింది అంశాలు వివరించగల్గుతారు.

* ప్రగతిపాలనలో సాధారణ ఉద్యోగుల - విషయనిపుణుల పాత్ర
* భారతదేశంలో వారి మధ్య సంబంధాల స్వభావం
* వీరి మధ్య సంబంధాలలో ఉన్న వివాదాస్పద అంశాలు
* వీరి సంబంధాలపై వివిధ సంఘాల సూచనలు, అభిప్రాయాలు

## 16.1 పరిచయం

దేశ ఆర్థిక, సామాజిక ప్రగతి విషయ నిపుణులు -సాధారణ ఉద్యోగులు కలిసి కృషి చేస్తేనే సాధ్యమవుతుంది. ఒక విధంగా ప్రగతి , ప్రత్యేకీకరణలు కలిసికట్టుగా సాగే ప్రక్రియలని చెప్పవచ్చును. కాని ప్రగతి పాలనలో విషయ నిపుణులు - సాధారణ ఉద్యోగుల పాత్ర గురించి వాద, ప్రతివాదాలు ఎంతో కాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. గ్లెన్ స్టాల్ పేర్కొన్నట్లు విశాల దృక్పథం, దూరదృష్టి, సమతాభావం, బాధ్యతాయుత దృక్పథం మొదలైనవి ప్రగతి పాలకులు తప్పనిసరిగా అలవర్చుకోవలసిన లక్షణాలు. కాని ఈ లక్షణాలను అలవర్చుకునే పద్ధతులు ఆధునిక ప్రజాస్వామ్య

అవసరాలకు అనుగుణంగా లేవని పరిగణించబడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో విషయ నిపుణుల సాధారణ ఉద్యోగుల పాత్ర గురించి అనేక వివాదాలు చెలరేగాయి. విధాన ప్రక్రియలో ఆధిక్యత సాధారణ ఉద్యోగికి ఉండాలా లేక విషయ నిపుణునికి ఉండాలా లేక వీరిద్దరూ రాజకీయాధికారికి ప్రత్యక్షంగా సలహాలు సహాయం అందించే సమాంతర క్రమానుగత శ్రేణిని ఏర్పాటు చేయటం మంచిదా అనే ప్రశ్నలు చర్చనీయాంశాలయ్యాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం ఉత్పన్నమైన ఈ వివాదం ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలలో తారాస్థాయిలో కొనసాగుతున్నది.

భారతదేశంలో ప్రభుత్వపాలనా వ్యవస్థలో విషయ నిపుణుల పాత్ర స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ పరిపాలనా అధ్యయన రంగంలో ప్రముఖ చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఈ వివాదం ఒక కొరకరాని కొయ్యగా రూపొందింది. ఒక ప్రక్క విషయ నిపుణులైన వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు తమ అధికారాలు పాత్ర గురించి ఆందోళన చెందుతుండగా వేరొక ప్రక్క ప్రభుత్వప్రణాళికలను, కార్యక్రమాలను విజయవంతం చెయ్యాలంటె దేశంలోని అన్ని వర్గాల ప్రజలు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటానికి తగు పరిష్కారమార్గాలను కనుగొనవలసిన అవసరం ఉంది. సాధారణ ఉద్యోగులు, విషయనిపుణుల మధ్య వివాదం కొంతవరకు చారిత్రక వారసత్వంగా సంక్రమించినా ప్రభుత్వనాయకుల ధోరణి కొంతవరకు కారణమని చెప్పవచ్చు. ఏమైనప్పటికీ ఈ సమస్యతీవ్రతను గుర్తించి దానిని పరిష్కరించవలసిన అవసరాన్ని ఎవరూ గుర్తించలేదనే చెప్పాలి. ఈ వివాదం సమసిపోయేందుకు తగిన చర్యలు తక్షణం తప్పనిసరిగా అమలు చేయవలసిన అవసరం ఉంది అంటే ఈ సమస్య ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు.

## 16.2 సాధారణ ఉద్యోగిపాత్ర

పాలనా ప్రక్రియలో సాధారణ ఉద్యోగి పాత్ర చర్చించే ముందు సాధారణ ఉద్యోగి అంటె ఎవరో తెలుసుకోవలి. ఎల్. డి. వైట్ విధాన నిర్ణయాల అమలు, సమన్వయం, ప్రభుత్వయంత్రాంగ అభివృద్ధి, సాధారణ శాఖల నిర్వహణ, నియంత్రణకు సంబంధించిన విధులు సాధారణపాలనకు అర్థం అని పేర్కొన్నాడు. కాబట్టి సాధారణాధికారికి పాలనా ప్రక్రియ అన్ని దశలతో, చర్యలతో సంబంధముంది. అంటె ఒక విధంగా (పోస్ట్‌కార్బ్)(POST CORB) విధులను అతడు నిర్వహిస్తాడని చెప్పవచ్చును. వ్యతిరేక అర్థంలో ఒక నిపుణుడు లేదా శాస్త్రవేత్తకాని ఉద్యోగి. అందువల్ల తరుచుగా అతనిని ఔత్సాహిక ఉద్యోగిగా పరిగణించటం జరుగుతున్నది. కాగా సకారాత్మక అర్థంలో సాధారణ ఉద్యోగి వృత్తిపర అధికారి అనీ (ఒకవేళ పరిపాలన) ఒక రంగానికి లేదా వృత్తికి సంబంధించిన అనేక రంగాలలో ప్రవేశం కలిగి ఉన్న అధికారిగా పరిగణింపబడుతున్నాడు. సాధారణ ఉద్యోగి అతని వృత్తిపర సామర్థ్యంతో పాటు రాజకీయ వేత్తకు ఉండే నైపుణ్యాన్ని కలిగి ఉంటాడు. నిర్వాహకుని హోదాలో అతడు ఇతర ఉద్యోగులతో పనులు చేయించే బాధ్యతను కలిగిఉంటాడు. పరిపాలనావ్యవస్థ పరిమితులకు లోబడి సంక్లిష్ట సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను వ్యాఖ్యానించే బాధ్యతను నెరవేరుస్తాడు. ఆర్.జి.యస్. బ్రౌన్ అనే బ్రిటీష ప్రభుత్వోద్యోగి సాధారణ ఉద్యోగి నిర్వహించే విధులను ఈ క్రింది విధంగా వివరించాడు.

**A. అమలు పరచే ఉద్యోగి (Facilitator)గా :** ప్రభుత్వశాఖలలో జరిగే నిర్ణయాలను నమోదు చెయ్యటంలో, అమలు చేయటంలో కీలక పాత్ర నిర్వహిస్తాడు. రాజకీయవేత్త విధాన రూపకల్పనకు కావలసిన ప్రేరణను కల్పిస్తే, సాధారణ ఉద్యోగి ఆ నిర్ణయాలను క్రోడీకరించి అమలు పరుస్తాడు. సాధారణ ఉద్యోగికి తన పాత్ర పోషించాలంటే వ్యవస్థ గురించి అవగాహన, ఏది ఎంతవరకు సాధ్యమో గ్రహించగలిగిన శక్తి అవసరం అయితే దీనికి రాజకీయ లక్ష్యాల పట్ల



BRAOU

సానుభూతిధోరణి కాని, సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేదు. కాని కొంతమంది వృత్తి నిపుణులు అయిన వాస్తుశాస్త్రజ్ఞులు ఇంజనీర్లు, ఆయారంగాలలో సామర్థ్యం కల్గి పైన పేర్కొన్న పనిచేయటానికి ఇష్టపడతారు.

**B.** మధ్య వర్తిగా : సాధారణ ఉద్యోగి సాంకేతిక చొరవకు మించి రాజకీయ ఆర్థిక పరిమితులను ఎదుర్కొన్నపుడు మధ్యవర్తిగా ప్రముఖ మైన పాత్ర పోషిస్తాడు. మధ్యవర్తిగా సాధారణ ఉద్యోగి విషయనిపుణుని వ్యవస్థలక్ష్యాలతో అనుసంధానం చేస్తాడు. అంటే విషయనిపుణుని పరిమితులను గుర్తించి ఆ పరిమితులకు లోబడి పనిచేసేట్లు అతనిని ఒప్పించే ప్రయత్నం చేయటం.

**C.** వివాదాల పరిష్కర్త : ఇది ఒక రాజకీయ విధి. రాజకీయనాయకులకు విధాన నిర్ణయాలు తీసికోటానికి తగినంత వ్యవధి ఉండదు. అందుచేత నిర్ణయాలు తీసుకోటంలో వారికి సహాయకుల అవసరం ఉంది. ఈ విధిని సాధారణ ఉద్యోగి నిర్వహిస్తాడు. దీనికి సాధారణ ఉద్యోగికి విభిన్న అంశాలను పోల్చగలగటం, వివాదాస్పద అంశాల మధ్య రాజీకుదిర్చే సామర్థ్యం అవసరం.

**D.** సమన్వయ కర్త: సాధారణ ఉద్యోగి వివిధ శాఖలలో అనుభవజ్ఞు లు సూచించిన మార్పులను సరిపోల్చి చూడటం, కొన్ని సందర్భాలలో ఒకవైపు విషయనిపుణుల, మరోవైపు రాజకీయ ప్రయోజనాలకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించే పద్ధతిని సూచించటం మొదలైన విధులను నిర్వర్తిస్తాడు. వీటితో పాటు ప్రభుత్వ విధాన నిర్ణయాలలో విభిన్న సాంకేతిక, ఆర్థిక, వ్యవస్థాపర రాజకీయ అంశాలను తులనాత్మకంగా పరిశీలించి వాటిని క్రమపద్ధతిలో అమర్చి వాటి మధ్య సమతుల్యత కోసం చూస్తాడు. అంటే విధానాల వల్ల ప్రభావితులయ్యే సమూహాల ప్రయోజనాలను గుర్తించడం, పరస్పరం వైరుధ్యం కల ప్రయోజనాలను మధ్య సయోధ్యను సాధించడం, అవసరాన్ని బట్టి సాంకేతికాంశాల ప్రాముఖ్యత తగ్గించి, అందరికి మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోనటం సాధారణ ఉద్యోగి నిర్వర్తించే ఇతర ప్రధాన విధులు.

BRAOU

అనేక ప్రత్యేకతలకు కారణమైన శక్తులు కల విషయనిపుణులకు సమాజంలో ప్రాముఖ్యమైన పాత్ర కోరుకునే వారుకూడా సాధారణ ఉద్యోగికి తగిన ప్రాధాన్యత ఉండాలనే కోరుతున్నారు. ప్రస్తుత సమాజంలో ఏర్పడిన సవాళ్ళ నెదుర్కొనటంలో ఏ ఒక్క నిపుణుని వల్ల సాధ్యంకాదు. అంటె వివిధ రంగాలలో నిపుణతలను ఏకీకృతం చేసి, వాటి మధ్య సంబంధాన్ని ఏర్పరిచి సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించేలా చూడాలి. అలాగే విషయనిపుణులు రాజకీయాలకు పూర్తిగా అతీతులుకాలేదు. కొన్ని సందర్భాలలో విషయనిపుణులు తమ వ్యక్తిగత నిపుణత్వం వల్ల వ్యవస్థల్లో సమస్యలు సృష్టిస్తున్నారు. కాన విషయనిపుణులు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిపాలనా అవసరాలను, పరిస్థితులను దృష్టిలో వుంచుకొని నిర్ణయాలు చేయాలి. ఈ ప్రక్రియకు చర్చలు, సమ్మేళం, సమన్వయం, నియంత్రణ అవసరం. ఇవి సాధారణ ఉద్యోగి నిర్వర్తించే విధులు. ఈ దృష్టితో చూస్తే విషయనిపుణుడు - సాధారణ ఉద్యోగి ఒకవైపు భిన్నమైన మరోవైపు పరస్పర పూరకమైన పాత్రలను పోషిస్తారు. వాస్తవానికి విజయవంతమైన పరిపాలనకు వీరి సేవలు తప్పనిసరి. వారు పాలనను సంకుచిత దృష్టితో కాక విశాల దృష్టితో చూడాలి. పరిపాలనలో సాధారణ ఉద్యోగి మరుగున పడతాడని ఆశించడం కేవలం ఉహాగానం మాత్రమే. భారతదేశ పరిపాలనలో సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యత కొనసాగటానికి కొన్ని ముఖ్య కారణాలున్నాయని ఒక పరిశీలకుడు పేర్కొన్నాడు. అవి :

1. మంత్రులకు రెండు మార్గాల ద్వారా సలహాలు పొందటం
2. విషయనిపుణుడు అత్యధిక ఉత్సాహం చూపటం వలన తనంతట తనే అంతిమ నిర్ణాయాలను తీసుకోటంలో అనర్హుడవుతున్నాడు.
3. విషయనిపుణులు, సాధారణ ఉద్యోగులు కలిసి కట్టుగా పని చేయటం, వారు నిర్మాణాత్మక ఉద్రిక్తతను కొనసాగించడం, ప్రభుత్వ విధాన నిర్ణయీకరణకు సహాయకారిగా ఉన్నాయి. కొన్ని ఐ.ఏ.యస్. సభ్యులు తమ విధులు నిర్వర్తించుటలో సామర్థ్యం, విజ్ఞానం పెంచటానికి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. వాస్తవానికి ఐ.ఏ.యస్. ఉద్యోగులు పరిపాలనలోని ప్రత్యేక అంశం మీద దృష్టి కేంద్రీకరించి ఆ విషయంలో శిక్షణ, పరిపాలనా పరమైన అనుభవం సంపాదించాలి. ఉన్నతస్థాయిల్లో, అంతరశాస్త్ర/విషయదృక్పథం తప్పని సరి కావున వారి బదిలీలు కూడా సంబంధిత రంగాలకు సంబంధించి ఉండాలి.

భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా నైపుణ్యం కల ఉద్యోగుల అవసరం చాలా ఉంది. దీంతో పాటు పరిపాలనా విషయాలలో జిజ్ఞాస చూపిన విషయనిపుణుల నుంచి, సాధారణ ఉద్యోగులను రూపొందించేందుకు తగిన చర్యలు చేపట్టాలి.

అయితే ఈ దశ చేరాలంటే విషయనిపుణులు-సాధారణ ఉద్యోగులు చాలా కృషిసల్పాలి. ప్రస్తుతం ప్రతిభావంతులైన విషయనిపుణులు - సాధారణ ఉద్యోగులు కొనసాగుతారు కాని ప్రభుత్వ ఉద్యోగాలలో వారి మొత్తం సంఖ్యలో చాలా స్వల్పం.

## విషయనిపుణుడు పాత్ర

విషయనిపుణుని పాత్రను విశ్లేషించే ముందు విషయనిపుణుడు అంటె ఎవరో నిర్వచించవలసిన అవసరం ఉంది.

ఒక ప్రత్యేక విషయానికి సంబంధించిన అంశాలలో నిద్యార్హతలు సాధించి తద్వారా ఆ రంగంలో నియమింపబడి తమ నైపుణ్యం, విషయనిపుణత, అర్హతలద్వారా తమ విధులను నిర్వర్తించే ఉద్యోగులుగా చెప్పవచ్చు. ఉదా॥ వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఈ వర్గానికి చెందుతారు.

విధాన నిర్ణయ ప్రక్రియలో సాంకేతిక అంశం అంతిమ నిర్ణయంలో ఒక స్వల్ప అంశం, అనేక అంశాలలో నిపుణత్వం ఒకటి మాత్రమే కనుక మొత్తం అంశాలను అనుసంధానించడం అసాధ్యం. సాధారణ ఉద్యోగి విషయనిపుణుని సలహాలు పొందివాటిని అవగాహన చేసుకుని అనుభవజ్ఞులు ఇచ్చే పరస్పర వివాదస్పద సలహాలను అంచనా వేసుకుని నిర్ణయం తీసుకుంటాడు. అదే విషయనిపుణుడైతే సాంకేతిక స్వభావం లేని సాధారణ విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వక రాజకీయ అంశాలకు విలువ తగ్గిస్తూ వ్యయానికి సంబంధించిన అవగాహనా లోపం మొదలైన పరిమితులతో వాస్తవమైన పరిపూర్ణత కోసం ప్రయత్నిస్తాడు. విషయనిపుణులు తరుచుగా ఒక దృష్టితోనే ఉంటారనే సిద్ధాంత భావన

BRAOU

కొంతవరకువాస్తవావమే అయినా, దీనికి కారణం వారికిచ్చే సంకుచితమైన శిక్షణలో అనుభవంకొరవడటం వలన హ్రస్వదృష్టి కలవారవటానికి కారణం. విద్యావ్యవస్థ ద్వారా వారు పొందిన శిక్షణ వారిని ఈ విధంగా తీర్చి దిద్దింది. కాబట్టి వ్యవస్థ అవసరాలను తగిన విధంగా మార్చవలసిన అవసరముంది. ఎల్.కె.ఝా విషయనిపుణుని గురించి తన అభిప్రాయాన్ని ఈ విధంగా పేర్కొన్నాడు.

" Increasingly Specialist is seen as some one who has acquired expertise in a narrow field. A person who knows more and more about less and less, unlimit it is derisinely said, he knows everything about nothing".

విషయనిపుణుని పాత్రకు అనుకూలమైన అంశాలు కలవు, కాబట్టి వారిని సమర్థించే వాదనలు ఉన్నాయి. సాధారణ అధికారులు ఒక సమస్యను పరిశీలించే దృక్పథం ప్రగతి శీలకమైంది కాగా సంప్రదాయ బద్ధమైంది. వారు ముఖ్యంగా యాధాస్థితి కొనసాగేందుకు తోడ్పడతారు. తప్ప నూతన ప్రగతిశీలక మార్పుల కొరకు ప్రయత్నించరు. ప్రతి చిన్న విషయానికి జాగ్రత్త పడుతూ, ఇతరులు చూపే ఉత్సాహాన్ని, నిబద్ధతను అనుమానస్పద దృష్టితో చూస్తారు. ఆధునిక పాలనలోని అధిక అంశాలు సాంకేతిక పరమైనవి కావడం చేత విషయనిపుణులు మాత్రమే వాటిని సమర్థవంతంగా అర్థం చేసుకుంటారని భావించబడింది. ప్రణాళికాబద్ధమైన ప్రగతి విధానం విషయనిపుణులను విధాననిర్ణయీకరణలో ప్రముఖపాత్రనివ్వాలని గట్టిగా వాదిస్తున్నది. అంతేకాదు ప్రస్తుతం ప్రభుత్వ విధాన నిర్ణయీకరణ, పరిపాలనా ప్రక్రియలు క్లిష్టమైన సాంకేతిక అంశాలతో నిండి ఉండటం వలన వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు అధికార పదవుల్లోని వారికి తప్పని సరిగా సాంకేతిక అంశాల పట్ల అవగాహన, వాటిని నిర్వహించే అర్హతలు అవసరం.

పాలనా యంత్రాంగంలోని వివిధ పదవులకు పలురంగాలలో అనుభవం మూర్తి మత్వ లక్షణాలు అవసరం. సాధారణ ఉద్యోగికి ఈ లక్షణాలు లోపించుటయే కాక వారు ప్రతి కార్య పర రంగంలో సమానంగా విజయవంతం కాలేక పోవటం సంభవమే.

BRAOU

ఈ మధ్య కాలంలో విషయనిపుణునికి అనుకూలంగా పలువాదనలు చేయబడ్డాయి. అవి

1. విషయనిపుణులు పరిపాలనా ప్రక్రియలో రాజకీయ అధికారికి సలహాల నివ్వటంలో అందుబాటులో ఉండే విషయాల్లో అన్యాయంగా, సమర్థించుకోలేనంతగా నిర్లక్ష్యం చేయబడ్డారు.

2. వేతనాలు, పదోన్నతి మొదలైన విషయాలలో వారికి సాధారణ ఉద్యోగులకు మధ్య చాలా అంతరం ఉంది. అందుచేత విషయనిపుణులు సాధారణ ఉద్యోగుల కన్నా తక్కువ దృష్టితో చూడబడుతున్నారు. అయితే విషయనిపుణులు పదోన్నతి ద్వారా ఉన్నత పదవులు చేరుకోవటానికి లాంచన ప్రాయమైన అవరోధాలు లేవు.

విషయనిపుణులకు - సాధారణ ఉద్యోగులకు మధ్య చెలరేగిన వివాదం వల్ల ఉత్పన్నమయ్యే ముఖ్య సమస్య ఏమిటంటే, సాధారణ ఉద్యోగులు పలు సమస్యలపై తీసుకునే విధాన నిర్ణయాలకు విషయనిపుణులు తలొగ్గవలసి

రావటం. ఈ సమస్య విషయనిపుణుని ప్రత్యేకీకరణ రంగాన్ని కూడా ప్రభావితం చేసింది. ఇంది తప్పని సరిగా వారి మధ్య ఘర్షణకు దారితీస్తుంది. అంటె విషయనిపుణుని పరిజ్ఞాన శక్తికి, సాధారణ ఉద్యోగుల పదవి వల్ల సంక్రమించే అధికారానికి మధ్య ఘర్షణకు దారి తీస్తుంది.

భారతదేశంలో ప్రభుత్వోగులను రెండు ముఖ్య తరగతులుగా విభజించవచ్చు. మొదటి వారు ప్రభుత్వంలో చేరే ముందే గుర్తింపబడిన వృత్తి పరమైన అర్హతలను కల్గి ఉండటం తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలలో వారికున్న వృత్తిపరమైన అర్హతల ఆధారంగా నియమింపబడటం. ఉదా|| వైద్యులు, ఇంజనీర్లు, వాతావరణ శాస్త్రవేత్తలు మొదలైనవారు. రెండో వర్గంవారు సాధారణ విద్యార్హతలు ఆధారంగా సివిల్ సర్వీసులలోకి తీసుకోబడతారు. ఐ.ఏ.ఎస్.పి.ఎస్. సభ్యులు ఈ వర్గానికి చెందుతారు.

భారతదేశంలో విషయనిపుణుల-సాధారణ ఉద్యోగుల పాత్రలో సంబంధాన్ని చర్చించేముందు బ్రిటనేలో ఏవిధంగా ఉందో పరిశీలిద్దాం. బ్రిటన్‌లో కూడా ఈ రెండు తరగతుల మధ్య వివాదం ఉందని డేవిడ్ జడ్జి వంటి పాలనా విశ్లేషకులు పేర్కొన్నారు. బ్రిటన్ ఏర్పరుచుకొన్న రాజకీయ వ్యవస్థ సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యత కొనసాగటానికి దారి తీసింది. ఈ దేశంలో విధాన నిర్ణయాక పద్ధతి, మంత్రికి-పార్లమెంటుకు ఉన్న సంబంధం, ఉద్యోగస్వామ్యంలో ప్రత్యేకీకరణ, సాధారణ ఉద్యోగి పరిపాలనలో నిర్వహించే పాత్ర, మంత్రులు-వారి క్రమానుగత శ్రేణివంటి అంశాలు పరిశీలించిన అనంతరం సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యత (80వ దశకంలో) ఉన్న పౌరపాలన ప్రాతిపదిక భావన ఉండాలని జడ్జి పేర్కొన్నాడు.

## 16.4 భారతదేశంలో సాధారణ ఉద్యోగికి - విషయనిపుణునికి గల పాత్ర : స్వాతంత్ర్యానికి పూర్వం

BRAOU

నూతన భావాలు, సవ్యత, నవకల్పన పుట్టు పూర్వోత్తరాలు కాలం అవసరాలకు అనుగుణంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రెండు తరగతుల ఉద్యోగల మధ్య కొనసాగుతున్న వివాదం దీనికి మినహాయింపు కాదు.

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ప్రభుత్వ పాలన ముఖ్యంగా, రెవిన్యూ, శాంతిభద్రతల నిర్వహణ, కనీస అవసరాల సంతృప్తి అనే కనీస సేవలలో నిమగ్నమైంది. అప్పటి బ్రిటీషు వలసపాలకులు ఏర్పరిచిన ప్రభుత్వపాలనా విధానం నిర్బంధపూర్వకమైంది. కాఠిన్యవంతమైంది. ప్రభుత్వపాలన ప్రజల కోర్కెలకు, అవసరాలకు ప్రతిస్పందించక వారికి దూరమైంది. ప్రభుత్వ పాలన నిర్వహణకు ఐ.సి.యస్. అధికారలను ఉన్నతస్థానాలలో నియమించటం జరిగింది. పాలనాయంత్రాంగంలో కొంతమంది విషయనిపుణులు ఉన్న వారికి ప్రభుత్వం తగిన ప్రముఖ్యత ఇవ్వలేదు. వారిజీతభత్యాలు, స్వయం ప్రతిపత్తిలో రెండో ఉద్యోగులుగా పరిగణింపబడ్డారు.

ఈస్టిండియా కంపెనీ కాలంలో సివిల్ సర్వీసు ఉద్యోగి విధులు చాలా ఉన్నతమైనవి కాబట్టి అతని అవగాహన పెంచటానికి ఆనాటి సాధారణ విద్య తోడ్పడింది. ఆ కాలం నుంచే సాధారణ ఉద్యోగులు ప్రభుత్వ వ్యవహారాలలో ప్రాముఖ్యత సంతరించుకొని నాయకత్వపాత్రను పోషించటం ప్రారంభమైంది.

1854 సం.లో ఇండియన్ సివిల్ సర్వీసు వ్యవస్థను (1853 లో నార్త్ కోట్-ట్రెవలీయాన్ సమర్పించిన నివేదిక ఆధారంగా) స్థాపించినప్పటి నుంచి వారి పాత్ర మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆ నివేదికోలో ఉన్నత స్థాయి అధికార పదవులను ఒక పోటీ పరీక్ష ద్వారా యువకులతో భర్తీ చేయాలని సూచించింది. 1854లో లార్డ్ మెకాలే అష్‌బర్టన్, మెల్ విల్‌సోవెట్, లీఫెవ్రీ (మెకాలే నివేదికగా ప్రాముఖ్యం చెందింది) భారత సివిల్ సర్వీసు మీద సమర్పించిన నివేదిక అంతకుముందు సమర్పించిన నివేదిక అభిప్రాయాలను బలపరిచింది.

బ్రిటీష్ రాణి పాలనలో విషయనిపుణులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఆనాటిపాలనా విధానాన్ని అనుసరించి వారు ఉన్నతస్థానాలలో నియమింపబడ్డారు. ఉదా. వ్యవసాయ డైరెక్టరేట్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, పోస్టు మాస్టర్ జనరల్ మొదలైనవారు అయితే ప్రభుత్వపాలనలోని అన్నిరంగాలలో పాలనా నాయకత్వ పదవులకు భారత సివిల్ సర్వీసుకు చెందిన ఉద్యోగులే నియమింపబడ్డారు. బ్రిటీష్ కాలంనాటి భారత సివిల్ సర్వీసుకు ప్రగతి దృక్పథం లేనప్పటికీ స్వాతంత్ర్యానంతరం ఈ సర్వీసు కొనసాగింపబడింది.

## 16.4.1 స్వాతంత్ర్యానంతరం

స్వాతంత్ర్యానంతరం కూడా బ్రిటీషు వారసత్వంగా సంక్రమించిన సాధారణ ఉద్యోగి అధిపత్యం పాలనాయంత్రాంగంలో కొనసాగుతుంది. స్వాతంత్ర్యానంతరం పరిపాలనా పరంగా సంభవించిన పలు మార్పుల వల్ల కూడా సాధారణ ఉద్యోగి ఆధక్యతలో పెద్ద మార్పులేదు. అంతే కాక, సాధారణ ఉద్యోగుల సంఖ్య ఊహించనంతగా పెరిగింది. పాలనలో సాధారణ ఉద్యోగుల సంఖ్య పెరగటం వల్ల విషయనిపుణుల నైతిక స్థాయి దెబ్బతింది.

సాధారణ ఉద్యోగి ఆధిపత్యం వల్ల ప్రణాళికా విధానం లక్ష్యమైన ఆర్థికాభివృద్ధి తగినంత స్థాయిలో సాధింపబడలేదనే ఒక భావన ఉంది. విషయనిపుణులకు విధినిర్వహణలో నైపుణ్యం, సామర్థ్యం ఉన్న వారికి వారి పని పరిస్థితులపై తగిన నియంత్రణాధికారం లేదు. ప్రస్తుత పాలనావసరాలను తీర్చటానికి సాధారణ ఉద్యోగులకు తగిన విషయ పరిజ్ఞానం, సామర్థ్యం కొరవడిందని చెప్పబడింది. సాధారణ ఉద్యోగులు కొన్ని ముఖ్యమైన సమాజ విధుల నిర్వర్తనకు అవసరం కాని విషయనిపుణులు అనేక జాతినిర్మాణ కార్యక్రమాలలో పాలుపంచుకోవటం వలన అభివృద్ధి ప్రక్రియలో వారికి సమాన ప్రాముఖ్యత ఉంది. కాని వారి స్థాయిలో, జీతభత్యాలలో ఉన్న అసమతౌల్యాస్థితిని తొలగించాలనే వాదన చాలా కాలంనుంచి కొనసాగుతున్నది.

స్వాతంత్ర్యానంతరం మనదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నేర్పాటు చేసుకోవటంచే ప్రభుత్వ విధులు అనేక రంగాలకు విస్తరించాయి. దీనితో పాటు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ సృష్టించిన సమస్యల వలన నూతన పాలనానిర్మాణాలు, సంస్థలు ఉద్భవించటమే కాక, అవి నూతన పద్ధతులు, విషయజ్ఞాన అవసరాన్ని కల్పించాయి. అంతేకాక ఆధునిక కాలంలో దేశ ఆర్థిక, సామాజిక ప్రగతికి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వలన కూడా నూతన పాలనా పద్ధతుల అవసరముందని గుర్తించారు. అయితే నూతనంగా అవతరించిన కొన్ని పాలనా నిర్మాణాలు మనదేశ అవసరాలు, విధులు నిర్వర్తించటంలో తగిన సామర్థ్యం కలిగి ఉన్నాయా ? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం సాధారణ ఉద్యోగులు విషయనిపుణుల మధ్య అనేక అంశాలలో వివాదమేర్పడి కాలక్రమేణా తీవ్రపరూపం దాల్చింది. ఎంత తీవ్రరూపం దాల్చిందంటే అది మన పరిపాలనా యంత్రాంగ సామర్థ్యానికే పరీక్షగా నిలవటమే కాక, వివాదం కొంత రాజకీయ రంగు కూడా పులుముకొంది. వీరి మధ్య వివాదం వల్ల ఉత్పన్నమైన పరిస్థితి పై రాజకీయనాయకులు దృష్టి సారించారు. 1956లో డా॥ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "సాధారణ ఉద్యోగులతో సమానంగా విషయనిపుణులకు వేతనాలు ఇవ్వకపోవటం, వారికి తగిన సౌకర్యాలు గౌరవం కల్పించకపోవటానికి నాకేమి కారణం కనపడుటలేదు. అయితే ఈ పరిస్థితిలో త్వరలోనే మార్పు వస్తుందని నేను నమ్ముతున్నాని" పేర్కొన్నారు. అనాటి ప్రధాని నెహ్రూ వీరి మధ్య తలెత్తిన సమస్యలను గుర్తించటమే కాక విషయనిపుణుల ప్రాముఖ్యాన్ని వక్కాణించాడు. నెహ్రూ మాటల్లో చెప్పాలంటే "సివిల్ సర్వీసులలో ఉన్నవారు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారినీ, వారి స్థానాన్ని సాధారణ ప్రజలు చేరుకోలేరనే ఆలోచన తప్పు. పాలకులు లేకపోయినా పాలన కొనసాగుతుంది. కాని విషయనిపుణులైన ఇంజనీర్లు లేకుండా దేశం పురోగతిని సాధించలేదని" పేర్కొన్నారు. అంతేగాక నెహ్రూ (1960) ఇంజనీరు పాలకుడుగా పనిచేయగలడు కాని పాలకునికి తగిన విషయపుణత లేక పోవడం వల్ల ఇంజనీరుగా వ్యవహరించలేడని పేర్కొన్నారు. వై.బి. చవాన్ (1966) ఒక సందర్భంలో మాట్లాడుతూ ప్రస్తుత పాలకుని పాత్ర బ్రిటీషు కాలనుంచి సంక్రమించిదనీ, అది ప్రస్తుతం తప్పని సరిగా మారవలసిన అవసరం ఉందని పేర్కొన్నాడు. విషయనిపుణులకు వారి శక్తికి తగిన స్థానం కల్పించవలసిన అవసరం ఉందని పేర్కొన్నాడు. 1967 లో శ్రీ మతి ఇందిరా గాంధీ దృక్పధం ప్రభుత్వపాలనలో విషయనిపుణులకు నైతిక స్థైర్యాన్ని పెంచిందిదేశంలోని గొప్ప వైద్య నిపుణులు, ఇంజనీర్లు వృత్తిపరంగా నాయకులుగా చూడదగినవారు. మనుషుల ప్రాణాలు కాపాడటంలో జాతికి శాశ్వత ఆస్తులు, వనరులను కల్పించటంలో వారి పాత్ర అమోఘం. మంత్రులతో సమానంగా జీతాలు, కార్యదర్శుల హోదాను పొందలేకపోవటం ఊహించలేని విషయం. యువతలో తెలవిగల వాళ్లు సాంకేతిక, వైద్య విద్య వైపు వెళ్లుతారు. అదే వారు ప్రభుత్వ పదవులకు వెళ్లడానికి నిర్ణయించుకుంటే వారు సాధారణ ఉద్యోగుల కంటే వెనుకబడి వుంటున్నారు. ఈ పరిస్థితి మారాలి .నేను ఈ పరిస్థితి మార్చటానికి ప్రయత్నిస్తున్నానని పరిపాలనావ్యవస్థ ప్రజాసంక్షేమానికి మరియు ఆర్థిక లాభంకు వ్యక్తిగత యోగాదానం ప్రతిబింబించాలని" ఆమె పేర్కొన్నారు.

వీరి పాత్రల మధ్య ఉన్న వివాధాన్ని రాజకీయనాయకులు గుర్తించిన దాని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేదనే చెప్పాలి. స్వాతంత్ర్యానంతర పరిస్థితిలో ఈ క్రింది అంశాలను ముఖ్యంగా గుర్తించవచ్చు.

1. సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యత కొనసాగటం -అది ప్రశ్నించబడటం
2. విధాన నిర్ణయ ప్రక్రియలో సాధారణ ఉద్యోగి ప్రముఖ పాత్ర వహించటం
3. సాధారణ ఉద్యోగులు - విషయనిపుణుల పాత్రల మధ్య వివాధం తీవ్రరూపం దాల్చటం.
4. సమర్థవంతమైన పాలనకు ఇద్దరికి ప్రాముఖ్యం ఇవ్వవలసిన అవసరాన్ని గుర్తించటం.

సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యతను అనేక వర్గాలు సవాలు చేసారు. దీనికి విషయనిపుణులలో పెరుగుతున్న అసంతృప్తే కారణం. 1950వ దశకంలో ప్రణాళికా విధానం మొదలైనప్పటినుంచి అనేక ప్రభుత్వస్థాయిల్లో సాంకేతిక నిపుణులను ఎక్కువ సంఖ్యలో నియమించటం జరిగింది. 1960 వ దశకం వచ్చే సరికి ప్రణాళికా పరిధి పెరగటం వల్ల వారి సంఖ్యను మరింత పెంచటం తప్పనిసరైంది. అంటే విషయనిపుణుల సంఖ్య, మనదేశంలో సామాజికా, ఆర్థిక ప్రణాళికా విధానం ప్రారంభమైనప్పటిమనుంచి క్రమంగా పెరుగుతూ వస్తుంది. 1971 సం.లో కేంద్రప్రభుత్వ ఉద్యోగాలలో

BRAOU

విషయనిపుణులు 6.4 శాతం మంది ఉన్నారు.

విషయనిపుణులు ప్రత్యక్షంగా ప్రభుత్వ అభివృద్ధి, వివిధ రకాలైన పారిశ్రామికీకరణ విధులు నిర్వహిస్తున్నారు. వారు ఆనకట్టలు నిర్మిస్తున్నారు. రోగులకు చికిత్స చేస్తున్నారు. భౌతిక, సామాజిక, జీవశాస్త్రాలలో పరిశోధన చేస్తుండటం వారి చేపట్టే పలు కార్యక్రమాలలో కొన్ని. ఈ సంక్లిష్టమైన విధుల నిర్వహణలో వారు తరుచుగా కేంద్ర, రాష్ట్ర సెక్రటేరియట్ యొక్క, అధికారయుత అలవాట్లు వల్ల నిరోధించ బడుతున్నారు. వారు ప్రభుత్వంలో కొంత మంది నియంత్రణాధికారుల ప్రవర్తన, దృక్పధం వల్ల అసంతృప్తిగా ఉన్నారు. సెక్రటేరియట్ లో ప్రముఖంగా ఐ.ఎ.ఎస్. సాధారణ ఉద్యోగులు వుండటం వలన, విషయనిపుణులలో అంసతృప్తి వ్యక్తమవుతుంది.

విషయనిపుణులు సాంప్రదాయకంగా వారికి ఏర్పరిచిన పాత్రతో సంతృప్తి చెందక వారి విధులలో ఉద్యోగస్వామ్య సరళి పద్ధతులలో ప్రాథమిక మార్పులు కోరుతున్నారు. వారి కోర్కెలకు తగినట్లుగా, ప్రభుత్వపాలనలో నిపుణలకు పెరుగుతున్న ప్రాముఖ్యత, ఆధునీకరణలో వారు నిర్వహించే పాత్రల వల్ల తగిన బలం చేకూరింది.

## 16.5 సాధారణ ఉద్యోగికి - విషయనిపుణులకు మధ్య ద్విభాజత్వం

పీటర్ సెల్ఫ్ అభిప్రాయం ప్రకారం వీరి మధ్య వున్న ద్విభాజత్వం కొంత వరకు ఐరోపా దేశాలలో వున్న సివిల్ సర్వీసు చారిత్రక అభివృద్ధి లో వెళ్ళునుకొందని పేర్కొన్నాడు. సంప్రదాయంగా వీరి మధ్య ద్విభాజత్వం కేంద్ర ప్రభుత్వపాలనా చట్టంపరిధికి లోబడి సాధారణ నిబంధనలు రూపొందించి అమలు పరచటానికి సంబంధించినది. మాక్స్ వెబర్ ప్రతిపాధించన సిద్ధాంతం కూడా ఇదే. ప్రభుత్వ కర్తవ్యాలు, విధులు నిర్వర్తించటంలో ఉద్యోగులకు సామర్థ్యం, సమ్మకం అవసరం కాని ప్రత్యేక సాంకేతిక అర్హతలు కాదు. ఐరోపా దేశలలోని ఉన్నత స్థాయి సాధారణ ఉద్యోగులు ఎదో ఒక అంశంలో ప్రత్యేక జ్ఞానాన్ని సముపార్జించి ఉంటారు. కాలక్రమేణా ఈ దేశాలలో విషయనిపుణులుగా వివిధ రూపాలలో ప్రభుత్వ సర్వీసులలో ప్రవేశించారు. కొందరు విధాన నిర్ణయ సలహాదారులుగా మరికొందరు సాంకేతిక పరిశీలకులుగా, ఇంకొందరు ప్రత్యేక సేవలందించే వారుగా ప్రభుత్వ సర్వీసులలో చేరారు. ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగుల సంఖ్య వారి ప్రభావం ప్రభుత్వ పరిధిపై ఆధారపడి ఉన్నది. క్రిస్ప్ సూచించనట్లు ప్రస్తుతం ఉన్న భిన్నత - రెండు విభిన్న పరస్పర సంబంధం మున్న ప్రముఖ సమస్యలకు సంబంధించినవి. మొదటిది పలు ప్రభుత్వ శాఖలలో పెరుగుచున్న విషయనిపుణుల పదవులలో వున్నాయనే వాస్తవాన్ని గుర్తించడం, అనేక పాలనా విషయాలలో ప్రత్యేకీకరణ పెరిగి విషయనిపుణత అవసరం వుండటం. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రభుత్వ పాలనలో విషయనిపుణులకు మరింత ఎక్కువగా అవకాశాలు ఇవ్వటం. రెండవది బ్రిటీషు సివిల్ సర్వీసుకు సంబంధించినది ఫుల్టన్ సంఘం పేర్కొన్నట్లు విషయనిపుణులకు సాధారణ పాలనలో ఉన్నత స్థానానికి చేరుకోటానికి ఉన్న హక్కులు అవకాశాలకు సంబంధించినది. ఈ ధోరణిని అభివృద్ధి చెందిన దేశాలలో కూడా గుర్తించవచ్చు.

క్రిస్ప్ విశ్లేషణల ప్రకారం ఈ రెండు అంశాల మధ్య పరస్పర సంబంధం వుంది. ఏ సందర్భంలో నైనా లాంచనప్రయామైన వ్యవస్థల్లో పనిచేసే విషయనిపుణుని పరిపాలకునిగా మార్పు చేయటానికి అవకాశం వుందా అనే మౌళిక ప్రశ్న ఉద్భవిస్తుంది. వాస్తవానికి వీరి మధ్య వున్న తేడాకు వ్యవస్థ ఉన్నతస్థాయిల్లో కాలం తీరింది. పాలనాఉన్నతస్థానాల్లోకి చలనం ఉన్నకొద్ది విషయనిపుణత కన్న కూడా విధానాలకు సంబంధించినది. సమస్య

BRAOU

ఏమిటంటే అధికారులనుంచి ప్రత్యేకీకరణ కల్గిన సాధారణ ఉద్యోగి లేదా సాధారణ లక్షణం కలిగిన విషయనిపుణుడుగా నైపుణ్యం పొందవలసిన అవసరం ఉంది. కాబట్టి విషయనిపుణుడు పాలనా విషయాలలో తగినంతగా శిక్షణపొంది,సాధారణ ఉద్యోగి విధులను సమర్థవంతగా నిర్వహించగలిగితే వారు పాలనా క్రమానుగత శ్రేణిలో ఉన్నతస్థానాలను చేరుకోగలరు. బ్రౌన్ అభిప్రాయంలో విషయనిపుణుడు తనకు సంబంధించిన రంగాలలో ప్రత్యేక సమస్యల ఎడల అవగాహన ఏర్పరుకోటానికి ఉత్సాహం ప్రదర్శిస్తుందని, పరిపాలనా పద్ధతులు తెలుసుకోవటంలో అతను వేరే రంగలో పొందిన శిక్షణవల్ల అంతసామర్థ్యం ఉండదని పేర్కొన్నాడు. ఈ సందర్భంగా వారి మధ్య ద్విభాజత్వానికి పరిష్కారంగా పరిపాలన సమర్థత పెంపొందించేందుకు ఇద్దరి అవసరమూ ఉంది కాబట్టి వారికున్న ప్రత్యేక అంశాల వల్ల పరిపాలనలో క్రమానుగత శ్రేణులను గుర్తించవలసిన అవసరం ఉందమో పరిశీలించాలని బ్రౌన్ పేర్కొన్నాడు. అతని అభిప్రాయం ప్రకారం మూడు వ్యవస్థా రూపాలున్నాయని పేర్కొన్నాడు. అవి :

1. ప్రత్యేక క్రమానుగత శ్రేణులు
2. సమాంతర క్రమానుగత శ్రేణులు
3. సమైక క్రమానుగత శ్రేణులు

అనేక దేశాలలో ఈ రెండు తరగతులకు చెందిన ఉద్యోగులుకల ప్రభుత్వ యంత్రాంగం పనిసులభతం చేయటానికి అనేక చర్యలు తీసుకోబడుతున్నాయి. మనదేశంలో వలే బ్రిటన్‌లో కూడా వీరిద్దరి విభిన్న తరగతులుగా సమాంతర, సమైక్య క్రమానుగత శ్రేణులేర్పాటు చేశారు. ఫ్రాన్సులో అంతస్సేవా శిక్షణ ఇస్తారు. కాబట్టినియామకం తర్వాత రెండు సర్వీసులకు సమాన ప్రాధాన్యత ఉంది. ఆస్ట్రేలియాలో విషయనిపుణునికి సాధారణ ఉద్యోగికన్నా ప్రాముఖ్యత ఇవ్వబడింది. సాధారణ ఉద్యోగి ఉన్నతస్థాయి పదవికి చేరాలంటే పోటీ పరీక్షలో ఉత్తీర్ణుడవ్వాలి. ఆ పరీక్షకు తయారవటమే అతనిని విషయనిపుణునిగా తయారుచేస్తుంది.

## అఖిలభారత కేంద్ర ప్రభుత్వ అధికారల సంఘ సమాఖ్య

ఈ భాగంలో వివరించిన విషయనిపుణులకు, కేంద్ర ప్రభుత్వ సాంకేతికపరం కాని సివిల్ సర్వీసు ఉద్యోగులకు వృత్తిపరమైన నేపథ్యం ఒకే రకమైంది కాదు. వాస్తవానికి ప్రతి సర్వీసు తన మూర్తి మత్వాన్ని, సంస్కృతిని, పెరుగుదలను ఏర్పరుచుకన్నాయి. కొద్దికాలంలోనే వారి మధ్య ఆశ్చర్యకరమైన ఏకత్వం నెలకొంది. వారిలో ప్రస్తుతమున్న సారూప్యతకు కారణం పరిపాలనలో ఐ.ఏ.యస్. ఉద్యోగి ప్రాముఖ్యత వహించటం. 1970 మార్చిలో విషయనిపుణుల సంఘాలన్నీ కలిసి అఖిలభారత కేంద్రప్రభుత్వ అధికారుల సంఘ సమాఖ్యను ఏర్పాటు చేసుకుని ఐ.ఏ.యస్. మోనో పలీని అంతమొందించాలని ప్రతిజ్ఞ పునాయి. దాని పరిణామం వల్ల వీరి మధ్య సరైన సంబంధాలుండాలనే ప్రశ్న ఐ.ఏ.యస్. ఇతర సర్వీసులుకు చెందిన అధికారుల మధ్య వివాదంగా మారింది. ఈ కారణంగానే ఈ సమాఖ్యలో ఐ.ఏ.యస్, ఐ.పి.యస్. ఐ.యఫ్.యస్. మరియు కేంద్ర సెక్రటేరియట్ సర్వీసుల ఉద్యోగుల చేరలేదు. ఈ సమాఖ్య తన ప్రవేశికలో బాధ్యాతాయుతంగా తమ బాధ్యతలు నెరవేర్చుతూ

BRAOU

a. దేశం త్వరితంగా అభివృద్ధి చెందాలంటె సమర్థవంతమైన అంకిత భావం కల పరిపాలనా యంత్రాంగం తప్పని సరి అని;

b. ప్రజాస్వామ్య అవసరాలకు అధికారయుతమైన బాధ్యతాయుతంకాని పరిపాలనా దృక్పధాలు పాతబడిన పద్ధతులు మరియు ప్రజావసరాలని ప్రతి బింబించని వ్యవస్థలేర్పడి సాధారణ అసమర్థతకు దారి తీస్తుందని;

c. ఆధునిక కాలంలో ప్రభుత్వకార్యకలాపాలు అనేక ప్రత్యేక రంగాలకు వ్యాపించటం వల్ల, పరిపాలన సమర్థవంతంగా జరగాలంటే, అన్నివర్గాల ఉద్యోగులు, తమకు చెందిన రంగాలలో క్రమశిక్షణతో కూడిన సామర్థ్యం వ్యక్తపరచటానికి అనువైన పరిపాలనావ్యవస్థ నిర్మాణం జరగాలని;

d. ప్రజాప్రభుత్వం ఎపుడైతే విషయనిపుణులనుంచి ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అనేక అంశాలలో ప్రత్యక్షంగా సలహాలు, సహకారం పొందుతుందో అపుడే సమర్థవంతమైన విధాన నిర్ణయాలు చేయబడతాయని;

e. ప్రభుత్వ కార్యక్రమాలలో వాస్తవంగా బరువు బాధ్యతలు మోపే అధికారులు, వారికి కావలసిన నైపుణ్యం ఉండటం వల్ల సమర్థవంతమైన పాలనావిధానం ఆవిర్భావానికి దోహదం చేస్తారని పేర్కొంది.

కాలక్రమేణా సాధారణ ఉద్యోగులు - విషయనిపుణులమధ్య ఘర్షణ పెరిగి అది 1966లో పరిపాలనా సంఘానికి నివేదించటంతో వారి మధ్య అంతరం మరింత పెరిగింది.

1980 సం.వరకు సమాఖ్య విషయనిపుణులు తదితర అధికారులకు సంబంధించిన విషాలకు ప్రాతినిథ్యం వహించటంలో ప్రముఖ పాత్ర వహించింది. ఈ సమాఖ్య కోర్కెలలో ప్రముఖంగా :

BRAOU

a. అధికారం, బాధ్యతల విషయంలో విషయనిపుణులకు సాధారణ ఉద్యోగులతో పాటు సమానావకాశాలు కల్పించే పరిపాలనావ్యవస్థ ఏర్పాటు చేయటం

b. శాస్త్ర మరియు సాంకేతిక రంగాల నుంచి పూర్తిగా లాభం పొందాలంటె పాలనా ఏర్పాట్లలో తగిన మార్పు చేస్తూ, ఆధునిక నిర్వహణ పద్ధతుల వలన దేశాన్ని త్వరితగతిని అభివృద్ధి చేయటం.

c. సమాఖ్య సభ్యుల మధ్య తన లక్ష్యాల కనుగుణంగా సహకార సమన్వయాలు పెంపొందించటానికి, అందరి సాధారణ ప్రయోజనాలను రక్షించుతూ వారికి పూర్తి అవకాశాలు కల్పించి తద్వారా దేశానికి సేవచేస్తూ వారికి రావలసిన వాటాను పొందటం.

## 16.6 వీరి పాత్రలపై పలు కమిటీల, సంఘాల అభిప్రాయాలు

వీరి పాత్రలపై ఉన్న వివాదాన్ని, విశ్లేషిస్తూ హరిద్వార్ రాయ్, ఎస్. పి.సింగ్, మూడు అభిప్రాయాల ద్వారా వివరించవచ్చు అని పేర్కొన్నారు. అవి

1. వారి సేవలకున్న సామాజిక అవసరం
2. సాపేక్షిక యోగ్యత
3. వారిని అభివృద్ధిపరచటానికి అవసరమైన ఉత్పాదకాలు

మూడవ వేతన సంఘం నివేదిక పై అసమ్మతి తెల్పిన ఎ.కె. దాస్ గుప్తా, నిహార్‌రంజన్‌రే లు విషయనిపుణులకు తగిన ప్రాముఖ్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వారి అభిప్రాయంలో రెవెన్యూ పాలన, శాంతి భద్రతలు, అత్యవసర సర్వీసుల పాలన సమాజానికి ముఖ్యమైనవనటంలో ఎవ్వరికి భిన్నాభిప్రాయం ఉండవలసిన అవసరం లేదని కాని వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా ప్రసారాలకు, వైద్య ఆరోగ్య ప్రాజెక్టుల నిర్మాణం, వాటి నిర్వహణ పైన పేర్కొన్న అంశాలకన్నా చాలా ప్రముఖమైనవి. కాబట్టి ఈ ప్రత్యేక విషయాల నిర్వహణలో పాల్గొనే వారికి ఏ విధంగాను తక్కువ వేతనం, ప్రతిపత్తి ఇవ్వటం సమంజసం కాదని పేర్కొన్నారు. ఎస్.ఎస్. ఝా అభిప్రాయంలో మెరిట్ సంబంధించి ఇంజనీరింగు విద్య ఎన్నుకున్నవారు ఐ.ఏ.యస్ కు అర్హత పొందే వారితో పోల్చితే ఏ విధంగా చూసినా ఉన్నతులని పేర్కొన్నాడు.

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషన్ 1970 వ దశకం మొదట్లో చేసిన విశ్లేషణ వల్ల ఐ.ఏ.యస్. లో 30 శాతం మంది మాత్రమే మొదటి తరగతి పట్టభద్రులని, అదే ఇంజనీరింగులో అయితే వారు 80 శాతం ఉన్నారని తేలింది. మరొక విషయం ఉత్పాదకాలకు సంబంధించిన అంశాలు (కాలం, ధనం) విషయనిపుణులుగా తయారవ్వాలంటే ఎక్కువ సమయం, వ్యయంతో కూడుకున్నదని, ఆ విధంగా చూసినా వారి జీతాలు, ప్రతిపత్తి సాధారణ ఉద్యోగి కన్నా తక్కువగా ఉండరాదని ఎస్.ఎస్. ఝా పేర్కొన్నాడు.

ఏ పాలనావ్యవస్థ అయినా విజయవంతం అవ్వాలంటే ఉద్యోగానికి -ఆ సాధారణ ఉద్యోగ విధులు నిర్వహించటానికి ఎంచుకునే మనిషికి మధ్య సత్సంబంధం ఉండాలి. మనకు వారసత్వంగా సంక్రమించి కొనసాగిస్తున్న వ్యవస్థ మారుతున్న పరిస్థితులకు అనుసరణీయత లోపించింది. అందుకే సాధారణ ఉద్యోగి ప్రాముఖ్యత వహిస్తున్నాడు. విషయనిపుణునికి విధాన ప్రక్రియలో ప్రముఖ పాత్ర ఇవ్వవలసిన అవసరం ఉంది.

ఉన్నతస్థాయి అధికారుల వివిధ నిర్వహణకు సామర్థ్యం అవసరం. అది విద్య, విధుల నైపుణ్యం, ప్రత్యేక శిక్షణ ద్వారా లభిస్తుంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా సాధారణ ఉద్యోగి పాలనా అనుభవం ద్వారా సంక్రమించే విషయజ్ఞానం పరిపూర్ణం కాదు. మరో ముఖ్య విషయం అధికారం బాధ్యత. రెండు సమపాళ్ళలో ఉండాలి. వాటి మధ్య సమతౌల్యం లోపిస్తే పని నిర్వహణలో సమర్థత లోపిస్తుంది. విషయనిపుణులకు బాధ్యతలే ఎక్కువ. అధికారం తక్కువ వారికి నియంత్రణాధికారం, వనరుల ఏర్పాటు, విధాన ప్రక్రియ మొదలైన విషయాలలో వారికి తగినంత పాత్ర కల్పించలేదు.

ఇంతకుముందే పేర్కొన్నట్లు, విషయనిపుణులకు సంబంధించి విషయాలపై పలు ప్రభుత్వ కమిటీలు కూడా తమ అభిప్రాయాలను వెలిబుచ్చాయి. రెండవ వేతన సంఘంకు (1957-59) విషయనిపుణులు మెమోరండం సమర్పించారు.

**దాని ముఖ్యాంశాలు :**

a. పరిపాలనా, కార్యనిర్వాహక పదవులలో విషయనిపుణులను స్వేచ్ఛగా నియమించటం.

b. విషయనిపుణులకు మంత్రులతో ప్రత్యక్ష సంబంధం కలిగించటం

c. విధాన ప్రక్రియలో వారికి తగిన పాత్ర కల్పించటం.

BRAOU

ఈ ప్రతిపాదనలకు రెండవ వేతన సంఘం ప్రతిస్పందిస్తూ ఈ క్రింది సూచనలు చేసింది :

a. సాంకేతిక పని ప్రముఖంగా ఉన్న శాఖల్లో సాంకేతిక అర్హతలున్నవారని ఆ శాఖల కార్యదర్శులుగా ఉండటం వాంఛనీయం.

b. పైన పేర్కొన్న శాఖలలో నియామకానికి సాంకేతిక అధికారులను మినహాయించక ప్రతిభ ప్రాతిపదికగా ఎన్నిక చేయాలి.

c. విషయనిపుణులకు మంత్రితో ప్రత్యక్ష సంబంధానికి అవకాశం కల్పించటమే కాక, విషయనిపుణులకు-సాధారణ ఉద్యోగుల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలను సమైఖ్య చర్యల ద్వారా మంత్రి సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించింది.

సుమారు 10 సం. ల తరువాత పార్లమెంటు అంచనాల సంఘం వీరి పాత్రలపై దృష్టిని సాదించింది. అతని వేదికలో ఈ సంఘం, విషయనిపుణులను పాలనా బాధ్యత పదవులలో అధికంగా నియమించాలని ఈ దిశగా తగు చర్యలు చేపట్టవలసిందిగా ప్రభుత్వాని సూచించింది. సాధారణ సర్వీసులైన ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్. ల్లో తామే అధికులమన్న భావన వల్లఅంతర్-సర్వీసుల పోటీ పెరుగుతుందని అందువల్ల అటువంటి భావనలో వదలుకుని, తమ శక్తి సామర్థ్యాల ద్వారా సేవ చేస్తూ ఉన్నత ఆశాయాలకు, విలువలకు కట్టుబడి ఇతరులకు ఆదర్శంగా ఉండాలని పేర్కొంది.

ప్రభుత్వం, అంచనాల సంఘం సూచనలకు జవాబు తెలియచేస్తూ ఈ సూచనలు అసాధారణమైనవి అని అంటూ, కొన్ని శాఖలలో ఉన్నత పదవులను విషయనిపుణులతోనే నింపబడుతున్నాయని కాని కొన్ని ఇతర శాఖలలో అమలుపరచటంలో వాస్తవంగా సమస్యలు ఉద్భవిస్తున్నాయని తెల్పింది.

వీరి పాత్రల మధ్య ఉన్న వివాదాల్ని పరిపాలనా సంస్కరణల సంఘం (1966) దృష్టికి తెస్తూ కులంకుషంగా పరిశీలించి సూచనలు చేయమని కోరడం జరిగింది. దీనికి సంబంధించి A.R.C చేసిన ముఖ్య సూచనలు :

a. కేంద్ర ప్రభుత్వ సర్వీసులన్నింటినీ 8 కార్యపరసర్వీసులుగా పునర్వ్యవస్థీకరించటం ఈ సూచనకు కొన్ని వర్గాలనుంచి తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది.

b. ఆధునిక కాలంలో ప్రస్తుతం కల అవసరం ఎక్కువ ప్రయోజనాత్మకమైన వృత్తిపరమైన ప్రగతి. ఇది అంత సంతృప్తికరంగా లేదు.

వీరి మధ్య వివాదం ప్రభుత్వ సిబ్బందిలోని కార్యపరమైన థృక్పథం అవసరాన్ని వక్కాణించేది కాని అది వారి మధ్య ఘర్షణ స్థాయికి చేరింది. ప్రస్తుతం పాలనను పీడిస్తున్న దుగ్మతల నివారణ సాధారణ ఉద్యోగి స్థానంలో విషయనిపుణునితో నియమించటం సహేతుకంకాదు. గత 20సం.లు పైగా మనకు కల అనుభవంనుంచి సరైన పాఠాలు నేర్చుకోవాలని A.R.C. పేర్కొంది. మనకు విషయనిపుణులు ఉన్నతస్థానాల్లో ఉన్న శాఖలు, వారు లేని శాఖలకన్నా సమర్థవంతంగా నిర్వహింపబడుతున్నాయనటానికి తగిన సాక్ష్యం ఉందా అని A.R.C. ప్రశ్నించింది. ఒకవేళ సాక్ష్యం కోసం ప్రయత్నించినా అవి వ్యక్తిగత అభిప్రాయాలే తప్ప తిరుగులేని సాక్ష్యాలుగా నిలువజాలవని పేర్కొంది. 1969లో పరిపాలనా సంస్కరణల సంఘం పలు సూచనలు చేసినా 1980 వరకు ఏ విధమైన తదుపరి చర్యలను ప్రభుత్వం చేపట్టలేదు. ఇంకో ప్రక్క వారి మధ్య అంతర్గత సమన్వయ సహకారాలు తరుచుగా విచ్ఛిన్నమవుతున్నాయి.

BRAOU

## 16.7 వీరిపాత్రలలో వస్తున్న మార్పులు

1977 సం. నుంచి 1987 సం. వరకు ఐ.ఏ.యస్. ఎంపికయిన అభ్యర్థులను పరిశీలిస్తే విషయనిపుణులైన ఇంజనీర్లు, వైద్యుల నిష్పత్తి కాలక్రమేణా పెరుగుతూ వస్తుంది. 1977 సం.లో ఐ.ఏ.యస్. కు ఎంపికయిన 707 మందిలో 54 మంది ఇంజనీర్లు, 4గురు వైద్యులు ఉన్నారు. 1982 కి వారి సంఖ్య వరుసగా 103, 16 కు పెరిగింది. కాగా 1987 వ సం.లో 175 మంది ఇంజనీర్లు (21.4 శాతం) 38 మంది వైద్యులు (4.6)శాతం ఐ.ఏ.యస్.కు ఎంపికయ్యారని తెలుస్తున్నది. దీనిని బట్టి విషయనిపుణ రంగాలలో పట్టభద్రులు, తమ సాంప్రదాయ రంగాలనుంచి అఖిల భారత సర్వీసుల మీదకు దృష్టి సారించారని గుర్తించవచ్చు. ఇదే పరిస్థితి కొంత కాలానికి విషయనిపుణులు అధికంగా ఐ.ఏ.యస్.కు ఎంపిక కాబడి ఏదో ఒక నాటికి ఈ పదవులలో ఆధిపత్యం చెలాయించటానికి అవకాశం ఉంది. వారుకూడా సంఖ్యాపరంగా సమతౌల్యాస్థితికి చేరుకునేసరికి వారి మధ్య వివాదాలు నూతన దశ చేరుకోటానికి ఆస్కారముంది.

ఈ మధ్య యూనియన్ పబ్లిక్ సర్వీసుకమీషను అనుసరించే పరీక్షా విధానాన్ని సమీక్షించిన ప్రొ. సతీష్ చంద్ర ఏక సభ్య సంఘం నివేదిక ప్రకారం అత్యధిక సంఖ్యలో ఇంజనీర్లు, వైద్యులు ఉన్నత సివిల్ సర్వీసులకు ఆకర్షితులనవున్నారని పేర్కొంది. ఇదే మన సామాజిక వ్యవస్థలో విషయనిపుణులకన్నా ప్రభుత్వ ఉద్యోగులకున్న అధిక ఆకర్షణకు నిదర్శనమని పేర్కొంది. ముఖ్యంగా 1987 సం. నుంచి ఐ.ఏ.యస్.కు ఎంపికైన అభ్యర్థులలో ఇంజనీర్లు, వైద్యుల సంఖ్య రెట్టింపు అయిందని పేర్కొంది. అలాగే 1992 లో మొదటి 20 స్థానాలలో ఉన్న ఐ.ఏ.యస్. అభ్యర్థులలో 12మంది ఇంజనీర్లు, ఒక వైద్యుడు, ఒక పశువైద్యుడు ఉన్నారు.

BRAOU

విషయనిపుణులకు వ్యతిరేకంగా ఉన్నవాదనే మంటే, వారి విద్యకు పెట్టె ఖర్చు అధికంగా ఉంటుందని, ప్రభుత్వపరంగా పెట్టె ఖర్చుకూడా ఎక్కువగా ఉంటుందని, కాబట్టి వీరిని వారి సాంప్రదాయ సాంకేతిక పర కెరీర్‌ని వదలిరావటానికి అనుమతించకపోవటం ఇంకో విధంగా చూస్తే దేశ పారిశ్రామికీకరణ త్వరితంగా జరుగుతుంది. కాన పాలనలో విషయనిపుణుల అవసరం అంతకు ముడుకన్నా ప్రస్తుతం ఎక్కువగా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు. మరో వాదన ప్రకారం దేశం మొత్తం మీద వైద్యుల కొరత ఉందని వారు పాలనా సర్వీసులలో చేరటం వైద్యరంగానికి నష్టంగా పరిగణించాలి. అయితే సతీష్ చంద్ర సంఘం ఈ వాదనను అంగీకరించలేదు. విషయనిపుణుల అత్యధిక సంఖ్యలో అఖిలభారత సర్వీసులలో ప్రవేశించటానికి అనుకూలంగా ఉన్న వారి వాదనలు ముఖ్యంగా మూడు. అవి :

1. విషయనిపుణులను సివిల్ సర్వీసు పరిధి నుంచి తొలగించటం సహేతుకంకాదు. ఎందువల్లంటే ప్రజ్ఞావంతులైన విద్యార్థులు సాధారణంగా ఇంజనీరింగ్ వైద్య విద్యలో ప్రవేశిస్తారు.
2. వారి పని నిర్వర్తన కూడా మిగితా వారితో సమాన స్థాయిలో ఉంది. లిఖిత పరీక్షలలో వారు మంచి ప్రతిభను కనపరుస్తున్నారు. కాని మౌఖిక పరీక్షలో సఫలీకృతులు కావటం లేదు.

3.1994 సం. నుంచి అఖిల భారత సర్వీసుల లిఖిత పరీక్షలలో వైద్య శాస్త్రం ఒక అంశంగా ప్రవేశ పెట్టవచ్చును.

# 16.8 సారాంశం

ఈ భాగంలో సాధారణ ఉద్యోగి -విషయనిపుణుడు, వారి పాత్రల మధ్య ఉన్న అంతరం గురించి విపులంగా చర్చించటం జరిగింది. భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న వలసపాలనలో స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రగతి పాలనలో వారి పాత్రలను వివరించటం జరిగింది. దీంతో పాటు స్వాతంత్ర్యానంతరం వారి పాత్రల పట్ల వెల్లడవుతున్న భిన్నవైఖరులు, వివాదాలు, ఈ సమస్యపై వివిధ సంఘాలు వెలిబుచ్చిన అభిప్రాయాలు పరిశీలించాం. ఈ మధ్య కాలంలో వారి పాత్రలలో వస్తున్న మార్పులు కూడా తెల్సుకున్నాం.

విషయనిపుణులు, సాధారణ ఉద్యోగుల మధ్య కొనసాగుతున్న ద్విభాజత్వాన్ని పరిష్కరించేందుకు కొందరు పాలనా విశ్లేషకులు ప్రయత్నిస్తూ ఉన్నారు. ఈ సందర్భంలో ఎస్. ఆర్. మహేశ్వరి చేసిన సూచన గమనించతగింది. మహేశ్వరి చేసిన సూచన ప్రకారం సాధారణ ఉద్యోగులు, విషయనిపుణులు అనే రెండు తరగతుల వ్యక్తులు, గణాలు ప్రాతిపదికపై విభజించారు. కాని ఈ విభజన కర్తవ్యాలు, విధుల ప్రాతిపదిక మీద జరిగితే ఎలాంటి సమస్య ఉత్పన్నమవదు. సాంకేతికపరమైన ఉద్యోగులకు సాంకేతిక నిపుణులు, విషయనిపుణులతో మాత్రమే భర్తీచేయాలి. కాగా ఉన్నత స్థాయి నిర్వహణ పాలనా ఉద్యోగాలను కేవలం ఏ ఒక్క క్యాడర్ లేదా సర్వీసుకు పరిమితం చేయకుండా వాటిలో తగిన అర్హతలు, ప్రతిభ కలిగిన అభ్యర్థులను వారి వృత్తి పరమైన నేపథ్యంతో సంబంధం లేకుండా నియమించాలి. ఈ ఉద్యోగాలకు నియమింపబడే అభ్యర్థులకు ఉండవలసిన అర్హతలు :

1. విభిన్న అభిప్రాయాల మధ్య ఏకత్వాన్ని సాధించే సామర్థ్యం
2. సాధారణ పౌరులు, రాజకీయ వేత్తలతో సమర్థవంతంగా వ్యవహరించగల నేర్పు
3. వైవిధ్య పూరితమైన పాలనానుభవం.

ఈ విధంగా పాలనా విశ్లేషకులు సాధారణ ఉద్యోగులు, విషయనిపుణుల మధ్య చెలరేగిన వివాదాన్ని తొలగించేందుకు పెక్కు సూచనలను చేసారు. ఈ సూచనలలో ఉత్తమమైన వాటిని, ఆచరణాత్మక మైన వాటిని ఎంపిక చేసి అమలు పర్చడం ఒక్కటే ఈ వివాదం సమసిపోయేందుకు పరిష్కార మార్గం.

ఈ పాఠ్యాంశంలో పొందుపర్చిన సమాచారం సాధారణ ఉద్యోగికి -విషయనిపుణునికి ఉన్న వివాదం బ్రిటీషు పాలన నుంచి వారసత్వంగా మనకు సంక్రమించిందనే వాస్తవాన్ని వెల్లడిస్తున్నది.

ప్రస్తుత పరిస్థితులలో విషయనిపుణులు -సాధారణ ఉద్యోగులు దేశ సామాజిక, ఆర్థిక ప్రగతికి సమానంగా సేవలందించాల్సిన అవసరాన్ని ఎవరూకాదనలేదు. ఈ రెండు తరగతుల ఉద్యోగులు తప్పుడు ఊహలైన స్వయం ప్రతిపత్తి, ఆధిపత్యంలను ప్రక్కకు నెట్టి దేశ ప్రగతిలో సమాన భాగస్వాములు కావాలి. విజ్ఞానమే అధికారానికి ప్రాతిపదికి అయినపుడు, వీరిద్దరూ విషయజ్ఞానంలో రెండు అంశాలకు ప్రతీకలు కనుక, అధికారాన్ని కూడా వారిద్దరూ సమానంగా పంచుకోవాలి. సాధారణ ఉద్యోగికి పాలనా సామర్థ్యం, విషయనిపుణునికి నైపుణ్యం విడదీయలేని అంతర్భాగాల వంటివి. ఏమైనా సుదీర్ఘ కాలంనుంచి కొనసాగుతూ వస్తున్న వారి పాత్రల మధ్య కల వివాదంలో ఇమిడి ఉన్న సమస్యలు పరిశీలించి తగినని వారణోపాయాలు చేపట్టటం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. ప్రభుత్వం తన కర్తవ్యాన్ని నిర్వర్తించక పోతే వీరి పాత్రల పట్ల చెలరేగుతున్న వివాదం పాలనా యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసే ప్రమాదం ఉంది.

BRAOU

రాజకీయ ప్రయోజనాల కొరకు వృత్తి పరమైన దృక్పథాన్ని వదలుకున్నారనే అభియోగం ఇరుపక్షాల పైనా మోపబడింది. ఈ సందర్భంలో వారు తమకు లేని నైపుణ్యాన్ని ఆపాదించుకోవటం ద్వారా ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. ఈ వాస్తవాన్ని విస్మరిస్తే ఈ అంశంపై జరుగుతున్న చర్చ మొత్తం పేలవం అవుతుంది. ఈ వాస్తవం భారతదేశానికి ఎక్కువ వర్తిస్తుంది. దీంతో పాటు ప్రభుత్వంలో సాంకేతిక పరమైన పదవులను ఆక్రమించిన ఉద్యోగులు అనుభవాన్ని నైపుణ్యంతో సమానంగా భావించటానికి ప్రయత్నిస్తున్నారు. ఉదాహరణకు ఇంజనీరింగ్ శాఖలో ప్రధాన ఇంజనీరు పదవిలో ఉన్న ఇంజనీరంగ్ పట్టభద్రుడు తన్ను తాను సంబంధింత రంగంలో అత్యున్నత నిపుణునిగా భావించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రతి రంగంలో సాధించిన వైజ్ఞానిక అభివృద్ధి దృష్టిలోకి తీసుకుంటె, మన నిపుణులందరూ కాలం చెల్లిన వారుగా గోచరిస్తారు. కాగా అత్యాధునికమైన వైజ్ఞానాన్ని సముపార్జించుకున్న వ్యక్తులందరూ దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థల నుంచి స్నాతకోత్తర స్థాయి లేదా డాక్ట రేటు స్థాయి విద్యను పూర్తిచేస్తున్న యువకులే. వైద్యరంగంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ రంగంలో శస్త్ర చికిత్స నిపుణులు, తదితర వైద్య నిపుణులు వైద్య విద్యారంగంలో చేపట్టిన అత్యాధునిక పరిశోధను ప్రభావానికి అతి స్వల్పంగా మాత్రమే గురయ్యారు. విదేశాలలో ఇటువంటి పరిస్థితులలో ఉన్న ప్రభుత్వాలు అనేక స్థాయిల్లోని ఉద్యోగాలలో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రవేశం కల్పించటం లేదా, వృత్తిలో అత్యంత నిపుణులైన వారి సలహాలను పొందటి జరుగుతున్నది.

## 16.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో జవాబు వ్రాయండి.

1. సాధారణ ఉద్యోగి-విషయనిపుణులెవరో వివరించి భారతదేశ ప్రగతి పాలనలో వారి పాత్రను వివరించండి.
2. సాధారణ ఉద్యోగి -విషయనిపుణుని పాత్రకున్న ద్విభాజత్వాన్ని వివరించి, మనదేశంలో వీరి పాత్రలలో వస్తున్న మార్పులు చర్చించండి.
3. సాధారణ ఉద్యోగి -విషయనిపుణుల పాత్ర వివాదాలపై పలు సంఘాల అభిప్రాయాలు వివరించండి.

II ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు వ్రాయండి

1. విషయనిపుణుని పాత్ర
2. అఖిల భారత కేంద్ర ప్రభుత్వ అధికారుల సంఘ సమాఖ్య
3. సతీష్ చంద్ర కమిటీ నివేదిక

BRAOU

## 16.10 చదువదగిన రచనలు

1. R.B. Jain : Contemporary Issues in Indian Administration, Visual Pubs. New Delhi,1976, PP 185-205

2. Haridwar Rai & Sakendreprasad Singh : Current Ideas and Issues in Public Administration, Uppal Pubs. Delhi, 1979

3. S.R. Maheswari : Indian Administration, Orient Longman, New Delhi, 1979 PP 131-150

4. A.P. Paracer : "Role of Generalists and Specialists in Public-Administration", The Indian Journal of Public Administration Vol XX1, No.2, April - June 1975, PP 197-207

5. L.K. Jha : " The Administrator as Specialists" Management in Government, Vol. X II No.2, July-Sep 1980, PP 99-109

6. David Judge : " Specialists and Generalists in British Central Government A Political Debate" Public Administration, Vol. 59 Spreing, 1981,PP 1-14

7. A. Avasthi and S.R. Maheshwari : Public Administration, Lakshmi Narain Agarwal, Agra, 1980, PP 355-366.

8. Usha Rai : " Doctors, Engineers succumb to Civil Services glamour, "Indian Express, Oct 28, 1992 (Vijayawada) PP land 9.

BRAOU

రచయిత : బి.పి.సి. బోస్.

# భాగం - 17: ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం

## విషయ క్రమం


17.0 లక్ష్యాలు
17.1 పరిచయం
17.2 ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం అంటే ఏమిటి ?
17.3 ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్యం అవసరమేమిటి ?
17.4 కొన్ని దేశాలలో ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం
17.4.1 బ్రిటన్‌లో
17.4.2 అమెరికాలో
17.4.3 భారతదేశంలో
17.5 ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం -పరిమితులు
17.6 సారాంశం
17.7 నమూనా పరీక్షా ప్రశ్నలు
17.8 చదువదగిన రచనలు


## 17.0 లక్ష్యాలు

BRAOU

ఈ భాగం చదివిన తరువాత మీరు

* ప్రాతినిత్య ఉద్యోగిస్వామ్య అర్థం
* అవసరం
* అంతర్జాతీయ ముఖచిత్రం
* పరిమితుల గురించి తెలుసుకుంటారు.

## 17.1 పరిచయం

ప్రభుత్వ పాలనాధ్యయనం చేసే విద్యార్థులందరికీ ఉద్యోగి స్వామ్యం చిరపరచితమే. ఉద్యోగి స్వామ్యం ప్రభుత్వ పాలనకు ఒక ఉపకరణంగా మాత్రమే గాక పాలనను జరిపించే విధానం కూడా. పరిపాలన మొత్తం ఉద్యోగి స్వామ్యం ఉద్యోగి స్వామ్యం ద్వారా జరగడంతో రాజ్యవ్యవస్థలో అది ఒక దృఢమైన వ్యవస్థగా రూపాంతరం చెంది, తనకుగల పాలనా నైపుణ్యంతో ఆధునిక సమాజాలలో ఒక అధికార కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఉద్యోగి స్వామ్య సహాయం లేకుండా ఏ ప్రభుత్వము మనజాలదు. ఏ రాజకీయాధికారి తన అధికారాన్ని కొనసాగించ లేరనే విషయం సర్వవిదితం. సాధారణ పౌరులు కూడా రాజకీయాధికారుల కంటే పాలనా ఉద్యోగులతోనే ఎక్కువ సంబంధాలను కలిగి వుండవలసిన రీతిలో నేటి ఉద్యోగి స్వామ్యం విస్తరించబడింది.

రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరంగా వుండడానికి ప్రజాసమస్యల పట్ల ప్రతిస్పందన, బాధ్యతాయుతంగా వ్యవహరించటంతో పాటు ఉద్యోగి స్వామ్యం కూడా ప్రజలకు ప్రాతినిథ్యం వహించవలసి వుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్యాలు మొదటి రెండు లక్షణాలను గుర్తించాయి. కాని ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్య అవసరాన్ని గమనంలో వుంచుకోవడం లేదు. ఉద్యోగి స్వామ్యం ఆ దేశంలోని సామాజిక పొందికకు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణమైన రీతిలో ప్రాతినిథ్యం వహించినపుడు మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా మనుగడ సాధించగలుగుతుంది. ఉద్యోగి స్వామ్యం ఒక సంఘటితమైన వ్యవస్థగా ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలోని కీలకమైన అంగంగా ఆవిర్భవించడంతో, ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం ప్రాధాన్యత ఆవశ్యకతలపై నూతన అధ్యనాలు వెలవడ్డాయి.

## 17.2 ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం అంటే ఏమిటి ?

నేడు ఉద్యోగి స్వామ్యం కూడా ప్రభుత్వం వలెనే ప్రజాసమస్యల పట్ల సక్రమంగా ప్రతిస్పందించడం, బాధ్యాతాయుతంగా వ్యవహరించడం మాత్రమే గాక ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించేటట్లు వ్యవహరించాలి. ప్రజలచేత ఎన్నుకొనబడిన రాజకీయాధికారుల ద్వారా ఆధునిక ఉద్యోగి స్వామ్యం తానుకూడా ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తూ, రాజకీయాధికారులు నిర్ణయాలు గైకొనడంలో సహకరిస్తూ ఆ నిర్ణయాలను అమలు చేసే ప్రక్రియను చేబడుతుంది. ఈ విధానం పరోక్షంగా ప్రజలకు ప్రాతినిథ్యం వహించేటట్లుగా ఉన్నప్పటికి, ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం ప్రజాస్వామ్య దేశాలలో ఇంకా ఏర్పడలేదు. ఆయా దేశాలలోని ప్రజల సామాజిక పొందికకు అనుగుణంగా ఉద్యోగి స్వామ్యం ఉండడాన్నే ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యమని అంటారు. మన దేశం వంటి మూడవ ప్రపంచ దేశాలలో మాత్రమే గాక, అభివృద్ధి చెందిన దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్‌లలో కూడా ఉన్నతోద్యోగాలు, సివిల్ సర్వీస్‌లలో సక్రమంగా ప్రాతినిథ్యం వహించడం లేదని, ఉన్నతాదాయ వర్గాలు వారే అత్యధికంగా వున్నారని అనేక అధ్యాయనాలు వెల్లడించాయి.

ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యాన్ని ఖచ్చితంగా వివరించే నిర్వచనాలు లేకపోయినప్పటికి పలువురు పరిశోధకులు వివరణాత్మకంగా తెలియపరచారు. దేశంలోని కుల, వర్గ, మత సమూహాలన్నింటికి జనాభాలోని వారి శాతాన్ని బట్టి దామాషా పద్ధతిలో సివిల్‌సర్వీస్‌లలో ప్రాతినిథ్యం కల్పించడమని, లేదా దేశంలోని వివిధ మతాలు, జాతులకు దామాషా ప్రకారం ప్రభుత్వోద్యోగాలలో భాగం కల్పించడమని కూడా చెప్పుకోవచ్చును. దేశంలోని ప్రభుత్వోద్యోగాలు ప్రత్యేకించి సివిల్ సర్వీస్‌లు కొన్ని వర్గాల వారికే అందుబాటులో ఉండకుండా మొత్తం ప్రజలందరికి ప్రాతినిథ్యం వహించాలన్నదే 'ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం' రాజకీయాధిపత్యం లోనే గాక పాలనా పరంగా కూడా సమాజంలోని అన్ని వర్గాలకూ సముచిత ప్రాతినిథ్యం కల్పించాలనేదే దీని ప్రధానోద్దేశం.

'ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం' అనే పదాన్ని మొట్టమొదట డొనాల్డ్ జె. కింగ్‌స్లే 1944 లో 'ప్రాతినిథ్యం ఉద్యోగి స్వామ్యం' అనే పుస్తకం ప్రచురించడం ద్వారా ప్రాచుర్యంలోకి తెచ్చాడు. ఇంగ్లాండులోని ఉద్యోగి స్వామ్యంలో మార్పుకు కాంక్షిస్తూ, 'ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం మాత్రమే ప్రజల భావాలను సక్రమంగా ప్రతిబింబిస్తుందని, రాజకీయాధికార మార్పు జరిగినపుడు, నూతన ప్రభుత్వ లక్ష్యాలను సక్రమంగా అమలు పరిచగలుగుతుందని ఆయన పేర్కొన్నాడు. ఉద్యోగి స్వామ్యం సమాజంలోని ఒక వర్గానికే తాము ప్రాతినిథ్యం వహించినపుడు రాజకీయ మార్పులకు అనుగుణంగా కాక, తాము ప్రాతినిత్యం వహించే వర్గాల అవసరాలను తీర్చే విధంగా మాత్రమే వ్యవహరిస్తారని, అందువలన ప్రజలనుండి, ప్రభుత్వం నుండి వేరు పడుతుందని కెంగ్‌స్లే భావించాడు. ప్రజాస్వామ్య పాలనకు

BRAOU

నైపుణ్యంగల అధికారులు మాత్రమే గాక ప్రాతినిధ్యం కూడా అవసరమని నొక్కి చెప్పాడు. ప్రజాస్వామ్య రాజ్యాలలోని ఉద్యోగులు సామాజిక పొందికకు అనుగుణంగా వున్నప్పుడు మాత్రమే ఉద్యోగి స్వామ్యం ఒక వర్గం గానో లేక శిష్టజల సమూహంగానో వుండే పరిస్థితినుండి ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రాతినిధ్యం మనే పదం ఉద్యోగి స్వామ్య సారస్వతంలో చాలాకాలం నుండి వినియోగించబడుతుంది. ఉదాహరణకు మాక్స్‌వెబర్ నాలుగు రకాల ప్రాతినిధ్యం గురించి వివరించాడు. అవి 1. సముచిత ప్రాతినిధ్యం: వంశపారంపర్యంగా సంక్రమించే విధానం. 2. సామాజికంగా ఉన్నత స్థానంలో వున్నవారికి ప్రాతినిధ్యం: సామాజికంగా ఉన్నత వర్గాలలో వున్నవారు తమ హక్కులను కొనసాగించుకునే విధానం 3. ఉత్తర్వులు లేక ఆదేశాల ప్రకారం ప్రాతినిధ్యం. 4. స్వేచ్ఛా ప్రాతినిధ్యం: ఈ నాల్గింటిలో మొదటి మూడు ప్రాచీన కాలంలోని రాజ్యాల అవసరాలకు అనుగుణంగా వుండగా నాల్గవది ఆధునిక ప్రజాస్వామ్య దేశాలలో అమలులో వుంది.

## 17.3 ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం అవసరం ఏమిటి ?

ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం అనేక విధాలుగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాస్వామ్య వ్యవస్థను, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలుగా శాసనసభలు, పార్లమెంటు అధికారంలో వున్న రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యంగా ఒక మంత్రివర్గం వుంటున్నపుడు అదే విధంగా సివిల్ సర్వీస్‌లలో కూడా ప్రజలలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం అవసరం వుందనేది ఒక వాదన. ఉద్యోగి స్వామ్యం సక్రమంగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించపోతే దేశ రాజకీయ వ్యవస్థ కూడా ప్రజాస్వామ్య యుతంగా లేనట్లే భావించవలసి వుంటుంది. కింగ్‌స్లే వివరించినట్లు మారుతున్న ప్రజల భావాలా ప్రభుత్వాలను మార్చివేస్తాయి. క్రొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ కార్యక్రమాలను ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం మాత్రమే సక్రమంగా అమలు పరచగలుగుతుంది.

BRAOU

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అమలు పరచే అభివృద్ధికర సంక్షేమ కార్యక్రమాలు సమాజంలోను అట్టడుగు వర్గాలు, బలహీనవర్గాల కోసం వుద్దేశించబడినది. అయా వర్గాలు ఉద్యోగి స్వామ్యంలో ప్రాతినిధ్యం వహించినపుడు మాత్రమే ఆ పథకాలు సక్రమంగా అమలు చేయబడి వాటి ఫలితాలు పేద ప్రజానీకం వద్దకు అందించబడతాయి. ఆధునిక ప్రజాస్వామ్యం ఈ భావన పైననె వయోజలనులందరి చేత ఎన్నుకోబడి మొత్తం ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించబడుతుంది.

ప్రాతినిధ్యం ఉద్యోగి స్వామ్య భావన బ్రిటన్‌లో రెండవ ప్రపంచయుద్ధకాలంలోను, భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మాత్రమే ఏర్పడడానికి ప్రధాన కారణం. ప్రజాస్వామ్య ప్రభుత్వాలన్ని సంక్షేమ ప్రభుత్వాలుగా మారడమే. ప్రజాస్వామ్య పునాదిపై ఏర్పడిన ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహించే మంత్రులు ప్రజలు ఆశయాలకు అనుగుణమైన ఉద్యోగి స్వానమ్యాన్ని కోరుకోవడం వలననే. స్థానిక, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలకు ఎన్నిక కాబడిన సభ్యులు తమను గెలిపించడానికి తోడ్పడిన పేద ప్రజల, బడుగు వర్గాల అవసరాలను తీర్చవలసని భాద్యత ఉండడంతో అందుకు అనుగుణమైన కార్యకలాపాల రూపకల్పన చేసే ఉద్యోగి స్వామ్యాన్ని ఏర్పరుచుకోవాలని భావించడం ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యానికి భావపునాది. పేద ప్రజల జీవన విధానంలో సంబంధం లేని ఉద్యోగి స్వామ్యం సరైన విధంగా రాజకీయ నాయకులకు తోడ్పడక పోవడంతో రాజకీయ-ఉద్యోగి సంబంధాలు సంక్షోభ దశకు చేరుకుని, ఫలితంగా ఉన్నతోద్యోగులు రాజకీయ నాయకత్వం పట్ల విశ్వాస రాహిత్యం ప్రకటించే స్థితి ఏర్పడుతుంది. బ్రిటన్,

భారతదేశంలోని రాజకీయ పాలనా విషయాలపై ప్రచురించబడ్డ అనేక గ్రంథాలు ఈ విధమైన అధికార-అనాధికారుల మధ్య ఏర్పడిన వైరుధ్య పూరిత ఘర్షణలను, ఉద్యోగుల విశ్వాసరాహిత్యాన్ని వివరించాయి. ఈ ఘర్షణలు ఉత్పన్నం కాకుండా వుండటానికి 'ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం' అవసరమవుతుంది.

వివిధ దేశాలలో ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం పరిస్థితిని మనం ఈ భాగాలలో పరిశీలిద్దాము.

## 17.4 కొన్ని దేశాలలో ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం

### 17.4.1 బ్రిటన్‌లో

బ్రిటన్ ఉద్యోగి స్వామ్యం తొలుత సమాజంలోని ఉన్నత వర్గాలకే ప్రాతినిధ్యం వహించింది. పేద, మధ్య తరగతి, అల్పాదాయవర్గాల వారికి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం 1950 వ దశకంలో లభించిన తరువాత మాత్రమే వారిని ప్రాతినిధ్యం లభించింది. బ్రిటన్‌లోని పబ్లిక్ స్కూల్ స్వల్పజన పరిపాలనకు అవసరమైన పాలనోద్యోగులను తయారుచేసే సముచిత విద్యా ఉపకరణంగా ప్రముఖ తత్త్వవేత్త బెట్రండ్ రస్సెల్ అభివర్ణించాడు. ఈ విధానం 1944 విద్యాచట్టం ద్వారా అంతమై అల్పాదాయ వర్గాల కూడా అందుబాటులో వుండే రీతిలో విశ్వవిద్యాలయ విద్యను సరళతరం చేయడంతో పరిస్థితిలో మార్పు సంభవించింది. అల్పాదాయ వర్గాల విద్యార్థులు పోటీ పక్షల ద్వారా, పదోన్నతి ద్వారా సబార్డినేట్ క్లాస్ ఉద్యోగులు సివిల్ సర్వీస్‌ల లోనికి ప్రవేశిస్తున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఉద్భవించిన సంక్షేమ రాజ్యభావన వలన కార్మిక కుటుంబాల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు లభించడం కూడా ఇందుకు తోడ్పడింది. అదే సమయంలో ఆక్స్‌ఫర్డ్ , కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు లభించినంత సులభంగా ఇతర విద్యార్థులకు ఉన్నతోద్యోగాలు లభించకపోవడం బ్రిటన్‌లో నేటికీ కొనసాగుతుంది. ఇతర విశ్వవిద్యాలయ విద్యార్థులు తాము ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విద్యార్థులకు పోటీగా నిలబడలేమనే భావనకు గురికావడం కూడా దీనికి తోడ్పడుతుంది. 1971-75 మధ్య కాలంలోని సివిల్ సర్వీస్ ఉద్యోగుల అప్లికేషన్ ఫారాలలో ఐదింటి ఒక వంతు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విద్యార్థులు కాగా, ఫలితాలలో వారు యాభైశాతానికి పైగా ప్రాతినిధ్యం వహించారు. పాలనా వర్గంలోకి క్రింది తరగతుల ఉద్యోగులను ప్రమోట్ చేయడం వలన మాత్రమే ఇతర విశ్వవిద్యాలయాలు, అల్పాదాయ వర్గాల సంతతి ఉన్నతోద్యోగాలలోకి ప్రవేశించడం గమనిస్తే బ్రిటన్ పాలనా వర్గం ఎంతగా శిష్టజన వర్గంతో నిండిపోయిందని గుర్తించవచ్చు.

### 17.4.2 అమెరికాలో

పాల్ పి. వాన్‌రైపర్ అమెరికన్ ఫెడరల్ సివిల్ సర్వీస్‌ను ప్రపంచంలోనే ప్రాతినిధ్యం ఉద్యోగి స్వామ్యానికి అత్యుత్తమ ఉదాహరణ అని ప్రకటించారు. సమాజంలోని అన్ని మతాలు, జాతుల వర్గాల ప్రాంతాల, వృత్తుల వర్గాలకు సివిల్ సర్వీస్‌లలో సక్రమ ప్రాతినిధ్యం కల్పించబడింది. అమెరికన్ ఉద్యోగి స్వామ్యం అమెరికన్ సమాజానికి సక్రమంగా ప్రాతినిధ్యం వహిస్తుందని కూడా రైపర్ అన్నాడు. మరికొంత మంది పరిశోధకులు అమెరికన్ కాంగ్రెస్ కంటె, ఉద్యోగి స్వామ్యంలోనే అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించిందని పేర్కొన్నారు.

BRAOU

ఇతర దేశాలతో పోల్చినపుడు అమెరికన్ ఉద్యోగి స్వామ్యం ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యంగా చెప్పుకున్నప్పటికి అమెరికన్ పాలనా వ్యవస్థ ప్రత్యేకతలను అర్థం చేసుకున్నపుడు, దానిని ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యానికి నమూనా గా అంగీకరించలేము. అమెరికన్ విద్యావ్యవస్థ అందరికీ విద్యావకాశాలు కల్పించినప్పటికి ఉద్యోగి స్వామ్యం లో సమాన ప్రాతినిధ్యం కల్పించబడలేదు. మరొక ప్రధాన విషయమేమంటే అమెరికన్ ప్రభుత్వపాలనా వ్యవస్థ 1.ఫెడరల్ 2. రాష్ట్ర 3. స్థానిక ఉద్యోగాలనే మూడు భాగాలుగా విభజింపబడివుండడం, అందునా ఏకీకృతమైన సివిల్ వ్యవస్థ అమెరికాలో ఇటీవలే ఏర్పడడం, ప్రజలలో కొద్ది శాతం మందికే ప్రభుత్వోద్యోగాలలో అవకాశం లభించడం వలన అమెరికన్ వ్యవస్థను ఒక నమూనాగా తీసుకోలేమని కొందరు భావించారు. అమెరికన్లు ప్రభుత్వోద్యోగాల కంటె స్వయం ఉపాధి, స్వంత వ్యాపారం మొదలైన వ్యాపకాలకు ప్రాధాన్యత నివ్వడం కూడా కద్దు. ప్రభుత్వ పాలనా కూడా వృత్తి నైపుణ్యానికి, సాంకేతిక పరమైన ఉద్యోగాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో, ఉద్యోగస్తులు కూడా తరుచుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటిలోను తమ అవకాశాలను బట్టి మారుతూ వున్నారు. ఇటీవలి కాలంలో అమెరికాలో కూడా జాత్యహంకార లక్షణాలు పొడసూపటం, నల్లజాతి వారు తమకు లభించవలసినంతగా అధికారంలో, ఉద్యోగాలలో వాటా లభించడం లేదనే అసంతృప్తి కలిగి వుండడం, ఇవి జాతి ఘర్షణలకు దారి తీయడం మనం గమనించవచ్చును. ప్రభుత్వోద్యోగాలలో కార్మిక వర్గం, ఇతర అల్పాదాయ వర్గాల సంతతికి అమెరికా బ్రిటన్‌లలో కూడా తగినంతగా ప్రాముఖ్యత లభించటం లేదనే విషయం ప్రస్తుతం ఆయా దేశాలలో ఏర్పడుతున్న జాతి ఘర్షణలు వైరుధ్యాలను బట్టి అర్థం చేసుకోవచ్చు.

## 17.4.3 భారతదేశంలో

భారతదేశంలోని సివిల్ సర్వీస్‌లు ఇతర ఉన్నతోద్యోగాలలోని సామాజిక పొందిక పై జరిపిన అధ్యయనాలు, పరిశోధనలు చాలా స్వల్పం. మొత్తం మీద భారత పాలనావ్యవస్థలోని ఉన్నతోద్యోగాలన్నింటిలో అగ్రకులాలు, అధికాదాయ కుటుంబాలు, పట్టణ వాసుల సంతతే అధికంగా ఉందనేది ఒప్పుకోవలసిన విషయం. వెనుకబడిన వర్గాలు, నిమ్నకులాలు, గ్రామీణ పేదల సంతతి సివిల్ సర్వీస్‌లలో అత్యల్పశాతానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తోంది.

BRAOU

భారతీయుల రాజ్యాంగాన్ని తయారుచేసుకునే హక్కును కల్పిస్తూ బ్రిటీష్ ప్రధానమంత్రి అట్లీ 1946 మార్చి 15 న ప్రకటించడంతో భారతదేశంలోని ప్రభుత్వ సర్వీస్‌ల విషయం ప్రముఖంగా చర్చకు వచ్చింది. అప్పటి ప్రభుత్వ సర్వీస్‌లు మూడు వర్గాల వారికి ప్రాతినిధ్యం వహించేవి. 1.యూరోపియన్లు 2. ముస్లింలు 3. హిందువులు ఇతర కులాల వారు. స్వతంత్ర భారత రాజ్యాంగం దేశంలోని విద్యార్థికులందరినీ పోటి పరీక్షల ద్వారా సివిల్ సర్వీస్‌ల ఎంపిక చేపట్టిన నాటినుండి సమాజంలోని వివిధ వర్గాల వారికి ప్రాతినిధ్యం లభించడం మొదలైంది. భారతదేశంలోని ఉన్నతోద్యోగాల భర్తీ విధానం గురించి నియమించబడ్డ ప్రొఫెసర్ సతీష్ చంద్ర కమిటీ 1989 లో నివేదికను సమర్పిస్తూ అఖిలభారత సర్వీస్‌లు, కేంద్ర సర్వీస్‌లలో వివిధ వర్గాల వారికి లభిస్తున్న ప్రాతినిధ్యం గురించి వివరాలు తెలియపరిచింది. హరిజన, గిరిజన వర్గాల భర్తీకి సంబంధించి 1979-87 మధ్య కాలంలో 7298 మంది వివిధ సర్వీసుల కొరకు ఎంపిక చేయబడగా వారిలో 1220 మంది హరిజనులు కాగా 665 మంది గిరిజనులు. 1983-87 మధ్య కాలంలో 6 నుండి 16 శాతం హరిజన అభ్యర్థులు, 3 నుండి 9 శాతం మంది గిరిజన అభ్యర్థులు వివిధ పోస్టులలోకి ఎంపిక చేయబడ్డారు. 1984-87 మధ్య కాలంలో జనరల్ అభ్యర్థులలో 20 శాతం మంది, హరిజనులలో 55 శాతం మంది, గిరిజనులలో 48 శాతం మంది అల్పాదాయ వర్గాల కుటుంబాల నుండి వచ్చిన వారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మొదటి తరం విద్యార్థులు 1987 లో 66 మంది ఎంపిక కావడం, అదే విధంగా 1955 లో నలుగురు స్త్రీలు

మాత్రమే ఉన్నతోద్యోగాలలో వుండగా 1987 నాటికి వారి సంఖ్య 120 కి పెరిగింది. కాగా 1988 లో స్త్రీలు 16 శాతానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ గణాంకాల ఆధారంగా చూసినట్లయితే భారత ఉద్యోగి స్వామ్యం ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పవచ్చు.

పై వివరాల ఆధారంగా చూసినప్పటికి భారతదేశంలోని ఉన్నతోద్యోగాలలో అధికాదాయ వర్గాలు, పట్టణప్రాంతాల వారి అధిక్యత హరిజన, గిరిజన విద్యార్థులలో కూడా కన్పిస్తుంది. ఈ పరిస్థితికి నాలుగు ప్రధానకారణాలను చెప్పకోవచ్చు. అవి 1. ఉన్నత విద్యావకాశాలు గ్రామీణ, వెనుకబడిన తరగతుల వారికి ఇటీవలి వరకు అవకాశాలు లభించక పోవడం, 2. ప్రాథమిక - మాధ్యమిక విద్యను మధ్యలోనే మానివేసే వారి సంఖ్య అధికంగా వుండడం 3. ఉన్నతోద్యోగాలకు దరఖాస్తు చేయడానికి కనీస అర్హత గ్రాడ్యుయేషన్ అయినప్పటికి ప్రశ్నాపత్రాలు పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో వుండడం 4.గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరువాత పోటీ పరీక్షలకు మరొక రెండు, మూడు సంవత్సరాల పాటు చదువవలిసి రావడంతో అందుకు తగిన ఆర్థిక స్తోమత లేక ఏదో ఒక ఉద్యోగంతో సరిపెట్టుకోవడం మొదలైంది.

ఈ పరిస్థితులను గమనంలో వుంచుకుని వయోపరిమితిని పెంచటం, ఉచితంగా దరఖాస్తు సౌకర్యం కల్గించడం, నివాసప్రాంతం గురించిన సక్రమ రికార్డు లేక పోయినా అంగీకరించడం వంటి రాయితీలను హరిజన, గిరిజన వర్గాలకు కేంద్ర రాష్ట్ర ఉద్యోగాలలో ప్రభుత్వం కల్పించింది. అంతేగాక వివిధ విశ్వవిద్యాలయాలలో పోటీ పరీక్షలకు సమాయత్తం కావడానికి అవసరమైన కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి హాజరయ్యే హరిజన గిరిజన, బలహీన వర్గాల వారికి ఉపకారవేతనాలను కల్పించారు. ఉద్యోగాలలో చేరిన అనంతరం వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను, ప్రమోషన్లకు అవసరమైన విధంగా ప్రవేశానంతర శిక్షణను కల్పించే అవకాశాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ వర్గాల వారికి ఉద్యోగాలలో ఎదురయ్యే వివిధ క్లేశాలను నివారించడానికి అవసరమయ్యే యంత్రాంగం కల్పించబడింది. దేశం మొత్తం మీద హరిజన, గిరిజన ఉద్యోగుల భర్తీకి సంబంధించిన విషయాలను పరిశీలించే నిమిత్తం 1978 లో కేంద్ర ప్రభుత్వం ఒక కమీషన్ ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ దేశంలోని వివిధ శాఖల భర్తీలో సక్రమంగా రిజర్వేషన్లు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలన జరిపి నివేదిక తయారు చేస్తారు. ఏ శాఖలోనైనా ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్ సక్రమంగా అమలు జరుపక పోతే ఆయా అధికారుల పై చర్య తీసుకునే హక్కు ఈ కమీషనుకు వుంది. ఇదే విధంగా బలహీన వర్గాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అఖిలభారత సర్వీస్‌లు, కేంద్ర సర్వీస్‌లలో రిజర్వేషన్ కల్పిస్తూ, వారికి కూడా ఒక కమీషన్‌ను నియమించింది. ఫలితంగా ప్రభుత్వం ప్రకటించే రాయితీలు, ఉపకారవేతనాలు, విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ల వలన భారతదేశ ఉద్యోగి స్వామ్యం కూడా ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యంగా అవతరించే మార్గం ఏర్పడింది.

BRAOU

## 17.5 ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం - పరిమితులు

సూత్రరీత్యా ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం అవసరాన్ని అంగీకరించినప్పటికి దాని అమలులో ఏర్పడే చిక్కులను కూడా గమనంలో వుంచుకోవాలి. సాధారణ ప్రభుత్వోద్యోగాలలో వయస్సు, గ్రాడ్యుయేషన్ విద్య మొదలైన అర్హతలను బట్టి ఎంపిక చేయడం జరుగుతుంది. కాని ప్రత్యేకతగల, నైపుణ్యం అవసరమయిన ఉద్యోగాలలో ప్రత్యేకార్హతలను బట్టి ఎంపిక చేయవలసి వుంటుంది. ఉదాహరణకు సాంకేతిక నైపుణ్యం, అంతరిక్ష పరిశోధనా రంగం, ఇంజనీరింగ్, గణాంకశాస్త్రం, కంప్యూటర్ విశ్లేషణ మొదలైన రంగాలలో ఆయారంగాలతో పరిచయం వున్నవారికే ప్రాధాన్యత ఇవ్వవలిసి వస్తుంది. దేశంలోని గ్రామీణ పేదలు, ఇతర బలహీన వర్గాల సంతతి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కారణాల వలన

యూనివర్సిటీ స్థాయి వరకు రావడమే దుర్లభమవుతున్న నేటి పరిస్థితిలో నూతనంగా వస్తోన్న వివిధ రకాల సాంకేతిక విద్యను అభ్యసించడం కష్టసాధ్యమవుతుంది. ఫలితంగా ఆయా రంగాలలో ఉద్యోగావకాశాలున్నప్పటికి అభ్యర్థులు లేని స్థితి ఎదురవుతోంది. అందువలన ప్రభుత్వం వివిధ శాఖలలోను, ప్రభుత్వరంగ సంస్థలలోను ఆయా వర్గాల కోసం ప్రత్యేక ప్రకటనలను జారీ చేస్తుండడం మనం గమనించవచ్చు.

సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు ప్రభుత్వపాలనకు ప్రభావిత మొనరుస్తాయి. ప్రభుత్వ పాలనా నిర్వహణ గతం కంటే భిన్నంగాను సంక్లిష్టంగాను అవుతున్న విషయం మనందరికీ తెలుసు. నిర్వహణా పద్ధతులలో రాను రాను సునిశితత్వం చోటుచేసుకుంటోంది. అందుకే ఛెస్టర్ బర్నార్డ్ సాంకేతిక పరిశోధనా ఫలితాలను, నిర్వహణా పద్ధతులలో మిళితం చేయవలసి వుంటుందని చెప్పాడు. మారుతున్న పరిస్థితులతో నిర్వహణా విధులను సమర్థవంతంగా సాగించడం అత్యంత శ్రమతో కూడుకుంటోంది. క్రింది ఉద్యోగులతో పని చేయించాలంటే వారి అవసరాలను తెలుసుకుని, సక్రమమైన మానవ సంబంధాలను కొనసాగిస్తూ, వారి తప్పులను వారు నొచ్చుకోకుండా జాగ్రత్తగా వివరించగలగడం వంటి పద్ధతులన్నీ పాలనాధికారికి విపరీతమైన మానసిక వత్తిడిని కలిగిస్తాయి. పాలనలో చూపించవలసిన నిర్వాహణ కౌశల్యం వ్యక్తులకు సమాజ జీవితంలో నేర్పబడదు. ఈ కౌశల్యం నిరంతరమైన శిక్షణ, అధ్యయనం, అచరణల ద్వారా వ్యక్తికి లభిస్తుంది. పోలీస్ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ప్రభుత్వరంగ సంస్థలు మొదలైనవి నిరంతరం పని భారంతో వుండడం వలన ఏర్పడే మానసిక వత్తిడిని తట్టుకోగలిగే సామర్థ్యం అనుభవం వలన మాత్రమే లభిస్తుంది. దీనిని తట్టుకోవడానికి ప్రభుత్వం కల్పించే శిక్షణ మాత్రమే గాక వ్యక్తి స్థిరచిత్తం, ధైర్యసాహసాలు, స్వతంత్ర నిర్ణయం తీసుకోగలిగే మానసిక ధారుఢ్యం వున్నపుడు మాత్రమే సాధ్యమవుతుంది. ఈ రకమైన ప్రత్యేక లక్షణాలు అధికారులలో వుండాలని ఆశించినపుడు ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యానికి గల పరిమితులను ఊహించుకోవచ్చు. ప్రభుత్వం కొన్ని రాయితీలను ప్రకటించినప్పటికి పై పరిమితుల నేపథ్యంలో పూర్తి ప్రాతినిధ్యం సాధ్యం కాదని గమనించాలి.

బహుళ వర్గ సమాజంలో ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం ప్రతికూల ఫలితాలను కల్గిస్తుంది కూడా. వివిధ సామాజిక, జాతి, కుల, ప్రాంత వర్గాలకు ప్రాతినిధ్యం కల్గించాలనే దృక్పథం సంకుచిత ప్రాంతీయ ధోరణులను పెంచే విధంగా రూపాంతరం చెందే అవకాశాలు కొట్టివేయలేము. ఏకశిలా సదృశంగా, సమైక్యంగా వుండవలసిన ఉద్యోగి స్వామ్యంలో ఏర్పాటు ధోరణులు ప్రబలడం రాజ్య వ్యవస్థకే ముప్పు కలిగిస్తుంది. ఉద్యోగి స్వామ్యం తప్పని సరిగా సమాజానికి ప్రాతినిధ్యం వహించాలనుకుంటే ఆ అవగాహన హేతుబద్ధత, చట్టబద్దా నియమాల ఆధారంగా ఏర్పడిన ప్రతిభ ప్రాతిపదిక పై ఎంపిక చేయబడిన ఉద్యోగి స్వామ్యానికి పోటీగా వివిధ రకాల సమూహాలకు ప్రాతినిధ్యం వహించాలనడం సమంజసం కాజాలదు. ఉద్యోగి స్వామ్య ప్రాథమిక పునాది అయిన హేతుబద్ధత, వృత్తి నైపుణ్యం, సమగ్రతలను సవాలు చేయడం దాని పునాదినే విచ్ఛిన్నం చేయడమవుతుంది. ఈ కోణం నుండి పరిశీలిస్తే ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్య నిర్వచనమే వైరుధ్యానికి ఆస్కారం కలిగిస్తుంది.

ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యానికి మాతృక ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. ప్రపంచంలోనే ప్రాచుర్యం పొందిన ప్రజాస్వామ్యాలుగా చెప్పబడే బ్రిటన్, అమెరికాలలో కూడా నేటికి ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యం స్థిరపడలేదు. సోషలిస్టు వ్యవస్థగా వున్న పూర్వసోవియట్‌లోనూ అదే పరిస్థితి. రష్యన్ జాతి ఇతర జాతులన్నింటి పైన అధికారం చలాయించిందనే విమర్శ వినిపించింది. ఆర్థిక సామాజిక అంతరాలు సామాజిక, రాజకీయ రంగాలలో కొనసాగుతున్నంతకాలం సమాజం వివిధ రకాల వైరుధ్యాలకు, ఘర్షణలకు నిలయంగా వుంటుంది. వ్యక్తుల మేధోసంపత్తి, విద్యా ఉద్యోగ అవకాశాలు ఆయా వర్గాలు ఆ సమాజంపై చూపే ప్రభావం ఆధారంగా, వారి వారి ఆర్థిక శక్తిపై ఆధారపడతాయి. పాలనా

BRAOU

పదవులలోనే జరిగే ఎంపికలో కూడా ఇదే ప్రవృత్తి పునరావృతమవుతుంది. హరిజన, గిరిజన, బలహీన వర్గాలు తమ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్యా వెనుక బాటు తనం నుండి జాతీయ వంతిలోనికి ప్రవేశించడానికి విద్య ఉపాధి సౌకర్యాల కల్పన తప్పనిసరిగా ప్రభుత్వ బాధ్యత అనడంలో సందేహం లేదు. అదే సమయంలో సమాజాభివృద్ధి క్రమానికి నైపుణ్యంగల ఉద్యోగి స్వామ్య అవసరాన్ని గుర్తించాలి. ఈ రెండింటి మధ్య రాజీ పడని సమతూక ధోరణిని చేబట్టడం పైననే ఆ రాజ్యవ్యవస్థ పురోభివృద్ధి ఆధారపడుతుంది. వైరుధ్య నిలయమైన బహుళ వర్గ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ పరిస్థితి అంత సులభసాధ్యం కాదు.

సమాజ భౌతిక ఆకాంక్షలకు ప్రాతినిథ్యం వహించడం మాత్రమే గాక, సమాజ పురోగతికి అవసరమైన కార్యక్రమాలను నిర్దేశించడం లోను, అమలు పరచడంలోను, వివిధ రకాలైన విధులను నైపుణ్యంతో, నిర్వర్తించాల్సిన బాధ్యత ఉద్యోగిస్వామ్యం పై వుంది. నేర్పరితనంతో మిత వ్యయంతో పాలనా విధులను నిర్వహించగలగాలంటే ఉద్యోగస్తుల ఎంపిక యోగ్యమైన రీతిలో 'హేతుబద్ధంగా' వుండాలి. దీనిని అంగీకరిస్తే ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యాన్ని అమలు చేయడంలోని పరిమితి అర్థమవుతుంది.

## 17.6 సారాంశం

ఆధునిక రాజకీయ వ్యవస్థలు పూర్తిగా ప్రజాస్వామ్య వ్యవస్థలు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేకూర్చాలి. వెనుక బాటు తనంతో, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన ప్రజల కోసం ఏర్పరచే కార్యక్రమాల సక్రమ అమలు ఉద్యోగస్థుల చిత్తశుద్ధిపై ఆధారపడుతుంది. ఆయావర్గాల ప్రజలకోసం ఏర్పాటైన కార్యక్రమాలు వారి కుటుంబాలనుండి వచ్చిన వారు సక్రమంగా అమలు చేయగలరనే భావన ఆధారంగా ఏర్పడిందే ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం. ప్రజల ఆకాంక్షలను వెనుకబాటుతనాన్ని ఉద్యోగి స్వామ్యం మొత్తంగా గుర్తించాలి కాని ఆయా వర్గాల వారు మాత్రమే అందుకు ప్రాతినిథ్యం వహించాలనడం పొరపాటు ధోరణి. ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం అవసరమయినా, అది మాత్రమే సమస్యలను పరిష్కరించ కలుగుతుందనుకోవడం భ్రమ మాత్రమే.

BRAOU

ప్రాతినిథ్య ఉద్యోగి స్వామ్యం రెండు ప్రధాన భావపునాదులపై ఆధారపడింది. ప్రతి వర్గానికి సమాజంలోని దాని జనాభా దామాషా ప్రకారం అవకాశాలు లభించాలనడం మొదటిది కాగా, సివిల్ సర్వీస్ ఉద్యోగులు ఎంతటి ఉన్నత స్థానంలో వున్నా తమ వర్గ లక్షణాల ఆధారంగానే పని చేస్తారనేది రెండవది. ఈ రెండు భావనలూ తిరస్కరించదగినవే. ఎందుకంటే ప్రపంచంలోని ఏ సమాజం లోనూ అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభించడం లేదు. అదే విధంగా వ్యక్తి యొక్క ప్రవర్తన అతను పనిచేస్తున్న సమూహ ప్రవర్తన పై ఆధారపడుతుంది. సివిల్ ఉద్యోగి ఇందుకు మినహాయింపు కాదు. వ్యక్తుల ప్రవర్తనను అతను జీవించే సమూహం, అనుభవం, విద్యార్హతలు, సామాజీకీకరణ మొదలైనవి ప్రభావితం చేస్తాయి. ఈ విషయమై ఆచార్య వి. సుబ్రమణ్యం వివరణ పరిశీలిద్దాం.

"అనేక మంది రాజులు, ధనికవర్గాల వారు శ్రామికుల పట్ల చూపిన నిరంతర ఆపేక్ష, వారికోసం పడిన శ్రమ మనకు ప్రపంచ చరిత్రలో కానవస్తుంది. శ్రామికవర్గ సిద్ధాంతాలన్ని ధనిక వర్గాల వారు తయారుచేసినవే. సమాజశ్రేణిలోని అట్టడుగు వర్గాల వారు ఉన్నతోద్యోగులు సంపాదించిన అనంతరం, తాము కూడా సమాజ ఉన్నత శ్రేణిలోనే

వుండాలనే భావనకు గురవుతూ క్రింది శ్రేణి వారి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విషయం గమనించాలి. ఉన్నతోద్యోగాలలో స్థిరపడిన వారే తిరిగి తమ పాత వర్గం పేరుతో ఉద్యోగావకాశాలను సంపాదిస్తూ, వాస్తవంగా అణగారిన వర్గాల అవకాశాలను చేజిక్కించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రాతినిధ్య ఉద్యోగి స్వామ్యాన్ని పరిశీలిస్తే దాని ప్రాథమిక పునాదులే బీటలు వారుతాయి."

## 17.7 నమూనా పరిక్షా ప్రశ్నలు

**I** ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో జవాబులు వ్రాయండి

1. ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్య. అవసరం పరిమితుల గురించి ఒక వ్యాసం రాయండి.
2. కొన్ని దేశాలలో గల ఉద్యోగిస్వామ్యం గురించి వివరించండి.

**II** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్యం అర్థం
2. ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్యం - పునాదుల

## 17.8 చదువదగిన రచనలు


1. మార్టిన్ ఆల్ బ్రో : బ్యూరాక్రసీ, 1970, మాక్ మిల్లన్, లండన్
2. మొహిత్ భట్టాచార్య : " పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, 1994, వరల్డ్ ప్రెస్ కలకత్తా.
3. డోనాల్డ్ కింగ్స్లే : రిప్రజెంటెటివ్ బ్యూరాక్రసీ, 1944, అంటిటోక్ ప్రెస్, ఓహియో.
4. సుబ్రమణ్యం వి : సోషల్ బ్యాక్ గ్రౌండ్ ఆఫ్ ఇండియాన్ అడ్మినిస్ట్రేటర్స్ 1971, పబ్లికేషన్ డివిజన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లి
5. శామ్యూల్ క్రిన్‌లోవే : రిప్రజెంటెటివ్ బ్యూరాక్రసీ, ప్రిన్స్టన్‌హాల్ 1974, ఎంజిల్ వుడ్ క్లిప్స్, న్యూజెర్సీ.


**రచయిత: వై. పార్థసారధి.**

BRAOU

# భాగం - 18 : పాలనా జవాబుదారీ పద్ధతులు

## విషయక్రమం


18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 భావన

18.3 జవాబుదారీ పద్ధతులు

18.4 సమిష్టి బాధ్యత

18.5 మంత్రిత్వ బాధ్యత

18.6 ఇతర సాధనాలు

18.7 సాంప్రదాయక పద్ధతులపై విమర్శ

18.8 జవాబుదారీ పద్ధతుల క్రమబద్ధీకరణ

18.9 సారాంశము

18.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

18.11 సంప్రదింపు రచనలు


BRAOU

## 18.1 లక్ష్యాలు

ఈ భాగంలో ఈ క్రింది అంశాల గురించి తెలుసుకుంటారు.

* జవాబుదారీ పదమునకు అర్థము, భావన, వివరణ
* జవాబుదారీ పద్ధతులనగా నేమి ?
* సమిష్టి బాధ్యత, మంత్రిత్వ బాధ్యత భావనలపై వివరణ (బహిర్గత అంశాలు)
* ఇతర సాధనాలు పరికరాలు (అంతర్గత అంశాలు)
* సాంప్రదాయక పద్ధతులపై విమర్శ
* జవాబుదారీ పద్ధతుల క్రమబద్ధీకరణ

## 18.1 పరిచయం

ప్రభుత్వం ఏ విధంగా వ్యవస్థీకరించబడినా దానికి జవాబు దారీ వహించడం తక్షణ కర్తవ్యం. ప్రభుత్వ తీరు తెన్నులలో, లక్ష్యసాధనలో, నిర్దిష్ట ప్రక్రియలలో తేడా ఉండవచ్చు. జవాబుదారీ విధానము ప్రభుత్వానికి ఆయువు పట్టు. నియంత పాలనా యంత్రాంగములను తన చెప్పు చేతులలో వుంచుకొనగలడు. తన ఆదేశాలకు అనుగుణంగా జవాబుదారీ పద్ధతులకు రూపకల్పన చేయగలడు. కాని ప్రజాస్వామ్య రాజ్యములో ప్రజల ద్వారా ప్రభుత్వానికి సంక్రమించే సార్వభౌమాధికారమునకు జవాబుదారీ పద్ధతులను నిర్ణయించడములోను వాటిని అమలులో పెట్టుటలో అనేక సాధక బాధకాలున్నాయి.

మొట్టమొదటి సారిగా జవాబుదారి అనే పదం 1583 సం. లో ఇంగ్లీషు భాష నుంచి ఆర్థిక విషయాల ప్రస్తావన సందర్భంగా వాడుకలోకి వచ్చింది. ఈ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్థిక జవాబుదారి మిగతా అంశాల జవాబుదారి కంటే ముఖ్యమైనదిగా పరిగణించబడుతోంది. ఈ భావన చాలా విశాలమైనదిగా, ప్రభుత్వ కార్యకలాపాలన్నింటికి సంబంధించింది. Shorter Extra English Dictionary నిర్వచనం ప్రకారం, జవాబుదారి' (Accountable) అనగా జవాబుదారి వహించడం. బాధ్యత వహించడం (కు కొఱ కై) Weber's New International Dictionary of the English language కూడా నిర్వచనాన్ని ఇస్తూ వివరణ యిచ్చింది. "ఎవరినైనా పిలిచి జవాబుదారి వహించమనడం" అని ఈ నిర్వచనము 'నియంత్రణ' (control) అనే పదములను అవగాహన చేసుకొనుటకు తోడ్పడుతుంది. నిక్కచ్చిగా చెప్పాలంటే, నియంత్రణ ఏదైనా ఒక చర్య లేక సంఘటనకు సంబంధించింది. జవాబుదారీ మాత్రం జరిగి పోయిన విషయం పూర్వాపరాలకు సంబంధించినది. అది శ్వాసపరీక్షలాంటిది. (Postmartem Examination). జరిగిన విషయానికి బాధ్యతను నిర్ధారించడం అనగా కార్య నిర్వాహకుల ప్రవర్తనా పరీక్షలో జవాబుదారి భావన కొంత ప్రభావం తప్పక చూపుతుంది. కాలక్రమేణా నియంత్రణ భావనలో జవాబుదారి భావన కూడా నిర్లిప్తమైనది.

## 18.2 భావన (concept)

"జవాబుదారిని విద్యుచ్ఛక్తి వలె నిర్వహించడం కష్టం. కాని దాని ఉనికిని ఏ పద్ధతిలోనైనా వెంటనే తెలుసుకోవచ్చు". అని కెనడాలో 1976 సం.లో ఆర్థిక నిర్వహణ మరియు జవాబుదారి విషయంపై నియమించబడిన రాయల్ కమీషన్ చెప్పింది. ఏ సర్క్యూట్‌లో నైనా ఒక కరెంటు వైరును తాకినట్లైయితే కరెంటు ఉన్నదీ లేనిదీ వెంటనే తెలుసుకోవచ్చు. అదే విధంగా ప్రభుత్వ రంగములో జవాబుదారి విధానము ఉన్నదిలేనిది అంతప్రత్యక్షముగా తెలుసుకోవడానికి వీలులేకపోయినా పరోక్షంగా నైనా నిదానంగా తెలుసుకోవచ్చు. మనం జవాబుదారీ పద్ధతిని చురుకుగా నడిచే ఒక సంక్లిష్టమైన గొలుసు ముడిలాగా ప్రభుత్వమును పార్లమెంటుతో పార్లమెంటును దిగువ బయట భౌగోళికముగా విడివడిన ఉద్యోగిస్వామ్యమును శాఖలుగా కార్పోరేషన్లుగా బోర్డులు కమీషనులుగా వ్యవస్థీకరించి ఒకదానికొకటి ముడివేయడం జరిగింది. జవాబుదారీ పద్ధతులు ఈ గొలుసు ముడిలో సర్క్యూట్‌లో ప్రవహిస్తున్న కరెంటు వలె పయనిస్తూ నియంత్రణా కేంద్రమునకు సంబంధము కలిగి వుంటుంది. ముఖ్యంగా మంత్రి వర్గానికి విభజించపడి సంక్లిష్టమైన ఉద్యోగిస్వామ్య శ్రేణి నిలుపుదలల వలన ఎక్కువ భారము వలన నియంత్రణాకేంద్రమును బలహీనం చేయవచ్చు. నియంత్రణా కేంద్రము ప్రభుత్వము అఖరి దశలో శాసన సభకు జవాబుదారి వహించినప్పటికి గొలుసు ముడికి అవతల ఏమిజరుగుతున్నదో లేదా జరుగక పోతున్నదో తెలుసుకొనలేక పోవచ్చు. అదే విధంగా కేంద్రము నుంచి ఇచ్చిన సూచన శాఖకు, యూనిట్‌కు గాని సంబంధిత ఏజెన్సీకి గాని అందక పోవచ్చు. అందినను దాని ఆచరణా తీరు తెన్నులను అంచనా వేయడం అసాధ్యము కావచ్చు.

వ్యవస్థ మౌళిక లక్షణాలలో పాలనా జవాబుదారి పద్ధతులు ముఖ్యమైనవి. అవి వ్యవస్థ లక్ష్యాలు ఎంతవరకు సాధించబడినవో నిర్ధారించుటకు తోడ్పడుతాయి. లక్ష్యములను కొన్ని నిర్దిష్టపనులు గాను బాధ్యతలుగాని విభజించి ప్రతి అధికారి తన బరువు బాధ్యతలు ఏవిధంగా నిర్వర్తించు చున్నదో తెలుపవలసినదిగా ఆదేశించడం జరుగుతుంది. పాలనా బాధ్యతను జవాబుదారి పద్ధతి ఎల్లప్పుడూ తోడై వుంటుంది. అది ప్రభుత్వ పాలన అనే నాణెమునకు ఇరువైపులా బొమ్మ బొరుసు వంటివి. ఏ వ్యవస్థకైనా అవి అంతర్భాగములే. క్రమానుగత శ్రేణి, నియంత్రణావిధి, అజ్ఞానత్వము, పర్యవేక్షణ మొదలగు భావనలు జవాబుదారి పద్ధతులను పెంపొందించి అమలులో పెట్టేవే. అదే

BRAOU

విధంగా సాంవత్సరిక బడ్జెట్‌కు, ఈ పద్ధతులకు వ్యవస్థ లక్ష్యాలకు అవినాభావ సంబంధము వుంది. పాలనా జవాబుదారీ పద్ధతి, అభివృద్ధికి తొలి మెట్టు. దానికి ఇది విషమ పరీక్ష. ఓడకు దిక్సూచి మార్గదర్శకముగా ఏ విధంగా ఉపయోగపడుతుందో ప్రభుత్వ ఉద్యోగికి వ్యవస్థ లక్షణాలు కూడా అదే విధంగా ఉపయోగపడుతుంది. కాని జవాబుదారీ పద్ధతులు ఇతర నిబంధనలను కూడా విధిస్తాయి. మానవ ఆర్థిక వనరులు వ్యవస్థకు పరిమితమై ఉంటాయి. ఆ పరిమిత వనరులను వ్యవస్థ ప్రధాన లక్ష్యాలతో సమన్వయ పరచవలె. మరో విధంగా చెప్పవలెనంటే, జవాబుదారీ పద్ధతులు లభ్యమైన వనరులను పూర్తిగా ఉపయోగించుకొని వ్యవస్థ లక్ష్యాలు సాధించడానికి త్రికరణ శుద్ధిగా తోడ్పడుతాయి. ఈ విధమైన ముఖ్యమైన విధులనే గాక ఇతర లక్ష్యాలను కూడా జవాబుదారీ పద్ధతులు నెరవేరుస్తాయి. ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే కార్యనిర్వాహకులకు తమ వనరులను తామే సమకూర్చుకోవలసిన బాధ్యత లేదు గనుక, అవి వాటంతట అవే ప్రభుత్వ ఖజానా నుంచి సమకూరుతాయి అనే నమ్మకం ఉండుట వలన వారు వ్యక్తిగత మరియు అనధికార ఆధ్వర్యములో ప్రభుత్వ వనరులను దుబారా చేయకుండా గట్టి చర్యలను తీసుకొనవలెను. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజాధనము పట్ల, ఉన్నత ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి అందరికి తెలిసినదే. వారికి ఎటువంటి శ్రద్ధకాని అంకితభావము గాని లేదు. అందుచేతనే దేశ రాజకీయ రాజ్యాంగయంత్రాంగము ప్రతి కార్యనిర్వాహకున్ని నియంత్రణ జవాబుదారి పద్ధతుల పరిధిలో నియమించి వాటి లక్ష్యాలను సాధించుటకు అనేక మార్గాలను ఉపాయాలను సూచించి అమలులో పెట్టుటకు కృషి చేస్తోంది. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన సామాన్య మానవుని సంక్షేమం కోసమే నియమించబడినానని మహాత్మాగాంధీ అన్నట్లు దరిద్రనారాయణుని అభివృద్ధికి కంకణం కట్టులేని ఆ లక్ష్య సాధనకు జవాబుదారి వహించవలెను. విస్తృతంగా త్వరితగతిని అభివృద్ధి చెందుతున్న ప్రభుత్వ కార్యకలాపాల సందర్భంలో ఇది తప్పదు.

## 18. జవాబుదారీ పద్ధతులు

జవాబుదారి భావనకు రెండువైపులు ఉన్నాయి. అవి వేరు వేరు అయినప్పటికీ రెండింటికి ఒకదానికొకటి విడదీయ రాని సంబంధము కలదు. మొదటిది ప్రాథమిక దశనందు రాజకీయ ప్రాధాన్యము కలిగి యుండుట. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అనగా మనదేశంలో కార్యనిర్వాహక వర్గము తన కార్యక్రమాల నిర్వాహణకు పార్లమెంటుకు జవాబుదారి వహించవలసిన బాధ్యత వుంది. దానికి అనేక పద్ధతులు మార్గాలు ఉన్నాయి. రెండోది ముఖ్యంగా పాలనా సంబంధమైనది. కార్యనిర్వాహక వర్గము తిరిగి తన ఆధ్వర్యములో వివిధ శాఖలలో సంస్థలలో పనిచేస్తున్న పాలనా అధికారులు వారివారి బాధ్యతా నిర్వహణా భావనకు జవాబుదారి వహించేలా చర్యలు తీసుకొనబడతాయి. ఈ రెండు వైపులు పూరకములు, రెండు బాధ్యతాయుత ప్రభుత్వమునకు పునాదిరాళ్ళు.

పార్లమెంటుకు కార్యనిర్వాహక వర్గము జవాబుదారి వహించడం ద్వారా, పార్లమెంటరీ ప్రభుత్వమునకు రాజకీయ ఔచిత్యం ఏర్పడింది. కార్యనిర్వాహక వర్గము పార్లమెంటుకు ఎందుకు జవాబుదారీ వహించవలెను ? భారతదేశంలో కార్యనిర్వాహక వర్గము అధికారాలను రాష్ట్రపతికి రాజ్యాంగము ద్వారా సంక్రమించాయి. అత్యంత ముఖ్యమైన పన్నులు రాష్ట్రపతి పేరనే నిర్వహింపబడతాయి. కాని రాష్ట్రపతిరాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రధానమంత్రి అధ్యక్షులుగా యున్న మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవలెను. అందుచేతనే మంత్రిమండలి పార్లమెంటుకు జవాబుదారి వహించవలసిన అవసరం ఉంది.

BRAOU

కార్యనిర్వాహక వర్గము పార్లమెంటుకు పూర్తిగా నిర్దిష్టంగా బాధ్యత వహించి వుండుట కొరకు అనేక మార్గాలను పద్ధతులను నిర్దేశించడం జరిగింది. ప్రజల ఇబ్బందులను తొలగించవలసిన బాధ్యత కార్యనిర్వాహక వర్గానిది. అంతకు ముందు ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా ప్రభుత్వము ప్రజల కనీస అవసరాలను తీర్చవలసిన నైతిక బాధ్యత యుంది. పార్లమెంటు కార్యనిర్వాహక వర్గానికి డబ్బు యిచ్చేముందు ఆ డబ్బు ఎందుకు ఖర్చు చేయబడుతూ వుందో ముందుగా తెలుసుకొని ఇవ్వవలెను, తాను యిచ్చిన డబ్బు సక్రమంగా ఉపయోగపడుతుందో లేదోనని పార్లమెంటు కార్యానిర్వహక వర్గకార్యకలాపాలను ఒక కంట కనిపెడుతూ ఉంటుంది.

పార్లమెంటు ప్రభుత్వ ఖజానాపై నియంత్రణా అధికారం చలాయించడమే గాకుండా కార్యనిర్వాహక వర్గాన్ని తనకు జవాబుదారివహించి ఎల్లప్పుడు వ్యవహరించేట్లు ఎన్నో మార్గాలను అవకాశాలను కల్పించింది. ఉదాహరణకు పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయం వాయిదా తీర్మానాలు, అవిశ్వాస ప్రకటన, గ్రాంట్లు కొఱకు డిమాండు చర్చ, కాల్ అటెన్షన్ నోటీసు, అర్ధగంట చర్చ, జీరో గంట చర్చ మొదలైనవి. జవాబుదారి పద్ధతిని ఖచ్చితంగా అమలులో పెట్టుటకు రూపొందించిన సాంప్రదాయక మార్గాలను, కిటుకులను రెండు రకాలుగా విభజించ వచ్చు. మొదటిది దైనందిన కార్యక్రమాలకు సంబంధించి ఉమ్మడిగా వ్యవహరింపబడే పద్ధతులతో కూడు కొనియున్నది. పార్లమెంటరీ ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, అవిశ్వాస ప్రకటన, గ్రాంట్లు కొఱకు డిమాండ్ల చర్చ అర్ధగంట చర్చ, జీరో గంట చర్చ, మొదలగునవి ఈ రకము క్రింద వస్తాయి. రెండవ జవాబుదారీ పద్ధతి శవపరీక్షతో పోలి యున్నది. జరిగిన విషయాన్ని అధ్యయనము చేసి ఒక నిర్ణయానికి రావడము ఆడిట్ పార్లమెంట్ కమిటీలు ఒక సంఘటన జరిగిన తరువాత దాని పూర్వాపరాలను కనుగొని దానికి ఎవ్వరు జవాబుదారి వహించాలో నిర్ధారించడంలో నియంత్రణ అంటే జవాబుదారి వహించాలో నిర్ధారించి నియంత్రణ అంటే జవాబుదారి పద్ధతి క్రిందే వస్తుంది.

ఈ వర్గీకరణ మరో సందర్భంలో కూడా ముఖ్యమైనది. మొదటి రకము జవాబుదారి పద్ధతులు రాజకీయ కార్యనిర్వాహకునికి ఉద్దేశించ బడినది. వాయిదా తీర్మానాలు, అవిశ్వాసతీర్మానాలు, పార్లమెంటరీ వాదోపవాదాలు భారతదేశంలో ఇతర దేశాలలోను రాజకీయ ప్రేరణతో రాజకీయ కార్యనిర్వాహకుని కార్య క్రమాలపై నిఘా కొరకు ఉపయోగపడే సాధనాలు. రెండవ జవాబుదారి పద్ధతి వృత్తి సంబంధమైన ఉద్యోగిబృందమునకు సంబంధించినది. అది పాలనా వ్యవహారం.

BRAOU

## 18.4 సమిష్టి బాధ్యత (Collective Responsibility)

మంత్రివర్గము పార్లమెంటు దిగువ సభకు అనగా లోక్‌సభకు జవాబుదారి వహిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రం ప్రకారం మంత్రివర్గం ఉమ్మడి లేదా సమిష్టి జవాబుదారి విధానానికి కట్టుబడి ఉంది. ప్రజాస్వామ్య ప్రభుత్వంతో లోక్‌సభలో మెజారిటీ వర్గానికి చెందిన పార్టీకి ప్రభుత్వమును ఏర్పరుచుటకు దానిని నడిపించుటకు ప్రత్యేక హక్కులు అధికారాలు కలవు. ప్రతియొక్క మంత్రివర్గ సభ్యుడు తన విధానాలతో ఇతర సభ్యులు కూడా ఏకీభవించేటట్లు వ్యవహరించవలె. లోక్‌సభ ఏదైనా ఒక మంత్రికి సంబంధించిన ప్రతిపాదనను వ్యతిరేకించినట్లైయితే మంత్రివర్గ సభ్యులందరు రాజీనామా చేయవలెను. మంత్రివర్గములో ప్రతియొక్క మంత్రి మనుగడ మరొకరితో ముడిపడి యున్నది. మంత్రివర్గములో అంతర్గతంగా మంత్రి తన ప్రతిపాదనలపై ఇతర మంత్రుల ఆమోదములు పొందుటకు ప్రయత్నిస్తాడు. పలుకుబడిగల మంత్రి అందరి సహకారం పొందగలడు. అటులకాని పక్షాన, ఆ ప్రతిపాదన ముఖ్యమైనది దానిని ఆమోదించవలసిన అవసరం ఎంతైనా ఉందని తను కేబినెటు విధానంతో ఏకీభవించక పోయినచో లేక తను దానిని బహిరంగముగా సమర్థించవలెనని భావించినప్పుడు ఆ మంత్రి, తప్పనిసరిగా రాజీనామా చేస్తాడు.

## 18.5 మంత్రిత్వ బాధ్యత ( Ministerial Responsibility)

సమిష్టి బాధ్యత భావన అనగా మంత్రివర్గములో అన్ని విషయాలు చర్చించబడుతాయని ఆమోదించబడతాయని కాదు. కొన్ని విషయాలు మంత్రివర్గ సమావేశాలలో కూలంకషముగా చర్చింపబడుతాయి. మరికొన్ని విషయాలు మంత్రివర్గ సభ్యుల వ్యక్తిగత నిర్ణయాధికారానికి కేటాయించబడినట్లుగా నిర్దిష్టంగా నియమనిబంధనల రూపకల్పన జరిగినది. పార్లమెంటుకు ప్రతిమంత్రి వ్యక్తిగత హోదాలో, తన అధ్వర్యంలో జరిగే కార్యకలాపాలన్నింటికి తను జవాబుదారి వహించవలసి ఉందని రాజ్యాంగపరంగా చట్టబద్ధంగా యున్న మౌళిక సూత్రము. ప్రతి మంత్రి పార్లమెంటుకు తను చేసిన పనులకు, చేయని పనులకు తన ఆధీనంలో వున్న ప్రభుత్వ ఉద్యోగుల కార్యకలాపాలకు బాధ్యత వహించవలెను. ప్రభుత్వ ఉద్యోగులకు నిగూఢలే' (Anonymity) అనే సూత్రము ఒక రక్షక కవచము. ఏదైనా ఒక మంత్రిత్వశాఖ తప్పుచేసినట్లు అయితే మంత్రిని వ్యక్తిగతంగా తెలియకపోయినా లేక తాను ఆ విషయానికి తన ఆమోదము తెలపక పోయినా పార్లమెంటుకు ఆ మంత్రి జవాబుదారి వహించవలసినదే. కాని మంత్రిత్వ బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి రక్షణయివ్వదు.

మంత్రి ప్రభుత్వ ఉద్యోగులకు యున్న సంబంధాలతో సిద్ధాంతరీత్యా నాలుగు సంఘటనలు జరుగవచ్చు. మొదటిది ఒక ప్రభుత్వ ఉద్యోగి మంత్రి జారీ చేసిన ఒక నిర్దిష్ట ఆజ్ఞను శిరసావహించి ఏదైనా ఒక పని చేసినట్లు అయితే మంత్రి అతనికి రక్షణ కల్పించి పార్లమెంటులో ఆపనికి పూర్తి బాధ్యతను తానే వహించవలెను. రెండవది ఒక ప్రభుత్వ ఉద్యోగి తన మంత్రి ఆదేశానుసారము ప్రభుత్వ విధానమును సక్రమంగా అమలు జరిపినట్లు అయితే అతనిని మంత్రి బలపరిచి రక్షించవలె. మూడవది ఒక ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా ఒకపొరపాటు చేసినచో లేక ఏదైనా విషయములలో జాప్యము చేసినచో (అది ప్రభుత్వ విధానానికి సంబంధించిన ముఖ్య విషయము కానప్పుడు, వ్యక్తిగత హక్కుల పోరాటములలో భాగము కానప్పుడు) మంత్రి ఆ పొరపాటును తనకు వ్యక్తిగతంగా సంబంధము లేకపోయినప్పటికి తానే చేసినట్లు ఒప్పుకొని దానికి బాధ్యత వహించవలె. నాల్గవది చాలా కీలకమైన వివాదాస్పదమైన సంబంధము. ఈ సందర్భములో తప్పు చేసి ప్రభుత్వ ఉద్యోగి మంత్రి చేసే నిందలకు ప్రజల విమర్శలకు గురి అయినప్పటికి మంత్రియే పార్లమెంటుకు బాధ్యత వహించవలెను. ఇందులో ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా ఒక పనిని మంత్రి ఆమోదము లేకుండా మంత్రికి తెలియకుండా చేసినప్పుడు ప్రభుత్వ ఉద్యోగి ప్రవర్తన తీవ్ర నిరసనకు గురి అయిన సందర్భాలు కూడా వస్తాయి. ఆ సందర్భములో మంత్రి ప్రభుత్వ ఉద్యోగి చేసిన పనిని సమర్థించ వలసిన అవసరము లేదు. Herbiat Marrison చెప్పినట్లు అటువంటి ప్రభుత్వ ఉద్యోగిని బహిరంగముగా అభిశంషించవచ్చు. "నా అభిప్రాయంలో ఒక పరిస్థితిలో ఎంత నిర్మొహమాటంగా మాట్లాడితే అంతమంచిది. ఒక మంత్రి తన మంత్రిత్వశాఖలో ప్రజాహితము కోరి ఏదైనా ఒక విషయముపై నిర్దిష్ట ఆజ్ఞను యిచ్చినప్పటికి ఆయన ఆదేశాలను అమలు పెట్టక పోయిన పరిస్థితులలో పార్లమెంటులో ఆ విషయము ప్రస్తావనకు వచ్చినప్పుడు మంత్రి పూర్తి వివరాలతో తనుతీసుకొన్న చర్యలను తెలిపి తనను తాను సమర్థించుకోవచ్చు. ఈ పరిస్థితులలో కూడా మంత్రి జవాబుదారి వహించవలె. ఈ పరిస్థితిలో నా ఉద్దేశము ఏమిటంటే ఏదయినా ఆదేశాన్ని ప్రభుత్వ ఉద్యోగి అమలు పెట్టకపోయినా లేక నిర్లక్ష్యభావముతో వ్యవహరించిన ఆ విషయము అందరికి తెలియపరిచి ఆ అధికారికి తలవంపులు కలిగేటట్లు మిగతా అధికారులకు తెలిపేటట్లు చేయుట భావ్యము. సర్వత్ర ఆమోద యోగ్యము. మంత్రులు యిచ్చిన చట్టపరమైన ఆజ్ఞలను తూచతప్పకుండా అమలులో పెట్టవలసిన బాధ్యత తమపై ఎల్లపుడు వుంది అనే విషయము ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలి".

BRAOU

నెహ్రూ మంత్రివర్గములో ఆర్థిక మంత్రిగా యుండి 1958 లో జీవిత భీమా కార్పోరేషన్ వివాదముపై రాజీనామా చేసిన T.T. క్రిష్ణమాచారి మనస్సులో బహుశా ఈ పరిస్థితే తలయెత్తే ఉండవచ్చు. తన అధీనోద్యోగి తన విధానాన్ని ఖాతరు చేయలేదని లేదా తన అభిప్రాయమునకు భిన్నంగా ఆదేశాలకు వ్యతిరేకంగా అతను ప్రవర్తించాడని చెప్పడానికి అనుమతి యివ్వకుండా ఏ మంత్రియైనా తన ఆధీన ఉద్యోగుల కార్యకలాపాలకు పూర్తి బాధ్యత వహించవలె అనే సిద్ధాంతమునకు కట్టుబడి ఉండడం అసాధ్యం. కాని అటువంటి పరిస్థితిలో కూడా పార్లమెంటుకు మంత్రి బాధ్యత వహించవలెనని సూత్రానికి తిరుగులేదు. క్రిష్ణమాచారి రాజీనామాను ఆమోదిస్తూ నెహ్రూ యిలా అన్నారు. మీరు ఎంతో సబబుగా చెప్పినట్లు మన రాజ్యాంగము నిర్దేశించినట్లు ఇతరములు తీసుకొన్న చర్యల గురించి ఎటువంటి భోగట్టా లేకపోయినప్పటికీ పరోక్షంగా కూడా తాను ఏ చర్యలకు జవాబుదారి కాకపోయినప్పటికీ మంత్రి తన బాధ్యతను తాను వహించవలసినదే" L.I.C. వ్యవహారాలను పరిశీలించి తన ఏకసభ్య కమీషన్ నివేదికలో జస్టిస్ M.C. చాగ్లా వక్కాణించి నట్లు "మంత్రిత్వ బాధ్యత అనే సిద్ధాంతమునకు రెండు ముఖ్యచిత్రాలు ఉన్నాయి. తానే అధికార పరిధిలో మంత్రికి పూర్తి స్వతంత్ర్యం వున్నది. అందువలనే తన ఆధీన ఉద్యోగుల చర్యలకు తాను పూర్తి బాధ్యత వహించవలెను.

ఈ భావనను పార్టీ విధానము దృష్ట్యా మరియు పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా మరింత విపులంగా చర్చించుదాము. మంత్రియే స్వయంగా, పార్లమెంటరీ సంఘాలకు తన శాఖనిర్వహించే కార్యక్రమాల వివరాలను తెలియపరచవలె. ఎవ్వరైనా ఒక ఉద్యోగి తెలిసో తెలియకో దేశంలో మారుమూల ప్రాంతంలో ఏదైనా ఒకతప్పు చేసినట్లైయితే మంత్రిత్వ బాధ్యత సిద్ధాంతం ప్రకారం సంబంధిత మంత్రి రాజీనామా చేయవలె. ఆ విధంగా ఏ ప్రభుత్వ ఉద్యోగియైనా మంత్రికి ఉద్వాపన చెప్పాలనుకుంటే తన అక్రమ చర్యల ద్వారా పార్లమెంటులో అసంతృప్తిని రేకెత్తించి మంత్రి రాజీనామా తప్పనిసరి అయ్యే పరిస్థితులను కల్పించవచ్చు. అటువంటి సందర్భాలలో మంత్రి ఎంతవరకు బాధ్యత వహించవలెననే విషయం కూలంకషంగా అధ్యయనం చేయవలెను. ఒకవేళ తన శాఖలో జరిగే అన్ని విషయాలకు మంత్రియే పార్లమెంటుకు బాధ్యత వహించవలెనని నిక్కచ్చిగా ప్రకటించినట్లైయితే ప్రతి మంత్రి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ప్రతి విషయమును ఆపాదమస్తకము పరిశోధించి నిర్ణయించవలెనన్న పరిపాలనా యంత్రాంగము స్థంబించిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగులు కూడా పార్లమెంటులో చర్చింపబడే విషయముపై ఏ చర్య తీసుకోకుండా మంత్రికే పదే పదే నివేదిస్తారు. అప్పుడు కూడా పాలనా యంత్రాంగము కుంటుపడుతుంది.

రాజకీయ ప్రాముఖ్యము కల విషయము ఏమనగా ఎద్దైనా ఒక తీవ్ర వివాదంలో గాని, సంక్షోభంలో గాని ఇరుక్కున్న మంత్రి తనవెనుక యున్న మెజారిటీ మద్ధతుతో పార్లమెంటు వెలబుచ్చినా తీవ్రనిరసనను కూడా తట్టుకొని మనగలుగుతున్నారు. ఏదైనా సంక్షోభం తలయెత్తినపుడు ఎందరు మంత్రులు రాజీనామా చేస్తారు? ఏ మంత్రియైనా తనకు పార్టీ సహాయ సహకారాలు యున్నంత వరకు ముఖ్యంగా ప్రధానమంత్రి చేయూత యున్నంత వరకు రాజీనామా చేయడు. అందువల్లనే మంత్రిత్వ బాధ్యత అనే భావనకు కొన్ని పరిమితులు ఉన్నాయి. అవే మనగా :

1. అది చట్టరీత్యా ఆమోదముద్ర లేని సాంప్రదాయము మాత్రమే. అది ముఖ్యంగా మనసాక్షికి నైతిక సూత్రానికి సంబంధించినది.

2. అది కేవలం లౌకిక పరిజ్ఞానానికి పరిమితమైనది. ఒక రైల్వే స్టేషన్ మాస్టరు ప్రజలతో దురుసుగా ప్రవర్తించనిచో రైల్వే మంత్రి రాజీనామా చేయాలి అని ఎవ్వరు వత్తిడి చేయరు. అదే విధంగా కరువు పరిస్థితులు ఎదురు అయినచో వ్యవసాయ మంత్రి రాజీనామా చేయాలి అని ఎవ్వరు పట్టుపట్టరు.

BRAOU

3. ప్రధానమంత్రి విశ్వాసం చూరగొన్నంత వరకు మంత్రి తన పదవిలో కొనసాగుతాడు.

4. పార్టీ ముఖ్య నాయకుడిగా గుర్తింపు గలిగి ఎక్కువ అనుయాయుల సహాయ సహకారము కలిగి యున్న మంత్రి అవసరం ఎప్పుడూ ఉంటుంది. అతనికి ఉద్వాసన చెప్పడం జరుగదు.

## 18.6 ఇతర సాధనాలు పదములు (Other Tools and Mechanisms)

మనం ఇంతవరకు జవాబుదారీ పద్ధతులలో బహిర్గత అంశాలనే చర్చించాము. జవాబుదారీ విధానములో అంతర్గత అంశాలు కూడా ఉన్నాయి. ఒక మంత్రిత్వశాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరు తమ సంబంధిత మంత్రికి జవాబుదారీ వహించి ఉండవలెనంటె ప్రభుత్వ ఉద్యోగులు విధిగా తిరిగి మంత్రికి జవాబుదారులై ఉండాలి. ఈ విషయం క్రింది విధంగా రూపొందుతుంది.

1. ప్రభుత్వ ఉద్యోగులు తమ మంత్రి మనస్సును ముందుగా తెలుసుకొని తాము చేపట్టిన కార్యక్రమాలను విశ్వాస పాత్రముగా అమలులో పెట్టవలె.
2. పౌరులలో తమ అధికార నిర్వహణలో ప్రభుత్వఉద్యోగులు క్రమబద్ధమైన స్వాభావిక న్యాయ పద్ధతిని పాటించవలె.
3. ప్రభుత్వ ఉద్యోగులు పార్లమెంటు మనస్తత్వాన్ని క్షుణ్ణంగా తెలుసుకొని తమ మంత్రికి పార్లమెంటుకు మధ్యయున్న సుహృద్భావ సంబంధాలు చేరకుండా జాగ్రత్తపడవలెను.
4. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాభిప్రాయము ప్రకారం స్పందించవలెను.

BRAOU

జవాబుదారీ విధానము అనేక వ్యవస్థాగత క్రమానుగత పద్ధతుల మిశ్రమము. క్రమానుగత శ్రేణిలో బాధ్యత నిర్ధారించబడియున్నది. క్రింది స్థాయిలపై పూర్తినియంత్రణ అజమాయిషీ లేనిచో జవాబుదారీ పద్ధతులను ఆచరణలో పెట్టడంసాధ్యం కాదు. నియంత్రణావిధి, ఆజ్ఞా ఏకత్వము, నిఘా, పర్యవేక్షణ మొదలగునవి ఇతర జవాబుదారీ పద్ధతులు. నోటింగు మరొక జవాబుదారీ పద్ధతి. ఆర్థిక బాధ్యతను నిర్ధారించుటకు ప్రతి మంత్రిత్వ శాఖలో ఒక ఆర్థిక సలహాదారి పద్ధతి ప్రస్తుతం వాడకలో ఉంది. ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖలు ఇతరజవాబుదారీ యంత్రంగాలు ఆడిట్ కూడా ఒక బలమైన జవాబుదారీ సాధనం. కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరలు అత్యంత ప్రాధాన్యం కల రాజ్యాంగ ఉన్నత అధికారులలో ఒకరు ఆయన కార్యనిర్వాహక వర్గంతో ప్రమేయం లేని ఒక స్వతంత్ర అధికారి.

మంత్రి తన మంత్రిత్వ శాఖ పరిధిలో పూర్తి అధికారముతో స్వతంత్రముగా వ్యవహరించి తమ విధాన సంబంధమైన ముఖ్య విషయాలపై నిర్ణయం తీసుకొని దైనందిన పాలనా కార్య భారమును ప్రభుత్వ ఉద్యోగులకు అప్పగించవలెను. సర్ వారెన్ ఫిషర్ (Sir Waren Fisher) చెప్పినట్లు విధాన నిర్ణయం మంత్రి విధి. ఒకసారి విధానము నిర్ణయించబడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగికి తిరుగులేని నిరాటంకమైన విధి ఆ విధానాన్ని తనకు ఇష్టమున్నా లేకున్నా ఆచరణలో పెట్టడమే.

మంత్రి తప్పనిసరిగా సంప్రదించ వలసిన విషయాలను నిక్కచ్చిగా కేటాయించడం కష్టము. మంత్రిత్వశాఖ పాలనాధిపతియైన కార్యదర్శి తమ మంత్రి మనస్తత్వాన్ని బట్టి ఏయే విషయాలలో ఆయనను సంప్రదించవలెనో

ముందుగా ఒక పట్టికను తయారు చేసుకొనవలెను. G.A. కంపబెల్ (G.A. Campbell) బ్రిటన్‌లో సివిల్ సర్వీసు (The Civil Service in Britain) అనే తన పుస్తకములో వ్రాసినట్లు అన్ని శాఖలలో ఎదురయ్యే సమస్య మంత్రికి ఎంతవరకు నివేదించాలనే నిర్ణయం తీసుకోవడం. మరీ ఎక్కువ విషయాలను చర్చించినచో రాజకీయ అధిపతి సమయం దొరకక కాగితాలన్నీ పూర్తిగా అధ్యయనం చేయక పోవచ్చు. సమస్యలను పరిష్కరించడంలో ఆయన తీసుకొనే నిర్ణయాలు అసంతృప్తికరంగా ఉండవచ్చు. మరో ప్రక్కన అధికాలు మంత్రి సమ్ముఖమునకు అతిముఖ్యమైన విషయాలనే తీసుకువెళ్ళి చర్చించేటట్లయితే మంత్రి లేనను వారందరు నిర్లక్ష్యము చేసినట్లు అంధకారములో పడవేసినట్లు భావించవచ్చు. రాజకీయ నాయకునికి కాగితాల భారము తలకు మించిన భారమై దానిని సమర్థవంతంగా చురుకుగా తొలగించలేకపోతే దానినే ఒక తొందరగా చదువగల వ్యక్తి తన మేధా సంపత్తితో అకుంఠిత దీక్షతో అటువంటి భారాన్ని అవలీలగా ఎదుర్కొనగలడు. అనుభవజ్ఞుడైన మంత్రి ఆఫీసు ఫైళ్ళలో ముఖ్యమైన సమచారమును కనుగొని స్పష్టంగా ఆదేశాలను ఇవ్వగలడు.

ప్రతి మంత్రిక ఒక ప్రత్యేక తరహా ఒరవడి పని సంస్కృతి ఉంటుంది. ప్రభుత్వ విధానము రూపకల్పన చేసి నిర్ధారించి ముఖ్యమైన విషయాలుతో తానే నిర్ణయం తీసుకొని మిగతా విషయాలన్నింటిని ప్రభుత్వ ఉద్యోగుల వివేకమునకు వదలవలెను. ఆ విధంగా చేసేటపుడు మంత్రికొన్ని విషయాలలో ఉద్యోగులు తీసుకున్న నిర్ణయాలు సరైనవి అవునా కాదా యని అప్పుడప్పుడు తనిఖీ చేసినచో ఉద్యోగులు జాగురూకులై మంత్రికి జవాబుదారి వహించి ఉంటారు.

## 18.7 సాంప్రదాయ పద్ధతులపై విమర్శ (A critique of Conventional Methods)

BRAOU

నేటి జవాబుదారి పద్ధతులు కాలానుగుణంగా లేవు. ప్రభుత్వ పాలన కొద్ది పరిమాణంలో ఉన్నప్పుడు చిన్న చిన్న వ్యవహారాలనే చక్కపెట్టుతున్నపుడు సాంప్రదాయకంగా కొన్ని జవాబుదారి సాధనాలు పద్ధతులు ఆచరణలో యున్నాయి. కాని ఈ రోజులలో ప్రభుత్వ పాలనా స్వభావము పరిమితి ప్రాముఖ్యము ఊహాతీతంగా మార్పు చెంది ప్రగతి పథంలో నానాటికి క్రొత్త ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజాస్వామ్య పద్ధతులలో చేపడుతున్నప్పుడు, సాంప్రదాయక సాధనాల ద్వారా అటు మంత్రి వర్గమునుగాని ఇటు ప్రభుత్వ ఉద్యోగులను గాని పార్లమెంటుకు తద్వారా ప్రజలకు జవాబుదారులుగా చేయలేము.

అందువలనే త్వరితగతిని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జవాబుదారి పద్ధతులు కూడా మార్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో జవాబుదారి పద్ధతులలో కొన్ని మౌళిక నిర్మాణాత్మక మార్పులు తీసుకొచ్చి సమైక్య జవాబుదారి సిద్ధాంతమునకు శ్రీ కారం చుట్టాలి. పార్లమెంటు తన పాత్ర బాధ్యతలు గుర్తు ఎరిగి రాజకీయ కార్యనిర్వాహకుని నేతృత్వంలో ప్రభుత్వ కార్యకలాపాల సమీక్షకు తగిన అవకాశం ఇవ్వవలెను. మంత్రి మండలి భవిష్యత్ కార్య క్రమప్రణాళికకు రూపకల్పన చేసి దానిని ఆచరణలో పెట్టుటకు తగిన విధాన నిర్ణయాలను తీసుకుని పరిసర సదుపాయాలను ఇతరవసతులను ఏర్పరచవలె. మంత్రులు తమ వ్యక్తిగత యాజమాన్య పరిధిలో ఆచరణాత్మక విధాన నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వ యంత్రాంగమును ఉత్తేజపరిచి శాఖలలోను ఉపశాఖలలోను సామర్థ్యం, లక్ష్యం, మిత వ్యయము అనే భావాలను దృఢ సంకల్పంతో వ్యాపింప చేయవలె. తలపెట్టిన లక్ష్యాలను సాధించుటకు మంత్రి కాల పట్టికకు అనుగుణంగా విధానాలను పథకాలను సమీక్షించి వాటికి తగిన మెరుగులు దిద్దవలె. ఉద్యోగబృందమునకు రథసారధియై ఎల్లపుడు అధికారులు అప్రమత్తులై ఉండేట్లు వారి శక్తి సామర్థ్యాలకు అగ్ని పరీక్ష పెట్టవలె. సీనియరు అధికారులు ప్రభుత్వ విధానాలను ఆచరణాత్మక పథకాలుగా రూపొందించి జవాబుదారి నిర్వహణా బాధ్యతను

చేపట్టవలె. క్రమానుగత శ్రేణిలో యున్న వివిధ స్థాయిలకు పూర్తి అధికారాలను బాధ్యతలను యివ్వవలెను. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నత స్థాయి ఉద్యోగులలో అధికారం కేంద్రీకృతమైనప్పటికి, క్రింది స్థాయి ఉద్యోగులే జవాబుదారులై ఉంటారు, అందుకే అంతర్గత నిర్వహణ సాధనాలు అనగా తనిఖీ, వ్యక్తిగత పర్యటన, నియంత్రణ, పర్యవేక్షణ మొదలగు శాస్త్రీయ పద్ధతులను పునరుద్ధరించి వాటిని ప్రభుత్వ ఉద్యోగులు ద్విగుణీకృత ఉత్సాహంతో అమలులో పెట్టవలెను.

జవాబుదారి పద్ధతులను ఒక యదార్థ ప్రతిపాదనగా చలామణిలోకి తీసుకు రావడానికి కొన్ని నిబంధనలను పాటించవలెను. వికేంద్రీకరణ, దత్తత అధికారము మరియు విభజన మొదలగు నిర్వాహణ పద్ధతులు జవాబుదారి విధానమునకు గీటురాళ్ళు. జవాబుదారి విధానము ఆచరణాత్మకమైన ప్రక్రియ, ఫలితాన్ని సాధించుటకు కావలసిన ఒరవడి బాధ్యాతాయుత ప్రభుత్వ ఆధ్వర్యముతో నిర్ధారింపబడిన పద్ధతులను త్రోసి రాజనే అధికారం ప్రభుత్వ ఉద్యోగులకు లేదు. అందుచేతనే నియమనిబంధనలను సూక్ష్మీకరించి కాలయాపన కాకుండా అనవసర పద్ధతులు విడనాడాలి. ఉద్యోగబృంద పాలనా నిర్వహణలో ముఖ్యంగా శిక్షణ, నియామకము ఆచరణ మూల్యాంకన పదోన్నతి మొదలగు విషయాలలో సరైన మార్పులు వెంటనే తీసుకురావాలి. సార్థకమైన జవాబుదారి తనమునకు పరిపాలనా సంస్కరణలు ముఖ్యంగా సివిల్ సర్వీసు సంస్కరణలు ఎంతో సత్ఫలితాలను ఇస్తాయి. ప్రభుత్వ పాలనలో జవాబుదారి పద్ధతులు సమర్థవంతంగా పనిచేయాలంటే వాటిలో నిర్వాహణ పద్ధతులను జోడించవలె. వ్యవస్థ లక్ష్యాలను అమలులో పెట్టడంలో సాధించిన ప్రగతిని నివేదిక ద్వారా తెలియపరిచే సమాచార విధానాన్ని ఆచరణలో పెట్టి వెనువెంటనే చర్యలను తీసుకు రావాలి. పరిపాలనా సరళిలో రహస్యపు అంతరంగిక విషయాలను క్రమబద్ధీకరించి బహిరంగ విధానాన్ని పెంపొందించాలి. దీనిని ఆచరణలో పెట్టుటకు అధికారుల రహస్య చట్టాన్ని (Official Society Act) సంస్కరించి పౌరులకు ప్రభుత్వ పాలనలో అనేక రంగాల సమాచారాన్ని అందుబాటులో ఉండేలా చేయవలెను. ప్రస్తుతం వాడుకలో యున్న రహస్య శాసనాలు అధికారులకు రక్షణ కల్పించడానికి అంటే వారు ఏదైనా విషయానికి బాధ్యత వహించకుండా తోడ్పడుతాయి గాని అధికార సమాచారాన్ని రహస్యంగా ఉంచడానికి కాదు. అన్నింటికంటే ముఖ్యమైనది జవాబుదారి పద్ధతులకు గంభీరమైన విషయము మరొకటి వుంది. జవాబుదారీ వహించే వారు జవాబుదారి పద్ధతులను అమలులో పెట్టేవారు ఇద్దరు మానవ మాత్రులే, ఎవ్వరు తప్పొప్పులకు అతీతులు అయిన వారు కారు. పరస్పర సంబంధాలలో వ్యవస్థా లక్ష్యాల ప్రేరణ ప్రమేయం తప్పని సరిగా ఉండకపోతే రెండువైపుల వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రైవేటు స్వలాభాలకు తావిచ్చి నట్లవుతుంది. జవాబుదారి పద్ధతులు పాతపడి పోకుండా చెడిపోకుండా తరుచు వాటిని తగిన మెరుగులు దిద్దవలసిన అవసరము ఎంతోవుంది.

## 18.8 జవాబుదారి పద్ధతుల క్రమబద్ధీకరణ (A Frame-work of Accountability)

జవాబుదారీ పద్ధతి చారిత్రకంగా ఒకవైపు రహదారి (one way traffic) మాత్రమే ప్రభుత్వ పాలనా విధానము ఎల్లప్పుడు పౌరులకు నియమనిబంధనలను రూపొందించి వాటికి కట్టుబడి ఉండేట్లు శాసించి తాను మాత్రము స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు పౌరులు తమ రాబడి పన్ను వివరాలను ఖచ్చితంగా ఒక నిర్ధారింపబడిన తేదిని ప్రతి సంవత్సరం క్రమబద్ధంగా సమర్పించాలని ఒకవైపు ఆదేశాలిస్తూ మరోవైపు ఉద్యోగిస్వామ్యం మాత్రమే వారి కేసులను పరిష్కరించుటకు కాలపరిమితి లేకుండా ఎంతో జాప్యము చేసి పౌరులకు సరైన న్యాయము చేకూర్చుట లేదు. ఇటువంటి సందర్భాలలో ఒక నిర్ణీత గడువు ప్రకారం పౌరునికి న్యాయము జరుగక పోయినచో అ పౌరునకు అనుకూలంగా నిర్ణయము ఇవ్వవలసి వచ్చినచో పాలనా యంత్రాంగము మరింత జవాబుదారి వహించవలసి వస్తుంది.

అదే విధంగా ప్రస్తుత విధానాన్ని విడనాడవలయును. కొన్ని చట్టాలు (నియమాలు, నిబంధనలతో సహా) కాల పరిమితి లేకుండా నిరంతరం అమలులో యుండడం కూడా సబబుకాదు. శాసన సభలు కొంతకాలము తరువాత అనవసరమైన చట్టాలు కాలగర్భములో కలిసిపోయేట్లు సూర్యాస్తమయ శాసనాల (Sunset legislations) భావనకు శ్రీ కారం చుట్టాలి. అదే విధంగా కార్యనిర్వాహక వర్గము పాలనా వ్యవహారాలలో వివేకము న్యాయము తప్పకుండా చేటుచేసుకొనేందుకు జీరోబేస్ బడ్జెటింగు (Zero-base Budgeting) ను ప్రవేశ పెట్టడము ఎంతో అవసరం. ఈ భావన ద్వారా సంక్రమించే అత్యంత గొప్ప ప్రయోజనము ఏమనగా ప్రతి సంస్థ నిరంతరము కఠినమైన క్రమబద్ధమైన పరిశీలనకు గురి అవుతుంది. ఎప్పటికప్పుడు దాని జయాపజయాలు బాగోగులు తెలుసుకొని కాలానుగుణ పరిస్థితుల దృష్ట్యా దానిని కొనసాగించడమో నిర్మూలించడమో జరుగుతుంది.

మరొక ముఖ్య విషయము ఏమనగా ప్రతి ప్రజాసంస్థకు ముఖ్యంగా పబ్లిక్‌రంగ సంస్థలకు సామాజిక ఆడిట్ అవసరం ఎంతైనా వుంది. సామాజిక ఆడిట్ ఒక కొత్తభావన. అది క్రిందటి దశాబ్దంలోనే వాడుకలోకి వచ్చింది. అనేక ప్రజాసంస్థలు శాసనరీత్యా సమర్పించే కొంత కాలములో వాణిజ్య జమాఖర్చుల పట్టిక (Commercial balance sheet)లో సామాజిక జమా ఖర్చుల పట్టిక ( Social balance Sheet) కూడా తప్పనిసరిగా ఒక భాగంగా రూపొందుతుంది.

ఆఖరిగా మనము గుర్తించవలసిన విషయమేమంటే భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగుల హక్కులకు అధికారాలకు సంబంధించిన టార్ట్సు చట్టము (Law of Torts), మన దేశములో బాగా అభివృద్ధి చెందలేదు. ప్రభుత్వ అధికారులలో తమ విధులపట్ల నిర్లక్ష్యవైఖరికి అవి చెప్పుకోదగిన కారణాలు. ప్రస్తుతము ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణలో లోపాలున్నా కొన్ని నిర్దిష్టమైన చట్టపరమైన అంశాలు వారిపై ఎటువంటి న్యాయ చర్య తీసుకోకుండా వారిని రక్షిస్తూ వున్నాయి. పౌరులకు ఎంతో కష్ట నష్టాలను కలిగిస్తున్నాయి. ఉదాహరణకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగియైన ఉద్యోగ నిర్వహణలో ఏదైనా నేరమును చేసినా, చేసినట్లు ఆరోపించబడినా అతనిని శిక్షించే ముందు సంబంధిత కేంద్ర ప్రభుత్వమును గాని రాష్ట్ర ప్రభుత్వమును గాని సంప్రదించి వారి అనుమతి తీసుకొనవలయును. అప్పటి వరకు రాజకీయ పౌర హక్కులపై అంతర్జాతీయ ఒప్పందముపై భారతదేశము కొంతవరకు పెట్టలేదు. అందులో ఒక అంశము ప్రకారం నష్టపోయిన పౌరునికి తగిన పరిహారము చెల్లించవలసిన బాధ్యత ఆయా రాజ్యాలపై యుంది. ఇటువంటి కొన్ని న్యాయ నిర్ణయాలు ప్రభుత్వఅధికారులను క్రమశిక్షణకు లోబడేటట్లు వారి చర్యలవల్ల లేదా చర్యలు తీసుకోనందు వలన అన్యాయానికి గురైన పౌరులకు కొంత ఉపశమ్యము కలగించేందుకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇది ఎంతో శుభపరిణామం. 1980సం.లో మొదట్లో భారతఉన్నత న్యాయస్థానము (Supreme Court) ఒక సంచలనాత్మకమైన తీర్పును ఇచ్చింది. అదేమనగా బీహార్ ప్రభుత్వము నిరపరాధియని నిర్ధారించబడిన ఒక ఖైదీకి విడుదల ఆదేశములను 14 సంవత్సరముల వరకు ఇవ్వకుండా అమానుషంగా ఆలస్యము చేసినందుకు ఆఖైదీకి నష్టపరిహారముగా రూ.30,000లు చెల్లించాలని ఉన్నత న్యాయ స్థానము బీహారు ప్రభుత్వమును ఆదేశించింది. రాజ్యము తీసుకునే చర్యలు మరియు తీసుకోని చర్యలు ప్రభావము వలన పౌరుల జీవనానికి సుఖశాంతులకు అవరోధాలు ఏర్పడినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు వారికి తగిన నష్టపరిహారము చెల్లించవలెనని కోరుతూ న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవాలి. దానితోపాటు న్యాయముసాధ్యమైనంత మిత వ్యయంతో త్వరగా తక్కువ ఇబ్బందులతో ప్రజలకు

BRAOU

అందుబాటులో యుండవలయును. అప్పుడే ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల పట్ల అప్రమత్తులై తమ సంబంధిత మంత్రికి, మంత్రి ద్వారా పార్లమెంటుకు, పార్లమెంటు ద్వారా ప్రజలకు జవాబుదారులై ఉంటారు.

## 18.9 సారాంశము

పైన చర్చించిన భావనలు ఫలదాయకములు కావాలంటే వాటిని త్రికరణ శుద్ధిగా నమ్మి అంకిత భావముతో ఆచరించవలెను. తరుచు పాలనా యంత్రాంగములను ప్రక్షాళనము చేస్తూ సంస్కరణల మూల్యాంకనముల ద్వారా మరింత శక్తి సామర్థ్యాలను అలవరుచుకొనేలా చేయవలెను. జవాబుదారి పద్ధతులు రెండు వైపుల రహదారి (Two way Traffic)గా అటు ప్రభుత్వ లక్ష్యాలను సాధించడములో ఇటు ప్రజారంజకముగా పాలించడములో ప్రభుత్వ అధికారులు సిద్ధహస్తులై యుండవలెను.

## 18.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I** ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానము వ్రాయుము

1. `జవాబుదారి' అనే పదమునకు అర్థమును వివరించి దాని ప్రాముఖ్యము తెలుపుము.
2. జవాబుదారి పద్ధతులను వివరించుము.
3. జవాబుదారి పద్ధతులలో సమిష్టి బాధ్యత, మంత్రిత్వబాధ్యతలకు సంబంధించిన బహిర్గత అంశాలను చర్చించుము.

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో సమాధానము వ్రాయుము.

1. సాంప్రదాయక జవాబుదారి పద్ధతులను విమర్శించుము.
2. జవాబుదారి విధానాన్ని అమలు పరిచేందుకు ఉపయోగపడే ఇతర సాధనాలు, పరికరాలను పేర్కొనుము.
3. జవాబుదారి పద్ధతులను ఏ విధముగా క్రమబద్ధీకరించగలవు ?

BRAOU

## 18.11 చదువదగినరచనలు


1. S.R. Maheswari : Theory and concepts in Public Administration.

2. Herbert Morrison : Government and Parliament (London Oxford University Press, 1964)

3. (Chairmain : M.C Chagla) : Report of inquiry into the affair of the Life Insurance Corporation of India

4. Paul H., Appleby : Policy and Administration (Alabama University of Alabama Press, 1949)

5. G.A. Campbell : The Civil Service in Bitain (Landon Gerald Duch work, 1965)

6. B.B. Misrva : Evolution of the concept of Administrative Accountability.

7. R.B. Jain : Contemporary Issues in Public Administra tion

8. Awasthi & Maheswari : Public Administratration



రచయిత : డా|| ఎమ్.ఆర్. ఆచార్య



BRAOU

# భాగం - 19 : పాలనలో నిజాయితీ

## విషయక్రమం


19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 నిజాయితీ ప్రాధాన్యత

19.3 నిజాయితీ - లాంఛనప్రాయమైన అంశాలు

19.4 పాలనలో నిజాయితీని ప్రభావితం చేసే అంశాలు

19.4.1 రాజకీయ పరిసరాల ప్రభావం

19.4.2 మానసిక పరిసరాల ప్రభావం

19.4.3 సామాజిక, ఆర్థిక పరిసరాల ప్రభావం

19.4.4 పాలనా పరిసరాల ప్రభావం

19.5 పాలనా నిజాయితీ, తులనాత్మక పరిశీలన.

19.6 పాశ్చాత్య దేశాలలో పాలనా నిజాయితీ

19.7 అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా నిజాయితీ

19.8 భారతదేశంలో పాలనా నిజాయితీ

19.9 ఉద్యోగిబృందం విలువలు, పాలనా నిర్వర్తన ప్రమాణాలు

19.10 పాలనలో నిజాయితీని పెంపొందించే మార్గాలు

19.10.1 పనిపట్ల విశ్వాసం, దృఢ సంకల్పం

19.10.2 రాజకీయాలలో నైతిక ప్రమాణాలను మెరుగుపర్చాలి

19.10.3 వ్యవస్థ ఆదర్శాల పట్ల నిబద్ధత

19.10.4 పాలనలో ప్రజల భాగస్వామ్యం

19.10.5 దేశీయమైన పరిష్కారాల రూపకల్పన

19.10.6 సమాజం నైతిక ప్రవర్తనను మెరుగు పర్చాలి

19.10.7 ప్రభుత్వ ఉద్యోగులలో అనైతికతను అరికట్టే యంత్రాంగం ఏర్పాటు

19.11 సారాంశం

19.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

19.13 చదువదగిన రచనలు


## 19.0 లక్ష్యాలు

ప్రభుత్వ పాలనలో నిజాయితీ వివరించడం ఈ భాగం ప్రధానోద్దేశం. ఈ భాగాన్ని చదివితే మీరు ఈ క్రింది విషయాలను వివరించగలరు.

* ప్రభుత్వపాలనలో నిజాయితీ ప్రాధాన్యత
* పాలనోద్యోగులలో నిజాయితీ ప్రభావితం చేసే అంశాలు
* వివిధ దేశాలలో పాలనా నిజాయితీ పరిస్థితి
* పాలనలో నిజాయితీని మెరుగు పర్చేందుకు చేపట్టవలసిన చర్యలు

BRAOU

## 19.1 పరిచయం

ప్రభుత్వ ఉద్యోగిబృందం నిజాయితీ ప్రజలకు సంపూర్ణమైన విశ్వాసం ఉండటం పాలనా వ్యవస్థ సక్రమ నిర్వర్తనకు ముఖ్యావసరం. ప్రజల ప్రయోజనాల పట్ల నిబద్ధత కలిగి ఉండటం ప్రైవేట్ ఉద్యోగుల కన్నా ప్రభుత్వ ఉద్యోగులకే అధిక అవసరం. ప్రభుత్వ ఉద్యోగులు తమ కర్తవ్య నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతున్నారంటే వారు సమాజానికి సమర్థవంతమైన నిష్పక్షకమైన, సేవలందించటంలో ప్రజలు ఆశించే ప్రమాణాలను అనుగుణంగా ప్రవర్తించటంలో విఫలమైనట్లే.

ప్రభుత్వపాలనలో నిజాయితీ సూత్రాలను ఉల్లంఘించటం వలన చాలా తీవ్ర పరిమాణాలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వ స్వభావం, చివరకు దాని ఉనికికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉద్యోగులు పాటించవలసిన ఉన్నత ప్రమాణాలేవో ఖచ్చితంగా, అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ధారించబడలేదు. కాని ఒక నిర్వచనం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు సమిష్టిగా లేదా వ్యక్తి గతంగా తమ అధికారాన్ని ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే విధంగా, ప్రజల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తూ తమ స్వార్థ ప్రయోజనాలను సాధించుకునేందుకు ఉపయోగించినపుడు పాలనలో నిజాయితీ సమస్య ఉత్పన్నమవుతుంది.

BRAOU

ప్రభుత్వ ఉద్యోగులలో నిజాయితీ క్షీణించటానికి, అనైతిక ప్రవర్తన ఏర్పడటానికి రాజకీయ, పాలనా రంగాలలో రాజ్యం ఏర్పరిచిన పద్ధతులకు భిన్నంగా వారు ప్రవర్తించటం, చర్యలు చేపట్టడం ప్రధాన కారణంగా భావించాలి. ప్రభుత్వం అమలు పర్చే, లేదా ప్రబోధించే సాధారణ ప్రవర్తనను అనైతిక ప్రవర్తనగా భావించవచ్చును.

ప్రభుత్వ ఉద్యోగుల అనైతిక పరిధి చాలా విస్తృతమైంది. దీనిలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి. వీటిలో అవాంఛనీయమైన పద్ధతులలో ప్రభుత్వ అధికారులను, లేదా వనరులను తమ ప్రయోజనాలకు వినియోగించటం కీలకాంశం. ఉద్యోగుల నైతిక ప్రవర్తనలో ఈక్రింది అంశాలు ఇమిడి ఉన్నాయి. 1. దేశంలో అమలులో ఉన్న న్యాయ ప్రమాణాలకు వ్యతిరేకమైన, శిక్షించేందుకు వీలైన చర్యలు. 2. సమాజం ఏర్పరిచిన మౌళిక నైతిక సూత్రాలకు భిన్నమైన చర్యలు 3. విధేయత, మతం, కులం, స్నేహం, బంధుత్వం మొదలైన సామాజిక బాధ్యతల వల్ల చేపట్టే నిగూఢ (latent) లేదా అభివ్యక్త (manifest) చర్యలు.

పై అంశాలతో పాటు ఉద్యోగుల అనైతిక ప్రవర్తనలో విధుల దుర్వినియోగం, లంచగొండితనం,. బంధుప్రీతి, ఆశ్రితజన పక్షపాతం, ప్రభుత్వ రహస్యాలను బహిరంగపర్చటం, ఆమోదం పొందకుండా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటం, తన బంధువులు లేదా స్నేహితులకు ప్రయోజనం చేకూర్చే విధంగా తమ అధికారాలను వినియోగించటం మొదలైన అనేక ఇతర అంశాలు ఇమిడి ఉన్నాయి.

ఈ విధంగా పాలనలో నిజాయితీ దిగజార్చే అనైతిక ప్రవర్తనలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి. దీనిని బట్టి ప్రభుత్వ పాలనలో నిజాయితీ సాధించటం ఆ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళలో ముఖ్యమైన సవాలుగా రూపొందింది. ఈ సవాలును ఎదుర్కొనటంలో అనేక దేశాలు అనేక పద్ధతులను, మార్గాలను అవలంబిస్తున్నాయి. అయినప్పటికీ, పెక్కు దేశాలలో పాలనా వ్యవస్థలో పరిపూర్ణమైన నిజాయితీ ప్రమాణాలను సాధించటంలో సఫలీకృతమవ్వలేదని చెప్పవచ్చును.

## 19.2 నిజాయితీ - ప్రాధాన్యత

ప్రస్తుత కాలంలో ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజ్యం పాత్ర విపరీతమైన స్థాయిలో పెరిగింది. దీనికి సైద్ధాంతిక, ఆచరణాత్మక కారణాలు ఉన్నాయి. అయితే ఈ దేశాలలో రాజ్యానికి తమ పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించే కార్య సాధక గుణం లోపించింది. లేదా ఈ గుణం పూర్తిగా అభివృద్ధి చెందలేదు. ఈ లోపాన్ని తొలగించాలని ప్రభుత్వం పై ఒత్తిడి పెరిగింది. వర్తమాన దేశాల్లో ప్రభుత్వం నూతనంగా నిర్వర్తిస్తున్న విధులు, కేవలం యాంత్రికమైనవి కాకపోగా, వాటి ప్రభావం అపరిమితం. ఈ విధులు ప్రజలందరి మొత్తం జీవితాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉన్నాయి. దీంతో పాటు రాజకీయ నాయకులు రూపొందించిన విధానాలను, నిర్ణయాలను అమలు పర్చటం మాత్రమే ప్రభుత్వపాలనా ఏకైక కర్తవ్యం. అనే దృక్పథంలో మార్పు కల్గింది.

ప్రస్తుతం విధానాలు, పాలన ద్విభాజత్వం తన ప్రాధాన్యతను పూర్తిగా కోల్పోయింది. ప్రభుత్వ ఉద్యోగులు విధాన రూపకల్పనలో విస్తృతమైన పాత్రను నిర్వర్తిస్తున్నారు. వారు విధాన నిర్ణయీకరణలో మంత్రులకు సలహాలను ఇవ్వటంతో పాటు నియమనిబంధనలను రూపొందించటం, పూర్వ ప్రమాణాలను ఏర్పరచటం మొదలైన చర్యలద్వారా విధాన రూపకల్పన ప్రక్రియలో కీలకమైన పాత్రను వహిస్తున్నారు. దీంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజల ఆశ్రయత పరిమాణంలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. ఈ దేశాలలో పాలన ఉద్యోగులను ఆశ్రయించే ప్రజలలో అధిక శాతం నిరక్షరాస్యులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారు. దీని ఫలితంగా పాలనోద్యోగులు, పౌరుల సంబంధాలు సమానాంతర స్థాయి (Horizontal level) లో కాక క్షితి జలాంబ (Vertical) రూపంలో ఉన్నాయి.

ఈ విధంగా ప్రస్తుత కాలంలో పాలనోద్యోగుల పాత్ర, ప్రాధాన్యతలు విపరీతమైన స్థాయిలో పెరగటంచేత వారు తమ విధి నిర్వహణలో నిజాయితీని పెంపొందించుకునేందుకు ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పాలనలో నిజాయితీ ప్రాముఖ్యత గతానికంటే ప్రస్తుతం అధికంగా ఉంది. ప్రభుత్వ పాలన ఒక వృత్తిగా రూపొందించేందుకు అది తన విధుల నిర్వర్తనలో ఒక ప్రవర్తనా నియమావళిని ఏర్పరుచుకుని. దానిని అనుసరించే అవసరం ఏర్పడింది.

## 19.3 పాలనా నిజాయితీ లాంఛన ప్రాయమైన అంశాలు

ప్రభుత్వ ఉద్యోగిబృందంలోని ప్రతి సభ్యుడు అవినీతి చర్యకు పాల్పడకపోవడం లేదా ఆ చర్యలకు పాల్పడేందుకు ప్రయత్నించక పోవడం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ పాలనా నిజాయితీ ఒక కీలకాంశంగా రూపొందింది. ఇదే విధంగా పాలనా ప్రవర్తనలో నిషేదించబడిన అంశాలు ఇంకా అనేకం ఉన్నాయి. ఉదాహరణకు, భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగి తన విధులకు పూర్తిగా అంకిత మవ్వాలను నిర్దేశించబడింది. ప్రభుత్వ ఉద్యోగి తన విధి నిర్వహణలో నిజాయితీగా, నిష్పాక్షికంగా వ్యవహరించటమే కాక, ఆ విధంగా ప్రవర్తిస్తున్నావ్ అనే అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించాలి. ప్రభుత్వ ఉద్యోగి తన వ్యక్తిగత జీవితంలో కూడా ఉన్నత ప్రవర్తనా ప్రమాణాలను పాటించాలి. తన అవినీతి చర్యల ద్వారా తను సేవిస్తున్న ప్రభుత్వం ప్రతిష్టను దిగజార్చరాదు.

BRAOU

ప్రస్తుత కాలంలో ప్రభుత్వ ఉద్యోగులు విపరీతమైన స్థాయిలో వివేచానాధికారాన్ని కలిగి ఉన్నారు. పాలనా నిర్ణయాలను జాప్యం లేకుండా అమలు పర్చేందుకు, ప్రభుత్వ ఉద్యోగులు తమ విచక్షణాధికారాన్ని దుర్వినియోగ పర్చకుండా నివారించేందుకు అనేక దేశాలలో ఉద్యోగుల కొరకు ఏర్పరిచిన ప్రవర్తనా నియమావళిలో అనేక నిబంధనలు చేర్చారు. వీటి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనాలు అనుమతించినదాని కంటె అధికంగా ఆస్తులు సంపాదించినా, లేదా సంపదను కూడబెట్టినా అందుకు సంతృప్తికరమైన వివరణ చూపించవలసి ఉంది. ఈ విధమైన వివరణను ఇవ్వడంలో విఫలమైనపుడు ఆ ఉద్యోగులు తమ అధికారాల దుర్వినియోగానికి లేదా అవినీతికి పాల్పడినట్లు భావించబడతారు. తగిన విధంగా శిక్షింపబడతారు. ప్రభుత్వ ఉద్యోగులు స్థిరాస్తులను కొనుగోలు చేయటాన్ని క్రమ బద్ధీకరించే నియమ నిబంధనలను రూపొందించారు. ఉదాహరణకు, భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సంవత్సరం తాము సంపాదించిన, లేదా తమకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల వివరాలను ప్రభుత్వానికి అందచేయాలి. మరో నిబంధన ప్రకారం ఉన్నత పదవులలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అనుమతితో తప్ప తమ కుమార్తెలు లేదా కొడుకులను తాము అధికార పూర్వకంగా లావాదేవీలు నిర్వహిస్తున్న ప్రైవేటు సంస్థలలోని ఉద్యోగాలలో చేరేందుకు అనుమతించరాదు. ఈ నింబంధన ప్రధానంగా అఖిల భారత సర్వీసులకు చెందిన ఉద్యోగులకు వర్తిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగుల నైతిక ప్రవర్తనను నియంత్రించడం అంటే వారు నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని దీని అర్థం కాదు. ప్రభుత్వ ఉద్యోగులు నైతిక సూత్రాలను ఆచరించడం అనేక అంశాలపై ఆధారపడి ఉంది. సమాజంలోని ఇతర వ్యవస్థలు విలువల వ్యవస్థను (Value systems) కలిగి ఉండకపోతే కేవలం ఉద్యోగిబృంద ఉపవ్యవస్థ మాత్రమే విలువలను పాటించడం ఆచరణలో అసంభవమైన అంశంగా గుర్తించాలి. సమాజంలోని ఇతరవర్గాలకు విధించిన నిరోధాలను (Restrictions) ఉద్యోగిబృందానికి మాత్రమే విధించడం అసమంజసంగా తోస్తుంది. అంటే ఉద్యోగిబృందం వ్యవస్థ నైతిక ప్రమాణాలను పాటించేందుకు సమాజంలోని ఇతర వర్గాలు కూడా కొన్ని నైతిక ప్రమాణాలను పాటించడం అవసరమున్న విషయాన్ని గుర్తించాల్సి ఉంది. సమాజంలో నైతిక విలువలు నశించినపుడు ఉద్యోగిబృందం ఆ విలువలను కట్టుబడి ఉండాలని ఆశించటం నిరర్థకం. ఈ వాస్తవాన్ని భారతదేశ పరిస్థితి పూర్తిగా బలపరుస్తున్నది. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఆశించిన ప్రవర్తనకు, వారి వాస్తవ ప్రవర్తనకు మధ్య అంతులేని అంతరం ఏర్పడింది. సిద్ధాంత పరంగా చెప్పాలంటే నైతిక ప్రవర్తన లేదా అవిభాజ్యం (indivisble), సమాజంలోని ఇతర ఉపవ్యవస్థల్లో (ప్రధానంగా రాజకీయ ఉపవ్యవస్థ) నిజాయితీ, నైతిక ప్రవర్తన లోపించినపుడు, కేవలం ఉద్యోగిబృందం ఉపవ్యవస్థ మాత్రమే ఉన్నత నైతిక ప్రమాణాలను ఆచరిస్తుందని భావించటం అసమంజసమే అవుతుంది.

BRAOU

## 19.4 పాలనలో నిజాయితీని ప్రభావితం చేసే అంశాలు

పాలనలో నిజాయితీని ప్రభావితం చేసే అంశాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

### 19.4.1 రాజకీయ పరిసరాల ప్రభావం

పాలనోద్యోగులు రాజ్యాంగ, చట్టబద్ధమైన పరిధిలో పనిచేయాల్సి ఉంటుంది. కనుక వారి ప్రవర్తనపై ప్రభుత్వం, న్యాయస్థానాలు విధించే నియంత్రణా ప్రమాణాల ప్రభావం ఉంటుంది. పాలనా యంత్రాంగంపై కల ఈ నియంత్రణ పాలనోద్యోగులు నిర్వర్తనపై నిరోధకంగా పనిచేస్తుంది. ఈ నిరోధం లేనప్పుడు, లేదా కార్యనిర్వాహక

విభాగం విపరీతమైన అధికారాలను చెలాయించడం వల్ల శాసనా నిర్మాణ శాఖ బలహీనమైనపుడు ప్రభుత్వ ఉద్యోగులు తమ జవాబుదారీ తనాన్ని (Accountability) ప్రధాన నిర్వాహకుని ప్రయోజనాలకు ఫణంగా పెట్టవలసివస్తుంది. ఇదే విధంగా, న్యాయశాఖ నిజాయితీ, కార్యనిర్వహణ శాఖ నుంచి దానికి కల స్వేచ్ఛ పరిమాణం, ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగం, చట్టాలు విధించిన ప్రమాణాలను ఉల్లంఘించినప్పటికీ శిక్ష ఉండదని నమ్మకం ఏర్పడినపుడు వారు అనైతిక ప్రవర్తన పాల్పడేందుకు దోహదం చేస్తుంది. ఉద్యోగుల రాజకీయ అధికారుల ప్రయోజనాలకు అనుగుణంగా తమ కార్యకలాపాలను, నిర్వర్తించామనే సాకుతో తమ ప్రవర్తనకు హేతు బద్ధతను సాధిస్తారు.

ఇదే విధంగా, కేవలం న్యాయశాస్త్రంతో పరిచయం ఉన్న వారికి తప్ప ఇతరులకు అవగాహన చేసుకోలేని చట్టాలను అపరిమితమైన రూపొందించినపుడు లేదా ఉద్యోగులకు విచక్షణాధికారాన్ని అప్పగించినపుడు వారు కొందరు పౌరులకు ప్రత్యేక సౌకర్యాలను కల్పించేందుకు తమ స్వతంత్ర ప్రమాణాలను నిర్ధారిస్తారు. కొన్ని సందర్భాలలో సదుద్దేశంతో లేదా సరియైన అవగాహన లోపించటం వల్ల ప్రభుత్వఉద్యోగులు రాజకీయ వ్యవస్థ ఒత్తిడికి లోనుకావటం జరుగుతుంది. కొన్ని సమయాల్లో ప్రత్యేక సౌకర్యాలను కల్పించకపోవటం లేదా అందరూ ఆమోదించిన ప్రమాణాలకు కట్టుబడకపోవటం ఉద్యోగి, అతని కుటుంబంపై తీవ్రమైన పరిణామాలకు గురిచేస్తాయి. ఈ విధంగా తగిన రక్షణలు లేకుండా ప్రతిఘటించటం దుస్సాధ్యం. ఈ పరిస్థితులలో నిజాయితీ పరులైన ఉద్యోగులు సైతం ప్రతిఘటనను మాని రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తారు.

అనేక దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులు, పలుకుబడి కల పౌరులు చేసే ఒత్తిడికి గురికాక తప్పదు. ఈ పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగులు వారి ఒత్తిడికి లొంగి చట్టాలు, నిబంధనలకు భిన్నంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. లేదా వారు భవిష్యత్తులో తమకు ఇబ్బందులు సృష్టించే వారుగా అనే ముద్రతో అభివృద్ధి చెందే అవకాశాలను కోల్పోక తప్పదు. ముఖ్య కార్యనిర్వాహణాధికారి తానే రాజ్యం అని భావించే అధికారయుత పాలనలో పరిస్థితి మరింత దిగజార్చుతుంది.

BRAOU

కొన్ని దేశాలలో రాజకీయ అధికార నాయకులలో కేంద్రీకృతమై ఉంటుంది. ఈ దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయంగా నియమింపబడిన, తమ నాయకుని ప్రయోజనాలను నెరవేర్చేందుకు తమ అధికారులను విచక్షణా రహితంగా వినియోగించే పాలనా అధికారుల ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ దేశాలలో దేశ వనరులను తమ వ్యక్తిగత వనరులుగా భావించే నూతన పాలకులు ఉదయించి విజయవంతమవుతున్నారు. అయితే ఈ దేశాలలో నిజాయితీగా, సక్రమంగా తమ విధులను నిర్వహించే ఉద్యోగులను ప్రగతినిరోధకులుగా, విప్లవ కారులుగా చిత్రించడం జరుగుతున్నది. పాలకుల పట్ల విధేయతను ప్రదర్శించడం వారి లక్ష్యాలు. ఆశయాలకు కట్టుబడి ఉండడం ఉద్యోగుల అర్హతకు పరీక్షగా రూపొందింది. ఈ విధమైన రాజకీయ వాతావరణం నెలకొని ఉన్న దేశాలలో తమ ఉద్యోగంలో కొనసాగటమే ఉద్యోగుల ప్రధాన లక్ష్యంగా ఉంటుంది.

## 19.4.2 మానసిక పరిసరాల ప్రభావం : (Psychological Environment)

జీవితం పట్ల కల వ్యక్తిగత, సామాజిక విలువలు, దృక్పథాలు నైతిక ప్రవర్తనను సిద్ధాంతపరంగా, ఆచరణాత్మకంగా ప్రభావితం చేస్తాయి. ప్రజలలో కల దృక్పధం అవినీతిని, పక్షపాతధోరణిని ఖండించడం జరిగితే ప్రభుత్వ ఉద్యోగులు సమాజం ఆశించిన ప్రమాణాలకు భిన్నంగా ప్రవర్తించడం జరగదు. ఈ విధంగా సమాజంలోని విలువల వ్యవస్థ

ఉద్యోగుల ప్రవర్తనను ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వంలో లేని వారు ప్రభుత్వాన్ని కుటుంబ వ్యాపార ధోరణిలో నిర్వహించామని భావించినపుడు, లేదా ప్రైవేట్ వ్యాపారానికి వర్తించే ప్రమాణాలే ప్రభుత్వ నిర్వహణకు కూడా వర్తించాలని విశ్వసించినపుడు లేదా రాజకీయ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలను జాతీయ ప్రయోజనాలు భావించినపుడు లేదా ప్రైవేట్ వ్యాపారానికి వర్తించే ప్రమాణాలే ప్రభుత్వ నిర్వహణకు కూడ వర్తించాలని విశ్వసించినపుడు లేదా రాజకీయ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలను జాతీయ ప్రయోజనాలుగా భావించినపుడు ప్రభుత్వ ఉద్యోగుల అనైతిక ప్రవర్తనను సమర్థించటం జరుగుతున్నది. అయితే ప్రజలు వాతావరణం పూర్తిగా అవినీతి మయమైందనీ, ఈ వ్యవస్థలో ఒక భాగంగా రూపొందిన వ్యక్తులే రాణించగలరని విశ్వసిస్తారు.

## 19.4.3 సామాజిక, ఆర్థిక పరిసరాల ప్రభావం

సమాజంలో భౌతిక విలువల పట్ల పెరుగుతున్న వ్యామోహం సామాజిక, నైతిక విలువలను దిగజార్చేందుకు కారణమైంది. ప్రస్తుత కాలంలో ప్రజలు ప్రభుత్వ ప్రక్రియకు హానికలిగించేందుకు ప్రభుత్వ నియమాలలో, నిబంధనలలో లోపాలను అన్వేషించేందుకు ప్రయత్నించడం అభివృద్ధి చెందిన దేశాలలో కాక అభివృద్ధి చెందుతున్న దేశాలలో సైతం సంభవిస్తుంది. ఏ మార్గంలోనైనా ధన సంపాదన ప్రజల ప్రధాన లక్ష్యం అయింది. దీనికి ప్రభుత్వం పరిమితులను ఒక అవకాశంగా తీసుకోవటం సర్వసాధారణమైంది. ప్రజలు ప్రభుత్వాన్ని మోసగించటానికి ఏ మాత్రం వెనుకాడటం లేదు. దీని ఫలితంగా తాము నష్టపోనంతవరకు ఉద్యోగుల అనైతిక ప్రవర్తనను ఖండించక పోవడం ప్రజల అలవాటుగా మారింది. సమాజంలో ఏర్పడిన ఇటువంటి వాతావరణంలో ఉద్యోగులు నిజాయితీగా ప్రవర్తిస్తారని ఆశించడం అవివేకమే.

స్వభావం, తీవ్రతల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతికి, అభివృద్ధి చెందిన దేశాలలోని అవినీతికి మధ్య భిన్నత్వం ఉంది. ప్రభుత్వం సమకూర్చే సేవలు ప్రజలు డిమాండు కన్నా తక్కువ స్థాయిలో ఉన్నపుడు వాటి కొరకు ప్రజలు ప్రభుత్వ అధికారులకు కొంత లంచాన్ని సమర్పించుకోవడం అసాధారణమైన విషయం కాదు. ఈ సమాజాలలో ప్రభుత్వ వనరుల కొరత, ప్రభుత్వ సేవల కొరకు కల అపరిమితమైన డిమాండు అవినీతి కార్యకలాపాలకు దారి తీస్తాయి. ఈ పరిస్థితుల్లో ఈ సేవలను అందించే లేదా, నియంత్రించే స్థానంలో ఉన్న ప్రభుత్వ అధికారులు ప్రలోభాలకు చలించే అవకాశం ఉంది. కాగా, కొందరు ఉద్యోగులు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగ పర్చటానికి ప్రయత్నించి తీరుతారు. వీరి ప్రవర్తన ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి పరులచే ప్రజల అభిప్రాయాన్ని దృఢ పరుస్తుంది.

కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతి పెరిగేందుకు మరో ప్రధాన కారకం ఏమిటంటే వలసపాలన వల్ల ఏర్పడిన పరిణామాలు. ఈ దేశాలలో గతంలో ప్రభుత్వపాలకులు వలస, పాలకులు ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు కాబట్టి వాటిని మోసగించటం సమంజసంగా పరిగణించబడింది. అయితే వలసపాలన తొలగి స్వదేశీ ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత కూడా వలసపాలనా కాలంనాటి ఈ సాంప్రదాయం తొలగలేదు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతిని ప్రోత్సహించే అనేక ఇతర కారకాలు ఉన్నాయి. నిరుద్యోగ పరిస్థితి, చాలీ చాలని వేతనాలు, నానాటికి విస్తృత మవుతున్న ప్రభుత్వ ఉద్యోగుల నియంత్రణాధికారాలు ప్రభుత్వ ఉద్యోగులు ధన సంపాదనకు అనేక అవకాశాలు కల్పించాయి.

BRAOU

## 19.4.4. పాలనా పరిసరాలు ప్రభావం

తాము అవినీతి చర్యలకు పాల్పడటం వలన పట్టుబడినప్పటికి శిక్షింపబడకుండా తప్పించుకొనే అవకాశాలు ఉన్నాయనే విషయం ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించినపుడు. వారు తమ విధినిర్వహణలో నైతికత ప్రమాణాలను పాటించడం పట్ల ఆసక్తిని కనపర్చరు. అవినీతి పరులపై చర్య తీసుకొనటంలో ప్రభుత్వ యంత్రాంగం లేదా న్యాయస్థానాలు మందకొడిగా ప్రవర్తించినపుడు అవినీతి శాశ్వతంగా కొనసాగే ప్రమాదం ఉంది. ఇదే విధంగా అనుచిత పాలవ పట్ల ఉన్నతాధికారులలో ఎలాంటి ప్రతిస్పందన లేనపుడు ప్రభుత్వ ఉద్యోగుల నిజాయితీపై ప్రజలలో అవిశ్వాసానికి మరింత బలం చేకూరుతుంది. ప్రజలలో ప్రభుత్వం పట్ల విశ్వాసం సడలటానికి అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి.

## 19.5 పాలనా నిజాయితీ తులనాత్మక పరిశీలన

1970 దశాబ్దంలో అనేక దేశాల పాలనోద్యోగులలో పెరిగిన అవినీతి, అనైతికతను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం రావటం వలన పాలనాలో నిజాయితి విశ్వవ్యాప్తంగా ఒక చర్చనీయాంశమైంది. ఇదే సమయములో అనేక దేశాలలో ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి చర్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంఘటనలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే కాక అభివృద్ధి చెందిన పాశ్చాత్యదేశాలలో కూడా సంభవించాయి. ఈ పరిణామాల వల్ల ప్రజలలో ప్రభుత్వ ఉద్యోగులలో నైతిక విలువలు అతి తక్కువ స్థాయిలో ఉన్నాయనే అభిప్రాయం ఏర్పడి, బలపడేందుకు దారితీసాయి. ప్రభుత్వ ఉద్యోగులలో పెరుగుతున్న విలువల రాహిత్యం ఆందోళనను రేకెత్తించటంలో ప్రజలు ప్రభుత్వ ఉద్యోగులలో నైతిక ప్రమాణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని వక్కాణించడం ప్రారంభమైంది. ఇదే పరిస్థితిని నొక్కిచెప్తూ ద్వివేది అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలలోని ప్రభుత్వ ఉద్యోగుల వివేచనాధికారి కారాలలో సంభవించిన ఉధృతమైన పెరుగుదలను అవకాశంగా తీసుకొని కొందరు ఉద్యోగులు తమ అధికారాలను, తమ వ్యక్తిగత ప్రయోజనాలకు దుర్వినియోగం చేయటం ప్రారంభమైంది. ప్రభుత్వ ఉద్యోగుల జవాబుదారీ విధానం సమర్థవంతంగా లేని దేశాలలో ఉద్యోగులు అనైతిక చర్యలకు పాల్పడిన సందర్భాలు అధికంగా ఉన్నాయి.

BRAOU

## 19.6 పాశ్చాత్య దేశాలలో పాలనా నిజాయితీ

అనేక పాశ్చాత్య దేశాలలో పాలన ఉద్యోగులలో నైతిక ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉండటానికి ఈ దేశాలలో 19, 20 శతాబ్దంలో ప్రభుత్వ ఉద్యోగులలో ఆశ్రితజన పక్షపాతం, పాలనాధికారాన్ని స్వప్రయోజనాలకు వినియోగించడం, బంధుప్రీతిమొదలైన అవాంఛనీయధోరణులను నివారించేందుకు పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడం ప్రధాన కారణంగా పేర్కొవచ్చును. దాని ఫలితంగా 20వ శతాబ్దంలో పాశ్చాత్య దేశాలలో ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థత, మంత్రుల బాధ్యత మొదలైన సూత్రాలపై ఆధారపడిన బాధ్యతాయుతమైన, నిష్పక్షికమైన పాలనా విధానం రూపుదిద్దుకొంది. ప్రభుత్వ ఉద్యోగుల గోప్యత ఉద్యోగిబృందం పాలనలో ప్రతిభ సూత్రం కూడ ప్రభుత్వ పాలనకు ప్రాతిపదికలు అయ్యాయి. ఈ సాంప్రదాయాలు యాధాతథంగా కొనసాగడం వల్ల ప్రస్తుతం ఈ పాశ్చాత్య దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులలో నైతిక ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉన్నట్లు గుర్తించవచ్చును. వాస్తవానికి 1970 దశాబ్దం నుంచి పాశ్చాత్య దేశాలలో ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రవేశానికి నిర్ధారించిన ప్రమాణాలు మరింత కఠినతరం చేయబడ్డాయి.

ఈ దేశాలలో ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి చర్యలకు పూనుకుంటున్న సంఘటనలు అరుదుగా వెలుగులోకి వస్తున్నా మొత్తం మీద ఈ ఉద్యోగులలో నైతిక ప్రమాణాలు మెరుగుగా వున్నట్లు ద్వివేది, గిబ్బక్స్ మొదలైన విశ్లేషణావేత్తలు నిర్వహించిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

## 19.7 అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా నిజాయితీ

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు తమ పాలనాధికారాలను తరచు దుర్వినియోగ పర్చడం వల్ల వారి పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్లుతున్నదని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వ పాలనా వ్యవస్థ ప్రధానంగా వలసపాలనా ప్రభావానికి గురైంది. అనేక దేశాల స్వాతంత్ర్యం పొందాక వలస పాలకుల నుంచి వారసత్వంగా పొందిన తమ పాలనా వ్యవస్థలలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటికీ, ఆనాటి పాలనా వ్యవస్థల మౌళిక పునాదులు, ప్రధాన లక్షణాలు కొద్ది మార్పులతో కొనసాగుతున్నాయి. అయితే ఆ దేశాలలో స్థానిక నైతిక సూత్రాలకు, అవి అనుకరిస్తున్న పాశ్చాత్య దేశాల ఉద్యోగి స్వామ్య విలువలకు మధ్య సంఘర్షణ ఉత్పన్నమైంది. ఈ దేశాలు పాశ్చాత్య పాలనా విలువల పట్ల విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, వాటి రాజకీయ నాయకులు ఈ పాలనా విలువలు సామాజిక, ఆర్థికాభివృద్ధి వేగాన్ని తగ్గించాయని భావిస్తున్నట్లు ద్వివేది, ఆర్. బి. జైన్ మొదలైన పరిశోధకుల అధ్యయనాలు వివరిస్తున్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ జాతీయ లక్ష్యాలను సాధించాలనే రాజకీయ స్వప్రయోజనాలకు, ప్రభుత్వ ఉద్యోగుల వృత్తి వాదం (Progressionalism) నకు మధ్య ఘర్షణ పెరుగుతున్నది. ఈ సంఘర్షణలతో రాజకీయ నాయకులే శక్తివంతులైన పాత్రధారులుగా ఉద్భవించటం జరిగింది. దీంతో ప్రభుత్వ పాలనకు సంబంధించిన అధికారాన్ని రాజకీయ నాయకులలో కేంద్రీకృతమయ్యాయి.

ఈ విధంగా పాలనాధికారాలు రాజకీయ నాయకులకు బదిలీ కావటం వలన అనేక పరిమాణాలు సంభవించాయి. రాజకీయ నాయకులు తమ ఆధీనంలో వున్న విస్తృతమైన పాలనా అధికారాలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించటమే కాక, పాలనా వ్యవహారాలలో జోక్యం కల్పించుకోవడం అధికమైంది. రాజకీయ నాయకులకు నూతనంగా ఉద్భవించిన వ్యాపార వర్గాల మద్ధతు కూడా లభించింది. ఈ రెండు వర్గాల కలయికతో పాలనాధికారాలు, యంత్రాంగం దుర్వినియోగం పెరిగింది. ఈ వాతావరణం ప్రభావ పాలనోద్యోగులు ప్రవర్తన, దృక్పధాలపై గాఢంగా ప్రసరించింది. వారు మారుతున్న పరిసరాలకు అనుగుణంగా మారే స్వభావాన్ని అలవర్చుకొన్నారు. దాంతో ప్రభుత్వ పాలన అవినీతికి మారు పేరు అయింది.

ఈ విధంగా మారిన వాతావరణాన్ని కెరిబియన్ దేశాల సందర్భంలో విశ్లేషిస్తూ కెంప్‌హోప్ ఈ దేశాలలో రాజకీయ వ్యవస్థలో ఏర్పడిన విలువల రాహిత్యం వల్ల పాలనలో ఆశ్రితజన పక్షపాతం, బంధుప్రీతి, అక్రమ నియామ కాలుపెచ్చు పెరిగాయని పేర్కొన్నాడు. పాలకపక్షానికి వ్యతిరేకమైన ప్రభుత్వ ఉద్యోగులపై అక్రమంగా ఉన్నాయని కెంపెహోప్ పేర్కొన్నారు. వీటిన్నిటి ఫలితంగా ఈ దేశాల పాలన ప్రక్రియ అవినీతి, బంధుప్రీతి వంటి అవాంఛనీయధోరణుల వల్ల కుంటుపడిందని హోప్ వాదించాడు.

BRAOU

## 19.8 భారతదేశంలో పాలనా నిజాయితీ

భారతదేశంలో పాలనా నిజాయితీ పట్ల ప్రజలు అనాదినుంచి ఆసక్తికనపర్చారని చెప్పటానికి ఆధారాలు ఉన్నాయి. కౌటిల్యుడు తన అర్థ శాస్త్ర గ్రంథంలో పాలనా వ్యవస్థలో నైతిక విలువల పాత్ర గురించి వివరంగా చర్చించాడు. కౌటిల్యుడు పాలనా రంగంలో అవినీతిని తొలగించేందుకు అనేక చర్యలను సూచించాడు. దీనిని బట్టి భారతదేశంలో ప్రాచీన కాలంలో సైతం పాలనలో నైతిక ప్రమాణాలను పెంపొందించటంపై ప్రజలు ఆసక్తి ప్రదర్శించారని విశదమవుతుంది. అయినప్పటికీ కాల క్రమంగా భారతదేశ పాలనా వ్యవస్థలో నైతిక ప్రమాణాలు క్రమంగా దిగజారినట్లు అనేక పరిశోధనలు వెల్లడించాయి.

స్వాతంత్ర్యానంతర భారతదేశ రాజకీయ, పాలనా రంగంలో క్రమంగా తమ నైతిక విలువలు కోల్పోతూ వచ్చినట్లు అనేక మంది దేశ, విదేశీ పాలనా విశ్లేషకులు తమ పరిశోధనల ద్వారా వెల్లడించారు. వారితో పాటు ప్రభుత్వం నియమించిన విచారణ సంఘాలు, పాలనా సంస్కరణల సంఘములు ప్రభుత్వ రంగంలో పెరుగుతున్న అనైతిక ధోరణులు, అవినీతి కార్యకలాపాలు గురించి వివరించాయి. ఈ సంస్కరణల సంఘాలు వక్కాణించి చెప్పినదేమిటంటే రాజకీయ రంగంలో పెరిగిన అవినీతి పాలనారంగం కూడా కలుషితం కావటానికి ప్రధాన కారణమైంది. అయితే భారతదేశ పాలనావ్యవస్థలో అవినీతికి రాజకీయ పరిసరాల పాత్ర ఒక్కటే కారణమని చెప్పటం సహేతుకం కాదు. అనేక కారణాలు కూడా ప్రధాన పాత్ర వహించినట్లు గుర్తించాలి.

కొందరు రచయితలు భారత ఉద్యోగిస్వామ్య వ్యవస్థ పాటించే ప్రమాణాలు అనేక వైరుధ్యాలతో నిండి వుందని గుర్తించారు. ఉదాహరణకు, ద్వివేదీ, జైన్‌ల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు నియమనిబంధనలను ఖచ్చితంగా అమలు పరుస్తున్నట్లు పైకి వెల్లడిస్తున్నప్పటికి వాస్తవంలో వాటిని పాటించే సందర్భాల కంటె ఉల్లంఘించే సందర్భాలే అధికం. ఇదే విధంగా వారు పాలనా విధానాలను కఠినంగా అనుసరిస్తున్నట్లు గోచరించినప్పటికీ, వాస్తవంలో వారు అనేక ఒత్తిడులకు లొంగుతున్నారు. ఇదే విధంగా ఉద్యోగులు నియమాలను, నిబంధనలను ప్రజలందరికీ సమానంగా వర్తింప చేయుటంలో నిమగ్నమైనట్లు అగుపించినప్పటికీ, యాదార్థంగా వారు ప్రజల మధ్య విచక్షణను ప్రదర్శించే సందర్భాలు కొల్లలు. ఈ సంఘటనలు ప్రతిఫలించే వాస్తవం ఏమిటంటే సిద్ధాంతం, ఆచరణకు మధ్య కల అంతరాన్ని భరించేందుకు భారతదేశంలోని ఉద్యోగిబృందం సంసిద్ధంగా ఉంది.

కొందరు రచయితలు భారత ఉద్యోగిబృందానికి కల దోషాలకు దాని నిర్మాణ పరమైన లక్షణాలు కారణమని వాదించారు. ప్రభుత్వ యంత్రాంగం విస్తృతమైన పరిమాణ భారంతో క్రుంగినట్లు గోచరిస్తుంది. అయినప్పటికీ ప్రభుత్వం చేపట్టనున్న అనేక పథకాలను అమలు పర్చేందుకు తగిన అర్హతలు కల ఉద్యోగులు లభించటం లేదు. కాగా భారత జాతి లక్షణాలలో కల వైరుధ్యం కారణంగా సామర్థ్యంలో భారత ఉద్యోగిబృందం వ్యవస్థల మధ్య వ్యత్యాసాలున్నట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. భారతదేశంలో పాలనా వ్యవస్థలో మరో ప్రధాన దోషం ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు, ప్రభుత్వానికి మధ్య సంబంధాన్ని ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకాంశ మని గుర్తించకపోవటం. ప్రభుత్వఉద్యోగులలో కల దృక్పథం వల్ల వారు ప్రజల సమస్యలకు, అవసరాలకు తక్షణం ప్రతిస్పందించటం లేకపోతున్నారు. అంతే కాక ప్రజల సలహాలను, అభిప్రాయాలను గౌరవించకపోవడం ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన లక్షణంగా రూపొందింది. కాగా ప్రభుత్వ పాలనా ప్రక్రియను ఒక రహస్య ప్రక్రియగా పరిగణించి ఈ ప్రక్రియ నుంచి ప్రజలను దూరం చేయడం మరో ప్రధానలోపం. ఈ కారణాల ఫలితంగా పాలనలకు ప్రజలకు మధ్య పూడ్చలేని అంతరం ఏర్పడినట్లు గుర్తించారు.

BRAOU

## 19.9 ఉద్యోగిబృందం విలువలు, పాలనా నిర్వర్తన ప్రమాణాలు

పాలనా వృత్తికి సమానాంతరంగా మరో వృత్తి లేదు. సమాజం పాలనా ఉద్యోగులు నిజాయితీ, ఆకుంఠితదీక్ష, పరిపూర్ణమైన నిష్పాక్షికత, అంకిత భావంతో పనిచేయాలని ఆశిస్తుంది. ఈ మౌలిక భావన ప్రాతిపదికగా పైన ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా ప్రమాణాలు, ఆవశ్యక పరిస్థితులు రూపొందించబడ్డాయి. ద్వివేది పేర్కొన్నట్లు నిర్వర్తన ప్రమాణాలు ఒక విస్తృతమైన భావన. ఈ భావనలో నిష్పాక్షికత, సమర్థత, కార్య సాధకత్వం, వస్తు పరత (Objectivity) సమగ్రత, నిజాయితీ అనే విలువలు ఇమిడి ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో, సమర్థత, సామర్థ్యం అనే ఉన్నత ప్రమాణాలను అంకితమై, ప్రభుత్వ పాలనను నిర్వహించాలి. ప్రభుత్వఉద్యోగులు పాటించవలసిన ఇతర విలువల్లో వనరులను సమర్థవంతంగా వినియోగించడం, ప్రజల కోర్కెలకు, అవసరాలకు తక్షణం ప్రతిస్పందించడం, ప్రభుత్వ విధానాలకు నిర్ణయాలకు చట్టబద్ధత చేకూర్చడం, ప్రజలకు జవాబుదారీగా ఉండడం, ఉన్నతాధికారుల పట్ల విధేయత కనపర్చడం. నిస్వార్థ పూరితమైన. ప్రజాసేవ మొదలైన అనేక విలువలు ప్రధానమైనవి. ఈ విలువలు, ఆదర్శాలు ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా ప్రవర్తించటమే కాక, అనైతిక చర్యకు పాల్పడకుండా వుండాలని నిర్దేశిస్తున్నాయి. దీని ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులు చట్టపరిధిలో వ్యవహరించటమే కాక, తమ పదవికి, ప్రభుత్వానికి అప్రతిష్టను తెచ్చిపెట్టె ఏ చర్యకు పూనుకోరాదు.

ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శించవలసిన నైతిక ప్రమాణాలు ఆదర్శవంతంగా ఉండటమే కాక, వాటిని స్పష్టమైన లిఖిత పూర్వకమైన రూపాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రమాణాలు, విలువలు, ప్రభుత్వ ఉద్యోగాలపై కొన్ని నిబంధనలను విధించినప్పటికీ, వీటిని ప్రజలకు వీటి వల్ల జరిగే ప్రయోజనాలు అధిగమిస్తాయి. ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని రూపొందించటం వలన ప్రభుత్వోద్యోగుల నైతిక ప్రవర్తనలో స్థిరత్వాన్ని సాధిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులు పాటించవలసిన సాధారణ నియమాలు, ప్రమాణాలను ఒక ప్రవర్తనా నియమావళి రూపంలో స్థిరపర్చడం ప్రభుత్వ ఉద్యోగుల తమ అధికారాలను తమ స్వార్థపూరిత ప్రయోజనాల సాధనకు దుర్వినియోగపర్చకుండా నివారిస్తుంది. దీనివల్ల ఉద్యోగులకు కల హక్కులు, వాటి పై కల నిరోధాల గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి వల్ల కల ప్రయోజనాల దృష్ట్యా అనేక దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాటించవలసిన ప్రవర్తనా నియమావళిని, నైతిక ప్రమాణాలను స్పష్టంగా రూపొందించారు.

BRAOU

అయితే ప్రభుత్వ ఉద్యోగులు పాటించవలసిన నైతిక ప్రమాణాలు, విలువలు పూర్వపరిస్థితులను విశ్లేషిస్తే, సాధారణ మానవులు ప్రభుత్వ ఉద్యోగులకు అర్హులవుతారనే సందేహం కలగకమానదు. ప్రభుత్వ ఉద్యోగులనుంచి ఆశించినదీ, వారిపై విధించిన నిబంధనలు అసంఖ్యాకంగా ఉండటం వలన వారినుంచి ఆశించే ప్రవర్తన మిగిలిన సమాజంలో అనుసరిస్తున్న ప్రమాణాల నుంచి వారిని మినహాయిస్తున్నది.

## 19.10 పాలనలో నిజాయితీని పెంపొందింప చేసే మార్గాలు

పాలనలో నిజాయితీ పెంపొందింపచేసేందుకు యీ క్రింది పరిస్థితులు ఆవశ్యకం.

## 19.10.1 పనిపట్ల విశ్వాసం దృఢ సంకల్పం

ప్రభుత్వపాలన విజయవంతం కావటంలో రాజకీయ, పాలనా నాయకత్వంల పాత్ర కీలకమైంది. పథకాల, విధానాల ఉత్పాదితాలను ఉత్పాదకాలుగా మార్చటంలో నాయకత్వం కీలక పాత్ర వహిస్తుంది. అందుచేత సమర్థవంతమైన ఇతరులను ప్రేరేపించగల, ఇతరులతో సమర్థవంతమైన ప్రసారాలు నిర్వహించగల, సాంస్కృతిక అణుగుణ్యత, వ్యవస్థీకరణ, నిర్వహణా సామర్థ్యం, అధీన ఉద్యోగులలో ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించగల నేర్పు మొదలైన లక్షణాలు గల నాయకత్వం ప్రభుత్వ పాలనకు అత్యంత అవశ్యక పరిస్థితి.

పని పట్ల నాయకులలో కల విశ్వాసం వ్యవస్థలోని ఉద్యోగుల సహకారాన్ని పొందగల శక్తిని పెంపొందింపచేస్తుంది. ఈ విధంగా వ్యవస్థలో సృజనాత్మక వాతావరణాన్ని, అత్యున్నత నిర్వర్తనను సాధించవచ్చును. ఈ విధమైన వాతావరణం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. సమర్థవంతమైన వ్యవస్థ నాయకత్వం తన చుట్టూ ఉన్న వాతావరణంలో నిజాయితీ సాంప్రదాయాన్ని అత్యున్నత ప్రమాణాలను సృష్టించుకోవాల్సి ఉంది. వ్యవస్థల లక్షణాల పట్ల అంకిత భావం నాయకులకు అత్యంత ఆవశ్యక లక్షణం. దీని వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరగటమే కాక, ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపిస్తారు.

## 19.10.2 రాజకీయాలలో నైతిక ప్రమాణాలను పెంపొదింపచేయాలి

ప్రభుత్వ పాలనలో అనేక సమస్యలు ఉత్పన్నం కావటానికి రాజకీయ అవినీతి, జోక్యం కారణమని గుర్తించారు. రాజకీయ నాయకత్వం, పాలనా నాయకత్వం, మధ్య విశ్వాస రాహిత్యం పెరుగుతున్నది. భారతదేశంలో పరిస్థితి మరింత తీవ్ర రూపు దాల్చిందని హెచ్.వి. కామత్ వంటి విశ్లేషకులు వాదించారు. రాజకీయ నాయకులు సంకుచిత ప్రయోజనాలకు అతీతంగా ప్రవర్తించి నపుడే పాలనావ్యవస్థ పురోగమిస్తుంది.

BRAOU

## 19.10.3 వ్యవస్థ ఆదర్శాల పట్ల నిబద్ధత

వ్యవస్థలోని ఉద్యోగులు వ్యవస్థ ఆదర్శాలను సాధించటం పట్ల నిబద్ధత పెంపొందింపచేసుకోనంతవరకు ఆ వ్యవస్థ ప్రగతిని సాధించలేదు. తమకు అప్పగించిన విధులకు అంకితం కావటం, దీక్షతో వాటిని నిర్వర్తించడం ద్వారా వాటి నిర్వర్తనలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం ప్రభుత్వ పాలనలో అత్యున్నత ఉత్కృష్టతను గుర్తు.

## 19.10.4 పాలనలో ప్రజల భాగస్వామ్యం :

మెర్లిఫైన్ సాడ్ పేర్కొన్నట్లు ప్రగతిపాలనలో ప్రగతి సాధనకు అనుకూలమైన సందర్భం రాజకీయంగా పలుకుబడు కలిగిన, ఆధునీకరణ చెందిన రాజకీయ శ్రేష్టులు ప్రగతిని బలంగా వాంఛించి, తమ దృక్పథాన్ని ఉద్యోగిబృందంలో ప్రజల్లో ప్రవేశపెట్టగలిగినపుడు ఏర్పడుతుంది. మంచి లక్ష్యాలతో సాంకేతికపరంగా పటిష్టంగా రూపొందించిన పథకాలు ప్రజల ఆమోదం పొందలేకపోవటం వల్ల లేదా వారి భాగస్వామ్యాన్ని సాధించినపుడు విఫలమవుతాయని ఫైయిన్ సాడ్ వాదించాడు. అభివృద్ధి పథకాల అమలులో ప్రజలు చురుకుగా పాల్గొనకపోవటం, లేదా వారు వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నది. ఈ పథకాలను లబ్ధిదారులు ప్రభుత్వం తమపై బలవంతంగా రుద్దిన

పథకాలుగా భావించి వాటి పట్ల ఎలాంటి ఆసక్తిని ప్రదర్శించారు. అందుచేత అభివృద్ధి పథకాల అమలులో ప్రజలు చురుకుగా పాల్గొనటం వాటి విజయానికి అత్యంత ఆవశ్యకం. ఈ లక్ష్యాన్ని వ్యవస్థలో పటిష్టమైన ప్రజాసంబంధాలను పెంపొందింపచేయటం ద్వారా సాధించవచ్చును.

## 19.10.5 దేశీయ పరిష్కారాల రూపకల్పన

పాలనా వ్యవస్థ ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి స్వదేశీ మార్గాలను లేదా పథకాలను రూపొందించడం అవసరం. సాంకేతిక పద్ధతులు ప్రభుత్వ పాలన కార్యసాధకత లేదా ఉత్పాదకతను పెంపొదింపచేసే శక్తిని కలిగి ఉన్నప్పటికీ, అది జాతీయ, ప్రాంతీయ అవసరాలకు తగినట్లు ఉన్నదీ లేనిదీ పరిశీలించాల్సి ఉంది. దేశావసరాలకు తగిన సాంకేతిక పద్ధతులను అనుసరించేందుకు ముందు వాటి ఉపయుక్తతను పరిశీలించాల్సి ఉంది.

## 19.10.6 సమాజం నైతిక ప్రవర్తనను మెరుగుపర్చాలి.

ప్రభుత్వ పాలనలో నిజాయితీ పెంపొందింప చేసేందుకు ఈ వ్యవస్థ చుట్టూ వున్న సమాజం నైతిక ప్రవర్తనను పటిష్టం చేయాలి. పాలనావ్యవస్థ సమాజం ప్రతిబింబం మాత్రమే. సమాజంలో నైతిక విలువలు ఉన్నపుడే పాలనలో నైతిక విలువలు ఉంటాయి. సమాజంలో నైతిక విలువలు దిగజారినపుడు పాలనలో నైతిక విలువలను ఆశించడం అవివేకమవుతుంది. అందుచేత సమాజంలో నైతిక విలువలు పెంపొదింపచేసేందుకు ప్రయత్నించాలి. దీనికి విద్యప్రధాన సాధనం. ప్రజలను విద్యావంతులను చేయటం ద్వారా వారిలో నైతిక విలువను ప్రేరేపించవచ్చును. సమాజం నైతిక ప్రవర్తన వచ్చిన మార్పు ఫలితం పాలనా వ్యవస్థ నైతిక ప్రవర్తనపై ప్రసరిస్తుంది.

## 19.10.7 ప్రభుత్వ ఉద్యోగులలో నైతికతను అరికట్టే యంత్రాంగం ఏర్పాటు

BRAOU

ప్రభుత్వ ఉద్యోగిబృందం లో అనైతిక ప్రవర్తనను అరికట్టేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పరచడం. అది సమర్థవంతంగా పనిచేసేలా చూడడం ఒక ఆవశ్యక పరిస్థితిగా గుర్తించాలి. చాలా దేశాలలో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులను కఠినంగా శిక్షించేందుకు ఏర్పాటు చేసిన సంస్థలు పటిష్టంగా లేవు. వాటికి తగిన అధికారాలు అప్పగించకపోవటం లేదా వాటి నిర్వహణలో రాజకీయ నాయకులకు ప్రమేయం అధికంగా ఉండటం చేత అవి సమర్థవంతంగా పనిచేయడంలో విఫలమవుతున్నాయి. దీనికి భారతదేశంలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులను శిక్షించేందుకు ఏర్పాటు చేసిన విజిలెన్సు కమీషను ఒక దృష్టాంతంగా పేర్కొనవచ్చును. ఈ అనుభవం ఆధారంగా అనైతిక చర్యలకు పూనుకునే ఉద్యోగులకు కఠినంగా శిక్షించగల సామర్థ్యాన్ని అవినీతిని అరికట్టేందుకు ఏర్పరచిన యంత్రాంగానికి కల్పించాలి.

ఇదే విధంగా నిజాయితీ, నైతికతకల ఉద్యోగులను ప్రోత్సహించేందుకు కూడ తగిన యంత్రాంగాన్ని ఏర్పరచాలి. చాలా దేశాలలో తమ విధినిర్వహణలో నీతి, నిజాయితీలను ప్రదర్శించే ఉద్యోగులకు తగిన ప్రోత్సాహకాలను కల్పించే పద్ధతిలేదు. అయితే అవినీతికి పాల్పడే ఉద్యోగులను శిక్షించినట్లే నీతివంతులైన ఉద్యోగులను ప్రోత్సహించాల్సి ఉంది. నిజాయితీ గల ఉద్యోగులను గురించి, వారికి పదోన్నతి కల్పించటం, నగదు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందచేయటం, నిర్వహణలో స్థానం కల్పించడం మొదలైన భౌతిక, మానసిక ప్రేరకాలను కల్పించాలి. ఈ విధమైన చర్యల ద్వారా నైతిక ప్రవర్తనను అలవర్చుకునేలా ఉద్యోగులను ప్రోత్సహించవచ్చును.

పై చర్యలద్వారా పాలనలో నిజాయితీని పెంపొందింప చేయవచ్చును. పై చర్యలను అమలు పర్చడంలో రాజకీయ వ్యవస్థ మద్ధతును పొందడం అత్యంత ఆవశ్యకం. దీనికి విస్తృత సమాజం మద్ధతును పొందటం కూడా అవసరమే.

## 19.11 సారాంశం

ఈ భాగంలో వివరించిన విధంగా ప్రస్తుత కాలంలో పాలనా నిజాయితీ ఒక ప్రధాన భావన అయింది. నేటి ప్రభుత్వాలు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తున్న సమస్యలలో పాలనా నిజాయితీ ప్రధానమైందిగా రూపొందింది. పాలనోద్యోగులలో నైతిక ప్రవర్తనను పెంపొందించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషి ఆశించిన ఫలితాలను సమకూర్చలేదు. ఒక వైపు అనేక దేశాలలో పాలనోద్యోగులలో అవినీతి, బాధ్యతారాహిత్యం పెరుగుతుండటంతో మరో వైపు పాలనలో నైతికత, నిజాయితీ మొదలైన సుగుణాలు క్షీణిస్తున్నాయి. పాలనలో ఈ సుగుణాలు క్షీణించటానికి అనేక కారకాలు దోహదపడుతున్నప్పటికీ రాజకీయ కారకం పాలనా నైతికతను గాఢంగా ప్రభావితం చేస్తున్నది. రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనం అయినపుడే పాలనా వ్యవస్థలో నిజాయితీ పెంపొందుతుంది. అందుచేత పాలనా వ్యవస్థల నైతికతను, నిజాయితీని పెంపొందించేందుకు రాజకీయ వ్యవస్థలో నాటిని అభివృద్ధి పర్చడం అత్యంత అవశ్యకం.

భారతదేశంవంటి వర్ధమాన దేశాలలో ఆర్థిక సామాజిక లక్ష్యాల సాధన ప్రధానంగా పాలనా వ్యవస్థపైనే ఆధారపడటం వలన పాలనోద్యోగులలో నైతికత, నిజాయితీని పెంపొందించటం పైనే ఈ దేశాల భవిష్యత్తు ఆధారపడి ఉంది. అయితే పాలనా వ్యవస్థలో నిజాయితీ పెంపొందించటం ఒక క్లిష్టమైన ప్రక్రియగా రూపొందటం వలన ఇటీవల కాలంలో ఉద్యోగిస్వామ్య విసర్జన ప్రక్రియను ఒక ప్రత్యామ్నాయ మర్గంగా ప్రతిపాదించారు. కాని ఉద్యోగిబృంద వ్యవస్థలో పెరుగుతున్న నైతిక విలువల రాహిత్యానికి ఉద్యోగిస్వామ్య విసర్జన ఒకటే పరిష్కార మార్గం కాలేదు. నానాటికి క్లిష్టంగా రూపొందుతున్న ఈ సమస్యకు సమాజంలో సామాజిక, రాజకీయ విలువల పునరుద్దరణ సరైన పరిష్కారాన్ని సూచించగలదు.

BRAOU

## 19.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I** ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానాలు రాయండి.

1. ప్రభుత్వపాలనలో నిజాయితీ ప్రాధాన్యతను వివరింపుము.
2. పాలనోద్యోగులలో నిజాయితీ లోపించేందుకు దోహదపడే కారణాలు ఏవి ?
3. పాశ్చాత్య, పాశ్చాత్యేతర దేశాలలో పాలనా ఉద్యోగులు నిజాయితీని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో పాలనోద్యోగులలో నిజాయితీ గురించి వివరింపుము.
2. ప్రభుత్వపాలనలో నిజాయితీని పెంపొందింప చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలుపుము.
3. ప్రభుత్వ ఉద్యోగులు అనుసరించవలసిన నైతిక ప్రమాణాలను వివరింపుము.

## 19.13 చదువదగిన రచనలు


1. Dube, S.C. : Public Service and Social Responsibility, New Delhi : Vikas 1979.

2. Dwivedi, O.P. and R.B. Jain : Administrative State in India, New Delhi : "Geethanjali," 1985.

3. Jain, R.B. : Contemporary Issues in Indian Administration, New Delhi : Vishal Publications, 1976.

4. Jain, R.B. (red), : Bureaucratic Polities in the Third World, New Delhi : Gitanjali Publishing House, 1989

5. Puri, K.K. : Public Administration : Indian Spectrum, New Delhi, Kitab Mahal, 1985


రచయిత : ఎమ్. బాప్టాజీ.

BRAOU

# భాగం - 20 : పాలనా సంస్కరణలు

## విషయక్రమం

20.0 లక్ష్యాలు
20.1 పరిచయం
20.2 పాలనా సంస్కరణ భావన - నిర్వచనం
20.3 పాలనా సంస్కరణలు - విశిష్ట అంశాలు
20.3.1 పాలనా సంస్కరణ ఒక నిర్దిష్ట భావన
20.3.2 పాలనా సంస్కరణలో మార్పు కీలకాంశం
20.3.3 పాలనా సంస్కరణ - ఒక ప్రక్రియ
20.3.4 పాలనా సంస్కరణ - అమలు
20.4 పాలనా సంస్కరణలు - ప్రగతి పాలన
20.5 భారతదేశంలో పాలనా సంస్కరణలు
20.6 ఇతర దేశాలలో పాలనా సంస్కరణలు
20.7 పాలనా సంస్కరణలు - కొన్ని అనుభవాలు
20.8 సారాంశం
20.9 నమూనా పరీక్షా ప్రశ్నలు
20.10 చదువదగిన రచనలు

BRAOU

## 20.0 లక్ష్యాలు

పాలనా సంస్కరణల భావన గురించి వివరించడం ఈ భాగం లక్ష్యం. ఈ భాగాన్ని చదివితే మీరు క్రింది అంశాలను వివరించగలరు.

* పాలనా సంస్కరణ భావన నిర్వచనం, కీలకాంశాలు
* పాలనా సంస్కరణలు, ప్రగతి పాలన
* భారతదేశంలో, కొన్ని ఇతర దేశాలలో పాలనా సంస్కరణలు
* పాలనా సంస్కరణల రంగంలో పొందిన అనుభవాలు.

## 20.1 పరిచయం

గత కొన్ని దశాబ్దాలనుంచి పాలనా సంస్కరణల ప్రాముఖ్యత పెరుగుతున్నది. ఒక అంతర్జాతీయ సమావేశంలో పేర్కొన్నట్లు ప్రస్తుతం ప్రపంచంలో వేడిగా చర్చించబడుతున్న అనేక అంశాలలో పాలనా సంస్కరణలు ఒకటి. అనేక

ప్రజాస్వామ్య దేశాలు తమ పాలనా వ్యవస్థలను విప్లవాత్మకంగా సంస్కరించే ప్రయత్నంలో మునిగి ఉన్నాయి. ఇదే విధంగా కమ్యూనిస్ట్ దేశాలు తమ కేంద్రీకృత పాలనా, ఆర్థిక వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించటంలో నిమగ్నమయ్యాయి. ఇదే సందర్భంలో ఐక్యరాజ్యసమితి తన ప్రభుత్వ పాలన, విత్త కార్యక్రమం (Programme in Public Administration and Finance) భాగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థల అభివృద్ధికి పాలనా నిపుణుల సమావేశాలను నిర్వహిస్తున్నది.

ఈ విధంగా ఇటీవలి కాలంలో ప్రపంచ స్థాయిలో పాలనా వ్యవస్థలను మౌళికంగా సంస్కరించటం ద్వారా వాటి సామర్ధ్యాన్ని పెంపొందించేందుకు ప్రయత్నాలు ఉధృతం కావటానికి ప్రపంచస్థాయిలో పాలనా వ్యవస్థలు తమ సవాళ్ళను ఎదుర్కొనడంలో విఫలం కావటమే ప్రధాన కారణమని గెరాల్డ్ కైడన్, దుభాషి, హ్యామర్ చతుర్వేది మొదలైన పాలనా సంస్కరణల నిపుణులు ఉద్ఘాటించారు. ఆవిర్భవిస్తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తమ దేశాల స్థానాన్ని మెరుగు పర్చుకునేందుకు ప్రభుత్వాలు తమ పాత్రలను, వ్యూహాలను తిరిగి రచించుకుంటున్నాయని వీరు పేర్కొంటున్నారు. ఈ సందర్భంలో ఉద్యోగిబృంద వ్యవస్థ అసమర్ధత, అవినీతి, అవి అనుసరించే సంక్లిష్టమైన పద్ధతులు, ప్రమాణాలు లేని సేవలు అనేక విమర్శలకు గురైయ్యాయి. ప్రభుత్వం తన సాంకేతిక, రాజకీయ, పాలనా సామర్థ్యాలకు మించిన అనేక బాధ్యతలను చేపట్టిందని విమర్శించబడింది. విస్తృతమైన ప్రభుత్వం పాత్రపై ఏర్పడిన సందేహం పాలనా సంస్కరణలపై ఒక నూతన ఆసక్తిని పెంపొందించిందని కైడన్ వాదించాడు. ఈ ఆసక్తి రష్యాలో పెరిస్త్రోయికా, గ్లాస్త్ నాస్త్ వంటి విప్లవాత్మక సంస్కరణలకు, బ్రిటన్‌లో థాచర్ పాలన ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలకు, బ్రెజిల్‌లో చేపట్టిన ఉద్యోగిస్వామ్య విసర్జిత కార్యాచరణ పథకానికి దారితీసింది. వీటి ఫలితంగా రాజ్యవ్యవస్థనే మౌళికంగా సంస్కరించేందుకు, రాజ్యం హద్దులను పునః నిర్వర్తించేందుకు, రాజ్యం పాలనా నిర్వహణ, వృత్తిపరమైన లక్షణాల పునః రూపకల్పనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ సంస్కరణలు కేవలం సాంకేతికపరమైన స్వభావాన్నే కాక రాజకీయ, సైద్ధాంతిక పరమైన స్వభావాన్ని కలిగి ఉన్నాయి. రాజ్యం నిర్వర్తనను మెరుగుపర్చడం. విధాన రూపకల్పన, నాయకత్వ రంగాల్లో రాజ్యం సమర్థతను పెంపొందింప చేయటం. ప్రజల పట్ల పాలనా వ్యవస్థ బాధ్యతను స్పందనను ఇనుమడింపచేయడం, అస్థిరమైన, అనిశ్చితమైన పరిసరాలను ఎదుర్కొనే స్థోమతను రాజ్యానికి సంతరింపచేయటం, మారుతున్న పరిసరాలతో అనుగుణ్యతను పెంపొందింపచేసుకునేలా పాలనా వ్యవస్థను తీర్చిదిద్దడం, ఉద్యోగులు నైతిక ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేలా చేయడం, అందుబాటులో వున్న శ్రేష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించేలా రాజ్యాన్ని ప్రోత్సహించటం మొదలైన అనేక అంశాలు పాలనా సంస్కరణల నూతన అజెండాలో చోటు చేసుకున్నాయి.

## 20.2 పాలనా సంస్కరణ భావన - నిర్వచనం

సామాజిక శాస్త్రాల్లోని అనేక భావనలే పాలనా సంస్కరణ అనే భావనకు భిన్న అర్థాలు ఉన్నాయి. ఈ భావనకు అందరూ ఆమోదించిన అర్థం అంటూ ఏర్పడలేదు. అయినప్పటికీ పాలనా సంస్కరణలు ప్రభుత్వ పాలనా రంగాలలో విస్తృతమైన గుర్తింపు పొందుటయే కాక అందరూ ఉపయోగించే భావన అయింది. అందుచేత అనేక మంది పాలనా రచయితలు ఈ పదాన్ని నిర్వర్తించే ప్రయత్నం చేస్తారు. భాషాశాస్త్రం పరంగా సంస్కరణ అంటే ఒక నూతన స్వరూపాన్ని లేదా ఆకారాన్ని (Shape) కల్పించడం. సంస్కరణ అంటే మంచి జీవితాన్ని ప్రసాదించడం అనికూడా అర్థం ఉంది. వివిధ పాలనా రచయితలు పాలనా సంస్కరణలను అనేక విధాలుగా నిర్వచించారు. లీ అనే రచయిత పాలనా సంస్కరణలను సకారాత్మక ప్రగతి లక్ష్యాలను సాధించేలా పాలనా వ్యవస్థలను మెరుగుపర్చేందుకు చైతన్యపూరిత ఉద్దేశ్యంతో ఆ వ్యవస్థలకు నూతన భావనలను లేదా భావాల సమ్మేళనాన్ని వర్తింపచేసే ప్రయత్నం అని నిర్వచించాడు.

మోషర్ నిర్వచనము ప్రకారం పాలనా సంస్కరణ అంటే తన ఉనికిని కోల్పోయేందుకు సిద్ధంగా ఉన్న ఒక వ్యవస్థను కాఠిన్య పద్ధతుల నుంచి విముక్తిచేసేందుకు ప్రవేశపెట్టే ఉద్దేశపూరితమైన, చైతన్య పూరితమైన, ప్రణాళికబద్ధమైన వ్యవస్థా మార్పు. డ్రార్ పాలనా సంస్కరణలను ఒక పాలనా వ్యవస్థ ప్రధాన లక్షణాలలో నిర్దేశిత మార్గంలో సంభవించే మార్పు అని నిర్వచించాడు. అబువే (Abowe) పాలనా సంస్కరణలను నిర్వచిస్తూ ఉద్యోగిబృంద వ్యవస్థ లక్ష్యాలు, నిర్మాణాలు, పద్ధతులు ప్రవర్తనలలో మార్పు పెట్టేందుకు శక్తి, అధికారం, ప్రభావాలను ఉద్దేశపూరితంగా వినియోగించడం అని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం పాలనా సంస్కరణలు అంటే మొత్తం వ్యవస్థను లేదా వ్యవస్థలోని ప్రధాన అంశాలను మార్పు చేయటం ద్వారా పాలనా వ్యవస్థలో మౌళికంగా మార్పును ప్రేరేపించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రయత్నాలు అని నిర్వచించాయి.

ఎమ్. ఎమ్. ఖాన్ పాలనా సంస్కరణలను ఒక దేశంలో స్థిరంగా పాతుకున్న ఉద్యోగిబృంద పద్ధతులను, ప్రవర్తను నిర్మాణాన్ని మౌళికంగా మార్పు చేసే ప్రయత్నంగా వర్ణించారు. ఆర్నే. ఎఫ్. లీమన్స్ పాలనా సంస్కరణలను వాస్తవానికి ఆశయానికి మధ్యకల అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వ యంత్రాంగంలో ప్రేరేపించిన మార్పుగా పరిగణించాడు. ఇదే ధోరణిలో మహేశ్వరి పాలనా సంస్కరణలను సమాజం ప్రాణపదంగా భావించి, కొనసాగిస్తూ వస్తున్నా ఆశయాల సాధనకు తోడ్పడే పాలనా వ్యవస్థలో ఉద్దేశ పూర్వకంగా ప్రవేశపెట్టిన మార్పులని పేర్కొన్నారు.

ఈ విధంగా పాలనా సంస్కరణలను అనేక రచయితలు పెక్కు విధాలుగా నిర్వచించినప్పటికీ, ఈభావనపై గెరాల్డ్ కైడన్ ప్రతిపాదించిన నిర్వచనం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. కైడన్ పాలనా సంస్కరణలను ప్రతిఘటన ఎదురవుతున్నప్పటికీ పాలనా పరివర్తనకు చేసే కృత్రిమ ప్రేరణ అని నిర్వచించాడు. కైడన్ నిర్వచనంలో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి.

1. పాలనా సంస్కరణలు మానవుల చేత కృత్రిమంగా ప్రేరేపించబడతాయి. అవి యాంత్రికమైనవి. ప్రకృతి సిద్ధమైనవి. ప్రమాదవశాత్తు సంభవించినవి కావు.
2. పాలనా సంస్కరణలు ఒక పరివర్తన ప్రక్రియ వంటిది.
3. పాలనా సంస్కరణలకు ప్రతిఘటన ఎదురవటం అనివార్యం.

కైడన్ నిర్వచనంలో మూడు దోషాలున్నట్లు క్వా (Quah) పేర్కొన్నాడు. ఒకటి కైడన్ నిర్వచనం పాలనా సంస్కరణల లక్ష్యాన్ని కాని, ప్రయోజనాన్ని కాని వివరించదు. అందుచేత కైడన్ నిర్వచనం అసంపూర్ణమైంది. పాక్షికమైంది. రెండు, కైడన్ ప్రతిపాదించిన పాలనా పరివర్తన (administrative transformation) భావన సందిగ్ధ పూరితమైంది. అది పాలనా సంస్కరణల సారాంశాన్ని వివరించదు. మూడు, పాలనా సంస్కరణలకు ప్రతిఘటన ఎదురవడం అనివార్యం అనే కైడన్ ఊహనకు ఆచరణాత్మక (empirical) నిదర్శనం ఏది లేదు.

పై నిర్వచనాలు పరిశీలిస్తే పాలనా సంస్కరణల కీలక లక్షణాలను గుర్తించవచ్చును. అవి.

1. పాలనా సంస్కరణలు పాలనా వ్యవస్థలో లేదా ఉద్యోగిబృందం నిర్మాణం, పద్ధతులలో మార్పులను ప్రవేశపెట్టే ఉద్దేశపూర్వక ప్రయత్నం (సంస్థా పునర్ వ్యవస్థీకరణ అంశం.)
2. అవి ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన, దృక్పథాలలో మార్పులు ప్రవేశపెట్టాయి. (ప్రవర్తనా అంశం)

BRAOU

3. పై రెండు మార్పులు పాలనా వ్యవస్థలో సమర్థత ప్రతిభ, ఉత్పాదకతలు పెంపొందేందుకు దారితీస్తాయి.

4. పాలనా సంస్కరణలు విలువల సమన్వితమైన భావన ఈ భావన అర్థం నిర్ధిష్టమైంది.

## 20.3 పాలనా సంస్కరణలు - విశిష్ట అంశాలు

పాలనా సంస్కరణలపై కల నిర్వచనాలను పరిశీలిస్తే చర్చించదగిన కొన్ని పాలనా సంస్కరణల విశిష్ట అంశాలను గుర్తించవచ్చును. అవి :

1. పాలనా సంస్కరణ ఒక నిర్ధిష్ట భావన
2. పాలనా సంస్కరణలో మార్పు కీలకాంశం
3. పాలనా సంస్థ ఒక ప్రక్రియ
4. పాలనా సంస్కరణ అమలు

పై అంశాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 20.3.1 పాలనా సంస్కరణ ఒక - నిర్ధిష్ట భావన :-

పాలనా సంస్కరణ ఒక నిర్ధిష్ట భావన. కొందరు రచయితలు ఈ భావనను ఇతరభావనల నుంచి విభజన చేసేందుకు ప్రయత్నించారు. ప్రధానంగా, ఈ భావనను పునర్ వ్యవస్థీకరణ, మార్పు, విప్లవం మొదలైన ఇతర భావాల నుంచి వేరుపర్చేందుకు ఈ రచయితలు ప్రయత్నించారు. ఈ భావనలను పాలనా సంస్కరణ భావనకు ప్రత్యామ్నాయంగా వాడబడుతున్నప్పటికీ వాటి మధ్య మౌళిక వ్యత్యాసం ఉందని ఈ రచయితలు పేర్కొన్నారు. ఈ పదాల మధ్య భిన్నత్వాన్ని వివరిస్తూ ముతాలిబ్ సామాజిక విలువలను పెంపొందింప చేసే వేగం, అవి ఎదుర్కొనే ప్రతిఘటన పరిమాణం మొదలైన అంశాలలో అవి విభేదిస్తాయని పేర్కొన్నాడు. ముతాలిబ్ అభిప్రాయం ప్రకారం పాలనా సంస్కరణలు విలువల భరితమైనవి. కాగా పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో విలువలకు స్థానం ఉండవచ్చు లేదా లేకపోవచ్చును. కానీ ఈ రెండు ప్రక్రియలు ప్రతిఘటనను ఎదుర్కొంటాయి. మార్పు సహజ ప్రక్రియ. ఈ మార్పుకు సార్వజనీన ప్రయోజనం ఉండటం చేత ప్రతిఘటనను ఎదుర్కోదు. చివరగా, విప్లవం మార్పుకు విపరీతరూపం. విప్లవం సంస్కరణ రెండు అంశాలలో విభేదిస్తుంది. విప్లవం పరిధి అతి విస్తృతమైంది. సంస్కరణల పరిధి సంకుచితమైంది. విప్లవం వ్యవస్థలో సమూలమైన మార్పును ప్రవేశపెట్టే హఠాత్తు పరిమాణం. పాలనా సంస్కరణలు కేవలం పాలనా వ్యవస్థలో జాగ్రత్తగా ఆలోచించి ప్రవేశపెట్టే ప్రక్రియ. ఈ నాలుగు భావనల వ్యత్యాసం మీద ఇతర పాలనా శాస్త్రవేత్తలు ఈ విధమైన అభిప్రాయాలు వెల్లడించారు. మ్యాన్ ఫీల్డ్ పాలనా సంస్కరణలన్ని మార్పులే కాని, అన్ని మార్పులు పాలనా సంస్కరణలు కావు అని పేర్కొన్నారు. కొన్ని మార్పులు ప్రగతినిరోధాలు, అవాంఛనీయమైనవి. కాని పాలనా సంస్కరణలు అవాంఛనీయ పరిస్థితిని ప్రయోజనాత్మక పరిస్థితిగా సంస్కరించే ప్రక్రియ అని మాన్స్ ఫీల్డ్ అభిప్రాయ పడ్డాడు. ఫ్రెడరిక్ అనే మరో రచయిత పాలనా సంస్కరణలు ప్రామాణాత్మక స్వభావం కలిగిన సమగ్రమైన, శాంతియుతమైన మార్పుకు దారితీస్తే పాలనా పునర్వ్యవస్థీకరణ సంకుచితమైన మార్పును ప్రవేశపెట్టుందని వివరించాడు. పాలనా సంస్కరణల పరిధి విస్తృతమైందే కాక, దానికి సామాజిక లక్ష్యాలు, ప్రాధాన్యత ఉన్నాయని ఫ్రెడరిక్ పేర్కొన్నాడు.

BRAOU

కాగా ఫినన్ డీన్ అనే రచయితలు పాలనా సంస్కరణల ప్రయత్నాలలో పాలనా పునర్వ్యవస్థీకరణ ఇమిడి ఉన్నప్పటికీ పాలనా సంస్కరణ అని పునర్ వ్యవస్థీకరణ ఒకటి కావని వాదించారు. కాని పాలనా సంస్కరణలను అమలు పర్చటంలో అనుసరించే పద్ధతులలో పాలనా పునర్ వ్యవస్థీకరణ ఒకటి అని వారు పేర్కొన్నారు. అంటే పాలనా సంస్కరణలు విస్తృతమైన భావన అనీ ఈ భావనలో పాలనా పునర్వ్యవస్థీకరణ మార్పు అంతర్లీనంగా ఉన్నాయని వారు సూచించారు. ఈ విధంగా పెక్కుమంది రచయితలు పాలనా సంస్కరణలను ఒక నిర్దిష్టమైన, స్పష్టమైన భావనగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు.

## 20.3.2 పాలనా సంస్కరణలో మార్పు కీలకాంశం:-

పాలనా సంస్కరణలో మార్పు అతికీలాకాంశం. ఈ మార్పు పాలనా వ్యవస్థ లక్షణాల్లో ప్రత్యక్షంగా సంభవిస్తుంది. మార్పు పాలనా వ్యవస్థను తీవ్రమైన పరిణామాలకు గురిచేస్తుంది. పాలనా సంస్కరణలు మార్పును అనుకూలమైనవి. అవి పాలనా వ్యవస్థలో జడత్వాన్ని, స్థబ్దతను, తొలగించి గమనశీలతను పెంపొందింపచేసే విధంగా పాలనా వ్యవస్థ మూలసారంలో, నిర్వహణా ప్రక్రియలో మార్పులు ప్రేరేపిస్తాయి. అయితే ఇది సులభమైన విషయం కాదు. కొన్ని సందర్భాలలో సంస్కరణల పాలనా వ్యవస్థ సమర్థతను పెంపొందింప చేసిన మరికొన్ని సందర్భాలలో దానిని నిర్వీర్యం అందువలన పాలనా సంస్కరణల వల్ల పాలనా వ్యవస్థ సమర్థతను పెంపొందింపచేసిన, మరికొన్ని సందర్భాలలో దానిని నిర్వీర్యం చేస్తాయి. అందువలన పాలనా సంస్కరణల వల్ల పాలనా వ్యవస్థలో సంభవించే క్రమరహితమైన పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంది.

పాలనా సంస్కరణలు పాలనా వ్యవస్థలో రెండు రకాల మార్పులను ప్రవేశపెట్టాయి.

1. నిర్మాణ పరమైన మార్పులు
2. ప్రవర్తనా పరమైన మార్పులు

BRAOU

నిర్మాణ పరమైన మార్పులు పాలనా వ్యవస్థ అధికార విధానం దాని విధులు, ప్రక్రియ, పద్ధతులు, సమన్వయ పద్ధతులు, నివేదిక విధానం మొదలైన అంశాలను మెరుగుపర్చి క్రమబద్ధమైన శాఖీయాకరణకు దారి తీస్తాయి. కాగా ప్రవర్తనా పరమైన మార్పులు పాలనా వ్యవస్థలోని మానవాంశంలో అంటే ఉద్యోగిబృందంలో లక్ష్యసాధన దృక్పథం, సృజనాత్మక, నవకల్పనాతత్వాలను పెంపొదింపచేస్తాయి.

## 20.3.3 పాలనా సంస్కరణ - ఒక ప్రక్రియ

పాలనా సంస్కరణ ఒక నిరంతర ప్రగతిశీలక ప్రక్రియ. ప్రభుత్వం మారుతున్న సమాజం అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను మార్చేందుకు నిరంతర ప్రాతిపదిక మీద పాలనా సంస్కరణలను ప్రవేశపెడ్తుంది. పాలనలో నిర్వర్తనా ప్రమాణాల అవసరం పెరిగిన కొద్దీ పాలనా సంస్కరణల అవశ్యకత కూడా పెరుగుతుంది. ఉదాహరణకు, స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం మారిన, మారుతున్న సమాజ అవసరాలకు అణుగుణంగా పాలనా వ్యవస్థను, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అనేక పాలనా సంస్కరణలను అమలు పర్చింది. కైడన్ పాలనా

సంస్కరణల ప్రక్రియను హెర్బర్ట్ సైమన్ ప్రతిపాదించిన నిర్ణాయీకరణ నమూనాకు అనుగుణమైందనీ వివరించాడు. సైమన్ ప్రతిపాదించిన నిర్ణయీకరణ నమూనాలోని అన్వేషణ, రూపకల్పన, ఎంపిక దశలను పాలనా సంస్కరణల ప్రక్రియకు కూడా వర్తించవచ్చునని కైడన్ వివరించాడు. కైడన్ సూచించిన పాలనా సంస్కరణ ప్రక్రియలో నాలుగు దశలు ఉన్నాయి. అవి.

1. పాలనా సంస్కరణ గురించిన చైతన్యం
2. పాలనా సంస్కరణ లక్ష్యాలు, ఆశయాల నిర్ధారణ
3. సంస్కరణ అమలు
4. సంస్కరణ ఫలితాల మూల్యాంకం

కైడన్ సూచించిన విధంగా పాలనా సంస్కరణల ప్రక్రియ పాలనా వ్యవస్థలో మార్పు చేయవలసిన అంశాలు గుర్తింపుతో ప్రారంభమవుతుంది. తరువాత పాలనా సంస్కరణల ప్రతిపాదనలు రూపొందించబడతాయి. తదుపరి దశలో పాలనా సంస్కరణల లక్ష్యాలు, ఆశయాలు స్పష్టీకరించబడి, వాటి సాధనకు అవసరమైన వ్యూహం, ప్రణాళికలు రూపొందించబడతాయి. దీని తరువాత అంటే పాలనా సంస్కరణల వ్యూహం, ప్రణాళికలు ఆమోదించబడ్డాక వాటి అమలు ప్రారంభమవుతుంది. చివరిదశలో అంటే సంస్కరణలు పూర్తిగా అమలు పరిచాక వాటి మూల్యాంకనను చేపట్టడం జరుగుతుంది. సంస్కరణలు ఆశించిన ఫలితాలను సమకూర్చినట్లు వెల్లడి అయితే, నూతన సంస్కరణలను రూపొందించే ప్రయత్నాలు మొదలవుతాయి.

## 20.3.4 పాలనా సంస్కరణ - అమలు

BRAOU

పైన వివరించినట్లు పాలనా సంస్కరణ అమలు సంస్కరణ ప్రక్రియలో చివరి దశ. ఈ దశ అంతిమమైనదే కాక క్లిష్టమైంది. ఈ దశపై తగిన శ్రద్ధ వహించకపోతే పాలనా సంస్కరణల లక్ష్యమే విఫలమయ్యే ప్రమాదం ఉంది. పాలనా సంస్కరణల అమలు ప్రధానంగా వాటిని అమలుపర్చే ఉద్యోగి బృంద దృక్పథం, అందుబాటులో ఉన్న నిధులు, ఉపయోగించే పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. పాలనా సంస్కరణ అమలులో రాజకీయ, సాంకేతిక, వ్యవస్థీకరణ, వ్యూహాలు ఇమిడి ఉన్నాయి. సక్సేనా పాలనా సంస్కరణ అమలుకు సంబంధించి మూడు దృక్పథాలును ప్రతిపాదించాడు. అవి :

1. ప్రాజెక్టు దృక్పథం (Project Approval)
2. సాన్నిహిత్య దృక్పథం (Access Approval)
3. ఓ & ఎమ్ దృక్పథం ( O & M Approval)

ప్రాజెక్టు దృక్పథం ప్రకారం పాలనా సంస్కరణలు ఒక విరాళ పథకంగా (discreet project), ఈ పథకం లబ్ధిదారులకు కొలిచేందుకు వీలైన పథకాలను సమకూరుస్తుంది. కాగా పాలనా సంస్కరణలను అమలు పర్చడం ద్వారా ఆశించిన రీతిలో అభివృద్ధి పథకాల ప్రయోజనాలను అందచేయటం పై ప్రాధాన్యతను కనపర్చడం సాన్నిహిత్య దృక్పథం లక్ష్యం. చివరగా ఓ & ఎమ్. దృక్పథం వ్యవస్థ నిర్మాణ పరమైన అంశాలపై తన దృష్టిని కేంద్రీకరిస్తుంది.

పాలనా సంస్కరణ అమలుకు అనుక్రమంలో చేపట్టవలసిని చర్యలను ఈ క్రింది విధంగా సూచించవచ్చును.

1. ప్రస్తుతం వ్యవస్థల నిర్మాణం పరిశీలన
2. నియంత్రణ కేంద్రాల గుర్తింపు, నిర్వర్తన ప్రణాళిక రూపకల్పన
3. వనరుల కేటాయింపు
4. లక్ష్యాల స్పష్టీకరం
5. ఫలితాలను వెల్లడించే నివేదికల రూపకల్పన.

మహేశ్వరి పాలనా సంస్కరణ అమలులో ఎదురయ్యే అనేక అవరోధాలను గురించి వివరించాడు. పాలనా సంస్కరణలు, ప్రధానంగా వ్యవస్థాపరమైన సంస్కరణల అమలుకు ఉద్యోగిబృందం నుంచి నిరంతర ప్రతిఘటన ఎదురవుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అవస్థాపనా సౌకర్యాలు బలహీనంగా ఉండగా, ఉద్యోగిబృంద వ్యవస్థ శక్తివంతమైన సంస్థ పాలనా సంస్కరణల అమలుకు ఉద్యోగిబృందం ఆమోదాన్ని పొందటం సంస్కరణల అమలుకు ఉద్యోగిబృందం ఆమోదాన్ని పొందటం అంతసులభంకాదు. పాలనా సంస్కరణ అమలు ఎదుర్కొనే మరో ప్రధాన సమస్య ఏమిటంటే పాలనా సంస్కరణల సంస్థలు సూచించే సంస్కరణలను అమలుపర్చేందుకు ప్రత్యేక యంత్రాంగం ఏదీలేకపోవడం. సాధారణంగా తన నివేదికను సమర్పించిన వెంటనే పాలనా సంస్కరణల సంఘాల యాంత్రికంగా రద్దు అవుతాయి. కానీ ఆ సంఘాలు సూచించిన సంస్కరణలను అమలు పర్చేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటం జరగదు. సాధారణంగా ఓ&ఎమ్ కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వ శాఖ పాలనా సంస్కరణలను అమలు చేసే బాధ్యతను చేపట్టుంది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించే ఈ శాఖ పాలనా సంస్కరణల అమలుకు ఏ విధంగానూ తగిన సంస్థ కాదు. ఎందుచేతనంటే తమ ప్రయోజనాలకు హాని కలిగించే పాలనా సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు పర్చేందుకు ఉద్యోగులు పూనుకోరు.

## 20.4 పాలనా సంస్కరణలు - ప్రగతి పాలన

ప్రగతి పాలన, పాలనా సంస్కరణల మధ్య అతిసన్నిహిత సంబంధం ఉంది. దీన్నే మరో విధంగా చెప్పాలంటే పాలనా సంస్కరణలు ప్రగతి పాలన ప్రక్రియలో అంతర్లీనమై ఉన్నాయి. ప్రగతి పాలనారంగంలో పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టినట్లయితే ప్రగతి పాలన లక్ష్యం నెరవేరనట్లే, అభివృద్ధి పథకాలను, ప్రణాళికలను అమలుపర్చడం ద్వారా ప్రజల అవసరాలను, సమస్యలను తీర్చడం ద్వారా, ప్రగతి లక్ష్యాలను సాధించటం ప్రగతి పాలన కీలకాంశం. ఈ పథకాలు, ప్రణాళికలను అమలు పర్చిన తరువాత వాటి అధ్యయనం నాటి నిర్మాణం, పద్ధతులలోని దోషాలను, లోపాలను వెల్లడించినప్పటికీ, అవి ప్రజల్లో లేదా లబ్ధిదారుల ఆశయాలను నెరవేర్చటంలో విఫలమైతే వాటి మీద వెచ్చించిన, మానవశక్తి, ఆర్థిక వనరులు వృథా అయ్యేందుకు అవకాశం ఉంది. వనరుల కొరత తీవ్రంగా ఉన్న భారతదేశం వంటి దేశాలలో వనరుల వృధాను తగ్గించాలి లేదా పూర్తిగా నివారించాలి. ఈ లక్ష్య సాధనకు ప్రగతి పాలన నిర్మాణాలలో, ప్రక్రియలలో సంస్కరణలను ప్రవేశపెట్టే యంత్రాంగాన్ని రూపొందించటం ఆవశ్యకం.

ప్రగతి పాలన సందర్భంలో పాలనా సంస్కరణలు. ఒక నిరంతర ప్రక్రియ ఎందుచేతనంటే ప్రగతి సాధన ప్రక్రియలో నిమగ్నమైన వ్యవస్థ, ఉద్యోగులు, పద్ధతులు నిర్వీర్యం అయితే ప్రగతి పాలన లక్ష్యం నెరవేరదు. సంకుచితమైన, లేదా పరిమితమైన పరిధి కల పాలనా సంస్కరణలు ప్రగతి పాలనా అవసరాలను సమర్థవంతంగా తీర్చలేవు. ప్రగతి పాలన సైద్ధాంతిక భావజలం ప్రాతిపదికపై లేదా ఆ ప్రక్రియ కీలకాంశాలపై పునరాలోచన చేపట్టినపుడు లేదా అమలు పర్చినపుడు సంకుచితమైన నిర్మాణాలు, పద్ధతులు కల్గిన పాలనా సంస్కరణలు ఆశించిన ఫలితాలను సమకూర్చలేవు.

వ్యవస్థల నిర్మాణాల్లో పద్ధతుల్లో స్వల్పమైన సంస్కరణలను చేపట్టడం తేలిక కాని మౌళికమైన సంస్కరణలు మాత్రమే ప్రగతి పాలనను పటిష్టపర్చగలుగుతాయి. స్వల్ప మోతాదుల్లో, అరుదుగా చేపట్టే నిర్మాణ పరమైన, కార్యపరమైన సంస్కరణలవల్ల ప్రగతి పాలనకు ఎటువంటి ప్రయోజనం సిద్ధించదు.

ప్రగతి పాలనా రంగంలో పాలనా సంస్కరణలు, రాజకీయ, రాజ్యాంగం సంస్కరణలతో సన్నిహితంగా ముడిపడిఉన్నాయి. కేవలం ప్రగతి పాలనలో మాత్రమే సంస్కరణలను ప్రవేశపెట్టడం వలన ప్రగతి ప్రక్రియ మందగించటానికి దారి తీస్తుంది. అందువలన ప్రగతి పాలనా రంగంలో సంస్కరణలతో పాటు రాజకీయ వ్యవస్థలో, రాజ్యాంగంలో సంస్కరణలను ప్రవేశపెట్టాలి. పాలనా సంస్కరణలు పాలనా నిర్మాణాలు, ఉద్యోగిబృంద వ్యవస్థలను మెరుగుపరిస్తే, రాజకీయ సంస్కరణలు ప్రగతి పాలన ప్రక్రియలో రాజకీయ పక్షాలు, ప్రయోజనగణాలు, కార్మిక, రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మొదలైన రాజకీయ, అర్థ రాజకీయ నిర్మాణాల పాత్రను మెరుగుపరుస్తాయి. కాగా రాజ్యాంగ సంస్కరణలు ప్రగతి పాలనపై ప్రభావం చూపే చట్టాలను, శాసనాలను ప్రగతి పాలనకు అణుగుణంగా తీర్చిదిద్దబడతాయి. ఈ విధంగా పాలనా సంస్కరణలను రాజకీయ, రాజ్యాంగం సంస్కరణలను సమ్మేళితం చేయటం ప్రగతి ప్రక్రియ మొత్తం దశలలో చేపట్టాల్సి ఉంటుంది.

## 20.5 భారతదేశంలో పాలనా సంస్కరణలు

BRAOU

స్వాతంత్ర్యం సిద్ధించినప్పటినుంచి భారత ప్రభుత్వం పాలనా యంత్రాంగం సామర్థ్యాన్ని పెంపొందించటంపై నిరంతరమైన శ్రద్ధను కనపరుస్తున్నది. వలస పాలకుల రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించే ఏకైక లక్ష్యం కలిగిన పాలనా వ్యవస్థను భారతదేశం బ్రిటీష పాలకులనుంచి వారసత్వంగా పొందింది. ఈ పాలనా వ్యవస్థకు స్వాతంత్ర్యానంతరం జాతి ఏర్పరుచుకున్న సామాజిక మార్పు, ఆర్థికాభివృద్ధి అనే రెండు లక్ష్యాల సాధనకు తగిన నిర్మాణాలనే కాక ఈ లక్ష్యాలను సాధించగల చర్యలను చేపట్టేందుకు అవసరమైన సంసిద్ధత కూడా లోపించింది. అందుచేత పాలనా వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణ, సంస్కరణలు ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటిగా రూపొందాయి.

ఈ విధంగా స్వాతంత్ర్యానంతరం దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలను, పథకాలను సమర్థవంతంగా అమలు పర్చేలా పాలనా యంత్రాంగాన్ని, పద్ధతులను తీర్చిదిద్దేందుకు పాలనా సంస్కరణలను రూపొందించడం, అమలు పర్చడం ప్రభుత్వం ప్రధాన కర్తవ్యాలలో ఒకటిగా రూపొందింది. భారత ప్రభుత్వం నేటి వరకు అమలు పర్చిన పాలనా సంస్కరణలను పరిశీలించడం అవసరం.

స్వాతంత్ర్యానంతరం పాలనా సంస్కరణల దిశలో మొట్టమొదటి ప్రయత్నంగా ప్రభుత్వం 1949 లో పాలనా యంత్రాంగం అధ్యయనానికి గోపాల్ స్వామి అయ్యంగారు సంఘాన్ని నియమించింది. ఈ సంఘం తన నివేదికలో ప్రభుత్వ యంత్రాంగం అనుసరిస్తున్న వ్యవస్థీకరణ, పద్ధతిని పాలనా పద్ధతులను మార్పు చేయాలని సూచించింది. ఈ సంఘం చేసిన సూచనలను ప్రభుత్వం ఆమోదించలేదు. 1951 లో ప్రణాళికా సంఘం నియమించిన గోర్వాల సంఘం రెండు నివేదికలను సమర్పించింది. ఈ సంఘం తన నివేదికల్లో ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇతర మంత్రిత్వ శాఖల మధ్య, మంత్రులు, కార్యదర్శుల మధ్య సంబంధాలను, ఉద్యోగిబృంద పాలనా, ఆర్థిక, విత్తపాలనా పద్ధతులను మెరుగుపర్చేందుకు, ప్రభుత్వ రంగ సంస్థలపై నియంత్రణను పటిష్టపర్చేందుకు అనేక సూచనలను చేసింది. ఈ సంఘం చేసిన కొన్ని సూచనలను ప్రభుత్వం ఆమోదించి అమలు పర్చింది.

1953, 1956 లో అమెరికాకు చెందిన ప్రసిద్ధ పాలనా నిపుణుడు పాల్ ఆపిల్ బి. సమర్పించిన నివేదికల్లో భారత ప్రభుత్వం పాలనా యంత్రాంగాన్ని మెరుగుపర్చేందుకు అనేక సూచనలు చేయబడ్డాయి. ఆపిల్ బి. సూచనల ప్రకారం ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (IIPA), ఓ&ఎమ్ (O &M) లను ఏర్పాటుచేసింది.

1960 దశాబ్దంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాలనా సంస్కరణలు సంఘాలలో జిల్లా పాలనపై నియమించిన కృష్ణమాచారి సంఘం (1962), అవినీతిపై నియమించిన సంతానం కమిటీ (1964), ఇండియన్ ఫారిన్ సర్వీస్ నిర్మాణం, వ్యవస్థీకరణ పరిశీలనకు నియమించిన పిళ్లై సంఘం (1966) ప్రధానమైనవి. సంతానం కమిటీ చేసిన అనేక సూచనలను ప్రభుత్వం ఆమోదించి అమలుపర్చింది. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి ఆరోపణలను విచారించేందుకు కేంద్ర విజిలెన్సు కమీషన్ను నియమించింది. 1950 - 60 దశాబ్దాల్లో ప్రభుత్వం అమలు పర్చిన పాలనా సంస్కరణలు ప్రభుత్వ యంత్రాంగం పద్ధతుల సమర్థతను మెరుగుపర్చలేక పోయాయి. ఈ సంస్కరణల పరిధి సంకుచితంగా ఉండటమే కాక, అవి ప్రభుత్వ పాలనావ్యవస్థల్లో, పద్ధతులలో తాత్కాలిక స్వభావం కల మార్పులను ప్రవేశపెట్టాయి. ఈ సంస్కరణ ప్రయత్నాలు పాలనా సంస్కరణల పట్ల సమగ్ర దృక్పథాన్ని కాని, దీర్ఘకాల ప్రాతిపదిక మీద సంస్కరణలను రూపొందించగల స్పష్టమైన వ్యూహాన్ని కాని ఏర్పరచడంలో విఫలమయ్యాయి.

ఈ విధంగా 1950 - 65 మధ్య కాలంలో చేపట్టిన సంస్కరణలు విఫలమవడం ప్రజల సమస్యలను, అవసరాలకు, ప్రతిస్పందించే సమర్థతా పాలనా యంత్రాంగానికి లోపించిందనే విమర్శలు పెరగడం మొదలైన పరిస్థితులు ప్రభుత్వం మొత్తం పాలనా వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసి, దాని లోపాలను తొలగింపచేసే సమగ్రమైన పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టే దిశలో ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆలోచింపచేసాయి.

ఈ ఆలోచనా ఫలితంగానే ప్రభుత్వం 1966లో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల సంఘం (ARC)ని ఏర్పాటు చేసింది. 1967లో మొరార్జీ దేశాయ్ ఉపప్రధాని పదవిని చేపట్టడంతో ఈ సంఘం అధ్యక్షునిగా కె. హనుమంతప్ప నియమితుడయ్యాడు. ఈ సంఘం రెండు సంవత్సరాల పాటు పాలనా యంత్రాంగం మొత్తం అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి 1968లో దేశ పాలనా యంత్రాంగం పై 20 నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సంఘం నివేదికలను సమర్పించిన అంశాలలో పౌరుల క్లేశనివారణ, ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర పాలనా, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, ఉద్యోగిబృంద పాలన, విత్తపాలన అధికారాల దత్తత మొదలైనవి ప్రధానమైనవి. ఈ అంశాలపై పాలనా సంస్కరణల సంఘం దాదాపు 600 సూచనలు చేసింది. వీటిలో అతికొద్ది సూచనలనే ప్రభుత్వం ఆమోదించి అమలు పర్చింది. మొత్తం మీద ప్రభుత్వ పాలనా వ్యవస్థ మీద పాలనా సంస్కరణల సంఘం ప్రభావం స్వల్పం.

పాలనా సంస్కరణలు సంఘం అనంతరం దేశంలో పాలనా సంస్కరణల పట్ల ఆసక్తి తగ్గిందనే చెప్పాలి. దీనికి చాలావరకు పాలనా సంస్కరణ సంఘం వైఫల్యం ప్రధాన కారణమని చెప్పాలి. 1970, 80 దశాబ్దాలల్లో చాలా కాలంపాటు పాలనా సంస్కరణల సంఘం చేసిన సూచనలపై చర్చ కొనసాగిందే తప్ప, ప్రధానమైన పాలనా సంస్కరణల సంఘాలేవి నియమింపబడలేదు. 1981లో ఎల్.కె. ఝా అధ్యక్షతన నియమించిన ఆర్థిక పాలనా సంస్కరణల సంఘం 1980 దశాబ్దంలో నియమింపబడిన ప్రధాన పాలనా సంస్కరణల సంఘం.

BRAOU

భారతదేశంలో నేటి వరకు అమలు చేసిన పాలనా సంస్కరణల వల్ల ఆశించిన ఫలితాలు సమకూరినట్లు గోచరించదు. ప్రభుత్వం పాలనా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపర్చటం పట్ల గణనీయమైన ఆసక్తిని ప్రదర్శించి అనేక పాలనా సంస్కరణల సంఘాలను ఏర్పరచినప్పటికీ పాలనా వ్యవస్థ, దాని పద్ధతుల సామర్థ్యం ఆశించిన మేరకు మెరుగు పడలేదనే చెప్పాలి. దేశ పాలనా వ్యవస్థను వేదిస్తున్న అనేక దోషాలు, బలహీనతలు యధాతథంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నియమించిన వివిధ పాలనా సంస్కరణ సంఘాలు కొన్ని ప్రయోజనకరమైన సూచనలను చేసినప్పటికీ అవి అమలు పర్చక పోవడం వలన అవి పాలనా వ్యవస్థపై ఏ విధంగా ప్రభావాన్ని కనబర్చలేకపోయాయి. భారతదేశంలో పాలనా సంస్కరణలు విఫలం కావటానికి తగిన రాజకీయ మద్దతు లేకపోవటం, ఉద్యోగిబృందం సహకారం లోపించడం, వివిధ పాలనా సంస్కరణల సంఘాలు చేసిన సూచనలు హేతుబద్ధంగా, ప్రతిభావంతంగా లేక పోవటం, పాలనా సంస్కరణలను అమలు చేసేందుకు ప్రత్యేకమైన యంత్రాంగాన్ని ఏర్పరచకపోవటం మొదలైనవి ప్రధాన కారణాలని మహేశ్వరీ, జైన్, దుబాషీ, రజనీ కోఠారి వంటి విశ్లేషకులు పేర్కొన్నారు.

మహేశ్వరి భారతదేశంలో పాలనా సంస్కరణలు విఫల మవటానికి ఆ సంస్కరణలు సెక్రటేరియేట్ (Secretariat) దృక్పథాన్ని కలిగి ఉండటం, వాటి అమలు సమర్థవంతంగా లేకపోవటం, ఉద్యోగి బృందం సంస్కృతి సంస్కరణలకు బలమైన అవరోధంగా ఏర్పడటం, ఉద్యోగులలో పెరుగుతున్న అవినీతి మొదలైన కారణాలు ప్రధానపాత్ర వహించాయని పేర్కొన్నారు. జైన్ భారతదేశంలో పాలనా సంస్కరణల వైఫల్యానికి పాలనా రంగంలో హేతుబద్ధమైన సంస్కరణలను ప్రవేశపెట్టక పోవడం, ప్రవేశ పెట్టిన అనేక సంస్కరణలు రాజకీయ స్వభావాన్ని కలిగి ఉండటం ప్రధాన కారణంగా పేర్కొన్నారు. దుబాషీ, రజనీ కొఠారి దాదాపు ఇదే అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

## 20.6 ఇతర దేశాలలో పాలనా సంస్కరణలు

BRAOU

కొన్ని అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో అమలు పర్చబడిన పాలనా సంస్కరణలను విశ్లేషించే భిన్నపోకడలను గుర్తించవచ్చును. అభివృద్ధి చెందిన దేశాలలో పాలనా సంస్కరణలు పాలనా వ్యవస్థ పద్ధతుల ఆధునీకరణ, హేతుబద్ధీకరణలపై పాలనా వ్యవస్థపై వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి కేంద్రీకరించాయి. కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా సంస్కరణలు సంస్థాగత నిర్మాణాన్ని, ఉద్యోగిబృంద ప్రవర్తనను మెరుగుపర్చడంపై ప్రాధాన్యతను వక్కాణించాయి. బ్రిటన్‌లో పాలనా సంస్కరణలు మొదట్లో పాలనా వ్యవస్థ, ఉద్యోగిబృంద వ్యవస్థల సమర్థతను మెరుగుపర్చటం పై తమ దృష్టిని సారించాయి. ఈ దశలో నియమింపబడిన ఫుల్టన్ సంఘం (Fulton committee) ఉద్యోగిబృందం స్వభావాన్ని, పద్ధతులను మార్పుచేసే అనేక సంస్కరణలను ప్రతిపాదించింది. రెండవదశలో (1973-78) పాలనా సంస్కరణల పెరుగుతున్న పాలనా వ్యయాన్ని తగ్గించటంపై ఆసక్తిని ప్రదర్శించాయి. కాగా 1980 దశాబ్దంలో పాలనా సంస్కరణలు పెరుగుతున్న ప్రభుత్వం పాత్రను తగ్గించేందుకు ఉద్దేశింపబడ్డాయి. పూర్వపు పశ్చిమ జర్మనీలో వివిధ స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం పునర్ వ్యవస్థీకరణకు అనేక పాలనా సంస్కరణలు ప్రవేశ పెట్ట బడ్డాయి.

జపాన్‌లో పాలనా వ్యవస్థలో, పద్ధతులలో హేతుబద్ధీకరణ, ఆధునీకరణ పెంపొందింపచేయడం, పాలనా వ్యయాన్ని తగ్గించటం మొదలైన లక్ష్యాలతో పాలనా సంస్కరణలు ప్రవేశ పెట్టబడ్డాయి. దీనికి అనుగుణంగా నిరుపయోగమైన అనేక పాలనా శాఖలను రద్దుచేయటమే కాక, ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించారు. మొదట్లో కెనడాలో ఉద్యోగిబృందం, విత్త పాలనా వ్యవస్థలను ఆధునీకరించడంపై పాలనా సంస్కరణలు తమ దృష్టినికేంద్రీకరించాయి.

కాగా. రెండవ దశలో మంత్రులు, ఉద్యోగిబృందాన్ని పార్లమెంటుకు బాధ్యులుగా చేసే సంస్కరణలు ప్రవేశపెట్ట బడ్డాయి. ఈ విధంగా అభివృద్ధి చెందిన దేశాలలో పాలనా సంస్కరణలు పాలనా వ్యవస్థ కీలకాంశాలపైన ఉద్యోగిబృంద వ్యవస్థ, విత్తపాలనా వ్యవస్థల ఆధునీకరణ హేతుబద్ధీకరణలపై, పాలనా వ్యయాన్ని క్రమబద్ధం చేయటం పై తమ దృష్టిని కేంద్రీకరించాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా వ్యవస్థ నిర్మాణ పరమైన అంశాలను, ఉద్యోగిబృంద వ్యవస్థ సమర్థతను, ప్రవర్తనను మెరుగుపర్చేందుకు పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా సంస్కరణలపై లక్ష్యంతోనే ప్రవేశపెట్టారు. కాగా ఈ దేశాలలో పాలనా సంస్కరణలను అంచెలంచెల వాద (Incremental) దృక్పథంతో ప్రవేశపెట్టారు. ఈ దేశాలలో పాలనా వ్యవస్థను మౌలికంగా మార్చే విప్లవాత్మకమైన మార్పులను ప్రవేశపెట్టే పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టే ప్రయత్నాలు పరిమితంగానే జరిగాయి. ఈ దేశాల్లో రాజకీయ నాయకత్వం పాలనా సంస్కరణలను ప్రతిపాదించటమే కాక, వాటిని బల పర్చింది కూడా.

## 20.7 పాలనా సంస్కరణలు - కొన్ని అనుభవాలు

అనేక దేశాలలో పాలనా సంస్కరణలు ఆశించిన ఫలితాలను సమకూర్చినప్పటికీ, కొన్ని దేశాలలో, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎన్నో ఆశలతో చేపట్టిన పాలనా సంస్కరణలు నిరాశనే మిగిల్చాయి. బ్రెజిల్‌లో ప్రవేశ పెట్టిన జాతీయ ఉద్యోగిస్వామ్య విసర్జిత కార్యక్రమం స్వల్పమైన ప్రభావాన్ని మాత్రమే కనపర్చింది. అనేక ఆఫ్రికాదేశాలలో ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు, ఆదేశాలలో ప్రభలిత రాజకీయ, అవినీతి, ఉద్యోగిబృందం అసమర్థత, సామాజిక అనైక్యత, మొదలైన కారణాల వల్ల ఏ మాత్రం ప్రభావాన్ని కనపర్చలేకపోయాయి. ఆసియా ప్రాంతంలోని భారతదేశం, పాకిస్తాన్ మొదలైన దేశాలలో ఉద్యోగిబృందం ప్రతిఘటన వల్ల పాలనా సంస్కరణలు విఫలం కాగా, ఫిలప్పైన్స్, ఇండోనేషియా, దక్షిణ కొరియా, తైవాన్ మొదలైన దేశాలలో రాజకీయ అవినీతివల్ల పాలనా సంస్కరణలు నిష్ఫలం అయ్యాయి. థాయ్‌లాండ్‌లో పాలనా సంస్కరణలు ఉద్యోగిబృందంపై ఎలాంటి ప్రభావాన్ని కనపర్చలేదు. ఈ దేశాల పాలనా వ్యవస్థలు గతంలో లాగే పాలనా సంస్కరణల ఆవశ్యకతను కలిగి ఉన్నప్పటికీ అవి పాలనా సంస్కరణల అమలుకు అవసరమైన రాజకీయ పద్ధతులను పాలనా సమర్థతను, ప్రజల సహకారాన్ని సమీకరించటంలో విఫలమయ్యాయి.

BRAOU

కాగా అభివృద్ధి చెందిన దేశాలలో పాలనా సంస్కరణలు విజయవంతం కావటానికి రాజకీయ వ్యవస్థ స్థిరచిత్తం, పాలనా నైపుణ్యం ప్రజల ఒత్తడి మొదలైనవి దోహదం చేసాయి. అయితే దీనికి బలమైన ఇతర కారణాలు కూడా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలో, ప్రభుత్వరంగంలో వచ్చిన మార్పులు నుంచి నేర్చుకున్న అనుభవాల కారణంగా తమ పాలనా వ్యవస్థలను మౌలికంగా మార్పులను ప్రవేశపెట్టే సంస్కరణ స్థానంలో తక్షణ ఫలితాలను ఇచ్చే స్వల్పమైన సంస్కరణలను ప్రవేశ పెట్టున్నాయి. ఈ దేశాలు చేపట్టిన ఉద్యోగిస్వామ్య విసర్జన ప్రక్రియ పాలనా రాజ్యాన్ని నిషేదించకపోగా అవసరమైన ప్రభుత్వ నిబంధనలను తొలగించింది. ఇదే విధంగా అవి చేపట్టిన అధికార వికేంద్రీకరణ ప్రక్రియ విస్తృత ప్రభుత్వాన్ని (Big Government) నిర్మూలించకపోగా నిర్ణయీకరణను క్రిందిస్థాయికి చేర్చింది.

వివిధ దేశాలలో అమలు పర్చిన పాలనా సంస్కరణలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన జెరాల్డ్ కైడన్ వీటి గురించి ఈ క్రింది అంశాలను వెల్లడించాడు.

ఒకటి, తమ స్వభావం సైద్ధాంతిక పరమైందనీ పేర్కొనకపోయినప్పటికీ, పాలనా సంస్కరణలు రాజకీయ పరమైనవి. అవి ప్రభుత్వ ఉద్యోగిబృంద వ్యవస్థపై ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణను దృఢపర్చటమే కాక రాజకీయ న్యాయకత్వానికి ప్రతిస్పందించేలా ప్రభుత్వ ఉద్యోగులను తీర్చిదిద్దాయి.

రెండు, ఉద్యోగిబృంద వ్యవస్థ తమతో సహకరించని సందర్భాలలో ప్రభుత్వాలు విప్లవాత్మకమైన సంస్కరణలను అమలు పర్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి.

మూడు, సంస్కరణలు సమగ్రంగా రూపొందించబడి, ఉద్యోగిబృందం చేత అమలు పర్చబడ్డాయి. ఈ సంస్కరణల పట్ల ఉద్యోగిబృందం మద్దతును పొందేందుకు ప్రేరణలు కల్పించబడ్డాయి.

నాలుగు, ఫలితాలను వేగంగా పొందేందుకు వీలుగా పాలనా సంస్కరణలు సాధించేందుకు, కొలిచేందుకు వీలైన లక్ష్యాల పైనే తమదృష్టిని కేంద్రీకరించాయి.

ఐదు, పాలనా సంస్కరణలు మొత్తం పాలనా వ్యవస్థను మెరుగుపర్చేందుకు సాధనాలుగా ఉపయోగపడేలా వర్తమాన ఏర్పాట్లను, పద్ధతులను ఉపయోగించటం ద్వారా పాలనా సంస్కరణలు ఉద్యోగి బృంద వ్యవస్థపై విశ్వాసాన్ని కనపర్చాయి.

ఆరు, పాలనా సంస్కరణలను, ప్రవేశపెట్టిన రాజకీయ నాయకులు వాటి ఫలితాలపై తగిన శ్రద్ధను కనపర్చారు.

ఏడు, ఈ నాయకులు తమ పాలనా సంస్కరణల పరిమితులను గుర్తించటం చేత వారు మౌలిక పాలనా సూత్రాలను, ఆవశ్యక పరిస్థితులను, పూర్తిగా మెరుగుపర్చేందుకు ప్రయత్నించకపోగా వాటిని పటిష్టపర్చేందుకు కృషిచేసారు.

BRAOU

## 20.8 సారాంశం

ఈ భాగంలో పాలనా సంస్కరణల అనేక అంశాల గురించి చర్చించాము. పాలనా సంస్కరణల అమలులో అనేక దేశాలు పొందిన అనుభవాలను వివరించాము. ఈ చర్చలవల్ల వెల్లడిఅయింది ఏమిటంటే అనేక అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెక్కు కారణాల వల్ల పాలనా వ్యవస్థల్లో సమర్థత లోపించింది. అందువలన పాలనా వ్యవస్థ సమర్థతను పెంపొందింపచేయటాన్ని ఈ దేశాల ప్రభుత్వాలు ఒక ప్రధాన కర్తవ్యంగా భావించాయి. ఈ దిశలో అనేక పాలనా సంస్కరణలను రూపొందించి, అమలు పర్చాయి. కాని పాలనా సంస్కరణల వల్ల పెక్కు దేశాలు ఆశించిన ఫలితాలను పొందలేక పోయాయి. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పాలనా సంస్కరణల ఫలితాలు ఆశాజనకంగా లేవు. పాలనా సంస్కరణల వైఫల్యానికి దేశ రాజకీయ, పాలనా పరిసరాల పాత్ర ఎక్కువగా ఉంది.

ప్రస్తుత దశాబ్దంలో ప్రపంచంలో ప్రభుత్వ రంగం వైఫల్యం మరింత తీవ్రం కావటంచేత ప్రభుత్వం పాత్రపైనే అనేక సందేహాలు ఏర్పడ్డాయి. ఈ సందేహాలు వాస్తవం అయ్యాయి. అనేక ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభానికి ప్రభుత్వం, ప్రధానంగా ఉద్యోగిస్వామ్య వ్యవస్థలోని లోపాలే కారణమని ఒక

నూతన ఆలోచనా, వివిధ దేశాల నాయకులు, విధాన నిర్ణేయతలలో తలెత్తింది. ఇటీవల కాలంలో తూర్పుయూరప్‌లోని కమ్యూనిస్ట్ దేశాలలో సంభవించిన తీవ్ర పరిణామాలు వారిలో కలిగిన నూతన ఆలోచనకు మరింత బలాన్నిచ్చాయి. మారిన ఈ ఆలోచనా ధోరణి ఫలితంగా ప్రభుత్వ రంగంపై కల ప్రాధాన్యత ప్రైవేట్ రంగం పైకి మళ్ళింది. క్రమంగా ప్రైవేటీకరణ ఒక ఆకర్షణీయ నినాదమైంది. అనేక దేశాలు ప్రైవేటీకరణ దిశలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టాయి. బ్రిటన్‌లో థాచర్ ప్రభుత్వం శ్రీ కారం చుట్టిన ప్రైవేటీకరణ సంస్కరణలు అనేక అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలకు విస్తరించాయి. ఇటీవల భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ లక్ష్యంతో విప్లవాత్మకమైన ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణలు ఆర్థిక రంగానికి మాత్రమే ఉద్దేశింపబడినప్పటికీ, వాటి ప్రభావం రాజకీయ, పాలనా రంగాలపై కూడా ప్రసరించింది. అందుచేత ఆర్థిక సంస్కరణలతో పాటు పాలనా, రాజకీయ సంస్కరణల ప్రవేశ పెట్టవలసి ఉంది. ఈ విధంగా ప్రస్తుతం పాలనా సంస్కరణల ఆవశ్యకత గతంకన్నా అధికంగా ఉంది.

## 20.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I.** ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానము లిమ్ము.

1. పాలనా సంస్కరణ భావనను నిర్వచించి. ఆ భావన కీలకాంశాలను వివరింపుము ?
2. భారతదేశంలో పాలనా సంస్కరణలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము ?
3. పాలనా సంస్కరణల రంగంలో వివిధ దేశాల అనుభవాలను వివరింపుము ?

**II.** ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు వ్రాయుము.

1. పాలనా సంస్కరణల అమలు ప్రక్రియను వివరింపుము ?
2. ప్రగతి పాలనలో పాలనా సంస్కరణల ఆవశ్యకతను చర్చింపుము ?
3. భారతదేశంలో పాలనా సంస్కరణల సంఘం చేసిన ప్రధాన సూచనలను పరిశీలింపుము ?

BRAOU

## 20.10 చదువ దగిన రచనలు


1. Gerald Caiden : Administrative Reform Chicago : Aldine Publishing House, 1969.

2. A.F. Leemans (ed.) : The Management of Change in Government. The Haque : Martinus Mishoff, 1976.

3. Thummala Krishna Kumar : Ambiguity of Ideology and Administrative Reforms, New Delhi: Allied Publishers, 1974.

4. S.R. Maheswari : Administrative Reforms in India, New Delhi : Macmillan, 1978.

5. Indian Institute of Public Administration : Special Issue on Administrative Reforms Vol. XXXI, No. 3, July - Sept. 1985.


**రచయిత : ఎమ్. బాపూజీ**

# భాగం- 21 : ప్రగతి పాలన - భారతదేశ పాలనలో పోకడలు

## విషయక్రమం


21.0 లక్ష్యాలు
21.1 పరిచయం
21.2 బ్రిటీషువారసత్వం
21.3 భారతదేశపాలన : రాజకీయ ఆవరణ
21.4 భారతదేశపాలనలో నూతన పోకడలు
21.4.1 రాజకీయ తటస్థత-నిబద్ధత
21.4.2 అధికార వికేంద్రీకరణ
21.4.3 రిజర్వేషన్ల విధానం - పాలనా సామర్థ్యం
21.4.4 పాలనలో అవినీతి పెరుగుదల
21.4.5 పాలనపై కంప్యూటర్ల ప్రభావం
21.4.6 భారతదేశ పాలన-పర్యావరణ
21.4.7 భారతదేశ పాలన : ప్రైవేటీకరణ
21.5 ప్రగతిపాలనా నిర్వర్తన
21.6 సారాంశం
21.7 నమూనా పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 21.0 లక్ష్యాలు

భారతదేశంలో రాజకీయ పాలనా అభివృద్ధి పాలనారంగంలో తలెత్తిన పోకడలను వివరించడం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠాన్ని చదివితే మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలరు.

* భారతదేశ ప్రభుత్వ పాలనపై బ్రిటీషు వారసత్వం ప్రభావం
* భారతదేశంలో పాలన రాజకీయ సందర్భం
* భారతదేశంలో పాలనారంగంలో తలెత్తిన నూతన పోకడలు
* భారతదేశంలో ప్రగతి పాలనా నిర్వర్తన.

## 21.1 పరిచయం

భారతదేశం ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల వలె నూతన పాలనా వ్యవస్థను రూపొందించుకునే సంక్లిష్ట ప్రక్రియ అవసరం ఏర్పడలేదు. ఎందుచేతనంటే భారతదేశం వలస పాలనా కాలంలో బ్రిటీషు ప్రభుత్వం అభివృద్ధిపర్చిన పాలనా వ్యవస్థను వారసత్వంగా పొందటమే కాక ఆ వ్యవస్థనే తగిన మార్పులతో కొనసాగిస్తున్నది. కొందరు పాశ్చాత్య

విశ్లేషకులు భారతదేశ పాలనా వ్యవస్థను ప్రపంచంలో అత్యంత సమర్థవంతమైన పాలనా వ్యవస్థలలో ఒకటిగా గుర్తించారు. కానీ దేశం స్వాతంత్ర్యం పొందాక నిర్బంధపూర్వక రాజ్యం, సంక్షేమ ప్రగతిశీలక రాజ్యంగా పరివర్తన చెందడంతో పాలనా వ్యవస్థ బలహీనతలు చాలావరకు బహిర్గతం అయ్యాయి. వలస పాలనా కాలంలో పాలనా వ్యవస్థ శాంతి భద్రతల రక్షణ, పన్నుల వసూలు అనే రెండు కర్తవ్యాలకు పరిమితమైంది. వలస ప్రభుత్వం ఈ నేపథ్యంలోనే మనుగడను సాధించింది. బాధ్యాతాయుతమైన ప్రాతినిధ్య రాజకీయ సంస్థలు లేకపోవటంతో ఉద్యోగిస్వామ్యం ఉదార వైఖరిని కలిగినప్పటికీ నిరంకుశంగా వ్యవహరించింది. అయితే దేశ స్వాతంత్ర్యం సముపార్జించుకున్న తరువాత పాలనా వ్యవస్థ పనిచేసే సందర్భం విప్లవాత్మకమైన మార్పుకు లోనైంది. కాని మారుతున్న సందర్భానికి అనుగుణంగా ప్రభుత్వ పాలన మార్పు చెందలేదు. దీంతో పాటు ప్రభుత్వపాలన పరిసరాలనుంచి ఎదురవుతున్న ఒత్తిళ్ళను, సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యాన్ని సంతరించుకోకపోవడం చేత ప్రగతి పాలనా లక్ష్యాలు, అచరణకు మధ్య పొంతన లోపించింది. అయినప్పటికీ ప్రగతి పాలనపై అభివృద్ధి సాధించాలనే ఒత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా అభివృద్ధి ప్రక్రియలో ప్రగతి పాలన నిర్వహించవలసిన పాత్ర మునుపటికన్నా విస్తృతమైంది. అయితే పరిసరాలనుంచి ప్రధానంగా రాజకీయ వ్యవస్థ నుంచి తగిన మద్ధతు లభించకపోవటంతో తన పాత్రను నిర్వర్తించడంలో ప్రగతి పాలన తీవ్రమైన సవాలును ఎదుర్కొంటున్నది.

## 21.2 బ్రిటీషు వారసత్వం

BRAOU

భారత పాలనావ్యవస్థ అవగాహనకు బ్రిటీషు సాంప్రదాయ (legacy)న్ని పరిశీలించవలసిన అవసరం ఉంది. ఎందుచేతనంటే ఆధునిక భారత పాలన వ్యవస్థలోని అనేక సంస్థలు వలస పాలనా కాలంలోనే అవతరించి పరిపూర్ణతను పొందాయి. బ్రిటీషు ప్రభుత్వం తన పాలనా కాలంలో ప్రవేశ పెట్టిన అనేక పాలనా సంస్థలను, పద్ధతులను, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన జాతీయ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొన్ని పాలనా విధానాలు దేశ అవసరాలకు అనుగుణంగా ఉండటం చేత, తగిన మార్పులు చేయలేని అశక్తత వల్ల గాని, ప్రస్తుత ప్రభుత్వం పాత వాటిని అనుసరిస్తుంది. బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిల్లా పాలనా వ్యవస్థ, కేంద్ర, రాష్ట్ర సర్వీసులు, సెక్రటేరియెట్ విధానం, శాఖీయ పద్ధతి, టోటన్ హ్యామ్ ప్రవేశ పెట్టిన పాలనా పద్ధతులు ప్రస్తుత పాలనా వ్యవస్థలో కీలక లక్షణాలుగా కొనసాగుతున్నాయి.

ఒక విధంగా ప్రస్తుత పాలనా వ్యవస్థను బ్రిటీషు ప్రభుత్వము మిగిల్చిన అవశేషంగా భావించడం సహేతుకమే. అందుచేత ప్రస్తుత భారత పాలనా వ్యవస్థ అవగాహనకు బ్రిటీషు పాలనా వ్యవస్థ అధ్యయనం ఒక అవసరం పరిస్థితి అని చెప్పక తప్పదు. పాలనా పరంగా బ్రిటీషు వారసత్వం మేలు, కీడులు కలయిక, నిరోధాలు (checks), సమతుల్యతలు (Balance) కలిగిన బ్రిటీషు పాలనా వ్యవస్థ దేశాన్ని పాలించటమే కాక భారతీయులను నియంత్రించేందుకు ఏర్పరచబడింది. ఆ కాలంలో ప్రవేశ పెట్టిన పాలనా పద్ధతులు క్రింది స్థాయి ఉద్యోగులు తమకు అప్పగించిన అధికారాలను నిర్ధారించిన హద్దులను అతిక్రమించకుండా చెలాయించేందుకు, వారిని ఉన్నత ఉద్యోగులుకు బాధ్యులుగా చేసేందుకు ఉద్దేశింపబడ్డాయి. బ్రిటీషు కాలంలో పాలనలో నియమాలను ఖచ్చితంగా పాటించటంపై ప్రాధాన్యతను పక్కాణించటం వెనుకు కల కారణం కూడా ఇదే. బ్రిటీషు పాలనలో రూపుదిద్దుకున్న పాలనా విధానాన్ని స్వాతంత్ర్యానంతరం మౌళికంగా మార్చేందుకు సాధ్యపడలేదు. అప్పటిపాలన విధానాన్నే కొద్ది మార్పులతో నేటికి అనుసరిస్తున్నారు. క్రిందిస్థాయి ఉద్యోగుల అధికారాలను పరిమితం చేయడంలో కల ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యం బ్రిటీషు ప్రభుత్వ లక్ష్యం ఒకటేనని గుర్తించవచ్చును. ఈ విధానం దేశ ప్రగతికి అవరోధంగా పరిణమించినప్పటికీ ప్రభుత్వం దానినే కొనసాగిస్తున్నది.

ఇదికాక బ్రిటీషు ప్రభుత్వం ఏర్పరిచిన అనేక లోపాలతో కూడిన ఆడిట్ వ్యవస్థ పాలనా సమర్థతను క్షీణింపచేసినప్పటికీ నేటి ప్రభుత్వం ఆ వ్యవస్థను కొనసాగిస్తుండటం అందరికీ తెలిసిన వాస్తవం. ఈ విధంగా కొన్ని లోపాలు ఉన్నప్పటికీ బ్రిటీషు ప్రభుత్వం భారతదేశానికి ఉక్కు చట్రం (steel frame) వంటి పటిష్టమైన పాలనా వ్యవస్థను అప్పగించిందనటంలో అవాస్తవికతలేదు.

## 21.3 భారతదేశ పాలన - రాజకీయ ఆవరణ

స్వాతంత్ర్యానంతరం భారతదేశం సర్వసత్తాక ప్రజాస్వామ్యక రిపబ్లిక్‌గా అవతరించటమే కాక పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని ఏర్పరుచుకొంది. రిపబ్లిక్ విధానం వారసత్వపు రాజరికాన్ని రద్దు చేస్తే ప్రజాస్వామ్య విధానం ప్రాతినిధ్యం, ప్రజల భాగస్వామ్యంతో కూడిన రాజకీయాలు, బాధ్యతాయుత పాలనకు అవకాశం కల్పించింది. కాగా పార్లమెంటరీ విధానం కార్యనిర్వాహక వర్గం పై ప్రజాప్రతినిధుల నియంత్రణను ఏర్పరిచింది. కొన్ని విచిత్ర లక్షణాలు కల సమాఖ్య విధానాన్ని కూడా స్పష్టించుకున్నాము.

సమాఖ్య విధానానికి అనుగుణంగా దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనే రెండు రకాల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ రెండు స్థాయిల్లో ప్రభుత్వాలు మధ్య అధికారాలు పంపిణీ జరిగింది. రాష్ట్రప్రభుత్వాలకు తమ సొంత పాలనా సర్వీసులను ఏర్పరుచుకునే అధికారం కల్పించబడింది. తమ ఉద్యోగిబృందానికి సంబంధించిన నియామకాలు, సర్వీసు నిబంధనలను రాష్ట్రాలే రూపొందించుకుంటాయి. ఈ విధంగా భారత రాజకీయ వ్యవస్థ కొన్ని సమాఖ్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ, అది సంపూర్ణమైన సమాఖ్యగా రూపొందించబడలేదు. కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ పాలనా అధికారాలు కల్పించబడటం, గవర్నరు వ్యవస్థ అత్యవసర పరిస్థితి అఖిల భారత సర్వీసుల ఏర్పాటు, ప్రణాళిక సంఘం వంటి సంస్థల ఏర్పాటు మొదలైన లక్షణాలు భారత రాజకీయ వ్యవస్థను ఏక కేంద్ర రాజ్యంగా మారుస్తున్నాయి. ఈ పరిస్థితి భారతదేశం ఏక కేంద్ర, సమాఖ్య రాజ్యాల సమ్మేళనంగా రూపొందేందుకు దారి తీసింది.

1967 తరువాత భారత సమాఖ్యలో అనేక నూతన పోకడలు తలెత్తాయి. పాలన, రాజకీయ అధికారాలు కేంద్ర ప్రభుత్వంలో కేంద్రీకృతం కావటం, రాష్ట్రాలు తమ స్వయం ప్రతిపత్తి కోల్పోవడం వంటి సమాఖ్య వ్యతిరేక ప్రక్రియ ప్రారంభమైంది. ఇటీవల కాలంలో కేంద్రంలో అధికారాన్ని పొందే రాజకీయ పక్షాలు అధికార కేంద్రీకరణకు చేస్తున్న ప్రయత్నాల వల్ల భారత సమాఖ్య వ్యవస్థకు తీవ్రమైన విఘాతం ఏర్పడింది.

కొన్ని అసందిగ్ధతలు నోటు చేసుకున్నప్పటికీ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ కొన్ని విశిష్ట లక్షణాలను కలిగిఉంది. భారత రాజకీయ నాయకులు సరళీకృత విధానాలను వక్కాణించినప్పటికీ వాటిని ఒక సిద్ధాంతంగా స్వీకరించలేదు. శాంతియుతమైన మార్పు, వాహనాలపై ప్రాధాన్యత వక్కాణించబడింది. సామ్యవాదం, వ్యక్తిగత వాదాలు సమ్మితం చేయబడ్డాయి. ప్రజాస్వామ్య బద్ధమైన సామ్యవాద పంథాను చేపట్టడంతో రాజ్యం నిర్బంధక సంస్థ రూపంనుంచి సేవాధృక్పథం కల సంస్థగా పరివర్తన చెందింది. దీని ఫలితంగా రాజ్యం విపరీతమైన పరిమాణంలో అభివృద్ధి పథకాలను, ప్రణాళికలను చేపట్టింది. వీటిని అమలు పర్చేభారం పాలనా వ్యవస్థపై మోపబడింది. ఈ పాత్ర నిర్వహణలో పాలనా వ్యవస్థ సమర్థతను పెంపొందింపచేసేందుకు అనేక సంస్కరణలను చేపట్టినారు. అయితే అవి కేవలం ఒక తంతుగా మాత్రమే మిగిలాయి.

BRAOU

రాజకీయ వ్యవస్థలో తలెత్తిన అనేక ధోరణులు ప్రగతి పాలనను ప్రగాఢంగా ప్రభావితం చేసాయి. వీటిలో జనాకర్షణ రాజకీయాలు ప్రధానమైనవి. అధికారాన్ని హస్తగతం చేసుకున్న రాజకీయ పక్షాలు అధికారంలో కొనసాగేందుకు అనేక రకాల జనాకర్షణ పథకాలను, విధానాలను ప్రవేశపెట్టున్నాయి. అధికార పక్షం రాజకీయ లబ్ధిని ఆశించి, విచక్షణారహితంగా పలురకాల పేదరిక నిర్మూలన పథకాలు, బలహీన వర్గాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం ఒక సాధారణ విషయమైంది. సైద్ధాంతిక ప్రాతిపదిక అంటూ లేకుండా ప్రవేశపెట్టిన జనాకర్షణ పథకాలు ఆశించిన ఫలితాలను సమకూర్చకపోగా అనాపేక్షిత ఫలితాలకు దారి తీసాయి. ప్రజల నిజమైన మద్దతు లేకపోయినా వారిని మభ్యపెట్టి, వారి ఓట్లను పొందేందుకు రాజకీయ పక్షాలు వేసే ఎన్నికల ఎత్తుగడలని జనాకర్షణ పథకాలను రాజకీయ విశ్లేషకులు విమర్శించారు.

ఇటీవల కాలంలో రాజకీయ నాయకులు చేపడుతున్న కార్యక్రమాలు, అవలంబిస్తున్న విధానాల వల్ల మతం, కులం మొదలైన సామాజిక సంస్థలు రాజకీయ అంశాలుగా మారాయి. దీనివల్ల తరచూ మత కల్లోలాలు, సంఘర్షణలు చెలరేగుతున్నాయి. తత్ఫలితంగా దేశంలో శాంతి భద్రతలకు ముప్పు ఏర్పడుతున్నది. రాజకీయ వ్యవస్థలో క్షీణిస్తున్న విలువలు రాజకీయ రంగంలో పెరిగిన అవినీతి ప్రభుత్వం ఇతర విభాగాలైన కార్యనిర్వాహక శాఖ, చివరకు న్యాయశాఖలోకి ప్రవేశించింది.

ఈ విధంగా స్వాంతంత్ర్యానంతరం దేశ రాజకీయ వ్యవస్థలో సంభవించిన పరిణామాలు ప్రగతి పాలనపై విపరీతమైన ప్రభావాన్ని కనబర్చాయి. రాజకీయ వ్యవస్థలో ఏర్పడిన సంక్షోభం వల్ల దేశంలో ప్రగతి పాలన సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమైన వాతావరణం కరువైంది. ప్రగతి పాలన తన లక్ష్యాలను నెరవేర్చటంలో రాజకీయ వ్యవస్థ నుంచి అనేక అవరోధాలను, సవాళ్ళను ఎదుర్కొంటున్నది. దీని ఫలితంగా ప్రగతి పాలన లక్ష్యాలను, ఆచరణకు మధ్య అంతరం పెరిగింది.

భారతదేశ రాజకీయ వ్యవస్థ దుస్థితిని మహేశ్వరి ఈ విధంగా సూచించారు. భారత రాజకీయ వ్యవస్థలో ఉద్రిక్తత పెరుగుతున్నది. సమీప భవిష్యత్తులో ఈ ఉద్రిక్తత లొంగిపోయే అవకాశం గోచరించటంలేదు. దేశ రాజకీయ వ్యవస్థపై డిమాండ్ల భారం పెరుగుతున్నప్పటికీ వాటిని నెరవేర్చే వ్యవస్థా సామర్థ్యం పెరగటంలేదు. దేశంలో తరుచూ నిర్వహిస్తున్న ఎన్నికల వల్ల సాధారణ ప్రజలు సైతం రాజకీయతత్వాన్ని పెంపొందించుకున్నారు. కాగా కొన్ని వర్గాల ప్రజలు అధికారంలో తమ వాటా కొరకు పోరాడేశక్తిని సంతరించుకున్నారు. రాజకీయాలు అన్ని విలువలను, ప్రమాణాలను కోల్పోయాయి. రాజకీయ నాయకులు తమ లక్ష్యాలను సాధించటం పైనే తప్ప ఆ లక్ష్యాలను సాధించే మార్గాల పట్ల తగినంత ఆసక్తిని కనపర్చటం లేదు. ఉద్యోగి బృందం వ్యవస్థ అవినీతికి, అసమర్థతకు కేంద్రం అయింది. అయినప్పటికీ అభివృద్ధి ప్రక్రియలో పాలనా వ్యవస్థ పాత్ర రోజురోజుకి పెరుగుతున్నది. దేశ రాజకీయ పాలనా వ్యవస్థలు చారిత్రక దృక్పథాన్ని కోల్పోయాయి. తక్షణ లక్ష్యాలు, అవసరాల ప్రాధాన్యత పెరుగుతుండడం, దీర్ఘకాలిక లక్ష్యాలు మరుగుపడుటకు దీనికి నిదర్శనం.

## 21.4 భారతదేశ పాలనలో తలెత్తిన నూతన పోకడలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం వలసపాలన నుంచి వారసత్వంగా పొందిన పాలనా వ్యవస్థను కొనసాగిస్తున్నప్పటికీ మారిన రాజకీయ, సామాజిక సందర్భాల ప్రభావంవల్ల పాలనా వ్యవస్థలో అనేక నూతన

BRAOU

పోకడలు రూపుదిద్దుకున్నాయి. ఈ నూతన పోకడలలో ప్రధానమైన వాటిని ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

## 21.4.1 రాజకీయ తటస్థత నిబద్ధత

స్వాతంత్ర్యానంతరం భారత పాలనా వ్యవస్థలో ప్రముఖంగా చోటు చేసుకున్న అంశం ఉద్యోగిస్వామ్య తటస్థత, నిబద్ధత మొదట్లో భారతదేశంలో ఉద్యోగిస్వామ్యం రాజకీయాలతో సంబంధం లేకుండా తన విధులను నిర్వహిస్తూ, రాజకీయ తటస్థతను పాటించాలని వక్కాణించబడింది. ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవశ్యక లక్షణంగా పరిగణించబడింది. మొదటి పంచవర్ష ప్రణాళిక ఈ అంశం పై ఖచ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తపర్చింది. ఈ ప్రణాళిక పేర్కొన్నది ఏమిటంటే రాజకీయ నాయకుల పాత్ర ఈ విధానాల అమలుకు ఖచ్చితంగా పరిమితం కావాలి. ప్రభుత్వ ఉద్యోగుల విధాన రూపకల్పన ప్రక్రియతో ఏ మాత్రం జోక్యం కల్పించుకోరాదు. వారి అభిప్రాయాలు, విధానాలను, నిర్ణయాలను ప్రభావితం చేసినప్పటికీ, విధానాలను అమలుపర్చటం ఒకటే వారి ఏకైక కర్తవ్యం. ఈ విధానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థతను పరిరక్షించే విధంగా వారి ఉద్యోగి నిబంధనలు, విధానాలు రూపొందింపబడ్డాయి. ఈ నిబంధనల ప్రకారం వారు ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కలిగి ఉన్నప్పటికీ తమ ఓటు హక్కును ఏ విధంగా వినియోగించింది వెల్లడించరాదు. అంతేకాక వారు ఏ విధమైన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదు. ఈ విధమైన నిబంధనలు ద్వారా ప్రభుత్వోద్యోగుల తటస్థతకు రక్షణ కల్పించబడింది.

ఉద్యోగస్వామ్య తటస్థత భావనను అనేకమంది రాజకీయ నాయకులు, ఉద్యోగులు బలపర్చారు. ఒక సందర్భంలో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ ఒకసారి విధాన రూపకల్పన జరిగాక దాన్ని అమలు పర్చడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇదే అభిప్రాయాన్ని కొందరు ఉన్నత ప్రభుత్వాధికారులు కూడా వెల్లడించారు. ఒక ప్రముఖ ఉన్నతోద్యోగి అభిప్రాయం ఈ విధంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగి తన విధులను, నిష్పాక్షికంగా, సమర్థతతో, విధేయతతో నెరవేర్చటానికి కట్టుబడి ఉండాలి. ఉద్యోగిబృంద తటస్థత భావనను 1967 లో ఏర్పడిన పరిపాలనా సంస్కరణల సంఘం బలపర్చింది. ఈ సంఘం అభిప్రాయం ప్రకారం పాలనోద్యోగులు మంత్రులపట్ల విధేయత కనపర్చాలి. కాగా మంత్రులు ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసాన్ని కలిగి ఉండాలి.

BRAOU

క్రమంగా ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థత అనే భావన ఉపయుక్తత (revelance) క్షీణించింది. ఈ భావనకు కాలం చెల్లడంతో తన విలువను, ప్రాధాన్యతను కోల్పోయింది. ఈ భావన ఒక మిధ్య అని నిరూపితమైంది. ఈ భావన స్థానంలో ఉద్యోగిస్వామ్య నిబద్ధత (Committed Civil Service) రాజకీయ అర్థితత్వ ఉద్యోగిస్వామ్యం (Politicised bureaucracy) అనే రెండు నూతన భావనలు అభివృద్ధి చెందాయి. ఉద్యోగిబృంద రాజకీయ తటస్థత అనేక కారణాల ప్రాతిపదికగా సవాలు చేయబడింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వపాలనను రాజకీయ ప్రక్రియనుంచి పూర్తిగా వేరుపర్చడం సాధ్యంకాదని వాదించబడింది. అనేక రూపాలలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ ప్రక్రియలో పాల్గొన్నట్లు నిరూపించబడింది. సైద్ధాంతిక స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయంగా తటస్థంగా ఉండాలని ఉద్ఘాటించబడినప్పటికీ, వాస్తవంగా వారు రాజకీయముగా తటస్థంగా లేకపోవటమే కాక, తమకు చెందని అధికారాలను చెలాయిస్తున్నట్లు వాదించబడింది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత అభివృద్ధికి తీవ్ర అవరోధమని వాదించారు.

ఈ విధంగా 1970 దశాబ్దంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత తీవ్ర విమర్శలకు గురైంది. ఈ విమర్శలకు అప్పటి ప్రధానమంత్రి శ్రీ మతి ఇందిరాగాంధీ వ్యాఖ్యలు ఎంతో బలాన్నిచ్చాయి. ఇందిరాగాంధీ ప్రభుత్వ

ఉద్యోగులు తమ రాజకీయ తటస్థ వైఖరి కారణంగా అభివృద్ధి మార్గంలో అవరోధాలుగా రూపొందారని విమర్శించింది. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు ఆమె ప్రతిపాదించిన నిబద్ధ ఉద్యోగిస్వామ్యం (Committed bureaucracy) బహుళ ప్రచారంలోకి వచ్చిది. శ్రీమతి గాంధీ ప్రభుత్వ ఉద్యోగులు జాతికి, ప్రజల సంక్షేమానికి నిబద్ధతను ప్రదర్శించాలని ఉద్ఘాటించారు శ్రీ మతి గాంధీ వ్యాఖ్యను చంద్రశేఖర్, మోహన్ ధారియావంటి రాజకీయ నాయకులు బలపర్చారు. ప్రభుత్వ ఉద్యోగులు జాతీయ లక్ష్యాలకు కట్టుబడి ఉండటమే కాక దేశ సామాజిక అవసరాలకు ప్రతిస్పందించాలని వారు సూచించారు.

అయితే ఈ రాజకీయవేత్తలు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ నిబద్ధత భావనపై అనేక అపోహలకు, అపార్థాలకు దారితీసింది. కాంగ్రెసుకు చెందిన కొందరు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు జాతి ప్రజలకే కాక అధికారంలోని రాజకీయ పార్టీ విధానాలు, కార్యక్రమాల పట్ల కూడా నిబద్ధతను కలిగి ఉండాలని వాదించారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు ప్రతిపక్ష నాయకులు అధికార పక్షం ఈ భావనను, తన సిద్ధాంతాలను, చివరకు తన అధికారాన్ని కొనసాగించేందుకు ఒక సాధనంగా ఉపయోగిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థత భావనకు బద్ధులైన వ్యక్తులు ఉద్యోగిస్వామ్య నిబద్ధత ప్రజాస్వామ్య వ్యతిరేకమేకాక ప్రభుత్వ ఉద్యోగుల నిష్పాక్షతకు ప్రమాదం కలిగిస్తుందని వాదించారు.

ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధత భావనపై చెలరేగిన వివాదం ఎలా ఉన్నప్పటికీ ఈ భావన లెబర్ ప్రతిపాదించిన ప్రభుత్వ ఉద్యోగి రాగద్వేషాలకు అతీతంగా అంటే ఆపేక్ష ఉద్రేకాల రహితంగా తన విధులను నిర్వర్తిస్తారనే ఊహనకు భిన్నంగా ప్రభుత్వ ఉద్యోగులలో రాగద్వేషాలను పురికొల్పే ప్రయత్నమని గుర్తించవచ్చును. దీనిని నివారించేందుకు మూడు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి. ఒకటి ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనలో ఆశించిన మార్పులు కలిగేలా ఉద్యోగ బృందం నిర్మాణంలో, వ్యవస్థలో తగిన మార్పులు ప్రవేశపెట్టడం, రెండు ఉద్యోగుల దృక్పథాలను, ప్రవర్తనను మార్పు చేసేందుకు వారికి తగిన శిక్షణను నేర్పడం, మూడు వారి నుంచి తగిన విధేయతను పొందేందుకు నిర్బంధపూర్వక చర్యలను చేపట్టడం. అయితే భారత ప్రభుత్వం నేటి వరకు అమలు పర్చిన పరిపాలనా సంస్కరణలు ఈ లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడుటలేదు. అందుచేత ప్రభుత్వ ఉద్యోగి బృందం ప్రవర్తన, నిర్మాణం యథాతథంగా కొనసాగుతున్నాయి.

BRAOU

## 21.4.2 అధికార వికేంద్రీకరణ

ప్రజాస్వామ్య సూత్రానికి అనుగుణంగా అధికార వికేంద్రీకరణ భారతదేశంలో ఒక ప్రధాన నినాదమైంది. ప్రభుత్వ అధికారం వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నట్లు నెహ్రూ వంటి నాయకులు తరుచూ ఉద్ఘాటిస్తూ వచ్చారు. దీనికి అనుగుణంగా పాలన, రాజకీయ రంగాలలో అధికార వికేంద్రీకరణ ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యతలలో ఒకటైంది. 1959వ సం.లో పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా అధికార కేంద్రీకరణ ఆదర్శానికి ఒక కార్యరూపాన్ని ఇచ్చే ప్రయత్నానికి నాంది జరిగింది. రాజకీయ, పాలనా అధికారాలను అట్టడుగు స్థాయిలోని ప్రజలకు చేర్చటమే పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రధాన ఆశయం. అయితే పంచాయితీ రాజ్ వ్యవస్థ తన ప్రధాన ఆశయమైన అధికార వికేంద్రీకరణను సంపూర్ణంగా సాధించలేకపోయింది. ఈ వ్యవస్థపై నిర్వహింపబడిన అనేక పరిశోధనల్లో ఈ వ్యవస్థ అనేక బలహీనతలు, లోపాలకు గురైనట్లు వెల్లడైంది. ప్రభుత్వం అధికారవికేంద్రీకరణ సాధనకు పంచాయతీరాజ్ వ్యవస్థకు తగిన అధికారాలు, నిధులు ఇచ్చి స్వయం ప్రతిపత్తిని కల్పించేందుకు సంసిద్ధంగా లేదనే వాస్తవం వెల్లడైంది. ఈ కారణాలవల్ల అధికార వికేంద్రీకరణ కేవలం ఒక రాజకీయ నాయకుల వాగ్ ఆడంబరంగా మిగిలిపోయినట్లు గుర్తించవచ్చును.

## 21.4.3 రిజర్వేషన్ల విధానం - పాలనా సామర్థ్యం

రాజ్యాంగంలోని 15వ ప్రకరణ ప్రకారం రాజ్యం, మతం, కులం, జాతి, లింగం, జన్మస్థానం మొదలైన కారణాల ప్రాతిపదికగా ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలలో ప్రవేశంలో ఏ పౌరుని పట్ల విచక్షణ చూపరాదు. లేదా ఏ పౌరుని అనర్హునిగా గుర్తించరాదు. 116 వ అధికరణ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలల్లో పౌరులందరికీ సమానమైన అవకాశాలను కల్పించాలి. కాని వాస్తవంలో ఈ అధికారణలపై అనేక పరిమితులున్నాయి. ఈ పరిమితులు ప్రభుత్వపాలన ప్రతిభపై ప్రభావాన్ని కనపర్చాయి. రాజ్యాంగం 335 అధికరణ షెడ్యూల్డు కులాలకు, జాతులకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 15%, 7.57% ఉద్యోగులను కేటాయించాలని ఆదేశిస్తున్నది. ఈ రిజర్వేషన్ల విధానాన్ని పది సం॥ ల వరకే కొనసాగించాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ అవి ఎప్పటికప్పుడు పొడిగించబడుతున్నాయి. అంటే రిజర్వేషన్ల విధానం భారత రాజకీయ వ్యవస్థ ఒక శాశ్వత లక్షణంగా ఏర్పడింది.

ఇటీవలి కాలంలో రిజర్వేషన్ల పరిధి కూడా విస్తృతమైంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, తమ ఉద్యోగాలలో షెడ్యూల్డు కులాలు, తెగలతో పాటు వెనుకబడిన కులాల అభ్యర్థులకు కూడా రిజర్వేషన్లు కల్పించాయి. ఈ రిజర్వేషన్ల పరిమాణం 25 శాతం నుంచి 50 శాతం వరకు ఉంది. 1993 లో కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో 27 శాతం ఉద్యోగాలను వెనుకబడిన కులాల అభ్యర్థులకు కేటాయించింది. ఈ విధంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో దాదాపు 50 శాతం ఉద్యోగాలు వివిధ వెనుకబడిన వర్గాల వారికి కేటాయించబడ్డాయి. కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాయి. ఈ విధంగా భారతదేశంలో రిజర్వేషన్ల విధానం ఒక శాశ్వత లక్షణంగా రూపొందటమే కాక వాటి పరిమాణం విస్తృతమవుతూ వచ్చింది.

భారతదేశ పాలన వ్యవస్థలో రిజర్వేషన్ల విధానం ఒక వివాదస్పదమైన అంశమైంది. ఈ విధానానికి అనుకూలంగా వ్యతిరేకంగాను అనేక వాదనలు చేయబడుతున్నాయి. మండల్ కమీషన్ నివేదికానంతరం కాలంలో ఈవిధానం మరింత జటిలంగా, సంక్లిష్టంగా రూపొందింది. ఇటీవల అనేక ప్రయోజన గణాలు తమ వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలలో కొంత శాతం కేటాయించమని ఆందోళనలు ప్రారంభించటంతో పరిస్థితి మరింత విషమించినట్లు గుర్తించవచ్చును.

గత 45 సంవత్సరాల నుంచి కొనసాగుతున్న రిజర్వేషన్ల విధానం ప్రభుత్వ పాలనపై కనపర్చిన ప్రభావాన్ని గుర్తించి భిన్నాభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. రిజర్వేషన్ల విధానం వల్ల బలహీన వర్గాల ప్రజలు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించి తమ జీవన పరిస్థితులను మెరుగుపర్చుకోగలిగారు. ఈ విధానం వల్ల సామాజిక న్యాయస్థాపన కొంతవరకు సాధ్యమైంది. అయితే ప్రభుత్వ పాలనా సామర్థ్యం పై రిజర్వేషన్ల ప్రభావం ప్రోత్సాహకరంగా లేదనేది వాస్తవం. కొందరు విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం రిజర్వేషన్ల విధానం వల్ల సామాజిక వ్యవస్థలో సమర్థత, ప్రతిభ, నిబద్ధత వంటి ఉన్నత ప్రమాణాలు క్షీణించాయి. ప్రభుత్వ ఉద్యోగుల సుస్థితి ( moral) కూడా దిగజారింది ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో ప్రతిభ కన్నా ఒక ప్రత్యేక కులం, జాతి లేదా వర్గంలో సభ్యత్వానికి అధిక ప్రాధాన్యతను కనపర్చే విధాన సహేతుకం కాదని పెక్కు మంది అభిప్రాయ పడ్డారు.

వీరి వాదనకు భిన్నంగా  ర్వేషన్లకు అనుకూలమైన వారి వాదన ఏమిటంటే దక్షిణ భారతదేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో 40 సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలంలో రిజర్వేషన్ల విధానం అమలులో వున్నప్పటికీ, దీనివల్ల ప్రభుత్వ పాలనా సామర్థ్యం క్షీణించిందని నిర్ధారించేందుకు తగిన

BRAOU

నిదర్శనాలు లేవు. ఇదే విధంగా **ఇటీవల** వరకు రిజర్వేషన్ల విధానాన్ని అమలుపర్చని ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో పాలనా సామర్థ్యం మెరుగ్గావుందని చెప్పేందుకు కూడా నిదర్శనాలు లేవు. దీనిని బట్టి పాలనా సామర్థ్యం అనేక అంశాల మీద ఆధారపడి ఉందనీ, కేవలం రిజర్వేషన్ల విధానం కనపర్చే ప్రభావం స్వల్పమని గుర్తించాల్సి ఉంటుంది.

## 21.4.4 పాలనలో అవినీతి పెరుగుదల

భారతదేశంలో స్వాతంత్ర్య వచ్చాక ప్రభుత్వ పాలన వ్యవస్థ ఎదుర్కొన్న సవాళ్ళల్లో ఉద్యోగిబృంద అవినీతి అత్యంత ప్రధానమైందని చెప్పడం అతిశయోక్తికాదు. భారత పాలన వ్యవస్థలో అవినీతి హద్దులు లేకుండా విస్తరించింది. ఇది తొలగించలేని జాడ్యంగా పరిగమణించింది. భారతదేశ పాలన వ్యవస్థకు అవినీతి క్యాన్సర్‌లా పట్టిపీడుస్తున్నదనేది తరుచూ వినిపించే చలోక్తి. భారతదేశ ప్రభుత్వ రంగంలో అవినీతిపై గ్రెర్నార్ మిర్థాల్, ఫ్రెడ్‌రిగ్స్, బైబాంట్, రోడాల్ఫ్ వంటి పాశ్చాత్య రచయితలతో పాటు మహేశ్వరి, బి.కె. నెహ్రూ, ఆర్ బి. జైన్ సంతానం మొదలైన భారతీయ రచయితలు కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చెసారు. అవినీతి గురించి ఈ విశ్లేషకులు వెలిబుచ్చిన అనేక అభిప్రాయాలు అవినీతి సమస్య తీవ్రతకు వ్యక్తం చేస్తాయి. ఏమైనప్పటికీ, భారతదేశ పాలనా వ్యవస్థలో అవినీతిగా లీలాసర్వత్రా వ్యాపించింది. పాలనా వ్యవస్థ అన్ని స్థాయిలోని ఉద్యోగులలో అవినీతి తాండవిస్తుంది. దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతిని అరికట్టేందుకు అనేక శాసనాలు ఉన్నప్పటికీ అవి కాగితాలకే పరిమితయ్యాయే తప్ప ఆచరణలో విఫలమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులలో ప్రబలిన అవినీతి వల్ల దేశ ఆర్థిక పరిస్థితి కుంటుపడింది. ప్రభుత్వం అనేక వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న ప్రణాళికలు, పథకాల ఫలితాలు ప్రజలకు చేరలేకపోతున్నాయనీ ప్రభుత్వం నియమించిన పాలనా సంస్కరణల సంఘాలు, విచారణ సంఘాలు ఘోషిస్తున్నాయి.

ప్రభుత్వరంగంలో అవినీతి విస్తరించటానికి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాలు దోహదం చేసినప్పటికీ, రాజకీయ వ్యవస్థ పాత్ర ఎక్కువగా వుందని అందరూ గుర్తించిన వాస్తవం రాజకీయ వ్యవస్థలో క్షీణిస్తున్న విలువలు, ప్రామాణాలు, పెరుగుతున్న అవినీతి, పాలనా రంగంలో అవినీతి అదుపులేకుండా విజృంభించేందుకు ప్రధాన కారణమని పలువురి భావన. ఏమైనప్పటికీ పరిపాలన రంగంలో అవినీతిని పూర్తిగా అంతమొందిస్తేనే దేశం ఆర్థికంగా ముందడుగు వేయగలదనేది నిర్వివాదాంశం.

## 21.4.5 ప్రగతి పాలనపై కంప్యూటరీకరణ ప్రభావం

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిసరాల గతశీలకంగా, సంక్లిష్టంగా రూపొందటంతో సామాజిక, ఆర్థిక ప్రగతిసాధన ప్రభుత్వ పాలనపై అధిక భారన్ని మోపింది. ఇదే సందర్భంలో మైక్రో కంప్యూటర్ల మూల్యం తగ్గడం. హార్డ్‌వేర్ సాఫ్ట్‌వేర్ సాంకేతిక పరిజ్ఞానంలో సంభవించిన విప్లవాత్మక అభివృద్ధి మొదలైన పరిణామాలు అట్టడుగు స్థాయికి సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడం ద్వారా వికేంద్రీకృత అభివృద్ధిని సాధించేందుకు తగిన కృషి చేసేలా అభివృద్ధి చెందుతున్న దేశాలను పురికొల్పాయి. ఈ కృషి ప్రధాన ఆశయం ఏమిటంటే ఆధునిక సమాచారాన్ని అందచేయడం ద్వారా నిర్ణయీకరణ ప్రక్రియను హేతుబద్ధంగా వాస్తవ పూరితంగా తీర్చిదిద్దడం ద్వారా అభివృద్ధిని వేగంగా సాధించడం. ఇదే లక్ష్యంలో 1980 దశాబ్దంలో భారతదేశంలో పాలనా రంగంలో కంప్యూటర్లను ప్రవేశపెట్టడం జరిగింది.

BRAOU

భారతదేశంలో 1980 దశాబ్దంలోనే వికేంద్రీకృత ప్రణాళికీకరణ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ నేటివరకు దాని లక్ష్యం నెరవేరలేదు. దీనికి స్థానిక స్థాయిలో ప్రగతి పాలన అవసరాలను, లక్షణాలను విస్మరించి ప్రణాళిక కేంద్ర ప్రభుత్వస్థాయిలో రూపొందించడంకు ప్రధాన కారణం కొందరు విశ్లేషకులు పేర్కొన్నట్లు లాంఛనప్రాయమైన నియమాలకు ప్రాధాన్యతనిచ్చే పాలనా పద్ధతికి కట్టుబడి వుండటం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రణాళికీకరణ ప్రక్రియలో సమాచార ప్రాసెసింగ్‌లో పరిణామాత్మక సమాచారం, సంఖ్యాత్మక (numarical analysis) విశ్లేషణను ఉపయోగించటంపై పరిమితులను విధించటం వలన అభివృద్ధి ప్రణాళికీకరణ ఆశించిన ఫలితాలను సమకూర్చలేదు.

భారతదేశంలో 1970 నుంచి గ్రామీణాభివృద్ధి పథకాల అమలు వేగం పుంజుకుంది. ఈ పథకాలపై ప్రణాళీకరణ, అమలు, అనుశ్రోణత (monitioring) లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా, బ్లాకు పాలనా యంత్రాంగాల సమిష్టిబాధ్యతగా రూపొందించింది. 1980 దశాబ్ధంలో భారత ప్రభుత్వం సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP) నిర్వహణకు విస్తృతమైన పరిమాణంలో సమాచారం సేకరింపబడినప్పటికీ దానిలో అధిక భాగం నిరుపయోగంగా వున్నట్లు గుర్తించింది. అంతేకాక తగిన నిపుణత కలిగిన ఉద్యోగబృందం లేకపోవడం చేత సమాచార సేకరణలో విపరీతమైన జాప్యం జరుగుతున్నట్లు కూడా గుర్తించబడింది. స్థానిక కార్యాలయాలలోని రికార్డులలో భద్రపర్చబడిన సమాచారం తిరిగి ఉపయోగం (retrieval) సులభం కాక పోవటం వలన దాన్ని సూక్ష్మస్థాయి ప్రణాళికీకరణకు వినియోగించడం సాధ్యం కాదని గుర్తించబడింది. కాగా కంప్యూటర్ ఆధారమైన సమాచార విధానాలు సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకాల నిర్వహణకు అవసరమైన నిర్ణయాకరణను స్థానిక స్థాయిలోనే చేయగలదు. దీని ఫలితంగా భారత ప్రభుత్వం 1980 దశాబ్ధంలో గ్రామీణాభివృద్ధి సత్వర సాధనకు కంప్యూటరైజ్‌డ్ గ్రామీణ సమాచార పథకాన్ని (Computerised Rural Information System Project) ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రయోగాత్మకంగా గుజరాత్‌లో ప్రవేశపెట్టబడి క్రమంగా ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. దీనితో పాటు ఈ దశాబ్ధంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అనేక శాఖలలో, ఏజన్సీలలో కంప్యూటర్లను ప్రవేశపెట్టారు.

BRAOU

ఈ విధంగా 1980 దశాబ్ధంలో భారతదేశంలో ప్రగతి పాలన రంగంలో కంప్యూటర్ల యుగం ప్రారంభమైంది. ఈ దశాబ్ధంలో రాజీవ్ గాంధీ దేశనాయకత్వాన్ని చేపట్టడం వలన రాజకీయ నాయకత్వంలో వచ్చిన మార్పు ప్రభుత్వ పాలనా రంగంలో కంప్యూటర్ల వినియోగం గణనీయంగా పెరిగేందుకు ప్రధాన కారణమైంది. కంప్యూటర్ల వినియోగం వల్ల ప్రగతి పాలన రంగంలో పెక్కు మార్పులు కలిగినట్లు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ముకుల్ సన్ వాల్ (mukul san wal) అధ్యయనం వెల్లడించేది ఏమిటంటే కంప్యూటర్ల వినియోగం వలన అభివృద్ధి సంస్థలదైనందిన పాలనలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అభివృద్ధి పథకాల అమలులో క్షేత్రస్థాయి ఉద్యోగుల జవాబుదారీ తనం, భాగస్వామ్యం పెరిగాయి. నేటి వరకు క్షేత్రస్థాయి ఉద్యోగుల నిర్వర్తనను వారు సాధించిన లక్ష్యాల (targets) ఆధారంగా మూల్యాంకన చేయడం జరిగింది. కానీ కంప్యూటర్ల వినియోగం తరువాత వారి పరిధిలో కల గ్రామాలు సాధించిన అభివృద్ధి ప్రాతిపదికగా వారి నిర్వర్తనను మూల్యాంకన చేయడం జరుగుతున్నది.

కంప్యూటర్ల వల్ల కలిగిన ఇతర ఫలితాలు ఏమిటంటే వాటి వినియోగం వల్ల స్థానిక కార్యాలయాలలోని ఉద్యోగుల గణ సంబంధాలలో (group relations) మార్పులు కలిగాయి. కంప్యూటర్ల వలన అభివృద్ధి కార్యక్రమాల అమలులో కల లోపాలను వెంటనే గుర్తించటానికి వీలవుతుంది. దీనివల్ల ప్రతి ఉద్యోగి అభివృద్ధి ప్రక్రియలో తన పాత్ర ఏమిటో గుర్తించేలా చేయవచ్చును. అంతేకాక అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉద్యోగుల అసమర్థత మునుపటికన్నా సులభంగా గుర్తించవచ్చును.

కంప్యూటరీకరణ వల్ల ఉన్నతాధికారులు, ఆధీన ఉద్యోగ సంబంధంలో కూడా మార్పులు కలిగింది. గతంలో వీరిమధ్య లాంఛన ప్రాయమైన సంబంధాలు మాత్రమే కొనసాగాయి. కాని ఆధీన ఉద్యోగులు కంప్యూటర్లను వినియోగించటం మొదలైన తరువాత వారు అనేక సమస్యలను ఉన్నతోద్యోగులతో ప్రత్యక్షంగా చర్చిస్తున్నారు. ఈ విధంగా కంప్యూటర్ల వలన ప్రగతి పాలనలో సమిష్టి నిర్వహణకు అవకాశం ఏర్పడింది.

మొత్తం మీద కంప్యూటరీకరణ వలన ప్రగతి పాలనలో, ప్రధానంగా నిర్ణయీకరణ ప్రక్రియ, నియంత్రణ, అనుశ్రోణిత అంశాలలో సమర్థత, హేతుబద్ధతలు పెరిగాయని స్పష్టమైంది. అభివృద్ధి ప్రక్రియకు అవసరమైన సమాచారాన్ని వేగంగా, సమర్థవంతంగా సేకరించటం, వినియోగించటం ఎలాగో ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించారు. గత పాలనా సంస్కృతి ఉద్యోగులలో భౌతిక, ద్రవ్య పరమైన లక్ష్యాలకు సంబంధించిన పరిమాణాత్మక సమాచారాన్ని వినియోగించే దృక్పథాన్ని పెంపొదింప చేసింది. కానీ కంప్యూటర్ల ప్రవేశంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రగతి ప్రక్రియలో కల లోపాలు అంతరాల వెనుక కల కారణాలను వెంటనే పసిగట్ట గల్లుతున్నారు.

ఈ విధంగా కంప్యూటరీకరణ వల్ల ఎంత ప్రయోజనం చేకూరినప్పటికీ, ఈ పరిణామం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశంలో ఒక వింత పరిస్థితి తలఎత్తిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒక ప్రక్క ప్రగతి పాలన సంక్లిష్ట సామాజిక, రాజకీయ, ఆర్థిక సందర్భం కేంద్రీకృత అధికృతను, నియంత్రణకు దారితీస్తుండగా, మరో ప్రక్క నానాటికి పెరుగుతున్న కంప్యూటరీకరణ వ్యవస్థ అభివృద్ధి ప్రణాళికల అమలుకు వికేంద్రీకృత పాలనను ప్రోత్సహిస్తున్నది. అయితే ఈ విచిత్ర పరిస్థితి కంప్యూటరైజేడ్ సమాచార సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందేందుకు ఏ మాత్రం దోహదపడదని విశ్లేషకుల అభిప్రాయం.

## 21.4.6 ప్రగతి పాలన పర్యావరణ (Development Administration and Ecology)

BRAOU

ఇటీవల దశాబ్దాలలో ప్రకృతి వనరుల మితిమీరిన వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత ఒక తీవ్రసమస్యగా రూపొందింది. వాస్తవంలో గాంధీ, సెహమర్ ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ అభివృద్ధి దృక్పథం ఒక ప్రక్క పర్యావరణ, పరిసరాలు, నైతిక సూత్రాలు, మరో ప్రక్క సమర్థత, శక్తి సమానత్వం, ప్రయోజనాల మధ్య తలెత్తిన సంఘర్షణను నివారించాలని వక్కాణించింది. ప్రస్తుతం పర్యావరణ నిపుణులు ప్రశ్నిస్తున్నదేమిటింటే ఒక్కటిగా మనం పృథ్విని, మానవ జాతిని విధ్వాంసానికి ఎందుకు పూనుకుంటున్నాము? నేడు అనేక పర్యావరణ వ్యవస్థల విధానం వల్ల ఏర్పడుతున్న పరిణామాలపైన విశ్వవ్యాప్తంగా తీవ్రమైన చర్య కొనసాగుతున్నది. నేడు యుద్ధాలు పారిశ్రామికీకరణ, ఆధునిక వ్యవసాయం, విద్యుత్ ఉత్పాదనల పేరిట జరుగుతున్న విధ్వంసం వల్ల భయంకరమైన పరిస్థితి ఉత్పన్నమైంది. 1972 రోమ్‌లో నివేదిక జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, కాలుష్యం, ఆహారధాన్యాల ఉత్పత్తికి ఉపయోగిస్తున్న రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వల్ల ఏర్పడిన సమస్యలపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి పురికొల్పింది. ప్రస్తుతం కొనసాగుతున్న వనరుల వినియోగాన్ని అరికట్టలేకపోతే ఒక శతాబ్ధంలోపున ఈ నివేదిక హెచ్చరించింది.

1972లో స్టాక్ హోమ్‌లో నిర్వహించిన రాజ్యసమితి సమావేశం పరిసరాల విచ్ఛిన్నత, వనరుల తరుగుదల వల్ల ఏర్పడిన పరిస్థితులపై ప్రపంచదేశాలు తమ దృష్టిని కేంద్రీకరించాలని ఉద్ఘాటించింది. 1987 లో ప్రచురింపబడిన ప్రపంచ నివేదిక విధ్వంసానికి తోడ్పడిన కారణాలపై విభిన్న అభిప్రాయాలను వ్యక్తపర్చింది. ప్రపంచ పర్యావరణ పరిస్థితిని మెరుగుపర్చేందుకు వెంటనే తగు చర్యలను చేపట్టాలని ఈ నివేదిక ఉద్ఘాటించింది.

ఇటీవల రియోడిజనీరోలో నిర్వహింపబడిన పుడమి శిఖరాగ్ర సమావేశం (Earth Summet) ఈ భూతలాన్ని పర్యావరణ విధ్వంసాన్నుంచి పరిరక్షించేందుకు చేసిన ప్రయత్నంగా భావించవచ్చును. ఈ శిఖరాగ్ర సమావేశం అన్ని రకాల అభివృద్ధి ప్రాజెక్టులవల్ల ఏర్పడే పర్యావరణ పరిమాణాలను పరిగణలోకి తీసుకునే (Sustaineble) అభివృద్ధి అనేక నూతన భావనగా ప్రతిపాదించబడింది. ప్రపంచబ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి తమ సహాయక పథకాల అమలులో అభివృద్ధిపై ప్రాధాన్యతను వక్కాణించాయి.

భారతదేశంలో పరిసరాల విధ్వంసం వల్ల నష్టపోయిన బాధితులు నిర్వహిస్తున్న పోరాటాలవల్ల పరిసరాల పరిరక్షణ ఉద్యమం కొనసాగుతున్నది. ఈ ఉద్యమం హిమాలయాల ప్రాంతంలో అటవీ సంపద విధ్వంసానికి వ్యతిరేకంగా నిర్వహించిన బిప్కో ఉద్యోమంతో ప్రారంభమైంది. ఇదే విధమైన ఉద్యమాల దండకారణ్యం ప్రాంతంలో కూడా నిర్వహింపడ్డాయి. ఇటీవలకాలంలో ఇడిక్కి (కేరళ) నర్మదా సరోవర్ (గుజరాత్) ప్రాజెక్టులు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యామాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాల నాయకులుపై ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నిరాశ్రయులైన ప్రజలు, ప్రయోజనాల రక్షణకు పోరాటం కొనసాగిస్తున్నారు.

భారతదేశంలో ఇటీవల కాలంలో తలెత్తిన తీవ్ర పర్యావరణ సమస్య మరొకటి ఉంది. ప్రభుత్వం దేశ సత్వర ఆర్థికాభివృద్ధి చేపట్టనున్న భారీ నీటిపారుదుల ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టుల నిర్మాణం వల్ల అనేక వేలమంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. వారికి పునరావాసం కల్పించడం ఒక ప్రధాన సమస్యగా రూపొందింది. అభివృద్ధి ప్రక్రియ వల్ల ఉత్పన్నమవుతున్న పర్యావరణ సమస్యలు ప్రగతి పాలన ఊహించని సమస్యలు. ఈ సమస్యల రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలు తీవ్రమైనవి కావటం చేత ప్రగతి పాలకులు, విధానకర్తలు వాటికి ప్రతిస్పందించక తప్పటం లేదు. భారీ ప్రాజెక్టులు, తదితర నిర్మాణాలవల్ల తమ ఇళ్ళను, ఆస్తులను కోల్పోయి నిరాశ్రయులయ్యే ప్రజలకు వేరే ప్రాంతాలలో పునరావాసు (resettlement) కల్పించే కార్యక్రమాలను చేపట్టడం ప్రగతి పాలనలో అంతర్భాగమైంది.

BRAOU

అయితే ప్రభుత్వం చేపడుతున్న పునరావాస కార్యక్రమాల ఫలితాలు సంతృప్తికరంగా లేవు. దీనికి ఈ కార్యక్రమాల రూపకల్పన, అమలులో అనేక లోపాలుండటం ఒక ప్రధాన కారణం. ఈ రంగంలో ఇప్పటివరకు నిర్వహించిన పరిశోధనలు వెల్లడిస్తున్నది. ఏమిటంటే వివిధ భారీ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తమ సర్వస్వాన్ని కోల్పోయి నిరాశ్రయులైన ప్రజల పునరావాసానికి చేపట్టిన పథకాలు రూపకల్పన, అమలు సమర్థవంతంగా, అర్థవంతంగా లేవు. వాటిలో కల విధాన, పాలనాపరమైన లోపాలవల్ల అవి ఆశించిన ఫలితాలను సమకూర్చటంలో పూర్తిగా విజయవంతంగా కాలేకపోయాయి. దీని ఫలితంగా నిరాశ్రయులైన ప్రజలలో తీవ్రమైన ఆందోళన, ప్రగతి పాలన పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి.

హరిమోహన్ మాథుర్ ప్రగతి పాలన అమలు చేసిన పునరావాస పథకాల ఫలితాలను విశ్లేషించి చేసిన వ్యాఖ్యలు ఈ విధంగా ఉన్నాయి. ప్రభుత్వం అమలు పరుస్తున్న పునరావాస పథకాలు కేవలం తాత్కాలిక ప్రాతిపదకపైన రూపొందించబడుతున్నాయి. అవి నిరాశ్రయులైన ప్రజల వాస్తవ పరిస్థితుల అనగాహనపై రూపొందింపబడుటం లేదు. పునరావాసం కల్పించటం అంటే కేవలం నగదు రూపంలో నష్ట పరిహారాన్ని చెల్లించడం అని భావించబడుతుంది. ఈ నష్ట పరిహారాన్ని చెల్లించడంలో కూడా విపరీతమైన జాప్యం జరుగుతున్నది. దీని వల్ల నిరాశ్రయులైన ప్రజల పునరావాసాన్ని కల్పించుకునేందుకు తీవ్రంగా పోరాడవలసివస్తున్నది.

1980 దశాబ్దం మొదట్లో ప్రపంచ బ్యాంకు (World Bank) అభివృద్ధి వల్ల ఏర్పడిన నిరాశ్రయత (Development displacement) వల్ల నష్టపోయిన ప్రజల పునరావాస కల్పనకు ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించింది. ఈ కార్యాచరణ పథకం ప్రకారం పునరావాస కార్యక్రమాలను అభివృద్ధి ప్రక్రియలో ఒక అంతర్భాగంగా పరిగణించాలి. పునరావాసం కల్పించేందుకు చేపట్టే కార్యక్రమాలు సంబంధిత వ్యక్తులకు ఆర్థిక అవకాశాలను కల్పించటంపై ప్రాధాన్యతను కనబర్చాలి. భారీ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నష్టపోయిన ప్రజలు గిరిజన తెగలకు చెందిన వారైతే వారి పునరావాసానికి, అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధవహించాలి. వారు కల్పోయిన భూములకు నష్టపరిహారాన్ని చెల్లించడంలో చట్టపరమైన అంశాల పట్ల ప్రాధాన్యత కనపర్చరాదని ప్రంపంచ బ్యాంకు వివరించింది.

ప్రపంచబ్యాంకు సూచించిన విధావ దృక్పథాన్ని చైనా, జాంబియా మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించటం ప్రారంభమైంది భారతదేశంలో ఈ దృక్పథానికి అనుగుణంగా ప్రభుత్వం తన పునరావాస విధానాన్ని రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నది.

## 21.4.7 ప్రగతి పాలన ప్రైవేటీకరణ : ప్రభావం

గత రెండు దశాబ్దాల నుంచి అభివృద్ధి చెందిన చెందుతున్న దేశాల ఆర్థికరంగంలో తలెత్తిన అత్యంత ప్రధానమైన ధోరణి సరళీకరణ (Liberalization) సరళీకరణ అనుబంధ సిద్ధాంతము ప్రైవేటీకరణ (Privitization) సరళీకరణ ఎటువంటి అవరోధాలు, పరిమితులు కాకుండా పెట్టుబడి, వస్తువులు, సేవలు స్వేచ్ఛగా సమకూర్చటాన్ని లేదా ఉత్పత్తి చెందటాన్ని అనుమతించే విధానం కాగా వస్తువులు, సేవలను ప్రభుత్వరంగం నుంచి ప్రైవేట్ రంగానికి బదిలీచేయడం లేదా వాటిని ప్రైవేటు రంగంలోనే సమకూర్చటం లేదా ఈ రెండింటి సమ్మేళనాన్ని ప్రైవేటైజేషన్‌గా భావించవచ్చును.

BRAOU

ప్రభుత్వరంగం నిర్వర్తనపై తొలగిన భ్రమలు, ప్రజలకు వస్తువులు సేవలను సమర్థవంతంగా అందచేయడంలో ప్రభుత్వం పొందిన వైఫల్యం ప్రైవేటీకరణకు ప్రధాన ప్రేరణలు అయ్యాయి. ఉదాహరణకు, భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రభుత్వ రంగం సంస్థలపై దాదాపు 180 లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టడం జరిగింది. కేంద్రప్రభుత్వం ఆధీనంలోని ప్రభుత్వరంగ సంస్థల సంఖ్య 1951లో 29 వుండగా 1993 నాటికి వాటి సంఖ్య 246 పెరిగింది. ప్రభుత్వరంగం పరిధి మౌలిక వస్తువుల నుంచి భారీయంత్రాల ఉత్పత్తి వరకు కల మొత్తం రంగాలకు విస్తరించింది. అయితే దేశంలోని దాదాపు 70% ప్రభుత్వరంగం సంస్థలు తీవ్రంగా ఖాయిలా పడిన సంస్థలుగా నిర్ధారించబడ్డాయి. కాగా దాదాపు 50% సంస్థలు విపరీతమైన నష్టాలు పొందుతున్నాయి. వివిధ నిపుణుల సంఘాలు ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ అధ్వాన్నంగా నిరాశాపూరితంగా వుందని వెల్లడించాయి.

1991 జూన్-ఆగస్ట్ మధ్య కాలంలో దేశం ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభాన్ని తొలగించేందుకు ప్రభుత్వానికి సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను చేపట్టడం కన్నా వేరే గత్యంతరం లేకపోయింది. ఈ సంక్షోభం పరిస్థితుల్లో దేశాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన వరల్డ్ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రైవేటీకరణ, సరళీకృత విధానాలను అవలంబించేలా భారత ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసాయి. గత నాలుగు సంవత్సరాలలో మన్‌మోహన్ సింగ్ ప్రతిపాదించిన కేంద్రబడ్జెట్‌లు సరళీకృత, ప్రైవేటైజేషన్ విధానాలను ప్రతిఫలిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లు గ్లోబలైజేషన్ విదేశీ పెట్టుబడిని ఆకర్షించడం, దేశ ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మాణం, ప్రభుత్వరంగం ఈక్విటీలపై పెట్టుబడిని

తగ్గించడం మొదలైన నూతన ధోరణులపై ప్రాధాన్యతను వక్కాణించటం గుర్తించవచ్చును. ఈ విధానాలకు సమానతరంగా ఏమ్ ఆర్ టి పి (MRTP) చట్టంలోని అనేక నిబంధనలను సడలించడం, పరిశ్రమలు మినహాయించి మిగిలిన పరిశ్రమల విషయంలో లైసెన్సింగ్ విధానాన్ని రద్దు చేయటం, కంపెనీ చట్టంలో మార్పులను ప్రవేశపెట్టడం, కస్టమ్స్, ఎక్సైజ్ డ్యూటీలను తగ్గించడం బ్యాంకుల సంస్కరణలు మొదలైన అనేక ఇతర విధానాలను కూడా ప్రభుత్వం చేపట్టింది. ఈ పరిణామాల ప్రభావం వల్ల ప్రభుత్వం పాత్ర క్షీణించటమే కాక, ఆర్థిక రంగంలో రాజ్యం తన ఆధిపత్యం స్థానాన్ని కోల్పోవలసివచ్చింది. ప్రగతి పాలన నూతన పరిమాణాలకు అనుగుణంగా ప్రతిస్పందించాల్సి ఉంది. అది ప్రభుత్వ రంగంలో ఉద్యమిత్వాన్ని ప్రేరింపించాలి. ప్రగతి పాలన ఆర్థికాభివృద్ధి సాధనకు తగిన మౌళిక వసతులను సమకూర్చాలి. అయితే తన పాత్రను కేవలం సేవారంగానికి మాత్రమే పరిమితం చేయాల్సి వుంది. అంటే మానవవనరుల అభివృద్ధి (HRD) ఆరోగ్య సేవలు, సాంఘిక సంక్షేమం పైనే తన దృష్టిని కేంద్రీకరించాలి.

## 21.5 ప్రగతి పాలన నిర్వర్తన

అభివృద్ధి రంగంలో భారతదేశ పరిస్థితి ఉపఖండంలోని మిగిలిన దేశాలకంటే మెరుగ్గా ఉంది. ఈ ఘనత రాజకీయ న్యాయకత్వానికి, రాజకీయ వ్యవస్థ సుస్థిరకు చెందవలసివున్నప్పటికీ ఉద్యోగిస్వామ్య వ్యవస్థ మారుతున్న పరిస్థితుల అణుగుణ్యతను పెంపొందింపచేసుకొనుటకు కాక అభివృద్ధి విధులను నిర్వర్తించటంలో తన సామర్థ్యాన్ని ఋజువు పర్చుకొంది. అయితే భారత ఉద్యోగిబృందం సమర్థవంతమైనదనీ, స్పష్టమైన అంతిమ నిర్ణయం చేయటం సాధ్యం కాదు. దేశంలో అంకుతిత సేవా తత్పరత, దీక్ష నిబద్ధతతోను విధులను నిర్వహించే ఉద్యోగులు ఉన్నప్పటికీ స్వప్రయోజనాల కొరకు తమ నిపుణతను, వ్యక్తిత్వాన్ని ఫణంగా పెట్టేందుకు సిద్ధపడటమే కాక రాజకీయ నాయకులకు పూర్తిగా దాసోహం చేసే ఉద్యోగులున్నారు. అంతే కాక భారతదేశ ఉద్యోగులలో సాంప్రదాయ వాదులుగా లేదా యదాస్థితి వాదులుగా పరిగణించబడే ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉంది. ఈ ఉద్యోగుల విక్టర్ థాంప్సన్ ప్రతిపాదించిన ఉద్యోగిస్వామ్య రోగగ్రస్థత (bureanpatghology) అనే లక్షణాన్ని ప్రదర్శించటాన్ని గుర్తించవచ్చు అయితే దీనిని బట్టి భారత ఉద్యోగులు అసమర్థులని చెప్పడం సహేతుకం కాదు. వారు సరైన రాజకీయ నాయకత్వం లభించినపుడు కఠినతరమైన విధులను కూడ నిర్వర్తిస్తారని రుజువైంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వ్యవసాయ, పారిశ్రామిక, వైద్య, ప్రసార వార్తాప్రసారం, విద్యుచ్ఛక్తి రంగాలలో సాధించిన ప్రగతి, పాకిస్తాన్‌తో వచ్చిన యుద్ధాలు, అనేక సార్లు కాందిశీకుల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనటంలో వారు చూపించిన సమర్థత భారత ఉద్యోగిబృందం శక్తి సామర్థ్యాలకు ప్రత్యక్ష నిదర్శనాలుగా భావించవచ్చును. అంతే కాక 1977-79, 1990-92 మధ్యకాలంలో రాజకీయ రంగంలో తలెత్తిన సంక్షోభ పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగులు దేశ స్థిరత్వానికి ప్రమాదం ఏర్పడకుండా నివారించటమే కాకుండా సంకుచిత రాజకీయ నాయకుల కార్యకలాపాలను నిరోధించి యదాస్థితిని కొనసాగించే శక్తిగా పనిచేసారు. అయితే దీంతోపాటు 1970,1980 దశాబ్ధంలో ప్రభుత్వ ఉద్యోగుల సుస్థితి క్రమంగా క్షీణించటాన్ని గుర్తించవచ్చును. దానికి ఈ దశాబ్ధాలల్లో వారి ఉద్యోగి భద్రతకు ముప్పు ఏర్పడడం, ప్రథమ కారణంగా భావించవచ్చును. 1977లో ఇందిరా గాంధీ పతనం తరువాత ఏర్పడిన జనతా ప్రభుత్వ కాలంలో దాదాపు 500 మందిని సీనియర్ ఉద్యోగులు తమ స్థానాల నుంచి బదిలీ చేయబడ్డారని అంచనా వేయబడింది. అయితే 1980 లో కేంద్రంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం తిరిగి ఏర్పడడంతో వీరందరూ తమ స్థానాలకు బదిలీ చేయబడ్డారు. ఈ రెండు ప్రభుత్వాల కాలంలో అనేక ఉద్యోగుల రాజకీయ వ్యవస్థతో వారి సంబంధాల ఆధారంగా శిక్షింపబడటం లేదా లబ్ధిపొందటం జరిగిందని వార్తా పత్రికలు వెల్లడి చేసాయి. ఈ విధమైన భద్రతారాహిత్యం

BRAOU

ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను నిర్వర్తించటం పట్ల జాగ్రత్తను ప్రదర్శించటం ప్రారంభమైంది. ఈ పరిస్థితిని గుర్తించిన అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ప్రభుత్వ ఉద్యోగుల దృక్పథాన్ని నిరసిస్తూ ఈ విధంగా పేర్కొన్నది. పాలనలో సమర్థత క్షీణించటానికి ఉన్నత ఉద్యోగులు తమ బాధ్యలను విస్మరించటం ప్రధాన కారణం. నిర్ణయాలను చేయడానికి ఒక ప్రమాదకర చర్యగా పరిగణించే ధోరణి ఉద్యోగులలో ప్రబలింది. ఈ దృక్పథాన్ని అంతమొందాల్సి ఉంది.

ప్రస్తుత దశాబ్దంలో పాలనా వ్యవస్థ పరిస్థితిని మరింత క్షీణింపచేసే పరిస్థితులు ఉత్పన్నమైయ్యాయి. రాజకీయ అస్థిరత, పాలక పక్షంలో అభిప్రాయ బేధాలు, కార్యనిర్వాహక వర్గం, న్యాయస్థానాల మధ్య పెరుగుతున్న సంఘర్షణ, బలహీనమైన ప్రతిపక్షాలు, శాంతి భద్రతల క్షీణత, పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతల జనాభా పెరుగుదల, ఉధృతమవుతున్న ఆర్థిక సంక్షోభం మొదలైన అనేక కారణాలు పాలన వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని కనపర్చాయి.

భారత పాలన వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం బి.కె. నెహ్రూ విశ్లేషణ చక్కగా ప్రతిబింబిస్తున్నది. నెహ్రూ విశ్లేషణ ప్రకారం పాలనా వ్యవస్థ తన పాత్రను నిర్వర్తించటంలో రాజకీయ నాయకులు జోక్యం తీవ్రమైన అవరోధం అయినది. పాలనా ఉద్యోగులు రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తడం ఒక సాధారణ విషయమైంది. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులుకు అనుకూలంగా ప్రవర్తించేలా వారిని ఒత్తిడి చేసేందుకు పదోన్నతి, భర్తరఫ్ బదిలీ మొదలైన పద్ధతులను తరుచుగా వినియోగించడం జరుగుతున్నది. పాలనా వ్యవస్థ స్వయం ప్రతిపత్తి పెంపొదింపచేసేందుకు అధికారాలను క్రమ బద్ధం చేయాల్సి ఉంటుంది. పాలనోద్యోగులలో దిగజారిన పరిస్థితిని తిరిగి పెంపొందింపచేసేందుకు వారికి తగిన శిక్షణ జరపాలి ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతి, అసమర్థత పెంపొందితే అనుచిత పాలన అభివృద్ధి చెంది దేశ ప్రజాస్వామ్య వ్యవస్థనే పెకిలించే ప్రమాదం ఉంది.

BRAOU

## 21.6 సారాంశం

భారతదేశ పాలనా వ్యవస్థ అనే వైరుధ్యాలతో నిండి ఉంది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ పాలన రాజకీయ, సామాజిక సందర్భంలో విప్లవాత్మకమైన మార్పులు కలిగినప్పటికీ వలస పాలన వారసత్వంగా సంక్రమించిన పాలనా పద్ధతులు, విధానలే కొద్ది మార్పులతో కొనసాగుతున్నాయి. నూతన రాజకీయ, సామాజిక, ఆర్థిక సందర్భాలు విసరే సవాళ్ళను ఎదుర్కొనడం పాలన వ్యవస్థకు అసాధ్యమైంది. దేశంలో రాజకీయాలు సృష్టించిన సంక్షోభం వల్ల తన లక్ష్య సాధనలో ప్రగతి పాలన అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నది. దీని ఫలితంగా ప్రగతి పాలన తన లక్ష్యాలైన జాతి నిర్మాణం సామాజిక, ఆర్థిక ప్రగతి లక్ష్యాలను పూర్తిగా సాధించలేకపోయింది.

## 21.7 నమూన పరీక్షా ప్రశ్నలు

**I.**ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో జవాబు రాయండి.

1.పాలనా సామర్థ్యంపై రిజర్వేషన్ విధానా ప్రభావం గురించి పరిశీలించండి.

2.ప్రగతి పాలనపై కంప్యూటర్ల ప్రభావం గురించి వివరించండి.

**II.**ఈ క్రింది ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు రాయండి.

1.పాలనలో అవినీతి పెరుగుదల కారణాలు.

2.రాజకీయ తటస్థత - నిబద్ధత

BRAOU

**రచయిత : ఎమ్. బాపూజీ**

## డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## సామాజిక శాస్త్రాల విభాగం

ప్రభుత్వపాలనా శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయన కార్యక్రమం
ఎం.ఏ : రెండవ సంవత్సరం

### పాఠ్యాంశం - 1 ప్రగతిపాలన

**ఖండం - 1 ప్రగతిపాలన : భావనలు**

భాగం - 1 తులనాత్మక ప్రభుత్వ పాలనా శాస్త్రం : అర్థం, పరిధి, ప్రాధాన్యత

భాగం - 2 తులనాత్మక ప్రభుత్వ పాలనా దృక్పథాలు - సంస్థాగత, ఉద్యోగిస్వామ్య, వ్యవస్థా దృక్పథాలు

భాగం - 3 ప్రగతిపాలన : భావన, పరిధి ప్రాధాన్యత

భాగం - 4 ప్రగతి దృక్పథాలు : నిర్మాణ విధుల దృక్పథం

భాగం - 5 ప్రగతి దృక్పథాలు, మార్క్సిస్టు, గాంధేయ దృక్పథం

భాగం - 6 ప్రగతిపాలన సాధనాలు

BRAOU

**ఖండం - 2 ప్రగతిపాలన : భారతదేశ అనుభవం**

భాగం - 7 ప్రగతి : సామాజిక, ఆర్థిక అంశాలు

భాగం - 8 ప్రగతి వ్యూహాలు : ప్రణాళికీకరణ

భాగం - 9 ప్రగతి : ఉద్యోగుల పాత్ర

భాగం -10 ప్రగతిపాలన - నిబంధనల పాలన

భాగం -11 ప్రగతి కార్పొరేషన్లు

భాగం -12 సంక్షోభ నివారణ పాలన

భాగం -13 ప్రగతి పాలన : లబ్ధిదారులు

భాగం -14 పాలన : సంస్కృతి

భాగం -15 రాజకీయ అధికారులు - ప్రభుత్వ ఉద్యోగుల సంబంధాలు

భాగం -16 ప్రగతిపాలనలో సాధారణోద్యోగులు - విషయనిపుణుల పాత్ర

భాగం -17 ప్రాతినిధ్య ఉద్యోగిస్వామ్యం

భాగం -18 పాలనా జవాబుదారీ పద్ధతులు

భాగం -19 పాలనలో నిజాయితీ

భాగం -20 పాలనా సంస్కరణలు

భాగం -21 ప్రగతి పాలన : భారతదేశ పాలనలో పోకడలు

## డా II బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం - ప్రభుత్వ పాలనా శాస్త్రం
కోర్సు - 2 : ప్రగతి పాలన

### మాదిరి పరీక్షా పత్రం

సమయం : 3 గంటలు | గరిష్ఠ మార్కులు : 100

#### భాగం - 'ఎ'

**సూచన : I** ఈ క్రింది వాటిలో నుంచి ఏవేని నాలుగు ప్రశ్నలకు **30** పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించుటలో ప్రణాళిక సంఘం పాత్ర, ప్రాధాన్యతలను వివరించండి.
2. 'ఉద్యోగాభివృద్ధి, అభివృద్ధి పాలనకు పునాది', చర్చించండి.
3. 'నిబంధనల పాలన అభివృద్ధి పాలనకు మూలం'. వివరించండి.
4. పారిశ్రామికీకరణలో ప్రగతి కార్పొరేషన్ల పాత్రను తెలపండి.
5. "చురుకైన లబ్ధిదారులు ప్రగతి పాలనకు 'పదును' లాంటివారు". చర్చించండి.
6. 'రాజకీయాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు - పరస్పర అవగాహన, యిచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి'. వివరించండి.
7. "సాధారణోద్యోగులు - విషయనిపుణులు - ఇద్దరూ - ప్రభుత్వ యంత్రాంగ నిర్వహణలో తమ వంతు పాత్రను నిర్వహించుటలో నిమగ్నమవ్వాలి". చర్చించండి.
8. "ప్రభుత్వ యంత్రాంగం తుప్పుపట్టకుండా ఉండాలంటే పాలనా సంస్కరణలు అవసరం". వివరించండి.

#### భాగం - 'బి'

**II** ఈ క్రింది వాటిలో ఏవేని ఐదు ప్రశ్నలకు **15** పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రగతి పాలన - నిబంధన పాలనల మధ్యగల వ్యత్యాసాలు
2. ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్యం - అర్థం, అవసరం
3. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఆర్థిక సంఘం - లక్ష్యాలు - విజయాలు
4. సంక్షోభనివారణ పాలన - అర్థం, అవసరం
5. పాలన : సంస్కృతి - అవసరం, అర్థం
6. పాలనలో జవాబుదారీ పద్ధతులు
7. పాలనలో నిజాయితీ - అవసరం
8. ప్రగతిపాలన - భారతదేశ అనుభవం

BRAOU

## డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
## సామాజిక శాస్త్రాల విభాగం

ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం - ప్రభుత్వ పాలనా శాస్త్రం
కోర్సు - 2 : ప్రగతి పాలన

### అభ్యాసం - 1

## సూచన :

1. ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు పుస్తకాలను చూసి రాయకూడదు.
2. జవాబులు సాధ్యమైనంతవరకు మీ స్వంత పదాలలోనే రాయాలి.
3. మీరు రాసే జవాబు సరియైనదేనని నిరూపించుకొనుటకు తగిన ఆధారాల కోసం మీరు సంప్రదించిన గ్రంథాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
5. మీరు రాసిన జవాబులు మూల్యాంకణం చేయడానికి మీరు ఉపయోగించే పుటల (పేజీలు) కు ఒక ప్రక్కన పరీక్షకుడి వాఖ్యానం కోసం తగినంత స్థలం (Margin) వదలండి.
6. మీరు ఈ అభ్యాసం రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

BRAOU

**I ఈ క్రింది ప్రశ్నలలో ఒక్కొక్క దానికి 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. ప్రగతి పాలనలో సామాజిక, ఆర్థిక అంశాల ప్రాధాన్యత ఏమిటి ?

2. జాతి నిర్మాణంలో ప్రణాళిక సంఘం పాత్ర ఏమిటి ?

3. 'వెబర్ నమూనా ఉద్యోగిస్వామ్యం ప్రగతి పాలనకు ఆటంకం' ఎందువలన ?

**II ఈ క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి 15 పంక్తులలో జవాబు రాయండి.**

1. నిబంధనల పాలన సాధనాలకు (నియమనిబంధనలకు) ప్రాధాన్యతనివ్వగా, అభివృద్ధి పాలన లక్ష్యాలకు ప్రాధాన్యతనిస్తుంది. వివరించండి.

2. పారిశ్రామికీకరణలో ప్రగతి కార్పొరేషన్ల పాత్ర.

3. 'బాధ్యతగల లబ్ధిదారులు - ప్రగతి పాలనకు నిఘా సంఘంలాంటి వారు'. వివరించండి

## డా ॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం - ప్రభుత్వ పాలనా శాస్త్రం
కోర్సు - 2 : ప్రగతి పాలన

### అభ్యాసం - II

## సూచన :

1. ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు పుస్తకాలను చూసి రాయకూడదు.
2. జవాబులు సాధ్యమైనంతవరకు మీ స్వంత పదాలలోనే రాయాలి.
3. మీరు రాసే జవాబు సరియైనదేనని నిరూపించుకొనుటకు తగిన ఆధారాల కోసం మీరు సంప్రదించిన గ్రంథాలను పేర్కొనండి.
4. అభ్యాసాలు రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
5. మీరు రాసిన జవాబులు మూల్యాంకణం చేయడానికి మీరు ఉపయోగించే పుటల (పేజీలు) కు ఒక ప్రక్కన పరీక్షకుడి వాఖ్యానం కోసం తగినంత స్థలం (Margin) వదలండి.
6. మీరు ఈ అభ్యాసం రాయడానికి రెండు గంటలకంటే ఎక్కువ సమయం తీసుకోరాదు.

BRAOU

**I. ఈ క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. "రాజకీయ అధికారులు, ప్రభుత్వోద్యోగులు ప్రత్యర్థులు కారు, పరస్పర ఆధారాలు". వివరించండి.
2. "రాజకీయ అధికారులు, సాధారణ ఉద్యోగులు, విషయనిపుణులు - ఈ ముగ్గురు ప్రగతి పాలనకు ముఖ్యులే". చర్చించండి.
3. ప్రాతినిథ్య ఉద్యోగిస్వామ్యం గురించి ఒక వ్యాసం రాయండి.

**II ఈ క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. 'పాలన జవాబుదారీ కలిగి ఉండాలి. వివరించండి'.
2. చట్టాలను కఠినంగా అమలు చేయుట వలన నిజాయితీని పెంపొందించవచ్చును. వివరించండి.

BRAOU

BRAOU

BRAOU

BRAOU